# శ్రీ మర్యాద రామన్న
## తీర్పు కథలు



రోహిణి పబ్లికేషన్స్, రాజమండ్రి-1

# శ్రీ మర్యాదరామన్న తీర్పు కథలు

(పాఠకులు ముందెన్నడు చదవని పలుతీర్పు కథలతో వెలువడిన తొలి తెలుగు గ్రంథం )


రచన

**శ్రీ యర్నాగుల సుధాకరరావు** సీనియర్ జర్నలిష్టు

(శ్రీ భయంకర్ కలం పేరుతో కొన్నివందల డిటెక్టివ్, జానపద, గూఢచార, మిష్టరీ నవలలు రాసిన రచయిత )



✆ 2473444

**రోహిణి పబ్లికేషన్స్**

**పాత కూరగాయల మార్కెట్**

**మెయిన్‌రోడ్, రాజమండ్రి - 1**


# శ్రీమర్యాదరామన్న తీర్పు కథలు

- శ్రీ యర్నాగుల సుధాకరరావు

© ప్రకాశకులు

ప్రథమ ముద్రణ :

జూలై 2008




మూల్యము

రూ. 100/-

**రోహిణి పబ్లికేషన్స్**
**పాత కూరగాయల మార్కెట్**
**మెయిన్‌రోడ్, రాజమండ్రి - 1**

# విషయసూచిక

| | | |
|---|---|---|
| 1) | మర్యాదరామన్న జననం | 5 |
| 2) | చేతబడి బూటకం | 27 |
| 3) | ఆముదపు విత్తులు ఆణిముత్యాలు కావు | 39 |
| 4) | గురుకులంలో రామన్న | 49 |
| 5) | రాచపీనుగుకు తోడు కావాలి | 61 |
| 6) | ఊరుమారినా ఉనికి మారునా ? | 76 |
| 7) | ఆ వృత్తికి రెండువైపులా పదును | 88 |
| 8) | పులిపాలు చికిత్స | 101 |
| 9) | పాపం పదిరకాలు | 115 |
| 10) | అందితే పీక అందకుంటే కాళ్లు | 125 |
| 11) | వనితలు వలచి రావాలి | 137 |
| 12) | పంచగంగల పాత్రలు | 151 |
| 13) | నిజం దేవుడెరుగు | 162 |
| 14) | బానిస ధర వెయ్యి వరహాలు | 171 |
| 15) | స్పర్శవేది ఎవరికి చేదు | 184 |
| 16) | క్షుద్రశక్తుల ప్రభావం | 194 |
| 17) | భూతవైద్యం | 202 |
| 18) | ఒక కన్నుతో ఏమి చూస్తాం | 209 |
| 19) | ఉప్పుమూటతో భలే లాభం | 217 |
| 20) | మెడలో రుద్రాక్షలు | 230 |
| 21) | దయ్యమై పట్టుకున్నాడు | 241 |
| 22) | ఛండాలుని హితబోధ | 245 |
| 23) | ఎవరీ బసివిరాండ్రు | 255 |
| 23) | ఇద్దరు దొంగల కథ | 271 |
| 24) | దేవునికే సాధ్యం కానిది | 283 |
| 25) | నిజాయితీకి ఇదా ప్రతిఫలం | 294 |
| 26) | కొండల్ని కరిగించే సంగీతం | 301 |
| 27) | లేస్తే మనిషిని కాను. | 308 |
| 28) | పాపం చెరి సగం | 315 |
| 29) | రామన్న దేశసంచారి | 320 |

# ముందుమాట

ప్రియమైన పాఠకులారా, మీచేతుల్లో ఉన్న శ్రీమర్యాదరామన్న తీర్పు కథలు గ్రంథం ఆద్యంతం పలు ఆసక్తికరమైన హాస్యకథలతో సాగిపోతుంది. అన్నికథలు మీమనస్సును ఆహ్లాదపరుస్తాయి. ఈకథలు ఒకప్పుడు తెలుగునేలపై యథార్థంగా జరిగినవే. కానీ, ఆనాడు ఎవరు వీటిని గ్రంథస్తంచేసి తరువాత తరాలవారికి అందించాలని ఆలోచించలేదనే చెప్పాలి. ఇలాంటి పలువురు మహనీయులచరిత్రలు మనకు అందుబాటులో లేకుండాపోయాయి. కొంతవరకు వెర్రిబాగులతనంతో నడిచే కథలకు అక్షరరూపం ఇవ్వడానికి అప్పటిలో ఏకవులు ముందుకు రాలేదు. ఒకవేళ వచ్చినా, ఏ చిరుగ్రంథం రాయబడినా, అవి ప్రజల్లోకి రాలేదు. రామన్న కథలు గురించి పలువురు సరదాగా చెప్పుకునేవారు అలా అమ్మమ్మలు నాయనమ్మలు నోట నానుతూ వారసత్వంలా తెలుగునాట నిలబడ్డాయి. 1930 తరువాత తెలుగు పబ్లిషర్సు చిన్ని పుస్తకాలుగా 60 పేజీలకు మించకుండా వేసేవారు. ఆ తర్వాత చాలామంది పబ్లిషర్సు అవే కథలను మరికొంత మంది రచయితలతో రాయించి వేసారు. ఏప్రాంతంలో ఎప్పుడు ఎక్కడ జరిగినది మాత్రం ఎవరూ పట్టించుకోలేదు. ఏదో వేసాం కథలు చదువుకోండి అన్నట్టుగానే వేసారు. ఏదిఏమయినా మన తెలుగు రామన్నకు జమీందార్ చావిడీల్లో, పలువురు తెలుగు రాజులు రామన్న తీర్పులనే నెమరువేసుకుని చెప్పేవారు అనేది జగమంతా అనుకునేమాట. ఫలానా తీర్పు ఇలాఇచ్చాడని కథలుగా చెపుకునే వారు ఇవేరామన్న కథలకు ఆధారజీవాలుగా నేడు మనమధ్య నిలబడ్డాయి. నాడు అక్షరరూపం ఇవ్వకపోవడమే రామన్న జీవితచరిత్ర అసమగ్ర రూపంగానే ఉన్నా, ఉన్నంతలో లభించిన ఆధారాలతో మొత్తం కథనం మీ ముందుంచు తున్నాను. ఈ గ్రంథంలో ప్రతి కథనం నా స్వంతం. నా సేకరణలో చిన్నలైన్ మాత్రమే లభిస్తేతరువాత పుస్తక రూపంలోకి తీసుకువచ్చినపుడు నవరసాలతో కథలుగా అల్లుకున్నవి. నా అనుమతిలేకుండా ఈగ్రంథంలో కథలు ఎవరూ ప్రింట్ చేయుట,ఫిలిమ్,కాపీ, అనువాదం,టీ.వి.సీరియల్,మూవీగా చేయడం చట్టరీత్యానేరం. ఈగ్రంథంపై మీ అమూల్యమైన అభిప్రాయాలను తెలుపగోర్తున్నాను.

మీ

**యర్నాగుల సుధాకరరావు**
(రచయిత-సీనియర్ జర్నలిష్టు)
ఆమదాలవలస. శ్రీకాకుళంజిల్లా
సెల్.9985265313

# శ్రీ మర్యాదరామన్న తీర్పు కథలు

## మర్యాదరామన్న జననం

నాలుగువందల ఏళ్ల క్రితం కళింగప్రభువుల ఏలుబడిలో ఉన్న శ్రీకూర్మం,హర్షవిల్లి,శ్రీముఖలింగం దేవాలయాలకు మధురరాజు విజయ రంగ చొక్కనాధుడు (1706-1766) పాడి ఆవులను దేవుని పూజలకై కానుకగా పంపించాడు. అతడు చాలా ఆలయాలను నిర్మించిన ఘనచరిత్ర కలిగినవాడు. మహాదైవభక్తిపరాయణుడు. ఆ ఆవులను దేవాలయాలకు అందజేసే బాధ్యత నాలుగు యాదవ కుటుంబాలకు అప్పగించారు. ఆవుల మందను తోలుకుని నాలుగు యాదవ కుటుంబీకులు బయల్దేరి.ఒక్కో దేవాలయంకు కొన్ని గోవులను సమర్పించి శ్రీముఖలింగంలో కొన్నాళ్లుండా లనుకున్నారు. తొలుత శ్రీకూర్మం చేరుకున్నారు.అక్కడ పాడి ఆవులను ఆలయపూజారులకు అప్పగించి బయల్దేరారు.కానీ, వర్షాలు వారిని ముందుకు వెళ్లనీయలేదు. మిగిలిన ఆవులమందను దేవాలయానికి ఆనుకుని ఉన్నతోటలో చెట్లుక్రింద కట్టేసి ఆలయానికి ఉత్తర దిశలోగల సత్రంలో తలదాచుకున్నారు. ఆలయ పూజారులు వారికి వండుకునేందుకు బియ్యం, పప్పులు ఇచ్చారు. అక్కడ ఒక యోగి వచ్చి విడిది చేసి ఉన్నాడు. అతడు పాడిఆవులను చూసి "ఏమయ్యా పశుపాలకులారా, మీ రాజు చొక్కనాధుడు క్షేమమే కదా, నేను ఆయన్ని ఎరుగుదును. మీ మధురకు చాలాకాలం

క్రితం నేను వచ్చి ఆయన్ని దర్శించాను. దైవభక్తి గలవాడు. మంచి సమయంలో గోవులను ఈ క్షేత్రాలకు సమర్పించడం చాలా ఆనందంగా ఉంది." అని ప్రశంసించాడు. ఆ మాటలు వింటూ యాదవ కుటుంబీకులు చేతులు కట్టుకున్నారు.

"అయ్యా మీరు యోగులు కదా, మీకుండే దివ్యేగేనంతో సూస్తే మా రాజు యోగక్షేమాలు తెలియగలవు."అని గడుసుగా కిసుక్కున నవ్వి జవాబు చెప్పాడు యాదవుల్లో ఒకడు అతడిపేరు బసవయ్య.

ఆ యోగి ఒక్కసారి అయోమయంలో పడ్డాడు. తీక్షణంగా చూసాడు ఆ వెంటనే తమాయించుకుని "నాయనా బసవయ్యా నీవు చెప్తేకదా మన మధ్య సంభాషణ పెరిగేందుకు అవకాశముంటుంది. నేను ఎవరికి ఏమీ అడగకుండా నాకుగా నేను తెలుసుకోగలను. సరే, నీకు ఇప్పటికి ఐదుగురు సంతానం కలిగారు కానీ,వారు నీకు దక్కలేదు. నీవు మొక్కని దేవుడు, గుడి,చెట్టు లేదు. నీకు ఒకవిధంగా దేవునిమీద భక్తి సన్నగిల్లింది. దేవుడులేడని నీకుగా నీవే నిర్ణయించుకుని నాలాంటి వారిని మాటలతో బాధించే వరకు వచ్చావు. చివరికి నీ ఆలిపోరు పడలేక ఈమూడు దేవాల యాలకు మధుర రాజు పంపిన గోవులతో వచ్చి నీవు శ్రీముఖలింగ క్షేత్రంలో ఉండాలను కుంటున్నావు. ఆ శివుని కరుణతో పండంటి బిడ్డను కనాలని నీ భార్య ఆశపడ్తూ నీ వెంట వచ్చింది?" యోగి నవ్వుతూ అడిగాడు.

బసవయ్య వెంటనే యోగి కాళ్లమీద పడిపోయి "సెమించండి సామీ! చాలాతప్పుగా పెవర్తించాను. పెద్దలు నన్ను మాటలతో మన్నించీసినారు. లేకుంటే శాపమిచ్చి ఉంటే నా గతి ఏంకాను. నాకు పిల్లలు పుట్టీకూడా దక్కనందున చాలాకోపం వచ్చి నేను దేవుణ్ని నమ్మడం మానుకున్నాను. అందుకే మీలాంటి సాముల్ని కూడా నమ్మడం మానుకున్నాను. ఒక రకంగా సామీ, నేనేపాపం సేయలేదు. కానీ, నాకీ శిక్షేమిటి? నా ఇల్లాల్ని ఇరుగు పొరుగు వారు నానారకాలుగా ఆడిపోసుకుంటే మధుర వదిలి ఇటు





వచ్చేసాం. మాకు మంచి జరుగుతుందా లేక మా బతుకు ఇంతేనా? ఇప్పుదు నాఆడమడిసి ఒట్టిమడిసి కాదు. అదే నాభయం సాలాదూరం నడిపించుకు వచ్చాను. దారిలో ఒక ధన్వంతరి చూసి ఇలా నడిస్తే పిండం కరిగిపోద్ది అని చెప్పి బయపెట్టీసినాడు." వణుకుతూనే చెప్పాడు.

"బసవయ్యా భయపడకు. నీకు పండంటి బిడ్డదు పుద్తాడు. అయితే, నీవు యోగులను,భక్తులను దూషించిన నిన్ను శపించలేదు. కానీ నీపూర్వజన్మ పాపంవలన నీకు మతిహీనమైన బిడ్డపుద్తాడు. అతడు పన్నెండేళ్లు వచ్చేవరకు మతిమాలిన పనులతో ఉంటాడు. ఆ తరువాత అతడు దశదిశలు పేరు ప్రఖ్యాతులతో కీర్తికిరీటాన్ని ధరిస్తాడు."యోగి సన్నగా నవ్వుతూ చెప్పాడు.

"సామీ నిజమా? ఈసారి నాకు సంతానం దక్కుతుందా ? పన్నెండేళ్లు మతిహీనుడై ఉంటాడా? ఆ తరువాత ఆ దేముడు మారుస్తాడా?" కళ్లవెంబడి కన్నీరు కారుస్తునే అడిగాడు.

"భయపడకు బసవయ్యా! నా మాటలు సత్యం" యోగి మరోసారి చెప్పాడు.

"సామీ, నా బిడ్డడికి నేను చేసుకున్న పాతకం వలన ఇలాంటి శిక్ష శాపమై తగలడం నా గుండెలపై కత్తివేటు పడ్డట్టుగా ఉంది. ఈ శిక్షను తప్పించుకునే దారిలేదా సామీ!నేను ఏపాపం చేసిన నాకు శిచ్చగా ఉండాలి కానీ బిడ్డడేం చేసాడు. నన్ను శిచ్చించి నా బిడ్డను రచ్చించండి"

"కారణ జన్ములు ఇలానే ఉంటారు. ఎవరూ పుట్టగానే మహాను భావులు కారు. నీ కొడుకు ఈనేల ఉన్నంతవరకు కీర్తిప్రతిష్టలతో వెలు గొందుతాడు. నీ కొడుకు గొర్రెలను మేపుకుని జీవిస్తాడు. అతడు ఎప్పుడైతే కేవలం తొమ్మిది గొర్రెలను మాత్రమే కలిగి ఉంటాడో ఆ క్షణం నుంచి అతనిలో మతిహీనం నశించి పోతుంది. నవరసాలపై తీర్పులు వెలువరించ గలదు. ఆచంద్రార్కం రాణిస్తాడు. అతని నోటివెంట వెలువడిన తీర్పులు





ప్రతి ఒక్కరికి ఆమోదయోగ్యం కాగలవు." యోగి ప్రశాంతవదనంతో శూన్యంలోకి చూస్తూ చెప్పాడు.

శ్రద్ధగా విన్న బసవయ్య అయోమయంగా తనకు జరగబోయేది మంచా! చెడ్డా! అని ఆలోచిస్తూనే అక్కడే కూలబడ్డాడు. నాలుగు కుటీంబీకులు ఒకచోట కూర్చుని బసవయ్యకు పుట్టబోయే బిడ్డకోసం ఆలోచనలో పడ్డారు. యోగిచెప్పినది ఎంతవరకు నిజం అని ఆలోచించారు. ఎవరో దారినపోయిన దానయ్యలు చెబితే నిజమవుతుందా? నమ్మితే జీవితాంతం భయపడి చావాలి అని ఒకరిద్దరు నచ్చచెప్పి చూసారు.

బసవయ్య అంతవరకు దేవుడు లేడు జోస్యంలేదు. భవిషత్ అంతా ఒకకల, ఒక భ్రమ అని చెప్పేవాడు. కానీ, యోగి చెప్పాక, ఎందుకో నమ్మాడు. గుండెల్లో ఒకటే పోటెత్తే పీకు ప్రారంభం అయ్యింది. యోగి తనపేరు, తనకుపుట్టిన ఐదుగురు బిడ్డలు దక్కకపోవడంచెప్పడంతో ఆయన మాటలపై గురిఏర్పడింది. అతని భార్యకు తెలిసి లబోదిబో మనిఏడ్చింది. అక్కడ కొంత మంది పూజరులు విషయం తెలుసుకుని ఆ యోగి జ్ఞానానందుడు. చెప్పినది నూటికి నూరుపాళ్లు నిజం అయితీరు తుంది అనిచెప్పారు. దాంతో బసవయ్య పూర్తిగా నీరసించి పోయాడు. అంతా కలిసి అతడికి ధైర్యం నూరిపోసారు. అక్కడ కొంతమంది యోగులు బసవయ్య దంపతులకు ఎన్నోవిధాలుగా మానప మసుగడ ఒక భ్రమ. అలాంటి భ్రమ గురించి ఎవరూ ముందు తెలుసుకోరాదు. తెలుసుకుంటే ఇలాంటి మానసిక క్షోభలు తప్పవు. నీవు అనపసరంగా జ్ఞానాసందున్ని తూలనాడి భవిష్యత్ తెలుసుకోగలిగావు. నీకు బుద్ధిరాపడానికే ఆ యోగినీ భవిష్యత్ గురించి నిజాలు చెప్పాడు. యోగులు అంటే ఏమిటో తెలుసుకున్నట్టు చేసాడు. ఏదైనా నీవు రానున్న విపత్కర పరిస్థితిని తెలిసి ఎదుర్కోవాల్సిందే విచారించకు."

అక్కడ్నించి నాలుగు యాదవ కుటుంబాలు మిగిలిన గోవులతో బయలుదేరారు. హర్షవిల్లి (అరసవిల్లి శ్రీకాకుళం జిల్లాలో పుణ్యక్షేత్రంగా ఇప్పుడు అలరారుతోంది) సూర్యదేవాలయానికి గోవులను దానంగా ఇవ్వవల్సినవి అప్పగించి శ్రీముఖలింగం దారివైపు సాగారు.

బసవయ్యకు యోగి మాటలు గుర్తుకురాగా శోకమూర్తి కాసాగాడు. పుట్టినవారు పోగా పుట్టిదక్కినవాడు యవ్వనమొచ్చినంతవరకు మతి హీనుడుగా ఉంటాడా?అయ్యోవాడు విద్యాబుద్దులు నేర్చేదెప్పుడు? ఆటపాటలు ఆడేదెప్పుడు? చిన్నవాడి చిలుకపలుకుల్లాంటి తొలిపలుకులు వినే భాగ్యం తల్లితండ్రులమైన మాకు లేకపోవడమా?మతిభ్రష్టుడుగా పుట్టి ఏం మాట్లాడుతాడు?అని పరిపరి విధాలుగా ఆలోచించాడు. అప్పుడు గుర్తుకు వచ్చాయి యోగి మాటలు. పుట్టిన వాడు గొర్రెలకాపరిగా బతుకుతాడు. తొమ్మిది గొర్రెలకుకాపరి అయిన మరుక్షణం అతడిలో మతిహీనం నశిస్తుంది. తాను బిడ్డపుట్టగానే వెంటనే తొమ్మిది గొర్రెలను తెచ్చి యజమాని చేసానంటే బిడ్డ మతిహీనం నుంచి తప్పించుకుంటాడు అని ఒక ఉపాయం ఆలోచించాడు. రహస్యంగా భార్యకు చెప్పాడు. ఆమెకు ఆ ఆలోచన ఎంతో నచ్చింది. ఇద్దరు రోజులు లెఖ్ఖించసాగారు.

శ్రీముఖలింగంలో గోవులను అప్పగించి మూడుకుటుంబాలు వెను దిరిగి మధుర వెళ్లిపోయారు. తాను ఇక్కడే ఉండిపోతాను అని చెప్పిబసవయ్య భార్యతో ఉండిపోయాడు. బసవయ్యకు 'సహదేవపశువైద్యం' తెలిసినందున ఆ ప్రాంతంలో పశువుల రోగాలకు చికిత్స చేస్తూ జీవనం సాగిస్తున్నారు

కొన్నినెలలకు బసవయ్య భార్య వసుమతి పండంటి బిడ్డను కన్నది. పుత్రోత్సాహంతో వెంటనే బసవయ్య తొమ్మిది గొర్రెలను కొనుగోలు చేయ్యాలనుకున్నాడు. అప్పుడు వసుమతి పురిటిబిడ్డ నుంచి మనమేమి సరదాలు చూడగలం?ఒక ఏడాది గడిచాక అప్పుడు చూద్దాం అంది.





నిజమే అనుకుని గొర్రెలను కొనుగోలు చేయడం తాత్కాలికంగా విరమించుకున్నాడు.

రామన్న ఎనిమిదేళ్ల బాలుడు అయ్యాడు. తొమ్మిదిగొర్రెల కొనుగోలు విషయం అప్పుడు ఇప్పుడు అంటూ వాయిదాలు వేస్తూనే ఉన్నారు ఆ దంపతులు. దీనికి కారణం ఉంది. తొమ్మిది సంఖ్యలో గొర్రెలు ఎక్కడా దొరకలేదు. ఎక్కువ తక్కువగా ఉంటున్నాయి. తెలివిగా ఒక్కొక్కటి కొనుగోలు చేసి ఒకచోట చేరుద్దామా అంటే ఏదో అవాంతరం వచ్చిపడసాగింది. వారి ప్రయత్నంలో ఈ తొమ్మిది గొర్రెలు కొనుగోలు జరగకుండా పోయింది. దైవమే ఏదోరోజు కరుణిస్తుందని దేవునిమీద భారం వేసారు. బాలుడు నోటినుంచి ఒక్కమాట వెలువడలేదు. మతిహీనమైన పనులకు పెట్టింది పేరుగా అల్లారుముద్దుగా పెరగసాగాడు.

ఒకరోజు పశువైద్యం కొరకు వెళ్తున్న బసవయ్య లోకజ్ఞానం వస్తుందని కొడుకును తీసుకుని ఒక గ్రామానికి వెళ్లాడు. రోగగ్రస్థమైన పశువులకు పసర చికిత్సలు చేస్తుంటే రామన్న కొద్ది దూరంలో రచ్చబండ వద్ద కాళ్లమీద కాళ్లేసుకుని కూర్చుని తననెత్తిమీద చెట్టుకొమ్మల్లో అరిచిగోల చేస్తున్న కాకులను ఆసక్తిగా చూడసాగాడు. ఆ ఊరి గ్రామపెద్దకు ఛాదస్తం, భేషజాలు ఎక్కువే. గ్రామపెద్ద దగ్గర పనిచేసే వాళ్లు రామన్న వాలకం చూసి తిన్నగా వెళ్లి రచ్చబండ వద్ద పొన్నూరు బాలుడు పెద్దలు కూర్చునే చోట కూర్చున్నాడు అది మీకవమానం అని నూరిపోసారు. అదివిన్న ఆ గ్రామపెద్ద కుపితుడై చరచరా బయల్దేరాడు. రచ్చబండవద్ద బాలున్ని చూసి "ఓరి నీకెంత కండకావరం" లేచి కాళ్లమీదపడి నీ తప్పులను ఒప్పుకో! లేకుంటే నీకు నూరు కొరడాదెబ్బలు దండన తప్పదు. అని అరిచాడు.

ఆ గ్రామపెద్ద పలికిన కర్కశ పలుకులువిని బసవయ్య అటుచూసాడు. అక్కడ రామన్న రచ్చబండమీద కూర్చున్న తీరు తనకే భయంవేసింది. అప్పటికి అతడు రోగగ్రస్థమైన గొర్రెలకు వైద్యం చేస్తున్నాడు. అటువైపు

పరుగున వెళ్లాడు. అప్పటికే అక్కడ చాలామంది చేరారు. గ్రామపెద్ద వారిని చూసి మరింత పెట్రేగిపోయాడు. రామన్న వారిని చూసి మట్టితో గుండ్రంగా ఉండలు చుట్టుకోసాగాడు. “ఓరి పొగరుబోతు బాలకా, నిన్నేరా పిలుస్తున్నది. నీకేమి కానట్టుగా ఉన్నావేమిరా? వచ్చి కాళ్లమీద పడి క్షమాపణలు వేడుకో!” మరోసారి గర్జించాడు. అప్పుడు బసవయ్య గ్రామపెద్ద కాళ్లమీదపడి “అయ్యా క్షమించాలి, వాడు నాకు ఒక్కగానొక్క నలుసు. మతిహీనుడు మీరు ఏమిచెప్తున్నది తెలియనివాడు. వాడికి బదులు మన్నించాల్సిందిగా నేను కోరుకుంటున్నాను,మీ ఊరి పశువులను రోగాలబారి నుంచి రచ్చిస్తున్నాను.” అని కన్నీళ్ళతో కాళ్లను చుట్టేసాడు.

“ఏమీ, బాలకుడు మతిహీనుడా నేను ఏమి ప్రేలినావాడికి తెలియదా? మరి మతిహీనుణ్ని వెంటబెట్టుకుని ఎందుకు వచ్చావు? నీవు పశువులకు చికిత్సలు చేసేవాడివి. ఆ మాత్రం ఇంగితం నీకులేదా? వీరి వలన ఎంతో ప్రమాదం ఈ గ్రామంలోగల రెల్లుగడ్డి గుడిశెలను ఈ పిచ్చివెధవ తగలబెడితే చాలామంది ఛస్తారు.కనుక నీవు నీ కొడుకు దండనార్హులే! రేయ్ ఈ ఇద్దరిని ఆ చెట్టుకు విరిచి కట్టేసి కొరడాతో చెరో యాభై దెబ్బలు కొట్టండి. ఊరికి ఎంత చేటు జరిగేది. సకాలంలో చూసాను లేకుంటే ఎంత ప్రమాదం” తన అనుచరులకు ఆదేశించాడు.

బసవయ్య గ్రామపెద్దను వేడుకుంటూ “చిన్నవాడు అన్ని దెబ్బలు భరించలేడు. వాడికి విధించిన శిక్షను కూడా నేనే భరిస్తాను” అని భోరున ఏడుస్తూ ప్రాధేయపడ్డాడు.

ఇంత జరుగుతున్నా రామన్న ఏమీకానట్టుగా మట్టిముద్దలతో ఆడుకుంటున్నాడు. అక్కడ గుమిగూడిన జనులకు అర్థం అయ్యింది. ఆ బాలుడు ఉత్తవెర్రిబాగులోడు అని గ్రహించి జాలిపడ్డారు.కొందరు గ్రామ పెద్దకు చెప్పారు. అతడు కూడా ఒకింత జాలిపడి “కనీసం నేను కూర్చున్న చోటులోంచి ఆ బాలున్ని ఇంతవరకు దించనేలేదు. ఈ తండ్రిలో చాలా





దుర్బుద్ధి ఉంది. తన మతిలేని కొడుకుని గ్రామపెద్దగా చూసి ఆనందిస్తున్నట్టుగా ఉన్నాడు.” అని మళ్లీ చిర్రెత్తిపోయాడు.

బసవయ్య వెంటనే రామన్నను రచ్చబండమీదనుంచి కిందకు లాగేసాడు. “గ్రామపెద్దకు నమస్కరించు నాయనా” అని రెండుచేతులు కలిపి గ్రామపెద్దవైపు చూపాడు. ఈడ్చినందున, మట్టిఉండల ఆటను భగ్నం చేసినందున రామన్నకు చిరుకోపం వచ్చి తండ్రిచేతిని విదలించుకుని పరుగున వెళ్లి రచ్చబండమీద కూర్చుని మట్టిఉండలు మళ్లీ చుట్టసాగాడు. అక్కడున్నవారికి ఆ బాలుడు పూర్తిగా మతిహీనుడు అని మరింత జాలిపడ్డారు. గ్రామపెద్దకు మాత్రం కోపం తారాస్థాయికి వచ్చింది. “ముందా బాలుణ్ని తీసుకుని నాకు కన్పించకుండా పోవయ్యా, లేకుంటే నేను ఏమి చేస్తానో నాకే తెలియదు.”అని అరిచాడు. బసవయ్య మళ్లీ బాలున్ని కిందకు దించేందుకు రచ్చబండ మీదకు ఎగబ్రాకాడు.అంతలోనే గొర్రెలనుతోలుకుని వచ్చిన రైతు “అయ్యా నా గొర్రెకు రోగంముదిరి చచ్చేట్టు కన్నులు తేలవేసింది. దీనికి తగిన పసరలు వేయండి నేను బాలున్ని కిందకు తీసుకు వస్తాను” అని ఒకడు చిన్నగొర్రెపిల్లను చేతుల్లో తీసుకుని వచ్చాడు. అక్కడ అందరిలో ఒక్కటే ఉత్కంఠ.

బసవయ్య చేతికి రామన్న చిక్కలేదు.ఒక రకమైన విసుగు కోపం వచ్చింది.“ఒరేయ్ రారా బుద్ధిహీనుడా,నీ వలన నాపేణం మీదకు వచ్చీసినట్టుంది.” కోపంతో బుసలు కొట్టాడు.

“అయ్యో నాగొర్రెపిల్ల చచ్చింది.పసరలు ఏసినావు కావు. సంపేసినావు కదా ”అని రైతు అరిచిగోల చేసాడు. అతడిచేతిలో గొర్రెపిల్ల తలవాల్చేసింది.

“నా గొర్రెపిల్ల సచ్చింది. ఏటు సేద్దును”అని రైతు లబోదిబో మన్నాడు. అంతా అతడ్ని జాలిగా చూసారు.

“నేను ముందే చెప్పాను. ఆ కుర్రవెధవాయ్‌ని చావక చితక కొట్టాలి. మీరంతా అడ్డం పడ్డారు.”గ్రామపెద్ద రుసరుసలాడిపోయాడు.

బసవయ్య కోపం తారస్థాయికి వచ్చింది. ఒకవైపు శిక్షించే గ్రామపెద్ద మరోవైపు వైద్యం అందక గొర్రెపిల్ల చావు ఇదంతా రామన్న వలనే. వీడ్ని ఊరక వదిలితే కాదు. చావక చితకకొట్టాలి. అని అక్కడే ఉన్న గ్రామపెద్ద అనుచరుని చేతిలో కొరడా అందుకున్నాడు. రామన్న వైపు ఝుళిపించాడు. అర్థమైనా రామన్న తన ఆటలో తాను ఉన్నాడు. ఈ కొడుకును కొడితే ఏమి వస్తుంది? నా చచ్చిన గొర్రెపిల్ల బతుకుతుందా? ఒక్క ఆడగొర్రెతో ఈనాడు పది గొర్రెలవరకు పెంచాను. నా ఇంట గొర్రె చావులేదు. తొలిసారి ఒకటి చచ్చింది. ఇప్పుడు తొమ్మిది అయ్యాయి. ఈ దెబ్బతో ఒక్కొక్కటి చస్తాది. నా దొడ్డి అలా నాశనం అయిపోద్ది. నేను ఎలా బతికేది. ఒక్క అడుగు ముందుకువచ్చి పసరపోస్తే అది బతికేసును." అని లబోదిబో మని ఏడ్చాడు.

"ఆ కుర్రవెధవను పట్టుకోండిరా తండ్రే దండిస్తానంటున్నాడు. పన్నె తనర్థాలకు దారితీయించాడు. వీడికి ఎవర్ని భయంలేదు. కొడుకు అని చూడకుండా చర్మంలేచేలా చావ చితకబాదవయ్యా!" గ్రామపెద్ద ఆదేశించాడు.

గ్రామపెద్ద అనుచరులు రామన్నను ఒడిసిపట్టుకుని బసవయ్య ముందు పడదోశారు. ఏమీ అర్థంకాని రామన్న బిక్కుబిక్కుమని తండ్రివైపు చూస్తూ ఏడవసాగాడు. ఎత్తిన కొరడాను సర్రుమని దించాడు బసవయ్య. అది రెండు చుట్టలు రామన్న నడుం చుట్టూ తిరిగిపోయింది. కివ్వుమన్నాడు అదేపనిగా కొట్టాడు. బాలుడు విలవిలలాడిపోయాడు. అంతలోనే కొందరు వృద్ధులు అడ్డంపడ్డారు. "నువ్వు ఎంతకొట్టినా బిడ్డడు పల్లెత్తిమాటలాడడం లేద్రా" అని అడిగారు. బసవయ్య అంతవరకు ఉన్న కోపాన్ని దిగమింగుకుని "అయ్యా, బిడ్డకు అమ్మా అయ్యా తప్పితే మరోమాట మాటలాడ లేడు. నేను అయితే దెబ్బను తగ్గించి కొడతాను అదే వేరే ఎవరైనా కొడితే ఒక దెబ్బకే ఆడు సచ్చిపోతాడని నేనుగా పూనుకున్నాను." అని బిడ్డను పట్టుకుని





బోరున ఏడ్చాడు. అక్కడ ఉన్న అందరి కళ్లుచెమర్చాయి. అక్కడికి చేరిన ఆడాళ్లు బుగ్గలు నొక్కుకుని "ఎంతపాపం పసివాణ్ని పట్టుకుని కన్నవాడిచే చావగొట్టిస్తారా ఊరికి మంచి జరుగుతుందా? వర్షాలు పడ్తాయా? ఎంత పాపం జరిగిపోయింది. ఆ మాటలు విని,అంతవరకు పెద్దరికంతో ఉన్న గ్రామపెద్దకూడా విలవిల లాడిపోయాడు. అనవసరంగా పసివాణ్ని దండింపచేసాను అని బాధపడ్తూనే బిడ్డను చేత్తో తలనిమిరాడు. చచ్చిన గొర్రెపిల్లను వదిలేసి రైతు బిడ్డ వద్దకు వచ్చాడు. రామన్న మెల్లగా కన్నులు తెరిచి రైతును చూసాడు. అతడివెనుక తొమ్మిది గొర్రెలున్నాయి. వాటిని చూడగానే లేచి కూర్చున్నాడు. జ్ఞానానందయోగి చెప్పినట్లు ఆ గొర్రెల ప్రభావంతో అతడిలో మార్పులు చోటుచేసుకున్నాయి. "తండ్రీ విచారింపకు, ఏది జరిగినా మన మంచికే, ఆ రైతు వద్ద ఉన్న గొర్రెలు పది రోగాలుతో చచ్చేవి. చచ్చిన గొర్రెపిల్లకు ఆరోగ్యం పుంజుకోదు. అది బతికుంటే దాని అంటురోగం మిగిలినవాటికి వచ్చి అవి చచ్చేవి. ఊళ్లో ఉన్న గొర్రెలు కూడా నశించేవి. ఓ రైతూ తక్షణం చచ్చినగొర్రెను దూరంగా తీసుకుపోయి పాతిపెట్టు. ఓ గ్రామపెద్ద నీవు కూర్చున్నప్పుడు మాత్రమే రచ్చబండ పెద్దరికం సంతరించుకుంటుంది. ఆ తరువాత బాటసారులకు చెట్టునీడతో బాటు విశ్రమించేందుకు తన ఒడిలో చోటునిస్తుంది. నావంటిపిల్లల ఆటలకు పాటలకు ఈ రచ్చబండ చిరువేదికగా ఉంటుంది. నేను మతి హీనుడను, పసివాడను అని నా తండ్రి చెప్పినా నీవు నీ పెద్దరికాన్ని ఇక్కడి ప్రజల ముందు ప్రదర్శించేందుకు ఏమాత్రం మానవత్వం చూపలేక పోయావు. పిల్లలు దేవునితో సమానం అని కూడా నీవు తెల్సుకోలేక పోయావు. అంతెందుకు అదిగో రచ్చబండచెట్టుమీద సేదతీరుతున్న కాకి నీమీద రెట్టవేసింది.అది నీ పెద్దరికాన్ని కించపరచలేదు. దాని సహజగుణం ప్రదర్శించింది. దాన్ని నీవు గాని నీ అనుచరగణం గాని శిక్షించలేరు.

ఎగిరేపక్షిని నీవు ఏమిచేయగలవు. దానిని పట్టుకోలేవు." కొన్నివందలమంది ఆ గ్రామప్రజల మధ్య రామన్న ఖంగుమనేలా అడిగాడు.

ఒక్కసారి విన్నవారంతా ఖిన్నులయ్యారు."అయ్యా వీడు కావాలనే ఇంతవరకు నోరువిప్పలేదు.వీడు చాలా తెలివైనవాడు.చూడండి ఎలా వల్లించాడో ధర్మపన్నాలు.మీరు ఆదేశించండి వీడిని చెట్టుకుకట్టి చావ గొడ్తాం."అరిచాడు ఒక అనుచరుడు.అక్కడ ఉన్న గ్రామస్థులు అడ్డుకున్నారు. "ఆ పిల్లోడు చెప్పినది నూటికి నూరుపాళ్లు నిజం.పసివాడు దేవుడితో సమానం,అలాంటిది గ్రామపెద్దగాఉంటూ హీనంగా పిల్లవాడిమీద ప్రాణాలు హరించే కొరడాదెబ్బలు శిక్ష వేసిన ఈ గ్రామపెద్దను మేము పెద్దగా గుర్తించం.మంచిమాటలు చెప్పేవాడికి వయస్సుతో పనిలేదు.రామన్నా! ఇంతవరకు అమాయకంగా ఉన్న నీవు ఎలా ఇంతచక్కగా మాట్లాడ గలిగావు? సహజగుణం గల కాకి గురించి చెప్పి దాన్ని శిక్షించ మన్నావు. భళీ నీవు మాటకారివి."అని పొగిడాడు ఒక వృద్ధుడు. అంతావంత పాడారు.

గ్రామపెద్ద బిక్కముఖం వేసాడు. బసవయ్య అలా నోరు తెరుచుకుని రామన్నవైపు చూస్తూ ఉండిపోయాడు. "ఏమయ్యా నీ కొడుకును చూసుకుని అలా ఉండిపోయావు. మాటలే రావు అన్నావు. న్యాయం తెలిసినవాడిలా మాట్లాడాడు.ఏమిటిదంతా!"మరో వృద్ధుడు అడిగాడు.అంతా ఏంచెబుతాడా అని బసవయ్యవైపు చూడసాగారు.

"అయ్యా! నిజమే సెప్తున్నాను.నా బిడ్డ మాటలు ఇంతవరకు ఎప్పుడు నేను వినలేదు. అదేం మాయో మహిమో నాకు అర్థంకాలేదు." అని బదులిచ్చాడు.

రైతు తన తొమ్మిది గొర్రెలు అక్కడే వదిలేసి చచ్చినగొర్రెను తీసుకుని నిర్జన ప్రదేశంవైపు సాగిపోయాడు. ఆ గొర్రెలు అక్కడే ఒకదాన్ని ఒకటి అతుక్కు పోయినట్టుగా ముద్దగా నిలుచుండిపోయాయి.





"ఇక్కడ జరుగుతున్న అరాచకాన్ని ఆ భగవంతుడు ఆ పిల్లవాడిలో దూరి పలికించాడు అని చెప్పుకున్నారు. అలా చెప్పుకున్నారో లేదో వెంటనే అక్కడ ఉన్న మహిళలు ఇళ్లవైపు పరుగులు తీసి క్షణాల్లో పసుపు కుంకుమలతో వచ్చి వాటితో పిల్లవాడిని ముంచేసి కాళ్లమీద పడి దండాలు పెట్టసాగారు. ఎటు చూసినా కోలాహలంగా మారిపోయింది. ఇంతవరకు పిల్లవాడు నేరగాడిగా శిక్ష అనుభవించాడు. ఆ తరువాత మాటకారిగా, నీతిపలుకులను పలికేవాడిగా గుర్తింపుపొందాడు.చివరగా దేవునికి ప్రతిరూపంగా పూజింప బడ్తున్నాడు. బసవయ్యకు ఇంతవరకు భరించరాని దుఃఖం, ఆ తరువాత తన కళ్లముందు తన మతిహీనపుబిడ్డకు పూజలు జరుగుతుండగా అంతులేని ఆనందం ఒకదాని తరువాత ఒకటి అతనిలో చోటుచేసుకున్నాయి.

"మన మధ్య ఈ గొర్రెలు ఏమిట్రా బయటికి తోలండిరా!" అరిచారు కొందరు. అప్పుడు బసవయ్య వాటివైపు చూసాడు, తొమ్మిది గొర్రెలున్నాయి. అంతే! అతడికి జ్ఞానానందస్వామి మాటలు గుర్తుకు వచ్చాయి. వెంటనే తానే ఆ గొర్రెలను పక్కకు తోలుకుని పోయి తిరిగివచ్చి చూసాడు. అప్పుడు కూడా ప్రశాంతంగా ఉంది రామన్న ముఖం.మళ్లీ పరుగున గొర్రెల వద్దకు వెళ్లి విడదీసి నాలుగు ఒకవైపు ఐదు మరోవైపు నిలిపి వచ్చి బిడ్డను చూసాడు. అంతే ఒక్కసారి గతుక్కుమన్నాడు. రామన్న అయిష్టంగా ముఖంపెట్టి తనను మొక్కుతున్న వారిచేతుల్ని విదలిస్తు కన్పించాడు. కొందరు మహిళలు నైవేద్యంగా అరటి పండ్లుపెడితే వాటిని ఆత్రంగా అందుకుని తినేస్తూ కన్పించాడు.పళ్లాల్లో ఉన్న పసుపుముద్దలతో బంతు లాడుకోసాగాడు. 'తొమ్మిది సంఖ్యలో గొర్రెలుంటే రామన్నలో ఎంతోమార్పు వస్తోంది. ఏమిటి వింత?' బసవయ్య అంతులేని ఆశ్చర్యానికి గురయ్యాడు. అంతలోనే గొర్రెలు ఇటుగా కలిసివచ్చాయి. రామన్నలో మళ్లీ మార్పు రాసాగింది. ప్రశాంతమైన ముఖంతో కన్పించాడు. పసుపు రాస్తుంటే ఆనందంగా అర్ధనిమిళిత నేత్రుడై అందరివైపు చూస్తూ కూర్చున్నాడు.

"స్నానించండి అమ్మలారా, రామన్న లేసిరారా, ఎళ్లిపోదాం. ఇంత చిన్న వయస్సులో పూజలు అందుకోరాదు. నీకు క్షేమం కాదు నాయనా! రా! వెళ్లిపోదాము. ఈ ఊళ్లో అన్నీ ఎక్కువే, అయితే అనావృష్టి లేకుంటే అతి వృష్టి అయితే కొరడాలతో కొడ్తారు. లేకుంటే పసుపురాసి పూజలు చేస్తారు." అని అన్నాడు బసవయ్య.

"తండ్రీ, నా శరీరం రంపపుకోతలో ఉన్నందున ఈ మాతృమూర్తులు రాస్తున్న పసుపుతో హాయిగా ఉంది. ఒకింత సేదతీరనీ, వీరు చేస్తున్నవి పూజలు కావు. ఇంతకు ముందు నేను తిన్న కొరడాదెబ్బలకు ఆ దేవుడు నాకు పసుపుతో చల్లదనం ఇచ్చి, ఉపశమనం కల్గిస్తున్నాడు. నేను సర్వేశ్వరుని రక్షణలో ఉన్నాను." అంటూ రామన్న బదులిచ్చాడు. ఈలోగా రైతు తన గొర్రెలను తోలుకుపోయాడు. రామన్నలో తిరిగి పూర్తిగా మతిహీనం చోటు చేసుకుంది. మళ్లీ పసుపుముద్దలతో ఆడుకోసాగాడు. వెకిలి చేష్టలతో వారి మధ్య కన్పించాడు.

బసవయ్య ఆ సాయింత్రం కొడుకును తీసుకుని ఇంటిముఖం పట్టాడు. జరిగిన విషయం మొత్తం భార్యకు చెప్పాడు. ఆమె విని తొలుత ఏడ్చింది. ఆ తరువాత అంతులేని ఆశ్చర్యానికి గురయ్యింది.

"ఆ గొర్రెల తొమ్మిది సంఖ్యలో అంత మహిమ ఉందా అయితే, వెంటనే మనం అదే సంఖ్యలో గొర్రెలను పెంచుదాం వీడికి మతిమాలిన తనం పోతుంది. ఎలాగైనా మనం ఆ సంఖ్యలోగొర్రెలను తీసుకురావాల్సిందే. నేను ఏనాడు వీడి మాటలను వినలేదు. మీరు ఎంత అదృష్ట వంతులు వీడి నుంచి నీతి పలుకుల్ని విన్నారు." అని కన్నులు తుడుచుకుంది.

రామన్నకు ఆమాటలతో సంబంధం లేకుండా ఒక మూల కూర్చుని ఆడుకోసాగాడు. ఆ మరుసటిరోజు వేకువనే తల్లి రామన్నను ఊరి గ్రామదేవత గుడికి తీసుకువెళ్లింది. అక్కడ అన్ని రకాల దిష్టి తీసింది. గుళ్లో





అమ్మవారిని చేతులెత్తి మొక్కింది. "అమ్మా నా కొడుకు చక్కగా మాట్లాడేవాడని విన్నాను. నేను బతికి ఉండగా బిడ్డ మాటలు వింటానా? నేను నిత్యం నిన్ను కొలుస్తుంటాను. ఎక్కడో మధుర నుంచి దేవుళ్లను మొక్కుకుని ఇంత దూరం వచ్చాం. నీ కరుణతో బిడ్డను కన్నాను. తీరా వాడు మతిహీనుడు అయినాడు. వాడిని అందరి బిడ్డల్లా నాకప్పగించవా తల్లీ, నాపై కరుణ చూపించవా" అని ఏడ్చింది.

ఊరంతా రామన్న గురించి చెప్పుకోవడం విన్న ఆ గుడి పూజారి "అమ్మా నీ కొడుకు కారణజన్ముడు, విచారించకు. పొరుగూరులో తొలిసారి పెదవి విప్పి అందర్ని చకితుల్ని చేసాడు. ఆ వెంటనే పూజింపబడ్డాడు. అక్కడ పెద్దను ఆ గ్రామస్థులమధ్య నిలదీశాడు. ఇవన్నీ అంత చిన్న వయస్సులో అదీ ఓ అమాయకపు జాతిలో బిడ్డలు చేయలేనివి. నీవు దుఃఖించనవసరంలేదు. నేను దేవీ ఉపాసకుడను, చేయగల సాయం చేస్తాను. నాకు రామన్న గురించి విపులంగా చెప్పు." అని ఆమెను అడిగాడు.

యోగి జ్ఞానానందుడు చెప్పిన రామన్న భవిష్యత్ గురించి చెప్పింది. ఎంత ప్రయత్నించినా తొమ్మిది సంఖ్యలో గొర్రెలు లభించలేదు. అదొక శాపం వెంటాడుతోంది. ఆ సంఖ్యతో గొర్రెల్ని బాలున్ని సమీపించగానే వాటి ప్రభావం వలన పొరుగూరులో నోరువిప్పి మాట్లాడాడు." అని చెప్పి ఏడ్చింది.

తల్లి, పూజారి మాటలు అసలు వినకుండా రామన్న గుడి ఆవరణలో ఆడుకుంటున్నాడు. పూజారి రామన్నను తీసుకువచ్చి గర్భగుడి లోపలికి తీసుకువెళ్లాడు. అమ్మవారి విగ్రహం ముందుకూర్చుని "నాయనా రామన్నా ఇక్కడ కూర్చో ఆ తల్లిని నమస్కరించు అని చెప్పి ఒక అరటిపండుమీద తొమ్మిది గొర్రెబొమ్మలు పసుపునీళ్లలో గరికపూస ముంచి చిత్రించాడు. ఆ అరటిపండును రామన్నచే తినిపించాడు. "అమ్మా వసుమతి నాకు తోచిన మేరకు రామన్నకు చేయగలిగినది చేసాను. ఆపైన రామన్న అదృష్టం." చెప్పి

దేవీ ధ్యానంలోకి వెళ్ళిపోయాడు. కొడుకుతో వసుమతి వెనుదిరిగింది. ఆ అరటిపండు తిన్నందువలన రామన్నలో మార్పు ఏమి కన్పించలేదు. ఇంటికి వెళ్లగానే పెనిమిటికి చెప్పింది.బసవయ్య బిడ్డను అక్కున చేర్చుకున్నాడు. "పీడిమీద మనుష్యుల జాలికంటే దేవుని కృప ఉండాలి." అని చెప్పి ఆమెను సమాధాన పరిచాడు.రామన్న ఇంటిలో ఒక మూలకు చేరిపోయాడు.

"వసుమతీ, నువ్వు గుడిలో అయ్యోర్లు వద్ద సాలాసేపు ఉండిపోనావు. బిడ్డకు ఏమైనా పెట్టినావా? ముందు వంటసెయ్యి నేను అలా ఊళ్లోకి వెళ్లి వస్తాను అని చెప్పిబయటికి వెళ్లిపోయాడు.

కొడుకు గురించి ఆలోచిస్తూనే వంట చేస్తున్న వసుమతి కుండ దించుతున్నప్పుడు చేయిజారిపోయి కిందపడి పగిలిపోయి అన్నం నేలపాలయ్యింది.బసవయ్య అప్పుడే ఇంటికి వచ్చాడు.భార్య రెండు పాదాలుపై వేడి అన్నం పడినందున బొబ్బలెక్కాయి.ఆమె లబోదిబోమని ఏడ్వసాగింది. భార్య అజాగ్రత్త వలన కుండపగిలి అన్నం నేలపాలయ్యింది. పైగా గాయపడింది.మళ్లీ వంట చేయడం ఎలా?అని ఆకలితో ఉన్నబసవయ్య చిరాకుపడిపోయాడు. సరిగ్గా అప్పుడే ఒక సన్యాసి గడప ముందునిలిచి 'భిక్షాందేహి' అని ఎలుగెత్తి అరిచాడు.

బసవయ్యకు అగ్నిలో పడ్డ మిడుతలా ఉంది పరిస్థితి. నేలమీద కూర్చుని రోధిస్తున్న వసుమతి "అయ్యో పాపిస్టిదాన్ని కొంచెం జాగ్రత్తపడి ఉంటే ఎంత బావుణ్ను. బిడ్డకు ఉదయం నుంచి ఏమీ పెట్టలేకపోతిని, గాభరపడి సేయిజార్సు కున్నాను. ఇటు బిడ్డకు,ఆకలితో వచ్చిన పెనిమిటికి నోటివద్ద కూడు తీసేసాను. మన గడపనే ఏరికోరి వచ్చినట్టు సన్నాసయ్య ఒచ్చాడు. అతడేం శాపనార్థాలు పెట్టిపోతాడో, అసలే ఇంటిలో పరిస్థితి ఏమీబాలేదు." అని భయపడింది.

"భిక్షాందేహి మాం.....ఉపవాసాలతో కృంగితిని, మీ గడపకే వచ్చాను.





కాశీ వెడుతూ ఇక్కడ శ్రీముఖలింగక్షేత్రదర్శనం చేసుకుని మీఇంట క్షుద్బాధ తీర్చుకోవాలనివచ్చాను."అని సన్యాసి ఎలుగెత్తి అరిచాడు.

బసవయ్యకు కోపం వచ్చింది. వాకిట్లోకి వెళ్లి "మరో ఇంటికి పోవయ్యా! నాకో మతిహీనుడైన కొడుకున్నాడు. వాడికి ఉదయం నుంచి ఏటీ పెట్టుకోలేకపోతిమి, నా ఇల్లాలు వండిన అన్నం కుండను చేజార్చు కుంది.అన్నం నేలపాలయ్యింది. ఆమెకు రెండుపాదాలు కాలిబొబ్బలెక్కి నవి."అని రుసరుసచెప్పి వెనుదిరిగి లోపలికి వచ్చాడు.

"ఓయీ ఆ జగన్నాథుడు జన్మించిన పవిత్రమైన యదువంశంలో జన్మించి,ఇంటికి వచ్చిన అతిథి ఆకలి తీర్చడానికి పిడికెడు అన్నం విదల్చలేవా ? నీ వంటివాడికి మతిహీనుడైన కొడుకు కాకుండా సకలగుణ శోభితుడు జన్మిస్తాడా?నేను వేరుగడపకు పోను. నాకు నియమము కలదు. ఈ పూట నీ ఇంటనే ఉంటాను అతిథి ఆకలి తీరుస్తావా? లేదా?"ఆ సన్యాసి కోపంగా నాలుగువీధులు వినపడేలా అరిచాడు.ఆ చుట్టపక్కల వారుచోద్యం చూసారు.

ఇరుగు పొరుగువారు వచ్చి"వారి ఇంట కుదరదు అంటున్నారు. మా ఇంటికి రండి.కడుపునిండా తినిపొండి" అని చెప్పారు.అందుకా సన్యాసి నిరాకరించాడు.దాంతో అక్కడ గ్రామస్థులు మరింతమంది గుమి గూడారు. ఇదేదో వింతగా ఉంది. ఇంటింటికి 'అన్నమో రామచంద్రా' అని యాచించే ఈ సన్యాసి యాచకత్వంలో నియమాలు అంటున్నాడు. కొంపదీసి ఈతడు మహిమలు గలిగినవాడా? గ్రామానికి శాపాకారం పెట్టిపోడుకదా! ఏమిటో ఎవరిలో ఏశక్తి ఉంటుందో"అని గ్రామస్థులు మూతులు కొరుక్కున్నారు.

"అయ్యా, ఇదేమిటి ఇలా మాట్లాడుతున్నారు. మీకు సెప్పాను నా పరిస్థితి వండిన అన్నం నేలపాలయ్యింది.నేలమీదపడిన అన్నం మీకు పెట్టగలమా? మేము తినగలమా? మళ్లీ వండడానికి నా ఇల్లాలికి సాధ్యం కాదు. ఆమె కాలిన పాదాలతో ఏడుస్తోంది. అంతమంది పిలుస్తున్నారు. ఆ ఎదురుగా బ్రామ్మలున్నారు. ఆ ఇంటికి వెళ్లండి. వారూ పిలుస్తున్నారు." అని మెల్లగా చెప్పాడు.

"నా నియమాన్ని నేను వదులుకోను. చస్తాను కానీ, ఈ పూట వేరు ఇంట తినను. అతిథికి వండించవల్సిన బాధ్యత నీది. ఆమెకు కాళ్లు కాలినవి కానీ, చేతులు కాలలేదుకదా! అయినను నీవున్నావు. నీవు వండివార్చవచ్చు"

బసవయ్యకు కోపం తారాస్థాయినందుకుంది. "ఛీ. బయటికి వచ్చింది ముష్టికి. ఇంకా వాటికి నియమాలు కూడానా, నీకు ఒక్క మెతుకు కూడా పెట్టను. నీకోసం గాయపడిన నా ఇల్లాలు, నేను వండివార్చాలా?" పరుషపద జాలంతో రెచ్చిపోయాడు. ఒకదశలో మూల ఉన్న కర్రతీసాడు.

ఆ సన్యాసి వెంటనే వాకిటిలో చతికిలబడ్డాడు. కన్నులు చింతనిప్పుల్లా ఉన్నాయి. అతడి ముఖంలో చెమటబిందువులు ఎండకు మెరవసాగాయి.

మొత్తం గ్రామం అక్కడ మోహరించింది. బసవయ్యదంపతులకు ఏమీ చేయాలో పాలుపోలేదు. అంతవరకు వారి భరించలేని ఆకలి మందగించిపోయింది. బిడ్డవైపు చూసారు. రామన్న ఆకలికి ఒక్కక్షణం నిలువలేడు. ఏదైన పెట్టమని తల్లికి సైగలు చేసేవాడు. కానీ, ఈరోజు ఎందుకో అలా ఒకమూల కూర్చుండి పోయాడు. బిడ్డను చూసి "నాయనా ఆకలిగా ఉందా? పెట్టిస్తిదాన్ని"అని మెల్లగా లేచింది. బసవయ్య ఆమెకు తోడుపట్టాడు.

అంతలో రామన్నలేచి వాకిట్లోకి చూసి "ఓ అతిథి, రావయ్యా నీ ఆకలి తీర్చుకుందువు. నీ నియమానికి ఏ భంగం వాటిల్లదు. నీవు కోరు కున్నట్లే తుష్టుగా ఆరగించు." అని పిలిచాడు.

తల్లితండ్రులు ఉలిక్కిపడి, చేష్టలుడిగిపోయారు. రామన్న మాటలు విన్న గ్రామస్థులు కూడా నోళ్లు తెరిచారు. సన్యాసి దిగ్గున లేచి లోపలికి వచ్చాడు. రామన్న సన్యాసికి కాళ్లు కడుక్కోవడానికి చెంబుతో నీళ్లు ఇచ్చాడు. నేలమీద మూడు పీటలు వేసి, మూడు ఆకులువేసాడు. అతిథిని కూర్చోబెట్టి ఆపక్కనే తల్లి తండ్రులను కూర్చోబెట్టాడు. నేలమీదపడి ఉన్న అన్నంకు నమస్కరించి మెల్లగా తీసి అతిథికి వడ్డించాడు. ఆ తరువాత తల్లితండ్రికి వడ్డించాడు. అంతకు ముందు వండిన కూరలను, కాచిన బర్రెపాలను అక్కడ పెట్టి





తనకో ఆకు వేసుకుని నేలమీద మిగిలిన అన్నం తీసాడు. దానికి ఇసుక అంటుకుని ఉంది. అంతవరకు ఊపిరి బిగబట్టిచూస్తున్న సన్యాసికి కోపం కట్టలు తెంచుకుంది. "ఓరి మతిభ్రష్టా, నీవు ముమ్మాటికీ మతిగతి తప్పిన వాడవే, లేకున్నా నేలపాలయిన అన్నాన్ని నా వంటి అతిథికి వడ్డిస్తావా? నీ బుద్ధిహీనాన్ని చోద్యం చూస్తున్న నీ తల్లితండ్రులకు ముచ్చటగా ఉండిన ఉండవచ్చు. క్షమించరాని నేరం ఇందుకు నీవు, నీ వంశం ఈ పాపానికి పరిహారం చెల్లించక తప్పదు. నేటినుంచి ఇప్పుడు జరిగినతంతు ఈనేల ఉన్నంత వరకు మీవంశాలకు శాపమై వెన్నంటుతుంది. అతిథిలకు వడ్డించే వేళ, మీకు అన్నం నోటివరకు రాదు. మీరే కాళ్లతన్నుకునిపోతారు. అని గంగవెర్రులెత్తిపోయాడు. (ఇప్పటికి కొన్నిప్రాంతాల్లో యాదవకుటుంబాలలో పదిమంది కలిసిచేసుకునే విందుల్లో ఏచిన్న మాటపట్టింపు వచ్చినా వెంటనే తింటున్న భోజనాలు వదిలేస్తారు. లేచివెళ్లి పోతారు. కొంతమంది ఏకంగా విస్తరల్లో వడ్డించిన అన్నాన్ని తొక్కి వెళ్లిపోతారు. వీరంతా మర్యాదరామన్న వారసులే. ఈ విధానం చాలావరకు అంతరించినా ఇంకా ఉత్తరాంధ్రలో కొన్నిచోట్ల కన్పిస్తుంటుంది. దీని వెనుక కారణంవారిలో చాలామందికి తెలియదు. మర్యాదరామన్న పొందిన శాపం అది.)

రామన్నను తల్లితండ్రులు అక్కడ గుమిగూడిన వారు కన్నార్పకుండా చూసారు. వారిని కన్నులతో అనునయిస్తూ రామన్న చిర్నవ్వుతో "ఓ అతిథీ నీవు ఆకలితో ఉన్నందున నీలో ఆలోచనా శక్తి నశించింది. నీవు వచ్చునది భోజనాల వేళ, అదీ శూద్రకులసంజాతుని ఇంట భుజించుటకు వచ్చితివి. అతిథి ధర్మం నీవెరుగవా? భోజనాల వేళ ఏమి వండుకుంటే అదే పెడతారు అదే తిని పోతాడు కానీ నీవు నేలపాలయిన అన్నం అని ఈసడించావు. తల్లితండ్రులు కంటే ఆ దేవుడు కూడా గొప్పవాడు కాడు. నీతోబాటు నాకు జన్మనిచ్చిన వారిని పంక్తిలో కూర్చుండబెట్టి నాకు ఇంట కలిగినది వడ్డించాను. నీ అన్నమందు ఇసుకరేణువు కూడా అంటుకుని లేదే. మిదిభాగం నీకు

పెట్టాను. అట్టడుగున ఇసుకతో కలిసినది నేను పెట్టుకున్నాను. అకారణంగా నాపై, నా వంశంపై నోరుపారేసుకున్నావు. నీవు తాపసివి పలుక్షేత్రాలు దర్శిస్తున్నావు. ఏదో ఒక కొంపను నీకుగా నీవు ఎంపిక చేసుకుని వచ్చి వడ్డించమంటున్నావు. ఇది ఏధర్మం? తాపసికి ఉండాల్సిన శాంతలక్షణమే లేదు. అన్నం పరబ్రహ్మ స్వరూపం అని ఎరుగవా?అన్నాన్ని ద్వేషించేవాడు పామరుడు.. తపస్సంపన్నుడు  కాడు. నీవింతవరకు చేసిన తపోబలం వ్యర్థమైంది."

విన్నవారంతా నోళ్లుజాపారు. తల్లితండ్రులు బిక్కముఖాలు వేసారు. కొడుకును చూసుకుని కళ్లనీళ్లు నింపుకుంది వసుమతి. సన్యాసికి జ్ఞానోదయం అయినట్టుయ్యింది."నాయనా ఆకలికి, కోపానికి బానిసనై పామరుడులా ప్రవర్తించాను. నా నియమాన్ని నీవు భంగపరచకుండా వడ్డించావు. నిజమే అన్నం పరబ్రహ్మ స్వరూపమే. ఆ మహాసత్యాన్ని విస్మరించాను. మన్నించు నీవంటి వాని చేతులమీదుగా ఆతిథ్యం పొందినందుకు గర్వపడ్తున్నాను." నాలుగు ముద్దలు మింగి ఆకలి తీర్చుకున్నాడు. అక్కడ ఉత్కంఠ మరింత నెలకొంది.

తల్లితండ్రులు తిన్నాక వారికి నీళ్లు అందించి ఆ తరువాత తాను ఇసుకతో కూడిన అన్నం తినబోతుండగా అక్కడ ఉన్న ఇరుగుపొరుగువారు "నాయనా రామన్న నీ ఆకులో  అన్నం నేలను దొలిచి తీసింది. అందులో ఇసుకకలిసి పోయింది. ఇదిగో మాఇంటి లోంచి తీసుకు వచ్చాం తిను అని అందించారు. "పూజ్యనీయులారా మన్నించండి నేల పాలయిన అన్నాన్ని నేను పరబ్రహ్మస్వరూపంగా భావించాను. కనుకనే ఆ మహాత్మునికి, నా కన్నవారికి వడ్డించాను. నేను ఈ ఆకులో ఉన్నదాన్ని భుజించడమే ధర్మం. ఎదుటివారికి చెప్పడం కాదు ఆచరించడం ముఖ్యం."అని ఇసుకతో కలిసిన అన్నాన్ని నమస్కరించి తిన్నాడు. ఆదృశ్యం చూసి అక్కడున్న వారితో బాటు సన్యాసి చేతులు జోడించాడు.





'అమ్మవారి గుడిపూజారి రామన్నచే తినిపించిన అరటిపండు మహత్యమే  రామన్న మాటలకు, ఆచరణకు కారణం అయ్యింది.కనుకనే అతనిలో గుణవంతుణ్ని, ధర్మమూర్తిని  అందరూ ఇక్కడ ఇలా చూస్తున్నాం' అని తల్లి లోలోపల అనుకుని సంబరపడి పోయింది.

సన్యాసి రామన్నను దగ్గరగా తీసుకుని "నాయనా నీవు లోకకళ్యాణాన్ని కోరేవాడివిగా దేశం నలుమూలలా తిరిగి నీ విలువైన తీర్పులతో అందర్ని ఆకట్టుకోగలవు.నేను పలికినది సత్యం.నీలో ఉన్న మతిహీనం నేటితో అంతరించినట్టే. నిన్ను కన్న నీ తల్లితండ్రులు ధన్యులయ్యారు." అని చెప్పి రామన్న నుదుటిపై ముద్దుపెట్టాడు.


అక్కడ ఉన్న గ్రామస్థులు చుట్టుచేరి రామన్నను తేరిపారచూస్తూ ఎత్తిపొగిడారు.బసవయ్యదంపతులుఎనలేనిఆనందంతో,ఆనందభాష్పాలతో నోటమాటరాకుండా నిలుచుండిపోయారు.

సన్యాసి మరలా మాట్లాడుతూ "ఓ పూజ్యదంపతులారా, నన్ను నమ్మి నావెంట ఈ బాలున్ని పంపండి. ఈ తెలుగునేలంతా తిప్పి ఈతని ప్రతిభను లోకానికి చాటగలను. ఎందరో మూఢులైన రాజులకు కనువిప్పు కల్గించగలడు. తిరిగి తీసుకువచ్చి మీకు అప్పగించగలను."అని కోరాడు.


అందుకు తల్లితండ్రులు అంగీకరించలేదు. అప్పటిలో సన్యాసులంటే భయభ్రాంతులైయ్యేవారు.కారణం వారు పసివారిని దేవతావిగ్రహాలకు బలి ఇవ్వడంవంటి దుస్సాహసాలకు పోతుండేవారు.అందుకే బసవయ్య దంపతులు కాదన్నారు.ఆ సన్యాసి నొచ్చుకోకుండా "నాయనా నేను ఒంటరిగా వెళ్లిపోతున్నాను.నిన్ను భైరిపురాధీశుడు అయిన రాచమల్లు గర్వం అణచవల్సిందిగా కోరుతున్నాను.అతడు పరమమూర్ఖుడు అట్టివాని ఏలుబడిలో ప్రజలు నానా యాతనలు పడ్తున్నారు.నీవే అతనికి సరైన గుణపాఠం నేర్పాల్సి ఉంది.ఇది నా నమ్మకం. మళ్లీకలుద్దాం సెలవు" చెప్పి అక్కణ్నించి వెళ్లిపోయాడు.

ఈ సన్యాసికేం పోయింది ఏకంగా భైరిపురాధీశుడిపైకి బాలున్ని ఉసిగొలిపిపోయాడు ఆ రాచమల్లు. పరమమూర్ఖుడు. మనకెందుకు హాయిగా పశువులను మేపుకుని కడో గంజో తాగిబతకకుండా లేనిపోనివి అనవసరం అని గ్రామస్థులు చెప్పి వెళ్లిపోయారు.

బిడ్డన్ను అక్కున చేర్చుకుని "సాయన్నా మనకెందుకు రాజులతో పట్టింపులు. మన బతుకేదో మనది, ఏమంటావు? అని అడిగి సముదాయించారు. రామన్న ఆ సాయింత్రం వరకు ఆదమరిచి నిద్రపోయాడు. బిడ్డవైపు నరులు దృష్టిపడింది నరుడు కళ్లుపడితే నల్లరాయి అయినా పగులుతుంది అందుకే ఇలా అయిపోయాడు అని బాధపడ్డారు బసవయ్య దంపతులు.


తెనాలి రామకృష్ణకవి
నూతన హాస్య కథలు
రచన :
శ్రీ యర్నాగుల సుధాకర్
పేజీలు : 308 వెల : 90/-
రోహిణి పబ్లికేషన్స్, రాజమండ్రి.




తెనాలి రామకృష్ణకవి
నూతన హాస్య కథలు
రచన :
శ్రీ యర్నాగుల సుధాకర్
పేజీలు : 308 వెల : 90/-
రోహిణి పబ్లికేషన్స్, రాజమండ్రి.






# చేతబడి భూటకం

ఒకసారి గ్రామంలో అలజడి మొదలయ్యింది. ఏడాది క్రితం పారిపోయిన క్షుద్రదేవతా ఉపాసకులు అయిన ఇద్దరు దంపతులు గ్రామంలో పెక్కుమందికి చేతబడిపెట్టి వారిచావులకు కారకులయ్యారు. ఈవిషయాన్ని భూతవైద్యుడు గ్రామస్థులకు చెప్పగానే ఆ రాత్రి ఆ దంపతులు ప్రాణ భయంతో గ్రామం వదిలిపారిపోయారు. ఉన్న ఊరును వదల్లేక తిరిగి వచ్చారు. వారిని చూసిన గ్రామస్థులు చెట్టుకు కట్టి చావగొట్టారు. ఇలా చావగొడితే కాదు ముందుపళ్లు ఊడగొడితే గాని క్షుద్రదేవతా ఉపాసన వారినుంచి అంతరించదు. వారు మంత్రోచ్ఛరణ చేయకుండా చేయాలి. అంటే, తప్పకుండా పళ్లూడ గొట్టాలి అని వారికి భూతవైద్యుడు సలహా ఇచ్చాడు. ఆ వెంటనే మరింత పెట్రేగి పోయారు గ్రామస్థులు. వారిలో వీసమెత్తు జాలిలేదు. తలా ఒక రాయి, అందుకున్నారు కొందరు పటకారులు తీసుకుని వచ్చారు. పాపం బాధితులు పెడబొబ్బలు పెడ్తున్నారు. దీనంగా అర్థిస్తున్నారు వదిలేయండి ఈ ఊరివైపు తొంగిచూడం. మాకేపాపం తెలియదు. దీనాతిదీనంగా ఏడ్వసాగారు. వారి మొర ఆలకించేవాడే లేడు.

బసవయ్య దంపతులు కూడా గ్రామస్థులతో కలసి నరకండి పొడవండి అని అరవసాగారు. ఈ మధ్యకాలంలో ఎందరు చచ్చారు. అందులో పిల్లలే ఎక్కువ. మీకు ఏంపోయేకాలం ఇలాంటి విద్యలు నేర్చుకున్నారు? మీ పిల్లల్ని చంపుకోలేక పోయారా? అని నిలదీసారు. సాయింత్రం గడిచి చీకటి తెరలు ముసురుకుంటున్నాయి. గ్రామపెద్దలు కొందరు వచ్చారు. ఇంకా ఏమిటి ఆలస్యం ఈ ఇద్దరిని చంపి పాతరేయండి. ఎవడు వచ్చి అడుగుతాడో చూద్దాం. ఇలాంటి క్షుద్రపూజలు చేసినవారిని వదల రాదు." ఎలుగెత్తి కోపంతో ఆదేశించారు. అక్కడ గుమిగూడిన వారు మరింత రెచ్చిపోయారు. ఆ బాధితులు ఎదుట ఎర్రచందనంతో వేసిన ముగ్గుముందు కూర్చున్న భూతవైద్యుడు గన్నేరుకాయలు, నిమ్మకాయలుపై దీపం వెలిగించి

ఆ ముగ్గుచుట్టూ నలువైపులా ఆకాయదీపాలను నిలబెట్టి వాటిమధ్య పేలాలు వేసి మనిషిపుర్రెబొమ్మ పెట్టి పూజలు చేయసాగాడు. నల్లకోడి, నల్లమేక, పందిపిల్ల ఒకటి బిక్కుబిక్కుమని కసాయిచేతిలో బలికి సిద్ధంగా ఉన్నాయి. భూతవైద్యుడు పుర్రెనోటిలోకి దుర్భిని వేసి చూడసాగాడు. "ఇంకా ఆ చేతబడి క్షుద్రపిశాచి ఈ నీచుల్లోనే దాగిఉంది.అది దిగివచ్చి ఈపూజ ముగ్గులో బంధింప బడినాక వారికి పళ్లూడగొట్టాలి." అని భూత వైద్యుడు అన్నాడు. అక్కడ నిశ్శబ్దం చోటుచేసుకుంది.

అప్పటికే మధ్యాహ్నం నుంచి తిండితిప్పలు లేక చావు దెబ్బలుతిని రక్తం ఓడుతున్న బాధితులు చెట్టుకు వ్రేలాడిపోయారు. దీనంగా ప్రతిఒక్కరిని వేడుకుని అందరిచే తిట్లు చెప్పుదెబ్బలు తిని ఏ క్షణం నోటిపళ్లు ఊడి పోతాయో అని భయంగా అర్ధంకాని ఆ పూజలవైపు చూడసాగారు. ఎంత వేగరం పూజ అవుతుందా! ఏ క్షణన్న భూతవైద్యుడు ఆదేశిస్తాడా! ఏమాత్రం ఆలస్యంచేయకుండా బాధితుల నోటిపల్లు రాలగొడదాం అని అక్కడున్న ప్రతివారిలో ఉత్కంఠగా ఉంది.అందరి చేతుల్లో సద్దురాయిలు, పటకారులు ఉన్నాయి. సరిగ్గా అప్పుడే అక్కడికి వచ్చాడు రామన్న.

రామన్నను చూడగానే తల్లి ఆ గుంపునుంచి బయటికి వచ్చి "నాయనా ఇక్కడికి ఎందుకు ఒచ్చినావు. ఆ నరపిశాచులు నీవంటి పిల్లలకు చేతబడిపెట్టి సంపేస్తున్నారు. ఆచెట్టుకు కట్టినవారి దృష్టిలో పడకురా నువ్వు ఇంటిలో ఉండు. ఇక్కడ జరుగుతున్నది నువ్వు సూడమాకురా."అని చెప్పి వెనుక్కు పంపే ప్రయత్నం చేసింది. బసవయ్య వచ్చి రామన్నను తీసుకు వెళ్ళాలనుకున్నాడు.

రామన్న తల్లితండ్రులను విదిలించుకుని చుట్టూ గుంపుగా ఉన్న గ్రామస్థుల మధ్యకు వెళ్లాడు.అక్కడ ముగ్గుముందు కూర్చుని పూజలు చేస్తున్న భూతవైద్యుడ్ని చూసి నమస్కరించి"నన్ను దీవించండి.నేను మీతో మాట్లాడాలి."అని వినయంగా అడిగాడు.అప్పటికే బసవయ్య లోపలికి వచ్చి "పదనాయనా అతడు పూజలో ఉన్నాడు. మనతో మాట్లాడడు.ఇక్కడ అంతా





అతని పూజ త్వరగా ముగియాలని,ఈ దుష్టులను శిక్షించాలను కుంటున్నారు." అని తీసుకుని పోబోయాడు.

"తండ్రీ నన్ను తొందరపెట్టకు. నేను నీతో రాలేను. ఇక్కడ జరుగు తోంది ఏమిటో అందరికి తెలియాలి. నేను ఈతనితో మాట్లాడాలి.ఈపూజలు వలన ఆ నిందితులలో గల చేతబడిదేవత బయటికి వస్తుంది అని చెప్పి పూజలు చేస్తున్నాడు. వారేమో తమకు ఎలాంటి శక్తులు లేవు, నిరపరాధులం అనిప్రతి ఒక్కరిని ధీనాతి దీనంగా వేడుకుంటున్నారు.ఇందులో నిజా నిజాలు తెలుసుకోవాలి.అది మనందరి బాధ్యత కాదా?ఈ ఇద్దరిని దండించి చేతులు దులుపుకుంటే కాదుకదా, ముమ్ముందు మనపై ఎలాంటి క్షుద్రశక్తులు పని చేయకూడదు." ఖంగుమనే గొంతుతో అక్కడ ఉన్న వారిని అడిగాడు.

మూఢనమ్మకాలున్న వారి సంఖ్య ఎక్కువ ఉన్నందున "నీవు చిన్నోడివి నీవు చెప్పడమేమిటి?ముందు పూజ జయప్రదం కానివ్వు. ఆ ఇద్దరిని చంపి తీరాలి.నిన్నటివరకు మూగోడిలా ఉన్నావు. ఈరోజు నోరు తెరిచావు. నీకు ఆ ఇద్దరు ఏదో క్షుద్రశక్తిని పెట్టిఉంటారు. ముందు వచ్చీరాని మాటలు ఆపేసి అదిగో అక్కడపడున్న రాయి అందుకుని ఆ ఇద్దరిమూతిపళ్లు రాలగొట్టు"అని ఏకగొంతుతో చెప్పారు గ్రామస్థులు కొందరు.

"చాలించండి మీ వాదన. శాంతం వినండి. ఈతడు భూతవైద్యుడు ఈతడు చేస్తున్న పూజలు భయంకరమైన క్షుద్రపూజలు అవి ఏఊరవతలో చేయడంలేదు. ఊరిమధ్య రచ్చబండవద్ద చేస్తున్నాడు. మనకెదురుగా ఉన్న శ్రీముఖలింగేశ్వరుని ఆలయం ముందు కోడి ,మేక, పందిని బలిఇవ్వడానికి సిద్ధపడ్తున్నాడు. మనం హైందవులం, ముందు ఇక్కడ ఈ బలిపూజలను, మానవ హింసను ఎత్తించాలి.లేకుంటే సాక్షాత్తు ఆ సర్వేశ్వరునికి కినుక వచ్చినా మనమెవ్వరం మిగలం."

రామన్న పలుకులకు ఆలయపూజరులు "నిజమే మనం ఇంతవరకు ఏమి ఆలోచించలేదు.ఎంతసేపు క్షుద్రశక్తులతో ఊరినంతా భీభత్సంచేస్తున్న ఆ హీనులకు తగు దండన వేయించాలి అని పనికట్టుకుని ఉన్నాం.ఇక్కడ

బలులు పూజలు పనికిరావు ఎత్తేయ్యండి. ఇక్కడ ఎట్టిపరిస్థితిలో సాగనీయం" అని అడ్డంపడ్డారు.

భూతవైద్యుడు నాలిక కరుచుకుని రామన్న వైపు కొరకొరాచూసి "ఓరి పిల్లగాడా ఎంతపనిచేసావురా కాళ్లుచేతులు ఆడకుండా చేసావు కదరా!" అని మనస్సులో తర్కించుకుని వెంటనే పూజను కుడిచేత్తో చిన్నాభిన్నంచేసి నిలబడ్డాడు. పెద్దలు "ఎక్కడ పూజ పెద్దాం" అని గాభరగా అడిగారు.

"పూజకాదు సగం చేసి లేచిపోతే మరిన్ని ఇబ్బందులున్నాయి. ఇప్పుడు ఈ నీచులు మరింత శక్తివంతులైపోయారు. ఇంతవరకు వీరు చేతబడి పెడితే కేవలం ఏదో తెలియని రోగంవచ్చినట్టుఉండేది.ఆ తరువాత కొన్నాళ్లు అయ్యాక చనిపోయేవారు.కానీ,ఇప్పుడు చేతబడి ప్రయోగం చేస్తే మరుక్షణం రక్తంకక్కుకుని ఎంతటివాడైనా ఛస్తాడు."అని రోషపూరితుడై ఆ భూతవైద్యుడు రామన్నను కోపంగా చూస్తూ మరీచెప్పాడు.

ఒక్కసారి గ్రామస్థులలో అలజడి పుట్టింది. "అయితే ఈ ఇద్దరిని పళ్లూడ గొట్టడంకాదు. ఏకంగా నరికి ముక్కలు చేసేద్దాం" అని అరిచారు. "ఆగండి ఆవేశం పడవద్దు వారిలో శక్తులు నా ముగ్గులోకి వచ్చాకనే,ఆ తరువాత ఆ శక్తులకు బలులు ఇచ్చాకనే ఆ పనిచేయాలి. ఆ శక్తులను వారిలో ఉంచి చంపితే వీళ్లు క్షుద్రదయ్యాలై మనపై పగతీర్చుకుంటాయి. మనలో ఒక్కడినీ మిగలనీయరు." భూతవైద్యుడు బిగ్గరగా గ్రామస్థులు మరింత నమ్మేట్టు చెప్పాడు.

ముగ్గులు వేసి పూజ చేయమని అందుకు అనువైన ప్రదేశం చూడమని గాభరపడ్డారు పలువురు."పదండి శ్మశానానికి పోదాం. పూజసిద్ధిస్తుంది." భూతవైద్యుడు లోగొంతుతో చెప్పాడు. అక్కడి వారికి అతడు ఏమి చెబితే అదే వేదం.

"అయ్యా నిరపరాధులం దాహంతో చచ్చిపోతున్నాం. నాలుకపిడచ కట్టుకునిపోతోంది"ఏడుస్తూ కోరారు బాధితులు.ఎవరో పేడకలిపిన నీళ్లు ఇచ్చారు. అవే తాగేందుకు సిద్ధపడసాగారు ఆ బాధితులు.





రామన్న మరల మాట్లాడుతూ "ఆగండి శాంతం వినండి. చీకటి పడింది పూజలు చేయడానికి పాపం ఈతనికి శక్తి ఉండాలి. నేనో ఉపాయం చెబుతాను వినండి ఈ నేరగాళ్లలో దాగిన శక్తులను మనం ఇక్కడే వెలికి తీయిద్దాం.అందుకు భూతాల అధిపతి అయిన ఆ సర్వేశ్వరున్ని కోరు కుందాం.నా మీద భారంపెట్టండి సమస్యను నేను తీర్చగలను."అని వారిని ప్రాధేయపడ్డాడు.

అంతా బాలునివైపు చూసారు. అప్పటికే ఉదయం రామన్న గురించి ఆ ఊరి వారు విన్నారు.కొందరు మహిళలు పూజలు చేసారు.కనుక అతడి మాటను వినాలనుకున్నారు."అయ్యా ఈరోజు ఈ చేతబడి సమస్య తీరిపోవాలి అని ఆశతో అంతా ఉన్నాం. నీవు చెప్పినది మాకు నచ్చితే ఖచ్చితంగా నీ వెనుకనే ఉంటాం. ఈ దిక్కుమాలిన ప్రాణాంతక సమస్యను ఎలా తీర్చాలనుకుంటున్నావు." అని అడిగారు. అలా కొంతసేపటికి రామన్న మాటలు విందామని అంతా కలిసారు.

"మన భూతవైద్యులు వారు ఇప్పుడు చెప్పినట్టు ఈ చేతబడి పెట్టే దంపతులు ఇప్పుడు ఎవరికైనా పెడితే రక్తం కక్కుకుని ఛస్తారు.కనుక నేనే పెట్టించుకుంటాను. ఈ గ్రామం కోసం చావాలనుకుంటున్నాను.అయితే, నా చివరి కోరిక మీరంతా తీర్చాలి. అందుకు ఒప్పుకుంటే క్షణాల్లో చిక్కుముడి వీడిపోతుంది. అసలు చేతబడి నిజమా లేదా అనేది తేలి పోతుంది."

అంతా మూతులు కొరుకున్నారు. బసవయ్యదంపతులు లబోదిబో మన్నారు."నాయనా ఇదేమి ఈరోజే నోరువిప్పి మాకు ఆశ్చర్యం కల్గించావు. ఇప్పుడు ఏకంగా ఊరికోసం చావాలనుకుంటున్నావు.పదాపోదాం" అని ఈడ్చుకుపోసాగారు.'తీసుకుపోండి లేకుంటే ఛస్తాడు'అన్నట్లు సైగలు చేసాడు భూతవైద్యుడు.రామన్న తల్లితండ్రులకు సర్ధిచెప్పాడు."మీరు అలా చెట్టుక్రిందకు పోయి కూర్చుని చూస్తూండండి అని వారిని పరిపరి విధాలుగా చెప్పి వెనుకకు పంపించి "ఓ ప్రజలారా అంతా దయచేసి చూడండి. చేతబడిలో ఉన్న నిజం మనంఅంతా కళ్లారచూసే భాగ్యం మన భూతవైద్యులు





వలన, తద్వారా నా వలన మీ అందరికి ఈ క్షణమే ఇక్కడే కన్పిస్తుంది. ఏమంటారు ?" అని ప్రశ్నించాడు.

మనిషికి ఉండే ఒకే ఒక అవలక్షణం ఇతరులమీద ఏదైనా ప్రయోగం చేసి అందులో నిజాలు ఎంతున్నాయో చూద్దామని ఆశ,ఉత్సాహం ఎక్కువగా కన్పిస్తుంది.కనుక అక్కడ గుమిగుడినవారు రామన్న ఏమి అయిపోయినా తాము కళ్లార చూసే భాగ్యంకు మురిసిపోయారు. అంతా ఎలుగెత్తి "మేము సిద్ధం. నీవు మాకు ఆ దిక్కుమాలిన మహమ్మారి చేతబడిని చూపించు నీ చివరికోరికను తెలియపరుచు. తీరుస్తాం ఎంతకావాలన్నా ధనం నీ తల్లి తండ్రులకు ఇప్పించగలం" అని కూడా ఆశపెట్టారు.

"నా చివరికోరిక తెలియపరుస్తున్నాను.చేతబడి పెట్టినట్టు మీ అందరిచే అభియోగం మోపబడి నానాహింసలకు గురయి,చెట్లకు విరిచికట్టి వేయబడి మనమంతావిధించుఘోరమరణశిక్షకై బెదురుతు ఎదురుచూస్తున్న వీరిని ఉన్నపళంగా వదిలేయాలి.వీరిలో శక్తులు తాత్కాలికంగా బయటికి వచ్చి నాలో ప్రవేశించాక ఇంకా వీరిని దండించడం శుద్ధ దండుగ ఏమంటారు? ఎక్కడికో పోయి వారి బతుకు వారు బతుకుతారు. వారిని మనం శిక్షించరాదు. నాయీ కోరిక తీర్చాలి అప్పుడు నేను నా మరణాన్ని వీరిద్వారా స్వాగతిస్తాను."

పెద్దగా గోలచేసి మరీ ఒప్పుకున్నారు గ్రామస్థులు. బసవయ్య దంపతులు కన్నీరుమున్నీరు అయ్యారు.చెట్టుకు కట్టివేయబడి వేలాడిపోయిన ఆ బాధితులు రామన్నకు మనస్సులో మొక్కుకున్నారు."నీవు పిల్లోడివి కావు. మాపాలిటి దేవుడవు.నీకు జన్మజన్మలకు రుణపడిఉంటాం."అని మొక్కు కున్నారు.

భూతవైద్యుడు ఎటుపాలుపోని పరిస్థితిలో మిగిలాడు."ఇదేంటి ఈ కుర్రాడు మహాచమత్కారిలా ఉన్నాడు. తాను ఏమి మాట్లాడినా దాన్ని తనకు అనుకూలంగా మలుచుకుని గ్రామస్థులతో ఒప్పించాడు. ఇప్పుడెలా? చేతబడి లేదు అని తెలిసిపోతుంది. లేదని తెలిసిపోతే ఈ గ్రామస్థులు ఒక్కరూక

అయినా ఇవ్వరే. ఇక తాను బతికేది ఎలా? అని తలవొంచుకుని తర్కించుకోసాగాడు.

రామన్న తల్లితండ్రులకు మ్రొక్కి దీవెనెలు పొంది చెట్టుకు కట్టివేయబడిన ఇద్దరిని బంధవిముక్తులను చేసి వారికి నీళ్లుఇచ్చి"చల్లని నీళ్లతో సేద తీరండి మీరు నేర్చిన చేతబడి మంత్రం గుర్తుకు తెచ్చుకోండి " అని వారిని భుజం తట్టాడు. తాము చూస్తుండగా చేతబడితో రామన్న ప్రాణాలు పోతాయి ఆ దృశ్యం దగ్గరనుంచి చూడాలని ముందుకు తోసుకురాసాగారు ఊరి ప్రజలు.

"అయ్యా ఇలా అయితే కష్టం. వీరికి ఆ మంత్రం గుర్తుకురావాలి. అంతా బంతి ఆకారంలో దూరంగా నిలబడండి."అని రామన్న అందరికి విన్నవించాడు. అప్పటికే చీకటిపడినందున కచేరీనుంచి కొందరు భటులు దివ్విటీలు తెచ్చారు.

భూతవైద్యుడు లేచి " నాయనా నీవెందుకు ప్రాణత్యాగం చేయాలి.నీవు చాలాకాలం బతకాల్సినవాడవు. నీవు వెనక్కిపో! నేను ఈ రాత్రి శ్మశానంలో పూజలు తెల్లవార్లు చేస్తాను. ఈ నీచుల్ని అక్కడే అంతంచేసి ఈఊరికిపట్టిన చేతబడిని వదిలిస్తాను." పెద్దగా అరిచి చెప్పాడు.

కొందరు యువకులు ఒప్పుకోలేదు. "ఓ మంత్రాలమర్రి వైద్యుడా, నీ పూజలు తర్వాత చేద్దువుగాని, కళ్లముందే చూపిస్తానంటున్నాడు.నువ్వు అడ్డుతగలకు."అని భూతవైద్యున్ని కాదన్నారు. అక్కడ పరిస్థితి క్షణక్షణం ఉద్రేకపూరితమవుతోంది.

రామన్న నేలమీద పడున్న నిమ్మకాయలు అందుకున్నాడు వాటినికోసి సేదతీరుతున్న ఇద్దరికి ఇచ్చాడు.వారు నోట్లో పిండుకున్నారు.

వారిని మరింతగా ఉత్సాహపరిచాడు."మీకున్న చేతబడిని నాకు పెట్టగలిగితే మీరు ప్రాణాలతో బయటికిపోతారు లేకుంటే వీరి చేతిలో ఛస్తారు." అని పదేపదే చెప్పాడు.వారు ఎలాగైనా బయటపడాలి అనే ఆశతో ఉన్నారు.వచ్చిన అవకాశం వాడుకోవాలని చూసారు.వారు నిశ్శబ్దం





భగ్నంచేస్తూ తలలు పైకెత్తి చేతులూపసాగారు.అంతా ఉత్కంఠగా చూడసాగారు. 'అదిగో చేతబడి ప్రయోగం చేస్తున్నారు.' అని పలువురు మూతులు కొరుక్కోసాగారు.దివ్విటీల వెలుగులో ఎర్రగా కన్పిస్తున్నారు. 'ఓంఫట్ ఓం ఫట్ స్వాహా' అని అరవసాగారు.

రామన్న పెద్దగా అరిచాడు. ఆ వెంటనే నోటివెంట రక్తం స్రవించసాగింది.

ఒక్కసారి గ్రామస్థులలో కలకలం మొదలయ్యింది.'అదిగో రక్తం పాపం రామన్న బలిఅవుతున్నాడు అని అనుకోసాగారు.' రామన్నవైపు చేతబడిపెట్టిన దంపతులు అయోమయంగా చూడసాగారు. "ఓ ప్రజలారా నాకు ఇచ్చిన మాట ప్రకారం వీరిని వదిలేయండి. మన భూతవైద్యుడు చెప్పినట్లు వీరిలో శక్తులు బయటపడి నాలో ప్రవేశించాయి. కనుక, వారిని వదిలేయండి. లేకుంటే కోరిక తీరని నాకు ఇప్పుడు చనిపోయాక దయ్యం అయి మీ అందరిమీద పగ తీర్చుకునే ఆత్మగా చేయవద్దు." అని లుంగలు చుట్టుకు పోతూ చెప్పాడు.

ప్రాణాలు బలిపెట్టిన రామన్న అంతిమ కోరిక తీర్చాలి తప్పదు అని గ్రామస్థులంతా చేతబడివారిని పొమ్మని అరిచారు. ఆ మాటవిన్నంతనే బ్రతుకు జీవుడా అని చేతబడి దంపతులు పరుగెత్తారు.ఆ ఎదురుగా కన్పించే అడవిలోకి పారిపోయారు. దివ్విటీ వెలుగులో రామన్న విలవిల లాడుతునే ఉన్నాడు.అతడి నోటివెంట రక్తం కారుతోంది.బసవయ్య దంపతులు గొల్లున ఏడ్వసాగారు. భూతవైద్యుడు నోరు చాటలా చాపుకుని చేతబడి బూటకం కాదన్నమాట నిజంగా ఉందా తను ఇంతవరకు లేనిది ఉన్నట్టుగా పిచ్చి ప్రజలను నమ్మించి పొట్టపోసుకునేవాడు.ఇప్పుడు ఉందని తెలిసింది. ఆనందంతో లేచి మరిన్ని లేనిపోనివి నమ్మించ చూసాడు. "ఇదిగో బాలుని ముఖంలో ప్రేతకళ కన్పిస్తోంది.ఇది ప్రేతాండక పిశాచంపనే.రక్తం కక్కిస్తుంది చూస్తుండగా ఛస్తాడు. ఊరిమధ్య చావడం ఊరికి అరిష్టం కనుక ఏటికి (నదికి)ఆవల ఈవల మన్ను తీసుకురావాలి.ఆవలి ఒడ్డున ఉన్న అరిటి

పిలకల చెట్టుతో ఈ బాలుణ్ని దిగతుడవాలి.అలాగే,ఇంటికి తలాచేట బియ్యం నల్లకోడి ఆరుశేర్ల నల్లనువ్వులు,ఆరుగిద్దెలు నువ్వులనూనె నేను చేసే పూజకు కావాలి. అవన్నీ తీసుకుని ఈ రచ్చబండవద్ద నా అనుచరులకు ఇవ్వండి. వారు తీసుకుని నా పూజకు సహకరిస్తారు. వెంటనే ఆ పనిలో ఉండండి పిల్లవాడు చచ్చేదాక నా ఆధ్వర్యంలో ఉండాలి.పిల్లవాని కన్నవాళ్లను ఇక్కడ్నించి తీసుకుపొండి. పదండి మీలో ధైర్యం ఉన్నవారు చావనున్న పిల్లవాణ్ని తీసుకుని శ్మశానంలో వదిలిపెట్టి వెనక్కు తిరిగి చూడవద్దు అని అప్పటికప్పుడు తయారుచేసిన కొన్ని నియమనిబంధనలు అంతా నమ్మేట్టు చెప్పాడు. అంతా ఉత్కంఠభరితంగా విన్నారు.

బసవయ్య ముందుకువచ్చి "నా బిడ్డను నాకివ్వండి" అని ఏడుస్తూ అడిగాడు. అంతా కాదన్నారు అతన్ని దూరంగా ఈడ్చుకుని పోసాగారు. భూతవైద్యుడు పెద్దగా మంత్రాలు చదవసాగాడు.అక్కడ ఉన్న ప్రజలు ఒక్కసారి విచారంలోకి వెళ్లిపోయారు. చూస్తుండగా రామన్న చావుబాటలో పడినందుకు విచారించారు.

నేలమీద పడుకున్న రామన్న ఒక్కసారి దిగ్గున లేచి కూర్చున్నాడు. అక్కడ దివ్విటిని అందుకుని "పురప్రముఖులారా నా మాటలు వినండి.నేను చావడంలేదు. నాకు ఎలాంటి శక్తులు సోకలేదు. చేతబడి అనేది బూటకం రండి మీ అందరికి నిరూపిస్తాను." అని ఎలుగెత్తి పిలిచాడు.

"రామన్న బతికాడురా, అదిగో ఎంతదర్పంగా నిలబడి నిరూపిస్తానంటున్నాడు" అని వెనుదిరిగారు. అందరి మధ్య రామన్న తిరుగుతూ ఇలాంటి భూతవైద్యులు సృష్టించినదే ఈ చేతబడి. చూడండి పూజలు చేస్తానంటున్నాడు. ఇతడు చేసేవి క్షుద్రపూజలు వాటిని మనం ప్రోత్సహిస్తున్నాం. నిరుపేద దంపతులను చేతబడి పెట్టినవారిగా గుర్తించి నానావిధాలుగా హింసి స్తున్నాం. అసలు చేతబడి లేనేలేదు.అది మన మానసిక రోగం. ఇలాంటి దొంగవైద్యులకు జీవనమార్గం."





"మరి నీవు రక్తం కక్కితివి.అదిగో నీ దుస్తులపై అంటుకుని మెరుస్తోంది."అని ఒకడు అడిగాడు.

ఇది నిమ్మకాయలో కలిసిన ఎర్రసిందూరం.మీరు చూడకుండా నేను నిమ్మకాయలను కోసి ఇక్కడ పూజలో ఉన్న సిందూరం పూసుకున్నాను. చేతబడి పెట్టమని పాపం ఆ బాధితులను లోగొంతుతో అడిగితే, వారు అయ్యా నిజంగా మాకు ఎలాంటి చేతబడి రాదు అని చెప్పారు. వారికి లోగొంతుతో చెప్పాను. నింగిలోకి చూసి ఓంఫట్ ఓం ఫట్ స్వాహా !అని అనమని చెప్పాను. వారు పామరులైనా ప్రాణాలకోసం తూ.చ. తప్పకుండా అనగలిగారు. ఈలోగా నేను నిమ్మకాయను నోటిలో పెట్టుకుని నేలమీద పడిపోయాను.ఆవిధంగా రక్తం కక్కాను."అందరికి అర్థం అయ్యేలా చెప్పాడు.

గ్రామస్థులు బిక్కముఖాలు వేసారు."అయితే మనచే హింసింపబడినవారు నిరపరాధులా? మరి ఊళ్లో చనిపోయిన పిల్లలసంగతి? వారు చేతబడి వలనే చనిపోయారు. ముమ్మాటికే వారే పెట్టారు." కొంతమంది వాదించారు. వారికి పలురీతుల్లో సమాధానపరిచాడు రామన్న.

"అయితే వారిని హింసించి పాపాన్ని మూటకట్టుకున్నామా ?ఎంతగా చావచితకతన్నాం.నిజమే ఈ కుర్రవాడు చెప్పినది.మన కళ్లముందు నిరూపించాడు. పాపంచేసాం. ఆ పారిపోయినవారిని వెనక్కుపిలుద్దాం."అని కొందరు ఆలోచించారు.

"ముమ్మాటికి పాపమే చేసారు.నా తల్లితండ్రులు కూడా హింసకే దిగారు. ఆ దేవుడు నాకు ఈ సమస్య పరిష్కారమార్గం చూపకుంటే ఈపాటికి ఆ బాధితుల్ని ఈ పనికిమాలిన భూతవైద్యుడు ప్రాణహాని కల్గించేవాడు. ఓయీ ఇప్పటికైనా నిజం ఒప్పుకొనుము" అని గద్దించాడు రామన్న.

భూతవైద్యుడి వైపు అందరూ కొరకొరచూస్తుంటే ఇక లాభం లేదని తలదించుకుని నిజమే పలికాడు."రామన్న చిన్నవాడైనా చేతులెత్తి దండం పెట్టాలి. ఈతడు దేవుని అనుగ్రహం పొందినవాడు. కనుకనే దయ్యాన్ని

నమ్మడు. చేతబడి ఉందోలేదో నాకు తెలియదు. నా వృత్తి నా తాతలనాటి నుంచి వస్తున్నది. మా ఇంట కర్ణపిశాచి నివాసం ముంటుంది అని తాతలు చెబుతుండేవారు. నేను ఏ పిశాచిని చూడలేదు.కేవలం మాటలతో పది మందిని భయపెట్టడమే నా వృత్తిధర్మం. నాకు తెలిసినంతవరకు ఇంతకు మించి ఏమీ చెప్పలేను.ఇలా అడిగే సందర్భాం నాకు ఎదురుకాలేదు. తొలిసారిగా మీరు అడిగారు. తీరా పరిస్థితి ఇరకాటంలో పెట్టింది కనుక ఒప్పుకున్నాను.వాస్తవానికి నల్లనువ్వులు నల్లకోడి,నల్లమేక, పందిపిల్ల ఇవన్నీ కేవలం మా పబ్బం గడుపుకోవడానికే, వీటితో అసలేం కాదు.రామన్న మన్నించు. నీవు రాకుంటే ఈపాటికి నా పబ్బం గడుపుకోవడానికి ఆ ఇరువురిని నేను వీరిద్వారా అకారణంగా హతమార్చేవాడిని. ఆ పాపం మూట కట్టుకునే వాడిని, నీలాంటి వాడు గ్రామగ్రామాన పుట్టాలి. అప్పుడే మంచి జరుగుతుంది. నేటితో ఇలాంటి పాపపు భూతవైద్యం మరి చేయను."అని చెప్పి అక్కణ్నించి లేచి వెళ్లిపోయాడు.

ఆలయ పూజరులు రామన్నకు చేతులుజోడించారు."నాయనా మాలాంటి వారు చేయాల్సిన పని నీవు చేసావు. మేము నిత్యం దైవసన్నిధిలో బతికేవాళ్లం కానీ, లేని దయ్యాన్ని, పిశాచాన్ని నమ్మి ఇక్కడి జరుగుతున్న అనాచారాన్ని గుడ్డిగా ప్రోత్సహించాం." రామన్న చేతులు పట్టుకున్నారు.

"రామన్న నీవు చిన్నవాడివైనా అందరిని కాదని ఒంటరిగా ఎలా పోరాడి గెలిచావు.నిజంగా నీవు పూజారులన్నట్టు ఎంత గుండెనిబ్బరం గలవాడివి."అని గ్రామంలో వృద్ధులు చేతితో ఆప్యాయంగా తడిమి అభినందించారు.

బిడ్డవైపు ఆశ్చర్యంగా చూసారు బసవయ్య దంపతులు.

మొత్తం గ్రామం రామన్న గురించి గొప్పగా చెప్పుకున్నారు. అతడిలో దైవాంశ ఉందని నమ్మారు.





# ఆముదపు విత్తులు ఆణిముత్యాలు కావు

నెలరోజులు గడిచాయి. రామన్నకు ఊరిలో ప్రముఖులు కొందరు పశువులు కొని బహుమతిగా ఇచ్చారు. వాటిని మేపడానికి రామన్న సమీప కొండలకు, కోనలకు వెళ్లసాగాడు. ఒకరోజు ఎక్కడివారో గురుశిష్యులు ప్రయాణం చేస్తూ ఆ కోనలో బసచేసారు.గురువుగారు ఒక రాతిపలకపై కూర్చున్నారు.చుట్టూ శిష్యులు కూర్చున్నారు. వారిమధ్య దేవుళ్ల గురించి ఇంకా అనేకవిషయాలపై చర్చలు సాగుతున్నాయి.వాటిని ఆసక్తిగా వింటూ రామన్న అల్లంతదూరంలో కూర్చున్నాడు. శిష్యులు చూసి " గురుదేవా చూసారా ఆ పశువులకాపరి మీ నుంచి విజ్ఞానాన్ని ఆశిస్తున్నాడు. అల్లంత దూరంలో కూర్చుని చెవులు రిక్కించి ఇటే వింటున్నాడు. అట్టివానికి ఏమేరకు అబ్బుతుంది."అని నవ్వుతూ అడిగారు.

"విద్య అబ్బుతుందో లేదో కానీ, అతడు మేపడానికి తీసుకువచ్చిన పశువులు ఏపులి నోటికో చిక్కుతాయి. అప్పుడు తెలుస్తుంది ఇలా పొంచి విన్నందువలన ఒనగూరింది అదే."గురువు బదులిచ్చి పగలబడి నవ్వాడు.

రామన్న ఆ మాటలు విని సన్నగా నవ్వాడు."ఆకలిగొన్న పులికి ఆకలితీరాలి అంటే ఏదోఒకటి తినాలి.అది నేను పెంచే ఆవు కావచ్చు. లేకుంటే నేను కావచ్చు.అదంతా దైవలిఖితం ఇందులో మనమేమి మార్చలేం ఎలా రాసుంటే అలా జరుగుతుంది. గురుదేవా!ఇక నేను ఆశించిన విద్య ఇలా వింటే నాకు ఖచ్చితంగా తలకెక్కితే నాలో జీవం ఉన్నంతవరకు దాని వాసనలుంటాయి లేకుంటే లేదు.ఇందులో గురుబోధనతో కూడిన విద్యలు మాత్రం మనలో నిక్షిప్తం అవుతాయి.నాకు విద్య అభ్యసించాలనే ఆశ ఉన్నందున మీరు మీ శిష్యులకు చెప్పినది చాలావరకు నాగుండెల్లో గూడు కట్టినవి.విద్యనేర్వడానికి కావల్సింది తపన,ఆసక్తి ముఖ్యం!" చేతులు జోడించి చెప్పాడు.

గురుశిష్యులకు కోపం వచ్చింది. "ఓరి పశువులకాపరితో చెప్పించుకునే హీనస్థితికి దిగజారిపోతినా? ఎంతకండకావరం పశులక్షణాలను

ప్రదర్శించితివి. ఛీ! నీచవాచాలా, నీకు తగిన బుద్ధిచెప్పిగాని ఈతావు విడిచిపోను. ఆ వెర్రిబాలకున్ని పట్టిబంధించి ఆ చెట్టుకు కట్టివేయండి. ఆ చెట్టుకొమ్మలను వాడిమీదకప్పి అగ్నిరగల్చండి. వాడికి తెలిసిన దైవలిఖితం ఎలారాసుందో అలా జరుగుతుంది. యజ్ఞయాగాదులు చేసినవాడిని, నాకు ఈ హీనుడు ధర్మపన్నాలు చెప్పుటయా?" కోపంతో రెచ్చిపోయాడు గురువు.

శిష్యులు పదిమంది వరకున్నారు. వారు రామన్ననుపెడరెక్కలు విరిచి చెట్టుకు కట్టారు. వెంటనే ఆ చెట్టుకు ఉండే ఎండినకొమ్మలు విరిచి రామన్న చుట్టూ పేర్చారు.కొమ్మల్లోంచి రామన్నను చూసిన గురువు నవ్వుతూ "వీడు అచ్చం యజ్ఞవాటికలో బలి ఇచ్చేందుకు సిద్దంగా ఉన్న బలిపశువుల ఉన్నాడు కదూ!ముఖానికి ఇంత పసుపు పూసి కాల్చేయండి.రేయ్ నిరక్షరకుక్షి నీవు నాకు ఎదురుపడి మాట్లాడుతావా? తగిన శాస్తి అను భవించు" అని గట్టిగా తలవిదిలించాడు. ఆ ఉదుటకు నెత్తిమీద ఉన్న పిలక చెదిరిపోతే దాన్ని సరిచేసుకోసాగాడు.

"గురువుగారు చెప్పినట్టు పసుపు తీసేందుకు మన మూటలు విప్ప నక్కర్లేదు.ఈ చెట్టుమొదల్లో చాలా పసుపు కుంకుమ ఉంది దాన్ని తీసి పూయండి ఒక శిష్యుడు చెప్పనే చెప్పాడు."నిజమేరా, ఇదేదో పూజింపబడ్తున్న చెట్టులా ఉంది. సరైన బలిపుచ్చుకుంటోంది" మరొకడు పగలబడి నవ్వాడు.

రామన్న కన్నులు మూసుకుని "నాకు తెలిసి ఏ నేరం చేయలేదు. ఇంతటి శిక్షను విధించడం మీకు న్యాయమా? శూద్రుడు విద్యను నేర్వ కూడదా? ఒకవేళ నేర్చుకుంటే మరణాన్ని శిక్షగా విధిస్తారా? "

"ఇప్పుడు లెస్సపలికితివి. నీ వంటి అల్పునికి విద్యలేలరా? విద్యనేర్చిన శూద్రుని నాలుక కొయ్యాలి. వేదం పలికేందుకు పెట్టిపుట్టాలి అదీ బ్రాహ్మణ పుట్టుకపుట్టాలిరా! హింసకమృగాలను భక్షించే నీకు హింసకమృగానికి తేడా ఏమిటిరా! కుర్రకుంకవు నిన్ను ఎందుకు శిక్షిస్తున్నామో తెలుసుకున్నంత జ్ఞానం ఉన్నందుకు ఒకింత ఆనందంగా ఉంది. ఇదే తెలివితో మరుజన్మలో బ్రాహ్మణుడవై పుట్టు. విద్యలు అభ్యసించు. అందుకు మాకు ఎలాంటి





అభ్యంతరంలేదు." గురువు కోపంతో రామన్న ముఖంపై మెరిసిపడ్తున్న పసుపుపూతపై కుంకుమ చల్లాడు. దాంతో రామన్న ముఖం మెరిసిపడింది.

సరిగ్గా అప్పుడే వచ్చారు జాతపుతెగ అటవికజాతివారు. చెట్టుకు కట్టి ఉన్న బాలుడు రామన్నను చూసి నివ్వెరపోయారు. పదిమంది గురు శిష్యులను గట్టిగా ఒడిసిపట్టుకున్నారు. మా తల్లి చెట్టును కొమ్మలు విరిచి గాయపరుస్తారా? ఎంత సాహసానికి ఒడిగట్టారు. మిమ్మల్ని ప్రాణాలతో విడువము."అని బల్లాలతో చుట్టూ చేరి వారిని నేలమీదపడదోసి కదలకుండా చేసారు. మరికొందరు వెంటనే చెట్టు కొమ్మలు విరిచిన చోటుల్లో గాయాలు గా గుర్తించి తేనెపూసి మన్నుముద్దలతో కప్పారు. క్షణంక్షణం ఆ అటవికులు కోపంతో ఊగిపోసాగారు.

"ఆ బాలున్ని కూడా విప్పి తీసుకురండి మన నెలవులో వీరిని కాల భైరవునికి బలిచేసిగాని నిద్రపోవద్దు. ఎంత కండకావరం కాకుంటే మనల్ని కాపాడే అడవి తల్లిని గాయపరుస్తారా ఒక్క లిప్త ఆలస్యం అయితే చెట్టుతల్లిని తగలబెట్టేందుకు సిద్ధపడ్డారు.ఈ అయ్యోర్లను ఒక్కర్ని వదలొద్దు." వారి నాయకుడు ఆదేశించి అందరిని అక్కణ్నించి తీసుకుపోయాడు.

అడవిలో ఒకచోట వారి స్థావరం వందలాది గుడిశెలున్నాయి. ఆ మధ్య పెద్ద కాలభైరవ విగ్రహం ఉంది.ఎర్రని రంగులో నెత్తురుగడ్డలా ఉంది. అక్కడ గురుశిష్యుల చేతులు వెనక్కు విరిచి కట్టేసి నిలబెట్టారు. వారుచేసిన మహాపరాధం గుడిశెలలో ఉన్న వారంతా విని తోకతొక్కిన త్రాచులైయ్యారు. ఆడవారే కత్తులతో దాడిచేసినంతపని చేసారు. కారణం పూజించే చెట్టును తగలేయడానికి యత్నించినందున ఒకవేళ అదే జరిగితే, తమ పిల్లలు తమకు దక్కేవారు కాదు అనేది ఆ ఆడువారి నమ్మకం. (ఇప్పటికి శ్రీకాకుళం,ఒరిస్సా కొండప్రాంతంలో ఉండే జాతాపుతెగలో వారు పూజించే చెట్టుకు ఎవరైన చిన్నకొమ్మ నరికినా భరించలేరు. చెట్టుతల్లి గాయపడితే తమపిల్లలకు మంచిజరుగదు. ఇంకా అనేక రకాలుగా కీడు తాము అనుభవించకతప్పదు అని ఇప్పటికి నమ్ముతారు. ఇలాంటి ప్రగాఢ మూఢనమ్మకాలతో వారు ఉన్నారు.) నాయకుడు చొరవతో అక్కడ అంతా

మహిళలను పక్కకు తీసుకు పోయారు. కొందరు చెట్టుతల్లికి పసుపు ముద్దలతో కొమ్మలకు పూసేందుకు పరుగులు తీసారు. మొత్తం గూడలన్నీ కోలాహలంగా మారిపోయాయి.

ఎటుచూసినా భీభత్సంగా ఉంది. గురుశిష్యులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఆ అడవి మనుష్యులవైపు చూడసాగారు. నాయకుడు సైగతో భేరీ మ్రోగింది. గురుశిష్యులపై విచారణ ప్రారంభం అయ్యింది.

"ఓ అయ్యోర్లు (గురువు) నీవు మేము పూజించే చెట్టును ఎందుకు నరికి తగలబెట్టాలని చూసావు ఇది మొదటి పాతకం. అలాగే, ఆ బాలున్ని ఎందుకు మంటలకు ఆహుతి చేయాలనుకున్నావు ఇది రెండో పాతకం. నిన్ను మా కాలభైరవునికి బలిచేయాలనుకుంటున్నాం. నీతో బాటు నీ శిష్యులను కూడా వదలకూడదనుకుంటున్నాం. అయితే మీరు అయ్యోర్లు కనుక మేముగా చంపలేం. ఈ బాలకుణ్ని అందుకు నియోగిస్తాం. ఓ బాలకా, ఈపాటికి మంటలో మాడిపోయే వాడివి. మా వలన బతికావు. ఈ అయ్యోర్లను నీవు చంపాలి. నిన్ను చంపాలనుకున్నారు కనుక నీవు వీరిని చంపితే నిన్ను వదిలేస్తాం. నువ్వు కత్తితో నరకనవసరం లేదు. బాలుడవు నీచే అంత హింస చేయించలేం. వీరిని విరిచి కట్టేస్తాం. లోయ అంచులో నిలబెడాతాం. నీ చేతితో వారిని లోయలోకి నెట్టేయ్యడమే. లేకుంటే నిన్ను ప్రాణాలతో వదలము." చెప్పాడు నాయకుడు. అంతా ఆ తీర్పుకు డప్పులు మ్రోగించారు. ఉత్సాహంగా కొందరు నర్తించారు.

గురుశిష్యులు భయభ్రాంతులై చూసారు. తప్పకుండా ఆ బాలుడు చంపడానికి సిద్ధపడతాడు. వాడు ఏమాత్రం జాలిచూపడు అని చెప్పు కున్నారు. బాలుడు రామన్న చేతులు జోడించి "అయ్యా నాయకా, మీరెందుకు వీరిని చంపడానికి వెనుకాడుతున్నారు? అయ్యోర్లు అని కదా! మరి నేను మాత్రం చంపగలనా? నాకు మీ వలే పాపభీతి ఉండదా ?" అని ప్రశ్నించాడు.

"ఓ బాలకుడా నిన్ను చంపాలనుకున్నారు కనుక నీవు నీ ప్రాణాన్ని రక్షించుకునేందుకు ఏ అవకాశం లభించినా తప్పించుకుంటావు. ఎంతటి వాడికైనా ప్రాణాలు తీపికదా, మరి నీవెందుకు వీరిని తుదముట్టించడానికి వెనుకాడుచున్నావు." నాయకుడు ప్రశ్నించాడు.





ఆ బాలకుడుతో మాటలెందుకు మాకు అప్పగించి పదిమందిని చంపి పాతరేస్తాం. మన గూడెంకు ఎంత అపకారం తలపెట్టారు. వీరిని వదల రాదు. ఈ బాలకుడు పశువుల కాపరి హింసకుడు కాదు. వెర్రిబాగోలోడు మమ్మల్ని వదిలితే మేము పాపభీతికి వెరువం" అని గూడెం వాసులు కొందరు బల్లాలు ఎత్తారు. అక్కడ పరిస్థితి ఉద్రిక్తతగా మారిపోయింది.

రామన్న వారికి నమస్కరించి"అయ్యాశాంతం వహించండి. ముల్లును ముల్లుతో తీయాలి. అలాగే నన్ను చంపాలనుకున్నవారిని నేను చంపితే నన్ను ఖిడిచిపెడతాం అని చెప్తున్నారు. అది మీరిచ్చిన ఓ మంచి అవకాశం, దాన్ని జారవిడుచుకోడు నాలాంటి ప్రాణాలు కోల్పోయే వాడు. కానీ, నేనెందుకు కాదంటున్నాను ఒక్కసారి ఆలోచించండి. మీరు పూజించే చెట్టు తల్లిని వీరు తెలియక గాయపరిచినందున మీరు వీరిని చంపేవరకు వెళ్లారు. మీ సాంప్రదాయం మీది కనుక మీరు వీరిని చంపాలని నిర్ణయానికి వచ్చారు. మీ వరకు మీరు న్యాయం చేస్తున్నారని అనుకుంటున్నారు. వీరు వేదబ్రాహ్మలు నా వంటి శూద్రుడు నీతులు, ధర్మబోధనలు చేయడం వారికి ఏమాత్రం నచ్చనందున నాపై మీ వలే మరణశిక్షను అమలు చేయాలను కున్నారు. ఇందులో వారు చేస్తుంది వారికి న్యాయంగా తోచింది. నాకు మీకు ఎలాంటి సాధింపులు లేవు. అయినా మీరు నాకు పదిమంది ప్రాణాలు హరించేపని తప్పదని శాసిస్తున్నారు. ఇలా రెండుచోట్ల నేను శిక్షకు గురయ్యాను. నా మనస్సులో ఏమున్నది చెప్తాను."అని రామన్న అందరి మధ్య పెద్దగా గొంతుపెంచి చెప్పాడు.

ఆ మాటలు విన్నవారంతా ఏదో మంత్రముగ్ధులైనట్టుగా విన్నారు.

నాయకుడు తలపంకించాడు. చూస్తుండగా అక్కడ పొడుస్తాం నరుకుతాం అనే మాటలు,ఆవేశాలు అదృశ్యం అయిపోయి నిశ్శబ్దం చోటు చేసుకుంది. అందరి కళ్లు రామన్న వైపే ఉన్నాయి. వారి చెవులు రామన్న మాటలపైనే గురిగా ఉన్నాయి.

రామన్న గొంతు మరల విప్పాడు. గురుశిష్యులు అయోమయంగా చూసారు. ఇదేమిటి చంపేయాలనుకున్న మాపై ఈ బాలకుడు ఇంతకరుణ చూపుతున్నాడు అని కన్నులు వెంట నీళ్లు తిప్పుకున్నారు.

"ఓ వన్యమానవులారా, దయచేసి నాయీ అభ్యర్ధనను శాంతం వినండి. ఇక్కడ నాగరికులైన మాకంటే మీరు చాలా గొప్పమనస్సుతో ఉన్నారు. మీకు కొన్ని నియమ నిబంధనలున్నాయి. వాటిని తూ.చ. తప్ప కుండా పాటిస్తున్నారు. ఎంతటి వాడైనా మీరు పూజించే చెట్టుతల్లిని ఏచిన్న హాని తలపెట్టినా కాలభైరవునికి బలి ఇస్తారు. ఇక్కడ అలా హాని తలపెట్టిన వారు నాగరికులలో గొప్పవారు భూలోకదేవతలు వంటి బ్రాహ్మలు. అట్టివారిని చంపడానికి మీరు పాపభీతితో భయపడ్తున్నారు. అంటే మీరు అన్ని వైపులా ఆలోచిస్తున్నారు. మీరు మాకంటే గొప్పవారు. కాలభైరవునికి బలి ఆశపెట్టికూడా మీరు బ్రాహ్మణహత్యాపాతకానికి భయపడి పాపభీతితో ఆ పని చేయలేక పోయారు. లోయలోకి నెట్టి చంపాలనుకున్నారు. మీరు పూజించే చెట్టుతల్లి కూడా కొమ్మలు నరికిన మరుక్షణం వీరిని నాశనం చేయగలదు. కానీ, ఆమె ఓర్పుతో భరించింది. ఇక ఈ నాగరికులు అయిన బ్రాహ్మలు చేసిన నిర్వాకం చాలఘోరం. దివి నుంచి దిగిన దేవతలు వంటివారు. వీరు చేసే యజ్ఞయాగాదులు,లోక కళ్యాణం కోసమే. వీరితో మాట్లాడితే చాలు ఎంతటిపామరుడైనా విజ్ఞానవికాసానికి లోనవుతాడు. ఎక్కడైనా గురుపీఠాలు వీరి ఆధ్వర్యంలో నడుస్తాయి. వీరు చేయు యజ్ఞవాటి కల్లో కొన్ని సందర్భాలలో మూగజీవులు బలి చేయడం ఆచారంగా ఉంది. దాన్ని అక్కడితో సరిపెట్టుకోవల్సింది కానీ,అహంకారులై నా వంటి బాలుడు వీరితో మాట్లాడినందున కినిసి శూద్రుడు తర్కంలో మాట్లాడతాడా, ధర్మపన్నాలు వల్లిస్తాడా? ఇప్పుడు వదిలేస్తే రేపు వేదం వరకు వెళ్లిపోగలడు అని కర్కశంగా యజ్ఞ పశువుని చేసి చెట్టుకొమ్మలతో కాల్చిచంపాలను కున్నారు. వీరికి పాపభీతిలేదు. దేవున్ని తొలివరుసలో ఉండి పూజించే అవకాశం కలిగిన వీరు ఇలా దేవుని యందు భక్తి, భయం చూపకుండా పామరులవలే ప్రవర్తించారు. వీరికి మనందరం వివిధ రూపాలలో కొలిచే ఆ దేవుడే తగువిధంగా శిక్షించగలడు. వీరిని శిక్షించడం మనకి పాడికాదు. కనుక నా యందు దయఉంచి వీరిని విడిచి పెట్టండి"అని అందరికి అర్ధం అయ్యేలా కోరాడు.





మరింత నిశ్శబ్దం అయిపోయింది. బాలకుని మాటలు అందరికి నచ్చాయి. నాయకుడు తలపంకించి "ఇంత చిన్నవాడివి ఎలా చెప్పగలి గావు? నీ మాటలు చాలా బావున్నాయి. నిన్ను కాల్చితగలెట్టేవారిని దయతో విడిచి పెట్టమంటున్నావు. నీవు నిజంగా భూలోకదేవుడవే "అని ఆసనం నుంచి దిగివచ్చి రామన్నను ఎత్తుకున్నాడు. గూడెం వాసులందరూ పెద్దగా అరిచి తమ ఆనందాన్ని వ్యక్తం చేసారు.

"ఓ అయ్యోర్లు, ఇట్టివానిని చంపడానికి మీ మనస్సులెలా వచ్చాయి. మీరు చావును కోరితే ఈ చిట్టి బుడుతడు మీ ప్రాణాలు కాపాడేందుకు ఎంతచక్కగా మా అందరిని ఆకట్టుకునేలా చెప్పాడు. కనుక మిమ్మల్ని ప్రాణాలతో వదిలేస్తున్నాను. పొండి మా ప్రాంతంలో ఉండబోకండి. కన్పించవద్దు." అని వారిని బంధవిముక్తులను చేసాడు.

గురుశిష్యులు రామన్నను సమీపించి "నాయనా మన్నించు చిన్న వాడివైనా ఎంతటి న్యాయాన్ని పండితపామరులకు అర్ధంఅయ్యేలా ప్రదర్శిం చావు. ప్రాణాలు తీసేవాడిని రక్షించే పెద్దమనస్సును మా ముందు నిలువెత్తు నిలిపావు. నా వంటి పండితులు పామరులకంటే హీనంగా ప్రవర్తిస్తుంటే, నీవు న్యాయపరిరక్షకుడిగా నీకున్న పరిజ్ఞానంతో మాఅందరిప్రాణాలు దక్కేలా చేసావు. ప్రాణదాతవు, నీకు జన్మజన్మలకు ఋణపడి ఉంటాం. నీవు నేటి నుంచి ఈనేలమీద మానవుడు మసలేచోటుల్లో వెల్లువెత్తిన అన్యాయాలను నీవే పరిరక్షించాలి. ఇదే నాయన నా కోరిక. నావద్ద మనుధర్మశాస్త్రం తాళపత్ర గ్రంథం ఉంది. అది నా వంటి అహంకారివద్ద రాణించదు. నీకు సమర్పిస్తు న్నాను."అని తన సంచిలోవున్న ఆ గ్రంథం తీసి ఇచ్చాడు.

తాళపత్ర గ్రంథం అటుఇటు తిప్పి కన్నులకు అద్దుకుని"గురుదేవా! అక్షరజ్ఞానంలేనివాడిని ఈగ్రంథం నేనేవిధంగా నేర్వగలను. దీనిని పరిరక్షించ గలను తప్పితే, అభ్యసించలేను."అని వినమ్రుడై చెప్పాడు.

"నాయనా నీవు కారణజన్ముడవు. నీకు విద్య వస్తుంది. నీ వంటి సద్గుణ శీలికి విద్యకొరత ఉండదు. ఈ గ్రంథం నీవద్ద ఉంటేనే రాణిస్తుంది. నీవన్నావే పరిరక్షించగలను అని నీ నోట ఆ దేవుడే పలికించాడు."

అటవికులు నిశ్చేష్టులై చూసారు.వారి పూర్వీకుల నుంచి ఉన్న కొన్ని తాళపత్రగ్రంథాలను తెచ్చి రామన్నకు ఇచ్చారు."ఓ బుడుతా ఇవి మావద్ద మా పూర్వీకుల నుంచి ఉన్నాయి. వారివద్దకు ఎలా వచ్చాయంటే, అడవిలో పులివాతనపడిన బాటసారుల సంచిల్లో దొరికినవి.అవి దేవుడికి సంబంధించినవి అని మావద్ద జాగ్రత్తచేసి ఉంచినాము. మాకు చదువుకునే యోగ్యతలేదు. ఇవి పురుగులు తినకుండా రక్షించగలిగాం. నీకు ఎలాగూ ఈ అయ్యోర్లు చెప్పారు విద్య వచ్చేస్తుంది అని అందుకే నీకు మేము ఇస్తున్నాం." అని చేతిలోపెట్టారు.

ఆ మాటలకు గురుశిష్యులు నవ్వారు. వారే ఆ గ్రంథాలను పరికించి చూసారు. నాలుగు తాళపత్రగ్రంథాలు అవి పైశాచికభాషలో గుణాఢ్యునిచే రాయబడిన బృహత్కథలో కొంత నకలు భాగాలు. (వేరే ఎవ్వరో రాసినవి. కొన్ని వందలమంది కవులు రాసేవారు కానీ, చాలామంది రాజులు, జమీందార్లు సంస్థానాధీశుల ఆదరణకు నోచుకోకుండా వారి రచనలు వెలుగులోకి రాకుండా వారి ఇళ్లలో పూజాపీఠాలలో మిగుల్చుకున్నారు.అలాంటి తాళపత్ర గ్రంథాలు కొన్నివేలు కాలగర్భంలో కలిసిపోయాయి.) రామన్న వాటిని తన మెడలో ఉన్న గుడ్డలో చుట్టాడు.అంతా కలిసి ఆ గూడెం వదిలి బయల్దేరారు. గురుశిష్యులు అడవిమార్గంలో పడి వెళ్లిపోయారు.

రామన్న పశువులను వదిలి ఎటువెళ్లిపోయాడని తల్లితండ్రులు భయంతో అక్కడ పరిసరాలు వెదుకసాగారు. ఎదురువచ్చిన రామన్నను చూసి ఎటుపోయావు? అసలే హింసకమృగాలు తిరుగాడే చోటు. నాయనా ఇకనుంచి ఇటుగా పశువులను తీసుకురావద్దు. నచ్చజెప్పి ఇంటికి తీసుకుపోయారు.దారిలో జరిగినదంతా చెప్పాడు. దాంతో బసవయ్యదంపతులు భయంతో గజగజ లాడిపోయారు."వారు జాతాపుతెగలో మాలేసవరులు. నాయనా వారు నరమాంసాన్ని తింటారని విన్నాం." అని కొడుకుని గుండెలకు హత్తుకున్నారు.(మాలేసవరులు గురించిన కథలు ఇప్పటికి ఆ ప్రాంతంలో పూర్వీకుల నుంచి వినపడ్తుంటాయి. వాస్తవానికి వారు నరమాంసభక్షణ అనేది చేయరు. వారు తినేది పశువులను మాత్రమే. కాపరుల





నుంచి గేదెలు,ఆవులను ఎత్తుకుపోయి భక్షించేవారు. వారిలో హెచ్చు అనాగరికత కన్పిస్తుంది. వారు కొండదేవతలకు మనుష్యులను బలి ఇచ్చేవారు. కనుక వారు నరమాంసభక్షణ చేస్తారని వదంతులు ఉండేవి. గిరిజనులు కూడా సభ్య ప్రపంచంలోకి రావడంతో ఆ వదంతులకు కాలం చెల్లిపోయింది) రామన్న తల్లితండ్రులకు నచ్చజెప్పి "ఇలాంటివి మానవ సహజం. ఏక్షణం ఏమవుతుందో ఎవరికి తెలుసు? మనం నిమిత్తమాత్రులం.ఏదీ మనకు చెప్పి ఎదురుకాదు. కనుక ఎలాంటి కష్టముల పాలయినా కృంగిపోయేది ఎంత అందలం ఎక్కినా పొంగిపోయేది ఉండరాదు. ఏదైన మన మంచికే అనేది మనలో గూడుకట్టుకుని ఉంటే చాలు." అని పెద్దవేదాంతిలా చెప్పాడు.

తల్లితండ్రులు బిక్కముఖాలు వేసారు."నాయనా ఇన్ని మాటలు ఇంత కాలం నీలో ఎక్కడ నిక్షిప్తం అయి ఉన్నాయి.చాలా ఆశ్చర్యంగా ఉంది." అని తండ్రి కొడుకును గుండెలకేసి అదుముకున్నాడు. ఊళ్లో జాతాపుతెగ అటవికులు తీసుకుపోయారని రామన్న సమయస్ఫూర్తితో బయటికి వచ్చాడని తెలుసుకున్న గ్రామస్థులు తండోపతండాలుగా వచ్చి రామన్నను పరామర్శించారు. అంతాకలిసి ఒక నిర్ణయానికి వచ్చారు. ఇంత తెలివైన వాడు నిరక్షరాస్యుడుగా ఉండరాదు.ఏ గురుకులానికిపోయి విద్య అభ్యసించాల్సిందే ఇందుకు మనమంత తగు సహాయం చేద్దామనుకున్నారు.

శూద్రులకు విద్య ఎవరు చెప్పగలరు? గురుకులంలో గురుబ్రహ్మలు చెప్పడానికి నిరాకరిస్తారు. మరి ఎలా?అని ఆలోచనలో పడ్డారు.చివరికి బ్రాహ్మణులచే వెలివేయబడిన గురుకులం మహేంద్రగిరిలో ఉంది. అక్కడ అన్నిజాతులవారికి విద్య చెప్పే గుణనందుడు అనే బ్రాహ్మణగురువు వద్దకు పంపుదాం. అతడు కుష్టువ్యాధి పీడితుడు. ఆ రోగం రావడానికి కారణం. వేదాన్ని శూద్రులకు నేర్పినందునే అని వేదబ్రాహ్మలు వెలివేసారు.ఏది ఏమయినా అట్టి గురువువద్ద శుశ్రూష చేసినచో మన రామన్న మరింత కడిగినముత్యం కాగలడు." ప్రయాణానికి సిద్ధంకమ్మని చెప్పి వెళ్లి పోయారు.

తల్లితండ్రులు రామన్నను గురుకులానికి పంపడానికి ఇష్టంగా లేరు. ఇప్పుడిప్పుడే మతిమాంద్యం వదిలి మాతో ఉన్నాడు.వీడికి ఎందుకు ఆ విద్య. ఈ ఊరిప్రజలకు రామన్న మీద ప్రేమకాదు.ఊరికి రామన్న వలన పేరువస్తుంది అని వారి ఆశ. ఈ రాత్రి గ్రామం అంతా సద్దుమనిగాక ఎక్కడికైనా వెళ్లిపోదాం.మరి ఈ ఊళ్లో ఉండవద్దు అని బసవయ్య దంపతులు నిర్ణయించుకున్నారు.

అర్థరాత్రి ఊరంతా నిద్రపోతున్న వేళ. బసవయ్యదంపతులు లేచారు. బిడ్డను లేపాలనుకున్నారు.పడకమీద లేడు.ఇంట్లో వెతికారు ఎక్కడా కన్పించ లేదు.భయంగా చీకటిలో వెతుకసాగారు.అప్పటికే ఊరి అవతల ఉన్న పోలేరమ్మ గుడికి వెళ్లి వస్తూ కన్పించాడు రామన్న. స్నానం చేసి కొత్తబట్టలు ధరించి నుదుట అమ్మవారి కుంకుమను దిద్దుకుని ఉన్నాడు.

"నేను గుణనందుని వద్ద విద్యనేర్చుకోవడానికి వెళుతున్నాను.నన్ను ఆశీర్వదించండి" అని తల్లితండ్రుల పాదాలను మ్రొక్కాడు.

బసవయ్యదంపతులు నివ్వెరపోయారు."నాయనా మనకెందుకు చదువులు? ఊళ్లు ఏలలేం? పశువుల కాపరులుగానే బతుకు ఈడ్వాల్సిందే మమ్మల్ని విడిచిపోకురా! నిన్ను అంతటివాడు ఇంతటివాడు అని పొగిడి ఆఖరికి గురుకులం వెళ్లేవరకు తీసుకువచ్చారు.తెల్లవారేలోగా మనం మరో గ్రామం పోదాం. మన పశువులను తోలుకుపోదాం."అని కొడుకును లేవనెత్తి చెప్పాడు బసవయ్య. తల్లికూడా పలువిధాలుగా చెప్పింది.

"మన్నించండి నేను విద్యలు నేర్చుకుని మీవద్దనే ఉంటాను. నన్ను అడ్డుకుని విద్యలేని వింతపశువును చేయకండి." అని చెప్పి ఇంట్లో తనతో తీసుకు వెళ్లాల్సిన వస్తువులు సిద్ధం చేసుకోసాగాడు.తూర్పు తెల్లవారి పోసాగింది.గ్రామస్థులు కొందరు వచ్చారు.రామన్నతో బాటు మరి ఐదుగురు బాలురను గురుకులానికి పంపేందుకు సిద్ధంచేసారు.బసవయ్య మానసికంగా బాధపడ్తునే అంగీకరించి తాను బయలుదేరాడు.





# గురుకులంలో రామన్న

మహేంద్రగిరి కొండల్లోంచి సాగిపోయారు. దుర్గమారణ్యం అడుగడుగునా క్రూరమృగాల గర్జనలు ఏనుగులు ఘీంకారాలు విన్పిస్తునే ఉన్నాయి.బసవయ్య భయపడ్తూనే తోటి గ్రామస్తులను అడిగాడు."ఇంతటి కీకారణ్యం నేను ఎక్కడాచూడలేదు. ఇలా ఉంది ఏమిటి? బిడ్డలు ఇంటికి రావాలంటే ఎలా? ప్రతిసారి మనం వచ్చి తీసుకుపోవాలా ?"

"అదే మాకు మనస్సులో వేధిస్తోంది.ఇదేదో కాకులదూరని కారడివిలా ఉంది. ఏదిఏమయినా ఇంతదూరం వచ్చాం కనుక గుణనందులవారిని కలుసుకుని ఏంచేయాలో నిర్ణయిద్దాం." అని అనుకున్నారు.

సాయింత్రానికి చేరుకున్నారు. గురుకులం ప్రశాంతమైన వాతావరణంలో ఉంది.అక్కడ విద్యనేర్చుకునే పిల్లలు సొమ్ములు(పశువులు) కాసుకునేవారిలా ఉన్నారు. ఎవరికి సరైన దుస్తులు లేవు. వారు కత్తియుద్ధాలు నేర్చుకుంటున్నారు. తప్పితే వేదం, తర్కం, వివిధశాస్త్ర పరిజ్ఞానం నేర్చుకున్నట్టుగా లేరు. ఆ తరహ విద్యార్థులు లేనేలేరని చూస్తే తెలుస్తోంది.

గురువు ఏవో వనమూలికలు ఏరుకుని రావడానికి వెళ్లినట్లు తెలిసి అంతా ఆశ్రమం ఆవరణలో కూర్చున్నారు.ఒక పక్కచలి,మరోపక్క బడలికగా ఉన్నందున అంతాకలిసి చిదుగులు పేర్చి రగిల్చారు.చలిమంట కాగుతున్నారు. రామన్న మాత్రం చలికి వణుకుతూనే చెట్టుకింద నిలబడున్నాడు.అప్పుడు వచ్చాడు గుణానందుడు. అరవైఏళ్లవయస్సులో పొడుగ్గా బక్కగా గుబురు గడ్డాలతో కుంటుకుంటూ నడిచివచ్చాడు. అంతా చలికాగుతుంటే దూరంగా నిలబడున్న బాలున్ని చూసి దగ్గరగా వెళ్లాడు."ఎవరు నాయనా నీవు?చలి వణికిస్తుంటే అక్కడ వాళ్లు చలికాగుతున్నారు, మరినీవెందుకు ఇక్కడ వణుకుతున్నావు.చాలా చిత్రంగా ఉందే! "

"గురుదేవా నేను విద్య అభ్యసించడానికి వచ్చినవాడను. గురువాజ్ఞ లేనిదే ఇక్కడ నేను ఊపిరి కూడా పీల్చడానికి లేదుకదా! అందుకే ఆ చలిమంటవద్దకు పోలేకపోతిని" అని చెప్పాడు రామన్న.



గురుకులంలో కుష్టువ్యాధి పీడితుడైన గురువు పాదాలకు రామన్న మొక్కుట



గుణనందుడు చిత్రంగా చూసాడు. "నాయనా ఇంత చిన్నవయస్సులో ఎంతటి పరిజ్ఞానాన్ని ప్రదర్శించావు. రమ్ము అని చేతిని చాచాడు, ఆచేతికి ఒకవేలు మాత్రమే ఉంది. భయంకరమైన కుష్టువ్యాధి వలననాలుగు వేళ్ళు రాలిపోయినవి.(వాస్తవానికి రాలిపోవు. నిద్రపోతున్నప్పుడు ఎలుకలు తినేస్తాయి. అవి తింటున్నప్పుడు ఆ వ్యాధిగ్రస్తులకు నొప్పి తెలియదు. ఆరోజుల్లో ఆ వ్యాధి అంటే చాలు జనవాసాల్లో ఉండనిచ్చేవారు కాదు. వెంటపడి కొట్టేవారు. వీలుంటే చంపేసేవారు. అందుకే ఆ వ్యాధిగ్రస్తులు కొండల్లో అడవుల్లో తలదాచుకునే వారు. ఆ రోజుల్లో ఆ వ్యాధికి చికిత్సలేదు. భయంకరమైన పాపాలు చేసినవారికి ఆ జబ్బువస్తుందనే నమ్మకంతో ఉండేవారు. ఆ వ్యాధివారిని నాగుపాము కరిస్తే నయం అవుతుంది, కానీ, ఆ పాము ఎట్టిపరిస్థితిల్లో కాటేయదు అని చెప్పుకునేవారు వాస్తవానికి పాముకాటుకు ఆ వ్యాధికి సంబంధం లేదు. ఒకవేళ కరిస్తే అందరిలా ఆ రోగికూడా చావక తప్పదు.అలాగే పెరుగు అన్నంతో చేపలు తిన్నా ఈ వ్యాధి వస్తుందని గుడ్డిగా నమ్మేవారు.) ఆ చేతిని కన్నులకు అద్దుకున్నాడు రామన్న."గురుదేవా మీ శుశ్రూషణలో నేను తరించాలి అని ఆశిస్తున్నాను. నన్ను మనసావాచా దీవించండి."

అప్పటికి అంతా గురువును చుట్టుముట్టి తాము ఎక్కడ్నించి వచ్చింది చెప్పారు. ఐదుగురు బాలురకు విద్య నేర్పడానికి అంగీకరించాడు. ఆ రాత్రి గుణనందుడు అందరికి భోజనాలు ఏర్పాటు చేయించాడు.అంతా తిన్నాక బసవయ్య కొడుకును తన పక్కలోవేసుకుని నిద్రపోయాడు. అర్ధరాత్రివేళ బసవయ్య కొడుకును లేపి ఆశ్రమం అరుగుమీదకు తీసుకుపోయి పండు వెన్నెలలో లోగొంతుతో మాట్లాడాడు. "నాయనా ఈసదువులు మనకొద్దు. నా మాటవిను. పోనీ, సదివించాక నీవు ఊళ్లు ఏలవు.మళ్లీ పశువులే మేపుకుని బతకాలి.ఇక్కడ నిన్ను వదిలిపోవాలంటే భయంగా ఉంది. ఒక్కగానొక్క నలుసువి. ఆ గురువు ఎంతటి పాపం సేయకపోతే అంత భయంకరమైన కుష్టుతో వేలు పోయి మొండిచేతితో ఉన్నాడు. నువ్వు ఏకంగా అతడికి శుశ్రూష సేస్తానంటున్నావు. ఆ వ్యాధి

నీకు వచ్చేయగలదు. నీవు బతకాల్సిందే చాలా కాలం ఉంది. నీ సూదిముక్కు చప్పిడికావడం,చేతివేళ్లు, కాలివేళ్లు లేకుండా నిన్ను చూడలేనురా పదాపోదాం. నాకు చాలా భయంగా ఉంది. నిన్ను విడిచి వెళ్లలేను. ఇక్కడి విద్యలు మాటెలా ఉన్నా నీకు ఆ వ్యాధి రావడం ఖాయమురా"

రామన్న తండ్రిని ఆశ్చర్యంగా చూసాడు."కొడుకుమీద నీప్రేమ చాలా ఎక్కువగా ఉంది. పుత్రవాత్సల్యంతో నీవు ఏమేమో ఊహించు కుంటున్నావు. ఆ గురువుకు వచ్చిన వ్యాధి పాపం వలన రాలేదు. కర్మం వలన వచ్చింది. ఆయన కావాలనుకుంటే దానినుంచి లిప్తలో బయటపడగలడు. అంతటి శక్తి సంపన్నుడు. జ్ఞానులు ఎప్పుడు భౌతిక సుఖాలను ఆశించరు.ఆయనవద్ద నాకు అంటుకునేది వ్యాధి కాదు విద్యాగంధం.నన్నిక్కడ విడిచి ఎలాంటి ఆలోచన చేయకుండా వెళ్లిరండి"

"రామన్న నా మాటవినరా! నీతో ఇక్కడ సదువుకోవాలని వచ్చిన మిగిలిన బాలురు గురువు చేతులు చూసి భయపడ్తున్నారు. ఏదో వ్యాధి ఉంది అదీ అంతగా కన్పించదు అనుకుని వచ్చారు. తీరా, వచ్చాక మొండి చేతిని చూసి రేపే తిరుగుప్రయాణానికి సిద్ధపడ్తున్నారు. ఉంటే నీవొక్కడవే ఇక్కడ ఉండాలి.నేను ఉండనీయను." మరింత లోగొంతుతో చెప్పాడు.

"తండ్రీ, నీకు నామీద గలప్రేమ, నీ విధానం వలన నా భవిష్యత్ భంగ పడ్తుంది. నేను విద్యావంతుడనైతే కదా,భవిషత్‌లో మంచి మార్గం నాకు దొరుకుతుంది. కనుక నీవు మమతలు ఎక్కువగా పెంచుకోరాదు అశాశ్వతమైన బాంధవ్యాలను మరింతగా పెనవేసుకోరాదు." అని చెప్పి తండ్రిని శాంతింపచేసాడు.

ఆ పక్కనే నిద్రపట్టక పులిచర్మంపై నడుంవాల్చిన తండ్రీకొడుకుల సంభాషణ విని గుణనందుడు అంతులేని ఆశ్చర్యానికి లోనయ్యాడు.

ఉదయాన్నే బాలురు తిరిగి వెళ్లిపోవడానికి సిద్ధపడ్డారు. దానికి కారణం ఒకటి చూపించారు.'ఈ అడవులు భయంకరంగా ఉన్నాయి.ఇక్కడ పిల్లలకు అంతక్షేమం కాదు.మరికొంత పెద్దవారయ్యాక తీసుకుపస్తాం. సెలవు ఇప్పించండి' అని చెప్పారు. రామన్న మాత్రం చేతులు కట్టుకుని





నిలబడ్డాడు. ఆ పక్కనే బసవయ్య కళ్లలో నీళ్లు తిప్పుకునిఉన్నాడు.కొడుకును తదేకంగా చూస్తున్నాడు.

గుణనందుడు నవ్వి "నాయనలారా ఎంతో ఉత్సాహపడి వచ్చారు. మీరు చెప్పిన కారణం సరికాదు. నా వ్యాధి మిమ్మల్ని ఇబ్బంది కల్గించదు. అయినను మీరు దాన్ని చూసి భయపడ్తున్నారు. ఇలాంటి భయాలవలన మీకు నా నుంచి విద్య ఏవిధంగా అబ్బదు. మీరు తిరిగి వెళ్లిపోండి. రామన్న నీవు నా యందు శ్రద్ధగా ఉన్నావు. కానీ, నీ తండ్రి నీమీద చాలా ఆశలు పెట్టుకున్నాడు. నీవును వెళ్లిపో! నా వద్దకు వచ్చినవారంతా యుద్ధవిద్యలు నేర్చుకున్నవారే తప్ప శాస్త్రం నేర్చుకునేందుకు రావడంలేదు. దీనికి కారణం ఉంది. కూటికిగతిలేనివారు తమ పిల్లలను రాజులకొలువుల్లో సైనికులుగా చేద్దామని అందుకు తగిన యుద్ధవిద్యలు నేర్చుకుంటారని ఆశతో నావద్దకు పంపుతున్నారు.నా రోగం వారిని భయపెట్టడం లేదు.వారు పెరిగింది రోగాలు, రొష్టులమధ్యనే కదా, మీ వంటివారు అంతో ఇంతో ఉన్నవారు శాస్త్రం తెలుసుకుందామని వచ్చి నారోగం చూసి అదెక్కడ సోకిపోతుందని భయపడి పారిపోతున్నారు. శాస్త్రం శూద్రులకు నేర్పుతున్నాడు అందుకే కుష్టు సంక్రమించిందని నా బ్రాహ్మణజాతివారు నన్ను ఆడిపోసుకుంటు న్నారు. బ్రాహ్మణులకు తలవంపులు తెచ్చాడని నన్ను కులంలోంచి వెలివేసారు. నిజానికి నాకు ఈ వ్యాధి సంక్రమించిన కారణం వేరేఉంది. నా తండ్రి భిక్షాటనతో నన్నుపెంచి ఒక గురుకులంలో చేర్పించాడు. నేను ఏకసంథాగ్రాహిని, విద్యలు నేర్చుకుని వచ్చిన నన్ను నా కులం వారు గుర్తించరైరి. సరికదా నామీద కుట్రలు చేయసాగారు. సర్వశాస్త్రపరిజ్ఞానంతో ఉన్న నన్ను నా బంధువులు, నా కులం వారు గుర్తించక వెలివేసినట్టుండే వారు. దాంతో నేను మానసిక వేదనకు గురయి కన్నుమిన్ను కానకుండా పెద్దలయందు లేశమైనా గౌరవం లేకుండా బ్రతికాను. ఒకసారి యజ్ఞ వాటికలో నన్ను పిలవలేదని ఒక వేదపండితునితో వాగ్వివాదానికి దిగి అవమానించాను. నేను చదివిన వేదం అందరికి నేర్పుతాను ఒక్క మన కులం లోనే శాస్త్రం నిక్షిప్తం కాకూడదు అనిఎలుగెత్తాను.

నన్ను నా ఆవేశం చూసిన ఒక ఆయుర్వేద పండితుడు భుజం తట్టి "నాయనా నీ ఆవేశం నాకు అవగతమైంది. కులఅహంకారానికి, చిన్న చూపుకు గురయితివి. శాంతించునాయనా, నీవు నీకు తోచిన మార్గంలో సాగిపో! వేదం హిందువు అనే వారి నోట నిక్షిప్తంకావాలి. అందుకు నీవు నీ ప్రయత్నం చేయగలవు. కానీ, నీ ముఖంలో ఒక భయంకరమైన వ్యాధి లక్షణాలు కన్పిస్తున్నాయి. నీ ఆలోచనకు అది అంతరాయంగా నిలుస్తుంది అని చెప్పాడు.

భయపడి ఏమిటావ్యాధి అని అడిగాను. కుష్టులక్షణాలు ఉన్నాయి. నీ కనుబొమ్మలు, రాలిపోతున్నాయి. చెవులుపొంగుతున్నాయి. చేతివేళ్లు సన్నపడ్తున్నాయి. నీ అడుగులు ఒకింత తడబడ్తున్నాయి. ఏది ఏమయినా ఆవ్యాధికి మందు ఇంకా ఆయుర్వేదంలో కనుగొనలేదు. ఆ పండితుడు చెప్తుంటే విన్న బ్రాహ్మలు పగలుబడి నవ్వారు. వేదం శూద్రులపాలు చేస్తానన్నందుకు రోగిష్టివి అవుతున్నావు త్రేతాయుగంలో శ్రీకృష్ణుడి కుమారుడు సాంభునికే ఈ కుష్టు తప్పలేదు. సుమతి భర్తకే ఆ వ్యాధి ప్రాణాల మీదకు తెచ్చింది. నువ్వెనగా ఎంతరా భ్రష్టా అని చుట్టూ చేరి గేలిచేసారు. ఇది నాకథ. నేను ఈ కీకారణ్యంలో నివాసం ఏర్పాటుచేసు కున్నందుకు కారణం. నేను నేర్చుకున్న వైద్యశాస్త్రంతో అనేక వనమూలిక మందులు తయారుచేస్తున్నాను. నాకున్న రోగం అంటురోగం కాదు. నాకు పాపభీతి ఉంది. ఎవరికి నా వలన సోకినట్టు చేసే దుర్గుణం నాలో లేదు." అని చెప్పాడు. అయినను ఇక్కడ పిల్లలను ఉంచేందుకు వెనుకాడారు.

రామన్న ఉంటానంటే వద్దనే తండ్రిని గుణనందుడు సముదాయించి "రామన్న నీకు విద్య అభ్యసించే యోగంలేదు. కానీ, నీ పూర్వజన్మ పుణ్యం వలన సమస్త విద్యలు నీకు నేర్వకుండానే దక్కగలవు. గురువులేని విద్యలు రాణించవు కానీ, నీ విషయంలో ఏకలవ్యుని వలే విద్యలు రాణించ గలవు. నీవు న్యాయ పరిరక్షకుడవు కాగలవు. పాతకాలంనాటి మనుధర్మశాస్త్రంను అనుసరించి ఇంతవరకు మన పాలకులు ఏలుతున్నారు. ఆశాస్త్రం పూర్తిగా





కాకున్నా ఒకింత మన మధ్య ప్రమాదహేతువయినది. అది చాలా పాతకాలం నాటిది. ఆ విధానాలు ఇప్పుడు ఆచరణలో చాలా కష్టం. స్త్రీజాతిని కించ పరిచేవిధంగా హీనంగా ఉన్నందున నీవు ఆ శాస్త్రంలో స్త్రీలకు సంబంధించిన వరకు తొలగింపులకు కారకుడవు కావాలి. దాని ప్రభావాన్ని కొంతవరకు ప్రజలనుంచి దూరం చేయగలవు. నామాటలు సత్యం. వేయి శుభాలు నీకు కలుగగలవు. ఈ తాళపత్ర గ్రంథంలో ఒక పుట చదువు అని ఒక తాళపత్రాన్ని అందించాడు. రామన్నకు ఇంకా అక్షరాభ్యాసమే జరుగలేదు. అంతా అయోమయంగా చూసారు.

బసవయ్య చేతులు జోడించి "అయ్యా నా కొడుకు ఇంకా అచ్చరా భ్యాసాన్ని సేయనేలేదు. ఎలా సదువగలడు? మీరు తెలిసి ఇలా చెప్పడం వాడు సదివేందుకు సిద్ధపడడం చాలా అసహజంగా ఉంది." అని బిడ్డను తనపక్కకు లాక్కున్నాడు.

"రామన్నకు అక్షరాభ్యాసం కాలేదు. కానీ చదువగలడు. ఏదీ చదివి విన్పించు" అని మరల ఆదేశించాడు గుణనందుడు.

"మీ ఆదేశం అదే అయితే, అవశ్యం చదువుతాను గురుదేవా!" గురువు పాదాలకు నమస్కరించి నేలమీద కూర్చుని తాళపత్రంలో అక్షరాలను చూసి రామన్న చదివి విన్పించాడు. అక్కడున్నవారు నోళ్లు వెళ్లబెట్టారు. ఇదేలా సాధ్యం? ఎలా చదువగలుగుతున్నాడు అని మూతులు కొరుకున్నారు.

"రామన్నా నీకు ఇలా చదివేశక్తి ఎలా వచ్చింది అనుకుంటున్నావు, నీవు చదువుకోవాలన్న ఆశతో వచ్చావు. కానీ, నీతండ్రికి ఇష్టంలేదు. నేను శూద్రులకు శాస్త్రభోదన చేయడంపై నాకు కులశాపం ఉంది. అందుకే నేర్పడానికి కుదరలేదు. నా సర్వశక్తులను ధారపోసి నీకు విద్యాదానం చేసాను. బతికుంటే మళ్లీ మరోచోట కలుద్దాం."గురువు దీవించి లేవనెత్తాడు.

బసవయ్య వెంటనే కాళ్లమీదపడి "నన్ను సెమించండి, తెలియని అజ్ఞానంతో మిమ్మల్ని హీనపరిసి మేమంతా హీనపడ్డాం. మా బిడ్డను ఇక్కడే విడిచి ఎళ్లిపోతాను. మీ శుశ్రూషలో వాడు రాణించాలి."

"బసవయ్యా ఇది కలికాలం ఒకప్పటి తపశ్శక్తి ఇప్పుడు ప్రభావం లేకుండా పోయింది.కానీ, ఉసురులు,శాపాలుగా వెంటాడుతున్నాయి. నాకు కులశాపం ఉంది.అది నాపై ప్రత్యక్షంగా లేకపోయినా,నావెన్నంటే ఉంది. అలాగే,నాకు తెలిసిన విద్యలను పలువురికి నేర్పాలని చూసాను.కానీ, శాపకారణంగా నెరవేరకున్నది. అందుకే విద్యాదానం సంకల్పం మదిలో మెదిలిన మరుక్షణం రామన్నకు మనసావాచా దానం చేయాలను కున్నాను. నా దానస్వీకారం జరుగుతుందా లేదా అని భయంగానే తాళపత్రం ఇచ్చి చదవమన్నాను.బాలుడు నామాట మీద విశ్వాసంఉంచి అక్షరజ్ఞానం లేకున్నా చదువగలిగాడు నాకు ఎనలేని సంతోషంగా ఉంది."

రామన్నతో బాటు మిగిలిన బాలురు గురుకులంలో ఉండిపోతా మన్నారు. చేసిన తప్పులకు క్షమించమని కోరారు. అందుకు గుణనందుడు నిరాకరించి "మన మధ్య గురుశిష్యుల సంబంధం బెడిసింది. గురువును చూడాల్సిన కళ్లతో మీరు చూడలేదు. కనుక మీకు నా నుంచి విద్య అబ్బదు. రామన్న నాలో గురువునే చూసాడు.నారోగం గురించి పట్టించుకోలేదు. అందుకే అతడు విద్యాదానం పొందదానికి అర్హత పొందాడు."అని చెప్పి గాఢంగా నిట్టూర్చాడు.

రామన్న గురువుపాదాలపై పడి "గురుదేవా మీకు ఎలాంటి సేవలు చేయకనే విద్యాదానం పొందాను.గురుదక్షిణగా ఏమి కావాలన్నా ఇవ్వగలను దయచేసి ఆదేశించండి. చెల్లించగలను."

"భళిరా శిష్యా,నీవు కారణజన్ముడవు. ఇంతచిన్నవయస్సులో ఎంతటి ప్రజ్ఞాపాటవాన్ని ప్రదర్శించావు. నేను వేసిన విత్తు మొలక కాదు, వటవృక్షం అవుతున్నందున నాకు చాలా ఆనందంగా ఉంది. నేను కోరాల్సిందే, నీవు చెల్లించాల్సిందే. ఇక్కడ చేరువలో సింహపురి అనే రాజ్యం ఉంది. అక్కడ రాజు మతిహీనుడు, దుర్మార్గుడు నాప్రియతమ శిష్యున్ని వధించాడు. ఆ రాజుకు బుద్ధివచ్చేలా నీవు చేయగలగాలి. ఇదే నా కోరిక ఎన్నాళ్లలో సాధించగలవు? "





అక్కడవారంతా అదిరిపడ్డారు.ఒక నిరుపేద యాదవబాలకుడు రామన్న సింహపురి రాజుకు బుద్ధివచ్చేలా చేయడమా? అందులో విద్య నేర్చుకునే గురుకులంలో బాలున్ని వధించిన రాజును ఎదుర్కోవడమా? ఇదేదో రామన్న ప్రాణం మీదకు వచ్చినట్టుంది.ఈ గురువుకు చేతివేళ్లకే కాదు రోగం మనస్సుకు ఉన్నట్టుంది.ఇక్కడ్నించి ఎంత త్వరగాపోతే అంత మంచిది అని ఆలోచించి బసవయ్య"అయ్యా మన్నించాలి ఇలాంటి పనులకు కత్తియుద్ధాలు ముష్టి యుద్ధాలు చేసేవారిని సూసుకోండి. ఒక అమాయక బాలునికి కోరవల్సిన కోరికేనా ఇది.నాడు ద్రోణుడు ఏకలవ్యుడిని అడిగినట్టు కూడా అడగలేదు.చిటికినవేలుతో సరిపోయేది. ఆ రాజు దుర్మార్గుడు అని మీరు చెప్తూనే ఈ పసివాడిని వాడడానికి మీకు మనస్సు ఎలా వచ్చింది.ఈ గురుదక్షిణ గురించి తెలిస్తే రామన్నను ప్రాణాలతో వదులుతాడా? వద్దుబాబు మీ విద్యలు దానం సేసినవి తిరిగి తీసు కోండి."అని పాదాలపై పడ్డాడు.

గుణనందుడు చిర్నవ్వుతో బసవయ్యను చూసి"బసవా నీవు సత్యకాలం మనిషివి నీవు ఇంకనూ అజ్ఞానంతో కొట్టుమిట్టాడుతున్నావు. సింహపురి రాజు ఉగ్రసేనుడు వెతుక్కుంటూ రామన్నవద్దకే వస్తాడు. ఎందుకో తెలుసా? అదిగో అటుచూడు ఆ గుడిశెలో నివసించే వ్యక్తి. ఇక్కడ జరిగిన దంతా విని నన్ను శపించే కులపెద్దలముందు చెప్తాడు.వారు రామన్న విద్యాదానం పొందాడని ఆగ్రహించి రామన్నపై లేనిపోని కుట్రలు చేస్తారు.అవి అన్నీ రామన్న తిప్పికొట్టగలడు.నీవు కలత చెందాల్సింది లేదు.నీకంటికి నీకొడుకు చిన్నబాలుడు.కానీ,అతడు అరివీరభయంకరుడుగా చెలరేగగలడు.కత్తి యుద్ధంతో, భుజబలంతో కాదు.మానసిక బలం అతడిలో మెండుగా ఉంది. నీవు సప్తసముద్రాలు వెనుక దాచినా ఈతడి కోసం రావల్సినవారు వస్తారు. ఈతనితో పరాజితులు కావల్సినవారు కాకపోరు."

ఆ మాటలకు బసవయ్య అదిరిపడ్డాడు. ఇక్కడ జరిగినది అంతా ఆ రాజుకు తెలిసిపోతుందా? బాగుందయ్య పంతులయ్యా ఎంతగా కొంప మీదకు తెచ్చావు.నా బిడ్డకు కుడిచేత్తో విద్య ఇచ్చి ఎడమచేత్తో ప్రానాలు తోడేస్తున్నావు." అని లబోదిబోమన్నాడు. మిగిలినవారు కూడా భయపడ్డారు.

బసవయ్యతో బాటు అంతా ఆ గుడిశె వైపు చూసారు. అక్కడ ఒక యువకుడు ఇటువైపు చూస్తూ కన్పించాడు. బసవయ్య లోగొంతుతో "అయ్యా మన మాటలు విన్పించవు కదా, ఇక్కడ జరిగినదంతా ఆ యువ కునికి ఎలాతెలుస్తుంది ? అతడేకేమైనా కర్ణపిశాచి వంటి విద్యలున్నాయా? ఒకదాని తరువాత మరొకటి భయంకరమైనవి వినాల్సి వస్తోంది."

"వాడికి ఏ కర్ణపిశాచి రాదు. ఇక్కడ ఉన్న నా శిష్యులద్వారా ఇక్కడ జరిగినదంతా తెలుసుకుంటాడు. గురుకులంలో మొదటి సూత్రం సత్యం పలుకవలెను. కనుకనే వీరంతా సత్యం చెప్పకతప్పదు."అని గురువు చిర్నవ్వుతో చెప్పాడు.

"బాగుంది మీ గురుకులంలో సత్యం పలకడంలో మర్మం. ఇంత వరకు మీ వద్ద శాస్త్రం నేర్చుకోవడానికి ఎవరూ రాకపోవడానికి కారణం ఇదన్నమాట. మీరు నేర్పి ఆ గూఢచారి యువకునికి ఇక్కడ గుట్టుమట్టు తెలియపరిచి మీ కులపెద్దల ద్వారా వాడి ప్రాణంమీదకు తెస్తారన్న మాట. అలాగే ఒకశిష్యుడి చావుకు కారకులైయ్యారు."బాలురతో ఉన్న తల్లితండ్రులలో ఒకడు చిర్రెత్తిపోయాడు.

అంతలోనే ఆ యువకుడు రానే వచ్చాడు. చూస్తుండగానే ఆరాతీయ సాగాడు. ఒకచెట్టు కింద కత్తిసాము నేర్చుకున్న కొందరు శిష్యులు చెప్పడానికి తటపటాయించారు. వారి ఇబ్బందిని చూసిన గుణనందుడు నవ్వి "నాయనలారా ఆ వేగులు వానికి నిజమే చెప్పండి. మీరెందుకు దాచాలని ప్రయత్నిస్తున్నారు. తప్పు కదా ప్రాధమిక సూత్రాన్ని ఆచరించండి. ధిక్కరించక వద్దు. గురుకుల వాస ధర్మాలను మరువకండి." పెద్దగొంతుతో చెప్పాడు.

ఆ శిష్యులు ఏది దాచకుండా చెప్పారు. ఆ వేగు బ్రాహ్మడు దగ్గరగా వచ్చి రామన్నను ఎగాదిగా చూసి "ఓహో యాదవబాలుడు లిప్తలో వేదం నేర్చెనా? సర్వశాస్త్రపారంగతునిగా ఈ గుణనందుడు చేసెనా ?ఇట్టివాడు తనకు దానంగా లభించిన విద్యతో ఏకంగా రాజాధిరాజు ఉగ్రసేనునికి బుద్ధివచ్చేలా చేయనున్నాడా?ఇది గురువుగారి గురుదక్షిణ కోరిక, చాలా





బాగుంది. ఓ నందా ఏమి నీతీరు ఇలా ఉంది. నీవు శూద్రులను ఉద్ధరించ గలనని చెప్పి వారికి విద్యలునేర్పి వారి ప్రాణాలమీదకు తెస్తున్నావు. ఇలా చేయడం నీకు భావ్యమా? ఓ అమాయకులారా, ప్రాణాలమీద ఆశలేనట్టు ఇంకనూ ఇక్కడ నిలచెదరేల పోయి మీ వృత్తిపనులు చేసుకుని బతుకు ఈడ్చుకోండి. దానంగా పొందిన విద్యలు అక్కరకు రావు. అన్ని జీవులలో మానవజన్మ గొప్పది. అట్టి మానవులలో బ్రాహ్మణపుట్టుక మరీ గొప్పది. వారికోసం నిర్దేశింపబడిన వేదం అన్యులకు పనికిరాదు. ఈ గుణనందుడు తానో మహాత్మునిలా తప్పుతోవను నడిచి మీ వంటి శూద్రులను నడుపుతున్నాడు. చివరికి వారిని ఊహించని విధంగా నాశనం చేస్తున్నాడు. కనుక మీ హితవుకోరి చెప్పాను." అని చెప్పి వెనుక్కు వెళ్ళిపోయాడు.

అక్కడున్నవారు భయభ్రాంతులైయ్యారు. బసవయ్య వెంటనే రామన్నను తీసుకుని బయల్దేరిపోయాడు. అతడివెంట మిగిలినవారు అనుసరించారు. రామన్న తండ్రిచే ఈడ్వబడుత్తునే "గురుదేవా గురుదక్షిణ, చెల్లించగలను."అని అరిచి చెప్పాడు. గుణనందుడు కత్తిసాములో ఆరితేరిన వారిని పిలిచి వారు ఆవేశంతో వెళ్ళిపోతున్నారు. వారు దారితప్పి క్రూరమృగా లున్న తావులకుపోగలరు. మీరు వెళ్లి అడవిదాటించి వచ్చేయ్యండి అనిచెప్పి పంపాడు. నలుగురు శిష్యులు పరుగులు తీసి బసవయ్య బృందాన్ని కలుసు కున్నారు. అప్పుడు బసవయ్య అడిగాడు"ఏమయ్యా మీరు కత్తిసాము నేర్చుకుంటున్నారు. మీకు ఎలాంటి ప్రమాదం ఉండదా ? మీకు ఆ కులం వారితో పోరులేదా?"

"మేము నిమ్నజాతికి చెందినవారం. మేము గురువుగారి కులపెద్దలకు ఆగ్రహం కల్గించే పనులు ఏమీ చేయం. శాస్త్రం నేర్చితే ప్రాణాలు మీదకు వస్తుంది, మాకు కావాల్సింది కత్తియుద్ధం. వీటిని నేర్చుకుంటే మాకు ఎవరివలన ఎలాంటి ఇబ్బందులు ఉండవు. రాజుల కొలువులో బతుకుదారి కలుగుతుందని ఆశతో వచ్చిచేరాం." ఒకడు చెప్పాడు.

"అతనెవరో బ్రాహ్మడు ఎదురుగా గుడిశె వేసుకుని ఉన్నాడు. నోటికి వచ్చినట్లు గురుదూషణ చేసినా మీలో ఎవరు వాడికి తగిన బుద్ధిచెప్పక పోవడానికి కారణం?"

"గురువుకు భరించే శక్తి ఎక్కువ. తొలుత ఆ గుడిశెలో ఉన్నవారిపై గురువే తీవ్రంగా దాడిచేసి చావబాదేవాడు. అయితే ఆ దెబ్బలు తిన్నవాడు వెళ్లిపోయి మరొకడు వచ్చి తన పనితాను చేస్తుండేవాడు. అగ్రకులపోళ్లు వేదం శూద్రులపాలు కాకూడదని రక్షించుకునేందుకు ఎంత మంది అయినా వస్తారు, ఎన్ని కష్టాలు అయినా పడతారు. ఇలా నిత్యం గొడవలతో విలువైన కాలం మసికాకూడదని గురువే వదిలేసారు. అందుకే వాడు ఎంత పొగరుగా మాట్లాడినా వదిలేస్తున్నాం. లేకుంటే వాడిని చావచితకతన్ని ఏ పులికో ఆహారంగా వేసేవాళ్లం"

"లోగడ ఒక శిష్యుడిని కోల్పోయాను వాడిని ఉగ్రసేనుడు చంపేసాడు అని గురువుసెప్పాడు. ఆ ఉగ్రసేనుడిని సాధించమని గురుదక్షిణగా కోరాడు. ఇదేమిటి మావంటివారి మీద ఇంతపెద్దపెనుభారం మోపవచ్చునా? తలసుకుంటే మనస్సు పీకుతోంది. రాజులతో మావంటి పశువుల్ని మేపుకునే వారు సాటి ఎలా అవుతారు?" బసవయ్య కళ్లనీళ్లు తిప్పుకుని అడిగాడు.

ఆ మాటలకు ఓపికగా జవాబులు చెప్తున్న శిష్యులు ఆగారు. "మీ భయం మాకు తెలుసు. మేము మీకంటే హీనతెగలనుంచి వచ్చినవాళ్లమే. గురుసేవలో ఆయన గురించి చాలా తెలుసుకున్నాం. ఆయన కాలపురుషుడు ఏమి చెబితే అది జరిగి తీరుతుంది. తప్పకుండా ఈ రామన్న చేతిలో ఉగ్రసేనుడు అవమానం పాలయి తలదించుకోక తప్పదు. ఆ రాజు గర్వం అణచడానికి రామన్ననే గురువు ఎందుకు ఎంపికచేసుకున్నాడో తెలుసా? లోగడ గురువుగారి ప్రియశిష్యుడిని ఉగ్రసేనుడు నరికి చంపాడు. ఆ కథనం మీకు పూర్తిగా చెప్తాను అని ఆ కథనం చెప్పసాగాడు.





# రాచపీనుగకు తోడు కావాలి

భైరవభట్టు అనే బీదబ్రాహ్మణునికి ఆరుగురు పుత్రులుండేవారు. వారిని పెంచడానికి చాలాకష్టాలు పడేవాడు. జోలిపట్టుకుని ఊరూరా తిరిగి భిక్షాటన చేసి పూటగడిపేవాడు. అతడు ఎవరు ఏమి ఇచ్చినా ఈశ్వర కటాక్షంగా భావించి స్వీకరించేవాడు. ఒకసారి కులపెద్దలు అతన్ని పిలిపించి, కొన్ని గ్రామాలలో హీనులవద్ద భిక్షాటన చేసి మన సాంప్రదాయాలను మంట కలిపితివి కనుక నీవు మా నుంచి వెలివేయబడితివి అని పొమ్మన్నారు. భైరవభట్టు ఎంత ప్రాధేయపడినా, వారి మనస్సులు కరుగలేదు. నివాసముంటున్న ఇంటిలోంచి గెంటివేయబడ్డారు. వారి కథ విని జాలిపడిన ఒక బోయవాడు తన గుడిశెనిచ్చి తాను అడవిలోకి వెళ్లిపోయాడు. ఒక బోయవాని ఇంట భైరవభట్టు కాపురం ఉండడం మరింత అపరాధంగా భావించిన కులపెద్దలు అతని బిడ్డలు కాశీవిద్యాపీఠంలో విద్యాభ్యాసంకు తగరని పనికట్టుకుని అక్కడికి వెళ్లి ఆ పీఠంనుంచి వెలివేయించారు. (అప్పటిలో అంత ధారుణంగా ఉండేవి కులాచారాలు, కులపట్టింపులు. భారతదేశంలో మూడొంతులు ప్రజలు ఆ రోజుల్లో ఇలానే పాడయిపోయారు. నిర్ధాక్షణ్యంగా చంపుకునే వరకు వెళ్లిపోయేవారు.)

భైరవభట్టు కన్నీరుమున్నీరు అయిపోయాడు. ఇంటికి చేరిన ఆరుగురు పుత్రులను చూసి "నాయనలారా మీకు ఇంత తిండిపెట్టలేక నాకు తెలిసిన వారిని పట్టుకుని కాశీవిద్యాపీఠంలో చోటు సంపాదించాను. కానీ,ఇక్కడ మన కులపెద్దలు వారి ఛాందస భావాలతో మన నోటమట్టి కొట్టారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం అని తెలిసి కూడా ఆ అన్నంకుఅనేక ఆంక్షలు పెట్టారు. హీనుని చేతితో మనం భుజింపరాదు అంటే ఎలా? మనమే చెప్తున్నాం అన్నదానం చేయనివాడు మంచిగతులకు పొందలేడని, ఆ అన్నదానం చేయువాడు హీనుడా శూద్రుడా లేక బ్రాహ్మడా అని చూస్తే ఎలా? ఏది ఏమయినా మనం వెలివేయబడ్డాం. కనుక మీరు కొంత లోకజ్ఞానం

పొందినవారు. నేను మీకు ఇచ్చేది తలా ఒక జోలి. దాంతో ఇక్కడ మనకు విధింపబడిన వెలికిఅందనంతదూరంగా వెళ్ళికొత్తజీవితం ప్రారంభించండి. మీకు మా దీవెనెలు ఎప్పుడూ ఉంటాయి.మీలో ఐదుగురు వరుసుగా అమరావతి, ప్రతిష్టానపురం, విదర్భ, పాండ్య, పాటలీపుత్రం నగరాలకు వెళ్లండి. అక్కడ మన స్వగోత్రీయులు బంధువులున్నారు. చివరివాడు మీ అమ్మకు నాకు తోడుగా ఉంటాడు. మాకు పున్నామ నరకం నుంచి విముక్తి కల్గిస్తాడు."

ఆ మాటలు విని తండ్రి అజ్ఞప్రకారం తలా ఒక జోలి తీసుకుని ఐదునగరాల తోవపట్టి పోయారు. కులపెద్దలు వారిగురించి ఆరాలుతీసారు భైరవభట్టును అతడి చివర బిడ్డను హింసించి తెలుసుకోవాలనుకున్నారు. కానీ హింసలను భరించారే తప్ప గుట్టు విప్పలేదు.దాంతో అన్ని నగరాలకు వేగులను పంపించారు. ఎట్టి పరిస్థితిలో భైరవభట్టు కొదుకులు వెలినుంచి తప్పించుకోరాదు అనేది కులపెద్దలు పట్టుదల. అందుకు ఎంతఖర్చయినా, ఎంత శ్రమ అయినా,ఎందరు చచ్చినా,వెనుకాడేది లేదు అంటూ ఆ దిశలో సాగిపోయారు. అది అలా ఉంటే ఇక్కడ భైరవభట్టుకు భిక్షాటన చేసి పెంచే చివరికొడుకు జటాకేశుడు ఒకరోజు చెరువు గట్టుమీద కూర్చుని భిక్షాటనలో దొరికిన అన్నం తనముందు కొంత పెట్టుకుని తినేముందు ధ్యానం చేయసాగాడు.ఆ తోవలో వెడుతున్న గుణనందుడు చూసి "ఓ బాలకా చూస్తే బ్రాహ్మణునిలా ఉన్నావు.ఒక్కడివే ఆరగించేందుకు సిద్దపడ్తున్నావు. ఎవరూ అతిథి దొరకలేదా? లేక పిసినారివా?నీ వద్ద మరిముగ్గురకు సరిపడా అన్నం ఉంది. సంతృప్తిగా తినేందుకు కూరలు, పప్పు ఉన్నాయి.నాకు పెట్టగలవా? ఆకలితో ఉన్నాను.క్షుద్బాదతో బాధపడ్తున్నాను."

"ఓ మహానుభావా ఆకలికి తట్టుకోలేక పోవుచుంటిని నేను ఎంగిలిపడి మిగిలినది నా తల్లితండ్రులకు తీసుకువెళ్లిపెట్టగలను.నేను బాల్యంలో ఉన్నవాడిని, ఆకలికి ఓర్చుకోనందున నా తల్లి చెప్పినది కుమార ఆకలికి బాధపడకు. ఏచెరువు గట్టునో కూర్చుని ఆరగించమంది. ఇక నాలాంటి





ఆయవారంతో సంపాదించిన కూటికి అతిథి ఎవరు లభించరు. కారణం మేము మా కులపెద్దలతో వెలివేయబడినాము. కనుక చెరువు గట్టుమీద తప్పితే ఆలయప్రాంగణంలోకి వెళ్లితినలేము. మావద్ద ఎవరు తింటారు? ఈ భోజనం హీనులవద్ద నుంచి దానంగా పుచ్చుకున్నవే.ఆ హీనులు మాకు దేవుళ్లు కానీ మా కులపెద్దలకు దయ్యాలు." బాలకుడు కుండబద్దలు కొట్టినట్టు చెప్పాడు.

గుణనందుడు నవ్వి పక్కనే కూర్చుని "నాకు పెట్టునాయనా, నీకు నేను అతిథిని, నీచేతితో తినాలి అని నామనస్సు ఎందుకో తహతహలాడు చున్నది" అని ఒక ఆకు తన ముందు వేసుకున్నాడు.

జటాకేశుడు గుణనందుడి పాదాలకు మ్రొక్కి" స్వామీ, ఇలా నేను అతిథికి నా జీవితంలో వడ్డించలేనేమో అని అనుకున్నాను. ఇంతవరకు నాకున్న ఆకలి ఈ క్షణంనుంచి లేకుండాపోయింది. ఎంత విచిత్రం మీకు ఈ అన్నంపై ఎలాంటి ఆంక్షలు లేవు కదా స్వామీ!" వడ్డిస్తూ అడిగాడు.

సరిగ్గా అప్పుడే వచ్చాడు ఒక కులపెద్ద "ఆరిపిడుగా, నీకు ఒక అతిథి తగిలాడు. బాగుందిరా చెరువుగట్టు భోజనం ఒకేగూటి పక్షులు కలిసారురా, ఈ గుణనందుడు మీ కంటే ముందే వెలివేయబడినాడు. మీ ఇద్దరి కలయిక కన్నులపండుగా ఉంది.అయితే, ఇంతవరకు గుణనందునికి కేవలం గురుపీఠం నిర్వాహణ నుంచి మాత్రమే వెలి ఉంది. నీ దయవల్ల అగ్రహారాల్లో జీవించే హక్కు నేటితో శాశ్వతంగా కోల్పోతాడు." అని అక్కణ్నించి వెళ్లిపోయాడు ఆ కులపెద్ద.

"నాయనా ముందు ఈ అన్నం తిని మన క్షుద్బాద తీర్చుకుందాం. ఆ దురహంకారుల మాటలు గురించి ఆలోచనవద్దు.ఆ కన్పిస్తున్న అడవిలోకి పోదాం అక్కడ నీ వంటివారికి విద్యాబోధన చేస్తూ నా జీవితం గడిపేయ గలను."అని చెప్పాడు. ఇద్దరు తిని బ్రేవుమని త్రేన్చుచుండగా, వారిని కులపెద్దలు చుట్టిముట్టి నిలదీసారు."ఓయీ గుణనందా, నీవు హీనుల అన్నం భుజించితివి కనుక నీకు అగ్రహారములో నివసించే హక్కు లేదు.ఓరి

బాలకా,నీకు నీ తండ్రికి ఎంత హీనంగా చూసినా రవ్వంతయినా సిగ్గులేకుండా ఏమిట్రా మీ పొగరుబోతుతనం. మీరు చెడినది కాక పలు వురు బ్రాహ్మణులకు హీనులవద్ద చేయిచాచి తెచ్చిన అన్నం పెడుతున్నారు. ఈసారి నీవు మా కళ్లలోపడితే యజ్ఞపశువుగా ఏ యజ్ఞంలోనైనా నిన్ను బలిచేతుము. ఇదే నీకు మరణశాసనం" అని కులపెద్ద మండిపడ్డాడు.

జటాకేశుడు ఆ మాటలకు గజగజలాడిపోయాడు. అప్పటికే అక్కడికి కుమారుని కోసం వెతుక్కుంటూ భైరవభట్టు వచ్చి మరణశాసనాన్ని విని, కులపెద్దల పాదాలపై పడినాడు "అయ్యా పసివాడు. చేతకాని ఈ తండ్రి పెంచిపోషించ లేనందున ఆకలికి పట్టెడు అన్నం భిక్షాటన చేసుకుని వచ్చి ఎవరికి ఇబ్బంది లేకుండా చెరువు గట్టున తింటున్నాడు. ఇందులో తప్పేమీ లేదు. వాడిని యజ్ఞపశువును చేయకండి."బొటబొట ఏడుస్తూ ప్రాధేయ పడ్డాడు. కులపెద్దల మనస్సులు కరుగలేదు. "నీ పుత్రుడు కనిపించినచో యజ్ఞపశువు కాక తప్పదు." అని మరణశాసనాన్ని మరింత దృఢతరం చేసారు.

గుణానందుడు ఆ బాలకున్ని తీసుకుని "ఓయీ వెర్రిబ్రాహ్మడా, మన హైందవ సాంప్రదాయాలను కాపాడుతామని చెప్తూనే వీళ్లు మన కులాన్ని మనల్ని మట్టిపాలు చేస్తున్నారు. ఈ ఛాందస కులపెద్దలు వలన మన మతం, సంస్కృతి కాలగర్భం మందు కలిసిపోతోంది. వీరి భావాలతో కొన్ని వందల బ్రాహ్మల కుటుంబాలు మట్టిపాలవుతున్నాయి. ఆకలి తీర్చుకోవడానికి పట్టెడన్నం పెట్టరు కానీ, ఆ అన్నం పెట్టినవాడి కులమతాలు ఆరాతీసి శల్యపరీక్షలు చేసి ఆ అన్నంకు ఆంక్షలు విధించి నేలపాలు చేయుచున్నారు. వీరికి భయపడకు. నేను నీ కుమారున్ని ఆ అడవికి తీసుకుపోయి నాకు తెలిసిన విద్యలు అన్నీ నేర్పి తీర్చిదిద్దుతాను. వీరికి తగు గుణపాఠం నేర్పుతాను. అయినను నిన్ను నీ కుటుంబాన్ని హీనపరిచి, బాలురయిన నీ కుమారులకు విద్యాహీనులను చేసి, అగ్రహారంనుంచి వెలివేసినారు. అవి మరణం కంటే పెద్ద శిక్షలు కావా? వీరు ఇంకను మీకు వేయు శిక్షలకు





భయపడెదవేల? నేను కావాలనే నీ కుమారుని వద్ద ఎంగిలిపడితిని. నీ కుమారుడు ధర్మశాస్త్రం ఎరిగినవాడిలా అతిథికి పెట్టాలని ఎంతగానో ఆరాటపడినాడు. మిమ్మల్ని ఎవరు వెలివేసినా మీలో పరిపూర్ణమైన బ్రాహ్మణత్వం ఉంది. అది నశించదు." భైరవభట్టుకు ధైర్యం చెప్పి లేవనెత్తాడు

కులపెద్దలు మండిపడి "ఓయీ నీవా మమ్ము హీనపరుచునది. ఇంత చేసింది ఎవరికోసం? హిందూవులలో మనకు మాత్రమే వేదరక్షణ కోసం, సాంప్రదాయ రక్షణకు నియమించింది సాక్షాత్తు ఆ దైవమే. భూలోక దేవతలుగా మనం ఆ దేవుని తరువాత పూజింపబడ్తున్నాం. మన జాతి వేదరక్షణకోసం వేలసంవత్సరాల నుంచి జీవితాలు అంకితం చేస్తూనే ఉంది. అందుకు కొన్ని వేలమంది సమిధలు కాకతప్పదు. మాకులేదను కున్నావా పాపభీతి, ఆ బాలుని చూస్తే మా పుత్రులను చూసినట్టేఉంది. లోకజ్ఞానం సంపాదించలేని బాలుడు ఆయవారం చేసుకుని తెచ్చిన అన్నం చెరువుగట్టునపడి తింటున్నాడు అంటే ఎంతటి శిక్ష అనుభవిస్తున్నాడు. శవాలను మోసేవారు కదా చెరువుగట్టున తినేది. మేము దయ, క్షమ, జాలి వీటితో ముడిపడి ఉన్నవారమే. వేదసారం నీకు తెలియంది కాదు. అందులో ఇహము, పరము,భౌతిక, దైవిక,ఆధ్యాత్మిక రహస్యములతో నిండి ఉండడమే. వేదమంత్రాలలో చెప్పబడిన వేదాన్ని స్పష్టంగా చెప్పడానికి, పలకడానికి బ్రాహ్మణునికే సాధ్యం అని ఆ దేవుని నిర్ణయం." అని రోషంగా చెప్పాడు. అలా చెప్పినపుడు కులపెద్ద కపోలాలు పొంగాయి.

"మీతో వాదులాట అనవసరం. అన్నీ తెలిసి మీరు కావాలని ఒక బ్రాహ్మణ కుటుంబాన్ని కష్టాల పాలుచేసిరి. బోయవాడు వాల్మీకి రాసిన రామాయణం మీకు పఠనీయం. ఆ బోయలు మీ దృష్టిలో ఏమి కానివారు. వాల్మీకి రోజులలో మీరుంటే ఆయన్ని వెలివేసి ఉండేవారు. సరే,ఈ బాలుడను నాతో తీసుకువెడుతున్నాను. మీరు వేసిన శిక్షకు ఈతడు చిక్కడు. మానవ ఛాందస మృగాలకు దూరంగా, వన్యమృగాలు తిరుగాడే ప్రాంతంలో జీవించగలం."అని చెప్పి తూర్పునగల అడవిలోకి వెళ్లిపోయాడు


గుణనందుడు. అతడివెంట జటకేశుడు అడవిలో క్షేమంగా ఉంటాడని ఆశతో భైరవభట్టు పంపేసాడు. దాంతో కులపెద్దలు ఆగ్రహంలో ఆజ్యంపోసినట్టు అయ్యింది. వేదపరిరక్షణలో భాగంగా తాము చేయాల్సింది చేయాలి. ఇట్టి వెలికి గురి అయినవారు వేదం నేర్వరాదు, నేర్పించరాదు అని మరింత కక్ష వహించారు

జటకేశుడు అడవిలో ఒక పర్ణశాల యందు గుణానందునివద్ద సకల విద్యలు నేర్చుకున్నాడు. పదహారేండ్ల ప్రాయం వచ్చింది. ఏనాడు అడవి వదిలి నాగరిక ప్రపంచంలోకి వెళ్లలేకపోయాడు. తనకు కులపెద్దలు విధించిన మరణశాసనం అనునిత్యం గుర్తుకు తెచ్చుకుని కుమిలి పోతుండేవాడు.

తల్లితండ్రులు ఎప్పుడు జటాకేశుని చూడాలనుకుంటారో అప్పుడు అడవికి వచ్చి చూసుకునేవారు. కులపెద్దలు ఒకచోట చేరినప్పుడు ఇదే విషయాన్ని మాట్లాడుకునేవారు. వెలివేయబడిన వారు రాణించరాదు. సర్వనాశనం కావాలి. ఇదే వారి ఆలోచన. ఎలాగైనా జటకేశునికి మరణ శాసనం అమలు చేయాలని అనేక దారులు వెతుకసాగారు. రోజులు గడిచిపోతున్నాయి.

వైశాఖ శుద్ధ ఏకాదశి రోజున సింహపురి రాజాధిరాజు ఉగ్రసేనుడు తన వృద్ధతండ్రిని తీసుకుని శ్రీముఖలింగక్షేత్రం దర్శనం నిమిత్తం వచ్చాడు. పట్టపు టేనుగుపై కూర్చున్న ముసలి రాజును వైశాఖ ఎండలకు వెర్రి చేష్టలగురయి, ఆ ఏనుగు నేలపడద్రోసి పాదాలతో కుమ్మేసి చంపేసింది. అది ఎక్కువ దూరం ప్రయాణించినందున ఒకింత పిచ్చెత్తి పోయిందని మావటులు రాజుకు చెప్పారు. తండ్రి అకాల మృత్యు వాతకు ఉగ్రసేనుడు చాలా విచారించాడు. తండ్రికి అంత్యక్రియలుచేస్తుండగా ఆస్థాన జ్యోతిషులు "ప్రభూ మీ తండ్రిగారు మహాశూరులు, యాభై ఏండ్లు పాలించినవారు. ఆయన చావులో పెక్కుదోషములు కలవు. మీరు జ్యోతిష్యులను, పురోహితులను అడుగకుండా అంత్య క్రియలను చేసేస్తున్నారు. పార్థివ శరీరం చితిపై లేకున్నచో మేము చెప్పినా బావుండేది. కానీ, మీరు చితి





రగిల్చారు.కాడు చల్లారకముందే రాచపీనుగుకు తోడును వెతకండి లేకున్నచో మీ తండ్రి పూర్వగతులకు పోడు.అధోగతిలో కష్టములు పడక తప్పదు.ఇక్కడే పిశాచగణాలతో కలిసి పోగలడు.అది మీకు మీవంశానికి చేటు చేయక తప్పదు."అని చెప్పారు అది విని ఉగ్రసేనుడు భయభ్రాంతుడైనాడు.

"ఇంతవరకు ఏమి చేసారు. ఇలా మీదకు వచ్చాక చెప్పడం భావ్యమా? అందులో నా తండ్రికి సరిజోడును తోడుగా తీసుకురావాలి. ఇది క్షణాల్లో సాధ్యమా? జరిగేపనేనా? ఏమిదారి? మీరే చెప్పండి" ఎరుపెక్కిన కన్నులతో అడిగాడు. అక్కడ ఒక్కటే ఉత్కంఠ. అక్కడ ఉన్న అపరకర్మలలో దానాలు పుచ్చుకునే బ్రాహ్మలు ముఖాలు చూసుకున్నారు.

చితి ఆకాసాన్ని తాకేట్టు అగ్నిజ్వాలలతో ఎగిసిపోతోంది. గంధం చెక్కలు,నెయ్యి పోస్తునే ఉన్నారు.కాలుకాలిన పిల్లిలా తిరుగుతూ, ఉగ్రసేనుడు క్షణక్షణం కోపంతో ఊగిపోసాగాడు. వెంట ఉన్న మంత్రి పెద్ద జేగంటను తీసుకు వచ్చి చితికి దూరంగా వేలదదీసాడు. అది మ్రోగితే పదియోజనాలు విన్పిస్తుంది. "గంట ఎందుకు వేలాడదీసారు?" రాజు చిరాకుగా అడిగాడు.

"ప్రభూ, చితి ఆరిన మరుక్షణం ఆగంట మ్రోగించబడ్తుంది. అంటే దహనసంస్కారం అయిపోయినట్టే. పోనీ, చితిఆగకుండా అలానే రగుల్చు కుంటూ కొన్నిరోజులు గడుపగలం.అది శాస్త్రవిరుద్ధం.అందుకే ఏమి చేయాలో తోచడం లేదు." మంత్రి నీళ్లునమిలాడు.

"ఈ జ్యోతిష్యులను మన రాజధానికి వెళ్లిన మరుక్షణం ఉరితీయిం చాలి.వీరు తేరగా తిని మీదకు వచ్చినప్పుడు ఇలాంటి విషయం చెప్తున్నారు." అని కోపంతో చితి ముందు కూలబడ్డాడు ఉగ్రసేనుడు.

జ్యోతిష్యులు భయభ్రాంతులైపోయారు. నేరకపోయి చెప్పాం. ప్రాణం మీదకు తెచ్చుకున్నాం అని తలలు పట్టుకున్నారు.రాజు తలచుకుంటే దెబ్బలకు కొదువాఅనే సామెతలా దశదిశలు పరుగులు తీసారు రాజభటులు. ఆ చుట్టు ప్రక్కల వందలాదిమంది బ్రాహ్మణులను పిలుచుకుని వచ్చారు. విషయం వారికి చెప్పబడింది.రాచపీనుగుకు తోడు కావాలి.దానికి సమయం





లేదు.క్షణాల్లో జరుగాల్సినదే. చనిపోయినరాజుకు సమానమైన వాడు ఇక్కడ ఎవరున్నారు? సాహసాలు, శూరత్వం, అధికారం, ఇవన్నీ సమానంగా ఉన్నవాడు కావాలి. వాడిని వధించి నా తండ్రికి స్వర్గలోకప్రాప్తి చేసితీరాలి. నా బాధ్యత చెప్పండి ఇక్కడ బ్రాహ్మలు వేదపరి రక్షకులు అని విన్నాను,మీకు తెలియని ధర్మసూత్రాలు లేవు."అని దీనంగా రాజు అడిగాడు.

బ్రాహ్మలు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. వారికి జటాకేశుడు తళుక్కున మెరిశాడు.వెంటనే వారిముఖాలు విప్పారాయి. "రాజా దిగులు చెందకు.మీతండ్రి గురించి విని ఉన్నాం.అతడు మహావీరుడు అతడికిచావు ఈ పుణ్యభూమిలో వెతుక్కుంటూ పట్టపుటేనుగు రూపంలో వచ్చింది. సరే, ఆ మహావీరునితో సరిజోడును వెతకడం ఎవరికి సాధ్యం కాదు. ఒకవేళ వెతికి పట్టుకున్నా అతన్ని జయించడం కష్టమే.కారణం మీతండ్రి అంతటి వాడు కనుక, దీనికి ఒక సూక్షమార్గం కలదు. సమస్తవిద్యలు నేర్చిన బ్రాహ్మణ యువకుడ్ని, అవివాహితున్ని రాచపీనుగుకు తోడుగా వధించడమే.అట్టి యువకుడు ఇక్కడే ఆరు క్రోసులదూరంలో ఉన్నాడు."

ఆ మాటలకు ఉగ్రసేనుడు అయోమయంలో పడ్డాడు.

"బ్రాహ్మణ బాలున్ని వధించడమా? అది ఘోరపాతకం కాదా?"

"రాజాధిరాజా మేమాతన్ని యజ్ఞపశువుగా ఎప్పుడో నిర్ణయించాం. అతన్ని వెలివేసితిమి. నాగరిక ప్రపంచంలోకి అడుగుపెట్టకుండా ఆంక్షలు విధించితిమి. అయినను రాచపీనుగుకు తోడు తీసుకువచ్చినప్పుడు మీరు ఇలా పాపపుణ్యాలు లెఖ్ఖించడం భావ్యం కాదు.అడిగారు చెప్పాం ఆపైన మీ ఇష్టం." కులపెద్ద చెవిలో ఇల్లుకట్టుకుని మరీచెప్పినట్టు చెప్పాడు.

మంత్రి వెంటనే రాజుకు నూరిపోయసాగాడు."ప్రభూ,మనంనగరానికి వెళ్లగానే మనజ్యోతిష్యులను ఉరితీయాలనిఆదేశాలు ఇచ్చారు.వారు బ్రాహ్మణులు కారా? కనుక ఆ బాలుని వధ గురించి ఆలోచించకండి"

అంతలోనే జేగంట మ్రోగింది.రాజు దిగ్గున లేచాడు. మరి రెండు సార్లు జేగంట మ్రోగినచో దహన సంస్కారం ముగిసినట్టే. "ఎక్కడున్నాడు

ఆ బాలకుడు?"అని అడిగి ఖడ్గంధరించాడు. అప్పుడు తొలిరోజు శ్రాద్ధకర్మలు చేయునపుడు దానాలు పుచ్చుకోవడానికి బీదబిక్కి వారితో ఉన్న భైరవభట్టు అక్కడ మాటలు విని రాజు కాళ్లమీదపడి "అయ్యా! వాడు నా కుమారుడు వాడిని వధించి నాకు గర్భశోకం కల్పించవద్దు. ఈ కులపెద్దలు పగతో రగిలిపోయి మీకు తప్పుగా నాబిడ్డను మీతండ్రితో సరిపోల్చి చెబుతున్నారు. రాజులెక్కడ? బీదబిక్కి బ్రాహ్మణ బాలుడెక్కడ? మన్నించి వదిలేయండి." కన్నీరుమున్నీరై విలపించాడు. అక్కడఅంతా ఊపిరి మరిచిమరీవింటున్నారు.

"ఓయీ విప్రుడా, నీకు మోయలేనంత ధనమిత్తును. నీ కొడుకును నా పితృయజ్ఞంకు సమిధగా అప్పగించుము. నీకు మరి ఐదుగురు పుత్రులున్నారు. కనుక వారిని వెనక్కు రప్పించి మీకు రాజకొలువులో భృతికల్పింతును."అని ఆశలు చూపాడు. అందుకు భైరవభట్టు ససేమిరా అని తిరిగి రాజుపాదాలపై పడి కనికరించండి, కడపటి కుమారుడిపై ఆశలుపెట్టుకుని బతుకుతున్నాం. వాడే మాకు పున్నామనరకం నుంచి విముక్తుడు చేయగలడని ఆశతో ఉన్నాం అని గగ్గోలు పెట్టాడు. ఆ పక్కనే ఉన్న మంత్రి రాజు చెవిలో "సమయంలేదు ప్రభూ ఏదో ఒక నిర్ణయం చేయండి." గొణిగాడు. ఆ వెంటనే రెండోసారి జేగంట మ్రోగింది. అక్కడ ఉద్రిక్తవాతావరణం పెరిగిపోయింది.

రాజు, కులపెద్దలు గుర్రాలు ఎక్కి దుమ్మురేపుకుంటూ అడవిలోకి దూసుకుపోయాయి. గుణనందుని ఆశ్రమం ముందు ఆగాయి. అక్కడ మెరిసిపడ్తున్న నూనుగు మీసాల బాలకుడు జటకేశుడు కన్నులు మూసుకుని ధ్యానంలో ఉన్నాడు. ఎదురుగా గురువు కూర్చుని తాళపత్రాలు తిరగవేస్తున్న గుర్రపుడెక్కలు శబ్దంతో ఇటుగా చూసాడు. గుర్రందిగిన రాజుకు కులపెద్దలు "వాడే జటకేశుడు జాగుచేయక వధించండి అని అరిచి చెప్పారు. రాజు మరుక్షణం కరవాలం తీసి ధ్యానంలో ఉన్న జటకేశుని తలను నరికేసాడు. ఆ తల పక్కనే పచ్చికలోపడి పొర్లాడింది. సరిగ్గా అప్పుడే జేగంటమూడవసారి మ్రోగిన శబ్దం విన్పించింది. చుట్టూ ఉన్న శిష్యులు తేరుకుని దొరికిన





ఆయుధాలు తీసి రాజువైపు కదిలారు. వారిని గుణ నందుడు నిలువరించి నేలమీద దొర్లిన జటకేశుని తలను చేతుల్లోకి తీసుకుని "నాయనా లిప్తలో గతించితివా? నిన్ను మతపిచ్చిమదాంధుల మధ్యనుంచి తీసుకువచ్చి భయంకరమైన అడవిలో క్రూరమృగాలనుంచి కాపాడుకుని సర్వవిద్యా పారంగతున్ని చేసాను. కానీ, మతపిశాచుల నుంచి నిన్ను కాపాడలేక పోతిని. నీవు పరలోకానికి చేరేలోగా నీకీ గతి కల్పించినవారిని, ఈ రాజుతో సహ ఈ నేలమీద నూకలు చెల్లిస్తాను. నీ వంటివాడిని అకాలమృత్యువుకు ఎరచేసినవారిని నశింపచేసే వరకు నిద్రపోను."అని రోషంతో పలికి తెగిన తలను పట్టుకుని రోధించాడు.

రాజు బిక్కముఖం వేసాడు. కులపెద్దలు పీడవిరగడయ్యింది అన్నట్టు చూస్తూ "ఓరి రోగిష్టి, నీవా మాకు ఈ నేలమీద నూకలు చెల్లించునది. రాజు తలచుకుంటే నిన్ను నీ ఆశ్రమాన్ని బుగ్గిపాలు చేయగలడు. నీ నోటికూతలను విని ఎవరూ బెదిరిపోరు. మర్యాదగా రాజు పాదాలపై పడి ప్రాణభిక్ష కోరుకో! ఆ చచ్చినవాడికి ఇంత పిండాకూడు పెట్టడానికి నీవు, నీ మొండి చేతులుంటాయి." ఎకసక్కెంగా పలికాడు కులపెద్ద ఒకడు.

అంతే మరుక్షణం దర్భను మంత్రించి వదిలాడు గుణనందుడు. అందరూ చూస్తుండగా ఆ దర్భ పైకిలేచి ఖడ్గంగా మారిపోయింది. వెంటనే ఎకసక్కేలాడిన కులపెద్ద కుత్తుకను తెగవేసింది. అక్కడున్న వారంతా భయభ్రాంతులై పోయారు. నోటమాటరాకుండా పోయారు.

రాజుతో సహా అందరూ తమకు ప్రాణహాని తప్పదు అని భయపడ సాగారు. "ఓ రాజా! అదిగో నీ తండ్రి దహనం పూర్తయ్యిందని జేగంట మ్రోగింది శతవృద్ధుడైన నీ తండ్రికి సాటి పసిప్రాయంగలవాడు నాశిష్యుడా? నీవు 64 విద్యలు నేర్చినవాడవు కదా,నీకు తెలియదా బ్రాహ్మణుని వధించరాదు అని, నీవు చేయునది యజ్ఞం కాదు కేవలం పితృదహనం దానికి రాచపీనుగుకు తోడుకావాలి అని ఈ పాషాణ హృదయులు చెప్పిన

వెంటనే కత్తి ధరించి ఇలాగున గురుకులంపైపడి ఒక విద్యార్ధిని వధించ వచ్చా?గురువునైన నాకు ఆ శిష్యున్ని కాపాడుకునే నైతికబాధ్యత ఉంటుందని నీవెరుగవా? నీ తప్పిదానికి నేను నీకు విధించునది మరణదండన, నిన్నే కాదు, నీ రాజ్యంకూడా నాశనం చేస్తాను." అని కోపంతో పండ్లు పటపట కొరికాడు.

"మన్నించండి గురుదేవా, నా తండ్రి చితి ఆరేలోగా నేను ఈ కార్యక్రమం పూర్తిచేయాల్సి ఉంది. అందుకే వెనుకాముందు ఆలోచించలేదు. నా తప్పును నాకు మాత్రమే పరిమితం చేసి నన్ను వధించండి. అందుకు నేను సిద్ధం.నా పితృకర్మలు పూర్తికాగానే నాకుగా నేనువచ్చి మీచే వధింపబడతాను." అని చేతులు జోడించాడు.

"ఛీ! నీవు అలా అడగడానికి సంకోచంగా లేదు. నీ పితృకర్మలు నీచే పూర్తియ్యే వరకు నీకు గడువు కావాలి. ఈ అమాయక బాలుడు ధ్యానంలో ఉండగా నీవు అతడ్ని వధిస్తున్నట్టుగా కూడా చెప్పకుండా మృత్యువులా విరుచుకుపడ్డావు.నీలో రాజలక్షణాలే లేవు.నీవు పరమ మూర్ఖుడివి.నీ వంటివాడికి జీవించు హక్కులేదు." అని నేలమీదకు వంగి ఒక దర్భను త్రెంచాడు గుణనందుడు.నెత్తిమీద చక్కర్లుకొడ్తూ నాలుగు డేగలు కర్ణకఠోరంగా అరిచాయి.

రాజు, కులపెద్దలు నోటమాటరాకుండా నిలబడ్డారు.

గుణనందుడి చేతిలో జటాకేశుని తల కన్నులు తెరిచింది.

"గురుదేవా, మీ ఆగ్రహానికి ఆ తుచ్ఛులను బలిచేయకండి. వారిని మీరు చంపవద్దు. నేను సకల విద్యలు అభ్యసించి అడవి వదిలి నగరప్రవేశం చేస్తే నన్ను ఈ కులపెద్దలు యజ్ఞపశువును చేస్తారని వీరు విధించిన మరణశాసనాన్ని తలచుకుని భయపడ్తూ దినదిన గండంలా బతుకు తున్నాను.అట్టిగతి లేకుండా మన కులపెద్దలు ఈ రాజుద్వారా నాకు తెలియకుండానే నన్ను అంతం చేసారు. వారికి ఋణపడితిని. గురుదేవా,





సకలవిద్యలు ఓపికగా నాకు నేర్పినందుకు మీకు గురుదక్షిణ ఇవ్వకుండానే నాజీవితం ముగిసినది.కోరుకోండి చెల్లించగలను.లేకుంటే పిశాచ రూపంలో ఈ ఛాందసులు నడిచే నేలమీద తచ్చాడుతూ ప్రేతంగా మనుగడ సాగించాలి." గుణనందుని చేతిలో జటాకేశుని తల నోరువిప్పిమాట్లాడింది.

అక్కడవారంతా ఊపిరిమరిచి ఆ దృశ్యం చూడసాగారు.

"నాయనా నీవెంత జ్ఞానవంతుడవు.నీ జీవితాన్ని అతిచిన్న వయస్సులోనే అంతంచేసిన ఈ దుష్టులను క్షమించమంటున్నావు.నీవుకాదు వెలివేయబడినది వీళ్లే ఈ నష్టజాతకులే వెలివేయబడినది వీరిముఖాలు చూస్తే పంచమహాపాపాలు చుట్టుకుంటాయి. సరే, మానవుడిగా నా వద్ద పొందిన విద్యలకు మరణించి ఆత్మ రూపంలో గురుదక్షిణ చెల్లిస్తానంటు న్నావు. నాకు ఏ ఆశలు లేవు. నా ప్రియశిష్యుడవు. నీవు చెల్లించే గురుదక్షిణ రూపంలో వీరిని శిక్షించగలను. నీవు చెల్లించవలసిన గురుదక్షిణ....... నీవు ఆత్మరూపంలో ఎలాంటి దుష్టశక్తులకు లోనుకాకుండా తపమాచరించు. ఒక అభం శుభం తెలియని ఒకశూద్రునిలో నీ సర్వశక్తులను ప్రవేశపెట్టి ఈ నేలమీద అతన్ని నీడలా రక్షిస్తూ మహామేధావిగా సర్వజనులు గుర్తించేలా చెయ్యి. అట్టి శూద్రుని వలన ఈ రాజు సర్వం కోల్పోయినట్టు చేయాలి. అంతవరకు ఈ రాజు దుర్భర కష్టాలతో మనుగడ సాగాలి.ఇక ఈబ్రాహ్మలు వేదాన్ని కొన్నివేలసంవత్సరాలుగా కాపాడే జాతి అనిచెప్పుకుంటోంది.వీరిది ప్రయాస కావాలి. హిందువు అనేవాడు ఎవరైనా వేదాన్ని నేర్చుకోవాలి. ఆ వీలు కలగాలి. ఇదే జటకేశా నేను కోరే గురుదక్షిణ." అని కన్నీరుమున్నీరు అయిపోయాడు.

"చెల్లించగలను గురుదేవా, నా తల్లితండ్రులకు మీరే దిక్కు.వారికి అవసానమున దగ్గరుండి విధులు నిర్వర్తించనందుకు నన్ను క్షమించమని కోరినట్టు చెప్పండి ఇక సెలవు." చూస్తుండగానే జటాకేశుని నోరు, కన్నులు మూతపడినవి.

అప్పుడు వచ్చారు భైరవభట్టు అతని భార్య. కుమారుని మృతకళేబరం చూసి దిక్కులు పిక్కటిల్లేలా ఏడ్చారు.రాజుకు, కులపెద్దలకు శాపనార్థాలు పెట్టారు. ముక్కుపచ్చలారని బిడ్డను చంపుటకు మీకు చేతులు ఎలా వచ్చాయి. కాటికి కాళ్లు చాపుకున్న ఆ ముదుసలి రాజుచావుతో ఈ పసివాన్ని తోడుగా గుర్తించి రాచపీనుగుకు తోడును చేస్తారా? మా ఉసురు మీకు, మీ వంశాన్ని రూపుమాపుతుంది."అరిచి అరిచి తొలుత తల్లి , తరువాత తండ్రి ప్రాణాలు విడిచారు. ఆ దృశ్యాలు, అకాలమరణాలు, శాపనార్థాలు విన్నాక తాను పెద్దతప్పు చేసి భూలోక దేవతలైన బ్రాహ్మణుల చావులకు కారకుడనైతిని అని ఉగ్రసేనుడు లోలోపల దిగులుతో తలపట్టుకుని నేలమీద కూర్చుండి పోయాడు.అంతలోనే ఉగ్రసేనునికి వర్తమానం వచ్చింది."జయము జయము మహారాజా, సింహపురిని విడిచి వచ్చినట్లు తెలుసుకున్న మన శత్రువు సమరసింహుడు దండెత్తి కోటను దిగ్బంధం చేసి ఆక్రమించు కున్నట్టు వేగు అందింది."అని వార్తాహరులు చెప్పారు.ఉగ్రసేనుడు కళ్లు పెద్దవి చేసాడు. జటకేశుడు గురుదక్షిణ చెల్లిస్తున్నాడు. వృద్ధదంపతులు శాపనార్థాలు తనను బాధిస్తున్నాయి. రాజుగా క్షేత్రదర్శనానికి వచ్చి తండ్రిని, రాజ్యాన్ని కోల్పోయినదే కాకుండా భయంకరమైన బ్రాహ్మణహత్యపాతకం మూటకట్టు కుంటిని అని మనస్సులో తీవ్రంగా బాధపడ్డాడు. అక్కణ్నించి తలవంచుకుని కదిలాడు.

గుణనందుడు తన విధి తాను నిర్వర్తించాడు. భైరవభట్టు దంపతులతో జటకేశునికి దహనసంస్కారాల్లు చేసి పుణ్యనదీ తీరాన పిండప్రధానాలు చేసాడు.ఆ తరువాత మానసికంగా చాలా కృంగిపోయాడు.

ఇది అనాడు జరిగిన కథనం అని గుణనందుడి శిష్యులలో ఒకడు వివరంగా తెలిపినాడు, నాడు ఖండింపబడిన జటకేశుని ఆత్మరూపంలో ధ్యానంలో ఉండి, గురువుకు ఇచ్చినమాట ప్రకారం నిన్ననే ఈ రామన్నకు తన విద్యలు ప్రసాదించి పరలోకానికి తరలిపోయాడు ఈ విషయం గురువు





గారు మాకు వేకువజామున తెలిపారు.అందుకే అక్షరజ్ఞానంలేని రామన్న అవలీలగా తాళపత్రాన్ని చదువగలిగాడు అని చెప్పాడు.

బసవయ్యతో ఉన్నవారంతా విని ఆశ్చర్యపోయారు.


"ఉగ్రసేనుడు ఇప్పుడు రాజుగా సింహపురిలో ఉన్నాడా లేక ప్రవాసంలో గడుపుతున్నాడా?" బసవయ్య ఆత్రంగా అడిగాడు.

"అతడు మహాబలసంపన్నుడు సింహపురి తిరిగి స్వాధీనం చేసుకు న్నాడు. కానీ, చాలా కష్టాలు అనుభవిస్తున్నాడు. కరువులు కాటకాలు సింహపురిని అట్టుడికిస్తున్నాయి" అని చెప్పాడు ఆ శిష్యుడు.

"జటకేశుడు మా రామన్నకు విద్యలు దానం చేసినట్టు విషం చిమ్మే కుల పెద్దలకు తెలిసి ఉంటుందా? " బసవయ్య మెల్లగా అడిగాడు.

"మాకంటే ముందు తెలుస్తుంది. కులపెద్దలు మా ఆశ్రమం ముందు ఏర్పాటు చేసిన వారి గూఢచారికి అదేపని. మీరు మీ గ్రామం చేరేసరికి ఆ కులానికి తెలిసిపోతుంది. ఇందులో దాచాల్సింది ఏమీలేదు."

బసవయ్య మౌనంగా కొడుకు వైపుచూసాడు. అడవి వదిలి సన్నటి బాటలో పడ్డారు. శిష్యులు వెనక్కి వెళ్లిపోయారు. ఆ తరువాత ఏ ఒక్కరు ఏమి మాట్లాడు కోలేకపోయారు వారి మనస్సులో శిష్యులు చెప్పిన కథనం మనస్సులో అలజడి రేపింది. అలా మౌనంగానే ఇంటి ముఖం పట్టారు.



సహస్ర శిరచ్ఛేద
అపూర్వ చింతామణి
(జానపద ఉత్కంఠ కథా సంగ్రహము)
వచనం :
శ్రీ ఇచ్ఛాపురపు రామచంద్రం
పేజీలు : 372
బైండ్ ప్రతి వెల : 100/-
రోహిణి పబ్లికేషన్స్,
రాజమండ్రి.

# ఊరుమారిన ఉనికి మారునా ?

గ్రామం చేరిన బసవయ్య ఇంటికి వెళ్లాక, భార్యతో గురుకులంలో జరిగిన విషయం చెప్పి రామన్నను తన దగ్గరకు తీసుకున్నాడు. విషయం తెలిసిన ప్రతి ఒక్కరూ వచ్చి రామన్నను చూసిపోసాగారు. ఆనోట ఈనోట జటకేశుని కథ పదేపదే చెప్పుకోసాగారు. అందులో రామన్నకు ఆత్మ రూపంలో జటకేశుని విద్యాదానం చేయడం గురించి చిలవలు పలవలు అయ్యింది. గ్రామంలో ఎక్కడ విన్నా ఇదే కథనం. బసవయ్యకు వసుమతికి వచ్చిపోయిన వాళ్లను చూస్తే ఆనందంగా ఉన్నా, ఏదో కీడు వారి మనస్సును తీవ్రంగా కలిచి వేసింది. ఏదో రోజు సింహపురి రాజు ఉగ్రసేనుడికి తెలిసి, పగతో రామన్నను ఏమైనా చేయవచ్చు. బ్రాహ్మణబాలున్నే చంపిన పాపాత్ముడు ఆ రాజు. శూద్రునికి విద్య అంటే మండిపడే హైందవ సాంప్రదాయ పరిరక్షకులు మాత్రం విడిచిపెడతారా? వారి బారినుంచి ఎలాగైనారామన్నను రక్షించుకోవాలి. తప్పకుండా ఊరువిడిచి పారిపోవాలి. లేకుంటే ఎంతో ప్రమాదం చవి చూడాల్సిందే. బిడ్డను శాశ్వతంగా దూరం చేసుకోవాల్సి వస్తుంది అని ఆలోచించుకోసాగారు. వారికి నిద్రపట్టని పరిస్థితి ఎదురయ్యింది.

ఆ రాత్రి గ్రామంలోని వారంతా రామన్నకు ఊరిపెద్దరికం అప్ప గించాలని నిర్ణయానికి వచ్చారు. తనకు వద్దు అని రామన్న చెప్పినా వినలేదు. రచ్చగెలిచిన నీవు ఊరికి పెద్దరికం స్వీకరించి తీరాల్సిందే అని చెప్పారు.

అదేరాత్రి అంతా నిద్రపోయేవేళ ఊరినుంచి దూరంగా పోవాలి లేకుంటే రామన్నకు ఇలానే పదవులు గౌరవాలు వచ్చి పడ్తునే ఉంటాయి. ఈ సుగంధం దశదిశలు వ్యాప్తి చెందుతాయి. కనుక తప్పకుండా ఎంత త్వరగా ఊరువదిలితే అంతమంచిది. అర్ధరాత్రి వేళ రామన్నను లేపి బయల్దేరారు. రామన్న వారికి ఎదురు చెప్పలేదు. తెల్లవారేసరికి చాలాదూరం వెళ్లిపోయారు. బయల్దేరేటప్పుడు కొన్ని పాడి పశువులను మాత్రమే తోలుకుని





పోసాగారు. కొన్ని మేకలు పెరటి కొట్టాంలో విడిచి పెట్టేసారు. అక్కడ ఒక ఆకుపై రాసారు. బర్రెలను ఎవరెవరికి ఇవ్వాలో ఆ ప్రకారం పంచేయమని రాసాడు బసవయ్య.

ఉదయం అయ్యేసరికి మేకలు అరవసాగాయి. ఇరుగుపొరుగువారు ఏ నక్కలో కొట్టాంలో దూరాయని వచ్చిచూస్తే అక్కడ వారికి కన్పించింది బోసిపోయిన ఇల్లు. అయ్యో బసవయ్య పారిపోయాడు. అక్కడేదో తాళపత్రంపై రాసిన రాతలు చదివేందుకు ఆ గ్రామంలో ఎవరికి చదువు రానందునపక్క గ్రామంలోకిపోయి అమ్మవారి గుడిపూజారిని కలిసి పత్రం చూపించారు. ఆ పూజారి చదివి ఆశ్చర్యపోయాడు. రామన్న రాసిన రాతలో మర్మం తెలిపాడు.

"అయ్యా పొన్నూరు గ్రామపెద్దలారా, రామన్న తనతో తీసుకు పోవల్సిన పాడిపశువులను తాను తీసుకుపోయాడు. అవి అతడి కుటుంబాన్ని సాకేందుకు పనికి వస్తాయని ఆశతో అలా చేసాడని వివరించాడు. మిగిలిన మేకలు అన్నీకలిసి 9 ఉన్నాయంట. వాటిని పేదరికంతో అలమటించేవారికి ఇవ్వాలని ఉన్నా, వారి సంఖ్య 96 మంది, కనుక వారికి పంచడం కుదరదు. గ్రామంలో ప్రతి ఒక్కరు ఈ 9 జీవులను కలిసి సాకాల్సిందిగా కోరు తున్నాను. అవి 96 సంఖ్య పెంచుకున్న వెంటనే సమానంగా తలా ఒకటి పంచుకోవాలి. ఇందుకు గ్రామ పెద్దలు పూర్తిగా సహకరించి పెంచేందుకు ముందుకు రావాల్సిందిగా కోరుతున్నాను అని రాసాడయ్యా రామన్న." చెప్పాడు పూజారి.

" రామన్న వంటి ఉత్తముడు చెప్పినది మనం విధిగా పాటించాలి. అతడికి మహామహుల దీవెనెలున్నాయి. అంతటివాడికి మన గ్రామ పెద్దరికాన్ని కట్టబెట్టాలని మనమంతా అనుకుంటే కాదని మనల్ని వదిలిపోయినా అతడి ఆదేశం మనకు శిరోధార్యం. ఆయన ఆశించినట్టే ఆ మూగజీవాలను సాకి, సంఖ్యను పెంచి పంచుదాం" అని గ్రామపెద్దలు ప్రకటించారు.

'ఇలా ఎందుకు రాసాడు ఆ రామన్న. ఇందులో మర్మం ఏముంది అని కొంతమంది పెద్దలు ఆలోచించి "మేకలు సంఖ్య పెరిగాలంటే చాలాకాలం పడ్తుంది. అంతాకలిసి సాకాలంటే కలిసి కట్టుగా ఉండాలి. ఒకడు ఇటులాగితే మరొకడు అటులాగుతాడు. అంతా కలియడం జరిగే పనేనా?" అని ఆశ్చర్యంగా పూజారిని ఒక పెద్ద అడిగాడు.

"అదే రామన్న కిటుకు. అతడికి గ్రామాధికారాన్ని కట్టబెట్టినవారు అతని మాటకు ఎంతవిలువ ఇస్తారో చూడాల్సిఉంది. అదిగాక అతడి వలన కొన్ని ఇబ్బందులు మీకు తప్పవు. అటు హిందూమత పెద్దలవలన, అటు రాజు ఉగ్రసేనుని వలన కనుక మీరు ఒకేమాట, ఒకే బాటగా సాగాలి. తగవులు పొరపొచ్చాలు మీ మధ్య ఉండరాదు. సమానంగా గొర్రెలను పంచుకున్నప్పుడు తాను తప్పక వెనుదిరిగి వచ్చి పెద్దరికాన్ని వహిస్తాను అని చెప్పకనే చెప్పాడు మీకు ఒక పరీక్ష పెట్టాడు" అని వివరించాడు పూజారి.

అంతా ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. అతడిలో ఇంత ఆలోచన ఉందని మాకు తెలియదు. సరే,చచ్చీచెడి కలిసే ఉంటాం అని వెను దిరిగారు. ఇలా గ్రామంలోకి అడుగుపెట్టారో లేదో అక్కడ పలువురు చుట్టుప్రక్కల గ్రామాలవారు రామన్న దర్శనానికి వచ్చి ఉన్నారు. విషయం తెలిసి ఆ గ్రామస్థులను తిట్టుకున్నారు. అంతటివాడిని వదులు కున్నారా? అతడి వలనే మీ గ్రామానికి పేరువచ్చింది. లేకుంటే సొమ్ములు (గోవులు) కాసుకునే మీకు గుర్తింపు ఎలా లభించేది అని దుయ్యబట్టి పోయారు.ఆ గ్రామం తీర్ధయాత్రగా మారిపోయింది. రామన్న గురించి అలా ప్రచారం ఎక్కువై వస్తునే ఉన్నారు. కొందరు రామన్న వదిలిపోయిన మేకల్ని కొనుగోలు చేసేందుకు తాపత్రయపడేవారు. చాలా ఎక్కువధర చెల్లించి కొనుగోలు చేయడానికి ముందుకు వచ్చేవారు. ఒకటి రెండు అమ్మితే వచ్చిన అధికధరతో మరిన్ని మేకలు కొని ఆ మందలో కలిపారు ఆ గ్రామస్థులు. ఇలా యాదవులు కలిసికట్టుగా ఆ తవ్యాపారం చేసారు. వారిమధ్య ఐక్యత మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగిపోయేది. అందుకే విడి పోయేందుకు సుముఖంగా ఉండేవారు కాదు.





రామన్న వసించే పిన్నెలకగ్రపురం (కాలంతో బాటు ఈపేరు కూడా రూపాంతరం చెందుతూ పోతుండేది. పిన్నెలకగ్రపురం తరువాత పిన్నెల పురం ఆ తరువాత పిన్నంటిపురం చివరికి పిన్నింటిపేట అయ్యింది. ఎక్కువగా యాదవుల నివాసంగా ఉండేది. పలుసంస్థానాల పశువులు మేతకు ఈ గ్రామంకు తీసుకు రాబడేవి. (చూలుతో ఉన్నప్పుడు ఈ గ్రామవాసుల వద్ద మేపుకు తీసుకువచ్చి కొన్ని నెలలు ఉంచేవారు. దూడలు పుట్టేవరకు పశువులను సాకేవారు.ఈ ప్రక్రియను మేతకు పంపాం అంటుండేవారు) అదే నేటి పిన్నింటిపేట శ్రీకాకుళం జిల్లాలో ఉంది. నాటినుంచి ఉర్లాం సంస్థానాధీశులు ఏలుబడిలో ఉన్నంత వరకు ఆ గ్రామంలో మందమేకల్ని సమానంగా పంచుకునేందుకు అంతా కలిసి మందను అన్నివిధాల సాకేవిధానం కొనసాగుతూ ఉండేది. పంచుకోవడం అనేది జరిగేది కాదు. అంతాకలిసి పెంచేవారు. పండుగలకు పబ్బాలకు ఆ మేకల్ని తినేవారు. కొన్నిజబ్బులు వచ్చి చనిపోతూండేవి. ఎప్పుడు పంచుకునేట్టు సంఖ్య ఉండేది కాదు. ఏరోజు సమానంగా పంచుకోగలమో ఆ రోజు విడిపోదాం అనుకునేవారు. ఒక్కోసారి మేకలు సంఖ్య గణనీయంగా పెరిగితే, ప్రజల సంఖ్య ఆ సంఖ్యతో సమానంగా ఉండేది కాదు. హెచ్చుతగ్గుదలతో ఉండేవి. యాదవులు మేకలు సంఖ్యపెరిగిన మరుక్షణం పంచుకున్ననాడు రామన్న వచ్చి మనల్ని అన్ని విధాల ఆదుకుంటాడని ఆశతో ఉండేవారు. రామన్న తను పుట్టిన గ్రామాన్ని ఏనాడైతే వదిలేసాడో ఆ తరువాత మరి సందర్శించ లేకపోయాడు.)

రామన్నను ఎలాగైనా తీసుకురావాలి అని ఆశతో మొత్తం పిన్నింటిపుర ప్రజలు ఉండేవారు. అందుకు కొంతమంది దశదిశలు బయలుదేరి వెళ్లారు. ఎక్కడా వారికి రామన్న ఆచూకి లభించలేదు. కానీ అతడి న్యాయమైన తీర్పులు పలుగ్రామప్రజలు చెప్పుకోగా వింటుండేవారు. తీరా పరుగులు తీసి అక్కడికి వెళ్తే అక్కడ కన్పించేవాడు కాదు. ఈవిధమైన దోబూచులాటలో మిగిలిపోయారు.

రామన్న గ్రామం వదిలిపోయిన ఆరునెలలకు ఒక వింత జరిగింది. దిండిగల్లు నవాబు ఒకరు రామన్నను వెతుక్కుంటూ వచ్చాడు. అతడు ఇద్దరు ఖైదీలను తనవెంట బంధించి తీసుకువచ్చాడు. వందలాది గుర్రాలు మీదసైనికులు, ఏనుగుమీద నవాబు వచ్చి గ్రామం వెలుపల విడిదిచేసారు. గుడారాలు వేసుకుని ఉన్నారు. నవాబు పంపగా ఒక సైనికుడు వచ్చి"అయ్యా గ్రామపెద్దలారా! మీ ఊళ్లో రామన్న అనే న్యాయనిపుణుడు ఉన్నాడంట అతడిని తక్షణం మా నవాబుగారు కలవాలని ఉత్సాహపడ్తున్నారు. వారెక్కడ ఉంటారో తెలుపండి వెళ్లి కలుసుకుంటారు."అని వినయంగా అడిగారు.

"నవాబులే వచ్చారంటే మేమంతా ధన్యులం, కానీ మా రామన్న మమ్మల్ని విడిచి వెళ్లిపోయి ఆరుమాసాలయ్యింది. ఎక్కడున్నాడో తెలియదు. మీ నవాబు గారి కోరిక తీర్చలేకపోతున్నందుకు విచారిస్తున్నాం."గ్రామపెద్ద ఒకడు ఏది దాచకుండా నిజమే చెప్పాడు.

"చుప్ ఏమిటా తలపొగరు సమాధానం.రామన్నను కలియడానికి కొన్నివేల మైళ్లదూరం ప్రయాణించి వచ్చిన నవాబుకు ఉత్తచేతులతో పంపాలను కుంటున్నారా? అతడు వెర్రిమొర్రి నవాబు. మొత్తం గ్రామంలో ఒక్కడ్ని వదలడు. కత్తికోకండగా నరికిపోగులెడ్తాడు. ఏమి చేస్తారో ఏమో రామన్న వచ్చి తీరాలి, నవాబుతో మాట్లాడాల్సిందే.నేను వెళ్లి రామన్న బయల్దేరి వస్తున్నాడు అని చెప్తాను. లేకుంటే మీరు చెప్పిన నిజం చెప్తే, నా తల నేలమీద పొర్లాడుతుంది." చెప్పి నిష్క్రమించాడు.

గ్రామం మొత్తం గజగజలాడిపోయింది. ప్రాణాలు అరచేతపెట్టు కుని కొంపా గొడ్డు వదులుకుని పారిపోదామంటే అతి చిన్న గ్రామం. ఏవైపు నుంచి వెళ్లినా కన్పించి తీరుతారు. అసలే ఆ వెర్రి నవాబు కళ్లలోపడితే ఇంకా ఏమైనా ఉందా? చంపి పాతరేస్తాడు.అని తలలు పట్టుకున్నారు.

వారిలో ఒకడు ఒక ఉపాయం చెప్పాడు. 'ఇలా కూర్చుంటే నవాబు ఆగ్రహానికి మనమంతా బలికాకపోము.కనుక అడవిలో ఉన్న రామన్న గురువు గుణనందుడిని కలుసుకుందాం.అతడికి చెప్తే ఏదో రకంగా మనల్ని





కాపాడక పోడు. అయితే, పూర్వంలా అతడు అడవి లోపల లేడు. నదికి అవతల ఒడ్డుపైనే చిన్న ఆశ్రమం నిర్మించుకుని ఉన్నాడు.'

మాటకారితనం ఉన్న నలుగురు బయల్దేరారు. గుణనందుని కలుసు కుని విషయం విన్నవించారు. శాంతం విన్న అతడునవ్వి "నాయనలారా రామన్న ఉన్నాలేకున్నా అతడు వెడుతూ విడిచిపెట్టినది మీగ్రామంలో ఏమున్నా,ధర్మపరిరక్షణ చేస్తుంది కనుక మీరు ఎలాంటి ఆందోళన చెందకుండా తిరిగి వెళ్లిపోండి. జరగాల్సిన మంచి మీకు జరుగుతుంది." చెప్పి ధ్యానంలోకి వెళ్లి పోయాడు.బిక్కముఖాలు వేసి వెనుదిరిగారు. ఇదేమిటిరా ఇలా అంటున్నాడు.ఏమి కాకుండా చెప్పి పంపేసి కన్నులు మూసుకున్నాడు అని చాలా బాధపడ్తూ బయల్దేరాడు.

అప్పటికే నవాబు నాలుగుసార్లు కబుర్లుపెట్టాడు. రామన్న గురువు గారిపద్దకు అడివిలోకి వెళ్లారు పచ్చేస్తున్నారు అని చెబుతూ వచ్చారు గ్రామపెద్దలు. అడవినుంచి తిరిగి వచ్చిన వారు చెప్పినది విని హతాశు లైయ్యారు. రామన్న వదిలిపోయిన వాటివలన ఈరోజు గండం గట్టెక్కు తుందా? ఆకులు తిని వృక్షజాతిని నాశనం చేసే మేకలు వదిలి పోయాడు. అవి ఎందుకు పనికి వస్తాయి. కనీసం నవాబు మందిమార్బలం తినడానికి కూడా చాలనన్ని మేకలు. రోగిష్టి గురువు మనల్ని గండం గట్టెక్కించలేదు. సరికదా,మన సమస్యను మరింత జటిలం చేసాడు అని బాధపడ్డారు. అంతలోనే మళ్లీ నవాబు బంట్లు వచ్చారు."అయ్యా ఎక్కడ రామన్న జరూర్ తీసుకురమ్మన్నారు.మరి ఆగేది లేదు, లేకుంటే నవాబు వారే స్వయంగా వచ్చేస్తామంటున్నారు. ఆయన రాక మీకు ఇబ్బంది కల్గించవచ్చు. ఏనుగు మీద వస్తారు. దారిలో ఎలాంటి అడ్డంకులున్నా వాటిని మేము తొలిగిస్తాం. అంటే గుడిశెలు ఇరుకు సందులుంటే కొట్టిపారేస్తాం. రోగిష్టులు, మర్యాద తెలియనివాళ్లు ఎదురయితే నిర్ధాక్షణ్యంగా ఏరివేస్తాం అంటే ఖతమ్ చేస్తాం." అని చెప్పి తొందరపెట్టారు.

"ఇదిగో వచ్చేస్తున్నాం.మరి క్షణమాగం మీరు నవాబు సన్నిధిలో ఉండండి మేము మీ వెంటపడి వస్తాం." చెప్పి పంపేసారు.ఆ వెంటనే

తలలు పట్టుకున్నారు. ఇదెక్కడ గొడవరా బాబు రామన్నను క్షణాల్లో ఎక్కడ్నించి తీసుకురాగలం. అతడెక్కడో ఉన్నాడో తెలిసిచావదు. భలే చేసాడు. మన పీకలమీదకు వచ్చింది వ్యవహారం." అని గ్రామపెద్దలు భయంతో ఏడ్వసాగారు. అప్పుడు ఆఊరి గ్రామదేవత పూజారి కలుగచేసుకున్నాడు." ఏడిస్తే సమస్య తీరదు. ఆ వచ్చిన నవాబుకు ఆ వెనుక మందికి రామన్న ఎవరో తెలియదు. కనుక ఈ ఊళ్లో ఆ ఈడు కుర్రాడిని తీసుకుని వెళ్లి చూపండి. అతడు ఏమైనా అడిగితే, మీరు లోగొంతుతో వివరించారంటే ఆ కుర్రాడు అదే చెపుతాడు. నవాబుకు అనుగుణంగా చెప్పేయండి అతడు మెచ్చి వెళ్లిపోతాడు. దీనికి ఇంతగా బాధపడనవసరంలేదు." ఉపాయం చెప్పాడు. ఒక్కసారి అక్కడున్న గ్రామపెద్దలకు మనస్సు అంతా ఆనందంతో నిండిపోయింది. "ఇలా చెప్పిఉంటే ఆ దిక్కుమాలిన గురువును మా తలమీద పెట్టుకుని పూజించేవాళ్లం. రామన్న మిగిల్చిపోయినవాటితో మీ పనులు కాగలవు అని చెప్పిపొమ్మన్నాడు. రామన్న మిగిల్చినవి మేకలు మాత్రమే, వాటి వలన ఏమవుతుంది? మేఁ అని అరుస్తాయి. అసలే నవాబు దానికితోడు వాడికి వీసమెత్తు వికారం ఆవగింజంత సెకారం, వేపకాయంతా వెర్రి ఉందంట.వాడు మేకల అరుపుతో వాడికున్న మూడు వెర్రితనాలతో మన మీదకు ఏ కత్తో కటారు పట్టుకుని దిగిపోతాడు.మనం చాలా బాధపడి అడవిలో గురువును కలిస్తే అతడు అడిగేవాడు చెప్పేవాడికి లోకువ అన్నట్టుగానే వ్యవహరించాడు అందుకే మన పెద్దలు ఊరకే అన్నారా?" గ్రామ పెద్దల్లో ఒకడు రాగాలు తీసాడు.

పూజారి నవ్వి "ఆయన చెప్పినది నిజం. ఆ మేకలను తీసుకుని నవాబు వద్దకు వెళ్లండి.మీరు సునాయాశంగా బయటపడతారు. అందులో ఏదో మర్మం ఉండి ఉంటుంది." చెప్పి వెళ్లిపోయాడు.

రామన్న వదిలివెళ్లిన మేకలను వెంటనే నీళ్లతో తడిపి వాటి మూపులపై ఎర్రని ముక్మాల్ గుడ్డలు వేసి, వాటి కొమ్ములకు రంగులు





అద్ది బయల్దేరారు. రామన్న వేషం వేసినది మరో యాదవబాలుడు గంగన్న. తలపాగ, నుదుట కస్తూరితిలకంతో అందంగా అమాయకంగా ఉన్నాడు. అందరూ కలిసి నవాబు సన్నిధికి చేరారు.

"వారెవాహ్ భలేగున్నాడు న్యాయ్‌పరిరక్షక్, అరే మేకల్ తోల్కుని వస్తున్నాడు. ఇదేమి చిత్రం? ఇవి బుద్ధిహీనుల్ పెంచేజీవుల్ వీటిని రామన్న పెంచుకుంటున్నాడు. అలా అయితే కొన్నాళ్లకు బుద్ధిమాంద్యంతో న్యాయం మరిసి పోతాడేమో?" నవాబు ఆ వస్తున్న వారిని చూసి అన్నాడు. అందుకు ఆ వెనుక ఉన్నవారంతా "నిజమే పాదుషాజీ! తమరు చెప్పినది నూటికి నూరుపాళ్లు జరిగి తీరుతుంది. అసలు మేకల్ని పెంచడం చెరుపు ఇటు పచ్చని చెట్టుకు హానికరం, అటు మానవుడి బుద్ధివికాసానికి గొడ్డలిపెట్టు. తమరు ఆజ్ఞ ఇవ్వండి ఆ మేకల్ని ఖతమ్ చేసి ఆ రామన్న బుద్ధిని పరి రక్షిద్దాం." ముందుకు వచ్చాడు ఒక సర్దార్ అతడి చేతిలో ఖడ్గం తళతళ మెరిసిపడింది.

అప్పుడు వారితో బాటున్న ఒక వృద్ధ పారశీకకవి వారించి "జఁహాపనా ముందు వారిని రానీయ్యండి. మనకి విషయం ఏమీతెలియదు. అసలు ఆ మేకలకు ముస్తాబు చేసి ఎందుకు తీసుకువస్తున్నారో తెలియదు. ఎటు చూసినా, ఇక్కడ అన్నీ విశేషాలే. ఎక్కడైనా న్యాయాన్ని పరిరక్షించేవాళ్లు అనుభవజ్ఞులు, పైగా వృద్ధులు ఉంటారు. మరి ఇక్కడ ముక్కుపచ్చలారని బాలుడు న్యాయాన్ని నాలుగుపాదాలా నడుపుతున్నాడు."

"లెస్సాపల్కితివి కవీ, పరికించి చూద్దాం. ఈ సర్దార్‌డు నేను ఇలా అన్నానో లేదో అలా తల్వార్ తీసిందు, మేకల్ని ఉసురు తీస్తానని సిద్ధపడ్డాడు. అసలు పాగల్ వీడే.అరే చుప్ బద్మాష్ తల్వార్ ఒరలో దోపుకుని ఆ వెనుకకు పో! నిన్నుచూసి మేకల్ బెదిరిపోయి జరా ఉరికిగలవ్."నవాబు చిరుబురు లాడాడు

రామన్న పరివారం వచ్చారు. నవాబు పాదాలకు గంగన్న మ్రొక్కాడు.

"బహుత్ అచ్ఛా పెద్దలయందు ఎంత గౌరవం. ఇలా ఉండాలి అన్నీ బావున్నాయి. ఈ మేకల్ ఒంటికి పదిశేర్ల సితకల్ ఉండవ్.వాటినివెంటేసుకుని రావడం ఏమిటి ?"నవాబు పకపకమని నవ్వుతూ అడిగాడు.

గంగన్న జవాబు ఏమిచెప్పాలో తెలియక తలదించాడు. ఆ పక్కనే ఉన్న గ్రామపెద్ద లోగొంతుతో చెప్పాడు."ఆ మేకలు తొమ్మిది రసాలు కలవి. వాటిని ఒక యోగి ఇచ్చాడు అని చెప్పు." ఆ మాటలను తూ.చ. తప్పకుండా చెప్పాడు.

"మేకల్‌కి రసాలుంటాయి. ఏమిరసాలు, వాటితో నీకూ ఏమి పని పడతాది రామన్న. బోలో " నవాబు రెట్టించాడు.

పాదుషాజీ నా వద్ద మేకలు చాలా గొప్పవి. నవరసాలతో ఆయోగి ఇచ్చారు. ఒకటి కరుణ, రెండు శృంగారం, మూడు హాస్యం నాలుగవది రౌద్రం,ఐదవది భయానకం, ఆరవది భీభత్సం, ఏడవది అద్భుతం, ఎనిమిది శాంతం, తొమ్మిదవది వీరం వీటికి ప్రతిరూపాలు.కనుకనే నేను ఈ తొమ్మిది విధాలుగా తీర్పులు ఇవ్వగలుగుతున్నాను. వీటిలో ఉంది మర్మం" చెప్పాడు గంగన్న.

"అచ్చా ఎంత సిత్రం సూపించినావ్ బేటా రామన్న. శేరుసితకల్ ఉండే మేకల్‌లో ఇంత శక్తి పెట్టినాడా ఆ అల్లా. నేను చాలా దూరం నుంచి ఎండల్ పడి హొచ్చినా, హొచ్చినందుకు మంచి ఇంతల్ సూసినా, అరే ఈమేకల్ మీకీ ఇంత రాణింపు తెచ్చినాయ్.సరే బేటా విషయాన్కి వద్దాం.ఇద్దరు దొంగల్‌ని పట్టి బందిఖానాలో మూసి ఉంచినాం.దొంగల్ అంటే మామూల్‌గా కాదు. ఖతరనాక్ చోర్. ఈళ్ల సేతుల్లో తల్వార్ పడితే నెత్తురు సూడంది తల్వార్ దించేది లేదు.అరే, వో బద్మాషోంకో లావో" నవాబు చెప్తుంటే అంతా నిశ్శబ్దంతో చూడసాగారు.క్షణాల్లో ఒక శిబిరంలోంచి ఇద్దరిని తీసుకువచ్చారు.

ఇద్దరు దొంగలు గొలుసులతో బంధింపబడినందున వారి దేహాలపై చినుగుల చొక్కా,గొలుసుల రక్కులవలన మానని గాయాలతో నీరసించి ఉన్నారు. వారు రామన్నను చూసి పకాలున నవ్వారు.

"అరే చుప్, రామన్నను చోటా బేటాలా చూడకండిబే, పాగల్ నవ్వులు మరోసారి చూస్తే మీకు ఖతమ్ చేస్తా"నవాబు అరిచాడు.





ఆ దొంగల్లో ఒకడు రామన్న (గంగులు)తో మాట్లాడాడు."అయ్యా చాలా రాజ్యాల్లో మేము దొంగతనాలు చేసాం. ఎక్కడా దొరకలేదు. కానీ ఈ నవాబు ఒక దండోరా వేసాడు. బేషరతుగా దొరికిపోతే, మీకు వెయ్యి వరహాలు ఇస్తామన్నాడు.ఆరోజు మేము ఒక మసీదులో ప్రమాణం చేసుకున్నాం. ఈరోజు నుంచి ప్రాణంపోయినా దొంగతనాలు, దోపిడీలు హత్యలు చేయం, నవాబుకు లొంగిపోయి అతడు ఇచ్చే వెయ్యి వరహాలతో మక్కా యాత్రకు పోయి అక్కడ శేష జీవితం గడుపుదాం అనుకున్నాం. అప్పటికి దోచినది ఒక్క కాసుకూడా మిగుల్చుకోకుండా పేద ముస్లింలకు, దానమిచ్చి చిల్లిగవ్వలేకుండా వెళ్లి లొంగిపోయాం. ఈ నవాబు మమ్మల్ని చిత్రవధకు గురిచేసి బందిఖానాలో పడేసాడు. మేము ఇది అధర్మం అని చెప్పాం. మాకు తెలిసి దొంగతనాలతో జీవించాం. ఇప్పుడు మేము చేయునది పాపం కనుక ఆ అల్లాను వెతుక్కుంటూ మక్కా వెళ్లిపోతాం వదిలేయమన్నాం. కానీ, ఈతడు మా వాదనలో న్యాయం ఎంతుంది అని విచారించి మరణ దండన విధించాడు. అందుకు మేము అభ్యంతరం చెప్పాం. పోనీ మమ్మల్ని ఉరితీసే ముందు చివరికోరిక తీర్చాలి కనుక ఒక్కసారి మక్కాకు పంపండి. ఆ యాత్రచేసుకుని లొంగిపోతాం. అప్పుడు ఉరితీయండి అని కోరాం. మీరు దొంగలు నమ్మను అని చెబుతున్నాడు. ఈతడు పదిమంది న్యాయ నిపుణులను అడుగుతాను. అందులో ఏ ఒక్కరు కాదన్నా మక్కాకు పంపేది లేదు అని చెబుతున్నాడు.రామన్న మరోవిషయం మేము తలచుకుంటే ఈ గొలుసులు మాకు ఆపలేవు. క్షణాల్లో పారిపోగలం.కానీ,అల్లాకు మాటిచ్చాం. తప్పుడుపని చేయం."

"చుప్‌రే బద్మాష్ మార్‌దాలూంగా ఉత్తముల్లా సెప్తార్. ఎన్ని ఖూనీలు ఎంతమంది పీకల్ తీసారుబే. అవి వదిలి అచ్చా ఆద్మీలా సెప్తార్ బే.ఇదే ఆఖరు ఇప్పటివరకు 9మంది న్యాయపరిరక్షకుల్ ముందు నిలిపినా, జరూర్ ఖతమ్ సేయుండ్రి అని చెప్పినారు బేటా రామన్న. మరి నీవేమి సెప్తావ్." నవాబు ప్రశ్నకు గంగన్న తలగోక్కుకున్నాడు. గ్రామపెద్దలవైపు చూసాడు. వాళ్లు బిక్కముఖాలు వేసారు. వారికి ఏమి చెప్పాలో తెలియలేదు.

గంగన్నకు మంచి ఉపాయం తోచింది.“ నవాబుజీ, మీ వంటివారు నాలాంటి అల్పునికి, చిన్నవాడికి న్యాయం అడగాలా? మీకు ఈ తొమ్మిది మేకలను ఇస్తాను. వాటిని మీతో తీసుకు వెళ్లిపోండి. మీరే ధర్మనిర్ణయం చేయగలుగుతారు. మేకలు మీ అధీనం అయిన మరుక్షణం మీరు ధర్మం మరువరు. నేను చెప్పానే నవరసాలు. వాటిల్లో ఈ దొంగలకు భీభత్సం, భయానకంతో బాటు వీరము గల మేకలు వలన మీరు తగు న్యాయం చేయగలరు. ఈ దొంగలు భీభత్సం, భయానకానికి చెందిన వారు. మీరు వీరము వలన తగు తీర్పునిస్తారు అని చెప్పాడు.

“మేకల్ని పుచ్చుకుని వాటికి వేరే శిబిరం ఏర్పాటు చేయండి.”అని లేచి మేకల్ని ఆత్రంగా తడిమాడు నవాబు. అప్పుడు అతడికి ఏదో తెలియని ప్రశాంతత శరీరాన్ని తాకింది. సైనికులు మేకల్ని తీసుకున్నారు. నవాబు వెంటనే దొంగలకు గొలుసులు విప్పి ‘మీరే మన దిండిగల్లు వెళ్లే వరకు ఈమేకల్ని సాకుతూరావాలి. అలా వస్తే మీకు శిక్ష రద్దుచేస్తాను. మక్కా పంపుతాను. మేకల్ని పట్టుకోగానే ఇలా ఇన్సాఫ్ ఇవ్వగలిగాను. ఠీక్‌హై బేటా,. మంచి సితకల్ మేకల్ ఇచ్చినావ్ అప్పుడే మేరా సిర్‌కో దిమాగ్ పరేషాన్ అయ్యింది. వెయ్యిరూకల్ ఇచ్చి ఆ ధాకూలిద్దరికి మక్కాదారిన వదిలితే పోలా! సరే, బేటా నీకు చూడగలిగాను.నీది మేకల్‌కి సంరక్షక్ అయ్యాను.ఇదిగో ఇవితీసుకో వెయ్యి గోవులు.వీటితో మీగ్రామం కళకళలాడి పోవాలి. ఇక్కడ నా సర్దార్ ఉండిపోయి, గోవులను చుట్టుప్రక్కల రూకలికి కొనితెచ్చి మీకు అప్పగిస్తాడు.” ఒక పత్రంలో వెయ్యి గోవులు బహుమతిగా ఇచ్చినట్టు రాయించి ఇచ్చాడు.ఆ గ్రామవాసులు చాలా ఆనందించారు.

దొంగలు ఇద్దరు “గంగన్న కాళ్లమీదపడి చిన్నవాడివి నీవేం చెబుతావు అనుకుని నవ్వాం.తీరా,మాకు మక్కావెళ్లేందుకు అవకాశం చూపావు. మా నవాబుజీ మనస్సు మారిపోయింది.”అని సంతోషం వ్యక్తం చేసారు.

గంగన్నకు కూడా అంతా అయోమయంగా ఉంది.తాను ఎలా ఇన్ని మాటలు చెప్పగలిగానా అని తర్కించుకోసాగాడు.





నవాబు అతడి పరివారం వెళ్లిపోయారు. ఒక్కసారి గాలివాన వచ్చి వెలిసినట్టు అయ్యింది. గంగన్నకూడా రామన్న అంతవాడయ్యాడు. బాగానే తీర్పుఇచ్చాడు. అని ఆ ఊరి ప్రజలు చుట్టుముట్టారు.

గంగన్న నవ్వి “నామీద ఏదోశక్తి ఆవరించి ఈ పని చేయించింది. తప్పితే నాకు నవరసాలు అంటే ఏమిటో తెలియదు.ఏదో చెప్పాను. మేకలను తీసుకు పొమ్మన్నాను.ఇవన్నీ ఎలా నా తలలోకి వచ్చాయో తెలియదు. అంతా అయోమయంగా ఉంది.ఏ క్షణం నేను రామన్నను కానని తెలిసి పోతుందో అసలే ఆ నవాబు పరమక్రూరుడులా ఉన్నాడు. ఎప్పుడు చూసినా తల తెగేస్తాను అని అంటున్నాడు. ఇకమీదట నేను ఇలా నటించలేను.” అని తలకు కట్టుకున్న పాగా ముడివిప్పేసాడు.

“చెయ్యికాలగానే కుండ ఎత్తేయకూడదురా, పోనీలే నీకష్టం వృధా పోలేదు.వెయ్యిగోవులు వస్తున్నాయి.అవి చేతికి వచ్చేవరకు ఎవరూ ఆ సర్దార్ ముందు బోలాగా ప్రేలవద్దు.”గ్రామపెద్దలు గంగన్నను తలనిమిరారు. ఊరంతా ఆ విషయంలో కలిసికట్టుగా ఉంటామని నిర్ణయించుకున్నారు.

వారంలోగా వెయ్యిగోవులు పిన్నెలపురానికి తరలివచ్చాయి.

గోవులను సమర్పించిన సర్దార్ వారినుంచి రశీదు పుచ్చుకుని తిరిగి వెళ్లి పోయాడు. ఒకటా రెండా వెయ్యిగోవులు రావడంతో గ్రామంలో ఎక్కడ చూసినా గోవులే ఉన్నాయి. 9 మేకలకు ఇన్ని గోవులు రావడం ఇదంతా మర్యాదరామన్న వలనే, అంత అదృష్టం నుదుట రాసుంది కనుకనే మనం ఆ నవాబువద్ద మన తెలివి ప్రదర్శించకపోయినా ఇన్ని ఆవులు మనకు దక్కాయి.ఆ దొంగలకు విముక్తి లభించింది. ఎటుచూసినా మంచే జరిగింది. అడవిలో ఉన్న గుణనందుడు చెప్పినది నూటికి నూరుపాళ్లు నిజం అయ్యింది.ఇక అతన్ని ద్వేషించవద్దు అని అనుకున్నారు.

# ఆ వృత్తికి రెండు వైపులా పదును

బసవయ్య దంపతులు కళింగ నగరానికి దూరంగా వెళ్లిపోయారు. తమవెంట తెచ్చుకున్న గోవులను తీసుకుని రామన్న దగ్గర్లోగల కొండలకు వెళ్లాడు. అక్కడ దీర్ఘదత్తుడు అనే బ్రాహ్మణ ధన్వంతరి రామన్నను చూసి "నాయనా అలా చెట్టుకింద కూర్చునే కంటే నాతో కలిసి ఈ ఆకులు కొన్ని ఏరిపెట్టవా? ఈ ఊరి ధనికుడు ఒకడు తెలియని రోగంతో బాధపడ్తున్నాడు. ఎవరికి తప్పినా నాకు తప్పదు కదా, ఏదో లేహ్యం లేదా మూలికల చికిత్స చేయాలి" అని పిలిచాడు.

రామన్న వెళ్లి ఆకులు ఏరసాగాడు. "ఇంతకీ ఆ ధనికుడు ఏ రోగంతో బాధ పడ్తున్నాడు. ఈ ఆకులు చాలా సాదాసీదావే, వీటిలో ఎలాంటి రోగనిరోధక శక్తి లేదు. గుణరహితమైనవి. మరి ఎందుకు వీటిని ఏరు తున్నారు." అని అడిగాడు.

"ఓరికుర్రా ఏమిరా ఆకులు ఏరమన్నానని ఆ చిన్నసాయం కోరితే సర్వం తెలిసినవాడిలా ఆకుల రసాల గురించి చెబుతున్నావు. నీవెంత? నీ పశువుల కాపరితనం ఎంత? నా ఖర్మకాలి వైద్యశాస్త్రం గురించి నీతోనా నేను ముచ్చటించునది. కటకటా ఎంత హీనపడితిని, అందుకేరా పెద్దలు చెబుతారు తక్కువ జాతి వాడికి నిక్కులు హెచ్చు. నీ హీనబుద్ధి చూపితివి." అని రుసరుస లాడిపోయాడు. అందుకు రామన్న నవ్వాడు. "ఓ మహానుభావా నేను ఏమంటిని, రోగివేయాల్సినప్రశ్న వేసితిని, ఏమీ అడగకుండానే మీరు నూరిఇచ్చుమందు సేవించడు కదా, ఈ ఆకులు కేవలం పడిశమునకు తప్ప ఎందుకు పనికిరావు. మీరు రోగపీడితునికి ఇస్తామంటున్నారు. నాకు తెలిసినంత వరకు ఈ ఆకులు అసలు మందుగా పనికిరావు.

"ఛీ నీచవాచాలా ఏమి కూస్తివి. వైద్యవిద్వాంసుల ఇంటపుట్టిన ఈ కిళాంబాచార్యులనా నీవు వేలెత్తిచూపినది. ఆయుర్వేదం పుట్టింది, పెరిగింది మా వంశంలోనే, గరళముతో మందు ఇవ్వగలం. ఇంకనూ నీవెరుగవేమో





రాయభార మంత్రంతో పొడిచి వెళ్లిపోయిన నాగుబామును ఎక్కడున్నా తిరిగి రప్పించగలం. ఒకసారి మాతాతలనాటి ముచ్చట గురించి చెబుతాను చెవులు రిక్కించి విను. ఏకంగా పాతాళాధిపతి తక్షకుడు అనే పాములరాజు ఒక మునిని కరిచి పాతాళమున దాగినాడు. ఈ రాయబార మంత్రంతో వెనుక్కు రప్పించి మునిదేహంలోగల విషం ఆ పాముచే పీల్పించిన చరిత్ర మాది. అంతెందుకు కేవలం వనమూలికలతో వృద్ధాప్యాన్ని మాపిన వైద్య శిఖామణులం. దేవలోక ధన్వంతరీలు అయిన అశ్వనీ దేవతలు ఒక్కోసారి మమ్ము వనమూలికల రహస్యాలు అడుగుతుంటారు. అటువంటి మమ్మల్ని ఏమి కానట్టు తీసివేస్తివి." అప్పటికే ధనికుని బంధువులు అక్కడికి వచ్చి కిళాంబాచార్యులవారి రోషంతో కోపాన్ని రంగరించి ప్రేలుతున్న మాటలు విన్నారు. వారు మరింత వినయంతో నిలబడ్డారు.

"అయ్యా అటువంటి పశుపాలకునితో తమవంటివారికి ఏమిటి? అసలే అక్కడ రోగి పరిస్థితి దిగజారిపోతున్నది. త్వరగా మందు నూరి నోటిలో పోయాలి. వెంటనే బయల్దేరి రండి." అంటూ వారు గాభరపెట్టారు.

"అయ్యా తమ బంధువుకు ఏమి రోగం అంతగా పీడించుచున్నది." అడిగాడు రామన్న. వారు ఒకరిముఖాలు ఒకరు చూసుకున్నారు. మనం హీనపరిచి మాట్లాడినా ఏమికానట్టుగానే అడుగుతున్నాడు.

"నీకెందుకయ్యా, నీతో కాలాయాపనతప్ప, ఒరిగేది ఏమీలేదు. ఆచార్యుల వారు వెంటనే ఆకులు నూరిపోయండి." అని రామన్నను ఏమీకానట్టు తీసేసి తొందరపెట్టారు. అందుకు కిళంబాచార్యులు గర్వంగా చూసాడు.

"ఓ అయ్యలారా నామాట వినండి. ఈ ఆకులు వలన మీ ఇంట బాధపడ్తున్న రోగికి మంచి జరిగేది చాలా తక్కువ కనుక ఇదిగో ఈ దుంప ఇస్తున్నాను. దీన్ని అరగదీసి దాన్ని రోగిచే చప్పరించునట్లు చేయండి." అప్పటికే ఒక మొక్కను పీకి దాని వేళ్లనుంచి ఒక ఎర్రని దుంపతీసి ఇచ్చాడు.

ఆ దుంపను ఎగాదిగా చూసి "ఓరి భడవా ఇది పందులు తినేది అయినను వీడితో మనకేమి పని? పదండిపోదాం అని కిళాంబాచార్యులు బయల్దేరాడు. అతడివెంట ఆ వచ్చినవారు పరుగెత్తారు. అందులో ఒకడు

రామన్న ఇచ్చిన దుంపను పారవేయకుండా వారివెనుక వెడుతూనే తిరిగి పరుగెత్తుకుని వచ్చి "నాయనా ఏ పుట్టలో ఏ పాముందో ఎందుకైనా మంచిది దీన్ని తీసుకుని వెడుతున్నాను. ఒకవేళ మా ఆచార్యులు నూరి ఇచ్చు ఆకురసం పనిచేయకుంటే ఈ దుంపను అరగదీసి తినిపిస్తాను. దీని గుణం ఎలా ఉందో తరువాత చెబుతాను."అని చెప్పి పరుగులు తీసాడు.

కిళాంబాచార్యులు వేసిన ఆకులరసంతో ధనికుడు మరింతగా ఆయాసపడసాగాడు. అప్పుడు ఆచార్యులు మరోలేపనం తయారీలో పడ్డాడు. అక్కడ అంతా భయంకరమైన ఉత్కంఠగా మారిపోయింది.

రామన్న ఇచ్చిన దుంపను నీటిచుక్కల మిశ్రమంతో అరగదీసి రోగి నాలుకకు రాసాడు ఒక బంధువు. వెంటనే అది పనిచేసి కొద్దిసేపటిలో మగత నిద్రలోకి జారుకున్నాడు. ఆ తరువాత లేచాక అతడు తేలికపడ్డాడు. కిళాంబాచార్యులకు రామన్న ఇచ్చిన దుంపవలన రోగికి స్వస్థత కుదిరింది అని తెలిసి మండిపడ్డాడు. అప్పటికే ఆ ధనికరోగి వెనుక బంధువులు రామన్న కోసం అడవిలో పశువులు కాచే కుర్రాడి కోసం గాలించారు. ఆ మరుసటిరోజు రామన్న వారికి దొరకడంతో ఆ ధనికుడు ఇంటికి తీసుకువెళ్ళి పళ్లెం నిండ వరహాలు పోసి ఇచ్చాడు. నా ప్రాణాలు గిలగిలలాడిపోయాయి. నీ దయవలన ఇప్పుడు తేలిగ్గా ఉంది. నీవు ఈ గ్రామాన్ని నమ్ముకుని ఉండిపోరాదు. మేము నిన్ను నీ కుటుంబాన్ని పోషించుకోగలం. ఏమంటావు?" అని అడిగాడు.

"ఏదో ఒక మూలిక వలన మీ రోగం తగ్గినంత మాత్రాన నేను పరిపూర్ణుడను కాను. కిళాంబాచార్యులు మిమ్మల్ని చాలాకాలంగా నమ్ముకుని ఉన్నారు. ఆయన పొట్టకొట్టే విధంగా నేను ఇక్కడ వైద్యునిగా మనలేను. మన్నించండి మీమాటను నేను కాదంటున్నందుకు క్షమించండి."

"రామన్న నీవు చిన్నవాడివైనా, ధర్మంగా బదులిచ్చావు. కిళంబా చార్యుడు చాలాకాలంగా మాతో ఉన్నాడు. కానీ, అతడు ధనపిశాచిలా మారి నా రోగాన్ని దీర్ఘకాలంగా చికిత్స రూపంలోకి నిలిపి ఉంచాడు. మావద్ద ఉండడానికి నీవు కాదన్నా ఆ ఆచార్యులను వైద్యునిగా మా





గ్రామంలో ఉండనీయం ఇదే మానిర్ణయం. నీవు కాదంటే వేరేవారిని తీసుకువస్తాం." అని ధనికుడు చెప్పాడు. అతడికి వంతపాడారు ఆగ్రామ వాసులు. అక్కడే ఉన్న కిళాంబాచార్యులు కోపంగా రామన్నవైపు చూసాడు.

"ఒరి రామన్న శూద్రకులమందు జన్మించిన నీకు ఈ కలికాలమందు ఎంతభోగం లభించినది. నిన్ను ఇక్కడవారు కోరుకొనుచున్నారు. ఇంకనూ జాగేల సరే అని తిష్టవేయుము. ఏదో రోజు నావలే నీకు భంగపాటు తప్పదు."ఎర్రగా చూస్తూ చేతిలో ఉన్న నూరిన మందును నేలమీదకు విసిరికొట్టాడు. అక్కడ ఉన్నవారంతా అయోమయంగా చూసారు.

"ఆచార్యదేవా! మీకు సరివాడను కాను. ఎందుకు నాపై కోపం చూపుతున్నారు. నేను మీ మార్గాన అడ్డుపడలేదు, మీ స్థానం ఆశించలేదు. మీరు దైవాంశ సంభూతులు, దేవుని తరువాత దేవుడంతటివారు. ఎందరో ప్రాణాలు రక్షించే ఆయుర్వేదానికి చిరునామా వంటివారు. మీరెక్కడ ?ఈ పశువులకాపరి రామన్న ఎక్కడ?నాకు ఆకులు తుంచమని చెప్పినపుడు ఆ ఆకులలో అంతటి గుణం లేదని చెప్పినాను. నాకు తెలిసినంతలో ఒక దుంపను తీసి ఇచ్చాను. అది రోగికి అన్నివిధాల పనికివచ్చి స్వస్థత చేకూర్చి నది. అంతకుమించి నేను చేసినది ఏమిలేదు. అందుకే వీరి అభ్యర్ధనను కాదనుచున్నాను." అన్నాడు రామన్న. అక్కడవారు చెవులు రిక్కించిమరీ వినసాగారు. రామన్న అలా చెబుతుంటే అంతా హాయిగా వినసాగారు.

"చాలించు నీ కపట ప్రేలాపన. నీవు నా పొట్టకొడితివి. నన్ను నమ్మిన వారిని నా నుంచి నీ వైపుకు తీసుకునిపోతివి. ఇంత చిన్నవయస్సులో ఇంత భారీ పథకం వేస్తివి. తెలివిగా ఏదేదో మాట్లాడుచున్నావు. నీవు టక్కరివి. ఎందుకు ఇంతహీనమైన యోచన చేస్తివి. ఈచేత్తో కొన్నివందల మంది ప్రాణాలు నా వైద్యంతో కాపాడితిని. ఈరోజు నాచేతిమీదుగా ఈ ధనికుడు కోలుకోనందున నేను ధన్వంతరిగా పనికిరాకుండా పోతిని." అని బాధపడ్తూనే అక్కణ్నించి వెళ్లిపోయేందుకు సిద్ధపడ్డాడు.

రామన్న అడ్డుపడి "నామాట వినండి. నేను ఎట్టిపరిస్థితిలోను ఇక్కడ ఉండను. మీకు తెలియదా? ఆ ఆకులు మంచివికావని మీకు తెలియదా?

కానీ, మీరు రోగిని మంచం దిగకుండా అలానే ఉంచాలనే ప్రయత్నం చేసారు. లేకుంటే మీరు తలచుకుంటే ఆ రోగం ఏపాటిది. వైద్యునికి ఉండాల్సింది ధనపిచ్చికాదు,రోగికి స్వస్థత చేకూరాలి అనే ఆలోచన. అది మీకు కొరవడింది. ఇలాంటి తప్పుడు చికిత్సల వలన మీరు అసలు మూలికల్ని మరిచిపోయే ప్రమాదం ఉంది. కనుక వైద్యంలో నిజమే ఉండాలి లేకుంటే ఇరువైపులా నష్టం. "అని చెప్పాడు.

అక్కడున్నవారు "భలే చెప్పావు రామన్న, చిన్నవాడవైనా ఆచార్యుల వారిని బాగా గుర్తుపడితివి. ఒకప్పుడు నీతితో వైద్యంచేసేవాడు ఇప్పుడు అవన్నీ అతడిలో కొరవడినవి. అదంతా మేము చేసుకున్న పాపం లేకుంటే ఇలా ఈ ధన్వంతరి మారిపోవడం ఏమిటి?"అని బాధపడ్తూ చెప్పు కోసాగారు. కిళాంబాచార్యులు కోపంతో అడ్డుగా ఉన్న రామన్నను గెంటివేసి అక్కణ్నించి వెళ్లిపోయాడు.

రామన్నను గ్రామస్థులు అంతా ఒప్పించారు. ఊళ్లో వైద్యం చేయాల్సిం దిగా కోరుకున్నారు. తప్పని పరిస్థితిలో అంగీకరించి ఇంటికి చేరాడు. ఆరోజు నుంచి చిట్కా, మూలికావైద్యం చేయ సాగాడు రామన్న. అతడికి గుణనందుదు వలన జటకేశునికి అతడి వలన సంక్రమించిన విద్యల్లో వైద్యంకూడా ఉంది. ఒకవైపు మనుష్యులకు, మరోవైపు పశువులకు రామన్న వైద్యం చేయసాగాడు.

రామన్న పేరు దశదిశలు మారుమ్రోగింది. ఊళ్లో ఉన్న కిళాంబా చార్యులు వద్దకు ఒక్కరు కూడా వెళ్లడం లేదు. దాంతో అతడు అతడి కుటుంబం రామన్నకు శాపనార్థాలు పెట్టి ఊరివిడిచిపెట్టి వెళ్లిపోయేందుకు సిద్ధపడ్డారు. మూటముల్లు సర్దుకుంటున్నవేళ నిండు సరుకులతో గూడు బండి ఒకటి వచ్చి ఇంటి ముందు ఆగింది. దాన్ని చూసి కిళాంబాచార్యులు వేదాంతిలా నవ్వాడు.తను ఇలాంటి గూడు బండి ఒకటి బాడుగకు తీసుకుని పొన్నూరు పోవాలి.ఎలాబతికేవాడిని, ఇప్పుడు ఎలా హీనపడితిని, కనీసం ఒక్కరు ఎలా ఉన్నావని అడుగుటలేదు అని వేదనగా కళ్లనీళ్లు తిప్పుకున్నాడు. గూడు బండివాడు వచ్చి వాకిట నిలబడ్డాడు.





"ఏరా నాతో నీకేంపని? ఎప్పుడు ఊరువిడిచి పోతానని తెలుసుకోవ డానికి వచ్చావా? పోక తప్పుతుందా? ఇప్పుడు అంతా శూద్రులచేతిల్లోకి పోతోందిరా నేడు ఆయుర్వేదం, రేపు వేదం వాళ్లనోట నానినా ఆశ్చర్య పడనక్కర్లేదు. కలికాలం మన గ్రహచారం రా! ఈ ఊళ్లో నేను ఒక్క ఆకుపసర పిండనురా,ఎవడు ఏమయినా ఎవడి నాడిముట్టను.భ్రష్టుపట్టిన సమాజంతో నాకేంపని? నీకేదైనా రోగం వస్తే ఆ పశువులకాపరి రామన్న ఇంటికిపో! వాడు ఏ దుంపో, కాకి రెట్టో ఇచ్చి నీచే తినిపించి నీ రోగం కుదురుస్తాడు. చివరికి ఇంట్లో నూకలు నిండుకున్నంతగా నా ఆర్థికస్థితి దిగజారిపోయింది. పదిమంది కుటుంబం ఒక్కడి సంపాదన కూర్చుని నాలుగునెలలు తింటే తరిగిపోదురా, నా ఉసురు ఆ రామన్నకు తగిలి నాశనం అయిపోతాడు. ఈ ఊళ్లోవాళ్లు దుంపధూళి అయిపోతారు.బ్రాహ్మడు ఉసురు ఊరకే పోదురా, అది పదిమంది కుటుంబాలిది."

"అయ్యా నేను ఎందుకు వచ్చానో తెలుసుకోకుండా మీకు మీరే మాట్లాడుతున్నారు.గూడుబండిలో మీకు కావాల్సిన పప్పులు,బియ్యం, ఒక వరహాలమూటను రామన్న నాకు ఇచ్చి మీకు అందజేయమన్నాడు. ఇక్కడి వైద్యంలో సింహ భాగం మీదేనట లెక్కలు కట్టి ఇచ్చాడు వివరాల పత్రం మీకు ఇమ్మని చెప్పాడు. గూడుబండిలో సరుకులు ఎక్కడ దించను. ఇలా నాలుగు నెలల కొకసారి లెక్కలు పంపుతానని చెప్పమన్నాడు." అని చెప్పి పత్రం అందించాడు. కిళాంబాచార్యుల వారికి నోటమాట రాలేదు.

పత్రం చూసి ఇదివరలో నాలుగు నెలలలో ఇంత సంపాదించలేక పోయాడు. ఇంటిలో ఒక మూల బియ్యం, పప్పులు నూనెలు దించబడ్డాయి. వరహాల మూటను చూసి ఆచార్యులు పెదాలు తడుపుకున్నాడు.ఇంటిల్లిపాది అయోమయంలో పడ్డారు."రేయ్ గూడు బండీ నేను ఊరివిడిచి పోనక్కర్లేదా? రామన్న నాకు నిజంగా ఈ భత్యాలు పంపుతుంటాడా? ఆ శూద్రునికి ఇంతటి మంచి మనస్సు ఉందా?" అని అడిగాడు.

"అతడు ముఖం చూస్తే తెలుస్తుంది.అతడిలో ఎన్నో మంచి గుణాలు న్నాయని,వెళ్లినరోగులకు ఇట్టే నయం చేస్తున్నాడు.అన్నట్టు ఈరోజు

ఉదయం మన ఊరి ధనికుడుకి రోగం తిరగబెట్టింది. వాకిట్లోవేసారు. రామన్న నాడిచూసి పెదవి విరిచి, చనిపోతాడని చెప్పాడు."

"ఆ ధనికుడికి నా ఉసుర తగిలి మళ్లీమళ్లీ చావాలి. ధనికుడట, బుద్ధిహీనుడు నా పొట్టకొట్టినవాడు పురుగులు పడిచావాలి. ఆరోజు వాడికి నా మందువలన తగ్గకపోతే నేనుపనికి రానా? అసలు ఎవరికి వైద్యం అందించడానికి కూడా పనికిరానివాడిగా నన్ను జమచేసి హీనపరిచాడురా, నా ఉసురు నా కుటుంబం ఉసురు తగిలి వాకిట్లో నాలుగురోజులు కళ్లు మూతలుపడక తులసినీళ్లు కూడా లోపలికి వెళ్లకుండా చివరికి గోమూత్రం తాగి ఛస్తాడు." అనిపెద్దగా నవ్వాడు.

ఆ మాటలు విన్న గూడుబండివాడు నిశ్చేష్టుడయ్యాడు. కిళాంబాచార్యులు తమ్ముడు లోహితాచార్యులు లోపల్నించి ఆత్రంగా వచ్చి " ఏమిటి మన ఊరి ధనికుడు అవసానంలో ఉన్నాడా? వాకిట్లో పడేసారు అంటే నోరు పడిపోయి ఉంటుంది. కాళ్లు చేతులు చచ్చుపడిఉంటాయి. ఈ నాలుగు రోజులు మంచివి కావు కనుక ఎప్పుడు ఎవడు చచ్చినా నాకు చేతినిండా పని పడ్తుంది." అని మూలనున్న వస్తువులు గాలించుకోసాగాడు. అతడు పౌరోహిత్యంలో ఉన్నాడు. ఒక పాత సంచిలో అపకర్మల గ్రంథం తాళప్రతి తులసితీర్ధం కుప్పీవేసుకుని ఆదరాబాదరాగా బయలుదేరాడు. అతడిలో యమసంతోషం కన్పించింది.

"నాయనా లోహితా,సరిగ్గా నీ పని చక్కబెట్టుకో! అసలే, ఊళ్లో చావులు బాగా తగ్గాయి. అందుకు కారణం నేను నా పసరలు, ఒక్కొక్కడూ గుండ్రాయిల్లా మృత్యుదేవతకు మొగుళ్లులా తయారయ్యారు. నెలకు నాలుగైదు చావులు లేక నీకు ఆదాయం అంతంత మాత్రమే అయ్యింది. నిన్ను నీ కుటుంబాన్ని చేరదీసి సాకుతున్నాను. ఈరోజు శూద్రపు రామన్న దయతో మన ఇల్లు ఎలాగో భత్యాలతో నిండిపోయింది. కొంపదీసి ఆరామన్న తగుదునమ్మా అని నీకుపోటీగా వచ్చేయగలడు. కసిరిపొమ్మను. కర్మకాండలు చేసేది బాపడేనని గట్టిగా చెప్పి. నువ్వు వెళ్లేది ఫలదానాలు, ఒక ఛత్రంకోసం కాదు. చచ్చేది ధనికుడాయే. బాగా అవకాశమున్న మేరకు పిండుకుని





వచ్చేయ్. మంచి పాడిగోవులు ఆరువరకు దానం పట్టు లేకుంటే ఆ ధనికుడు వైతరణీ దాటలేడు అని చెప్పి భయభ్రాంతుల్ని చెయ్యి. అప్పుడు ధనికుడు సంతానానికి భయంపుట్టి నీవడిగినది కట్టబెడతారు." నూరిపోసాడు.

గూడుబండివాడు అది విని చేష్టలుడిగిపోయి "బావుంది మీవరస. ఆచార్యులు అంటే ఏమిటో అనుకున్నాను. రోగమున్నంతవరకు మీరు పిండుకున్నారు. చచ్చాక పురోహితుడు పిండుకుంటాడా ! ఆ ఇద్దరు మీ ఇంట్లో ఉండడం భలేబాగుంది."అని లోలోపల అనుకుంటూనే బయల్దేరాడు.

లోహితాచార్యులు గూడుబండి ఎక్కాడు. ఇద్దరూ కలిసి బయల్దేరారు. 'రేయ్ నీకు అంటూ ఒక పని తగిలిందిరా నాకు ఏ పని లేదు. ఏ ఇంట శుభమో అశుభమో జరిగితే తప్ప నాకు నాపిల్లలకు కడుపునిండేదిలేదు. పోనీ మరోపనికి పోదాం అంటే మా కులం అందుకు ఒప్పుకోదు, వెలివేస్తుంది. ఆకలితో చస్తున్నాం. విన్నావుగా మా అన్న మాటలు,ఏదో ఒక రూపంలో నిన్ను నీ కుటుంబాన్ని పెంచుతున్నానని ఎలా అంటున్నాడో, తప్పదు పడాలి. ఈమధ్య అతడి గ్రామవైద్యం కాస్తా నీరుగారి పోయింది. అందుకు మా అన్నే కారణం. రోగికి తగ్గకుండా చచ్చేవరకు పిండుతాడు అదేం విధానం మనల్ని నమ్మి వచ్చినవాడిని ఇలా చేయొద్దురా అంటే నీవు ఇంటినుంచి ఫో అంటాడు. పోనీ,బయటికి వెళ్లిపోదాం అంటే ఈ పౌరోహిత్యం ఘోరంగా ఉంది. కరువుకాటకాలవలన ఎవరూ శుభకార్యాలు చేయడంలేదు. ఇక అశుభాలు వలన వచ్చేది అంతంతమాత్రం. ఇప్పుడు మా అన్న ఏకంగా ఆరు గోవులను తీసుకురమ్మన్నాడు. ఒక గోదానం చేయండి అని చెప్పగలం కానీ, ఆరుగోవులను దానం చేయండి అని ఏశాస్త్రం చూపించి చెప్పగలను. నా బతుకు కుడితిలో పడ్డ ఎలుకలా అయిపోయింది." విచారవదనంతో చెప్పాడు.

ధనికుడు ఇల్లు వచ్చేపోయేవారితో నిండిపోయింది. ఒకవైపు ధనికుడి నాడిచూసి ఈ రాత్రిలోగా అతడు చనిపోతాడని రామన్న చెప్పాడు. రాత్రిపోతే దోషం తప్పదు కొన్ని శాంతులు చేయాలి అని చెప్పాడు. మరో వైపు జ్యోతీష్యులు దోషాలకు ఏమి చేయాలో చెబుతున్నారు. ఆ సమయంలో

వెళ్లాడు లోహితాచార్యులు. అతడు వెంటనే కడివెడు ఏడ్చాడు."ఊరికి పెద్దాయన ఇలా వాకిట పడున్నాడు. అయ్యో ఇక ఊరికి దిక్కువరు" అని బాధపడ్తూనే తులసీ తీర్థం పోసాడు.ధనికుడు ఒక్క గుక్కకూడా మింగలేకపోయాడు.ఆ వెంటనే కన్నులు నిలబడిపోయాయి.అతడి ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసి పోయాయి. ఒక్కసారి గొల్లుమన్నారు. "రాత్రి వరకు లేడు. చనిపోయాడు రామన్న చెప్పినది అబద్ధం. అతడు పిల్లచేష్టలతో ఏదో చెప్పాడు. మనం ఏదో విన్నాం. సరైన సమయానికి లోహితాచార్యులు వచ్చాడు లేకుంటే ప్రాణాలు పోయే క్షణాన తులసీతీర్థం అందేది కాదు. పెద్దదోషం మనకు చుట్టుకునేది. ఇక అంతా ఈయన చేతులమీదుగా చేస్తే సరిపోతుంది."అక్కడ సమీపబంధువులు అనుకున్నారు. లోహితా చార్యులు ఎనలేని ఆనందంతో గుండెలనిండుగా గాలిపీల్చు కున్నాడు. ఒక్కసారి అందరిని చూసి "నామీద భారం వేసాక నేను ఈయన్ని స్వర్గం చేర్చకుండా ఉండను. దోష నివారణ చేయాల్సిందే.''అని ధనికుని బంధువులకు చెప్పాడు.ఆ మాటలకు అక్కడ వారు తలలు ఆడిస్తున్నవిధానం గూడుబండివాడు చూసి అలా ఉండి పోయాడు. ఆ వెంటనే లోహితాచార్యులను చూసి జాలిపడ్డాడు. ఏవృత్తిలో అయినా లోపాలు మోసాలుతప్పవు. ఎలా ఆరుగోవులను సాధించగలడో అని చూడసాగాడు.

ధనికుని శవాన్ని దహనానకి తీసుకుపోయారు.చాలా దానాలు చేయించాడు. కొన్ని దానాలు తానే పుచ్చుకున్నాడు.ఎట్టకేలకు ఆరుగోవులను దానంగా తీసుకుని సాయింత్రానికి ఇంటిముఖం పట్టాడు. అన్న కిళాంబా చార్యులు చాలాసంతోషించాడు."రాముడివెంట నడిచే లక్షణుడివిరా, చెప్పినది చెప్పినట్టే చేసావు. పాడి ఆవులు ఇంట ఉండాలిరా! గుమ్మపాలు తాగి ఎన్నాళ్లు అయ్యిందో " అని హడావుడిగా ఇంటివెనుక పాడి ఆవులను కట్టి సంతృప్తి చెందాడు.

ఆ మరుసటిరోజు కిళాంబాచార్యులవారి ఆడుబిడ్డకు తీవ్రమైన కడుపునొప్పి వచ్చింది. దాంతో కూతురికి కొన్నిమందులు ఇచ్చాడు గుణం కన్పించలేదు. పిల్ల తెలివి తప్పిపోయింది. ఎన్ని మూలికలు నూరి వేసినా





ఫలితం లేకపోయింది.ఇంటిల్లిపాదికి కాళ్లుచేతులు ఆడలేదు.తలలు పట్టుకుని కూర్చున్నారు. అప్పుడు ఎవరో రామన్నపేరు చెప్పారు. ఎలాగైనా అతనికి చూపించండి. అతడు ఈ మధ్య చాలావరకు రోగులకు స్వస్థత చేకూర్చుతూనే ఉన్నాడు అని చెప్పారు. కిళాంబా చార్యులకు తలతీసినంత పనిలా ఉంది రామన్నను పిలవడం ఎంత హేయం. అయినా తాను సరైన వైద్యం చేయలేక పోవడానికి కారణం ఏమిటి? తీవ్రంగా ఆలోచించాడు. చివరికి తానే ఎలాగోలా తనబిడ్డను కాపాడుకోవాలి అనే ఆలోచనతో తిరిగి వైద్యం చేయసాగాడు. కడుపునొప్పికి ఇతరత్రా ఏ మూలికలు గుర్తుకువచ్చినా వాటిని తెచ్చి నూరి ద్రవరూపంలోకి మార్చి ఆమె నోట్లోపోస్తున్నాడు.

పాపం ఆడబిడ్డ నిలుగుడ్లువేసుకుని అలానే ఉండిపోయింది.

ఊరంతా అక్కడికి చేరారు. వైద్యుడు తన కూతురుని రక్షించుకోలేక పోవడంతో అది మామూలు జబ్బుకాదు.అంతుపట్టని జబ్బు అని గుసగుసలాడుకోసాగారు. కొందరు పనిగట్టుకుని "రామన్నను పిలవండి ఏపుట్టలో ఏ పాముందో" అని చెప్పిచూసారు. మరి కొంతమంది ఇలా జాగుచేస్తే పిల్ల దక్కదు అని చెప్పారు.

"ఆ రామన్న నన్ను మించిన వైద్యుడు కాదు.వాడిని పిలవడం కంటే నా బిడ్డ మరణాన్ని స్వాగతిస్తాను. శూద్రుడు నా కూతురుని తాకరాదు. నాకున్న పట్టింపును వదులుకోను.''కిళాంబాచార్యులు కోపంగా బదులిచ్చాడు. నీవు మూర్ఖుడిలా మాటలాడకు. వైద్యుడు దేవునితో సమానం మరి నీవు మహిళలమీద చేతులు వేస్తున్నావు. నీవు వైద్యుడవే! అందుకే నీకు ఆ హక్కు లభించింది. లేకుంటే ఈపాటికి చంపేసేవాళ్లం.ముందు నీ నడత బుద్ధి మార్చుకో!" అని నాలుగు చీవాట్లువేసారు.

రామన్న సరిగ్గా అప్పుడే వచ్చాడు."గురుదేవా మీ ఆడకూతురికి బాగులేదని విన్నాను.అయ్యో ఇంతచిన్న వయస్సులో ఇంతటి బాధను ఎలా భరిస్తుందో,గుర్రపువాతం వచ్చినదానిలా ముఖవల్లికలు ఎలా దగ్గరయ్యాయో, ఇలా ఉంటే ఈమెకు వాతం చేర్చ వచ్చు." అని బాధవ్యక్తం చేసాడు.

"నా కూతురి అనారోగ్యంతో చాలా మానసిక వేదన అనుభవిస్తున్నాను. నీ కపట ప్రేలాపనలతో నన్ను బాధించకు.వెళ్లిపో! పిల్లదానికి వచ్చినది కడుపు నొప్పి నీవన్నట్టు వాతం కాదు."అని రామన్నకు బదులిచ్చాడు కిళాంబాచార్యులు.

కిళాంబాచార్యుల భార్య వచ్చి "నాయనా రామన్న నా కొడుకు లాంటివాడవు. ఈయన మాటలను పట్టించుకోకుండా నీవు చేయదగ్గదేమైనా ఉంటే చేసి నా పిల్లప్రాణాలు కాపాడు. "అని చేతులు జోడించింది. ఆమెను కిళాంబా చార్యులు వారించలేదు. ఆమెను తప్పుపట్టలేదు. అతడు ఒక విధంగా తాను చేయలేనని చేతులు ఎత్తేసాడు. చివరికి తలపట్టుకుని కూతురి తలవద్ద కూర్చుండి పోయాడు.

రామన్న వెంటనే ఏ మందులు నూరి ఇచ్చారో కిళాంబాచార్యుల శిష్యులను అడిగి తెలుసుకుని వెంటనే ఆయన ఇంటిలో వాడకుండా ఉన్న ఒక ఔషదాన్ని తీసుకుని "గురుదేవా ఎందుకు దీన్ని వాడలేదు. ఇది వాడుంటే ఈపాటికి అమ్మాయిలేచి కూర్చునేది, ఆయుర్వేదంలో ఎవరైనా నేర్చుకునేది తొలిపాఠం దీన్నేకదా!" అని చెప్పి నాలుగు చుక్కలు అమ్మాయి నోటిలో పోసాడు. కొద్దిసేపటిలో నాలుక చప్పరించింది. ఆ వెంటనే ఆమె పెదాలను తడుపు కుంది.అలా క్షణక్షణానికి ఆమెలో పెనుమార్పులు కలిగాయి.అక్కడ వారంతా దిగ్భ్రాంతిగా చూసారు.అలా ఆ పాపలో మార్పులు చూసిన కిళాంబాచార్యులు తనకు తెలియకుండానే రామన్నకు చేతులు జోడించాడు."నా బిడ్డ బతుకుతోంది నువ్వు దేవుడివిరా! నన్ను మన్నించు,అనరాని మాటలు అన్నాను." అని బావురమన్నాడు. అక్కడ ఒకవైపు సంతోషం మరోవైపు అంతా క్షణాలు లెక్కిస్తున్నపిల్ల ఎలా లేచింది అని ఆశ్చర్యంతో చూడసాగారు.

కొంతసేపటికి పిల్ల లేచింది.అతికష్టంమీద కన్నులు తెరిచింది. ఆమెలో నీరసం నిలువెత్తుంది. అందుకు కారణం, తొలుత తండ్రి ఆమెచే తాగించిన మూలికలతో తయారయిన రసాలు, లేహ్యాలఫలితం.అవి ప్రాణాంతకాలుగా మారిపోయాయి.వాటికి విరుగుడు తయారుచేసి ఇచ్చాక





రామన్న పాపను ఇంటిలోకి తీసుకుని వెళ్లమన్నాడు. అప్పుడు అక్కడ చేరిన గ్రామస్తులు "అయ్యా రామన్నా, చావుకు దగ్గరలో ఉన్న అమ్మాయి ఎలా బతికింది. ఏ మందు వేసావు. తలపండిన ఆచార్యులు చేయలేనిది నీవు ఎలా చేయగలిగావు." అని ప్రశ్నించారు.

కిళాంబాచార్యులు అలా చూడసాగాడు. రామన్న అందరి మధ్య తిరుగాడుతూ "అయ్యా వాస్తవాన్ని చెప్పకతప్పదు. ఆచార్యులువారు తనకు వచ్చిన వైద్యంతో ఆ పాపను బతికించుకునేవాడే కానీ, ఈతడు రోగికి స్వస్థత చేకూరే మందులను ఇవ్వకుండా రోగాన్ని చాలాకాలం అలానే ఉండేట్టు చేయడం దీర్ఘకాలంగా తాను చికిత్స చేస్తూ తన పబ్బం గడుపు కోవడంలో ఉన్నందున అసలు నయంచేసే మందులను మరిచిపోయి నకిలీమందులనే గుర్తుపెట్టుకునే స్థితికి వచ్చాడు. అందుకే ఇంటిలో కళ్ళ ముందుకన్పించే ద్రావకమందును వదిలి ఏవేవో నూరి తనబిడ్డకు పోసాడు. ఆ మందు ఆమెకు చివరినిముషంలో పట్టించకపోతే ఈపాటికి ఆమె స్వర్గాన సభలు తీర్చేది.ఇది రోగులు ఎడల ఈతడు చేసిన పెద్దనేరం. మన భుక్తికి, అవసరాలకు ధనం కావాలి.అందుకు అడ్డతోవలు ఇంత హీనంగా తొక్కరాదు. కానీ, వైద్యుడు, జ్యోతిష్యుడు,న్యాయమూర్తి వీరియెడల ప్రజలకు గుడ్డినమ్మకం ఉంటుంది.అంతమాత్రాన వారు దాన్ని తమకు అనుకూలంగా మలుచుకోరాదు. కనుక కిళాంబాచార్యులు ఇప్పటికైనా ప్రజలను కాపాడే వృత్తిలో అంకితభావంతో పనిచేయాలి.లేకుంటే ప్రజలతోబాటు తన కుటుంబాన్ని ఇలానే పనికిరాని హానికరమైన మందులు ఇచ్చి చంపు కుంటాడు.ఈరోజు ధనికుడు రాత్రి సమయాన చనిపోతాడు అని నేను చెప్పినందున ఊరి పౌరోహిత్యం చేసే లోహితాచార్యులు నామాట కాదనడానికి తాను తెచ్చిన కాశీగంగను ధనికుని నోటిలో పోసాడు. ఆ మరుక్షణం ధనికుడు చనిపోయాడు. ఆ గంగ చాలాకాలంగా ఆచార్యులవారి ఇంట అటకమీద ఉంది. ఆ నీళ్లు పాడయినవి. చుక్క నీళ్లు మింగలేని సమయాన నోరు బలవంతంగా తెరిచి పోస్తే నాళాల్లోకి పోయి పాడయిన నీటి ప్రభావం చూపింది.చనిపోతే, ఏకంగా ఆరుగోవులను దానంగా

పుచ్చుకుని వెళ్లాడు.ధనికుడు కనుక ఆరు గోవులేకాదు వంద గోవులు అయినా దానంగా ఇవ్వగలరు. ఈ విధానం వలన రేపు సామాన్యులు ఆరుగోవులనేసరికి భయపడిపోతారు.ఇక హైందవ సాంప్రదాయంలో అతి ముఖ్యమైన గోదానం వెలవెల బోతోంది.అందుకే వెనుకటి పెద్దలు అన్నారు. చచ్చేంతవరకు,వైద్యుడు చచ్చాక పురోహితుడు వదలరు,దానికి ఉదాహరణగా కిళాంబాచార్యులు, లోహితా చార్యులు ప్రవర్తన ఇక్కడ స్పష్టంగా ఉంది. ఇకనైనా ఈ ఇద్దరు అన్నదమ్ములు మారాలి." అని అంతమందిలో చెప్పాడు.

"నాయనా రామన్న నీవు చెప్పినది అక్షరసత్యం. నేను రోగికి సరైన మందు వేస్తే లేస్తాడు.అలా చేసేవాడిని, స్వస్థత చేకూరిన రోగి వెంటనే లేచి ఒస్ ఇంతేనా వైద్యం అని ఏదో తృణమో పణమో ఇచ్చి పోయేవాడు. అది నాకుటుంబాన్ని పెంచుకోవడానికి సరిపడేది కాదు. అందుకే, ఈ అడ్డత్రోవలు తొక్కేవాడిని.నీవన్నట్టు నాలో అసలు మందు వివరాలు మరుగున పడిపోయి పనికి మాలిన హానికరమైన మందులు గుర్తుండి పోయాయి.ఇక ఇలాంటి తప్పుడు పనులు చేయను.నీకారణంగా జ్ఞానోదయం అయ్యింది ప్రజాక్షేమం ఆశించి జీవించగలను. నావద్ద ఉన్న వైద్యగ్రంథాలను తిరిగి చదువుకుని మునుపటిలా నావృత్తికి న్యాయం చేస్తాను.నా బిడ్డను కాపాడితివి;నీకు జన్మంతా ఋణపడి వుంటాను." అని అన్నాడు.

రామన్నకి అక్కడివారంతా జేజేలు పలికారు.లోహితాచార్యులు తాను దానంగా పుచ్చుకున్న గోవులను తీసుకుని ధనికుని బంధువులకు తిరిగి ఇచ్చేందుకు సిద్ధపడ్డాడు.కానీ, ధనికుని కుమారులు ఒకసారి దానంగా ఇచ్చిన వాటిని తీసుకోం. అందునా బ్రాహ్మణులకు ఇచ్చాం కనుక ఏవిధంగా చూసుకున్నా మా తండ్రికి పుణ్యమే. అతడు మంచిగతులకు పొందుతారు అని సంతృప్తి వ్యక్తంచేసారు.





# పులిపాలుతో చికిత్స

రామన్న ఆయుర్వేద చికిత్సతో చాలామందికి స్వస్థత చేకూరడంతో అతడి కీర్తి దశదిశలు వ్యాప్తిచెందింది.చుట్టుప్రక్కల ఉన్న ధన్వంతరీలు వచ్చి కిళాంబాచార్యులను కలుసుకుని "అయ్యా ఇలా ఒక శూద్రపువాడు మన వృత్తిని స్వీకరించి, మనకెవ్వరికి బతికే దారిలేకుండా చేస్తున్నాడు. మీరు ఎర్రగా చూస్తే ఎంతటివాడైనా కాలిబూడిద కావల్సిందే మరి ఎందుకు వదిలేసారు అని అడిగారు. అందుకు కిళాంబాచార్యులు నోరుమెదపకుండా కొంతసమయం మాత్రమే ఊపిరిబిగబట్టాడు. ఆ తరువాత "ఏముంది నా వైద్యం నా బిడ్డను రక్షించలేక పోయింది. ఒకదశలో చనిపోయేస్థితిలో ఉన్న నా కూతురు రామన్నచే రక్షింపబడింది.కనుక నేను రామన్నను ప్రత్యక్షంగా ఏమిచేయలేను.నన్ను వదిలేయండి. అతడు అడ్డంకిగా ఉంటే మీరు ఏమైనా చేయవచ్చు. అతడు పశువులకాపరి కొండలలో ఉంటాడు. మాటువేసి రెండోకంటికి తెలియకుండా హతమార్చవచ్చు.చుట్టుప్రక్కల ఎవరుచూసినా మిమ్మల్ని ప్రాణాలతో వదలరు అదిమాత్రం గుర్తించుకోండి." అని హతమార్చే పథకం వారు కోరకుండానే చెప్పాడు.ఆ మాటలకు వారు దీర్ఘంగా ఆలోచించారు.

"ఆచార్యులు వాడిని మాచేతులతో చంపేటంత పాపులం కాము. విను ఇక్కడికి దగ్గరలో ఉన్న సాలిగ్రామం సంస్థానాన్ని ఏలే రాచమల్లు తెలియని రోగంతో చాలాబాధపడ్తున్నాడు.ఇప్పుడు మంచంమీద ఉన్నాడు. అతడికి ఆస్థాన వైద్యుడు శంభులింగం పట్ల నమ్మకం ఎక్కువ.అక్కడకూడా రామన్న గురించి జనాలు పదేపదే చెప్పుకుంటున్నారు. అక్కడ మేము చిచ్చుపెడతాం. రామన్న అక్కడికి వస్తే ఇక్కడికి మరిరాడు, ఈ భూమిమీద మరి ఉండడు, అలాంటి ఏర్పాటు చేస్తాం.అక్కడ ఆస్థాన వైద్యుడు కూడా రామన్నమీద గుర్రుగా ఉన్నాడు. పైగా పరమ క్రూరుడు" అని తమలో దాగిన విషాన్ని విరజిమ్మారు.

"ఏది చేసినా ఆచితూచి చేయండి మాటరానీయ్యద్దు. రామన్న వయస్సులో బుడుతడు కానీ. వాడికి తెలియనిదిలేదు. వాడికి ఏదో అతీతశక్తి అండగా ఉంది" అని కిళాంబాచార్యులు జాగ్రత్తలు చెప్పాడు.

గుంపుగా వచ్చిన ధన్వంతరిలు వెంటనే వెళ్లిపోయారు.

వారం తరువాత ఒక పల్లకి. నలుగు గుర్రాలపై సాలిగ్రామం సంస్థానం నుంచి వచ్చి రామన్న ఇల్లు ఎక్కడ అని వాకాబు చేయసాగారు. అంతా కలిసి చూపారు. రామన్నను కలుసుకుని తక్షణం బయల్దేరండి. "మాఏలికకు ప్రాణాలు పోయేటంత అనారోగ్యం కమ్మేసింది. మిమ్మల్ని మా ఆస్థానవైద్యులు తక్షణం తీసుకుని రమ్మని కోరారు. ఆలస్యం అనర్థాలకు దారితీస్తుంది అని చెప్పారు."

"మీ ఏలిక మంచం పట్టినా ఓపికతో మాట్లాడుతున్నాడా లేక తెలివితప్పి పడి ఉన్నాడా?" అని రామన్న వారిని ప్రశ్నించాడు.

"నిక్షేపంగా మాట్లాడుతున్నా ఆరోగ్యం సరిగ్గాలేదు. ఆయనకు రావల్సిన రోగం కాదు ఎంతోబలంగా ఉండేవారు. లేవలేకపోతున్నారు. వయస్సు చాలా చిన్నది. ఎంతకాలమో బతకాల్సినవారు." అని అన్నారు.

"శంభులింగం శాస్త్రం తెలిసినవారు ఆయన చేయలేంది నేనేం చేయగలను? పైగా నన్ను రప్పించేది మీ ఏలికకాదు.ఆస్థానవైద్యుడు కనుక నేను రాలేను.మీరు వెళ్లండి."చెప్పి పంపేసాడు.వారు తిన్నగా కిళాంబాచార్యుల వద్దకు వెళ్లి విషయం చెప్పారు. ఒకవేళ రామన్న కాదంటే మీవద్దకు వెళ్లి ఎలాగైనా రామన్నను పంపేట్టు చేయమన్నారు మా శంభులింగంవారు అని చెప్పారు. వెంటనే ఆచార్యులు వారిని వెంటేసుకుని వచ్చి రామన్నను బతిమాలి వారి వెంట పంపాడు.

అంతాకలిసి సాలిగ్రామం చేరుకున్నారు. అక్కడ సంస్థానం దిగులుతో ఉంది. ఏలిక పరిస్థితి ఘోరంగా దిగజారిపోసాగింది. శంభులింగం చాలా లేపనాలతో, లేహ్యాలతో, మూలికలతో, ఔషధ మొక్కలరసాలతో, ఒకటేమిటి ఆయుర్వేద మందులతో ప్రాసాదం నింపేసాడు.కానీ,ఏమందు పని చేయడం





లేదు.ఏలిక భార్యలు నలుగురు శోకసముద్రంలో ఉన్నారు.ప్రజలు కన్నీరు మున్నీరు అయ్యారు.ఆ సమయాన రామన్న అక్కడకి చేరాడు.

అంతా రామన్న వైపు చూసారు. ఇంత చిన్నవాడా చికిత్స చేసేది. తలపండినవారే ఏమి చేయలేకపోతుంటే ఈ బుడుతడు ఏమిచేయగలడు అని ఆశ్చర్యంగా చూడసాగారు.వైద్యుడు శంభులింగం ఎదురొచ్చి నఖశిఖ పర్యంతం చూసాడు.

"రామన్న అంటే నీవేనా?చూసావా ఏలిక ఏ స్థితిలో ఉన్నారో? శరీరాన్ని రంపపు కోతకోసే వాతరోగాలకు గురయినారు.మందులు పనిచేయడంలేదు. నీవు చేయగల వైద్యం ఉంటే అది చేయడానికి లేదు. ఎందుకు అంటే ఏమందు వదలకుండా ప్రయోగించడం జరిగిపోయింది. కావాలంటే చూడు."అని చెప్పాడు శంభులింగం. అతడు బాగా వృద్ధాప్యంలో ఉన్నాడు అసహనంగా చెప్పాడు.

రామన్న రోగిని చూసాడు. కన్నుల్లో జీవాలు నిలుపుకున్నట్టున్నాడు చేతులు జోడించాడు."నన్ను ఎలాగైనా రక్షించు నాయనా! నీ శ్రమను నేను గుర్తిస్తాను.నీకోసం విన్నాను.నా ఆస్థాన వైద్యుడుపై కొండంత నమ్మకంతో ఉన్నాను. కానీ, ఆయన ఏమి చేయలేకపోయారు. నీవేమైనా చేయగలవా?" అని చేయి అందించాడు.ఆ చేతిలో పటుత్వంలేదని గుర్తించాడు రామన్న.

అంతవరకు ఊపిరిబిగబట్టి చూస్తున్న శంభులింగం "రామన్న నీవు కూా ఏలిక శరీరపరీక్షలు చేసి కాలాయాపన చేయవద్దు. ఒకేఒక మార్గం ఉంది. నీకు కొంత సాయుధబలగాలను ఇస్తాను. ఇది పులులు సంతానంతో కళకళ లాడే కాలం.నీవు వెళ్లి పులిపాలు లేదా పులిజున్ను తీసుకువస్తే దాంతో నీ చేతుల మీదుగా లేహ్యం చేయించి ఏలికకు పట్టిద్దాం. దాంతో లేచి కూర్చుంటారు.ఎవరు పులిపాలు తీసుకువస్తారో వారే లేహ్యం నూరాలి.అదీ ఏ బలశాలో పనికిరాడు. వైద్యం తెలిసినవాడై ఉండాలి. అందుకే వెళ్తే నువ్వు లేదా నేను.నేను వృద్ధుడనయ్యాను.కనుక అడవికి పోలేను." అనిచెప్పాడు.

అంతా రామన్న వైపు చూసారు. అతడు సన్నగానవ్వి " పులిపాలతో వైద్యం. సరే,నాకు బలగాలు ఎందరో అక్కర్లేదు. కేవలం ఒక్కరే చాలు. రెండు గుర్రాలపై వెళ్లి చీకటి పడేలోపల వస్తాం. మీరు లేహ్యానికి సంబంధించి పనిలో ఉండండి. నాకు తోడుగా ఇక్కడి కొత్వాలును పంపండి." అని కోరాడు.

కొత్వాలు గుండెల్లో దడ ప్రారంభం అయ్యింది. పులిఒండలకు వెళ్లాలంటే ప్రాణాలమీదకు తెచ్చుకున్నట్లే ఇదేమిటి చుట్టుతిరిగి నామీదకు మృత్యువు పంజా విసిరిందని లోలోపల బాధపడ్తూనే పరిసరాలను భయంగా చూడసాగాడు. అతడి అంతర్మధనం గ్రహించిన వెంటనే, శంభులింగం పక్కకు తీసుకునిపోయి "ఓయీ నీవు పులిపాలంటే భయపడ్తున్నావు. నీవు జాతిగుర్రం ఎంపికచేసుకో ఆ రామన్నకు ఒక రోగిష్టి గుర్రం ఇవ్వు. వాడు ఒంటరిగా పులి ఒండలోకి వెడితే ఆమడదూరంగా ఉండు. ఏమాత్రం పులులు తిరగబడితే నిర్దాక్షణ్యంగా వెనుదిరిగి రామన్నను ఆపులుల మధ్య విడిచి వచ్చేయ్. ఇదే నీప్రాణాన్ని కాపాడుకునే చిట్కా. తనకు మాలిన ధర్మం వద్దు. ప్రాణం తీపి ఎవరికి ఉండదు" అని అన్నాడు.

"మరి పులిపాలు తెస్తేకదా మన ఏలిక బతికేది." ఆశ్చర్యంగా అడిగాడు కొత్వాలు.

"నిజమే, సాగితే జల్లెళ్లతో నీళ్లు మోయించవచ్చు. నీవెందుకు అంత త్యాగం చేసి ఆ కుర్రవానితో నీప్రాణాలు బలిపెట్టనక్కర్లేదు. అంటీముట్టనట్టు వ్యవహరించు. రామన్న పులిపాలు సేకరణలో మరణించినా మనకు నష్టమేమి లేదు. మనిషిని తిన్న పులులు పిచ్చిపట్టినట్టు అయిపోతాయి. అవి కొన్నాళ్లుపాటు స్థిమితం కోల్పోతాయి. అంటే, వాటిలో అనుకోని చర్యలు జరుగుతాయి. అవి నివసించే ఒండల్లో వాటి పాలు కారిపోయి స్ఫటికాల్లా గట్టిపడి పోతాయి. వాటిని తరువాత మనం సేకరించుకోవచ్చు. దాంతో లేహ్యం నూరుకోవచ్చు." అని శంభులింగం అన్నాడు.

రామన్న వారిద్దరిని క్రీగంట చూసాడు. క్షణాల్లో ఏర్పాట్లు చేయబడినాయి. గుర్రాలపై రామన్న, కొత్వాలు బయల్దేరారు. ఇద్దరు అడవిలోకి





ప్రవేశించారు. అక్కడ మేకలను కాస్తున్న వాడిముందు రామన్న గుర్రం నిలిపాడు.

"నీకు పులులంటే భయంలేదా? ఇంత దూరంగా వచ్చి నీ మేకల్ని మేపుతున్నావు. ఒక వేళ అవి వస్తే ఎలా ఎదుర్కొంటావు?"

"మరింత దూరంగా వెడితే పులులు కన్పిస్తాయి. ఈ వైపుకు రావు. ఆ మధ్య ఒక మనిషిని తిన్న పులులు పిచ్చిపట్టినట్టు ప్రవర్తించాయి. చాలాదూరం వెళ్లి పోయాయి. ఉన్న భయం తోడేళ్లదే. వాటిని ఈ చేతికర్రతో అదిలించు కోగలం."

కొత్వాలు రామన్న ప్రశ్నిస్తున్న తీరును చూడసాగాడు.

"సరే, నాకు కొంచెం మేకపాలు కావాలి. ఇదిగో ఈ కొబ్బరిచిప్పలో పిండి ఇవ్వు." తన సంచిలోంచి చిప్ప, రెండు వరహాలు తీసి ఇచ్చాడు.

చిప్పలో పాలు పిండి ఇచ్చాడు. కొత్వాలకు అర్థంకాలేదు. "పులిపాలు అంటే మేకపాలు సేకరిస్తున్నాడు. వీటికోసం అయితే ఇంతదూరం ఎందుకు రావాలి. కబురెడితే కడివెళ్లకొద్దీ తెచ్చి ఇచ్చేవాళ్లున్నారు." మనస్సులో తర్కించుకుని లోపలదాచుకోలేక "ఇదేమిటి రామన్న నీవు మేకపాలు సిద్ధంచేసావు. కొంపదీసి వీటినే పులిపాలు అని చెబుతావా? ఇలా అయితే మా ఏలిక రోగం నయం అవుతుందా? ఇందుకు నేను సమ్మతించను. ముందా పాలు నేలపాలు చేసేయ్. పదా లోపలికి వెళ్లి స్వచ్ఛమైన పులిపాలు తీసుకుని వద్దాం. ఇందులో ఎలాంటి మర్మాలు వద్దు. మీ వైద్యులతో ఇదే చికాకు రోగుల రోగాలతో ఆడుకుంటారు." కోపంగా అన్నాడు.

రామన్న యిలా వివరించాడు. "కొత్వాలు ఆయుర్వేదంలో పులిపాలు ప్రస్తావన లేదు. పులిపాలే మందుకానప్పుడు పులిజున్ను ఎందుకు? సృష్టిమొదలయినప్పట్నించి వైద్యం ఏదోరూపంలో మానవుల మధ్య చెలామణిలో ఉంది. దాంతో పాటు మానవుడు ఆ వైద్యానికి వక్రరూపాలను, భయాలను,మోసాలను మిళితం చేసి తనకు అనుగుణంగా తయారు చేసారు. అంటే ఎంతటివాడైనా వైద్యం చేసేవాడికి లోకువ. వాడు ఏం చెప్పినా గొర్రెలా తలాడించక తప్పదు."

కొత్వాలు అయోమయంగా చూడసాగాడు. "పదకొత్వాలు ఈ మేక పాలతో మీ ఏలిక లేచికూర్చుంటాడు. నీవే కళ్లారచూద్దువు. ఈ మేక పాలల్లో కూడా ఎలాంటి సంజీవినీ లేదు. అంతా భ్రమ. కేవలం మూలికలతో తయారు చేయబడ్డ లేహ్యంతో అతడు లేస్తాడు. పులిపాలతో వైద్యాన్ని ప్రజలకు పెద్దగా చూపించడంలో వైద్యుడు తన ప్రతిభను చాటుకుంటాడు. కావాలంటే చూడు ఏ వైద్యుడు సామాన్యులకు ఈ పులిపాల వైద్యం చేయించుకోమని చెప్పడు కేవలం రాజులకే పరిమితం ఈ చికిత్సలు. ఎందుకంటే రాజు తనప్రాణాలు నిలుపుకోవడం కోసం పులిపాలు తెచ్చేవారికి సగం రాజ్యం అయినా ఇచ్చేస్తాడు. తన కూతురు నిచ్చి పెండ్లిచేసేవరకు వెళ్తాడు. అదే సామాన్యుడు మంచానపడి మరింత ముందుగానే ఛస్తాడు. "

కొత్వాలకు జ్ఞానోదయం అయినట్లయ్యింది. నిజమేఅన్నట్లు తలపంకించాడు. మేకలు కాసేవాడిని రామన్న దగ్గరగా పిలిచి "నాయనా రేపు ఉదయం నాలుగు నల్లమేకల పాలు పిండుకుని నీవు సాలిగ్రామం సంస్థానానికి వచ్చేయ్ అక్కడ నీవు ఉదయం ఎండ చిక్కబడ్డాక రావాలి. నీకు మరిన్ని వరహాలు దండిగా ఇప్పించగలను. మరిచిపోవద్దు."చెప్పి గుర్రాన్ని అదిలించాడు.

సాయింత్రానికి సాలిగ్రామం చేరుకున్నారు. శంభులింగడు పులిపాల గురించి ఆరాతీసాడు. కొత్వాలు చాలా అబద్ధాలు కల్పించి మరీ చెప్పాడు. "పులిని ఈ రామన్న ఏదో మంత్రంచెప్పి సమీపించాడు. అది ఎలాంటి వ్యతిరేకత చూపలేదు. వెంటనే, ఒండలో దూరి ఒక పిల్లలపులిని పట్టుకుని దానిపాలు పిండుకుని వచ్చాం."

శంభులింగం అయోమయంగా తలపంకించి కొబ్బరిచిప్పలో పాలను వాసన చూసి "ఓహ్ పాలు వాసన పులిపక్కలో ఉన్నట్టుగానే గబ్బుగా ఉంది. గుమ్మపాలు పిండుకుని వచ్చావు. రామన్న నీవు వైద్యుడవే కాదు మంత్రగాడవన్న మాట. ఏమైనా నీ వలన మా ఏలిక లేచికూర్చుంటారు.





ఏచేత్తో పులిపాలు పిండావో ఆ చేత్తో లేహ్యం తయారుచేయాలి" భుజం తట్టి సామాగ్రి అందించాడు.

లేహ్యం తయారు అయ్యింది. కొబ్బరిచిప్పలో పాలును శంభులింగం కలిపాడు. లేహ్యం ఏలికచే తినిపించారు. ఏలిక ఆబగా తిన్నాడు. లేహ్య ప్రభావం వలన ఆరాత్రి ఏలిక కూర్చోగలిగాడు. ఉదయానికి పూర్తిగా స్వస్థత కలిగింది. పులిపాలవైద్యం వలనతాను కోలుకున్నానని సంబరపడ్డాడు ఏలిక.

"రామన్న నీకు ఋణపడిఉన్నాను. నీవలన నేను ఈరోజు మీ మధ్య ఇలా మాట్లాడుతున్నాను. నీకేం కావాలో కోరుకో సమర్పించుకుంటాను." ఏలిక రాచమల్లు అడిగాడు. అతడి ధర్మపత్నులు కూడా చేతులు జోడించారు.

శంభులింగం కపోలాలు పొంగాయి. రామన్నను చూస్తే అతడికి కంపరంగా ఉంది. తనను వదిలి ఏలిక వాడికి ఏమికావాలో కోరుకోమంటున్నాడు. ఏలిక భార్యలు చేతులు జోడించి రామన్నను దేవుడిలా తమ పసుపుకుంకుమలు కాపాడినవాడిలా చూస్తున్నారు. తను రెండు రకాలు పథకాలు వేస్తే అవి నీరుగారిపోయాయి. ఒకటి పులిపాల నెపంతో పులి చెంతకు రామన్నను పంపితే పులికి ఆహారం కాకుండా ఏకంగా పులిపాలను పిండుకుని వచ్చాడు. రెండు రామన్న పులివాతపడి చచ్చాక తాను వెళ్లి ఏ మేకపాలనో, గొర్రెపాలనో తెచ్చి వాటితో లేహ్యం తయారుచేసి తినిపించేస్తే ఈ ఏలికలేచి కూర్చునేవాడు అని అనుకుంటే అదీ జరగలేదు. బిక్కముఖం వేసి వారి ఎదురుగా కూర్చున్నాడు.

రామన్న ఏమాత్రం తడుముకోకుండా మూడువేల వరహాలు కోరాడు.

శంభులింగం కోపంతో "ఏయ్ రామన్న నీకేమైనా పిచ్చా? మూడువేల వరహాలా? అంటే ఖజానా మొత్తం నీ చేతిలో పెట్టేసి సంస్థానం ఏమి కావాలి?"

"మన్నించాలి నన్ను కోరుకోమన్నారు. కోరాను, తీరా కోరాక అది గొంతెమ్మ కోరిక అంటే ఎలా? నా పులిపాలకు ఆ మాత్రం ధరలేకపోతే ఏంబావుంటుంది? ధర తగ్గిస్తే రేపు ఇక్కడి రాజభటుడు కూడా పులిపాలతో

వైద్యం చేయించుకుంటాడు. ఈరోజు నా అదృష్టం బావుండి బతికి మీ మధ్య ఉన్నాను.లేకుంటే ఈపాటికి పులికడుపులో జీర్ణం అయ్యేవాడిని."

ఏలిక రాచమల్లు తటపటాయించాడు.అంత సొమ్ము ఖజానాలో ఉందో లేదో అని ఆలోచించాడు."రామన్నా,నాకు కొంతకాలం గడువు కావాలి.నీవుకోరిన ధనం చెల్లించగలను.అంత వరకు మా అతిధిగా ఉండవచ్చు" అన్నాడు.

"నేను ఇక్కడ ఉండలేను.నాకు చాలాపనులున్నాయి. ఒక పని చేయండి. నేను కోరిన దానిలో సగం ఇప్పించండి సరిపెట్టుకుంటాను."

రాచమల్లు వెంటనే తనపక్కనే ఉన్న కోశాధికారిని అడిగాడు. "పదిహేను వందలు వరహాలున్నాయా? ఉంటే వెంటనే తీసుకురండి చెల్లించేద్దాం."

"ప్రభూ ఈ మధ్య మీ అనారోగ్యానికి చాలా ఖర్చుచేసాం. శంభులింగం ఏమికావాలంటే అది తీసుకురావడానికి ఎంత ఖర్చు అయినా వెనుకాడలేదు రెండునెలల కాలంలో పద్నాలుగు వందల వరహాలు ఖర్చుఅయ్యాయి. కొన్ని వందల మందికి శ్రమతప్పలేదు, ఖర్చులు చేస్తే గాని తమకు ఆరోగ్యం కుదుట పడలేదు. ఏ దూరప్రాంతంలో ఫలానా మూలిక ఉంటుంది అంటే దానికోసం పలువురు వెళ్లేవారు.ఎన్నో వ్యయప్రయాసలకు గురయ్యాము" అన్నాడు

"ఏమిటీ నేను మంచంపట్టిన తరువాత ఇంత జరిగిందా?భారీగా ఖర్చు చేసారా? చాలా ఆశ్చర్యంగా ఉంది.ఆస్థానవైద్యులు శంభులింగం నా ప్రాణాలు నిలిపేందుకు చేయని ప్రయత్నంలేనట్టుంది.ఈ జన్మంతా ఆయనకు ఋణపడి ఉంటాను." తన ఆసనంలోంచి లేచి శంభులింగం చేతులుపట్టుకున్నాడు.

"ఓరాజా ఈ చేతులతో మిమ్ములను పెంచాను. మీ ప్రాణాలకంటే నాకేది ఎక్కువ కాదు. నేను చేయాల్సినది చేసి చివరికి ఏమందు మీ మీద పనిచేయదు అన్నప్పుడు తరతరాలుగా వస్తున్న పులిపాలవైద్యం చేసాను. అందుకు ఈ రామన్నను వినియోగించాను. ఈ రామన్నకు పులిపాలతో





ఎలా లేహ్యం తయారు చేయాలో తెలియదు.నాకు తప్ప ఎవరికి తెలియదు. అందుకే మీరు పూర్తిగా కోలుకున్నారు."గర్వంగా చెప్పుకున్నాడు శంభులింగం.

"ఈ రామన్న కోరినట్టు చెల్లించాక మీకునూ ఎంత అడిగినా అంత ఇవ్వగలను. మీ ఋణం ఉంచుకోను.నాకు మరో జన్మనిచ్చారు."

"ఇవ్వవల్సినవారు మీరు.పుచ్చుకునేది మేము.అన్నట్టు ఈ రామన్న చాలా ఆశ బోతులా ఉన్నాడు.అతడు గొంతెమ్మకోరికలు కోరుతున్నాడు. ఓయి రామన్న, నీకు మతిఛాందసం లేదుకదా, ఏమిటి నీ వికారపు కోరికలు. ఇలా ఖజానాలు ఖాళీచేసే కోరికలు కోరరాదు. అది నీకు పాడికాదు." అన్నాడు శంభులింగం.

"పోనీ, అందులో సగం అయినా చెల్లించండి. పిల్లలు కన్న పులివద్దకు పోయి పాలు పితకడం,చాలాపెద్ద తెగింపు ఉంటే తప్ప వెళ్లలేం.దాని పిల్లలకు ఏమి హానిచేస్తామో అని దారుణంగా మీదపడ్తుంది. అలాంటి సాహసంచేస్తే, మీకు ఏమి కానట్టుందే. దయచేసి 750 వరహాలు ఇస్తే నా దారిన నేను పోతాను" అని రామన్న కొంచెం గొంతు పెంచి అడిగాడు.

"రామన్న ఆశకు అంతుండాలి నీ కోరిక ప్రకారం ఒక అంకె తగ్గించి కేవలం 75 వరహాలు ఇస్తున్నాం స్వీకరించు! అడవిలోకిపోయి పులిని చంపిన యోధులకు ఇచ్చేది. పదివరహాలే. కానీ, ఈ సాలిగ్రామం ఏలిక కోసం నీవు సాహసించావు కనుక ఎనిమిది రెట్లు అధికంగా బహు మానం ఇప్పించాను." అని చెప్పి రాచమల్లు వైపు చూసి నవ్వాడు.

రామన్నకు వరహాలు లెఖ్ఖించి కోశాధికారి పళ్లెంలో వేసి ఇచ్చాడు. "రామన్నా నీకు ఎంత ఇచ్చినా నీఋణం తీర్చుకోలేనిది.కానీ, నా ఖజానా పరిస్థితి హీనంగా ఉన్నందున, నీవు కోరినంత ఇవ్వలేకపోతిని." అని చేతులు పట్టుకున్నాడు రాచమల్లు.రాణులు తమనగలు ఇవ్వబోతే రామన్న వద్దన్నాడు.

అంతలోనే వచ్చాడు ముందురోజు మేకపాలు ఇచ్చిన కాపరి. రెండుపిడతలు నిండుగా మేకపాలతో ఆదరాబాదరాగా వచ్చాడు. "ఎవరు ఈ వెర్రిబాగులోడిని రాజమందిరంలోకి రానిచ్చారు." అరిచాడు దండ నాయకుడు.

"రామన్న ముందే చెప్పాడు తనకోసం మేకలు కాసుకునే వ్యక్తి వస్తే లోపలికి పంపమన్నాడు అందుకే పంపించాం." చెప్పాడు భటుడు.

రామన్న ఆ మేకల్ని కాసుకునేవాడి నుంచి రెండు పిడతల పాలు తీసుకుని "ఓ ఏలికా ఈ పాలను తాగండి మీకు ఆరోగ్యం చేకూర్చేపాలు ఇవే. వీటితో మీకు లేహ్యం తయారుచేసాను." జాగ్రత్తగా అందించాడు.


రాచమల్లు ఆశ్చర్యంగా ఆ పాలను వాసన చూసి "ఇవి మేకపాలులా ఉన్నాయి. ఈ పాలను తెచ్చినవాడు గొర్రెల కాపరిలా ఉన్నాడు. పులిపాలు వేరే వాసనతో ఉంటాయి. ఇలా నీచువాసనతో ఉండవు. నాకు ఇవ్వడంలో అర్థం ఏమిటి? వీటిని నేను ఎందుకు తాగాలి? ఏమిటిదంతా రామన్న." రాచమల్లు చేతిలో ఉన్న పిడతలు నేలమీద పెడుతూ అడిగాడు.

'అవి పులిపాలు కాదా మన ఏలిక రాచమల్లు మేకపాలు అంటున్నాడు. రామన్న నిన్న తయారుచేసిన లేహ్యంలో ఈ పాలనే వాడాను అని అంటున్నాడు' అని రాజును చూడడానికి వచ్చిన పురప్రముఖులు, ముఖ్యోద్యోగులు గుసగుసగా చెప్పుకోసాగారు.

శంభులింగంకు అక్కడజరుగుతున్నది ఒక్కముక్క అర్థంకాలేదు. దగ్గరగా వెళ్లి పాలను వాసన చూసి ఆ కాపరిని అడిగాడు. "ఏరా ఇవి మేకపాలేకదూ, నీవు పెంచే మేకలను పిండుకుని వచ్చావా? రాజులు మేకపాలు తాగరు మరి ఎందుకు తెచ్చావు. నీకు బ్రతకాలని లేదా?" అని అడిగాడు శంభులింగం.

ఆ కాపరి భయంగా రామన్న వైపు చూసాడు. "ఫర్వాలేదు. నిజమే చెప్పు.ఏదీ దాచకు అబద్ధం చెబితే భయపడాలి." రామన్న మరింతగా ప్రోత్సహించాడు.





రామన్న మేక పాలు తీసుకొని గుర్రం పై బయల్దేరుట అతడిని కొత్వాలు అనుసరించుట.

"అయ్యా నిన్న ఉదయం నా దగ్గర కొబ్బరిచిప్ప పట్టినన్ని పాలును ఈ రామన్న, మీ కొత్వాలయ్యా రెండువరహాలు ఇచ్చి మరీ కొన్నారు. ఈరోజు వస్తే దండిగా వరహాలు ఇస్తామన్నారు. వచ్చేయేళ మరిన్ని మేకపాలు పిండుకుని రమ్మన్నారు." చేతులు కట్టుకుని మరీ చెప్పాడు.

అక్కడవారంతా నిర్ఘాంతపోయారు. రాచమల్లు కోపం తారాస్థాయికి వచ్చింది."నాకు చేసిన వైద్యం పులిపాలతో కాదా? హీనమైన మేకపాల తోనా? ఏమిటి రామన్న నీవు ఇలా మోసం చేస్తావని అనుకోలేదు. నీవు చేసిన మోసపూరిత వైద్యానికి తోడు అంతులేని అత్యాశ బాగుంది. నీ తీరు ఇలా ఉంటే ఏ రాజు చేతిలోనో కుక్కకంటే హీనంగా చంపబడ తావు."అని అగ్గిమీద గుగ్గిలం అయిపోయాడు.

అక్కడ ఉన్న సంస్థాన ప్రముఖులు, పురప్రజలు అంతా రామన్నను తప్పుపట్టారు.శంభులింగం రామన్న మెడపట్టుకుని నెట్టేస్తుంటే రాచమల్లు ఆపాడు."ఆగండి ఏది ఏమయినా నాకు రోగవిముక్తి కల్గింది. కనుక ఇతడిని విడిచిపెడదాం. మన వద్దపనిచేసే కొత్వాలును ఉద్యోగంనుంచి తీసివేసి కారాగారంలో పడేయ్యాలి ఎన్ని అబద్ధాలు చెప్పాడు."అని కొత్వాలును తినేసేలా చూసాడు.దగ్గరగా రమ్మని పిలిచాడు.అతడు భయపడ్తూనేవచ్చాడు.

"ఏరా కొత్వాలు ఉద్యోగంతో నీకు కన్నులు నెత్తికెక్కాయా నాతో అబద్ధాలు చెబుతావా? నీకు సరైన దండన విధిస్తేతప్ప నాకు శాంతి లేదు."

"అయ్యా నన్ను మన్నించండి ఈ రామన్న ఆయుర్వేదంలో పులిపాల చికిత్స అనేది లేదని గట్టిగా చెప్తూనే మేకపాలతో కూడా మీ ఏలిక రోగం కుదర్చవచ్చు అని చెప్పినమ్మించాడు.అతడు చెప్పినట్లు మీకు వెంటనే రోగం తగ్గుముఖం పట్టింది.మిమ్మల్ని రక్షించగలను అని చెప్పినందున నేను అతని మాటలకు విలువ నిచ్చాను.అతడు ఏంచెప్పినా నేను విన్నాను. అబద్ధాలు చెప్పేసాహసం చేసాను.నాకు ఎలాంటి ద్రోహ చింతలేదు. నన్ను నమ్మండి"





"ఏమిటి ఆయుర్వేదంలో పులిపాల వైద్యంలేదా?మా పూర్వీకులు ఎందరికో పులిపాల వైద్యం జరిగింది.ఏమిటీ వింతవాదన. శంభులింగం మహాశయా మీరేమంటారు?" రాచమల్లు సూటిగా అడిగాడు.

అంతవరకు రామన్నకు ఏదో అయిపోతుంది అనుకున్న శంభులింగం చుట్టుతిరిగి తనపైకి వస్తున్నట్టుగా భావించి అక్కణ్నించి తప్పించుకుని వెళ్లి పోదాం అనుకున్నాడు. "అయ్యా నేను ఇక్కడ ఒక్క క్షణం ఉండలేను. ఇక్కడ ఉంటే నాకు వచ్చిన వైద్యం మరిచి మట్టిబుర్రతో మిగిలిపోయే ప్రమాదం ఉంది. నన్ను వెళ్లనీయండి.ఏమిటో వైద్యశాస్త్రం ఏమీకానట్లుగా మాట్లాడు తున్నారు. నేను నేర్చుకున్నది నాటి అశ్వనీదేవతల వైద్యం ఆషామాషీకాదు."

"మీరెందుకు వెళ్లిపోవడం వీరి నోరుమూయించండి. మీరు మా తండ్రి గారికి కూడా ప్రాణాలమీదకు వచ్చినపుడు పులిపాల వైద్యం చేసారు. అలాగే మా పిన తండ్రికి, మా తాతగారికి చేసారు. వీరు కాదన్నప్పుడు నోరు మూయించాల్సిన బాధ్యత మీకులేదా?"రాచమల్లు అడిగాడు.

అంతవరకు ఓపికగా ఉన్న రామన్న పెదాలు విప్పాడు."ఆయనేం చెబుతాడు నేను చెబుతాను. పులిపాలవైద్యం అనేది లేదు. అదో కట్టుకథ దాన్ని భూతంలాచూపి దోచుకునేందుకు ధన్వంతరిలు ప్రధాన ఆయుధంగా వాడుతుంటారు. మీకు రాత్రి నేను నూరి ఇచ్చే లేహ్యం ఇదివరలో ఇవ్వలేదు. మీకు వ్యాధి ముదరపెట్టి దోచుకున్నారు.కాదని చెప్పమనండి.ఈ శంభులింగం మీ ఖజానా నుంచి ఖర్చుచేసి మూలికలు కొనుగోల్లు చేయించాడు. వాటిల్లో చాలావరకు మీకోసం వెచ్చించలేదు. ఆయనింటికి తీసుకుపోయాడు. ఇతరత్రా ధనం కూడా ఆయన తీసు కున్నాడు. మీకు వచ్చిన రోగం చాలా చిన్నది. కాదని చెప్పమనండి."


ఒక్కసారి అయోమయంలో పడ్డారు అక్కడి వారంతా, శంభులింగం అదిరి పడ్డాడు. తన భండారం మొత్తం బట్టబయలు అయ్యింది. ఏమి చేయాలో తోచలేదు. వాదించి ఫలితం లేదు అని తలదించుకున్నాడు.

"ఓ ఏలికా మానవుడికి వైద్యం తెలిసిన నాటినుంచి ఇలా రోగులతో ఆడుకోవడం అలవాటు చేసుకున్నాడు. ఇది ఆగదు. అలా కొనసాగుతుంది. ఇక మీ పూర్వీకులకు చేసిన పులిపాలు పులిజున్ను వైద్యం అంతా ఇలా మేకలు తప్పితే గొర్రెల పాలతో మాత్రమే. పులిపాలు ప్రశ్నేలేదు. ఇక నేను అడిగిన ధనం కోసం కూడా చెబుతాను. ఇక్కడ భండారం బట్టబయలు కాకుంటే,మీరు నాకిచ్చినధనం నాలుగుభాగాలు చేసి పంచేయాలనుకున్నాను. అందులో తొలి భాగం శంభులింగం, రెండవ భాగం ఈ కొత్వాలు. మూడవ భాగం మేకపాలు ఇచ్చిన కాపరి చివర నాలగవ భాగం నేను తీసుకోవాలనుకున్నాను. అందుకే ఈతన్ని పిలిపించాను."రామన్న వివరించాడు. అంతా సంభ్రమాశ్చర్యాలు చెందారు.

రాచమల్లు రామన్న చేతులుపట్టుకుని "నావద్ద ఉండిపో! నీవంటి వాడిని ఆశ్రయం ఇచ్చే అదృష్టం నాకు కల్పించాలని ఆశిస్తున్నాను." అని కోరాడు.

"నేను ఇలా ఎక్కడా ఇప్పటిలో ఉండలేను. నేను దేశసంచారం చేయాలని ఆశపడ్తున్నాను. చాలా విషయాలు తెలుసుకోవాలనుకుంటున్నాను. నాకు తెలిసినది సముద్రంలో కాకిరెట్టంత. కనుక నన్నుమన్నించి సెలవు ఇప్పించండి అని కోరాడు.

రాచమల్లు వెలలేని ఆభరణాలు, కొంతధనం రామన్నకు ఇచ్చి సాగనంపేందుకు కోట వెలుపలివరకు వచ్చాడు. అక్కడ రామన్న శంభులింగాన్ని క్షమించమని తిరిగి అతడి సేవలు వినియోగించుకోవాలని రాచమల్లు కోరాడు. ఆయన సరేనని అయిష్టంగానే ఒప్పుకున్నాడు.


భట్టి విక్రమార్క కథలు
(జానపద ఉత్కంఠ కథా సంగ్రహము)
రచన :
శ్రీ ఇచ్ఛాపురపు రామచంద్రం
పేజీలు : 372 బైండ్ ప్రతి వెల : 100/-
రోహిణి పబ్లికేషన్స్,
రాజమండ్రి.






# పాపం పేదిరకాలు

మర్యాదరామన్న ఒకరోజు పొరుగూళ్లో ఏదో దేవత పండుగ సందర్భంగా జాతర జరుగుతుంటే అక్కడికి తన తండ్రి బసవయ్యతో వెళ్లాడు. ఆ జాతరలో బసవయ్య ఒక మూలకూర్చుని ఖర్జూరం, బెల్లం అమ్మసాగాడు. అక్కడ రామన్న తండ్రికి సాయంగా వచ్చి పక్కనే కూర్చున్నాడు అక్కడికి పదిగ్రామాలకు పేరుపడ్డ మల్లుడు ఒకడు వచ్చాడు. అతడిని ఏ రాజుగాని సంస్థానంగాని కొలువు ఇచ్చి ఆదుకోలేదు. ఆ కారణం చేత అతడు నేరగాడుగా మారిపోయి లేనిపోని తగవులలో దూరిపోయి ఏదో విధంగా నాలుగు రూకలు సంపాదించు కోసాగాడు. జాతరలో ఎక్కువగా తగవులు అవుతుంటాయి, కనుక అక్కడికి చేరాడు. వచ్చిరాగానే బసవయ్య చేస్తున్న ఖర్జూరం వ్యాపారం వద్ద కొంతసేపు ఆగి, పరికించి చూసాడు. బసవయ్య తలపాగ దుస్తులు చూసాక, యాదవ జాతి వాడేంటి వ్యాపారం చేయడమేమిటి అని వంకరనవ్వులు నవ్వి మణుగు నుంచి బేరం చేసి చివరికి తన పిడికిలి బరువుకు సరిపడా ఖర్జూరం ఎంత కిస్తావు నీ తూనికలో నా పిడికిలిని తేలిగ్గా పెడతాను. పైగా ఈ మధ్య ఎడమచేతికి పక్షవాతం వచ్చినట్టు సన్నపడి పోయి, ఫీలగా అయిపోయింది. పెద్దగా తూకంలో నిలబడదు." అని కొత్తరకం బేరం చెప్పాడు.

బసవయ్యకు అంతవరకు పెద్దగా బేరాలు లేనికారణంగా ఇదేదో మట్టిబుర్ర మల్లుడు బేరంగా భావించి "అయ్యా ఇలా పిడికిలి బరువులకు నేను ఎప్పుడు అమ్మలేదు. సరే, నీవు అడిగావు కనుక, నేను ఏదో ధర నిర్ణయిస్తాను. నీ ఎడమ పిడికిలికి అయితే మూడు వరహాలు, కుడిపిడికిలి అయితే నాలుగు వరహాలు అదీ నీవు తేలిగ్గా తూనిక పళ్లెంలో చేయిపెట్టాలి" అని మల్లుడు చెప్పిన షరతునే తను గుర్తుచేసాడు. పక్కనే ఉన్న రామన్న జాలిగా తండ్రివైపు చూసి నిట్టూర్చాడు. మల్లుడు ఎడమచేయి పెట్టాడు. తూనిక పళ్లెంలో రెండోవైపు ఎంత ఖర్జూరం వేసినా చేయి ఉన్న పళ్లెం

అసలు కదలదాయెను. బసవయ్య ఖంగుతిని "ఏమయ్యా నువ్వు పిడికిలిలో మొత్తం శక్తిని వినియోగిస్తున్నావు. అందుకే తూనిక ఏమాత్రం కదల దంలేదు." అని గాభరపడ్డాడు.

"నోర్ముయ్‌రా ముందు అనుకున్న ప్రకారం నాకు తూకం వేసి సరుకు ఇవ్వరా లేకుంటే ఇక్కడే నీ చేత రక్తం కక్కిస్తాను అని రెండో చెయ్యి ఎత్తాడు. మొత్తం ఖర్జూరం అంతా ఎడమ పిడికిలి బరువుకు దూదిపింజలా తేలి పోయింది. అది చాలక పక్కనే ఉన్న బెల్లం కూడా ఆ తూకంలోకి వెళ్లి పోయింది. కేవలం రెండు వరహాలకు యాభై వరహాల సరుకు మల్లుడు పాలయ్యింది. అక్కడ వినోదంగా చూస్తున్న జాతరకొచ్చినవాళ్లు "అయ్యా మల్లుడుగారూ మీరెంత ధర్మమూర్తులయినా ఒప్పందం ప్రకారం మీ తూకం ప్రకారం ఇంకా వీరి నుంచి సరుకు పొందాల్సి ఉంది. ఖర్జూరం, బెల్లంకూడా మీ పిడికిలి తూకానికి సరి కాలేదు. ఇంకా మీ ఒప్పందం ప్రకారం పుచ్చు కోవాల్సిందే.కనుక అదిగో అక్కడకూర్చున్న అతడి కొడుకు మీచేయిబరువుకు సరితూగుతాడో లేదో తేల్చండి." అని మరింత ఆజ్యం పోసారు. మల్లుడు పకపకమని నవ్వి"నిజమేరా మీ మాటల్లో న్యాయం ఉంది.ఇదేదో సంతబేరం కాదు. ఊరి పోలేరమ్మ జాతర అంటే మాటలా? అనుకున్న ప్రకారం తీసుకోవల్సిందే.నిజాయితీని వదలరాదు. రేయ్ కుర్రకుంకా వచ్చి ఈ తూనిక పళ్లెంలో కూర్చోరా! నువ్వు నా కాళ్లు పిసకడానికి బావుంటావు."అని రామన్న రెక్కపట్టుకుని కుదేసాడు.తలపాగ చుట్టుకున్న రామన్న పళ్లెంలో మౌనంగా కూర్చున్నాడు.

అలా ఇలా కదిలింది పళ్లెం. " సరేలే నీతో సరిపుచ్చుకుని నీ తండ్రిని వదిలేస్తున్నాను అని రామన్న నెత్తిమీద కొంత సరుకు వేసాడు. తన అనుచరులకు కొంత సరుకు నెత్తినపెట్టి బయలుదేరుతుండగా బసవయ్య మల్లుడు కాళ్లమీద పడి "అయ్యా లేకలేక కలిగిన సంతానం అల్లారుముద్దుగా పెంచుకున్నాను.ఏనాడు సరుకులు ఇలా మోయలేదు.అంతటి శక్తి ఉన్నవాడు కాదు.దయఉంచి విడిచిపెట్టండి. మీకు రేపు ఉదయానికి మీ తూకం సరిపడా ఇచ్చుకుంటాను."అని గోడుగోడుమని చెప్పి బ్రతిమాలాడు.





"నాన్నా నీవు ఆశపడ్డావు ఈ మల్లుడు కండలు పెంచినవాడే బుద్ధిశాలి కాదు అని నీకుగా నీవు ఊహించుకుని ఇంతవరకు తెచ్చుకున్నావు. ఈ జాతర ముగిసిన వరకు ఆ నీడలో ఉండు. ఆ తరువాత మల్లుడిని బతి మాలవచ్చు. అత్యాశకు ఫలితం చూసావుకదా!" రామన్న చెబుతుండగా మల్లుడు వంకరనవ్వు నవ్వి అక్కణ్నించి బయలుదేరాడు. అతడి వెనుక డప్పులు మారుమ్రోగాయి.

కొంతదూరం వెళ్లేసరికి అయ్యా ఈ బెల్లం ఖర్జూరం ఏంచేద్దాం? వ్యాపారం చేద్దామా? మనం మల్లులుగా జీవిస్తున్నాం మన వద్ద ఎవరు కొంటారు." అని ఒక అనుచరుడు అడిగాడు.

"ఈ వ్యాపారం మనం చేయవద్దు. మనం ఎంతపాపం చేస్తామో అంత పుణ్యం చేస్తే విరుగుడు అయిపోతుందట. అంటే నిజజీవితంలో బతకడానికి ఎన్నో తప్పుడు పనులు చేస్తుంటాం అలాంటప్పుడు మనం పుణ్యం చేసి తప్పులపాపం నుంచి బయటపడవచ్చు అని ఈమధ్య ఒక యోగి చెప్పగా విన్నాను. రేయ్ కుర్రకుంకా నీ ముఖం చూస్తుంటే తెలుస్తోంది నువ్వు చురుకైన వాడవు అని, నేను వరుసుగా తప్పులు చేసి అంటే పాపం చేసి ఈజాతరలో ధనం సంపాదిస్తుంటాను. నువ్వు ఆ పాపానికి విరుగుడుగా మన వద్ద ఉన్న ఖర్జూరం, బెల్లం సర్వం కోల్పోయిన వారికి పంచేయ్. ఆ పనిలో నీ వుండాలి. నేను నాశిష్యులు కలిసి పాపపుధనం సంపాదిస్తాం.

"అలానే చేస్తాను. మీ ఆదేశాలను వమ్ముచేయను."అని చెప్పి రామన్న నెత్తినున్న మూటను దించేసాడు మిగిలినవారు మూటలు దించేసారు. మల్లుడు కదిలాడు. అతడు వరుసగా తప్పులుచేసి సంపాదించ సాగాడు. అందులో భాగంగా పాడిపశువులు అమ్ముకుంటున్న వ్యక్తిని భయపెట్టి ఒక గోవును తీసుకున్నాడు. అతడు లబోదిబో మంటుంటే "నాకు నిత్యం పాలు తాగే అలవాటుంది. పాలు నిచ్చేగోవు కావాలి. ఎవరు ఇస్తారు? అందుకే ఇలా బలవంతంగా తీసుకున్నాను. కావాలంటే నాకు వ్యతిరేకంగా అక్కడ ఉన్న సంస్థానం రక్షకభటులకు ఫిర్యాదు చేసుకో!" అని పెద్దగా రంకెలు వేసాడు.

గోవులు అమ్మేవాడు బిక్కముఖం వేసి ఊరుకున్నాడు.

మల్లుడు వెనుక ఉన్నవారు గోవును దాని దూడను తోలుకుని కదిలారు. రామన్న వెంటనే బెల్లం మూటను ఎత్తుకుని పరుగున వెళ్లి చెట్టుకింద ఉన్న తండ్రికి ఇచ్చి నాన్నా ఇదిగో ఈ ధరకు అమ్ము తగ్గించరాదు. అని జాతరలో బెల్లంధరను పదిరెట్లు పెంచి అక్కడ ఒక చెక్కపేడుపై పిండిని నీటితో తడిపి రాసాడు. అదేమిటి రామన్న ఇంతధరకు ఎవరు కొంటారు? నీకు మతిచెడిందా? అసలే ఆ మల్లుడు వలన యాభై వరహాలు కోల్పోయాను. ఇప్పుడు నీవు విపరీతంగా పెంచేసే ధరతో ఎవరు కొంటారు?"

"నాన్నా నామాట విను. ఈ చెక్కపేడు మీద ఏమిరాసానో తెలుసా? ఈ బెల్లం ఎక్కువ ధరకు కొనండి పాడి ఆవును దౌర్జన్యంగా పొందండి." చెప్పి అక్కణ్నించి వెళ్లిపోయాడు.

మల్లుడు ఒక గుర్రాలు అమ్మేవాడినుంచి ఒక తెల్లని గుర్రం దౌర్జన్యంగా తీసుకున్నాడు. వాడు కత్తిదూసి మీదకు రాబోయాడు. వాడిని చావచితకతన్ని గొంతుమీద కత్తిపెట్టి "నా కండలు నీలాంటివాడి కుత్తుక కోయడానికే ఉందిరా! ఎంత పొగరు నీకు, ఈ మల్లుడు మీద కత్తిఎత్తుతావా?" అని నేలమీద అడ్డదిడ్డంగా పడేసాడు. పాపమాతడు విలవిలలాడిపోయాడు.

అక్కడ కొందరు గ్రామస్థులు మల్లునితో "అయ్యా ఈ గుర్రాల గోపిరెడ్డికి తెలియక కత్తి ఎత్తాడు. ఖరీదైన ఒక గుర్రం తీసుకున్నావు. జాలిపడి వదిలేయ్." గడ్డం పట్టుకుని సర్దిచెప్పారు.

ఆ వెంటనే రామన్న మరో బెల్లం మూటను తీసుకుని పరుగున వెళ్లి తండ్రికి ఇచ్చేసి అక్కడ ఇంకో చెక్కపేడు మీద ధర పదింతలు పెంచేసి ఇలా కొనుగోలు చేసినవారికి దౌర్జన్యంగా దేవతా గుర్రం లభించగలదు అని రాసాడు. అలాగే,మల్లుడు మరోచోట ఆభరణం తీసుకున్నాడు. ఇంకోచోట దుస్తులు తీసుకున్నాడు. అలా పది మందివద్ద విలువైన వస్తువులు కత్తులు చూపి తీసుకున్నాడు. జాతరలో ఆఖరి దుఖాణం వద్ద ఆగాడు. అప్పటికి సాయింత్రం అయ్యింది. జాతరలో ఒక్కటే మూతులు కొరుక్కోవడం





చూసి ఏమయ్యిందిరా అంతా ఏమిటో మాట్లాడుకుంటున్నారు. కనుక్కుని రండి అని ఒక చిన్న మల్లున్ని పంపాడు. వాడు వచ్చి పడిపడి నవ్వుతూ చెప్పాడు.

"ఈ బుడ్డోడు లేడు ఈడి తండ్రికి నీవు మొత్తం సరుకు తీసుకుని చెట్టుకింద కూకుండ ఏసినావు కదా వాడు ఎలా పూటెక్కాడో కానీ, బెల్లం, ఖర్జూరం అమ్మకాలు మస్తుగా చేస్తున్నాడు. అయితే బేరం కాలేదు. ప్రజలతో నిండిపోయింది. ఆడు బెల్లం ధర ఏకంగా జాతరలో అమ్ముడయ్యే ధరకు ఇయ్యట్లేదంట. పదింతలు పెంచుకుని అమ్ముకో చూస్తున్నాడంట" చిన్నమల్లుడు నవ్వాపుకుంటూ పూర్తిచేసాడు.

"ఆడు ఎలా పోతే ఏంరా! ఆడి కొడుకు మన కాదున్నాడు. ఏంచేద్దాం ఈడ్ని పెంచిపోషించాలా? పోనీ ఈడు పనికి వస్తాడా! వీడు బక్కగా ఉన్నాడు. వీడిమెడలో అదేదో బంగారు గొలుసులా ఉంది అది తీసుకుని వదిలేయండి అరే పోరాఫో!" మల్లుడు చెప్పి జాతరలో అన్ని వైపులా పరికించి చూడసాగాడు. అల్లంత దూరంలో అక్కడ సంస్థానం ఏలే ప్రభువు అజితుడు నాలుగు గుర్రాలు పూన్చిన రథం మీద వస్తూ కన్పించాడు. మల్లుడు అతడికి కనిపించకుండా చెట్టుకింద కూర్చుని తనవారితో ఏవో మాటలలో మునిగిపోయినట్లు చేస్తే తనను చూడడు అని అతడి ఆలోచన.

ఆ రథం చూస్తుండగా జాతరలోగల దుకాణాల సముదాయం పక్కనుంచి సాగిపోయింది. బసవయ్య చివరిలో పెట్టుకున్న దుకాణం ముందు గ్రామస్థులు ఎక్కువ సంఖ్యలో ఉన్నందున అజితుడు అక్కడ ఆపాడు. అప్పటికే అక్కడ ఆరా తీస్తున్న భటులు "ప్రభూ ఇక్కడ పెద్ద మోసం చేస్తున్నాడు ఈ వ్యాపారి. బెల్లంధర పదిరెట్లు పెంచి ఈ బెల్లం కొనుగోలు చేసేవారు తప్పక గోవు లేదా గుర్రం దోచుకునే శక్తివంతులవుతారు అని చెక్క మీద రాసి మరీ వ్యాపారం చేస్తున్నాడు." చేతులు కట్టుకుని చెప్పారు.

"ఏమిటయ్యా ఇదంతా చూస్తే నీవు వర్తకానికి కొత్తవాడిలా ఉన్నావు. ఏమిటి వికారపు రాతలు? నీ బెల్లం కొంటే ఎలా గుర్రాలు దోచుకోగలడు?

నువ్వు వర్తకం చేస్తున్నావా? లేక ప్రజల్లో దొంగతనాలు, దౌర్జన్యాలు నేర్పేందుకు కంకణధారివయ్యావా? నీ తీరు చూస్తుంటే ప్రజలను నీవు దుర్మార్గులుగా చేసేట్టున్నావు." అని అన్నాడు.

"ఈ రాతలు అన్నీ నాకొడుకు రాసాడు. నాకు చదువురాదు. ఇలా ధరపెంచితే మనకి ఏమి బేరం అవుతుంది అని అడిగాను. కానీ, ఆ పసివాడు వినలేదు. అందుకే సరుకు ఒక్కపిసరు అమ్ముకోలేక పోయాను. ఈ జాతరలో అంతా నష్టమే. నేను అమాయకపు జాతివాడిని నేను తప్పుడు మార్గాల్లో తిరిగేటోడిని కాను." అని తన బాధంతా చెప్పు కున్నాడు.

"ఎక్కడ నీ కొడుకు చూపించు వాడినే అడుగుతాను." అని గద్దించాడు.

అంతలోనే అక్కడికి చేరాడు రామన్న. అజితుని చివరిమాటలు విన్నాడు. "అయ్యా నేను మీరు వెతుకుతున్న బసవయ్య పుత్రున్ని. నేను అలా రాసి ధరలు పెంచి రాసాను. నా రాతలు నిజమే తప్పుకావు. ఏలినవారు దయతో నా మాటలు శాంతం వింటే నా రాతల్లో మర్మం తెలియగలదు." విన్నవించాడు.

"నాయనా చిన్నవాడిలా కన్పిస్తున్నావు. నీ మాటలు చాలా చక్కగా పొందికగా ఉన్నాయి. సరే చెప్పు ఆ మర్మం వింటాను." అజితుడు మరింత ఉత్సాహంగా చెవులు రిక్కించాడు.

"ఏలినవారు ఇలా జాతరలో విశేషాలు చూడడానికి స్వయంగా రావడం చాలా ఆనందదాయకమే. నేను చెప్పే మాటలు తమతోబాటు ఈ జాతరలో ఉన్నవారంతా వినాల్సిందే. కనుక తప్పక అందరిని ఇక్కడకి పిలిపించాల్సిందిగా కోరుతున్నాను. నా మాటలు అందరికి పనికి వచ్చేవి. చాలామందికి నా మాటలు ముడిపెట్టబడి ఉన్నాయి." మరింత వినమ్రంగా చెప్పాడు.

రక్షకభటులు వెంటనే జాతరలో ఉన్నవారినందరిని తీసుకుని వచ్చారు. వారిలో మల్లుడు అతడి అనుచరులు అయిష్టంగా వచ్చి నిలబడ్డారు.





"ఓ ప్రభూ ఇక నేను చెప్పాల్సినది చెబుతాను. జాతరలో ఎలాంటి గొడవలు జరుగకుండా ఉండేందుకు తమరు తమ రక్షకభటులను ఇక్కడికి పంపారు. వారు ఏదో మూలచేరి ఉన్నాం అన్నట్టుగానే ఉన్నారు. తప్పితే ఎలాంటి దోపిడీలు, దౌర్జన్యాలు అరికట్టే ప్రయత్నాలు చేయలేదు. నేను నా తండ్రి ఇక్కడ బెల్లం వ్యాపారం చేయాలని ఈచోటులో యాభై వరహాలు సరుకుతో సిద్ధంగా ఉన్నాం. అయితే ఇక్కడ ఒక నేరగాడైనా మల్లుడు అతడి అనుచరులు వచ్చి నా తండ్రిని ఎగాదిగా చూసారు. వెర్రి యాదవుడా వ్యాపారం చేయడమా? బురిడీపుచ్చాలని ఎడమచేయి చచ్చుపడిపోయిందని చెప్పారు. ఇంకా చాలాచెప్పారు. పెద్దగా ధనంలేదు. ఒకప్పుడు మల్లుడుగా బతికాను. తూనికపళ్లెంలో చచ్చుపడ్డ చేయిబరువుకు ఎంత బెల్లం ఇవ్వగలవు అని అడిగారు. అందుకు నా తండ్రి రెండు వరహాలు అని ఠపీమని చెప్పాడు. ఇందులో నాతండ్రి వ్యాపారిగానే మాట్లాడాడు. ఓ చిన్న బెల్లంముక్కకు తూగిపోతుందని అనుకున్నాడు. తీరా అది చచ్చుపడ్డ చేయి కాదు. కండపట్టిన మల్లుని ఉక్కుముక్కలాంటి చేయి. మా బెల్లం, ఖర్జూరంతోబాటు నేను కూడా తూకంలో నిలవలేకపోతిని. మల్లుడు జాలిపడి అంతటితో తూకం నిబంధనను వదిలి నన్ను తన బానిసగా తీసుకుపోయాడు. నా తండ్రి వ్యాపారంలో సర్వం కోల్పోయి దుఃఖాక్రాంతుడయి ఆచెట్టునీడన చతికిల బడ్డాడు. మల్లుడు ఒక యాదవుని పొట్టకొట్టిన తరువాత రెట్టింపు ఉత్సాహంతో తాను మరిన్ని పాపాలు చేస్తాను. ప్రతిపాపానికి విరుగుడుగా మన వద్ద ఉన్న బెల్లం లేదా ఖర్జూరం ఏమి లేని వారికి దానం చేయమని నన్ను ఆదేశించాడు. తొలిపాపంగా గోవులు అమ్మేవాడివద్ద ఒక గోవును కత్తిచూపి దోచుకున్నాడు. నేను వెంటనే కొంతబెల్లం జాతరలో నిలువుదోపిడీకి గురయి ఏమిలేకుండా ఉన్న నా తండ్రికి ఇచ్చాను. తిరిగి దుకాణం తెరిపించాను. కానీ, ధర చాలా ఎక్కువ పెట్టాను. ఎందుకంటే ఈ బెల్లం దానంగా వచ్చినా పెద్దపాపానికి పరిహారంగా వచ్చింది కనుక ఈ బెల్లం కొన్నవారికి ఒకగోవు దోచుకునేంత శక్తి వస్తుంది అని చిన్న చెక్కపేడు మీద రాసిపెట్టాను. అలాగే పదిరకాల పాపాలు చేసాడు ఆ మల్లుడు. నేను

పదిసార్లు దానం నా తండ్రి బసవయ్యకు మాత్రమే ఇచ్చాను. ఎందుకో తెలుసా? ఈ జాతరలో ఎవరు లేనివారో ఎవరు ధనికులో తెలియనందున ఒక కారణం కాగా, మరో కారణం ఉంది. నేను ఇచ్చిన దానం నా తండ్రి అమ్ముకోలేకపోతున్నాడు. కనుక అతడికే మళ్లీమళ్లీ దానం ఇచ్చాను. ఇందులో నా దోషం ఏముంది ప్రభూ, ఒక్కసారి ఆలోచించండి. ఇక్కడ ప్రజలు, తమరు, తమ రక్షకభటులు అంతా ఒక వ్యాపారిని ఏమిటి ఈ అధికధరలు అని నిలదీసారు. కానీ, మల్లుడు తన కత్తితో అందరిని బెదిరించి పదిపాపాలు చేస్తే ఒక్కరు అతడిని అడగనే లేదు. కనీసం బాధితులు కూడా తమకు ఫిర్యాదు ఇవ్వనేలేదు." రామన్న గొంతు అక్కడ కంచుగంటలా ఖంగుమంది.

అందరి దృష్టి మల్లుడిపై పడింది. అతడికి ఏమి చేయాలో పాలు పోలేదు. రక్షకభటులు అతన్ని చుట్టుముట్టి ప్రభువు ముందు నిలిపారు. "నీ వెనుక ఉన్న గోవు,గుర్రం దౌర్జన్యంగా సంపాదించినవా? వీటిని కోల్పోయిన వారెవ్వరు? ముందుకు రండి." అజితుడు కోపంతో అరిచాడు.

క్షణాల్లో అంతావచ్చారు. వారు పోగొట్టుకున్నవి వారికి తిరిగి ఇవ్వబడ్డాయి. మల్లుడుని అతడి అనుచరులను బంధించి కారాగారంలో పడవేయాల్సిందిగా అజితుడు ఆదేశించాడు. రక్షకభటుల పనితీరుపై మండి పడ్డాడు. జాతరలో ఇలా దోపిడీలు చేస్తుంటే ఏమిచేస్తున్నారు. ఒక కుర్రాడు చెప్పేవరకు మనకు తెలియకపోవడం చాలా శోచనీయం. ఇలా మరోసారి జరిగితే ఎవరిని ఉపేక్షించను. తీవ్రంగా హెచ్చరించి రామన్నను సమీపించి నాయనా నీవెవ్వరవు. ఇంత చిన్నవయస్సులో ఇంతచక్కగా అరటిపండు వొలిచినట్టు చెప్పగలిగావు నీ గురించి తెలుసుకోవాలని ఉంది అని అడిగాడు.

"ప్రభూ నాపేరు రామన్న అని అంటారు. ఈ బసవయ్యకు పుత్రుడను."

"రామన్న అంటే ఈమధ్య సాలిగ్రామం సంస్థానంలో అక్కడ ఏలికకు పులిపాల వైద్యం చేసింది నీవేనా?"





"అవును ప్రభూ పులిపాలు కాదు మేకపాలుతో వైద్యం"

"అవును అదే చాలా వింతగా చెప్పుకుంటున్నారు. విని నవ్వుకున్నాం. నిన్ను ఉండమన్నా నీవు ఉండనన్నావని కూడా విన్నాను. ఇంతటి సమయ స్పూర్తి గలవాడవు. మా వంటి వారి వద్ద ఉంటే వజ్రంలా రాణిస్తావు. నా మాటవిని నావద్ద కొలువులో చేరు. నీవు న్యాయమూర్తిగా మా ప్రజలకు మంచి తీర్పులు ఇచ్చి న్యాయదేవత ఆశీస్సులు పొందాలని నేను కోరుకుంటున్నాను." అజితుడు రామన్న చేతులు పట్టుకున్నాడు. బసవయ్య రామన్న చెవిలో నాయనా ఒప్పేసుకోరా అదృష్టం నిన్ను వరించింది"అని చెప్పాడు.

అక్కడే ఉన్న మల్లుడు రామన్న కాళ్లమీద పడి "నీ గురించి కతలు కతలుగా చెప్పుకోవడం విన్నాను. ఎప్పుడైనా ఆ రామన్నను చూస్తానా అని అనుకున్నాను. తీరా చూసాను కానీ, పెద్ద తప్పుచేసాను. నీ వంటి జ్ఞానవంతుడిని బానిసను చేసుకుని బెల్లం మూటలు మోయించాను. నా తప్పు క్షమించు దొరా! తప్పుడు మార్గంలో ఇకనుంచి బతకను." కళ్లనీళ్లు తిప్పుకున్నాడు. అతడి అనుచరులు కూడా రామన్న పాదాలపై పడ్డారు.

రామన్న మల్లున్ని లేవనెత్తి "నీక్షుద్బాధ నిన్ను నేరజీవితానికి అలవాటు చేసింది. నీ ఆకలి తీరు మార్గం నీకు లేనందున ఇలా ప్రవర్తించావు. సరే, నీవు మంచి మార్గాన్ని ఎంచుకుంటానంటున్నావు. ప్రభూ ఈతన్ని కారాగారంలో వేయాలని తమరు నిర్ణయించారు. నా యందు దయఉంచి ఈతన్ని మన్నించి తమ కొలువులో ఏదైనా పనికల్పించండి." అని అజితుడిని కోరాడు.

"ఈతనికి కొలువులో చేర్చుకుంటాను. నీవు చెప్పావు కనుక తప్పకుండా ఇవ్వగలను మరి నీ మాటేమిటి రామన్న" అన్నాడు.

"ప్రభూ నేను దేశాటన చేయాలని ఉత్సాహపడ్తున్నాను. ఆ తరువాత తప్పక తమ వద్దకు వస్తాను."

అప్పటికే అక్కడికి రాజోద్యోగులు చేరారు. వారు రామన్నను ఆశ్చర్యంగా చూసారు. మంత్రిగా పనిచేసే విరూపాక్ష దేవర అను వృద్ధుడు

రామన్న శరీరాన్ని నిమిరి "నాయనా ఇంతచిన్నవాడవు ఎంత వినయ విధేయతలను ప్రదర్శించావు. ముచ్చటగా ఉంది. నీవు ఇంతవరకు రామన్నవు కానీ నేటినుంచి మర్యాద రామన్నవు. నీ కీర్తి తెలుగు ప్రజల మదిలో చిరకాలం నిలుస్తుంది." చేత్తో తలమీద రాస్తూ దీవించాడు.

రామన్నకు జై! మర్యాద రామన్నకు జై!! అని అక్కడ ప్రజలు నినాదాలు చేసారు. పుత్రోత్సాహంతో బసవయ్యకు కళ్లలో నీళ్లుతిరిగాయి.

బసవయ్య కన్నులు ఆనందంతో వర్షించాయి. ఏతండ్రి అయినా తన కళ్లముందు తనయుడు ప్రజలనుంచి నీరాజనాలు అందుకుంటే చెప్పనలవికాని ఆనందంలో మునిగితేలుతాడు. బసవయ్య కొడుకును ఆలింగనం చేసుకుని నుదుటిపై ముద్దాడాడు. అక్కడవారంతా ఆనందంగా చూసారు. అప్పుడు రామన్న తండ్రిని వారిస్తూ "తండ్రీ కొడుకు ఎంతగా రాణించినా, ప్రయోజకుడు అయినా ఇలా ఏ తండ్రి పిల్లలయందు ఇంతగా ఆనందాన్ని వ్యక్తంచేయరాదు. అది బిడ్డలకు మంచి చేయదు." అని చెప్పి నవ్వాడు. రామన్నపలుకులు అక్కడి వారంతా అవాక్కయి విన్నారు. వృద్ధమంత్రి బసవయ్య భుజం తట్టి "నీవు చాలా అదృష్టవంతుడవయ్యా ఒక విజ్ఞానవంతున్ని కన్నావు. నీవు నీ కొడుకు ప్రయోజకత్వాన్ని చూసి ముచ్చటపడి ఆలింగనం చేసుకున్నావు. కానీ, పామరుడైన నీ కొడుకు ఇది తప్పు అని చెప్పకనే చెప్పాడు. పిల్లలయందు ఎప్పుడు ఈ విధంగా ప్రవర్తించరాదు. అది వారి మున్ముందు ప్రయోకత్వాన్ని దెబ్బతీయగలదు."

"అయ్యా మన్నించండి. గొర్రెలుమేకలు కాపరులమైన మా ఇంట పుట్టినవాడికి రాజులు, పెద్దవారు కీర్తిస్తుంటే చూసి నా వంటివాడు ఏమి కావాలి. మాకు రాజల ముందు నిలబడడమే గొప్ప. అలాంటిది మాకు సాక్షాత్తు రాజే తనకొలువులో న్యాయమూర్తిగా రమ్మంటే ఎంతపెద్ద విశేషం. అందుకే తట్టుకోలేక నా చిట్టితండ్రిని గట్టిగా పట్టుకుని ఆలింగనం చేసుకున్నాను. ఇందులో తప్పుంటే క్షమించండయ్యా" బసవయ్య వృద్ధ మంత్రిని కోరాడు.

అజితుడు రామన్న కొన్ని విలువైన ఆభరణాలు ఇచ్చి పంపాడు.





# అందితే పీక - లేకుంటే కాళ్లు

"అయ్యా నాపేరు చంద్రహాసుడు. నేను సకలు విద్యలు నేర్చిన వాడిని. కానీ, ఏం లాభం? అహంకారంతో కన్నుమిన్నుగానక దేశాటన చేసి చాలామందిని నా విద్యలతో ఓడించి, ఎన్నో సత్కారాలు పొంది చివరికి నా స్వంత ఊరు వచ్చి గర్వంతో ఏమి చేయకుండానే మా పూర్వీకులు ఇచ్చిన ఆస్థులు ఉదరపోషణకై విలాసాలకై ఖర్చుచేసి ఒక రకంగా బికారి నయ్యాను. ఇప్పుడు నా బికారితనం నా విద్యలు ప్రదర్శనకు పెద్దఅడ్డంకిగా మారిపోయింది. చూసావా రామన్న నా శరీరంపై గల వస్త్రం చినిగిపోయి దుమ్ముపట్టిఉంది. తైలసంస్కారం లేకుండా నాతల, గడ్డం నాకే ఛీ అని పిస్తుంటే ఎవరు మాత్రం నన్ను గుర్తించగలరు? ఈ మధ్య బొబ్బిలి సంస్థానంలో కవులకు సత్కారం జరిగింది అక్కడ అష్టావధానంలో నన్ను కనీసం కూర్చోనీయలేదు. కావలి వారు కసిరిపొమ్మన్నారు. నీవు ఇటీవల రాజులు ప్రాపకం బాగా సంపాదించావని విన్నాను. నాకు ఏ రాజువద్ద అయినా కొలువు ఇప్పించావంటే నీకు ఆ వచ్చినదానిలో కొంత ఇవ్వగలను. ఏమంటావు? నీ ఋణం ఉంచుకోను."

రామన్న అతన్ని నఖశిఖపర్యంతం చూసి అతడి మాటల్లో చివర కొలువు ఇప్పించావంటే అందులో కొంత ఇవ్వగలను అనే మాటలు రామన్నను ఒకింత బాధకల్గించాయి. లిప్తలో అతడి మానసికస్థితి గమనించాడు. అతడి వెనుక భార్య పిల్లలున్నారు. వారు బికారుల్లా ఉన్నారు. వారికి ముందు భోజన ఏర్పాటులు చేసి తన ఇంట్లో ఒక చోట విశ్రమించమని చెప్పాడు. బాగా అలసిన భార్యపిల్లలు నిద్రపోసాగారు. కానీ, చంద్రహాసుడు నేలమీద పడుకుని మిన్నుకున్న వాసాలు లెక్కపెట్ట సాగాడు. మరోవైపు రామన్న వద్దకు పలువురు వచ్చి తమ తగవులు చెప్పుకుంటే వాటికి పరిష్కారమార్గాలు రామన్న చెబుతున్నాడు. ఒకచెవితో వింటున్న చంద్రహాసుడుపెద్దగా నిట్టూర్చాడు. అతడి వైపు రామన్న చూసి "ఓ

చంద్రహాసుడా, ఎంతో దూరం నడిచి వచ్చినందున అలసిన మీ భార్యపిల్లలు ఆదమరిచి నిద్రపోతున్నారు. మరి మీరు నిద్రపోకుండా వాసాలు లెక్కించుతూ నేను ఎవరితో మాట్లాడినా పెద్దగా నిట్టూర్చుతున్నారు. కారణం ఏమిటి? నా తీర్పులలో ఏమైనా తప్పులున్నాయా? మీరు సర్వశాస్త్ర పారంగతులు" అని అన్నాడు రామన్న.

"అలా అడిగావు బావుంది నాయనా, అందుకే నీవు రామన్నగా వాసి కెక్కితివి. నీ తీర్పులలో తప్పులు లేవు. లేనిదంతా ఏ హంగులు లేని అతి సామాన్యమైన నీ ఇల్లు, పేదలతో అలరారే నీ గ్రామం లేకుంటే నీకోసం మరింత మంది ధనికులే వచ్చేవారు. ఇప్పుడు కడుపేదవారు నీ వద్దకు వస్తున్నారు. ఆడంబరాలు లేకుంటే ఏ విద్య రానించదు. ఏమంటావు?"

రామన్న నవ్వాడు. "నేను తీర్పులు ఇస్తానని ఎలాంటి ప్రచారంచేయ లేదు. నా వాక్కులు బావుంటాయి అని వారే వస్తున్నారు. ఇకవారికోసం నేను నా గ్రామంలో వారినందరిని ధనికులుగా చేయలేను. లేదా ఊరువదిలి ధనికులు వసించే నగరాలు పట్టిపోలేను. ఉన్నఊరు కన్నతల్లి లాంటిది. ఇక నావద్దకు వచ్చినవారివద్ద నేను ఏమీతీసుకోను. పేదవారు నాకేమి ఇవ్వ గలరు. కనుక నా ఇంటిని ఇంద్ర భవనంగా మార్చుకోలేను. ఉన్నదాంతో తృప్తి చెందడం నాకు తెలిసింది. అంతకుమించి మరేమి ఆశించను."

"రామన్నా ఇలాంటి మాటలు చెప్పుకోవడానికి బావుంటాయి. వచ్చిన వారికి ఫలాస తీర్పుకు ఇంత అని ఒక ధర నిర్ణయించేస్తే నీకు మంచి జరుగుతుంది. ఇప్పుడు వచ్చినవారు నీకు భత్యాలు ఇస్తున్నారు. బుట్టలతో బియ్యం, పప్పులు, కోడిపుంజులు నీకు ఇస్తున్నారు. ఇలా అయితే ఏ రోజు భత్యం ఆరోజుకే చెల్లు. ఎలా బతుకుతావు? ఎప్పుడైనా సంపాదన అనేది నిలకడగా కడవరకు మనల్ని అంటిపెట్టుకుని ఉండదు. అందులో ప్రజలు ఈరోజున్న అభిమానం రేపునిలుపు కోరు. నీలాంటి గాలివాటం వాళ్లు పుడుతుంటారు. ఇలాంటి ఊహించని మహత్యాలు చేస్తుంటారు. ఇవి అట్టే రాణించవు. చేయిదాటకముందే నాలుగు రాసులు సంపాదించుకుని నాలాగున కాకుండా నిలుపుకుంటే కూర్చుని జీవితాంతం జాగ్రత్తగా తినవచ్చు" అన్నాడు చంద్రహాసుడు.





ఆ మాటలు విన్న అక్కడి ప్రజలలో కలకలం పుట్టింది. "ఏయ్ ఎవరయ్యా నువ్వు నీ నోటికి ఏమి వస్తే అదే కూస్తున్నావు. రామన్న గాలి వాటంతో వచ్చి మా మన్ననలు పొందలేదు. అతడికి దైవశక్తి అపారం అతడివెనుక ఏదో శక్తి ఉన్నందున అతడు తీర్పులు మా జీవితాల్లో వెలుగు నిస్తున్నాయి. లేకుంటే మా నిలువెత్తు ధనం పెట్టినా ఇక్కడ రాలేం. చూస్తుంటే నీవు రామన్న పంచన కూటికిచేరి రామన్ననే తప్పుపడ్తున్నావు. బుద్ధిగా మెలగవయ్యా!" ఒకడు రోషంగా నిలదీసాడు. అతడికి మిగిలినవారు అండగా చేరి తలా ఒక మాట అన్నారు.

"చంద్రహాసుడా అలసిన నీవు వాసాలు లెక్కించడం మానుకుని హాయిగా నిద్రపో! తరువాత మాట్లాడుకుందాం." అని చెప్పి రామన్న ఎవరో దంపతులు మధ్య రగడను తీర్చేందుకు సిద్ధపడ్డాడు.

పది దినాలు చంద్రహాసుడు కుటుంబాన్ని రామన్న ఏలోటు లేకుండా మూడుపూటలా భోజనం పెట్టించి, తనింట్లో ఒకింత చోటు నిచ్చివారిని సాకాడు. అప్పటికి చంద్రహాసుడు రామన్న తీరుతెన్నులు బాగా పసిగట్టాడు. అతడి మనస్సులో రామన్న మరింత తేలికయ్యాడు. ఈ పశువులకాపరి తీర్పులలో మనువు రాసిన మనుధర్మశాస్త్రం లేదు. చాణక్య నీతిలేదు. మరి ఏ ఆధారంతో ఈతడు తీర్పులనిస్తున్నాడు. భలేవింతగా ఉన్నాయి ఏది ఏమయినా తన ఖర్మకాలి ఇలాంటివాడి పంచనచేరాను అని చాలా బాధపడ్డాడు. అయిష్టంగానే ఒకరోజు రామన్న పిలుపు మేరకు బొబ్బిలి సంస్థానానికి బయలుదేరాడు. అక్కడ రాజుకు ముందే వర్తమానం అందింది. తమ దర్శనార్థం మర్యాదరామన్న వస్తున్నాడని రాజు అప్పటికే రామన్న గురించి విని ఉన్నందున ఎదురుచూడసాగాడు. దీర్ఘకాలం ఒక సమస్య తన కొలువులో అపరిష్కృతంగా ఉన్నందున ఆ సమస్యను రామన్న ముందు పెడదాం అతడు ఏవిధంగా పరిష్కరించ గలడో చూద్దాం అని ఆశపడ్డాడు.

రామన్న ఒక సాయింత్రానికి బొబ్బిలి చేరాడు. మట్టికోట ముందు నిలిచారు. రామన్న, చంద్రహాసుడు. ద్వారపాలకులకు తాను ఎవరైంది చెప్పాడు రామన్నను వారు స్వాగతించి రాజు ముందు నిలిపారు.

"రామన్న ఇంత చిన్నవయస్సులో నీ మంచి తీర్పులతో వాసికెక్కితివి. మాముందు దీర్ఘకాలం పరిష్కారం కాని ఒక సమస్య ఉంది. దాన్ని నీవు ఎలాగైన ముడివిప్పి మా మన్ననలు పొందాలి." బొబ్బిలిని ఏలే ఐదవరాజు రాయడప్ప రంగారావు ఉచితాసనం చూపి అడిగాడు.

"ఓ రాజా తమవంటి ప్రజ్ఞావంతులు విప్పలేని సమస్య అంటూ ఏమి ఉండదు. నా వంటివానిని ప్రోత్సాహించాలని తమరు నాకు ఒక అవకాశం కల్పించుచున్నారు. పౌరుషానికి, వివేకానికి పేరుగన్న బొబ్బిలి వారి ముంగిట నేను ఏపాటివాడను." రామన్న చేతులు కట్టుకుని మరీ బదులిచ్చాడు.

"నీపక్కనే ఉన్న తేజోవంతుడు ఎవరు? చూస్తుంటే బ్రాహ్మణునిలా పండితునిలా వెలిగిపోతున్నాడు."రాజు భృకుటి ముడివైచి అడిగాడు.

అందుకు చంద్రహాసుడు నవ్వి "ఓరాజాధిరాజా జగమెరిగిన బ్రాహ్మణునికి జంధ్యమేల అన్నట్టు నా తేజోరూపలావణ్యం తమకు నా ఉనికిని తెలియచేసినది. మీ ఊహనిజం. నేను పండితున్ని. ఒకరోజు బికారిలా వచ్చాను. ఆ రోజు పండిత సభ జరుగుతోంది. మీ కావలి వారు నన్ను గేలిచేసి గెంటి వేసినారు. కారణం ఆరోజు నా రూపంలో అమావాస్య చంద్రుడున్నాడు. ఈరోజు పౌర్ణమినాటి చంద్రబింబం తాండవమాడు తున్నది. చూసారా మనిషి గుర్తింపబడేది బాహ్యసౌందర్యంతో, అంతేకాని మానసిక సౌందర్యంతోకాదు. కారణం ఎవరికైనా తొలుత కన్పించేది వేషభాషలు ఆ తరువాతే మిగిలివన్నీ నేను చెప్పినది యధార్థం కాదా రాజా!"అని వేదాంతిలా నవ్వాడు.

"మీ వాక్చాతుర్యం చాలా చక్కగా ఉంది. పండితుడా నీవంటివాడు కూడా రామన్నను అనుసరించి వచ్చుచున్నావంటే రామన్న ఎంతటి న్యాయ మూర్తియో చెప్పకనే చెబుతోంది. సరే, మీరాక గల కారణం?"

అందుకు చంద్రహాసుడు రామన్నను అదోలా చూసి" రాజా విధి శాసనాన్ని తలవంచక తప్పదు. ఈరోజు రామన్న నాకు గతి. ఆపైన, తమ





అనుగ్రహం అందుకే నేను నా పాండిత్యాన్ని పక్కకుపెట్టి రామన్నను అనుసరించి వచ్చితిని"

రామన్న రాజుతో తను ఎందుకు వచ్చింది వివరించాడు. "రాజాధి రాజా ఈతని బాహ్యసౌందర్యం చూసారు కదా, ఈతడు బహుముఖప్రజ్ఞశాలి ఇట్టివానికి తమరు తమ కొలువునందు పండితులలో పండితునిగా గుర్తించి ఆశ్రయం ఇవ్వాల్సిందిగా ప్రార్థిస్తున్నాను. కావాలనుకుంటే ఎలాంటి శాస్త్రపరీక్షలైనా నిర్వహించగలరు."మిక్కిలి వినయంతో కోరాడు.

"రామన్న నీవు చెప్పిన తరువాత ఇంకను ఈ పండితున్ని ఏవిధంగా విచారించపనిలేదు. ఈతడు నీవన్నట్టు బహుముఖ ప్రజ్ఞాశాలి, అవశ్యం తీసుకుంటాను. ఇక నావద్ద ఉన్న దీర్ఘకాల సమస్య ముడి విప్పి నాకు మానసిక ఆనందాన్ని కలుగచేయగోర్తున్నాను."రాయప్ప రంగారావు చిర్నవ్వుతో కోరాడు.

చంద్రహాసుడు చేతులు జోడించి "అయ్యా నేను ఈ క్షణం నుంచి తమ కొలువులో చేరినందున వివిధశాస్త్రపరిజ్ఞానవంతుడనైన నాకు ఎలాంటి చిక్కుముడి సమస్య అయినా అడుగవచ్చు. దాన్ని ఛేధించడం నాకు తృటిలో పని. చెప్పండి ప్రభూ!" లేచి నిలబడ్డాడు.

రాజు ముఖంలో రంగులు మారాయి. చంద్రహాసుని వైపు అదోలా చూసాడు. "ఓయీ నీవు శాస్త్రపరిజ్ఞానివి కావచ్చు. నీపాటి శాస్త్రం నా వద్ద ఉన్న పండితులకు తెలుసు. వారిని మించిపోవు. నిన్ను తీసుకున్నది రామన్న చెప్పినందున లేకుంటే నీ అవసరం మాకు లేదు. నీవు మా మధ్య జరుగు సంభాషణలో అర్థంలేకుండా ప్రవేశించకు. అది నీకు క్షేమం కాదు." చిర్రెత్తి పోయాడు రాజు. ఆ కోపాన్ని చూసి అక్కడివారు భయభ్రాంతులయ్యారు.

రాజు మాటలకు చంద్రహాసుడు బిక్కముఖం వేసి కూర్చుండి పోయాడు.

రామన్న రాజు మనస్సుకు ఒకింతనొప్పి కలిగిందని భావించి "క్షమించండి ప్రభూ! ఈతడు శాస్త్రములు తన నాలిక మీద నర్తిస్తున్నాయి

అనే గర్వంలో ఉన్నాడు. తన వరకు వస్తేగాని నోరువిప్పరాదన్న ప్రాథమిక ఆలోచనలేనివాడు. అందుకే చాలా కష్టములు ఇంతకాలం అనుభవించాడు. కూటికి గతిలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు.అయినను బుద్ధిరాలేదు. ఏలినవారి ప్రాపకంలో బతుకు ఈడ్చుతూ వారిని అన్నివిధాల ఆకట్టుకోవాలి.ఏవిధంగా రాజుల మనస్సును నొప్పించరాదన్న సత్యం ఎరుగనివాడు. తమరు మన్నించి నా వలన మీ సమస్య ముడి వీడుతుంది అని మీకు నమ్మకం ఉంటే తప్పక తెలియపరిచండి. నేను నా శాయశక్తుల ప్రయత్నించగలను."

"రామన్న నీమాటలు అమృతపలుకులు నీ తీర్పు మాకు అవశ్యం కావాలి.  ఒక సమస్య బొబ్బిలిని పట్టిపీడించుచున్నది. అదేమంటే ఇక్కడ నీవన్నట్టు పౌరుషానికి ప్రతీకలుగా మానవులేకాదు, పశుపక్ష్యాదులకు కూడా ఉన్నాయి. ఈమధ్య ఇక్కడ కుక్కుటాలు (కోడిపుంజులు) ఎదుటి పుంజులను చంపేవరకు తమ ప్రాణాలు బొందిలో నిలుపుకుంటున్నాయి.దీనివలన రానున్న కాలంలో ఏమైనా పొరుగు రాజులతో పొరపొచ్చాలు వచ్చే అవకాశం ఉందని భయపడ్తున్నాం. ఇటీవల విజయనగరంలో సరదాగా కోడిపందేలు జరిగాయి.అదీ అక్కడ రాజులు కావాలని ఎన్నో ఊళ్లనుంచి కోడిపుంజులను తెప్పించుకుని ఆ పందాలు ఆనందంగా నిర్వహించారు. అయితే, విజయనగరం పుంజులు ఏ ఒక్కటి గెలవలేదు.బొబ్బిలి పుంజుల ముందు ఏవీ నిలబడలేకపోయాయి  అందుకు ఇక్కడ నేలసారం గురించి ఆరాలు తీసారని విన్నాం. చూస్తే విజయనగరం చాలాపెద్దది. వారి సైన్యం లక్షల్లో ఉంది.మేము వందలలో ఉన్న సైన్యంతో పౌరుషంగా బతుకుతున్నాం. ప్రతి ఏడాది ఈ కోడిపందాలు అక్కడ జరుగుతున్నాయి. ఇక్కడినుంచి కోడిపుంజులు తీసుకు వెడుతున్నారు. ఇక్కడి పుంజులు మాత్రమే పందాల్లో పైచేయిగా ఉన్నాయి. అవి అక్కడ రాజులు జీర్ణించుకోలేకపోతున్నారు. వీటివలన మా మధ్య ఉన్న మైత్రీ బంధం తెగిపోతుందని ఒక అనుకోని భయం మమ్మల్ని చాలాకాలంగా వెంటాడు తోంది.వారి కాల్బలం యాభైవేలకు పైమాటే.ఇక గజబలం,అశ్వికబలం అవన్నీ అదనంగా





ఉన్నాయి. ఎటుచూసినా,వారు బలవంతులు మేము కేవలం వందల సంఖ్యలో సైన్యం కలిగి ఉన్నాం. పౌరుషంగా ముందుకు సాగిపోతున్నాం. కానీ, అనవసరంగా పొరుగు రాజులతో లేని శత్రుత్వం చాపకింద నీరులా సాగిపోతోంది.  ఏమిచేయాలి?" అని రాజు అడిగాడు. అక్కడ ఉన్న బొబ్బిలి వెలమవీరులు వింటూనే మొలలో వేలాడుతన్న  కత్తులపై పిడికిల్లు బిగించారు.

రామన్న తలపంకించి "రాజా మీరు భయపడ్తున్నంత పెద్దకీడు ఏదో రోజు మీకు ఎదురుకాగలదు. కారణం పొరుగున ఉన్నరాజు బలవంతుడు. విజయ నగరం ఒక సామ్రాజ్యంలా వెలుగుతోంది. మీరు అతి చిన్నరాజ్యానికి ఏలికగా ఉన్నారు. జీవరాసులను అడ్డుపెట్టుకుని శత్రుత్వం ఎవరూ పెంచుకోరాదు. ఆనాడు పల్నాటి యుద్ధంకు కారణం కోడిపందాలు వాటిని స్ఫూర్తిగా తీసుకుని ఇలా కోడిపందాలను ప్రతి ఏడాది జరిపి ఆ రాజులు ఏమేమో చేయాలని చూస్తున్నారు. ఈరకంగా శత్రుత్వం  పెంచుకోరాదు అని వారికి చెప్పడానికి ఎవరూ ముందుకు రారు.కానీ, ఏదో రోజు మీకు వారికి మధ్య ఆద్యం పోయడానికి కొన్ని దుష్టశక్తులు ముందుకు వస్తాయి. ఏదిఏమయినా యుద్ధం అనివార్యం కాగలదు. కానీ బలవంతుడు ఇలాంటి చిన్న కారణాలు  వెతుకుతాడు. మీ వరకు వారితో మీకుగా మీరు ఎప్పుడు కోడిపందాలలో పాల్గొనకుండా ఉండగలిగితే మీరు వారి ఆలోచనలను తుడిచిపెట్టినవారవుతారు. మీ సమస్యకు ఇదే నా పరిష్కారం. ఇంతకు మించి ఏమి చెప్పగలను."రామన్న ఆలోచించి మరీ చెప్పాడు.

రాజు అదోలా నవ్వి "రామన్నా, ఇది యుద్ధతంత్రం దీనిపై చర్చిం చేందుకు  వేరేవారు రణతంత్రాలు ఎరిగినవారు మావద్ద ఉన్నారు. వారు యుద్ధమే అనివార్యం అయితే కోడిపుంజులలో ఏమి చూసారు పొరుగు రాజులు. బొబ్బిలివీరుల ఖడ్గవిన్యాసానికి విజయనగరం సైన్యం కకావికలమై పోతుంది. మందిని చూసి మురిసిపోతోంది. దాసోహం అనేవరకు నిద్రపోరు బొబ్బిలి వీరులు. ఇప్పుడు ఆప్రస్తావన వచ్చిన మరుక్షణం ఇక్కడ ఆస్థానంలో వివిధశాఖలలో పనిచేసేవారి కరవాలలో కత్తులపై పిడికిల్లు బిగుసుకున్నాయి.

అంటే బొబ్బిలి వీరులు ఏక్షణమైనా ప్రాణాలు తెగించి పోరేందుకు ఎవరికి వారు సిద్ధంగా ఉన్నారు. కానీ,నాకు యుద్ధం చేయాలని లేదు. జననష్టంకు నేను తీవ్రవ్యతిరేకిని. అయితే యుద్ధం అనివార్యం అయితే ఎదురు నిలువక తప్పదు. నిన్ను ఎందుకు అడిగానో తెలుసా? నీవు ఎన్నో చిక్కు సమస్యలు విప్పావని విన్నాను.నీనుంచి ఒక మంచి సూచన వినాలని ఆశ."

"పొరుగురాజు తనబలంతో ఏవో సాకులు వెతుక్కుంటున్నాడు. వారికి మంది బలం, మీకు మనోబలం. రెండు గొప్పవే. కాలమే మీ పౌరుషానికి గుర్తింపునిస్తుంది. మీరు మనోబలం వదలవద్దు. అదే మీకు శ్రీరామరక్ష."అని చెప్పాడు. రామన్న మాటలకు అక్కడ ఉన్న బొబ్బిలి వీరులకు పెద్దగా రుచించి నట్టులేదు.అందుకే వారు ఎలాంటి కరతాళధ్వనులు చేయలేదు.

పక్కనే ఉన్న చంద్రహాసుడు ముళ్లు మీద కూర్చున్నట్టు కూర్చున్నాడు. రామన్నకు ఈ బొబ్బిలి రాజు అడగకూడని యుద్ధతంత్రం గురించి అడగడం ఈ రామన్న పెద్ద ఆరినవాడిలా చెప్పడం పక్కనే కూర్చుని వినలేక ఒక విధంగా చెవులు మూసుకుందామా, అన్నంతగా ఇబ్బందిపడిపోసాగాడు.

"రామన్న నీవు చెప్పినది నా ఆలోచనకు దగ్గరగా ఉంది. నిజమే ఎట్టిపరిస్థితిలో మేముగా కోడిపందాలలో పాల్గొనం." అన్నాడు రాజు.

"ఏలినవారికి ఒక విన్నపం ఈ చిన్నవాని మాటలకు మేము ఏకీభవించలేము. నేను చాలా కాలంగా ఈ కొలువునే నమ్ముకుని బతుకుతున్నాను. నాకు బొబ్బిలి కీర్తిప్రతిష్టలు మించి ఏదీఎక్కువకాదు. అందుకు నా ప్రాణాలు బలైనా సరే, పొరుగురాజులు ఎంతటి బలవంతులైనా బుద్ధిచెప్పకతప్పదు." సర్వసేనాని తన దృఢచిత్తం తెలిపాడు. ఆమాటలకు సభికులు హర్షధ్వనాలు చేసారు.

చంద్రహాసుడు నవ్వాడు. హమ్మయ్య రామన్నకు వ్యతిరేకత భలేగా ఎదరయ్యింది అని లోలోపల అనుకుంటూనే తాను చప్పట్లు చరిచాడు. అప్పుడు రాజు చూసాడు."ఏమయ్యా చంద్రహాసా, నీవుకూడా రణోత్సాహం చూపుతున్నావా?" అడిగాడు ఒకింత ఆశ్చర్యంతో.






"ప్రభూ నేను మీ కొలువులో చేరాను. ఆ క్షణం నుంచి ఇక్కడ రాజసేవ రాజ్యవిస్తరణ, రాజ్యక్షేమం కోరుకుంటున్నాను. రామన్న చిన్నవాడు అతడికి తెలిసిన శాస్త్రం ఏమిలేదు. ఏదో దైవసంకల్పం వలన అతడు ఏదో చెబుతాడు దాన్ని ప్రజల ఆమోదిస్తున్నారు. అతని తీర్పులకు ప్రచారం లభించింది. ఇది గాలివాటం. ఇప్పుడు అతడి పలుకులు వెలవెలాబోయినవి. ఇక్కడ ఏ ఒక్కరూ హర్షించలేదు. అన్ని తెలిసిన మీరే ఇలా ఒక బుడుతడిని పట్టుకుని ఎత్తేస్తుంటే శాస్త్రం తెలిసిన నా వంటివారు ఏమవుతారు? కర్మకాలి నేను ఈతని ద్వారా మీపద్దకు వచ్చాను. కనుక ఈతడు చెప్పిన రణతంత్రం విని జీర్ణించుకోలేక కూర్చున్నచోట స్థిరంగా లేకపోతిని.ఏమి చెప్పమంటారు? ఇలాంటి సంఘటనలే పండితునికి ఎవరూవేయని శిక్ష అంటే అందుకే మన పూర్వకవులు చెప్పారు వాసుదేవుడంతటివాడు గాడిదకాళ్ళు పట్టుకున్నాడని. ..........."

ఆమాటలకు రాజుకు పట్టరాని కోపం వచ్చింది.

"ఏమి నీ శాస్త్రపరిజ్ఞానం? బుద్ధిహీనుడుగా మాట్లాతున్నావు. ఈతడు చెప్పినదానిలో యుద్ధనీతి ఉంది. ఉత్తేజపూరితంగా మాట్లాడితే అతడు బాగా చెప్పినట్టా? లేకుంటే అతడి మాటలు గాలివాటంగా ఉన్నాయంటున్నావు. బావుంది నీతీరు. చిన్నవాడికి ఉన్నంత ఇంగితం మీకు లేనందుకు చాలా బాధగా ఉంది. ఇక్కడ సేనాని రణోత్సాహం చూపుతున్నాడంటే అతడు ఆ పదవి చేపట్టిన నాటినుంచి ఒక్క యుద్ధం కూడా మేము ఎవరితో చేయలేదు. అతడికి ఏదో యుద్ధం చేసి తాను విజేత కావాలి అనే ఆశలో ఉన్నాడు. అందులో తప్పులేదు. అతడు సర్వసేనాని.కానీ, నీవు పండితుడవు. పండితునివలే మాట్లాడుటలేదు. ప్రాణనష్టం అంటే ఇష్టపడని బ్రాహ్మణుడవై ఇలా ఎందుకు మాట్లాడావంటే నీకు రామన్నపై చిన్నచూపు ఉంది. అతడి ద్వారా నీవు ఇక్కడ కొలువు సంపాదించి కూడా కనీసం విశ్వాసం చూపలేదు. ఒక్కరోజు ఓపికగా లేవు ఈర్ష్యాద్వేషాలతో మనుగడ సాగించే నీలాంటివారు నా కొలువులో కొనసాగడం ప్రమాదం.నీవు అనవసరం పొమ్ము. రామన్నతో





వచ్చినందున నిన్ను విడిచిపెడుతున్నాను లేకుంటే నీకు తగిన శిక్ష విధించేవాడిని."అని కసురుకున్నాడు రాజు.

రామన్న లేచి "ప్రభూ మీరు అడిగినదానికి నాకు తోచినది చెప్పాను. నా పరిష్కారమార్గం ఇక్కడివారికి రుచించనిచో మన్నించగోర్తున్నాను." అని సభికులను చూసిచేతులు జోడించి మరీ చెప్పాడు.

అప్పుడు సభికులు రామన్న ముందుకు వచ్చి "అయ్యా చిన్నవాడవైనా చక్కగా చెప్పగలిగావు. మేము రాజుగారికి అనుక్షణం రాజ్యరక్షణలో భాగంగా ఉత్తేజం కల్గించేలా ఉండాలి. ఏ క్షణమైనా రణానికి సిద్ధంగా ఉన్నాం అని చాటి చెప్పుకోవాలి అప్పుడే అరాజు,దీర్ఘకాలం ధైర్యంగా ముందుకు సాగగలడు. పొరుగురాజు బలంగా ఉన్నాడు. మేము యుద్ధం చేయలేం అని చెప్తే ఏలిక ఏమికావాలి?" అని వారి మనోగతాన్ని ఒక్కొక్కరు తెలిపారు.

సేనాని రామన్న చేతులుపట్టుకుని "యుద్ధమన్నా ఎవరికి తీపి, అంతా సుఖంగా ఉండాలి. ఎలాంటి యుద్ధాలు రాకుండా మనవంతు అన్నివిధాల ప్రయత్నాలు చేయాలి.కానప్పుడు కదనానికి తరలిపోవడమే. ఇదేకదా ఏరాజ్యంలో అయినా జరిగేది.నా పదవి సేనాని అంటే అనుక్షణం కోటరక్షణ. రాజ్యవిస్తరణ,రాజులను అన్నివిధాలరక్షించుకునే బాధ్యత కనుక యుద్ధోన్మాదిలా ఉండాలి లేకుంటే శత్రువులు మన మీదకు దండెత్తి వస్తారు. చిన్నవాడవైనా చక్కగా చెప్పావు. చివరివరకు తెగేవరకు లాగక తప్పదు. అప్పుడే మనం ప్రజలను రక్షించగలం. ఆచితూచి అడుగేయాలి. లేకుంటే అనవసరంగా ఇరువైపులా ప్రాణనష్టం. నీ పలుకులు నాకెంతో స్ఫూర్తి నిచ్చాయి."

చంద్రహాసుడు బిక్కచచ్చిపోయాడు."ఇలా అయిందేమిటి తాను అనవసరంగా బయటపడిపోయి లభించిన కొలువును కాలదన్నుకున్నాడు. ఇప్పుడు రామన్న ముఖం ఎలా చూడాలి. అయ్యో నాలో అహం, అసూయ ఇవి ఎప్పుడు నన్నువిడిచిపోతాయి." తలచుకుని లోలోపల కుమిలి పోయాడు.

రామన్నను అంతా ఎత్తిపొగిడారు. రాజు విలువైన ఆభరణాలు ఇచ్చాడు. అక్కడ చంద్రహాసుడు ఒంటరిగా మిగిలిపోయి ఏడుపుముఖం పెట్టాడు.రామన్న అతన్ని నవ్వుతూ పిలిచి "పదండి చంద్రహాసా, మీ కారణంగా బొబ్బిలిరాజులను దర్శించగలిగాను. లేకుంటే ఇప్పట్లో వచ్చే వాడిని కాను. ఇక్కడ ఏమి లభించినా అది మీదే, ఇది తీసుకోండి. మీకు నేను ఇప్పించిన కొలువును మీరు మీ అమాయకత్వంతో కోల్పోయారు. మీ తీరుకు ఆగ్రహించి ఇచ్చిన పదవిని రద్దుచేసి పొమ్మన్న రాజుగారిని నేను తిరిగి ఆ పదవి కట్టబెట్టండి అని కోరలేను. నాపై గంపెడు ఆశతో వచ్చి కొన్నాళ్లుగా నా ఇంట కుటుంబంతో సహ ఉంటున్న మీకు ఏదో చేయాలి.మీరు, మీపిల్లలు బతకాలి. కనుక ఈ ఆభరణాలు మీకు ఇస్తున్నాను.వీటితో కొన్ని ఏళ్లు బతుకు ఈడ్చవచ్చు. చాలా విలువైనవి."అని ఆభరణాలు ఇచ్చాడు. అక్కడున్నవారంతా ఆశ్చర్యపోయారు.రాజు మరింత చకితుడయ్యాడు.

"రామన్న నీ సమయస్ఫూర్తి నాకెంతో నచ్చిందయ్యా! చంద్రహాసునికి మరోసారి నీవు నా కొలువులో పదవిని చాలా చక్కగా, నేర్పుగా కట్టబెట్టితివి. నీకు ఇచ్చిన బహుమానాలు నీవు అతడికి ఇవ్వనక్కరలేదు. చంద్రహాసుని నా కొలువులో ఉంటాడు" అని భుజం తట్టాడు.

చంద్రహాసుడు రామన్నను ఆలింగనం చేసుకుని "నాయనా నన్ను క్షమించు అన్నింటా మేటినని నిన్ను ప్రతిక్షణం చులకనగా చూస్తిని.నాకోసం నీవు ఏమి చేసినా విశ్వాసం లేశమైన చూపక నీకు అనుక్షణం వెన్నుపోటులా ప్రవర్తించాను. కానీ, నీవు నాకంటే గొప్పవాడవు.ఆగ్రహించిన రాజును శాంతపరిచేందుకు నీ మాటలు ఎంత చక్కగా పనిచేసాయి.నిన్ను ఇంత మందిలో నా అహంతో హీనపరిచినా నన్ను మన్నించి నాకు నా కుటుంబానికి జీవనాధారం మళ్లీమళ్లీ కల్పించావు. చిన్నవాడవైనా నీకు చేతులు ఎత్తి మొక్కుతున్నాను."

అంతా రామన్నను పెద్దకళ్లు చేసుకుని మరీచూడసాగారు.





# వనితలు వలచి రావాలి

రామన్నకు కుడుపాం సంస్థానం నుంచి కబురువచ్చింది. ఉన్న పళంగా మా రాజు తీసుకురమ్మన్నారు. బయల్దేరండి గుర్రాలు సిద్ధంగా ఉన్నాయి"అని చెప్పి యమబంటుల్లాంటి సిపాయిలు వాకిలిలో కూర్చున్నారు. కుడుపాం సంస్థానం అంటే ఒకరకమైన భయం వారు.కొండజాతికి చెందిన రాజులు వారిపాలనలో ఎక్కువభాగం హింసా మార్గంలో ఉంటుంది. ఏ చిన్న నేరంచేసినా అంగవిచ్ఛేదం వంటి క్రూరమైన శిక్షలు విధిస్తుండేవారు. వారికి సభ్యప్రపంచంతో సంబంధాలు తక్కువే . అలాంటప్పుడు రామన్న అవసరం ఏమొచ్చింది?అని రామన్న తండ్రి బసవయ్య మిగిలిన గ్రామస్థులు మాట్లాడుకోసాగారు.ఎట్టి పరిస్థితిలో పంపకూడదు అని అనుకున్నారు.

రామన్న శివాలయంకు వెళ్లివచ్చాడు. వాకిల్లో ఉన్న వారిని అడిగి విషయం తెలుసుకున్నాడు."అయ్యా ఇక్కడికి తూర్పుకొండల్లో ఉంది మాకోట. ఆవైపు నుంచి వెడుతున్న పర్లాఖిముండి రాజు యొక్క పరివారంపై దాడిచేసి వారి మంత్రి,సేనాని అమ్మాయిలను పట్టుకుని మారాజు పెళ్లివరకు వెళ్లాడు. ఆ అమ్మాయిలకు ఈసరికే వివాహనిశ్చయమైనందున వారు ఎంతమాత్రం కుదరదు అన్నారు. బలవంతంగా వారిని చేపట్టేందుకు మా కోయరాజు సిద్ధంగా ఉన్నాడు. పాపం అమ్మాయిలు రామన్న చేసుకో మంటే చేసుకుంటామని చెప్పారు. కనుక కదిలి రావల్సిందే. మీ తీర్పును మా రాజుకు అనుగుణంగా ఇవ్వాలి లేకుంటే రాజు కోపానికి మీ బతుకు బుగ్గిపాలుకాక తప్పదు."

అప్పటికే అక్కడికి చేరుకున్న గ్రామస్థులు ఎంతమాత్రం రామన్నను పంపం మీరు ఏమిచేసుకుంటారో అది చేసుకోండి. కొండల్లో ఏలేరాజుకు ఇక్కడివారితో పనేంటి? పెళ్లే చేసుకుంటాడో ప్రాణమే తీసుకుంటాడో అతడి ఇష్టం.రామన్న రాదు పొండి " అని కోపంతో చిరుబురులాడారు.

ఆ వచ్చిన సిపాయిలు మతితప్పినసట్టు అక్కడివారిని చూసి "ఈరోజు రామన్న రాకుంటే జీవితాంతం మూల్యం చెల్లించుకోక తప్పదు. రామన్నకే కాదు మీకు మృత్యువు పొంచి ఉన్నట్టే." హెచ్చరించారు.

రామన్న వారిని సముదాయించి "పదండి నేను వస్తాను. మీకోసం, మీ హెచ్చరికలకు భయపడికాదు. మీ రాజుకోసం అంతకంటే కాదు. నాపేరు చెప్పిన ఆ అమ్మాయిల కోసం వస్తున్నాను. ఇక తీర్పు అనేది మీ రాజుకు అనుకూలమా? ప్రతికూలమా అనేది అక్కడ పరిస్థితిబట్టి తేలుతుంది. అంతే కాని అనుకూలంగా చెప్పడానికి నేను మీ బంటును కాను." చెప్పి వారితో బయల్దేరాడు. బసవయ్య అడ్డుపడినా నచ్చజెప్పి మరీ వారితో బయలుదేరి వెళ్లిపోయాడు.

తూరుపుకొండల్లో గుర్రాలు దూసుకుపోసాగాయి. మధ్యలో కొండ సిపాయిలు రామన్నకు నచ్చజెప్పారు." మా కొండరాజు మనస్సులేని బండ అతనికి కాదని తీర్పు చెబితే నీవు చావును ఎదర్కొంటావు ఆతరువాత నీఇష్టం. మా కొండరాజు పేరు ఆదోరా (ఆదివారం) (ఎక్కువగా శ్రీకాకుళం జిల్లా కొండల్లో ఒరిస్సాకొండల్లో ఉన్న గిరిజనుల పేర్లు వారాలు పేర్లుతో ముడిపెట్టి ఉంటాయి.) మాసెద్ద కోపంతో పెట్రేగిపోతాడు. అంతటి భయానకమైన మనిషి, ఆ మహిళల మీద సరదాపడ్డాడు కనుక ఆ అమ్మాయిలకు మనువాడమని చెప్పు. నిన్ను చాలా సంతోషపెడతాడు" అని బాగా నూరి పోసారు. మధ్యలో గుర్రాలను ఆపి చిన్నవాగుల్లో వాటికి నీళ్లు పట్టించి తాము తాగి గమ్యం చేరారు. కొండల్లో రాజు చిన్నమట్టికోటలో ఉన్నాడు. బలంగా పొడుగ్గాఉన్నాడు. వెదురుకర్రలతో నిర్మితమైన బోనుల్లో ఇద్దరు యువతులను బంధించాడు. వారు అతిదీనంగా అందులో కూర్చున్నారు.

సిపాయిలు తలలు వంచి నమస్కరించి "ఇదిగో రామన్నను తీసుకుని వచ్చాం. ఇప్పుడు మీకు నచ్చేలా తీర్పునిస్తాడు" అని భుజాలు చరిచారు.

"అలా అయితే ఈ బోనులో గువ్వలు నన్ను మనువాడుతారా?"





రాజుకు రామన్న నమస్కరించాడు. రాజు ఎగాదిగా చూసి "రామన్న దొరకలేదా? అతడి పుంజును తీసుకుపచ్చారా? ఈ పుంజు (కొడుకు) తీర్పునిస్తుందా? మొత్తం రామన్న కుటుంబం అంతా న్యాయ దేవతలేనా?"

బోనులో యువతులు రామన్నను వింతగా చూసారు. "ఇంత చిన్నవాడా రామన్న ఇతడేం మనకు న్యాయం చేస్తాడు. మరీ బాలుడిలా ఉన్నాడే. ఆ వేషమేమిటి పశువులకాపరిలా ఉన్నాడు." అని అనుకున్నారు.

"కాదు దొరా ఈతడే రామన్న. మంచి మాటకారి. మేము వెళ్లేసరికి చాలామందికి తీర్పు చెబుతున్నాడు. మంచిగా న్యాయం చెబుతాడంట" అన్నారు.

"కుర్రాడు మరీ బొత్తిగా పుంజు వయస్సువాడేరా, సరే ఆ కన్నెలు కోరారు. మనం కాదనలేం. ఓ పుంజా నాకు ఆ ఇద్దరు అడవిలో చిక్కినారు. మనువాడతానన్నాను. నాపెంటి (భార్య) ఒప్పుకోలేదు. అది తిరగబడ్డది సస్తానంది. సావమన్నాను. మంచి వాటం మీద ఉన్న ఈ గువ్వల్ని చూసాక నా మనస్సు నాది కాలేదు. నా కోరిక సెప్పినాను. వీళ్లు మరీ బెట్టుచేసి కాదన్నారు. వేరే వారితో మనువు కుదిరిందన్నారు. అంతలోనో పర్లాఖిముండి రాజావారు కబురంపినారు. బందీలు చేసిన కన్యలను విడిచిపెట్టకపోతే యుద్ధం తప్పదంటున్నాడు. అఖండసైన్యంతో వచ్చి ప్రాణాలు తీయంది వదలను అని పొలికేకలు పెడ్తున్నాడు. సావుకైనా ఒప్పుకుంటాను కానీ, వదల్లేను అంతగా వీరిమీద మనస్సు పడినాను."అని రామన్నకు చెప్పాడు.

రామన్న బోనులో కన్యలను చూసి "ఆ రాజు అంతగా ముచ్చట పడ్తుంటే మీరు ఎందుకు కాదంటున్నారు. మీకు మనువు కుదిరింది అంతేకదా! స్త్రీకి పెండ్లి అయ్యేవరకు ఆమె పెండ్లి మీద ఆమెకు సర్వ హక్కులుంటాయి. మీరు కావాలంటే ఈతన్ని చేసుకోవచ్చు. దానికి నా ద్వారా చెప్పించాలనుకున్నారేమిటి? అటవీప్రాంతాన్ని ఏలుతున్న ఈ రాజుకు ఏమి తక్కువ".

"ఇంత చిన్నవాడవని మాకు తెలియదు. నీవు పెద్ద వయస్సు వాడివి అనుకున్నాం. అందుకే అనుభవజ్ఞుడైన రామన్న చెబితే వింటామని చెప్పాము. ఆఖరికి ఈ కొండవాడు,బండమనిషిని చేసుకోవాల్సి వచ్చినందుకు చావాలనిపిస్తోంది. వాడినిచూస్తుంటే శరీరం మీద జెర్రులు పాకుతున్నట్టుగా ఉంది ఎలాగైనా తప్పించు."అని ప్రాధేయపడ్డారు.

"ఏమి కుర్రపుంజూ ఏమి సెప్తావు? నీ తీర్పు నాకు భలే అనిపించాలి. ఆ ఇద్దరిని నేను మనువాడి తీరాలి." రాజు నర్తించి మరీ అడిగాడు.

"ఓ కొండరాజా నీకు ఈ ఇద్దరు జోడిగా బావుంటారు. అవశ్యం చేసుకో! వారు అరిచి గీపెట్టినా వదలకు. వారిని చేసుకుంటే నీకు ముగ్గురు పెంటిలతో అన్నివిధాల రాణింపు, ఇద్దరు అయితే యమగండం. అనుకున్న తరువాత ఎవరిని విడిచిపెట్టరాదు. ముగ్గురు వలన నీ రాజ్యం విస్తరించి పోతుంది. నీకు అపజయం లేదు." తన తీర్పునిచ్చాడు.

రాజు ఎగిరిగెంతాడు అతడి వెనుక సిపాయిలు నర్తించారు. పెద్దగా బూరలు ఊదారు. దప్పులు మ్రోగాయి. భేరీలు చెవులు బ్రద్దలుచేసేలా కొండల్లో ప్రతిధ్వనించాయి. "రామన్న నీవు పిల్లచేష్టలతో తీర్పులు ఇస్తున్నావు. నీవు ఇలా మా బతుకుల్లో నిప్పులు పోస్తావనుకోలేదు. మేము ఈ బండను చేసుకోం. ఆ భేరి మ్రోతలేమిటి పెళ్లా? చావుమేళమా?" వెదురు బోనులోంచి అరిచారు ఆ కన్యలు. వారిని చూసి రామన్న జాలిపడ్డాడు.

భేరీలు మ్రోగడంతో కొండరాజు భార్య కత్తితో పొడుచుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆ వార్త మోసుకొచ్చారు కొందరు కొండ సిపాయిలు. ఆ చావు వార్తను విని కొండరాజు ఏమి పట్టించుకోలేదు. ఆ శవం నాకళ్ల పడకుండా జాగ్రత్తపడండి నేను ఇప్పుడు పెండ్లికొడుకును. అశుభమైన ఆశవం చూడను." అని అన్నాడు. కొందరు మహిళలు బోనులో కన్యలను ముస్తాబు చేసేందుకు సిద్ధం అవుతుండగా రామన్న వారిని నిలువరించి "ఆగండి. ఓ కొండరాజా ఎంతతప్పు చేయుచున్నావు నీకు ముగ్గురు భార్యలు జాతకరీత్యా రాణింతురు. ఇద్దరు రాణించరు యమగండం కూడా, తొలుత





ఇద్దరు అనుకుని వారిలో ఒక్కరిని చేసుకున్నా ప్రాణప్రమాదం అని చెప్పాను. నీవు ఇప్పుడు వీరిని మనువాడడం కుదరదు. నీ ప్రాణాన్ని బలిపెట్టకతప్పదు. ఆపైన నీ ఇష్టం." అడ్డుపడి చెప్పాడు.

"నా పెండ్లివేళ చచ్చింది నా తొలి ఇల్లాలు. ఎంత ముప్పు తెచ్చింది. ఆ శవం మన ఆచారాల ప్రకారం దాన్ని పాతిపెట్టవద్దు. హింసక మృగాలకు విందుచేయండి. ఏయ్ తీర్పుల చిన్నోడా నీవు మరోలా తీర్పుఇవ్వలేవా? ఎలాగైనా వారిద్దరిని మనువాడితీరాలి. నాకు మంచి మార్గం చూపించు."

రామన్న దీర్ఘంగా ఆలోచించి "ఉంది కోయదొరా, నీకు మంచి అవకాశం మరోలా వరించనున్నది. అయితే కొన్ని సాహసాలు చేయాలి. ఈ ఇద్దరిచే కొండదిగువన ఉన్న కాళికాలయంలో కొన్నిపూజలు చేయించాలి. ఆ తరువాత ఈ ఇద్దరిని మీలో ఒక కొండదొర దత్తత తీసుకుని వీరితోబాటు మీ కులకన్యను కలిపి ముగ్గురును ఒకేసారి చేసుకోవచ్చు. ఇదే మీకు సరైన మార్గం."

"భళిరా బాలకా ఎంతచక్కని యోచన చేస్తివి. ఒక్కతే పోతే ఇద్దరు వచ్చారు. ఇప్పుడు ముగ్గురు అవుతున్నారు. తప్పక ముగ్గుర్ని చేపట్టి ఈ కుదుపాంను దశదిశలు విస్తరించగలను. నా పెళ్లికి ఏర్పాట్లు చేయండి."అని తన అనుచరులకు ఆజ్ఞాపించాడు.

ఆ ఇద్దరు కన్యలు రామన్న వైపు మరోసారి కోపంగా చూసారు.

"ఓ కొండరాజా! నీవు నీ రాజధర్మములను మరచి ప్రవర్తించుచున్నావు. నీ తొలిభార్య చనిపోయి శవం ఇంటిలో ఉండగా పెళ్లి అంటున్నావు ఇవన్నీ శాస్త్ర సమ్మతములు కావు. ముందు ఆమెకు జరగాల్సిన కర్మకాండ జరిగిన తరువాత నీవు మలి వివాహములు చేసుకోవచ్చు." రామన్న చెప్పగా కొండరాజు తప్పదన్నట్టు తలూపాడు. అప్పటికే తొలి భార్య శవం కోటలో ఒక గదిలో మూల కూర్చుండబెట్టి ఉంచారు. కిత్తలో (శ్మశానవాటిక) తీసుకువెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు. రామన్న అక్కడి సైన్యాన్ని బేరీజు వేయసాగాడు. ఒకవేళ పర్లాఖిముండి రాజులు సైన్యంతో వస్తే వీరు ఆయుధాలతో ఉంటే

పోరు తప్పదు. రక్తపాతం, ప్రాణనష్టం ఎందుకు అని మళ్లీ తన గొంతు విప్పాడు.

"ఓ కొండరాజా మీకిత్తలో ఎక్కడుంది అక్కడకు ఎవరు ఆయుధాలు ధరించి పోరాదు. చనిపోయింది కొండరాణి. కనుక తప్పక అంతా కలిసి చేయాల్సిన సంస్కారాలు పద్ధతిలో చేయాలి. ఇక్కడ మీ వ్యవహారాలతోబాటు మా నాగరిక వ్యవహారం కూడా తోడైంది." రామన్న చెబుతుంటే కొండరాజు ఏదీ కాదనకుండా తలూపాడు. అతని దృష్టి అంతా పెళ్లిమీద ఉంది.

పెద్దదండులా కదిలింది కిత్తలో (శ్మశానం) అనేది ఊరందరికి ఒక్కటే ఉంటుంది. చిన్నపిల్లనయినా, పెద్దవారినయినా దహనం చేస్తారు. పెద్ద వారయితే పచ్చి మామిడి కొమ్మలతో కాల్చి బూడిదచేస్తారు. క్షణాల్లో ఏర్పాట్లు జరిగాయి. తన తొలిపెంటి చనిపోయినపుడు ముఖం చూడని కొండరాజు తనపక్కనే కూర్చుండబెట్టిన కొండరాణి శవం ముఖం చూసి నొచ్చుకున్నాడు. ఆప్యాయంగా ఆమె తలనిమిరాడు. ఎందరినయినా తనకు సవతులను తీసుకుని రా, నేను భరించగలను. కానీ, ఎట్టిపరిస్థితిలో కూడా నాగరిక స్త్రీలను తీసుకుని రావద్దు. వారి వలన మనకు మన కుదుపాం ప్రజానీకానికి పెనుప్రమాదం అని చెప్పింది. అలా తెస్తే నా చావు నీవు కళ్లారచూస్తావు అని హెచ్చరించింది. ఆమె మాటలు గుర్తుకుతెచ్చుకుని ఒకింత బాధపడ్డాడు.

శవదహనం చేసారు. అక్కడ కొన్నివందలమంది సవరజాతి జనాలు, వారి సిపాయిలు విచారవదనాలతో నిలబడ్డారు. అక్కడ వెంటనే కాదు చల్లారక ముందే కుందరి (సమాధి) నిర్మాణం చేసారు. కర్రలతో, గడ్డితో చిన్న సమాధి నిర్మించారు అక్కడ వండుకోవడానికి ఒక కుండ, నాలుగు మట్టిగాజులు, పిల్లలను ఊపేందుకు ఉయ్యాల, అక్కడ విడిచారు. ఆమె కుల్బ (ఆత్మ) కాకుండా పెద్దశబ్దాలు చేసారు. అక్కడ ఒక గనువర్ (రాయి) పాతి పెట్టారు. అక్కడ పోతరించిన ఎనుబోతును బలిచేసారు. వాస్తవానికి పండుగరోజున ఈ బలులు చేస్తారు. కానీ, కొండరాణి చనిపోయినందున ఏకంగా ముందే జరిపారు. ఇదంతా సాయింత్రం వరకు అయ్యింది.





అప్పుడు పర్లాఖిముండి సైన్యం ఒక్కసారి కొండమలుపులో ప్రత్యక్షమయ్యింది. అంతే శవదహనంలో పాల్గొన్న కుదుపాం గిరిజన సైన్యం చేతుల్లో ఆయుధాలు లేనందున దశదిశలు పారిపోయారు. చివరికి అక్కడ కొండరాజు, రామన్న మిగిలారు.

సైనికులు చుట్టుముట్టారు. క్షణాల్లో ఇద్దరు బందీలయ్యారు. మట్టి కోటను ముట్టడించారు. బందీలుగా ఉన్న ఇద్దరు కన్యలను విడిపించుకున్నారు. పర్లాఖిముండి సైన్యానికి నాయకుడుగా వచ్చినవానితో కన్యలు విషయం చెప్పారు. "ఆ కుర్రవాడే రామన్న అతడి గురించి మేము లోగడ విన్నాం. అతడు మంచి తీర్పులు ఇవ్వగలుగుతున్నాడని అతను చెబితే వింటాం అని ఈ కొండరాజుకు కోరాం. అతడు రామన్నను రప్పించాడు. అతడు చాలాతెలివిగా మమ్మల్ని రక్షించాడు. లేకుంటే ఈపాటికి ఈ అనాగరిక రాజు వారి సాంప్రదాయం ప్రకారం పెండ్లి చేసేసుకునేవాడు." అని కన్నీరు మున్నీరు అయి చెప్పారు. వారు మట్టికోటను ధ్వంసంచేసి దొరికిన వారిని చీల్చిచెండాడి కొండరాజును గొలుసులతో బంధించి, ఏనుగు వెనుక ఈడ్చబడేట్లు చేసారు. రామన్నను వేరే పల్లకిలో కూర్చుండబెట్టుకుని సాగిపోయారు.

పర్లాఖిముండి రాజు రామన్నను ఎన్నోరీతుల కొనియాడాడు. వెలలేని ఆభరణాలు బహుమతిగా ఇచ్చాడు. కన్యల తల్లితండ్రులు కూడా బహుమతులు ఇచ్చారు. ఆ కన్యలు కూడా కొనియాడారు. నీవు లేకుంటే మేము ఆ కొండల్లో మ్రగ్గిపోయేవాళ్లం. నీ గురించి విని ఎందుకో ఆ కొండరాజును కోరాం. వాడు మాపై మరులు గొన్నందున మా కోరిక ప్రకారం నిన్ను తీసుకువచ్చాడు. నీవు తొలుత చాలా అనుమానంగా ప్రవర్తించావు. ఎటుచూసినా వాడివైపు మాట్లాడేవాడవు. ఈ కుర్రాడేం తీర్పులు ఇలా హీనంగా చెబుతున్నాడు. ఎలా పేరువచ్చింది అనుకున్నాం. తీరా నీ ప్రతి కదలిక మాకు ఉపయోగపడింది. మాకంటే చిన్నవాడవు. లేకుంటే పాదాభివందనం చేసేవాళ్లం." అని గలగల నవ్వారు.

అందరివద్ద సెలవు పుచ్చుకుని బయల్దేరాడు రామన్న .అప్పుడు కన్యలు ఎదురువచ్చి "మాపేర్లు కూడా అడగలేదు. రేపు మేము వివాహమై వేరే రాజ్యాలకు వెళ్లబోతున్నాం. నీకుఏదైనా పనిపడితే మావద్దకు యధేచ్ఛగా రావచ్చు ఇక మాపేర్లు చెప్తాను విను నేను రత్నమంజరిని ఈమె మణి మేఖల."

రామన్న నవ్వాడు. రాజు కూడా కన్యల మాటలకు నవ్వాడు.

"నీవు ఎప్పుడు వస్తావు? నీ తీర్పులు మాకు అవసరమైనప్పుడు కోరిన వెంటనే రావాలి. జాగుచేయరాదు." రాజు వీడ్కోలు చెబుతూ చెప్పాడు.

"కాకితో కబురంపగానే వచ్చి వాలుతాను. బహుశా నాకు అనతి కాలంలోనే మీ నుంచి పిలుపు వస్తుంది. అప్పుడు వస్తాను." చెప్పివెను తిరిగాడు రామన్న.

రాజు ఆలోచనలో పడ్డాడు. రామన్న ఎందుకు అలా అన్నాడు. పదేపదే తర్కించుకుని ఇదేవిషయం తన మంత్రి, సేనానులతో చర్చించాడు. వారు కూడా చాలాసేపు ఆలోచించి మహారాజా ఏముంది ఆ కుర్రవాడు కన్యల రక్షణకు మెచ్చి మీరు వెలలేని బహుమతులు ఇచ్చారు. వాటిమీద ఆశతో ఏదైనా చిన్న తగువులున్నా పిలవండి వస్తాను అని చెప్పకనే చెప్పాడు అని తేల్చారు. అందుకు రాజుకూడా నిజమేనన్నట్టు తలపంకించాడు.

నాలుగు వారాలు గడిచాయి. కన్యల వివాహములు పొరుగున ఉన్న యువరాజులతో ముందే కుదిరాయి. అనుకున్న ప్రకారం ఆ సమయం దగ్గరయ్యింది. మంత్రి, సేనాని వైశాఖంలో పెండ్లిచేయడానికి అన్ని విధాల సిద్ధంగా ఉన్నాం అని లేఖలద్వారా వియ్యంకులకు వర్తమానం పంపారు. అటునుంచి మాకు ఈ సంబంధాలు మరి ఇష్టంలేదు. మేము వివాహం చేసుకోదలిచిన మీ కన్యలు కుడుపాం కోటలో బందీలుగా ఉన్నారు. అట్టివారికి శీలపరీక్షలు (అప్పటిలో శీలపరీక్షలు అంటే అగ్నిలో దూకి ఏమాత్రం శరీరం కాలిపోకుండా బయటికి రావడం లేకుంటే సలసలకాగే





నూనెలో బంగారు ఉంగరాలు బొబ్బలు చేతిమీదపడకుండా తీయడం) చేయాల్సి ఉంది. కానీ, మేము అలాంటి పరీక్షలు చేసుకుని వివాహం చేసుకోవల్సిన అవసరం ఏమాత్రం లేదు. అందుకే వద్దు అనుకున్నాం." అని అటునుంచి బదులువచ్చింది.

విషయం తెలిసిన కన్యలు సర్వం కోల్పోయినవారిలా పిచ్చిపట్టిన వారిలా అయిపోయి, వారు వేగులద్వారా తాము పరిణయం చేసుకోవల్సిన యువరాజులకు లేఖలు రాసారు. కానీ, ఆ యువరాజులు కూడా తేలిగ్గా తీసుకుని తాము బందీగా ఉన్న కన్యలను చేసుకుని జీవితాంతం ఆ బాధ భరించలేం అని బదులిచ్చారు. దాంతో కన్యలు ఆత్మహత్యాప్రయత్నాలు చేసారు. సకాలంలో రాజవైద్యులు వైద్యంచేసి రక్షించారు.

పర్లాఖిముండి మంత్రి, సేనానులు తలలు పట్టుకున్నారు. కారాగారంలో బందీగా ఉన్న కొండరాజును వెంటనే ఉరితీయాలని రాజును కలిసి కోరారు. మా పిల్లల బతుకులు బుగ్గిపాలు చేసాడు వాడిని వదలరాదు. ఎంత దాచుదామనుకున్నా లోకం అంతా తెలిసిపోయింది. రాజుల సంబంధాలు వచ్చాయని సంతోషిస్తే ఇలా అయిపోయిందేమిటి ?అని కన్నీరుమున్నీరు అయి బాధపడ్డారు. వారిబాధ చూడలేక కొండరాజును తన ఎదుట రేపు ఉదయం హాజరుపర్చాల్సిందిగా రాజు ఆదేశాలు జారిచేసాడు.

రాజుకు అప్పుడు రామన్న గుర్తుకువచ్చాడు. వెంటనే పిలిపించాడు.

కొండరాజును చెరసాలనుంచి రాజభటులు వెలుపలికి తీసుకువచ్చి రాజు ఎదుట నిలిపారు. అతడిపై కన్యలు ఉమ్మేశారు. శాపనార్ధాలు పెట్టారు. మేము ప్రేమించిన యువరాజులను మాకు కాకుండా చేసావు. నీవు బతకకూడదు అని మీదపడ్డారు. మంత్రి, సేనానులు కోపాన్ని అణుచుకోలేక చావగొట్టారు. "నీవు అడవిమృగానివి, నీకు నాగరిక కన్యలు కావల్సి వచ్చారా? నిన్ను కత్తికో కండగా నరికిగాని శాంతించం"అని పెట్రేగి పోయారు.

అక్కడే ఉన్న రాణి వారిని వారించి "ఈతడు క్షమార్హుడు కాదు కానీ, ఈతన్ని ఇలా అటవికంగా శిక్షించడం మనకు పాడికాదు విచారించి తగిన శిక్ష వేయండి."అని అక్కడ జరుగుతున్న అటవికప్రవర్తనను నిలువరించింది. అంతా వెనుక్కు తగ్గారు. కొండరాజు శరీరం రక్తసిక్త మయ్యింది. అతడు నిలబడే శక్తిని కోల్పోయి బాధపడ్తూనే నిలబడ్డాడు.

అప్పటికే రామన్న వచ్చాడు. అక్కడ రామన్న ఏమి చెబుతాడో అని చూడసాగారు."ఓ రాజా నన్ను తమరు పిలిచిన వైనం తెలియదు. నేను ఏమి చేయాలో నిర్ధేశించండి. ఆపైన మాట్లాడుతాను." అని ఒక ఉచితాసనంపై కూర్చున్నాడు.

అక్కడ తొలిసారి గొంతువిప్పింది కన్యలే. "అయ్యా రామన్నగారూ మేము కొండంత ఆశతో పొరుగున ఉన్న యువరాజులను పరిణయం చేసుకోవాలనుకున్నాం. కానీ, మా దురదృష్టం ఈ అడవిమృగం కారణంగా ఈతనికి బందీలుకావడం వలన మా జీవితాలు అంధకారబంధురం అయిపోయాయి. పెళ్లికొడుకులు బంధీలుగా ఉన్నందున మా శీలంపై అనుమానం వ్యక్తం చేసారు. ఇదీ నేడు మేము ఎదుర్కొంటున్న చిక్కు సమస్య. ఇందులో న్యాయం ఉంది. మాకు మరి యువరాజులతో పెండ్లి అనేది గగనమే. ఊహించని విధంగా రాజులకు భార్యలమై ఏకంగా రాణీహోదాలు పొందాల్సిన మాకు పెండ్లి జరగడంకల్ల అనేట్టు అయి పోయింది. ఇకమాకు దారి ఏది? నిశ్చితార్థం అయ్యాక, ఆ సంబంధాలు తెగిపోతే అందులో ఇలాంటి కారణాలు ఎత్తిచూపబడితే ఇంకా ఏమైనా ఉందా? మా సమస్య ఎవరు తీరుస్తారు?"అని కన్యలు ఏడ్వసాగారు.

"ఆ కొండరాజును చావగొడితే సరిపోదు ఖండఖండలుగా నరికి పోగులెట్టాలి. నీచవాచాలుడు పాపం మా ప్రియపుత్రికలను ఇలా శోక మూర్తులను చేసాడు. మహారాజా! అనుజ్ఞ ఇవ్వండి. ఈ కొండరాజును నా కరవాలమునకు ఎరచేస్తాను. అప్పటికిగాని నాకు మనశ్శాంతిలేదు." సేనాని ఒరలోంచి కత్తిదూసి అనుజ్ఞకోసం మహారాజు ముందుకు వెళ్లాడు.





మహామంత్రికూడా కత్తిదూసి కొండరాజు గుండెలకు గుచ్చి "అనుజ్ఞ ఇవ్వండి ఏనాడు మాకుగా మేము మిమ్మల్ని ఏమి అడుగలేదు. ఈ నీచున్ని వదిలితే వీడి తలతో బంతాడుతాను" అని కోపంతో మహారాజును కోరాడు.

రామన్న వారిని నిలువరించి "ఆగండి మీ వెర్రి ఆవేశాలు మానుకోండి. బంధింపబడినవాడిని ఇలా ఎవరికి వారే చంపుతామని అందుకు ఆదేశాలు కోరడం మంచిదికాదు. ఇక్కడ ఈ కొలువులో ఒక న్యాయస్థానం ఉంది. న్యాయం వెలుపరించే న్యాయమూర్తి అదిగో అక్కడ ఆశీనులైఉన్నారు. మీరు ఆయన్ని కాదని,ఏకంగా మహారాజును కోరుతున్నారు. ఇది ఎంతటి అధర్మం."

"నిజమే రామన్న నీవు చెప్పినది మిగులు యుక్తియుక్తముగా ఉంది. మంత్రి సేనానులు మీరు మీ ఆసనములయందు కూర్చుని చూడండి. రామన్న నీవే ఇక్కడ తీర్పునీయాల్సిందిగా కోరుతున్నాను. ఎందుకంటే లోకం అంతా నీ తీర్పులకు చాలా విలుపనిస్తున్నది. నీవు న్యాయం చెప్పు" అని రాజు కోరాడు.

"ఓ కన్యలారా మీరు ముందు శోకరాగాలు ఆపి నామాటలు వినండి. మీరు రాజులకు భార్యలు కావల్సింది ఊహించని విధంగా తృటిలో తప్పిపోయింది. రాణీలు కావాలన్న ఆశమీది. అతి చిన్నరాజ్యాన్ని ఏలేరాజు రాజే, అతిపెద్ద రాజ్యాన్ని ఏలేరాజు రాజే అవునా? మీ అందాలను చూసి మిమ్మల్ని బంధించి రాక్షసవివాహం చేసుకోవాలనుకున్నాడు. కానీ, మీరు నేను ఏదో విధంగా ఆ కొండరాజు నుంచి తప్పించుకుని వచ్చాం. ఇప్పుడు మీ పరిస్థితి మొదటికి వచ్చింది. నా తీర్పు చెబుతాను. నచ్చితే తలవంచి ముందుకు నడవండి. మీ తల్లితండ్రులు రాజులుకారు. మంత్రి, సేనానులు మాత్రమే. మీ పెండ్లి ఈతని కారణంగా పాడయ్యింది. ఈతడే మీకు న్యాయం చేయాలి. మీరు ఈ బంధింపబడిన కొండరాజునే పెండ్లిచేసుకోండి ఈతడు మీ కారణంగా తనభార్య ఆత్మహత్యకు కారకుడయ్యాడు. అటు భార్యను, ఇటు రాజ్యాన్ని కోల్పోయాడు. ఈతడు అటవీప్రాంతానికి, కొంతమైదానానికి

రాజుగా ఉన్నాడు. మిమ్మల్ని పువ్వుల్లో పెట్టి చూసుకుంటాడు. కనుక కొండరాజును ఎలాంటి విచారణ లేకుండా విడిచిపెట్టించి అతన్ని పెండ్లి చేసుకోవడమే తక్షణ మీ కర్తవ్యం."

ఆ తీర్పుకు అక్కడ ఉన్నవారంతా హతాశులయ్యారు. రాజురాణి కొంతసేపటికి నిజమే భలే తీర్పునిచ్చాడు అని తలలు పంకించారు. మంత్రి సేనాని అయోమయంలో పడినా రామన్న తీర్పుకు మన్నుతిన్నపాముల్లా అయిపోయారు. కన్యలు ఎరుపెక్కిన కండ్లతో చూసి అలా కొంతసేపటికి కొండరాజు ముఖంలోకి చూసారు. అంతవరకు కొండరాజుకు రామన్నపై కసి,పగ ఉండేవి.తనను పట్టించాడన్న అక్కసుతో ఉన్నాడు.ఇప్పుడు రామన్న వైపు కృతజ్ఞతగా చూసాడు.అందుకే లోకమంతా రామన్న తీర్పుకు గౌరవిస్తోంది అని అనుకోసాగాడు.కొండరాజు గొంతు విప్పాడు. "ఓ రామన్న చిన్నవాడవైనా నీవు పెద్దమనస్సు గలవాడవు.అందరు నన్నుచంపుతామని కత్తులు దూసారు. ఈ కన్యలు మగవాడని గుర్తించ కుండా నాపై ఉమ్మేశారు. ఆ రాజదంపతులు మాత్రమే నాపట్ల గౌరవం చూపారు. నన్ను రాజుగా గుర్తించారు. ఇక నేను చేసినది తప్పే వనితలను బంధించడం అనాగరికం ఇది మా గూడల్లో మామూలే. మీ నాగరిక న్యాయం ఇప్పుడిప్పుడే నాకవగతం అవుతోంది. సరే, మీ తీర్పువిన్నాక నా మనోగతం తెలపాల్సి ఉంది.నన్ను చీదరించుకున్న ఈ కన్యలను నేను చేసుకోను.వీరివలన నాకు భార్యా వియోగం,రాజ్యభ్రష్టత్వం,చెరసాల వాసం,చీదరింపులు వరుసగా జరిగాయి వీరిని నేను ఎలా ఏలుకోను. కనుక నన్ను విడిచిపెడితే నా దారిన నేను పోతాను. ఇంకెప్పుడు ఇలా నాగరిక ఆడువారిని బంధించను. నాగూడల్లో కన్యతో కలిసి మెలిసి జీవిస్తాను.లేదూ నేను చేసిన తప్పిదానికి విచారించి మీ న్యాయం ప్రకారం నన్ను ఉరితీసినా అందుకు నేనుబాధపడను. చేసిన తప్పుకుశిక్ష అనుభవించాను అని అనుకుంటాను."





కొండరాజు మాటలు అక్కడివారి గుండెలకు సూటిగా గుచ్చుకున్నాయి. అంతవరకు కన్యలు గుర్రుతనం పోయి కొండరాజును సమీపించి "ఓ వనరాజా మమ్మల్ని క్షమించు నీపట్ల చాలా అగౌరవంగా ప్రవర్తించాం. మాకు నీవే గతి కాదనవద్దు. నీవు కాదన్నచో మాకు వేరేదిక్కులేదు." ప్రాధేయపడ్డారు. మంత్రిసేనాని కూడా కొండరాజు చేతులు పట్టుకుని బతిమాలారు. రాజుకు కొండరాజును విడిచిపెట్టాల్సిందిగా అర్థించారు.

రాజురాణీ కూడబలుక్కుని "ఓ కొండరాజా నీవు ఈ కన్యలను చేపడితే నిన్ను విడిచిపెడతాం. నీ రాజ్యం నీకు ఇచ్చేస్తాం. ధ్వంసం కాబడిన కోటను తిరిగి కట్టుకోవచ్చు." అని ఆశలు చూపారు. అందుకు ఆ కొండరాజు "నేను మీ బంధీని నన్ను ఏమైనా చేసుకునే అధికారం మీకుంది. మీరు చెప్పినవన్నీ బావున్నా నాకు నచ్చనందున నేను ఈ కన్యలను చేపట్టను. చావుకైనా సిద్ధం ఈ కన్యలతో జీవితం వద్దు."ఖరాఖండిగా చెప్పేసాడు.

"రామన్న నీవే ఈ సమస్య పరిష్కరించాలి." రాజు కోరాడు.

"వనితలు వలిచి రావాలి.బలవంతపెట్టకూడదు అని పెద్దలు చెబుతుంటారు.ఈ కన్యల అందాలను చూసి భార్యచావును కూడా స్వాగతించిన ఈ కొండరాజు ఈ కన్యల చీదరింపులకు గురయి చివరికి చెరసాల పాలయ్యాడు. తరువాత వలచివచ్చిన కన్యలుగా తాము చేసుకుంటా మని ముందుకువస్తే కాదనుచున్నాడు. అతడు అతని రాజసం కనబరిచాడు. ఈ కన్యలు, వారి తండ్రులు ఊసరివెల్లుల్లా క్షణానికోలా మారిపోతున్నారు. వీరికి రాణులు కావాలన్నదే కోరిక. భువినేలే రాజులు మీరు వీరికి మంచి వరులను చూసి పెండ్లి చేయాల్సినదే, అది మీ బాధ్యత."

"రామన్నా వీరికి ఈ కొండరాజే కాదన్నప్పుడు ఇప్పటివరకు జరిగిన తతంగం తెలిసి నాగరిక రాజులు ఎవరు ముందుకు వస్తారు. నాకు సాధ్యమైన పనేనా? మరోలా నీవు మంచిమార్గం చూపించిన బావుండేది." రాజు ఢీలాపడిపోయి చెప్పాడు.

"మీకు ఇరవై మంది రాణులున్నా అందులో మీ పక్కన మహారాణిగా ఒక్కరే ఉన్నారు. ఈ ఇద్దరు కన్యలను మీరే చేసుకుంటే వారికి రాణీలయ్యామన్న తృప్తి ఉంటుంది. రాణీవాసంలో ఎంతమంది చేరినా అదో పుష్పక విమానం లాంటిది. మీ ఏలుబడిలో ప్రజలు రాజోద్యోగుల సమస్య తీర్చాల్సింది మీరే, కనుక వీరిద్దరికి మీరే భర్త." రామన్న తన తీర్పును వెలువరించాడు.

వెంటనే కన్యలు ఇద్దరు రాజును చూసి సిగ్గుతో తలలు దించుకున్నారు. రాణీ వారిద్దరి సిగ్గులను చూసి మనస్సులో అనుకుంది. 'రామన్న అన్నట్లు ఈ ఇద్దరు ఊసరవెల్లుల్లా ఉన్నారు. అప్పుడే ఎంతగా మారిపోయారు. వీళ్లా నాకు సవతులు నా మహారాణి పదవికి ఎసరుపెట్టరుకదా!' అని ఆమె భయపడింది.

"రామన్న నీ తీర్పు బాగుంది. కానీ, నీవన్నట్లు ఈ కన్యలు, మంత్రిసేనాని ఊసరవెల్లుల్లా మారిపోయేతీరు నాకు నచ్చలేదు. వీరు ఇలా మారిపోతుంటే ఏదోరోజు ప్రమాదాలు మీదకు వస్తాయి."

"ప్రభూ! ఆ కన్యలను చేపట్టే ముందు మంత్రి సేనానులను ఆపదవిల్లోంచి తప్పించేసి వారిని ఇళ్లలో కూర్చుని రామాక్రిష్ణా అనుకోమనండి కొత్తవారిని తీసుకోండి. అలా అయితే పెండ్లి లేదా కుదరదు అని చెప్పండి" అన్నాడు రామన్న.

మంత్రిసేనానులు అదిరిపడ్డారు. చివరికి కుమార్తెల కోసం పదవి త్యాగానికి సిద్ధపడ్డారు. రామన్న తీర్పు అమలు అయ్యింది. కొండరాజును విడిచిపెట్టేసారు. రామన్న పర్లాఖిముండి రాజువద్ద సెలవు తీసుకుని వెనుదిరిగిపోయాడు.





# పంచగంగ పాత్రలు

ధర్మపురి రాజు లోకకళ్యాణం గురించి ఏదో యజ్ఞం చేయాలని అందుకు పంచగంగలు తీసుకురావాల్సిందిగా ఆస్దాన పురోహితులను పంపగా వారు ఎండనక వాననక కొన్ని నెలలు ప్రయాణించి పంచనదీ జలాలు వెండి పాత్రలలో నింపుకుని వచ్చారు. అయితే ఇక్కడ ఒకపొరపాటు వారికి తెలియ కుండానే జరిగిపోయింది. ఒకేలా ఉన్న వెండిపాత్రలు రాజు నుంచి తీసుకుని వెళ్లారు. తీసుకునివచ్చేటపుడు ఫలాన నదీజలం ఫలాన పాత్రలో ఉంది అని చెప్పలేక పోయారు. దాన్ని తప్పుపట్టాడు యజ్ఞ నిర్వాహకుడు శమీకుడు. అతడు చాలా కోపిష్టి కమండలశక్తిలేదు లేకుంటే శపించేవాడే. పురోహితులపై దాడిచేసినంత పనిచేసాడు. "బుద్ధిహీనులారా మీరు బ్రాహ్మణ్యానికి కళంకం పొండి. ఐదు పవిత్ర జలాలతో మనం అభిషేకించాల్సినది. మీ కారణంగా కాస్తా చెడింది." అగ్నిహోత్రుడులా మండిపోయాడు.

అప్పుడు రాజుకూడా కాలుకాలిన పిల్లిలా అయిపోయాడు. పురోహితులను శిక్షించలేడు. మళ్లీ తెప్పించాలంటే ఆ గంగలు తీసుకువచ్చేసరికి కొన్నినెలలు పడతాయి. ఎలా అని ఆలోచనలో పడ్డాడు. అప్పుడు మంత్రి "ప్రభూ ఈ గండం గట్టెక్కాలంటే మనం రామన్నను పిలిస్తే సరిపోతుంది. అతడు మంచి తెలివైనవాడు ఎలాంటి చిక్కుసమస్యలైనా తీర్చగలడు. కనుక పిలపించండి" చెప్పాడు. రాజు రామన్న గురించి విని ఉన్నాడు కనుక మంత్రి సలహా ఎంతో నచ్చింది వెంటనే రామన్నకు కబురు పంపాడు.

శమీకుడు చేయబోయే యజ్ఞంకోసం వాటికలు దగ్గరుండి నిర్మింప చేస్తున్నాడు. రాజునుంచి పిలుపు రాగా, అక్కడికి వెళ్లాడు "స్వామీ రండి పంచగంగలు గురించి ఏమైనా తెలిసిందా? జలానికి వాసనలు ఉంటాయి అవి మీవంటి యోగులకు మునులకు తపశ్శంపన్నులకు తెలుస్తుంది. అలా ఏమైన తెలుసుకున్నారా స్వామీ!" అడిగాడు రాజు.

పంచగంగలు మాటెత్తితే చాలు శమీకుడు మనస్సు మరింతగాయంగా మారిపోసాగింది. పంచగంగలు తెప్పించుకుని యజ్ఞం చాలా చక్కగా చేయాలనుకున్నాను. దిక్కుమాలినవారిని అందుకు పంపాం రాజాచాలాతప్పు చేసాం. ఎవరు చెప్పారు, గంగకు వాసన ఉంటుంది అని శుద్ధ అబద్ధం మన చేయి ఇరుకునపడింది కదా ఎవడో ఏదో సలహా ఇస్తుంటాడు. గంగకు వాసనలు ఉండవు. అయినదేదో అయ్యింది. దానికోసం ఎందుకు ఆలోచించడం వదిలేయండి. సరే, నన్ను ఎందుకు పిలిపించారు ప్రభూ! నేను చేయగలపని ఏమైనా ఉందా ?" అక్కడ కూర్చున్న రామన్నను ఎగాదిగా చూసి "ఎవరీ బాలుడు. వేషం చూస్తుంటే పశువులకాపరిలా ఉన్నాడు. ఈతడు ఇవ్వగలిగితే నల్లమేకలు మాత్రమే యజ్ఞం నిమిత్తం తీసుకురమ్మనమని చెప్పండి. అయినను మేకలు ఇచ్చు వాడికి ఇంత గౌరవమా? మీ ఎదుట కూర్చుండబెట్టారు. ఇక్కడ అంతా ఏమేమో జరిగిపోతోంది. ఏ సుమూహర్తమున అనుకున్నామో కానీ, ఏదీ సరిగ్గాలేదు. హీనులకు అందలమా?" అని చిరాకుపడిపోయాడు.

"మీకు చెప్పలేదు. ఈతడు రామన్న న్యాయానికి మరో పేరుగా దశదిశలు కీర్తి మూటకట్టుకున్నాడు. ఈతన్ని పిలిపించాను మన పంచ గంగలు గురించి ఆరా తీయగలడని నాకు నమ్మకం ఉంది. అందుకే మిమ్మల్ని వెంటనే రమ్మని కబురంపాను" అని రాజు చెప్పాడు.

శమీకుడు కన్నులు ఎరుపెక్కాయి. కోపం దిగమింగుకున్నాడు." ప్రభూ ఇది కాలమహిమ. ఏంచేస్తాం ఆఖరికి ఇలాంటి గొర్రెలకాపరి పూజ్యనీయ మైన గంగను గుర్తించే పరిస్థితి మనకు ఆ దేవుడుకల్పిస్తాడని అనుకోలేదు. సరే, ఏలికలకు మీకు అడ్డుచెప్పగలమా! ఈతడు న్యాయాన్ని దశదిశలు నాలుగుపాదాల నడుపుతున్నాడని చెప్పారు. ఈ పవిత్రమైన గంగలతో ఈతడు దశదిశలు వదిలి పుట్టిన చోటుకు పోయి గొర్రెలో మేకలో పెంచుకుని బతకాల్సిందే. ఏయ్ రామన్న ఇటుగా రా! పెద్దలయందు నీకు లేశమైనా గౌరవం లేదా? ఇంతగా మాట్లాడుతున్న నాకు గౌరవించాలని





తెలియదా? నీవు కూర్చున్న చోటిలోంచి ఇంతవరకు లేవనే లేదు. నేను ఋత్విజుడను. బహుశా నీకు తెలియకపోవచ్చు. ఇలాంటి పేరు వినియుండవు" అని సన్నగా నవ్వాడు. ఇలా రామన్నను గేలిచేసి మాట్లాడడం రాజుకు ఏమాత్రం ఇష్టంగా లేదు.

రామన్న లేచి ఋత్విజుడైన శమీకున్ని చూసి చేతులు జోడించి "ప్రణామములు మీ మాటలో బాధ నాకు తెలుసు. మీరు చేయునది మహా యజ్ఞం. అట్టి కార్యం పూర్తగువరకు మీలో ప్రశాంతత కొరవడుతుంది. అన్నీ మీకు చుట్టున్నట్టుగానే ఉన్నా, ఏదీ మీకు చేతికి చిక్కదు. యజ్ఞం అన్నచో అది మరో సృష్టిలాంటిది. కానీ, మీరు యజ్ఞకర్త నుంచి ధనం తీసుకుని యజ్ఞం చేయు ఋత్విజులు. మీ వంటివారిని దర్శించినందున నా జన్మధన్యం అయ్యింది." చేతులు జోడించాడు.

శమీకుడు తడబడ్డాడు. రామన్నను ఈసారి మరింతగా కన్నులు సాగదీసుకుని చూసాడు. ఈ యాదవుడేమిటి అరటిపండు వొలిచినట్లు ధర్మవాక్యాలు మాట్లాడుచున్నాడు. అయినను పది ఊళ్లు తిరిగేవాడికి ఆమాత్రం తెలియకపోతాయా ఋత్విజుడు అంటే, అంతమాత్రంచే అన్నీ తెలుసు అనుకోవడం ఈతనిలో న్యాయమూర్తిని చూస్తున్న పామరులకు నాకు తేడా ఏమిఉంది? అని తనకు తాను సమాధానపరుచుకున్నాడు.

రాజు వెంటనే రామన్న ముందు పంచగంగల విషయం పెట్టాడు.

శాంతం విన్న రామన్న సన్నగానవ్వి "ఇందులో గుర్తుపట్టని పరిస్థితి ఏముంది? ఈ చిన్నపనికోసం నన్ను పిలిపించారా? విజ్ఞులు తమకు తెలుసు. అంతా రామన్నకోసం ఏమేమో అనుకుంటున్నారు. ఒకసారి మనం పిలిపించితే పోలా అని నన్ను పిలిచారు." ఆమాటలకు అక్కడున్న వారు ఆశ్చర్యపోయారు. వారం రోజులుగా తలలుబద్ధలు కొట్టుకుంటుంటే ఈతడు ఏమికానట్టుగా మాట్లాడుచున్నాడు. చాలావింతగా ఉందే. ఒకేరకం వెండి పాత్రల్లో తీసుకురాబడిన పంచ గంగల్లో ఏ గంగ ఏ పాత్రలో ఉంది అని ఎలా ఇట్టే చెప్పగలను అని చెబుతున్నాడు. అంతా చెవులు కొరుక్కున్నారు.

తలతీసినట్టుగా అయిపోయింది శమీకునికి. నొసలు చిట్లించాడు. "ఏమోయ్ నీవు ఆ పాత్రలు తెరిచి వాసన చూసి నీ ఇష్టం వచ్చినట్టు చెప్పాలనుకుంటున్నావా? ఆ విధానం తప్పు. నీవు ఏదో ఒకటి చెప్పేయగలవు. అందుకు అంగీకరించం. అసలు పంచగంగలు అంటే ఏమిటి? ముందుచెప్పు. ఆ తరువాత నీవు ఏమికానన్నట్టు అదేదో అవలీలగా చిక్కుముడి విప్పేయగలను అనుకుంటున్నావు. మేమంతా అజ్ఞానుల్లా మాట్లాడుచున్నావు. నేనడిగిందాని గురించి చెప్పు." ఆ మాటలకు అక్కడి వారంతా భలేగా అడిగాడు అనుకున్నారు.

"పంచగంగలు అనగా కావేరి, తుంగభద్ర, కృష్ణవేణి, గౌతమీ, భాగీరథి"

"సమిధలు అన్నచో ఏమిటి? నీవా పేరు విన్నావా?"

"సమిధలు అంటే కర్రపుల్లలు యజ్ఞంలో వేసేవి. మండేటపుడు పొగరాని కట్టెలు.అవిసేకరించి ఉపయోగించాల్సిన రకాలు మామిడి, మోదుగ, మేడి, మారుడు, బాదాము,మద్ది, జమ్మి, రావి.ఇక ఋత్విక్కును ఎన్నుకోనేటపుడు మంచి నడత ధర్మబుద్ధి గలవాడు,విద్వాంసుడు, జితేంద్రియుడు,లోభికాని వాడు పరోపకారి,దుర్వ్యసనములు లోనికాని వాడు. వేదవేత్త,ఈ లక్షణాలు కల్గినవాడే ఋత్విజుడు.అట్టివాడు యజ్ఞవాటిక యందు పడమరదిశలో తూర్పువైపు ముఖంతో కూర్చుండాలి.యజ్ఞం చేయువాడు దక్షిణదిశలో ఉత్తరాభిముఖుడై కూర్చోవాలి."

అక్కడున్నవారితో బాటు రాజు, శమీకుడు తీక్షణంగా చూసారు.

"ఓ ఋత్విజుడా యజ్ఞం చేయువానికుండాల్సిన పరోపకారం జితేంద్రియం పుణికిపుచ్చుకోండి.అంతేకాని కులాలుమతాలు అని అహంకారాలకు పోవద్దు. మీకు తెలిసినచో వేదాలగురించి చర్చిద్దామా నాకు తెలిసినది సముద్రంలో కాకి రెట్ట అనుకుంటున్నాను.నా మీద నాకు నమ్మకం ఉంది కనుక ఆ చర్చలో అవలీలగా గట్టెక్కిపోగలను. దయచేసి





నన్ను రప్పించిన మహారాజుగారి కోరిక తీర్చాక మీతో ఎలాంటి చర్చకైనా సిద్ధం.ఇక విషయానికి వద్దాం. పంచపాత్రలను తెప్పించండి ఇట్టే ఆ జలాల పేర్లు చెప్పగలను." రామన్న తన దృఢచిత్తం తెలిపాడు.

శమీకుడు మరి మాట్లాడలేదు.అతడి ముఖంలో నెత్తురు చుక్క లేదు.'కాలం ఎలా అయిపోయింది. చేతిలో గొర్రెపిల్లను పెట్టుకుని ఊరువాడ వెతికి నూతిలోకి తొంగి చూసి అదిగో నా గొర్రెపిల్ల అని బావిలో దూకినవాడు నేడు వేదం గురించి చర్చిద్దాం రమ్మంటున్నాడంటే ఏమి కావాలి బ్రాహ్మణత్వం? ఛీ! కలికాలంలో హైందవసంస్కృతి ఎంతగా హీనపడింది' అని లోలోపల కుమిలిపోయాడు. రాజు వెంటనే వెండిపాత్రలు తెప్పించాడు. అక్కడ ఒకటే ఉత్కంఠగా ఉంది. పంచపాత్రలు తీసుకుని పురోహితులు వచ్చారు. సభ మధ్యలో మామిడిఆకులు పేర్చిన చెక్కపై పాత్రలు పెట్టారు.

వాటిని నమస్కరించి "ప్రభూ, మీకును 64 విద్యలు వచ్చు కదా మరి మీరెందుకు ఈ పాత్రలను గుర్తించేందుకు ప్రయత్నించలేదు. చాలా తేలికగా చెప్పవచ్చు. మీరు ప్రయత్నించలేదు. కారణం చెప్పమందురా ఇందు ఏ దోషమున్నా మీకు కీడు చేయునని భయం. భూమండలం ఏలే మీరు ఇందు వేలుపెట్టలేక పోతిరి." రామన్న పాత్రలను పరిశీలించి రాజుతో అన్నాడు. రాజు ఇంకా అయోమయంలో ఉన్నాడు ఎలా గుర్తుపట్టాలి అనే మీమాంశలో ఉన్నాడు. అతడితో బాటు అక్కడవారంతా అదేదిశలో ఉన్నారు.

"ప్రభూ నాకు వెండిపాత్రలు తయారుచేయువారు ఒకరిద్దరు కావాలి దయచేసి రప్పించండి." రామన్న కోరాడు.

"ఇంతవరకు తేలిగ్గా చెప్పగలను అని ప్రగల్భాలు పలికి ఇప్పుడు పాత్రల తయారీదారులను రప్పించమంటున్నావు. ఇదేమి వైపరీత్యం? నీవు ఎలాగూ తప్పుగా చెప్తావు ఆ నేరం ఆ తయారీదారులపై మోపేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నావు. అమ్మో నీవు చాలా తెలివైనవాడవు. అందుకే దశదిశలు నీకు ఇంతపేరు వచ్చింది. ప్రభూ ఈతనికి తెలిస్తే చెప్పమనండి లేకుంటే మానమనండి ఇవన్నీ పనికిమాలిన చిట్కాలు.

వీటివలన మనకు కాలాయాపన ఈతన్ని పొమ్మనండి. ఈతడు ఏవో కాకి ఎంగిలి సమాధానాలు చెప్పినంతమాత్రాన ఈతడో సర్వవిద్యాపారంగతుడు కాడు. మహానుభావుడు అంతకంటే కాడు."

రాజు మధ్యలో కలుగచేసుకుని "స్వామీ మీరు అసహనంతో ఉన్నారు. మనం పిలిపించుకున్నది మన సమస్య పరిష్కారం కోసమే కదా! రామన్నను పదేపదే అడ్డుతగలవద్దు. అతడు అన్నట్లు మీరు ఋత్విజునకున్న గుణాలను కలిగి ఉండండి. రామన్నా నీవు ముందు అవలీలగా పరిష్కరించగలను అని చెప్పి ఇప్పుడు వేరేవారిని పిలవమంటున్నావు. ఆస్వామి నిలదీతలో అర్థం ఉంది. ఒకవేళ మీరు పాత్రలు గుర్తించకపోతే పోయినది ఏమీలేదు. కానీ, నాతో ముందు అన్నమాటలు గుర్తుకు తెచ్చుకోమంటున్నాను. నా విద్యలు గురించి అడిగావు. తేలిగ్గా అయిపోయినదానికి నన్నెందుకు పిలిచారు అని ప్రశ్నించావు. కనుక ఇప్పుడు గుర్తించకపోతే నీవు దండనార్హుడవే."రాజు శమీకున్ని, రామన్నను సుతిమెత్తగా హెచ్చరించాడు.

ఒక్కసారి భయంకరమైన నిశ్శబ్దం ఆవరించింది. రామన్న గాఢంగా నిట్టూర్చి ప్రభూ నేను పిలవమన్నది ఎందుకో తమరు ఇక్కడ చూస్తారు. నేను గుర్తించినా గుర్తించకపోయినా బాధ్యత అంతా నాదే. మీ శిక్షకుగాని, మీ ఆదరణ గాని పూర్తిగా నేను స్వీకరించగలను. కనుక దయచేసి నేనుకోరిన వ్యక్తిని పిలిపించండి."

శమీకుడు లోలోపల సంతోషించాడు. రామన్న పూర్తిగా పీకలోతు మునిగాడు. పాత్రల్లో ఉన్న జలాలు గుర్తించడం వీడివలన కానేకాదు. మరోసారి హైందవ సాంప్రదాయం మలినం నుంచి తేరుకోబోతోంది అని ఆనందించాడు.

రామన్న పాత్రలను నిశితంగా పరిశీలించాడు. శమీకుడు మళ్లీ గొంతువిప్పాడు. "ఏయ్ రామన్న నీవు శూద్రుడవు తాకరాదు. అవి పవిత్రమైన జలాలు మలినం కారాదు. యజ్ఞంలో వాటిని వాడాల్సి ఉంది."






"అలాగే స్వామీ మీ ఆజ్ఞలు పాటించగలను. ఈ పాత్రలు నింపినవారు తెచ్చినవారు ముందుకురండి."అక్కడే ఉన్న పురోహితులను పిలిచాడు.

"రామన్నా పవిత్రమైన జలాలను పాత్రలయందు నింపువాడు ఇక్కడ లేడు. అతడు పనిలో పనిగా మరిన్ని క్షేత్రాలను దర్శించుకుని వస్తాను అని చెప్పి వెళ్లిపోయాడు. రేపోమాపో వస్తాడు. అతడు వస్తే గుర్తించగలడని ఆశ. కానీ,పాత్రలు అన్నీఒకేలా ఉండడంవలన అతడు చెప్పగలడో లేదో అనుమానమే." చెప్పాడో బ్రాహ్మడు. అంతలోనే వెండి ఆభరణాలు తయారీదారులు ఇద్దరు వచ్చారు. రామన్న వారికి పాత్రలను చూడమన్నాడు వారు చూసారు.

పంచగంగలు సేకరించుటకోసం మీరు వరుసగా ఎక్కడెక్కడికి వెళ్లారో చెప్పండి."రామన్న అడిగితే – ఆ పురోహితులు వివరంగా చెప్పారు. అంతే రామన్న పాత్రలను నిశితంగా చూసి "ప్రభూ చెప్పగలను. ఈ పాత్రలలో ఇది కావేరి జలాలతో ఉంది. ఇందు కృష్ణవేణి మూడవపాత్రలో, గౌతమీ నాల్గవపాత్రలో,తుంగభద్ర ఈ చివరిపాత్రలో భాగీరథి జలాలున్నాయి. క్షణంలో ముడివీడి పోయింది అనుకున్నారు. కానీ,అక్కడ శమీకుడు గంగవెర్రులయి పోయాడు. "ఎలా చెప్పావు. నీవు చెప్పినది తప్పు అయినచో యజ్ఞంలో చాలా ఇబ్బందులు చేయువారు,చేసేవారు పొందుతారు. కనుక నీవు ఎలా చెప్పగలిగావో నిరూపించు. ఆ పైన నమ్ముతాం. ఏదో చెప్పాను మీరు వినండి అన్నట్టు ఉండరాదు."

"అవశ్యం స్వామీ! మీ ఆదేశం నాకు శిరోధార్యం. వెండి తయారుదారులను ఎందుకు పిలిచానో ముందుగా చెప్పాల్సి ఉంది. వారికి వెండిని మెరుగులు దిద్దుటయందు ప్రావీణ్యం ఉన్నందున నేను గుర్తించినది అవునా కాదా తేలిపోతుంది."వారిని గుసగుసగా అడిగాడు. వారు తలూపారు.

రామన్న చెబుతుండగా తీర్థయాత్రలు ముగించుకుని పురోహితుడు హడావుడిగా అప్పుడే వచ్చాడు. "క్షమించండి ప్రభూ నేను కొన్ని యాత్రలు చేయాల్సి ఉండగా ఉండిపోయాను. నేనే పుణ్యనదీ జలాలతో పాత్రలు






నింపాను. అన్నట్లు వాటిని గుర్తించేందుకు నాతో వెండిబిళ్ళలు తీసుకు వెళ్లాను. అందులో వాటిని వేసాను. అవశ్యం చూడవచ్చు. "అని చేతులు కట్టుకుని చెప్పాడు.

"రామన్నను ఇప్పుడే పట్టించాలి. వీడు న్యాయదేవతకు ముద్దుల బిడ్డగా చెలామణి అవుతున్నాడు, నేడు ఈ శమీకునికి చిక్కితివిరా రామన్న, నీకు మూడింది" అని మనస్సులో అనుకుని "ప్రభూ నేను యాగాన్ని చేయించే వాడిని, కనుక నేను ఈ పాత్రలు తెరవగలను. అనుజ్ఞ ఇవ్వండి." అందుకు రాజు తలూపాడు. తొలిపాత్రమూత తెరవబోతూ –"నీవు చెప్పినది తప్పయితే మహారాజు ఆగ్రహానికి గురికాకతప్పదు ఏమంటావు? రామన్న. ఆ శిక్ష ఏమిటో ముందే అనుకుంటే సరిపోతుంది. ఎందుకంటే నీ తప్పులవలన, మహారాజుకు దేవతలవలన కీడు జరగకూడదు కదా!" చెప్పి అక్కడి వారందరిని మరింత జటిలం చేసేప్రక్రియలో పడ్డాడు. ఆ మాటలకు అంతా ఖిన్నులయి వినసాగారు.

"తప్పక శిక్ష అనుభవించి తీరుతాను. నేను చెప్పేదానిలో ఏమాత్రం దోషం ఉన్నా ఉరిశిక్షకు నేను సిద్ధం." రామన్న ప్రకటించాడు. అంతా ఆశ్చర్యపోయారు. "అంతపెద్ద శిక్ష ఎందుకు రామన్న. బాలుడవు నీకు ఉరితాడుకు వేలాడతీసేవాడిని కాను. నిన్ను శిక్షించలేను. అంతలోనే ఎవరో వెనుక నుంచి అరిచారు. మరి రామన్నకు శిక్ష వేయమని ఆ ఋత్విజుడు చెప్పకనే చెప్తున్నాడు. అతడెందుకు ఇంతకాలంగా పాత్రలలో ఏ జలం ఉన్నదో చెప్పలేకపోయాడు. ఒకవేళ రామన్న చెప్పినట్టుగానే ఉంటే అతడే శిక్షకు గురవుతాడు?" ఆ మాటలకు అంతా బలపరిచారు. రాజుకూడా మౌనం అయిపోయాడు. శమీకుడు క్షణాల్లో ఆలోచించి సరే, మీరు చెప్పినది నేను ఎందుకు కాదనాలి. నేను రామన్న చెప్పినది జరగదు అని నమ్ముతున్నాను. అతడు గాలివాటం మీద బతికి ఏమేమో చెబుతున్నాడు. కనుక నేను ఉరికి సిద్ధమే" అని తనకు తానుగా రామన్నలా ప్రకటించుకున్నాడు.

తొలి పాత్ర తెరిచాడు శమీకుడు. అంతా అటేచూసారు. తేట జలాల్లోంచి వెండిబిళ్ల కన్పించింది. కావేరి అని ఉంది. రామన్న చెప్పినది నిజమే అయ్యింది. తరువాత వరుసగా కృష్ణవేణి, గౌతమీ, తుంగభద్ర, భాగీరథి జలాలుగా రామన్న చెప్పినట్లే వెండిబిళ్లలు సాక్ష్యం చెప్పినట్లున్నాయి. అంతే! రాజు సింహాసనం దిగి రామన్నను బిగియార కౌగిలించుకుని "రామన్న చిన్నవాడవైనా ఎంతో వివేకం ప్రదర్శించి కొన్నిరోజులుగా మమ్మల్ని వెర్రిపుట్టించిన సమస్య చిక్కు ముడి విప్పావు. నీకు ఏమి ఇచ్చి సంతృప్తి పరచగలను." అభినందించాడు.

శమీకుడు ముఖంలో నెత్తురు చుక్కలేదు. నేలమీద చతికిలపడ్డాడు. పెద్దగా గొంతుతో "నన్ను ఉరితీయండి. నా వలన హైందవసంస్కృతి మంట కలిసిపోయింది. నేను హీనపడితిని కనుకనే చెప్పలేకపోతిని. ఒక పామరుని ముందు నిలవలేకపోతిని. నేను ఋత్విజుడను కాను. వెలవెలబోయిన హీనుణ్ని." పెద్దగా అరుచుకుంటూ నేలమీద పొర్లాడాడు.

రామన్న శమీకున్ని లేవనెత్తే ప్రయత్నంచేస్తే విదిలించుకున్నాడు. "పోరా శూద్రుడా నీవు నన్నుతాకడమా? ఎంతగా దిగజార్చితివి. నా ఖర్మము ఎంతగా హీనపడినది. ఏమిరా నాబతుకు ఇలా నేలమీద పొర్లాడుతోంది." తలబాదుకున్నాడు. అతన్ని చూసి రాజు కోపంతో తీక్షణంగా చూసాడు.

రామన్న మరో ప్రయత్నం చేసి చీదరించుకుంటున్న శమీకున్ని "ఆచార్య దేవా, కోపాన్ని తగ్గించుకుని ప్రశాంతచిత్తుడవై నా మాటలు ఒక్కసారి ఆలకించండి. నేను ఇందులో ఎలాంటి సాంప్రదాయాలను, కట్టుబాటులను అతిక్రమించ లేదు. కేవలం చిన్నచిట్కాతో ఆ పాత్రలను గుర్తించాను. ఆ ముడి విప్పుతాను. ఇది కేవలం మీరన్నట్టుగానే గాలివాటం. ఆ వెండిపాత్రలో ఉన్నది ఏ జలం అనేది ఎలా గుర్తించానో చెబుతాను వినండి. జలాలు తీసుకు రావడానికి వెళ్లిన పురోహితులు ఖాళీ వెండిపాత్రను నది ఇసుకతో తోమి ఆ తరువాత నీళ్లుపట్టాక మూతల బిగించి అక్కడ దొరికే ఆకులుచుట్టి సంచిలో వేసుకున్నారు. తొలిపాత్ర ఆరుమాసాలక్రితం నింపబడింది. చివరిపాత్ర ఇటీవల నింపబడింది. ఇక్కడే చిన్న చిట్కా ఉంది. జలపాత్రలు పుణ్యక్షేత్రాలలో వీరు బయటికితీసి సంచిలో పెట్టడంవలన





ఒకరకంగా దుమ్ముధూళికి గురయ్యాయి. ఇక్కడే వాటి గుట్టు నాకు తెలిసింది. తొలిపాత్రమీద పేరుకున్న దుమ్మును చూసి దేనితర్వాత ఏది అనేది తెలుసుకున్నాను. తొలిపాత్ర కావేరినదీ జలాలతో కూడిన పాత్ర బాగా దుమ్ముతో ఉండగా చివరగా పట్టిన పాత్ర తళతళలాడి పోతోంది. ఇలా ఐదింటిని వరుసగా గుర్తుపట్టాను. అయితే ఇక్కడ ఒకచోట దైవం అనుకూలించింది. కృష్ణవేణి, గౌతమీ నదీజలాలు రోజులు తేడాతో సేకరించడం వలన ఆ రెండుపాత్రలు ఒకేలాంటి దుమ్ముతో ఉన్నాయి. అప్పుడు వాటిమీదఉన్న ఆకులను చూసి గుర్తించాను. రాజమహేంద్రిలో విరివిగా పండే మామిడిరసాల ఆకులను చూసి గౌతమీ అని, అలాగే కృష్ణవేణినదీ తీరాల్లో విరివిగా లభించే తెల్లచెరకు(ఇప్పుడీ పంట అంతంత మాత్రమే అయ్యింది) ఆకులను చూసి గుర్తించాను. నేను గుర్తించిన విధానం వెండితయారీదారులకు అడిగితే వారు ఒప్పుకున్నారు. ఇందులో ఇంతకు మించి ఏమీలేదు."అని వివరించాడు. పూజ్యులు గురుతుల్యులు మీకు నాకు పోటీయా? పర్వతం సమానులు మీరు గులకరాయి లాంటి వాడిని నేను. నన్ను ఆశీర్వదించండి. ఇంతటితో నేను ఈ తావునుంచి నిష్క్రమించగలను." అని శమీకుని పాదాలపై పడ్డాడు.

శమీకుడు కళ్లలోంచి నీటిపొర కదలాడింది. "రామన్నా ఎందుకో నాకు తెలియకుండానే ఇలా ప్రవర్తించాను, బహుశా నాలో మిగిలిన కులాలపై ఉన్న చిన్న చూపేమో ఏదిఏమయినా నావంటి అజ్ఞానికి పడిన మరణశిక్షను నీవు కళ్లార చూసిపోదువుగాని నీకు వేయి శుభాలుకలగాలని కోరుకుంటున్నాను."

"ఛ ఛ మీకు మరణశిక్ష నేను అంగీకరించను. ఒకవేళ తప్పదు అనే పరిస్థితి ఉంటే ఆ శిక్షను నేను పొందగలను." రామన్న శమీకునికి చెప్పాడు. రాజు వారిమాటలకు నవ్వి "మీకుగా మీరు విధించుకున్న శిక్షలు నాకు ఎలాంటి సంబంధం లేదు. వాటిని అమలు చేసే ఆలోచన నాకులేదు. మన పంచపాత్రలలో ఏముందో తేలిపోయింది. ఇందుకు ఒక చిట్కాద్వారా కనుగొన్న రామన్నను అంతా అభినందిద్దాం." అని రామన్నకు విలువైన బహుమతులు ఇచ్చాడు.

# నిజం దేవుడెరుగు

మర్యాదరామన్న గురించి బాటసారులు పలుసత్రాలలో, మఠాలలో పదేపదే ముచ్చటించు కోవడంతో పలురాజ్యాలలో రామన్న గురించి గొప్పగా చెప్పుకోసాగారు. గుంపానగరంలో ఒక సత్రంలో ఇద్దరు బాటసారులు విడిది చేసారు. వారిమధ్య గుంపా నగరవిశేషాలు వచ్చాయి. అక్కడ దేవదత్తుడు ఒక సాధువు నిత్యం దేవుడితో మాట్లాడి రాజుకు చెబుతుంటే, ఆ ప్రకారం రాజు తనపాలన చేస్తున్నాడు. సాధువు ఒక దేవాలయ ప్రాంగణంలో ఉండేవాడు. ఇప్పుడు రాజుగారు ఒక సౌధవం ఇచ్చారు. అందులో నివసిస్తున్నాడు. అతడో దొంగసాధువు అతడివలన గుంపా నగరం ప్రజలు చాలా బాధపడ్తున్నారు. ఆ సాధువుకు అన్ని వ్యసనాలున్నాయి. అతడు చాల ధనం సంపాదించాడు. ఏదో ఒకరోజు ఆ రాజును దించేసి రాజు అవతారం ఎత్తినా ఆశ్చర్యపడనక్కర్లేదు. అతడివలన అక్కడ ప్రజలు నానాఅగచాట్లు పడ్తున్నారు. ఎలాగైనా ఆ సాధువుకు బుద్ధివచ్చేలా చేయాలి. రామన్నను కలుసుకుని చెప్పితే అతడే ఏదోఒకటి చేస్తాడు అని ఇద్దరు బాటసారులు చెప్పుకోసాగారు. రెండోవాడు తలఅడ్డంగా తిప్పాడు.

"నీ ఆలోచన సరికాదు. రామన్న ఉండే చోటుకు చాలాదూరంలో ఉండే ఈ గుంపానగరానికి వచ్చి ఈ దొంగ సాధువుకు బుద్ధివచ్చేలా చేయాల్సిన అవసరం రామన్నకు ఎందుకుంటుంది? మనమే సాధువును కలుసుకుని రామన్నగురించి చెబుదాం. అతడే రామన్నను పిలిపించి ఏదో ఒకటి చేయాలని చూస్తాడు. అప్పుడు రామన్న వాడిపనిపడతాడు. ఏమంటావు?" రెండోవాడు తన అభిప్రాయాన్ని చెప్పాడు.

"అయితే ఉదయాన్నే వెళ్లి కలుద్దాం."అని అనుకుని మరుసటిరోజు సాధువును కలుసుకున్నారు. సాధువు ఒంటినిండా విభూతి రాసుకుని తనను కలుసుకోవడానికి వచ్చి కాళ్లమీదపడిన వారిని దీవిస్తూ మీరుండే ప్రాంతంలో ఫలానావాడు నన్నుఎందుకు కలుసుకోడు?" అని ఆరాలు తీస్తూంటే ఇద్దరు





బాటసారులకు ఒళ్లుమండిపోయింది. ఆ వచ్చినవారు ఎవరిమీద కసి ఉంటే వారి గురించి సాధువుతో చెప్పడం అతడు విని "రాత్రి శ్రీవారు (దేవుడు) కలలో కనిపించి వాడికోసమే చెప్పారు. వాడిని మన రాజుగారికి చెప్పి తాటవలిపించాలి," అని బుసలు కొడ్తుంటే బాటసారులు బిక్కముఖాలు వేసారు.

అంతలోనే సాధువు బాటసారులను చూసి "ఎవరు మీరు? ఎక్కడి వారు? ఎన్నడూ చూడలేదు. ఇలారండి." కుశలప్రశ్నలు కురిపించాడు.

బాటసారులు కాళ్లమీదపడి"మా జన్మధన్యం అయ్యింది స్వామీ తమ గురించి వినడమే. ప్రత్యక్షంగా చూడడం కుదరలేదు. ఎలాగైనా చూడాలని ఆశపడి వచ్చాం. మీరు వినే ఉంటారు. మర్యాదరామన్న గురించి అతడో అభూత కల్పనల మోసగాడు. అతడంటే పడి ఛస్తున్నారు. అతడిచ్చే తీర్పులకు ఎక్కడెక్కడ్నించో రాజులు వచ్చి తీసుకువెళ్లి సన్మానిస్తున్నారు. ఒకప్పుడు మీ గురించి ఎక్కడా వినేవాళ్లం ఇప్పుడు సర్వం రామన్న మయం అయ్యింది. ఇలా కొన్నాళ్లు సాగితే మీ వంటివారు మరి కనపడకుండా పోతారు అని ప్రజలు చెప్పుకుంటున్నారు. ఈ విషయం తమచెవుల్లో వేసి పోదామని వచ్చాం."

"రామన్నపేరు మేము విన్నాం. అతడు మంచి చతురసంభాషకుడు అనికదా విన్నాం. తీర్పులు ఇచ్చేస్థాయికి ఎదిగాడన్నమాట. ప్రజలు అమాయకంగా ఉంటే ఇలానే ఉంటుంది వ్యవహారం. వేటగాడు గురితప్పితే లేడి ఒంటికాలుపై నడిచిందని ఒక కథ ఉంది. అసలు తీర్పు అనగానేమి? దైవం మనకు మనోఫలకంపై కన్పించి చెప్పాలి. అదే న్యాయం. ఇలాంటి శూద్రుడా తీర్పునిచ్చునది. అతడు తెలుసుకున్న విద్యలేమిటి? వాడిపనిపడ తాను. అన్నట్లు నా గురించి ఏమైనా ఎక్కడైనా వక్రంగా వాగాడా? భయపడ కుండా చెప్పండి. నేను వాడి అంతు చూడకుండా వదలను"అని బాట సారులను నిలదీసాడు.

"స్వామి రామన్న ఏమి అనకుండా ఉంటే మేము ఇక్కడికి వచ్చేవాళ్లమే కాదు. అతడు మీ గురించి తరుచు వాగుతుంటాడు. మీరు దొంగస్వాము

లంట.మీతో ఏనాడు దైవం మాట్లాడడం. మీ రాజుగారిని మీరు వెర్రివాడ్ని చేసి ఆడిస్తున్నారంట. ఆ విన్నవాళ్లు నిజమనుకోరు,అందుకే పనిగట్టుకుని వచ్చాం.అలాంటివాడిని తమరు వదలొద్దు.లేకుంటే లేనిపోనివి మీరు పడాల్సిందే.మీ వంటి దైవాంశ సంభూతులకు ఇంతటి మానసికశిక్ష ఆరామన్న వేయడమా? వాడిమీద కోపంతో వచ్చి చెప్పాం. మా పని అయి పోయింది. అట్టివానిని వదలొద్దు. ఇక వెళ్లిపోతాము చాలాదూరం ప్రయాణిం చాల్సి ఉంది. " అని ఇద్దరు లేచినిలబడ్డారు.

"మీరు ఎక్కడికి పోవద్దు.మీరు ఇప్పుడు వాగినదంతా నాకు ఋజువుగా కావాలి.నేను ఆ రామన్నను రప్పిస్తాను.మీరు అతడిముందు నిలబడి చెప్పాలి." ఆ సాధువు అడిగి వారి ముఖాల్లోకి చూసాడు.

"ఇద్దరు సరేనన్నారు. తప్పకుండా మేము ఋజువుకు నిలబడతాం. మీదే ఆలస్యం "అని ఏకకంఠంతో చెప్పారు.

రామన్నకు గుంపానగరం నుంచి రాజుగారి పిలుపు లభించింది. రామన్న బయలుదేరివెళ్లాడు.అక్కడ రామన్నకు విడిది ఏర్పాటు చేయ బడింది.బాటసారులిద్దరు ఎదురుగా ఉన్న విడిదిలో ఉన్నారు.వారు రామన్నను రహస్యంగా కలుసుకుని "అయ్యా క్షమించాలి.పెద్దపొరపాటు చేసాం. మన్నించాలి. ఈరోజు మీరు ఇక్కడికి రావడానికి కారణం మేమే. ఇక్కడ ఒక సాధువు రాజును ఆడిస్తున్నాడు.ప్రతి ప్రజాతీర్పును తానే కన్నులు మూసుకుని దైవంతో మాట్లాడి మరీ,ఆ తీర్పును చెబుతున్నాడు.చాలా మందిని క్రూరశిక్షలకు గురిచేయించుచున్నాడు. ఈ విషయాలు విన్నంతనే మాలో రక్తం సలసల కాగింది.అందుకే సాధువును కలిసి రామన్న మీపై గుర్రుగా ఉన్నట్టు నమ్మకంగా చెప్పాం. వాడు అసలే కోతిలాంటివాడు.మీపై కోపంతో పగతీర్చుకునేందుకు రప్పించాడు. ఏవో ఎత్తుగడలు వేస్తున్నాడు. మరో విషయం మేము చెప్పినది నిజమా కాదా అని మీముందు మమ్మల్ని నిలబెట్టి ఋజువు పెడతాడంట. మాకు ఏమి చెప్పమంటారు రామన్నా!" అడిగారు.





రామన్న పకపకమని నవ్వి "బాగుంది మీకు ఏమితోస్తే అది చెప్పేసి సమస్యను జటిలం చేసి నన్ను అడిగితే నేనేం చేయగలను.మీకు ఎలా చెప్పాలను కుంటే అలా చెప్పండి. నాకుగా నేను బయటపడను. ఎవరికి భయపడను." చెప్పిపంపేసాడు. వారు చాలా సంతోషించారు.

ఆ మరుసటి రోజు రామన్నను గుంపానగర సభలోకి వెళ్లాడు. రాజు కీర్తివర్ధనుడు రామన్నను ఆహ్వానించి ఒక ఆసనం చూపాడు.రామన్న కూర్చుని సాధువు దేవదత్తుడు వైపు చూసాడు. అతడు కన్నులలో నిప్పులు కురిపిస్తున్నాడు. అక్కడికి బాటసారులు ఇద్దరు తీసుకుని రాబడ్డారు.వారు సాధువువైపు చూస్తూ నిలబడ్డారు. సాధువు ప్రత్యేకమైన ఆసనంలో కూర్చుని ఉన్నాడు. అతడు మెల్లగా లేచి రాజుకు, సభకు హాజరు అయిన వారికి నమస్కరించి "ఓ రాజా నన్ను నామాటలను విశ్వసించి తమరు ఇక్కడ నాకో ప్రత్యేకతను కల్పించారు. నా దురదృష్టం అందరిచే కీర్తింపబడినా ఈ రామన్నచే దూషింపబడ్తున్నాను. ఏమి నాప్రారబ్దం, నాకు ఆ మాటలు విన్నతరువాత జీవించాలనిపించలేదు. అందుకే తమ ముందు ఈ దూషించే రామన్నను నిలిపాను.ఇక్కడ ఇద్దరు బాటసారులు నా గురించి విని వచ్చి నన్ను దర్శించుకుని నాకీ రామన్న నోటిపరుష పదజాలం గురించి వివరించారు.కావాలంటే అడగండి ప్రభూ! అదే నిజమైతే నేను మరణించుటే ఉత్తమం." అని చాల బాధపడ్డాడు.

రాజు కీర్తివర్ధనుడు రామన్నవైపు అదోలా చూసాడు.

"ఓ బాటసారులారా ఏమిటిదంతా మీరెవరు? ఎక్కడ్నించి వచ్చి ఇలాంటి జగడాల మాటలను మోసుకొచ్చారు. సరే, ఈ రామన్న ఏమి అన్నాడు. పాపం నిరంతరం దైవాన్ని ధ్యానించే ఆ సాధువును ద్వేషించడానికి కారణం మీరు ఏమి విన్నారో అది ఏమాత్రం దాచకుండా చెప్పండి." ఆదేశించాడు.

బాటసారులు రాజుకు నమస్కరించి"అయ్యా ఈ రామన్నకు దేశం అంతటా మంచి పేరున్నది.ఈతని తీర్పులు గురించి జగమంతా చెప్పు కుంటున్నారు. ఈతడు కారణజన్ముడు అని చాలామంది పెద్దపండితులు

సయితం నమస్కరించడం చూసాం.మేము ఈతని ఇంటికి వెళ్లినపుడు అదేపనిగా మన సాధువు దేవదత్తుని గురించి దుర్భాష లాడసాగాడు.కారణం అడిగాం. దేవదత్తుడు రాజును వలలో వేసుకుని కానరాని దేవునితో మాట్లాడి న్యాయం చెప్పడం వలన ఎందరో కఠిన శిక్షలకు గురిఅవుతున్నారని అందుకే అతన్ని అదే పనిగా తిట్టిపోస్తున్నాను అని చెప్పాడు. మాకు ఎందుకో కోపం వచ్చి అదేపనిగా రెండురాత్రులు, పగళ్ళు నడిచి వచ్చి సాధువుకు చెప్పాం."

"రామన్న నీ గురించి మేము చాలావిన్నాం. నీవు నన్ను ఏమి కానట్టుగా మాట్లాడి చిన్నచూపు చూసావు. నేనేమిటి సాధువు వలలో పడడమేమిటి? చతుషష్టి కళావిశారధుడను.ఆ సాధువులో ఎన్నో మహత్యాలున్నాయి. ఈరోజు ఈ క్షణం అతడు కన్నులు మూసుకుంటే సాక్షాత్తు దేవుడు మనోఫలకం మీద ప్రత్యక్షమవుతాడు.అలా దేవునికి ఇక్కడ నేరాలు నివేదించితే వెంటనే ఆ దేవుడు చెప్పిన తీర్పులే ఇక్కడ అమలు చేస్తున్నాం.ఇందులో ఆ సాధువు నేను నిమిత్త మాత్రులం. నీవు ద్వేషించడం నాకు ఏమి నచ్చలేదు. దేశమంతటా తీర్పులునిచ్చి పేరుపద్దావే, నీవు చేసిన సాధుదూషణకు ఏమి శిక్ష విధించుకుంటావు."

"నేను అలా అన్నానో లేదో మీరు విచారించలేదు.సరే, అన్నానే అనుకుందాం మరి నేనెందుకు నాశిక్ష గురించి చెప్పడం ఆ సాధువునే దేవుడితో మాట్లాడి శిక్షించమనండి ప్రభూ!" రామన్న వినమ్రంగా లేచి నిలబడి చెప్పాడు.

సాధువు అందరిని చూసి కన్నులు మూసుకున్నాడు. నిశ్శబ్దం అలుము కుంది. కొన్నిక్షణాల్లో కన్నులు విచ్చి "ఓరాజా ఈ రామన్న చేసిన సాధు దూషణకు మరణదండన విధించమని దైవాజ్ఞ." పెద్దగా అరిచిచెప్పాడు.

రామన్నవైపు భయంగా చూసారు బాటసారులిద్దరు. "అయ్యో అనవసరంగా అన్నెంపున్నెం ఎరుగని వాడిని ఇరికించేసాం."అని లోలోపల కుమిలిపోయారు. సభలోని వారు చాలా బాధపడ్డారు.రాజు మరో మాటకు అవకాశంలేకుండా "ఈ దోషిని దైవాజ్ఞగా భావించి మరణదండన అమలు చేయండి." ఆదేశాలు జారీచేసాడు.





రామన్న వెంటనే "ప్రభూ మరణదండనకు ముందు ఈ నిరపరాధి కోరిక తీర్చండి."అని చేతులు మోడ్చి కోరాడు.అందుకు రాజు ఇంకా ఏ జవాబు చెప్పకుండానే సాధువు కలుగచేసుకుని "ఓరామన్నా చచ్చేవాని కోరిక తీర్చడమనేది ఏ ఒక్కరూ కాదనరు.కోరుకో నీవు ఆలజాతివాడవు. తిండిపిచ్చి ఉంటుంది. నీకు నచ్చిన తినుబండారాలు గురించి చెప్పు తృప్తిగా నీకు వడ్డించే ఏర్పాటు చేస్తాను.హాయిగా తిని చక్కగా ఉరికొయ్యకు వేలాడిపోదువులే!"

వెంటనే రాజుకూడా కలుగచేసుకుని "రామన్న నీకు ఏమి కావాలన్నా అది తీర్చడం శాస్త్రసమ్మతం కోరుకో!"

"ప్రభూ నేను చచ్చేముందు తిండికోసం ఆలోచించువాడను కాను. నేను ఎన్నో విద్యలు నేర్చినాను.అందులో శబ్దభేరివిద్య ఒకటి.దాన్ని ప్రదర్శించేవారు ఈ చుట్టుప్రక్కల లేరు. నాకు కళ్లకు గంతలు కట్టి నిశ్శబ్దం పాటించండి. మీరు ఎక్కడ శబ్దంచేస్తే అక్కడ నాచేతిలో ఉన్న పిడిబాకు దూసుకుపోతుంది.అది గంటకావచ్చు కత్తికావచ్చు లేకుంటే ఎవరైనా మనిషి కుత్తుక కావచ్చు. మీ కారాగారంలో ఉండే బంధీలను రప్పించండి. వారిలో ఏ ఒక్కరి కుత్తుకనో నేను తెగేయ్యగలను.మీరంతా చూసినట్టుం టుంది." అని చెప్పాడు.

సభలోనివారు ఉత్సాహంగా చూసారు. అప్పటికి శబ్దభేరివిద్య కాలగర్భంలో కలిసిపోయి వందల సంవత్సరాలయ్యింది.. అందుకే అంతా కలిసి ఆ విద్య చూడడానికి పెద్దగా అరిచి ప్రదర్శించాల్సిందిగా కోరారు.

రామన్నను రాజు కూడా ఆనందంతో కోరాడు. సాధువు లేచి ఓ రామన్న నీవు గతించిన విద్యను ఇంతమందిలో చూపడానికి సిద్ధపడ్డున్నం దుకు ఆనందంగా ఉంది. అవశ్యం చూపించు." అని పెద్దగా నవ్వాడు.

"గురుదేవా! నా ప్రదర్శనకు ముందు మీరు వెంటనే ఆ దేవున్ని అడగాలి నా చేతిలో ఎవరైనా ఛస్తారా?లేక నా గురి తప్పి ఎవరికి ఏమీకాదా? ఆతరువాత నాశబ్దభేరివిద్యను ప్రదర్శించగలను." రామన్న మిక్కిలి వినయంగా కోరాడు.

"శెహబాష్ రామన్న ఎంతచక్కగా కోరావు. భలేగా ఉంది. నిజమే ఇక్కడ వారెవ్వరు నాతో సహ ఈ శబ్దభేరి విద్యను చూడలేదు.ప్రదర్శించు, సాధువు గారూ వెంటనే రామన్న కోరిక ప్రకారం మీరు దేవునితో మాట్లాడి ఏవిషయం చెప్పండి"తొందరచేసాడు.సాధువుకు గుండెలు తారెత్తి పోయాయి.ఏమిచేయాలో తోచలేదు.అయినా తప్పదు.నమ్మించడానికి కన్నులు మూసుకున్నాడు.

కొద్దిక్షణాల్లో కళ్లు తెరిచాడు. అతనిమాటలకై అంతా చెవులురిక్కించి వినసాగారు."ఈ రామన్న చేతిలో పిడిబాకు ఎవరికి ఎలాంటి హాని చేయదు. కానీ రామన్న కోరిక ఏమి బాగాలేనందున రాజే ఆ కోరిక తీర్చాలనుకున్నా తీరదు. అతడి చేతిలో కత్తి దూసుకునిపోదు. కనుక మీరు అతని గొంతెమ్మ కోరిక తీర్చవద్దు శిక్ష అమలు చేయమని శ్రీవారి (దేవుడు) ఆజ్ఞ." తడబడ్తూ చెప్పాడు.

అప్పటికే రామన్నకు రెండు కళ్లకు నల్లని గంతలు కట్టారు రాజ భటులు.రాజు ఏమి చేయాలో ఆలోచిస్తుండగానే మళ్లీ సాధువు గొంతు విప్పాడు."ఓరాజా వెంటనే శ్రీవారి ఆజ్ఞలను అమలుచేయండి తాత్సారం చేయవద్దు."అరిచి చెప్పాడు. అప్పటికే రామన్నచేతిలో పిడిబాకు గాల్లోకి లేచింది.మరుక్షణం దూసుకుపోయింది.అరిచి చెప్తున్న సాధువు కుడిచేతిలో దిగింది. కీచుగా అరుచుకుంటూ నేలమీదపడ్డాడు.

"రామన్నా ఏమిటి నువ్వుచేసింది."అని రాజు రామన్న మీదకు వెళ్లి కత్తిదూసి అడిగాడు.సభలోని కలకలం మొదలయ్యింది.

"మన్నించండి ప్రభూ ఒక్కసారి ఆలోచించండి. సాధువుకు దేవుడు ఏమిచెప్పాడు. నా కత్తివలన ఎలాంటి హాని జరుగదు అని, నా చేతిలో కత్తివెలువడదు. ఈ రెండు దేవుడు చెప్పితే మరెలా జరిగాయి. కనుక ఈ సాధువు ఒక మాయలమారి. ఇక్కడ మీ పాలనలో ప్రజలు ఎంతో హాయిగా ఉండేవారు. ఈతడు రావడంతో రాక్షసపాలనలోకి వెళ్లిపోయింది. మీకున్న దైవభక్తిని ఇతడు తెలివిగా దేవుడితో అనుక్షణం మాట్లాడుతున్నట్లు చెప్పుకుని





చాలా ఘోరంగా వ్యవహరించాడు. పలువురుకి చేసిన తప్పులకు మించి శిక్షలు వేయించాడు. తమరే ఆలోచించండి. దేవుడు మహామహామునులకే కన్పించడు ఈ సాధువెంత ఈతని భక్తి ఎంత?"

"రామన్న చెప్పినది నిజం. ఈ సాధువు మాయమాటలు వలన మేము చాలా కష్టాలు పడ్తున్నాం. ఈ సాధువులో మంచి లక్షణాలు లేవు. "అని సభలోని వారు అరిచారు.అక్కడే ఉన్న బాటసారులు రాజుముందుకు వచ్చి "ప్రభూ మన్నించండి మేము రామన్నను ఈ కొలువులో చూసాం తప్పితే మేము ఆయన్ని ఎక్కడా చూడలేదు. ఆయన ఇలా మిమ్మల్ని తిట్టిపోసాడు అని సాధువుకు చెబితే అప్పుడు ఆయన నిత్యం దేవునితో మాట్లాడుతాడు కనుక వెంటనే ఆ దేవునినే అడిగి తెలుసుకోవల్సింది. అలా చేయకుండా మా బూటకపు మాటలను విని వెంటనే రామన్నను పిలిపించి మీ ద్వారా మరణశిక్ష వేయించాలని చూసాడు. అడుగడుగునా మోసపుమాటలు ఇక్కడే కన్పించాయి. మేము బాటసారులం.రెండు రోజులక్రితం ఈ నగరానికి వచ్చి సత్రంలో రాత్రిగడిపాం. మొత్తం నగరవాసులంతా సాధువుకోసం చెప్పు కోవడం విని చాలాబాధపడి రామన్న ద్వారా ఈ పని కాస్తచక్కబెట్టేసాం. ఈ నగరానికి సంబంధం లేకపోయినా తోటిమానవుల బాధను చూసి ప్రాణాలకు తెగించి ఇంతవరకు తెచ్చాం."

సాధువు చేతికి తగిలిన గాయాన్ని పట్టుకుని నిలబడ్డాడు. మంత్రి కూడా రాజు చెవిలో చెప్పాడు." ప్రభూ నాకు తమ వద్ద ఎంతో చొరవ ఉన్నా ఈ సాధువు విషయంలో ఏమీ చెప్పలేకపోయాను.ఈతడు చాలా ప్రమాదకారి అని నాకు ముందే తెలుసు.ఇలాంటి పరిస్థితి వచ్చినపుడు తప్పక చెప్పాలనుకున్నాను."

"దేవదత్తా సాధువుగా నామదిలో మంచి స్థానాన్ని పొందిన నీవు ఇలా హీనపడి పోతావని ఎప్పుడు అనుకోలేదు.రామన్నకు మరణశిక్ష విధించినా అతడిలో అసలు మృత్యుభయమేలేదు. కారణం తను ఏ తప్పు చేయలేదు. కనుక భయపడాల్సింది ఏమీలేదు.కానీ, నీమీద ఇంతమంది

నిప్పులు చెఱుగుతుంటే నీవు చిక్కముఖంతో ఉన్నావు. నీలో దేవుణ్ని చూసాను. ఎందరికో అకారణంగా మరణదండన నీవు వేయమంటే వేసాను. నీవు నరపిశాచివి. రామన్న నీవు ఏమి శిక్షవిధిస్తావు. నీవు తీర్పుల భలే చెబుతావని విన్నాను."

"ప్రభూ ఇందులో అతడితోబాటు మీరు తప్పుచేసి ఉన్నారు. ఇలాంటి పనికిమాలిన వారిని నమ్మినందున మీరు తొలి నిందితుడు అయ్యారు. రెండో నిందితుడే ఈతడు. ఇక ధర్మం తప్పక పాలించాల్సిన ప్రభువు దైవాన్ని నమ్మి దేవుడే తీర్పులు ఇస్తున్నాడని భ్రమల్లో ఉన్నందున అదితెలియక చేసిన తప్పు. కనుక మీరు శిక్షార్హులు కారు. ఇక సాధువు దేవదత్తుడు రాక్షస మనస్సు గలవాడు. కానీ, వేషం సన్యాసిలా ఉన్నందున ఇట్టివానికి ఏవిధంగా శిక్షించరాదు. నగర బహిష్కారమే. ఈతనివద్ద ఇప్పటివరకు ఉన్న ధనం తీసుకుని నగరం నుంచి కట్టుబట్టలతో గెంటివేసిన చాలు అంతకు మించి శిక్ష అనవసరం" అన్నాడు రామన్న.

దేవదత్తుడు రామన్న కాళ్లమీద పడి "నన్ను మన్నించు. నిన్ను చంపాలనుకున్నాను. కానీ, నీకు అవకాశం ఉన్నా నన్నుమన్నించి ప్రాణాలతో విడిచిపెట్టమన్నావు. నీవు రామన్నవే కాదు సాక్షాత్తు ఆ దైవస్వరూపమే."అని కళ్లనీళ్లుపెట్టుకున్నాడు. ఆ తరువాత అందరిని ఉద్దేశించి "నన్నుమన్నించండి. ఎన్నడూ ఏమీ ఎరుగని వాడికి అందలం ఎక్కిస్తే ఇల్లుపీకిపందిరేసాడన్నట్లు నా బుద్ధి హీనత్వం కనబరిచి ఈరోజు అందరిలో చాలా హీనపడి పోయాను. ఇకనుంచి ఇలాంటి తప్పులు చేయను. పోవల్సిన ప్రాణాన్ని నిలబెట్టిన రామన్నకు వెయ్యి నమస్సులు తెలియపరుచుకుంటూ నా శేషజీవితం ఇక తపస్సుకే పరిమితం చేస్తాను. కీర్తివర్ధన రాజును నేలమీద నా తనువున్నంత కాలం ఆయన్ని మరువలేను. నన్ను ఎంతో గౌరవంగా ఆయన చూసుకుంటే నేను మోసం చేసాను. ఓరాజా నన్ను మనసావాచా క్షమించు" అని చెప్పి సభలోంచి వెళ్లిపోయాడు. అతడిని నగరం దాటించడానికి కొందరుభటులు అనుసరించారు. రామన్నను అంతాకొనియాడారు.





# బానిస ధర వెయ్యివరహాలు

మహాకోసల నగరానికి రామన్న బయల్దేరి వెళ్లాడు. అక్కడ ఒక పండితున్ని కలవాలి. అతడు తాను ఎవరైంది తెలియకుండానే పావురం ద్వారా తన శిష్యునికి పంపగా అతడు ఆ లేఖను తనకు తెచ్చిఇచ్చాడు. అందులో తాను శతవృద్ధుడను నా ఆహ్వానాన్ని తిరస్కరించకుండా రావయ్యా నీకువేయి శుభాలు కలుగుతాయి" అని రాసి పంపాడా వృద్ధుడు. దారిపొడుగునా పెక్కు నగరాలు పల్లెలు చూడవచ్చు అని ఆశతో ఒక గుర్రంమీద బయల్దేరాడు రామన్న.

సన్ననిబాటలో సాగిపోతుందా గుర్రం. కుంభిని అనే పట్టణంలోకి ప్రవేశించింది. అక్కడ కొందరు గుర్రాన్ని ఆపి "నీవు దిగి నడిపించుకుని పోవాలి లేకుంటే మా రాజభటుల దృష్టిలోపడితే శిక్షార్హుడవుతావు. ఎందుకంటే నీవు ఈకుంభినీ వాసివికావు. ఇతరులు ఎవరైనా ఇలా దౌడుతీస్తూ గుర్రాలపై పోరాదు. అదిగో కచేరి అక్కడికి పోయి నీ ఊరుపేరు చెప్పి, ఎందుకిలా ఈ కుంభినీ పట్టణం లోంచి వెళ్లాల్సివచ్చిందో తెలియ చేయాలి. అందులో ఏ ఒక్కపొరపాటు జరిగినా కచేరి మీద ఉన్న నగారాలు మ్రోగుతాయి. నీకు అక్కడ కొత్వాలు కొంత జరిమానా విధిస్తాడు. అదిచెల్లించి నీదారిని నీవు వెళ్లవచ్చు. ఇది ఈ పట్టణంలో చాలాకాలంగా అమలులో ఉన్న విధానం."అని చెప్పారు అక్కడి వారు.

అంతలోనే రాజభటులు వచ్చి యక్షప్రశ్నలతో రామన్నను నడిపించుకుని కచేరికి తీసుకునిపోయారు. అప్పటికే నగరా మ్రోగింది. ఇద్దరు బాటసారులకు జరిమానా విధించబడింది. వారు చెల్లించడానికి ధనం తక్కువగా ఉన్నందున వారి గుర్రాలను జరిమానా కింద చెల్లించి ఏడుపుముఖాలతో వెనుదిరిగి పోయారు. రామన్న అక్కడే నిలబడ్డాడు. అతడి ఊరుపేరు రాసుకున్నారు. ఎందుకిలా మా పట్టణ ప్రవేశం చేసావు. ఏం రహస్యాలు తెలుసుకుని పోదామని వచ్చావు. మా శత్రువు ఉగ్రసింహుని వద్ద ఎన్నాళ్లనుంచి పనిచేస్తున్నావు. నీవు చూస్తుంటే సాధువర్తనునిలా వేషం

వేసుకుని మా కోటలో ప్రవేశించావు." అడిగాడు కొత్వాలు. అతడిపక్కనే ఒక తాడు కచేరి పైభాగం నుంచి కిందకు వ్రేలాడుతోంది. దానిమీద కొత్వాలు మాట్లాడు తూనే తేలిగ్గా తాకుతున్నాడు.

"అయ్యా కొత్వాలుగారూ! మీరు ఎంతకాలంగా కొత్వాలుగా ఉన్నారు. మీ ఎడమపక్కన ఈ కొబ్బరిపీచు తాడును వేలాడదీసారు. పవిత్రమైన నారికేళం పీచును నిత్యం ఎడమచేతితో తాకుతున్నారు. అందుకే మీకు రానున్న సర్వసేనాని యోగం తృటిలో తప్పిపోతోంది. ఆ తాడును మీ కుడి వైపుకు మార్చుకోండి. శుభయోగం తప్పదు. నా మాటవిని ఎడమచేతితో తాడును తాకవద్దు. తెలియక ఇంతకాలం జరిగిపోయింది. తెలిసి చేస్తే సర్వ అవలక్షణాలు మీలో ప్రవేశిస్తాయి, ఆపైన మీ ఇష్టం." రామన్న కంచుగంట లాంటి గొంతుతో చెప్పాడు.

కొత్వాలుకు ఒకరకమైన భయం ఆరంభం అయ్యింది. వెంటనే తాడును పామును చూసినట్టు చూడసాగాడు. ఇక నాకు ప్రశ్నించిన వాటికి బదులు ఇస్తున్నాను. దయతో వినండి. నేను కళింగ నగరవాసిని, నాపేరు రామన్న అందరూ నన్ను మర్యాదరామన్న అని పిలుస్తారు. ఇకనేను ఒక శతవృద్ధుడైన పండితున్ని కలవడానికి మహాకోసలకు బయలుదేరు చున్నాను. ఇంతకుమించి నేను ఎవరికి గూఢచారిని కాను. ఇవి నేను చెప్పే నిజాలు. మరి మీ నగారా మ్రోగితే నాకు జరిమానా విధిస్తారు. నాకు తెలియక అడుగుతాను నగరాకు నేను చెప్పేది నిజమో అబద్ధమో ఎలా తెలుస్తుంది." అని ఎదురు ప్రశ్న వేసాడు.

కొత్వాలు నీళ్లు నమిలాడు. అయ్యా తమరు మర్యాదరామన్నగారా, మీపేరు విన్నాను. అలా కూర్చోండి. ఇక్కడ విశేషాలు చాలా విశేషంగా ఉంటాయి. ఇది మా రాజాజ్ఞ. మేము ఆయనేం చెబితే అది చేయడమే. నేను కుడిచేత్తో ఈ తాడును లాగితే, కచేరి మీదున్న నగరాలు మ్రోగుతాయి. అప్పుడు జరిమానా విధిస్తాం. అంటే బాటసారులను నిలువుదోపిడీ చేస్తాం. ఒకవిధంగా ఇదే మాకు ఆధాయవనరులు. ఆ బాటసారి సర్వంకోల్పోయి పట్టణం వదిలి ఇరవైక్రోసులు వెళ్లాక తగుల్తుంది ఉగ్రసేనుడు ఏలే నిశాపురి రాజ్యం అక్కడ మరో తతంగం జరుగుతుంది. ఇలానే పట్టుకుని కచేరిలో





నిలబెడతాడు అక్కడ కొత్వాలు వారికి చాలామంచిగా చూస్తాడు. వారు కుంభిని నగరం గురించి నీచంగా చెబుతారు. సర్వం దోచుకున్నారు. అక్కడ రాజు బాటసారులను దోచుకుని రాజ్యాన్ని నడుపుతున్నాడు అని వాగుతారు. అయితే మీరెంత చెల్లించారు. అని నయానా అడుగుతాడు. దానికి బాటసారులు మా వద్ద ధనం ఖరీదైన గుర్రాన్ని కూడా వారు లాక్కున్నారు అని చెబుతారు. అంతే ఆ కొత్వాలు రాసుకుంటాడు. పక్కనే కుంభిని నగరం గురించి రాసుకునే పత్రంలో అశ్వబలంలో జమ అవుతుంది. ఆ తరువాత కొత్వాలు అసలు రంగు కనబరుస్తాడు. బాటసారులను అక్కడ కచేరిలోనే చావబాది "ఏరా దున్నపోతుల్లా ఉన్నారు. మా శత్రువులకు మీవంతు ధనం బంగారం గుర్రం ఇచ్చి వచ్చేస్తారా? తిరగబడి ఉంటే కనీసం గుర్రం అయినా మిగిలేది. మీ వంటివారి వలన మా శత్రువు బాగా బలవంతుడైనాడు. మీకు కఠినకారాగారమే శిక్ష అని చెరసాలలోకి నెట్టేస్తాడు. ఆ తరువాత వారిని బానిసలుగా అమ్ముకుంటారు. అది వారి ఆదాయవనరులు ఇది ఈ రెండు రాజ్యాల తీరు." ఏది దాచకుండా చెప్పాడు.

"మరి ఇటునుంచి వచ్చిన బాటసారులను మీరుదోచుకుంటారు. అటునుంచి వచ్చినవారిని వారు దోచుకుంటారా?"

"రామన్నా బాటసారులను నిశాపురిలో దోచుకోరు. ఎట్టిపరిస్థితిలో కుంభిని నగరం వైపునుంచి పోరాదు. అది మాకు శత్రువు. అటువైపు నుంచి వెళ్లినవారిని వారు నిలువుదోపిడీ చేసి అన్ని రకాలబలాలతో మాపై యుద్ధానికి సిద్ధమవుతున్నారు. కనుక మీరు పోవద్దు. ఒక వేళ మామాట ధిక్కరించి వెళ్లి అక్కడ నిలువుదోపిడీకి గురయితే, అక్కడ మా గూఢచారుల వలన మీ వివరాలు మాకు వెంటనే ఇక్కడికి వస్తాయి, మళ్లీ ఎప్పుడైనా మీరు ఇటురావడం తటస్థించిననాడు మీరు మా చెరసాలయందు బంధీలయి పొరుగుదేశాల రాజులకు బానిసలుగా అమ్మబడతారు అని చెప్పి వదిలేస్తారు."

"బాగుంది మీవరస. మీ రెండు రాజ్యాల శత్రుత్వాల మధ్య ఏ పాపం ఎరుగని బాటసారులపైనా ఇంత క్రూరమైన చర్యలు తీసుకుంటున్నారు. అన్నట్లు మీవద్ద రాయబడిన వివరాల పట్టిక ఏమైనా ఉందా?"

"అయ్యా రామన్నగారూ ఇవన్నీ రాజకోట రహస్యాలు నేను ఇంతసేపు ఒక బాటసారితో మాట్లాడి ఇలాంటివిషయాలు చెప్పినట్లు మా రాజుగారికి తెలిస్తే నన్ను ఏమైనా చేస్తాడు. మీరు మెల్లగా మాట్లాడండి. మీరు నామేలు కోరి నా గురించి చెప్పారు కనుకనే మీకు చాలావిషయాలు చెప్పాను. ఇదిగోండి బాటసారులనుంచి దోచుకున్న గుర్రాల జాబితామాత్రమే ఉంటుంది. ధనం బంగారం ఎప్పటికప్పుడు రాజుగారి ఖజానాకు చేరిపోతుంది." చెప్పి ఒక పత్రం ఇచ్చాడు. అందులో చూసాడు గుర్రాలు ఆరువందలవరకు ఉన్నాయి.

రామన్న అక్కణ్నించి బయల్దేరేందుకు లేచాడు. "ఎప్పుడైనా పల్లకీలు, గుర్రపు బండ్లు దోచుకున్నావా?" లోగొంతుతో అడిగాడు.

"లోగడ ఆరుగురు బ్రాహ్మణులకు చెందినవి నాలుగు గుర్రాలు పూన్చిన బండిని స్వాధీనం చేసుకున్నాం. వారు ఆ తరువాత నిశాపురివైపు సాగిపోయారు"

రామన్న వెంటనే ఆలోచనలో పడ్డాడు. తనకు శతవృద్ధుడు పిలిచిన కారణం బహుశా ఇదే అయిఉంటుంది. ఆయనశిష్యులు నిశాపురిలో చెరసాల పాలయి ఉంటారు. ఇదంతా లేఖలో రాయలేక రమ్మని పిలిచాడా వృద్ధుడు. ఇదే నిజమైతే తాను తప్పకుండా నిశాపురి పోవల్సిందే అని మనస్సులో అనుకుని కొత్వాల్ వద్ద సెలవు తీసుకుని బయల్దేరాడు. కొత్వాలు వెంటపడి" మహనీయా నాకు సేనాని యోగం ఉందా?" అని లోగొంతుతో అడిగాడు.

"ఇలా బ్రాహ్మణులను నీవు నిలువుదోపిడీ చేస్తే వారి ఉసురు నీకు తగిలితే నీకు శుభయోగం ఎలా ప్రాప్తం అవుతుంది? నన్ను వదిలేసినట్టు వారిని వదిలేయాల్సింది. పెద్దతప్పు చేసావు."

రామన్న గుర్రాన్ని నడిపించుకుంటూ వెళ్లిపోయాడు.

రాత్రి అయ్యేసరికి నిశాపురి చేరుకున్నాడు. అక్కడ రాజభటులు రామన్నను నిలదీసి కచేరి ముందు నిలిపారు. కొత్వాలు ఎర్రగా చూస్తూ "నీవు ఎక్కడ్నించి వస్తున్నావు. బహుశా కుంభినీ నగరం నుంచి కానట్టుంది.





లేకుంటే నీ జాతిగుర్రాన్ని వారు వదలరు. నీ మెడలో విలువైన ఆభరణాలున్నాయి. అవి వారికి కన్పిస్తే లాక్కుంటారు. కనుక నీవు ఆవైపు నుంచి రాలేదు. అవునా?"

"అక్కడి నుంచే వచ్చాను. నన్ను ఏమీచేయలేకపోయారు. నావద్ద ధనం ఉంది. మీరన్నట్లు జాతి గుర్రంఉంది. అయినా నన్ను వదిలేసారు."

"అలా జరుగదు. అది కలలోకూడా కల్ల. వారు రాక్షసులకు వారసులు బహుశా నీవు వారి గూఢచారివా? ఇలావారు బాటసారులను వదిలిన దాఖలాలు లేవే." కొత్వాలు పెద్దకళ్లుచేసుకుని మరీ అడిగాడు.

"గూఢచారినయితే ఇలా రాజవీధిలోంచి వస్తానా? కోట వెనుక నుంచి చీకటిలో కలిసిపోయి నా గూఢచర్యం ఆరంభించేవాడిని. ఎందుకయ్యా ఆలోచించి ప్రశ్నించవు. నేను మర్యాదరామన్నను. అందుకే నన్ను వారు విడిచిపెట్టారు. అంతకు మించి ఏమీలేదు. నేను మహాకోసల రాజ్యానికి పోవుచున్నాను. అక్కడ ఒకశతవృద్ధుని అహ్వానంపై బయలుదేరి ఇలా ఈ రెండు రాజ్యాల విచిత్రవైఖరిని చూసి ఏమి పాలుపోని స్థితిలో మిగిలితిని."

"ఓహో రామన్నగారంటే మీరేనా? అదేమిటి మీరు ఇంత చిన్న వయస్సులో బాగా మాట్లాడుతున్నారు. రండి అలా కూర్చోండి. మీరు ధరించిన దుస్తులు భలేగా ఉన్నాయి. అన్నట్టు మీ వేషం కూడా నిండుగా ఉంది."

"ఇది మంచి ప్రశ్న. పెద్దపెద్దరాజులు పిలిచి ఏదో నాతో నాలుగు ముక్కలు మాట్లాడించి నన్ను సత్కరించి ఇచ్చిన పట్టువస్త్రాలు సమయం వచ్చింది కనుక ధరించి బయలుదేరాను."

కొత్వాలు పకపకమని నవ్వి "సరే వారు విడిచిపొమ్మన్నాక మేము మాత్రం బందిస్తామా? దోపిడీ చేస్తామా? బాగా రాత్రి అయ్యింది కనుక ఈ రాత్రిమీద ప్రయాణం అంతమంచిది కాదు. మీరు ఉండాలనుకుంటే సత్రంలో ఒక మంచి గది, భోజనం ఏర్పాటు చేస్తాను. అందులో హాయిగా నిద్రపొండి. ఉదయాన్నే మా రాజుగారిని కలుసుకుని ఆయన ఏమైనా ఇస్తే మూటకట్టుకుని వెళ్లిపొండి." అని భుజంతట్టి అప్యాయంగా చెప్పాడు.

"మీరు కుంభిన నగరంలో దోపిడీకి గురయినవారిని బానిసలుగా చేసి అమ్ముతుంటారని విన్నాను. ఇప్పుడు మీవద్ద అలాంటి బానిసలు ఎవరైనా ఉన్నారా? నేను కొంతమంది గురించి వెతుకుతున్నాను."

"ఈ మధ్య మావద్ద ఉన్న బానిసలు అందరూ అమ్ముడు పోయారు. నలుగురు బ్రాహ్మణ యువకులు మాత్రమే చెరసాలలో బిక్కుబిక్కుమంటూ ఉన్నారు.వారిని కొనడానికి ఎవరూ రారైరి. వారిని చూసి పెదవి విరుస్తున్నారు తప్పితే కొనుక్కుని బండచాకిరి చేయించుకుందామని ఒక్కరికిలేదు."

"ఒక్కసారి చూపగలవా? వీలుంటే నేనే కొనుగోలు చేసుకుని తీసుకుని పోతాను. వారికోసం వారి గురుపు పరితపిస్తున్నాడు. "

బానిసలను అమ్మకాలు ఉదయం జరుగుతాయి. కానీ, మీరు కొంటామంటున్నారు. తీరా ఆ నలుగురు చెల్లని బానిసలు పదండి చూపుతాను. అక్కడ మీగుర్రం కట్టేయ్యండి దానికి దాణాపెట్టిస్తాను."చెప్పి చెరసాలకు తీసుకునిపోయాడు. ఒక గదిలో నలుగురు బ్రాహ్మణయువకులు గుడ్డిదీపం వెలుగులో నిద్రలో జోగుతున్నారు.వారిని చూడగానే రామన్నకు మనస్సు విలవిల లాడింది." ఏమయ్యా పండితులను, ఇలా అకారణంగా బంధించవచ్చా? ఇది మీకు పాడియేనా? మీ రాజుకు దేవునిమీద నమ్మకం లేదా?" అడిగాడు.

"రామన్నగారూ, ఇదిపాపం అని నాకు తెలుసు. నేను మీరన్నట్లు పాపభీతికల వాడిని. వీరిని ఎలాగోలా తప్పించాలని చూసినా నాకు ఎలాంటి అవకాశం రాలేదు. ఇప్పుడు మీకు ఇంత రాత్రిమీద నిబంధనలను పక్కకుపెట్టి మరీ, తీసుకువచ్చాను వీరిపట్ల నాకు అంతులేని జాలి ఉంది. మా రాజు ముస్లిం. అతనికి ఇవేవి తెలియవు. అలా అని ఇతరమతాలపై అతనికి చిన్న చూపులేదు. నాలాంటి హిందువులు ఎందరో ఆయనవద్ద పనిచేస్తున్నారు. ఏదిఏమయినా ఇది వీరు చేసుకున్న కర్మఅనే చెప్పాలి. ఇక్కడ ఎందరో హిందువులున్నారు.ఒక్కరు ముందుకువచ్చి కొనుగోలు చేయరు. బ్రాహ్మ ణునికి బానిసగా కొంటే ఇంకేమైనాఉందా? మా ధనం పూర్తిగా అడుగంటి పోతుంది అని ఒక విచిత్రమైన భయంతో ఉన్నారు. "

"సరే ఎంతకు ఈ నలుగురిని అమ్ముతారు.?"





కొంతసేపు ఆలోచించి చెప్పాడు. "రామన్నా వీరి ధర చాలాఎక్కువ, కారణం వీరు చాలాకాలంగా చెరసాలలో ఉన్నారు. వీరి కోసం చాలా ఖర్చు అయ్యింది. అవన్నీ కలుపుకుని వీరి ధర నిర్ణయం అయ్యింది."

"అయితే వీరు ఖరీదైన బానిసలు అన్నమాట. ఒకవేళ నేను కొనకుంటే వీరు ఈ చెరసాలలో మ్రగ్గాల్సిందే.ఒకవైపు భూలోకదేవతలుగా అగ్రజాతిలో పుట్టినందున వీరిని బానిసలుగా ఎవరూ కొనరు.కొంటే అదేజాతివారు కొనాలి. వారు ముందుకు రారు. పోనీ, ధైర్యంచేసి నాలాంటివారు వస్తే మీధర చాలాఎక్కువలో ఉంది. ఏదిఏమయినా ఈ రాత్రే వీరిని నా అధీనం చేయండి. మొత్తం చెల్లించగలను." రామన్న మాటలు విని జోగుతున్న యువకులు లేచి ఇనుపచువ్వల వద్దకు వచ్చారు.

రామన్న ఆనలుగురికోసం తనవద్దఉన్న ధనం, ఆభరణాలు, గుర్రంకూడా ఇచ్చేసి సత్రంకు నలుగురిని తీసుకునివచ్చాడు.వారు మంచుముద్దల్లా అయి పోయారు.రామన్న పాదాలపై పడ్డారు."మాకు ఆ నాలుగుగోడలే మృత్యుసన్నిధికి దగ్గర తోవ అనుకున్నాం.మాకోసం ఎవరూ రారు. మా గురువుగారు శతాధిక వృద్ధులు ఆయన ఇంతదూరం వచ్చి ఇంతధనం చెల్లించలేరు.ఆయనకు మేము కావాలి.ఆయనకు మేము తప్పవేరెవ్వరు లేరు,మా పరిస్థితి అంతేకానీ మామాట ఇలా నీరుగారిపోతుందనుకోలేదు. ఆయన ఏమయ్యారో తెలియదు."

"ఓ విప్రులారా బాధపడకండి. నాకు మీ గురువుగారు లేఖరాసారు. కళింగ నగరంలో ఆయనకు ఒక శిష్యుడున్నాడు. అతడు పేరు జాబాలి అతనికి పావురంతో ఒకలేఖ రాస్తే నాకు అతడు తెచ్చిఇచ్చాడు.నేను కుంభిని నగరంలోకి ప్రవేశించగానే అక్కడ తెలిసింది. ఈ రెండు రాజ్యాలవారు చేస్తున్న దురాగతాలు . ఎందుకో మీ గురువుగారు రాసిన లేఖను పదేపదే ఆలోచిస్తే నాకు తెలిసింది. ఆయనకు ఈ రెండునగరాల్లో ఏదో నష్టం వాటిల్లింది. అందుకే నన్నురమ్మని ఆహ్వానించారు. నేను అనుమానించినట్లే ఆయన శిష్యులు బంధీలు అయ్యారు. విధి నాకు అనుకూలంగా ఉంది కనుక నేను మిమ్మల్ని విడిపించుకో గలిగాను.రేపు మనం ఇక్కడి రాజును కలుసుకుని వెళ్లిపోదాం. ఇక నిద్రపొండి" చెప్పి నిద్రలోకి జారుకున్నాడు.

మరుసటిరోజు దర్బార్‌లో ముస్లింరాజు సయ్యద్ ఖులీఅహ్మద్‌ను కలుసుకున్నారు. అతడు రామన్నను సాదరంగా ఆహ్వానించాడు. నీ గురించి విన్నాను. నీవు చిన్నవాడవు అయినా మంచి తీర్పులు నివ్వగలవని లోకమంతా కోడైకూస్తోంది. నావద్ద బానిసలుగా ఉన్నవారిని కొనుగోలు చేసుకున్నావని విన్నాను. నీవు దేవుడిని నమ్ముతావు.మరి నీవు బ్రాహ్మణులను బానిసలుగా నీవద్ద ఏమి పనిచేయించు కోగలవు. వీరు ఉసురుమంటే నీకు క్షేమం కాదుకదా! పైగా, హిందూవు ఎవరూ బ్రాహ్మణునిచే కాయకష్టం చేసే పనులు ఏవీ చేయించుకోడు.నేను రామన్న వంటి విజ్ఞుడు చేయాల్సిన పనికాదు అని మా కొత్వాలుతో అన్నాను."

"మహారాజ్ మీ మాటలు చాలాబావున్నాయి. మీకు ఇతరమతాలపై చాలా గౌరవం ఉంది. మరి మీ వంటివారు ఈ బ్రాహ్మణయువకులను బంధించి బానిసలుగా అమ్మజూపడం ఎంతవరకు న్యాయం.నిత్యం అగ్నిజ్యోతుల్లా మెరిసిపడే వీరు సంధ్యావందనం,సంధ్య వార్చుడానికి దూరం అయ్యారు.ఇతరత్రా ఎలాంటి నిష్టలకు అవకాశంలేకుండా దూరంగా బ్రతికారు.ఇది ఎంతవరకు న్యాయం. ఒక్కసారి ఆలోచించండి."

"రామన్న నేను వీరిపట్ల హీనంగా ప్రవర్తించలేదు. రాత్రులయందే వీరు చెరసాలలో నిర్బంధింపబడేవారు. మిగిలిన సమయాన చెరసాల వెనుక ఉన్న నదీతీరంలో గల భవనంలో ఉండేవారు. వీరు వండుకునే వారు. వీరు చేయు నిష్టలకు ఎలాంటి లోపంచేయలేదు. మా మతంలో మనిషికి విలువ మీ మతంలో ధనంకు విలువ. వీరిని నీవు తప్ప ఇంతవరకు ఒక్కరు ముందుకువచ్చి విడిపించుకు పోదామని రాలేదు. అదే నేను ఒకఫకీరును చెరసాలలో వేస్తే మా ముస్లింలు ఎంత ఖర్చయినా వెనుకాడకుండా విడిపించుకుపోతారు. మీ మతపెద్దలను ఏదో రోజు నిలదీయడానికే ఇలా వీరి ధరను ఆకాసానికి అంటినంతగా పెంచాను.ఇప్పుడు వీరిగురించి చెల్లించిన ధనాన్ని తిరిగి మీకే ఇచ్చేయాలనుకున్నాను. మరిన్ని బహుమతులు ఇచ్చే సాగనంపాలి అని నిర్ణయం చేసాను." రాజు చెప్పినదానికి దర్బార్‌లో అంతా ఆనందించారు.





రామన్నకు చాలా బంగారు ఆభరణాలు ఇచ్చాడు. ఆ యువబ్రాహ్మణులకు విలువైన వస్తువులను ఇచ్చి పంపాడు. ఐదుగుర్రాలపై బయల్దేరారు. అంతా మహాకోసల వైపు సాగిపోయారు.మూడురోజులకు గమ్యం చేరారు.

గురువు ఆశ్రమంలో అవసానం మీద పడగా రెల్లు గడ్డిమీద పడుకుని ఉన్నాడు. శిష్యులు నలుగురు గురువు స్థితిని చూసి బోరున ఏడ్చారు. అప్పుడు కన్నులు విప్పాడు. చిర్నవ్వు ముఖాన పులుముకుని "నాయనలారా,మిమ్మల్ని చూస్తాను అనుకోలేదు.ఆ ముస్లిం రాజుకు ఎన్ని విన్నపాలు పంపుకున్నా మిమ్మల్ని విడువడాయె,ఎందరో హిందూమత పెద్దలను కలుసుకుని నామొర వినిపించాను కానీ, ఒక్కరి మనస్సు కరగలేదు. బానిసలుగా మారిన నీ శిష్యులు మ్లేచ్ఛులతో కలిసి తినరానివి తిని మన సాంప్రదాయాలను మంట గలిపారు. అట్టివారిని ఏ ముఖం పెట్టుకుని విడిపించుకుని వస్తాం వారిని వెలివేయుచున్నాం అని పొమ్మ న్నారు. రామన్న ఎవరోతెలియకపోయినా పావురంతో ఒక లేఖ పంపాను అతడు మిమ్మల్ని తీసుకువచ్చినందుకు ఈ ముసలిప్రాణానికి ఈ క్షణం ఎంతో ఆనందంగా ఉంది.ఇకనాకు అవసానం ముంచుకొచ్చింది.నేను సంతృప్తిగా మరణిస్తాను." అని ఆ వృద్ధుడు తన ఆనందాన్ని వ్యక్తంచేసాడు.

రామన్న ఆ వృద్ధుని పాదాలకు నమస్కరించి పరిచయం చేసుకున్నాడు. "రామన్నా నీగురించి విన్నాను. ఎందుకో నీమీద కొండంత ఆశతో నీకు ఏవిషయం చెప్పకుండానే రమ్మని లేఖ రాసాను. నీవెంతటి విజ్ఞుడవు.ఎంతచక్కగా నా లేఖలో మర్మం గ్రహించితివి.నాశిష్యులను తీసుకుని వచ్చావు.నీకు ఏమి ఇచ్చిన నా ఋణం తీరుతుంది.నావద్ద ఎన్నో విద్యలు నిక్షిప్తమై ఉన్నవి. నీకు అందులో ఎవరికి చెప్పనిది నీకు నేర్పగలను?" అడిగాడు. రామన్న చేతులు మోడ్చి నిలబడ్డాడు.


చుట్టూ ఉన్న శిష్యులు " గురుదేవా,ఈతడు శూద్రుడు. మీరు చెప్పే విద్యలను నేర్చే అక్షరాస్యుడుకాడు. ఈతడు తన వాక్చాతుర్యంతో రాజులను మెప్పించి వారి వద్ద విలువైన వస్తువులను బహుమతిగా పొందడమే ఈతని దినచర్య.మీవద్ద అలాంటి విలువైన వస్తువున్నచో దాన్ని ఇప్పించండి

సంతోషంగా స్వీకరించగలడు. ఏమి రామన్నా నేను చెప్పినదానిలో ఏమైనా తప్పుందా?" అడిగాడు ఒక శిష్యుడు.

రామన్న చిరునవ్వుతో నిలబడ్డాడు. గురువు కొద్దిగా లేచి "నాయనలారా, ఏమి మీ మాటతీరు ఇలాఉంది. రామన్న కులాన్ని మీరు ఎత్తిచూపుతున్నారా? అతను రాకుంటే మీరేమయ్యేవారు. ఆ చెరసాలలో మ్రగ్గిపోయేవారు. ఎత్తిపొడిచే మాటలు మీకు తగనివి, నాయనా రామన్నా చిన్నవాడవైనా పెద్దమనస్సు గలవాడవు. నీకు మంచి జరుగుతుంది. నేను నీకు ఏదో ఒక విద్య నేర్పాలి కానీ, నాకు నాశరీర స్థితి బాగులేనందున నీకు ఒక మంత్రం ఉపదేశిస్తాను. అదే నీకు మాత్రమే పరిమితం. అని చెవిలో చెప్పాడు. ఆ తరువాత తాటాకుతో తయారుచేసిన చిన్నపెట్టెలో స్పర్శవేది అనే వస్తువును ఇచ్చాడు. కేవలం స్పర్శమాత్రమున ఇనుము బంగారంగా మారుతుంది. రామన్న విని "ధన్యుడను గురుదేవా, స్పర్శవేది గురించి వినడమే గాని ఎన్నడూ చూడలేదు. అయినా మీశిష్యులు చెప్పినంత మాత్రాన మీరు నాకు నిత్యం బంగారంతో తులతూగే అతి ఖరీదైన బంగారం తయారీతో జీవించమని ఇచ్చారా, మీ తృప్తికోసం స్వీకరిస్తున్నాను. ఏనాడు దీన్ని వినియోగించను. నాకు ఎలాంటి ఆశలు లేవు. గురుదేవా, నా యందు దయుంచి నేను జీవించువరకు ప్రజా క్షేమంకోరి జీవించునట్లు ఆశీర్వదించండి." అని కోరాడు.

(స్పర్శవేది రామన్నకాలం రామన్నవద్ద ఉండేది కానీ,అతడు దాన్ని ఏనాడు ఉపయోగించలేదు. ఆ తరువాత వేమనకాలంలో కూడా దీనికోసం అన్వేషణ ఉధృతం అయ్యింది. 1925 వరకు ఎందరోయోగులు దీనికోసం వెతకని స్థలం లేదు. కొందరు పూర్తిగా ఆస్తులను కోల్పోయారు.దాని ఉనికి పసిగట్టలేకపోయారు. నేటికి అది ఒక మిస్టరీగానే మిగిలింది. వాస్తవానికి ఇది స్వర్ణం తయారికి వాడబడేది అని పూర్వగ్రంథాలు చెబుతున్నాయి. మరోవాదన కూడా ఉంది.స్పర్శవేది అంటే చనిపోయనవారిని జీవింపచేసే ఒకరకం మొక్క కొండల్లో మానవుడు మసలనిచోటుల్లో పిచ్చి మొక్కల మధ్య ఉంటుంది అనేది యోగులు నమ్మకం. కొందరు తాము ఆ మొక్కను





అనుకోకుండా చూసామని దాని ప్రభావంతో మాలో పలు శక్తులు వచ్చా యని చెప్పేవాళ్లున్నారు. దీనిపై కొన్ని శతాబ్దాలు పరిశోధనలు జరిగాయి.)

"కొన్నాళ్లు ఇక్కడ ఉండి ఈ గురువు కాలం చేసాక నీవు వెళ్లిపోవుదువు అని కోరాడు. ఆమాటలకు రామన్న తలవంచి అక్కడే వారంరోజలు గడిపాడు. గురువు ఎన్నోవిషయాలుచెప్పాడు. రామన్న శ్రద్ధగా విన్నాడు.

ఒకరోజు తెల్లవారు జామున గురువు కాలం చేసాడు. శిష్యులు అంతాకలిసి గురువుకు చేయాల్సిన కర్మలు చేసారు. అంతా ఎవరి బ్రతుకు వారు బ్రతకాలని అనుకుని ఆ గురు ఆశ్రమం వద్ద విడిపోయేందుకు సిద్ధపడ్డారు. అయితే వారు రామన్నను అడిగారు. నీవు ఎలాగూ స్పర్శవేదిని ఉపయోగించను అని చెప్పావు. వినియోగించని నీవద్ద అది ఎందుకు? మాకు ఇచ్చేయ్. దాంతో బ్రతుకుతాం."

"అది నాకు గురువుగారు ప్రసాదించారు. నేను ఉపయోగించక పోయినా వేరెవ్వరికి ఇవ్వను. నన్ను బలవంతంచేయవద్దు" అని తేల్చిచెప్పాడు.

శిష్యులు చాలాసేపు బ్రతిమలాడారు. రామన్న ఎంతకీ దిగిరాలేదు.

" అయ్యా నీవు మాకు ప్రాణదాతవు,అందుకే నిన్ను ప్రాధేయపడ్తున్నాం ప్రాణం పోసినవాడవు. ఇక జీవనాధారం చూపవా? మా గురువు వద్ద ఇట్టి విద్య ఉందని ఆయన అవసానం వరకు మాకు తెలియదు. లేకుంటే ఏనాడో మేము ఆయన్ని నీకు మల్లే ప్రాధేయపడేవాళ్లం. ఈలోకంలో ధనంలేకుండా బ్రతకలేం. నీవు నీ నాలుకతో జీవించగలవు. కనుక చివరిసారిగా కోరుతున్నాం. మాకోరిక తీర్చు లేకుంటే నీవద్దబలవంతంగా తీసుకుంటాను." ఒక శిష్యుడు నయానా,భయాన హెచ్చరించాడు. మిగిలిన వారు ఆమాటలను మరింతగా బలపరిచి రామన్నను గుర్రుగా చూసారు. రామన్న వారిని చూసి నవ్వాడు.

"మీరు ఇంత మూర్ఖులుగా ఉన్నందున గురువుగారు మీకు ఇంతటి విద్యలు నేర్పలేదు. ఈవిద్యలను నేర్పేందుకు లోకకళ్యాణం కోరుకునేవారికి మాత్రమే ఏగురువు అయినా నేర్పేది. మరి మీరు హీనమైన ఆలోచనలకు శ్రీకారం చుడుతున్నారు. మీరు నన్ను ఏమి చేయలేరు. నాకు ఇట్టి విద్యలు





ఒకటిరెండు కాదు. చాలాచాలా వచ్చు. అవి ఈలోకంలో పనికి వస్తాయి అంటే వాటిని ఆయాపరిస్థితిబట్టి ప్రదర్శిస్తుంటాను. ఇది నాకు తెలిసిన మానవధర్మం."

"ఓరి యాదవా నీవా మావద్ద ధర్మపన్నాలు వల్లించునది. ఏదో మాకు చెరసాలనుంచి బంధవిముక్తి కల్పించితివని ఇంతగా ఉపేక్షిస్తుంటే నీస్థాయి మరిచి ప్రేలుచుంటివి. ఇక చూతము నీకు వచ్చిన విద్యలు మాపై ఏవిధంగా ప్రదర్శించగలవో నీచేతిలో ఉన్న స్పర్శవేదిని ఎలా రక్షించుకుంటావో ఇప్పుడే ఇక్కడే తేలాలి."అని మీదపడి స్పర్శవేదిని లాక్కున్నారు. తాటాకు పెట్టి తెరిచి బయటికి తీసారు. దానితో ఆ ఆశ్రమంలో ఉన్న ఇనుపముక్కలను తాకించారు. ఏమీ మార్పులేదు. "ఇదేమి ఈ వింత! బంగారం కాలేదు. యధా విధంగానే ఇనుపముక్క గానే ఉంది. మనగురువు వీడికి ఏదో మంత్రం చెప్పాడు. దాన్ని వీడిచే కక్కించాలి. లేకుంటే మనం బంగారం తయారు చేయలేం." అని కూడబలుక్కున్నారు.

రామన్న నవ్వి "ఇంతగా ఆశపడ్తున్నారు కనుక మీకు ఆ విద్యను నేర్పగలను. నాచేతికి ఆ తాటాకుపెట్టె ఇప్పించండి. ఆ తరువాత మీరంతా గురువు సమాధి వద్ద ధ్యానిస్తూ ఉండండి వచ్చి ఆ మంత్రోచ్ఛరణ చెప్పగలను అని చెప్పిపంపాడు. వారు రామన్న బాలుడు మన వద్ద అతడి ఆటలు సాగవు అని అనుకున్నారు. నలుగురు నవ్వుకుని కొద్దిదూరంలోగల సమాధివద్దకు వెళ్లారు. అలా వెళ్లారు వారి చెవులకు గుర్రపు డెక్కలు శబ్దం విన్పించింది. ఇటీవల గురువు చనిపోయినందున ఎవరెవరో వచ్చి పరామర్శించి పోతున్నారు. అలా ఎవరో వచ్చారు. ఆ వచ్చినవారితో రామన్న మాట్లాడు చున్నాడు అనుకుని సమాధి వద్దనే కూర్చున్నారు. అలాచాలాసేపు అయ్యాక వారికి కూర్చునే శక్తి నశించింది. వెంటనే ఆశ్రమానికి వచ్చారు. అక్కడ రామన్నలేడు. అతని గుర్రంలేదు అదిరిపడ్డారు. మోసంచేసి పారిపోయాడు. వాడిని వదలవద్దు. సర్శవేది నిరుపయోగంగా మన గురువు వద్ద చాలాకాలంగా పడిఉంది. ఈ రామన్నవద్ద అదే పరిస్థితిలో ఉండడం ఘోరం. దానివలన మనందరికి అన్నివిధాల లాభం. పదండి వాడ్ని వెతుక్కుంటూ వెళ్దాం."అని నిర్ణయించుకుని బయల్దేరారు.

# స్పర్శవేది ఎవరికి చేదు?

రామన్న స్వగ్రామం చేరుకున్నాడు. తల్లితండ్రులు రామన్నకోసం వేయికన్నులతో చూడసాగారు. రాగానే తల్లి దిష్టితీసింది. తండ్రి వెళ్లిన పనికోసం అడిగాడు. రామన్న వివరంగాచెప్పాడు. అంతే, తండ్రి బసవయ్యకు స్పర్శవేదిని చూడాలనిపించింది. వెంటనే కొడుకును అడిగాడు. "నాయనా దీనిగురించి వినడమే కానీ, ఏనాడు చూడలేదురా, నీవంటి పుత్రున్ని కన్ననాకు చాలా ఆనందంగా ఉంది. నేను ఎంతటిపుణ్యం చేసుకుని నిన్ను కన్నానో ఏమో, లేకుంటే మహామహులకు సాధ్యంకానిది, నీదయ వలన బంగారం తయారుచేసే స్పర్శవేది మన స్వంతం అయ్యింది. అన్నట్లు నాయనా దీనికి మరోగుణం కూడా ఉంది. అదేమంటే, పోయిన ప్రాణం తిరిగి తీసుకుని రాగలదు. ఇదో సంజీవిని పర్వతం లాంటిది. తండ్రి ఋణంతీర్చుకో, నాయనా! మంచి అవకాశం నీకు లభించింది. ఏది నా చేతిలో పెట్టు. నా జీవితం ఈ దెబ్బతో ధన్యం అవుతుంది." అని కోరాడు.

రామన్న తండ్రివైపు చూసాడు. "నాన్నా స్పర్శవేది అవసరం నీకు ఉందా? దానితో బంగారం తయారవుతుంది. అలాంటివి మనకెందుకు? శతవృద్ధుడైన గురువు నాకు ఎందుకు ఇచ్చాడో తెలుసా? ఎప్పుడైనా కరువుకాటకాలతో మనచుట్టూ ఉన్న సమాజం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లినపుడు ఇలాంటి స్పర్శవేదితో పనిపడ్తుంది. అంతే కాని ఇబ్బడిముబ్బడిగా ఇనుపముక్కల్ని తాకించి బంగారంగా తయారుచేసి మనం కోటీశ్వరులయి సుఖించమనికాదు. నా ఒక్కడికోసం ఆయన ఇవ్వలేదు. నా విజ్ఞతకే వదిలి పెట్టాడు. నేను ఆయనకే చెప్పాను. దీని అవసరం నాకు రాదు అని, కనుక నాన్నా, ఇలాంటి ఆశలకు పోవద్దు." సున్నితంగా చెప్పాడు. బసవయ్య ముఖంలో రంగులు మారాయి. కొడుకు వైపు అదోలా చూసాడు.

అప్పటికే స్పర్శవేదిని ఆశించిన శిష్యులు గుర్రాలు దిగి లోపలికి వచ్చారు. విషయం విని "రామన్న నీవు బాలసన్యాసిలా మాట్లాడుతున్నావు. మాకు ఎలాగూ ఇవ్వలేదు. కనీసం నీతండ్రికైనా ఇవ్వు. నిరు పయోగంగా





పడేయొద్దు. ఏ కోరికలు లేని మా గురువు ఆ తరువాత నీవు స్పర్శవేదిని హీనపరుస్తూ ఒకమూలపడే సారు. ఇది ఎంతమాత్రం కుదరదు. మానవకళ్యాణం కోరినవాడవయితే నీ తండ్రికి ఇచ్చేయ్ లేదా మాకైనా ఇవ్వు. లేదా చూస్తూ ఊరుకోం. నిన్ను ఏమైనా చేయగలం."

వారి మాటలకు బసవయ్య కూడా ఊరుకున్నాడు. రామన్న నవ్వుతూ "నాన్నా నీవు వారిని వారించకుండా ఉన్నావంటే వారి మాటలకు బల పరుస్తున్నట్లే కదూ! ఒకవిధంగా వారితో చేతులు కలిపినట్లే. ఓ బ్రాహ్మణ యువకులారా మీరు విన్నారు నేను మన గురువుముందు ఈ స్పర్శవేదిని వాడను అని చెప్పితిని. మరి ఎందుకు ఇంతగా వెంటపడి ఇమ్మని కోరుతారు. నా ప్రాణాలైనా పణంగా పెడతాను కానీ, దీన్ని ఎవరికి ఇవ్వను. ఇదే నా తుదినిర్ణయం."

"రామన్నా నీవు బుద్ధిహీనుడవు. బంగారపుటుంగరం చేతివేలికి ఉంటే దాన్ని దొంగలు దోచుకున్నప్పుడు వేలినుంచి రాకుంటే వేలినే నరికేస్తున్నారు కేవలం అతి చిన్నగులకరాయి బరువున్నబంగారానికి ఇంతగా హింసిస్తుంటే నువ్వు మణుగులకొద్దీ బంగారం తయారుచేసే స్పర్శవేదిని కలిగిఉన్నావు. నిన్ను ప్రాణం కంటే ఎక్కువచూసే నీ తండ్రి, ఈరోజు మాతో చేతులు కలిపినట్లు ప్రవర్తించాడు. ఇక మీగ్రామంలో వారికి తెలిస్తే ఇంకా ఏమైనా ఉందా? నిన్ను ప్రాణలతో వదలరు. నా మాటవిని మాకు ఇచ్చేయ్ లేకుంటే గ్రామం అంతా తిరిగి నీవద్ద ఉన్న బంగారం గురించి వివరంగా చెప్పి నీ పీకమీద కత్తిలా పనిచేస్తాం. ఆ తరువాత వందలాది మంది ఆశిస్తూ ఉంటే ఎవరికి ఇవ్వాలో తెలియక చాలా ఇబ్బంది పడతావు. ధనం దగ్గర ఎవరు మంచిచెడ్డా ఆలోచించరు. బంధుత్వం ఉండదు. నిన్ను నీలో గొప్పతనం వారికి మరి కనిపించదు చివరికి వారి చేతిలో ఛస్తావు. ఇదే తుది హెచ్చరిక ఆపైన నీ ఇష్టం." ఒక శిష్యుడు కోపంగా చెప్పాడు.

బసవయ్య రామన్నను సమీపించి "నాయనా నామాట విను వీరు చెప్పినది నిజమే, ఊరకే ఒక మూలపెట్టేకంటే అందరికి పనికి వచ్చేలా చేయాలి. నాకు ఇవ్వడంలో ఈ శిష్యులకు ఎలాంటి భేదాభిప్రాయంలేదు.

కనుక వీరన్నట్లు మన గ్రామస్థులకు తెలిస్తే వారు మనల్ని వదలరు. నామాట విను నాకే ఇస్తే ఆ వస్తువు ఎక్కడికిపోదు. మనవద్దే ఉంటుంది." బహువిధాల నచ్చచెప్పాడు.

తల్లికి ఏమిపాలుపోలేదు. కొడుకువైపు జాలిగాచూడసాగింది.

రామన్న మౌనంగా ఉన్నాడు. అతడి ముఖంలో గంభీరత చోటు చేసుకుంది. అప్పుడు శిష్యులు కోపంతో "వీడు మేకమెదడు యోచన గలవాడు. వీడికి బుద్ధివచ్చేలా చేద్దాం. పదండిరా ఈ గ్రామంలో గడపగడపకు ఎలుగెత్తి చాటుదాం." అని అరుచుకుంటూ బయటికి వెళ్లిపోయారు.

బసవయ్య రామన్నను తినేసేలా చూసాడు. "రామన్నా, తండ్రి మాటకు విలువ నిచ్చేవాడిలా లేవు. ఇప్పుడు ఊరంతా వచ్చిపడితే ఆ జగడంలో నేను చచ్చినా నీకు నష్టంలేదు. ఆ వెర్రి బ్రాహ్మలు ఊరంతా తిరగబడమని చెబుతున్నారు. ఊరు కదిలితే నువ్వునేను ఏమూలలకు వస్తాం. నాకిచ్చేయ్ నేను పారిపోతాను. తర్వాత కలుస్తాను. ఊరంతా వచ్చాక ఆమాట ఈమాట చెప్పి సాయింత్రమే మానాన్నకు ఇచ్చేసాను అని చెప్పు వారు నాకోసం వెతికినా దొరకను. నీవు నిన్నటి వరకు ఉలుకుపలుకు లేకుండా పడిఉండేవాడివి అని నీ పూర్వకథ చాలామందికి తెలుసు! నిన్ను ఇప్పటికి ఒక వెర్రివెధవలా చూసేవాళ్లు లేకపోలేదు." తొందరపెట్టాడు.

"నాన్నా నీవు ఎందుకుపారిపోవాలి. నేను వెళ్లిపోతాను. మళ్లీ కలుస్తాను. "చెప్పి తన గుర్రంపైకి ఎగిరి కూర్చుని కళ్లాలు బలంగా లాగాడు. అది దౌడు అందుకుంది. బసవయ్య దంపతులు నిశ్చేష్టుల య్యారు. అలానే నిలబడి పోయారు. రామన్న క్షణాల్లో ఆగ్రామం వదలి సన్ననిబాటలో పడి చుక్కలా అయిపోయాడు. అప్పటికే గ్రామం అంతా కోడైకూసింది. రామన్న చేతిలో స్పర్శవేది ఉందట దాంతో బంగారం తయారుచేయవచ్చు. పోయిన వాళ్లను బతికించనూ వచ్చు. ఇంతటి అద్భుతాన్ని మన రామన్న వద్ద ఉంది అంటే మన వద్ద ఉన్నట్లే. పదండి మన గ్రామంలో ఇదివరలో చచ్చినవాళ్లను ఏఒక్కరిని వదలకుండా బతికించేద్దాం. అలాగే ప్రతివాడు మణుగు బంగారం పొంది హాయిగా జీవిద్దాం. "నిర్ణయించుకుని బయల్దే రారు. రామన్న ఇంటిని





చుట్టుముట్టారు. తలుపులు వేసుకుని లోపల ఉన్న బసవయ్య దంపతులు బయట హడావుడికి ఏమి కానున్నదోనని బాగా భయపడి పోసాగారు. శిష్యులు ఎలుగెత్తి పిలిచారు. "రామన్న రావయ్యా నీ కోసం నీ పల్లెప్రజలు బారులుతీరి వచ్చారు. నీ ఒక్కడికే స్పర్శవేదిని పరిమితం చేసుకోకు. తలా ఒక ఇనుపముక్కను తీసుకుని వచ్చారు. వాటిని క్షణాల్లో బంగారంగా మార్చేయ్! ఈపల్లెలో లోగడ చనిపోయిన అతి మంచి వారిని తిరిగి బతికించేయ్. నీకు ఇంతటి అవకాశం ఇచ్చిన మాగురువు పేరు ఇక్కడ మారు మ్రోగాలి. "ఆమాటలకు బసవయ్య దంపతులు తలుపులు తెరుచుకుని వచ్చారు. గుమిగూడిన గ్రామస్థులు ఒక్కసారి నిశ్శబ్దంగా మారిపోయారు. అందరిలో ఒక్కటే ఉత్కంఠ. "అయ్యా మన్నించాలి. రామన్న సంగతి తెలుసుకదా! అతడు తెచ్చిన స్పర్శవేదిని అతడే తీసుకుని గ్రామంవదిలి తన గుర్రంపై ఎటువెడుతుంది చెప్పకుండా వెళ్లిపోయాడు. చేతులారా, ఇంటికి వచ్చిన అదృష్టాన్ని ఇలాచేసి పోయాడు. మేము మీలాగునే ఆశతో ఉన్నాం. కానీ, ఏంలాభం?" దీనంగా చెప్పాడు. ఆమాటలు విన్న ప్రజలు పిచ్చిపట్టినట్లు అయిపోయారు. తలా ఒకమాట ఆడిపోసుకున్నారు. అక్కడే ఉన్న శిష్యులు ఈ బసవయ్య చెప్పింది యథార్థమే. అతడు తండ్రికి ఇవ్వడానికి సిద్ధంగాలేడు. వితండవాదం కనబరిస్తే మేము మీ వద్దకు వచ్చి చెప్పాం. అతన్ని మనం పట్టుకోవాలి. అంతకు మించి ఈ దంపతులను ఏమి చేయలేం." అని వారిని సమాధానపరిచారు.

ఆ గ్రామపెద్ద ఒకరు ముందుకు వచ్చి " బసవయ్య నీవు నీభార్య గ్రామం వదిలిపోకూడదు. మీ కోసం రామన్న రాక పోడు. అప్పుడు అతన్ని పట్టుకుని నిలదీస్తాం. నువ్వు చేసింది ఏమి పని? నీతో బతుకుతున్న గ్రామప్రజలకు తలా ఇంత బంగారం ఇస్తే నీకు వచ్చేనష్టమేమి? పూర్వీకులను బతికిస్తే నీఆయుష్షు తగ్గిపోదు నీవు ఎందుకు పలాయనం చిత్తగించావు అని అడిగి అతన్నించి ఎంతో కొంత బంగారం సాధించుకుం టాం. పాతతరం వారిని బ్రతికించుకుంటాం. ఈలోగా మీరు పొరపాటున తోకముడిచారో అప్పుడు మాలో రాక్షసులనే చూస్తారు. అంతవరకు ఈ శిష్యులు ఇక్కడే ఉంటారు." అందరి ముందు చెప్పాడు.

బసవయ్య దంపతులు అందుకు అంగీకరించారు. ఆ వెంటనే నల్లని మేఘాలతో ఆకాశం నల్లబడి వర్షం కురిసింది. ఆరోజు నుంచి నాలుగు రోజులు ఏకధాటిగా కురిసింది. ఇదేదో గాలివానలా ఉంది. బిడ్డఏమయి పోయాడో అని బసవయ్యదంపతులు చాలాబాధపడ్డారు.

✤ ✤ ✤

రామన్న గుర్రం ఆపాడు. కుండపోత వర్షం కురుస్తోంది. వాగులు, వంకలు కలిసిపోయి ఉరకలేస్తు దారులు కన్పించకుండా సాగిపోతున్నాయి. ఇక గుర్రం ముందుకు కదలను అంటున్నట్లు ఒకచోట నిలబడి పోయింది. ఆ ప్రాంతం మహేంద్రగిరి పర్వతాలు దట్టంగా ఉన్న అడవులు సమీపంలో క్రూరజంతువుల అరుపులు విన్పిస్తునే ఉన్నాయి. వెంటనే తాటాకు పెట్టెతెరిచి అందులోంచి స్పర్శవేదిని తీసి మనసావాచా తనగురువును తలచుకుని "గురుదేవా మరణించిన వారిని బ్రతికించడం అధర్మం. ఎట్టి పరిస్థితిలో ఆ పనిచేయరాదు. యుగధర్మంను మనం వ్యతిరేకించరాదు. కాలంతో బాటు మానవుడు కదిలి ఆకాలంలోనే కలిసిపోవాలి. అయినా నేను ఈ క్షణం మీతో మాట్లాడి మీ అమృతపల్కులు వినాలి అని కుతూహలపడ్తున్నాను అని కన్నులు మూసుకున్నాడు.

స్పర్శవేది ప్రభావంతో శతవృద్ధ గురువు కన్నులెదుట ప్రత్యక్షమయ్యాడు. "నాయనా రామన్నా నీవు నన్ను మరల పునర్జీవితున్ని చేసావు. నేను ప్రస్తుతం నరకలోకంలోనే ఉన్నాను. నేను నేర్చుకున్న విద్యలు ఇతరులకు చెప్పకుండా నాలో మిగుల్చుకున్నందున అది పెద్దనేరంగా చిత్రగుప్తుని చిఠ్ఠాలో లిఖితమైంది. నేను ఎందుకు నా శిష్యులకు నేర్పకుండా నాలో నిక్షిప్తంచేసానో తెలియచేసినా యముడు పెదవి విరుస్తున్నాడు. నా విద్యలు వలన మనచుట్టూ ఉన్న ప్రజలకు మంచి కంటే చేటుజరుగుతుంది. అందులో నావద్ద చేరిన శిష్యులు ఎక్కువమంది ఆషాడ భూతులే. మరి వారికి నేర్పినచో రానున్న విపత్కర పరిస్థితులకు నేను కారకుడను కాగలను అని ఎవరికి నేర్పలేదు అని మొత్తుకున్నా ఆ నరలోకపతి వినడాయెను. విద్యతెలిసినవాడు దాన్ని బహిర్గతం చేయాలి. తనలో ఉంచుకుని అగ్నికీలల్లో





సమాధికాకూడదు అని నన్ను పదేపదే చెప్పి నరకలోకంలోంచి కదలనీయకుండా నిలువ రించాడు. నాకు తెలిసి నేను ఏపాపం చేయలేదు. కానీ,నాలో నిక్షిప్తమైన ఈ విద్యలు నన్ను కదలకుండా చేసాయి. అంతలోనే స్పర్శవేది మహిమతో నీవు నన్ను పిలిచావు. యముడు కన్నులెర్రచేసి చూసాడు. "ఏమయ్యా నిన్ను పునర్జీవితున్ని చేస్తున్నాడు ఆ రామన్న. ఇలా పునర్జీవితుల్ని ఈ యముడు అసలు క్షమించడు. నేర్పాల్సినవిద్యలు నేర్ప కుండా స్పర్శవేదిని మాత్రమే నేర్పావు. అది నీకు ఈ నరకలోకంలో కొన్ని వందలసంవత్సరాలు ఉంచేస్తుంది అని ఆయన చెబుతుండగా,నేను ఇక్కడికి నాకు తెలియకుండానే వచ్చాను. నన్ను జీవితుణ్ని చేయడానికి కారణం?"

"గురుదేవా! మన్నించండి. చూసారా కుంభవృష్టి. నాచేతిలో మీరిచ్చిన స్పర్శవేది తాటాకు పెట్టె. దీన్ని మీ శిష్యులు ఆశించడమేకాదు. నా గ్రామంలోకి వచ్చి నామీద అందరిని ఉసిగొలిపారు. వారినుంచి మీరిచ్చిన ఈవిద్యను కాపాడే ప్రయత్నంలో ఇక్కడ నిలుచున్నాను. నామీద అత్యంతవిశ్వాసం ఉంచి నాకు నేర్పిన ఈ విద్యతో మిమ్మల్ని పునర్జీవితున్ని చేసి మీవద్ద ఇంకనూ నిక్షిప్తమై ఉన్న శాకినీ-ఢాకినీ, గజకర్ణ-గోకర్ణ , భూతభేతాళ వశీకరణ,అద్భుత ఇంద్రజాల మహేంద్రజాల విద్యలతో బాటు కర్ణపిశాచిని విద్య నాకు ధారపోయండి. గురుదేవా వీటి సాయంతో నేను ఈ మహేంద్ర గిరులపైకి లిప్తలో పోయి అక్కడ మీరిచ్చిన స్పర్శవేదిని ప్రతిష్ఠించి వచ్చేస్తాను. ఇట్టి ఆశాకిరణాన్ని నావద్ద పెట్టుకొనుట ప్రాణప్రమాదం. ఇది మానవుల చేతిలోఉండుట కోతిచేతిలో పవిత్రమైన గ్రంథమున్నట్లే."

"చాలించు రామన్న నీవు నన్ను నమ్మించడానికి స్పర్శవేదిని వదిలించుకుంటానంటున్నావు. అందుకే లిప్తలో ప్రయాణించు మహేంద్రజాలవిద్యలు నన్ను ఇరుకునపెట్టి నేర్వాలనుకుంటున్నావు. స్పర్శవేదిని వదిలేస్తే ఈ మహేంద్ర జాలవిద్యలతో నీవు ఏమేమో చేయాలనుకుంటున్నావు. నేను అందుకే వాటిని ఎవరికి నేర్పకుండానే ఈ నేలమీదనుంచి గతించాను. ఇప్పుడు నీకు నేర్పాల్సింది లేదు. నన్ను తిరిగి పంపేయ్."

రామన్న సన్నగా నవ్వి "గురుదేవా ఇందాక ఒక మాట అన్నారు. యమునికి యుగయుగాలనుంచి ఆ పదవిలో ఉన్నందున కొంతవరకు బుద్ధిమాంధ్యం అంకురించి తలాతోక లేని మాటలు చెబుతూ,కొత్తవిధానాలు పాటిస్తున్నాడు అని, మీరు పెద్దవారు మీ తప్పులు ఎంచువాడనుకాను కానీ, నిజాలు మాట్లాడు కోవాలి. యముని మాటలు విధానాలు నూటికి నూరుపాళ్లు నిజాలు.ఆయన మీకు నిలదీసింది మీలో విద్యలు నిక్షిప్తమై ఉన్నందున మీరు చాలా బరువెక్కి ఉన్నారు.మీరు ఆ విద్యలను ఈ భూలోకంలో నేర్చుకున్నారు ఇక్కడే వాటిని విడిచిపోయినచో మీరు ఆ నరకలోకం వైపు కన్నెత్తి చూడకుండా స్వర్గంధామంలో విహరించేవారు. ఒక్కసారి ఆలోచించండి. ఇక మీ నుంచి నేర్చాల్సిన విద్యలు మీరిచ్చిన స్పర్శవేది కంటే గొప్పవికావు.మీ వంటి గురువుల ద్వారా నేర్చుకో గలను.ఇప్పుడు ఆలోచించండి.నరలోకాధిపతితో వాదులాటలో ఉన్నారు గాని మీలో ఉన్న భూలోక విద్యలను ఎందుకు ఇక్కడే వదులుకోరు. స్పర్శవేదిని నేను కోరకుండానే ఇచ్చారే, అంతకంటే విలువ తక్కువ విద్యలను నేను కోరితే నాకు నేర్పడానికి మీరు ఎందుకు సంశయిస్తున్నారు.గురుదేవా! మీరు ఇప్పుడు వెళ్లేది నరకానికా? లేక స్వర్గధామానికా? చెప్పండి."

"నాయనా ఏ ప్రాణి నరకం కోరుకోదు. ఒక్కక్షణం కూడా అక్కడ ఉండకూడదు అనుకుంటుంది.నేనూ అంతే. నీవన్నట్లు నేను ఈవిద్యలను నాలో నిక్షిప్తం చేసుకుని ఇక్కడ గతించాను.ఎందుకో తెలుసా? నేనే ఈభూమిపై అనేకవిద్యలకు మూలాన్ని అని నా శిష్యులు వారి శిష్యులు చెప్పుకోవాలని నేను చాలా విద్యలు నాలో మిగుల్చుకున్నాను అది తప్పు అని నరలోకపతి చెబితే సాక్షాత్తు యమున్ని తప్పుపట్టాను.కానీ నా తప్పును నీవు చాలాసున్నితంగా చెప్పగలిగావు.తప్పక నీకు నాలో ఉన్న విద్యలు నేర్పగలను.ఇలాచేసినచో నేను నేరుగా స్వర్గం చేరుకోగలనా?"

"గురుదేవా! మీకు తెలియదా నన్ను అడిగి నాచే చెప్పించాలను కుంటున్నారు. యమపురి దరిదాపులకు పోకుండా చేరుకోగలరు."





"అలాయితే ఇప్పుడే నేర్పగలను నీవు కోరినవి నేను ఇవ్వగలిగినవి అన్నీ ఈ కురుస్తున్న వర్షపుజలంతో ధారపోయగలను. కానీ, ఒక్క కర్ణపిశాచి విద్య మాత్రం ఎలుగెత్తి నీకు ఉపదేశించాలి.ఆ విద్యలో మర్మం అది. ఇక, విద్యలు పొందడానికి సిద్ధంగా ఉండు." అని దివ్యతేజస్సుతో మెరిసిపడ్తున్న శతవృద్ధు గురువు నిమిళిత నేత్రాలను ఒకసారి మూసుకుని అరచేయి డొప్పలా చేసి చాచాడు. ఆ చేయిలో నీళ్లు చేరాయి."నాయనా రామన్న నాలో ఉన్న సర్వవిద్యలను ఈ క్షణంనుంచి నీకు ధారపోయు చున్నాను."అని చేతిలో జలాన్ని రామన్న చేతిలో పోసాడు.ఒక్కక్షణం నింగిలో భయంకరమైన పిడుగుల శబ్దం అయ్యింది.


"ఇక కర్ణపిశాచిని యొక్కమంత్రాక్షరం తెలియచేస్తాను.నావెంట నీవు పఠించు.అక్షరం పొల్లుపోకుండా నీ మనస్సును ఉచ్చరణపై లగ్నంచేసి మరీ పఠించు

**శ్లో॥ చితసనస్థా నరముండమాలాం, విభూషితామస్థిమణీస్కరాబ్జైః**
**ప్రోతాం నరాంత్రైర్ధధతీం కువస్త్రాం, భజామహే కర్ణపిశాచినీంతామ్॥**

రామన్న కర్ణపిశాచిని మంత్రం పఠించడంతో అతనిపై ఒకశక్తి ఆవరించినట్లుయ్యింది. "గురుదేవా! నేను ఈ విద్యలతో మరిన్ని బాధ్యతలతో నిండిపోయాను.మీరు తేలికయిపోయారు.ఇక మీరు యమపురిలో నిలువ కుండానే త్రిలోకాలకు ఎక్కడికైనా యధేచ్ఛగా పోగలరు."

"నేను నీ కారణంగా యమపురినుంచి వచ్చినందుకు యముడు కోపం చెందాడు.ఇప్పుడు వెడితే నన్ను తప్పకుండా హింసాత్మకమైన శిక్షలకు గురిచేయగలడు. కానీ, నీ వలన యమపురికి పోకుండానే నేను నా గమ్యం చేరుతున్నందుకు నాకు ఎంతో ఆనందంగా ఉంది. రామన్న నీవు కారణ జన్ముడవు. నీవు నాకు చూపిన మార్గం చాలా గొప్పది.నీ తీర్పునాకు మంచి మార్గంలోకి తీసుకుపోయింది ." చెప్పి అదృశ్యుడయ్యాడు.

రామన్న మహేంద్రగిరి కొండలమీదకు లిప్తలో వెళ్లాడు. తాటాకు పెట్టెలోంచి స్పర్శవేదిని తీసాడు. దానిచుట్టూ తనకున్న మంత్ర తంత్ర శక్తులను కాపలాపెట్టి ఒక చిన్న కొండరాయిమీద పెట్టాడు. "ఓ స్పర్శవేది నీవు నాడు అశ్వనీదేవతలచే ఈ భూలోకానికి తీసుకురాబడినావు. ఎందరి



కొండల్లో స్పర్శవేదిని నిక్షిప్తం చేస్తున్న రామన్న



చేతుల్లో ఒక దివ్యశక్తిగా అలరారావు. ఇది కలియుగం నిన్ను భరించుశక్తి నాకు లేదు. నిన్ను ప్రయోగించి బంగారం రాసులు పోగుచేయలేను. చచ్చినవారిని బతికించలేను. కనుక నీకు ఇక్కడ కొలువు చేసి పోవు చున్నాను." చెప్పి వెనుదిరిగిపోయాడు.

(స్పర్శవేది వెనుక ఒక ప్రాచీనకథ ఒకటి ప్రచారంలో ఉంది. పూర్వం యజ్ఞయాగాదులు చేసే ఋషులు మహామునులు కాకులుదూరని కారడవుల్లో ఈ యాగాలు చేసేటపుడు కొన్నివందలమంది మునులు తాపసులు కలిసి చేసేవారు. వారు దర్భలు కోసం అడవుల్లోకి పోయినపుడు హింసకమృగాల వాతపడి ఏ చిన్న తపశ్శక్తిలేని తాపసులు అకాలమరణాలకు గురవుతుండే వారు. చాలామంది తాపసులను పోగొట్టుకున్నామని మహామునులకు తీరనిచింత ఉండేది. అప్పుడు వారు అశ్వనీదేవతలతో మొరపెట్టుకున్నారు. అకాలమరణాన్ని పొందిన వారిని పునర్జీవితుల్ని చేయమన్నారు. అప్పుడు వారు శాంతం విని "ఇలా రాక్షసులచే, హింసక మృగాలచేతిలో చనిపోతున్న వారిని ప్రతిసారి మేము వచ్చి బతికించడం కుదిరేపనికాదు. ఇందుకు ఒక మార్గం ఉంది మీకు స్పర్శవేదిని ఇస్తాం. దాని ప్రభావంతో ఎంత మందినైనా బ్రతికించవచ్చు. అలాగే యాగాలకు సరిపడా ఖర్చులకు ఎంత బంగారమైనా సృష్టించుకోవచ్చు." చెప్పి ఇచ్చారు. దాంతో మునులు తాము చేసే యజ్ఞయాగాదులను నిర్వర్తించేవారు. అప్పుడు తాపసులు ఏ కారణం చేతనో మరణించిన మరుక్షణం స్పర్శవేది ద్వారా బ్రతికించేవారు. ఇలా చాలాకాలం సాగింది.)

ఆ స్పర్శవేది ఎందరిచేతులో మారి చివరికి రామన్న వలన మహేంద్ర గిరి కొండలలో కొలువుతీరి ఎలాంటి ప్రభావం చూపకుండా ఉండి పోయింది. దీనికోసం నాలుగైదువందల సంవత్సరాలు ఎందరో ఈ మహేంద్రగిరి కొండలపై పరిశోధనలు చేసారు. తమ ఆస్తులు వెచ్చించి మరీ రంగంలోకి దిగి చివరికి ఏమీ సాధించలేక బికారులయిపోయారు.

# క్షుద్రశక్తుల ప్రభావం

రామన్న ఒక గుహలో ఆదమరిచి నిద్రపోయాడు. ఒక్కసారి ఎవరో తట్టిలేపినట్లుయ్యింది. లేచి చూసాడు. ఎవరూ లేరు.అడవి మధ్యలో ఒక కొండగుహ ఇక్కడ తననెవరు లేపుతారు అని నలువైపులా పరికించి చూసాడు. గట్టిగా తలవిదలించాడు.అప్పుడు అర్ధం అయ్యింది. తనలో ఇప్పుడు ఇంద్రజాల, మహేంద్రజాల, టక్కుటమార, గజకర్ణ గోకర్ణ, శాకిని-ఢాకిని విద్యలు ఉన్నందున వాటివలన తొలిసారిగా నిద్రలేమికి గురయ్యాడు. అతడిలో ఏదో తెలియని భయం చోటుచేసుకుంది. ఎంత ఆలోచించినా అర్ధం కాలేదు. అప్పుడు ఆ గుహలోంచి బయటికి వచ్చాడు. వర్షం తగ్గిపోయి తెల్లవారుతోంది. నిన్నటివరకు ఉన్న ప్రశాంతత ఇప్పుడు కొరవడడానికి కారణం.ఒక్కసారి మెరుపులా గుర్తుకువచ్చింది,అదే తనలో కొత్తగా వచ్చిన క్షుద్రవిద్యలు వీటి ప్రభావం వలన గురువు నరకానికి వెళ్లి కష్టాలు పడాల్సివచ్చింది. ఇవి తనలో ఉంటే ఇలానే ఉంటుందా అని ఆలోచించి వీటికి ఎవరికి నేర్పాలా అని ఆలోచిస్తునే నడవసాగాడు.

ఒక చెట్టుకింద ఒక ముని తపస్సు చేసుకుంటూ కన్పించాడు. అతనిని అడుగుదామనుకుని అక్కడే కూర్చున్నాడు.ఆయన కన్నులు తెరిచి ఈ లోకం లోకి వచ్చినవరకు తాను ఒకింత ధ్యానంలో ఉందామని కన్నులు మూసు కున్నాడు కానీ, అతనిలో ఏకాగ్రత లోపించింది. తలవిదలించి కన్నులు విప్పాడు.మళ్లీ ఆ ప్రయత్నంలో పడ్డాడు. అప్పుడు ఏదో తెలియని చికాకు తనను కలవరపెడుతోంది అని గ్రహించాడు. దీన్ని ఎలా అధిగ మించాలి అనుకుని పక్కనే ఉన్న జడధారిని చూసాడు.ఆయనలో ఏమాత్రం కదలిక లేదు. ప్రశాంతంగా శిలలా ఉన్నాడు. ఈరోజంతా ఇలా తపస్సులో ఉంటే తను ఏంకావాలి? అనుకుని లేచి దగ్గరలో ప్రవహిస్తున్న నదిలో స్నానం చేసుకుని దొరికిన పండ్లు తింటూ మునివద్దకు వచ్చాడు.ఇంకా ఆ మునిలో చెక్కుచెదరని ప్రశాంతత కన్పించింది. వెంటనే రామన్నకు ఒక ఆలోచన





వచ్చింది. ఈ మునికి తపోభంగం కల్పించాల్సిందే లేకుంటే తాను ఈనట్టడివిలో ఈరోజంతా గడపాల్సిందే, ఇక ఉపేక్షించరాదు అనుకుని వెంటనే ఇంద్రజాల మహేంద్ర జాలం విద్యతో ఒక పులిని సృష్టించి ముని సమీపంలో భయంకరంగా గర్జించునట్లు చేసాడు. అయినా ముని కన్నులు తెరవలేదు. ఇద్దరు రాక్షసులను సృష్టించి మునిమీద రక్తవర్షం కురిపించి తపోభంగం చేయాలనుకున్నాడు. కానీ, వీసమెత్తు ముని కన్నులు తెరవలేదు.రామన్నకు చెద్దచిరాకు కల్గింది.కొన్నివందల త్రాచుపాములను మునిమీద వేయించాడు. ఎంతచేసినా మునిలో మార్పులేదు. అతడి తపస్సు చెక్కుచెదరలేదు. రామన్నకు ఏమి తోచలేదు.తనకు వచ్చిన శాకినీ-ఢాకినీ విద్యలలో చేతబడిని గుర్తుకు తెచ్చుకుని వెంటనే నేలమీదకు వంగి మునిపాదముద్రలు వెతికాడు. మునిపాదముద్రలు ఇసుకలో దొరికాయి. ఆ పాదముద్ర నుంచి ఇసుకను తీసి మంత్రించి వదిలాడు.

అంతే, తపస్సుచేస్తున్న ముని తపోభంగం అయి తలపట్టుకుని నేలమీద పడిపోయాడు. చూస్తుండగానే వాంతి చేసుకున్నాడు. రామన్న సన్నగానవ్వుతూ ఒకచెట్టు వెనక్కు చేరిపోయి చోద్యం చూసాడు.

మునిలో పెనుమార్పులు ప్రారంభం అయ్యాయి.పిచ్చిచూపులు చూస్తూ ఎదురుగా ఉన్న తన ఆశ్రమం వైపు తప్పటడుగులతో వెళ్లి ఆగాడు.ఒక చోట కూర్చుని ఒకేవైపు చూసుకుంటూ ఉండిపోయాడు. అంతలోనే శిష్యులు వచ్చి చూసి ఏమిటీ వింత మన గురువుకు చేతబడి ప్రయోగమా? విడ్డూరంగా ఉందే. మునుల దరిదాపుల్లో ఇటువంటి క్షుద్ర విద్యలు బతికి బట్టకట్టలేవు.కానీ, ఏమి ఈ వింత ఎలా జరిగింది? ఒక శిష్యుడు చాలాబాధపడ్డాడు. ముని శరీరంపై అంతకుమునుపు కురిసిన రక్తవర్షంతో ఎండిన రక్తపుమరకలు చూసి ఇక్కడెవడో ఏమో చేసాడు. వెతకండి ఈ దాపుల్లో ఎక్కడైనా దొరకవచ్చు. ముక్కుమూసుకుని దేవునికై పరితపించు వారిపై ఇట్టి ఘాతుకానికి తలపెట్టినవాన్ని ఊరకనే వదలవద్దు." తనతోటివారిని ఉసిగొలిపాడు.అంతా వెతుకసాగారు. ఇంకా తాను చెట్టు వెనుక దాక్కుని ఉండడం అంతమంచిది కాదని రామన్న బయటికి

వచ్చాడు. అతన్ని పట్టుకుని చెట్టుకు కట్టేసారు శిష్యులు. రామన్న పకాలున నవ్వి "మూర్ఖులారా నన్ను మీరు నిర్బంధించగలరా? మీవెర్రితనం. మీ గురువుకే సాధ్యం కాలేదు. మీరెంత పిల్లకాకులు"అని తనకు వచ్చిన ఇంద్రజాలంతో ఆకట్లు విడదీసుకుని బయటికి వచ్చేసాడు. అంతా ఆశ్చర్యపోయారు.

"ఎవరునీవు ఎందుకు మామీద ఇలా నీకున్న క్షుద్రశక్తులతో విరుచుకు పడ్తున్నావు. మాకు నీకు ఎలాంటి శత్రుత్వంలేదు. నీకు ఏవిధంగా అడ్డంకిగా లేము." ఒక శిష్యుడు అర్ధంకాక అడిగాడు.

"నేను మీ గురుదేవున్ని నాకున్న సమస్య తెలుసుకోవాలని వచ్చాను. తీరా వచ్చాక అతడు కన్నులు తెరువకుండా ధ్యానంలో ఉన్నాడు. ఎంత అని భరించను. చూసిచూసి వేసారిపోయి అతడిని మీరన్నట్లు నాకున్న క్షుద్ర శక్తులతో చాలాచికాకు కల్పించాలనుకున్నాను,ఎన్నివిధాలుగా చేసినా, అతడు కన్నులు తెరవలేదు. అందుకే అతడిని ఎన్నోవిధాలుగా హింసించాను. చివరికి చేతబడికిగురిచేసాను."రామన్న దాచకుండాచెప్పాడు.

రామన్న ఏదో చెప్పబోతుండగా చేతబడికి గురయిన ముని లేచి నిలబడ్డాడు. "నాయనా రామన్న చూసావా నీ అంతటివాడు కూడా ఎంతగా హీనమైన చర్యలకు పాల్పడాల్సివచ్చిందో, నీలో ఉన్న క్షుద్రశక్తులు వలన నీవు ఎంతగా దిగజారి ఎలాంటి అకృత్యాలకు పాల్పడితివో, నీకు నేర్పిన గురువుకూడా ఆ విద్యల వలన క్షుద్రబుద్ధులతో ఏకంగా యమునితో వాదులాడాడు. ఇప్పుడు రామన్న ఎలాంటివాడో జగమెరిగిన నిజాన్ని వమ్ముచేసావు. తాపసులను హింసించేవరకు వెళ్లావు. అదే నీవు తెలుసుకుంటే చాలు. నీవు నన్ను ఈ విద్యలను ఎలా అదుపు చేయవచ్చు. లేక ఎలా వదిలించు కోవాలి అని అడగడానికి వచ్చి నాపై చేతబడి చేస్తివి. ఇక నీవు యోచించుకో నీలో నిక్షిప్తమైన విద్యలను ఏమి చేయాలనుకుంటున్నావో తెలుసుకో!" అని చెప్పాడు.

అప్పుడు శిష్యులు "గురుదేవా ఈ మూర్ఖరామన్నపెట్టిన చేతబడి ఎంతో ప్రమాదకారి మీకు ఇప్పుడెలా ఉంది?"ఆత్రంగా అడిగారు.





"అతడికి నమ్మించడానికి కేవలం చేతబడికి కొంతసమయం కట్టుబడి తిని. నన్ను ఇలాంటి క్షుద్రశక్తులు ఏమి చేయగలవు."

రామన్నకు అప్పుడు జ్ఞానోదయం అయ్యింది. ఆ ముని పాదాలపై పడి "నన్ను క్షమించండి ఎంతటివానికైనా ఇలాంటి విద్యలవలన ఒకింత గర్వం మనస్సు ఏలుతుంది. దానివలన, పూర్తిగా లౌక్యం నశించి పోతుంది. చాలా తప్పు చేసాను. నన్ను మనసావాచా క్షమించండి."

"రామన్న నీవంటి వానికే తప్పలేదు. శతవృద్ధు అయిన నీ గురువుకూ తప్పలేదు. నీవు వాటిని అదుపుచేస్తాను అని అనుకుంటే నీలో చలన రహితంగా పడుంటాయి. అవి నిన్నేమి. చేయలేవు. నిద్రలేమి వాడుచేయాల్సింది ఏమిటి నేను నిద్రపోతాను అని మనస్సులో గట్టిగా చెప్పుకుంటే చాలు అతడికి ఆఘమేఘాలమీద నిద్రపట్టేస్తుంది. అలాగే ఈ క్షుద్రవిద్యలను నేను ఖాతరు చేయను నాలో అవి ఉండకపోతే ఏంచేస్తాయి అనుకుని మనస్సు మీద ఆధిపత్యం వహించిననాడు ఏ క్షుద్రశక్తి ఏమీచేయలేదు."చెప్పి రామన్నను లేవనెత్తాడు.

రామన్న సిగ్గుపడ్తూనే నిలబడ్డాడు. "రామన్న నీవు కారణజన్ముడవు. నీకు వేయిశుభాలు వెతుక్కుంటూ వస్తాయి. నీవు గ్రామాన్ని, నీ తల్లితండ్రులను వదిలి వచ్చావు. నీ తల్లితండ్రుల అవసానం నీకు ముందే తెలియగలదు. నీకు తెలిసిన కర్ణపిశాచి ద్వారా తెలుసుకుని నీలో నిక్షిప్తమైన ఇంద్రజాల మహేంద్రజాలంతో తృటిలో గమ్యం చేరగలవు. అంతవరకు, నీవు భారతావని అంతా కలియతిరుగు నీ మాటకారితనం, నీ తీర్పులతో ప్రజలకు పాలకులకు మంచి మార్గాన్ని చూపు. విజయం నీకు అన్నింటా కలుగుతుంది." అని దీవించాడు.

రామన్న అక్కడ సెలవు తీసుకుని బయల్దేరాడు. అడవి మార్గంలో పోతూంటే కొన్నివందల ఏళ్లనాటి మర్రి చెట్టు ఒకటి కన్పించింది. దానికి మొదలు కాండం ఏదో తెలియని విధంగా విపరీతంగా ఊడలు నేలలోకి పోయి దృఢపడ్డాయి. అంతటి చెట్టును రామన్న అదే మొదటిసారి చూడడం. దాని మొదలు ఎక్కడుందా అని చూడసాగాడు. అప్పుడు అక్కడ విచిత్రమైన ధ్వనులు విన్పించాయి.

రామన్న చుట్టూ పరికించి చూసాడు. అక్కడ ముదుసలి ఒకమూల కూర్చుని ఉన్నాడు. అతడు పిలవడానికి శక్తిలేక చేతిలో ఉన్న రకరకాల వాయిద్యాలతో పిలవసాగాడు. అతడివద్దకు వెళ్లాడు. “ఎవరు నీవు? ఇంతటి నిర్జనప్రదేశంలో ఇంతటి వయోభారంతో ఎలా ఇక్కడ జీవిస్తున్నావు. నీకు మృగభయంలేదా? కదలవీలులేని వాడిలా ఉన్నావు. నీకు ఏమి కావాలి? నీకు అంటూ ఎవరూ లేరా?” ప్రశ్నలు కురిపించాడు.

“నాయనా నీవు సకలసద్గుణరాశిలా ఒప్పుచున్నావు. నీ కన్నురెప్పలు మెరయు చున్నవి. అంటే, నీకు క్షుద్రశక్తులున్నవని ఇట్టే తెలియచున్నది. నేను ఒకప్పుడు ఈ శక్తులకోసమే ఒక భూతమాంత్రికుని వద్ద ఆశించి చేరాను. వాడు నాకు నేర్పగలను వేచి ఉండమని ఇక్కడ నిర్బంధించి పోయాడు. ఇప్పటికి అరవైఏళ్లుగడిచినవి. వాడు రాడు. నాఆశ అలా వేచిచూడమంది. నా యవ్వనం అంతా ఈ చెట్టుకింద కాలగర్భంలో కలిసిపోయింది. అలా నాజీవితం నాశనం అయిపోయింది. ఇప్పుడు నాకు ఆక్షుద్రవిద్యలయందు ఆసక్తి లేదు. నా వారు ఏమయ్యారో తెలియదు. నేను దీపపురి అనే చిన్న రాజ్యానికి రాజును, నాపేరు విజయాదిత్యుడు, వేటకు వచ్చినపుడు ఇక్కడ ఒక మళయాళ మాంత్రికుడు తారసపడి నాకు విద్యలు నేర్పుతాను అని చెప్పి ముందుగా పరకాయ ప్రవేశవిద్య గురించి చెప్పాడు. వాడు ఒక చచ్చినచిలుకలో ప్రవేశించాడు. అది చూసి నేను నేర్వాలని వాడి వెనుక పడి తిరిగాను. తీరా వాడు నన్ను అన్నివిధాల మోసం చేసాడు. ఎందుకు చేసాడో తెలియదు. ఒకరోజు ఏ విద్యనేర్పకుండా ఇలా నెలలు తరబడి ఎన్నాళ్లు నేనుండాలి అని నిలదీసాను. అందుకు వాడు ఇదిగో వాగులో స్నానంచేసి శుచినయి వస్తాను. అంతవరకు వేచి ఉండు ఈ గీచిన గీతదాటకు అని చెప్పి వెళ్లిపోయాడు. అంతే,ఇక్కడ పడున్నాను వేళకు ఇంతముద్ద ఇక్కడ ఏ దుష్టశక్తో పడేస్తుంది. ఎటువెళ్లడానికి వాడు గీచిన గీతవలన మంటలు పుట్టి కదలనీయవు. ఎటుచూసినా రెండువందల బారలు మాత్రమే పోగలను.” అని చెప్పి ఏడ్చాడు.

ఆ వృద్ధున్ని చూసి రామన్న జాలిపడి“రాజా, నీకథ చాలా దయనీయంగా ఉంది. ఇంతకీ క్షుద్రశక్తులతో నీకు పని ఏముంది? దీనికోసం





భార్యాపిల్లలను, రాజ్యాన్ని వదులుకున్నావు. ఇక్కడ ఒకమాంత్రికునికి ఊడిగంచేసావు. నీవు చేయునది నీకు తప్పుఅనిపించలేదా?”

“నాయనా మంచి ప్రశ్న వేసావు. నీకు ముందే చెప్పాను అతిచిన్న రాజ్యానికి రాజును అని చెప్పాను. నామీద చక్రవర్తి దుమదుమలాడడం ఇరుగు పొరుగు రాజులు కాలుదువ్వడం, నేను భరించలేకపోతిని. వారికి నేను కత్తితో, పౌరుషంతో బదులు చెప్పలేను. ఎందుకు అంటే, నా రాజ్యానికి ఏవిధంగా అన్ని స్థాయిల్లో ఎలాంటి వనరులు పెంచుకోలేను. అందుకే క్షుద్రవిద్యలు నాచేతిలో ఉంటే వారందరిని భయభ్రాంతులు చేయగలను. అందుకే అందరిని వదులుకుని వచ్చాను. తీరా ఈ మాంత్రికుడు ఇలా నన్ను నిట్టనిలువునా ముంచేసాడు.”

“నాకు నీవు ఆశించిన విద్యలు వచ్చు. ఆ విద్యలు నేర్వాలని ఉందా? లిప్తలో నేర్పగలను.” రామన్న అడిగాడు.

“ఇప్పుడు నాకెందుకు? ఏమిచేసుకోగలను. వయోభారంతో మనుగడ సాగించు నాకు ఆ విద్యలు వలన నేడు మేలుకంటే కీడుఎక్కువ. వాటిమీద మోజుతో మరిలేను. ఉన్న ఆశ అంతా నారాజ్యం ఏమయ్యింది నా భార్యా పిల్లలు ఏమయ్యారు? వారి పరిస్థితి ఏమయ్యింది. తెలుసుకోవాలని ఇక్కడ బిక్కుబిక్కుమంటూ రోజులు లెఖ్కిస్తున్నాను. ఈ చెట్టును అల్లంతదూరం నుంచి చూసి ఇది ఏ భూతమో దయ్యమో ఉన్న చెట్టు అని బాటసారులు ఇటు వైపు ఎవరు రారు. ఇన్నాళ్లకు నీవు వచ్చావు.”

రామన్న కర్ణపిశాచి ద్వారా దీపపురి గురించి తెలుసుకున్నాడు. అక్కడ రాజుగా మాంత్రికుడు చాలాకాలం దుష్టపరిపాలనతో ఏలుబడిచేసాడు. విజయాదిత్యుని భార్యపిల్లలను బంధించాడు. వారు చెరసాల నుంచి తప్పించుకుని రాణి పుట్టింటికి పిల్లలతో పారిపోయింది. మాంత్రికునికి ఉన్న శక్తులు ఇటీవల నశించిపోగా, అతన్ని చక్రవర్తి ఉరితీసి విజయాదిత్యుని కుమారున్ని తాతగారి ఇంటినుంచి తీసుకు వచ్చి పట్టాభిషేకం చేసాడు. ఇప్పుడు దీపపురి ఏలుబడి సజావుగా సాగిపోతోంది. దీపపురి ప్రజలు వేటకు వెళ్లిన విజయాదిత్యుడు హింసకమృగాల వలన చనిపోయా

డని భావించి ప్రతిఏటా స్మారకోత్సవాలు చేస్తున్నారు." ఈవిషయాన్ని విజయాదిత్యునికి రామన్న చెప్పాడు.

సంతృప్తిగా తలపంకించాడు. అప్పుడు రామన్న అడిగాడు. "ఓరాజా నీ నిజపురి అయిన దీపపురికి వెడతావా? నాకు సర్వక్షుద్రశక్తులు వచ్చు. ఆ ప్రభావంతో నిన్ను దిగపెట్టగలను." అని చేయి అందించి చెప్పాడు.

"నాయనా. మరి ఆ రాజ్యంలో నాకు పనిలేదు. ఇక్కడే ఈ శేషజీవితాన్ని గడిపి ఈ తనువు చాలిస్తాను. ఇంతవరకు నాకు ఇంత తిండిపెడ్తున్నది ఎవరో చెప్పు. అవి భూతాలే అనుకుంటున్నాను. అవి ఏదో రోజు ఈ ముసలివానికి తిండిపెట్టకపోవచ్చు. కనుక వాటిమీద అజమాయిషీ చేయడానికి నాకు గజకర్ణగోకర్ణ, టక్కుటమార విద్యలు నేర్పు"

రామన్న కర్ణపిశాచి ద్వారా తెలుసుకున్నాడు. నీలాగునే క్షుద్రశక్తులను పొందాలని వచ్చిన ఒక యువకుడు ఆ మాంత్రికుని మాయలవలన ఒడలు అంతా చూడడానికి జుగప్సకరమైన చర్మరోగపీడితుడై సభ్య సమాజంలోకి వెళ్లలేక ఇలా చెట్టు తొర్రలో నీవలే జీవిస్తున్నాడు. అయితే మాంత్రికుడు హతం అయిన మరుక్షణం అతడికున్న రోగం లేకుండా పోయింది. అయితే ఇంకా ఆ రోగం ఉన్నట్టుగానే అతడు ఇక్కడే నివసిస్తున్నాడు." అని చెప్పి అక్కడ వెతికి ఆ నడివయస్సు వాడిని పట్టుకుని తీసుకువచ్చాడు.

"ముప్పయ్ ఏళ్లతరువాత మరోమనిషిని చూసాను. నన్ను చూసి భయపడకుండా నాచేతిని పట్టుకుని తీసుకుని వచ్చావు. ఈముసలి వానికి నేను తినగా మిగిలిన పండ్లుఫలాలు కన్పించకుండా పెట్టి పోతుంటాను. నా చర్మరోగం నీకు భయపెట్టుటలేదా? ఆ దుష్టమాంత్రికుని చేతిలో ఘోరంగా మోసపోతిని. ఎన్నో లేపనాలుపూసాను. కానీ, ఏవీ పనిచేయలేదు. చాలా చిన్న వయస్సులో ఈ అడవికి వచ్చాను. అప్పుడు నా వయస్సు పదిహేనేళ్లు. నాకు క్షుద్రవిద్యలు నేర్చుకోవాలని ఆశ. ఆ ప్రభావంతో మా యువరాణిని కలవాలనుకున్నాను. ఆమె ఈపాటికి అమ్మమ్మ అయిపోయి ఉంటుంది. ఇప్పుడు నాకు ఆ విద్యలు వచ్చినా ఏమి లాభం? ఒక వేళ వస్తే ఆ దుష్టమాంత్రికున్ని చంపి కాకులకు గద్దలకు వేస్తాను." అని ఏడ్చాడు.





"నీకా శ్రమ లేకుండా ఆ దుష్ట మాంత్రికుడు మరణించాడు. నీవు నేర్చాలనుకున్న విద్యలు నావద్ద ఉన్నాయి. కావాలంటే నేర్పగలను."

"కొన్ని విద్యలు నేర్పు వాటితో ఈ అడవిలో ఏ మూల నా వంటి వారు ఆ మాంత్రికుని వలన ఇలా కష్టాలు పడితే వారిని వెతికి రక్షించగలను. ఈ అడవికి వచ్చి శేషజీవితాన్ని గడుపుతాను. అంతకుమించి కోరికలు ఏమీ లేవు."

రామన్న నవ్వి" బాగుంది మీపరస. క్షుద్రవిద్యలతో సర్వం చక్కబెట్ట వచ్చు అని ఆశించి మీదకు తెచ్చుకున్నారు. మళ్లీ వాటితో క్షతగ్రాత్రులను రక్షించాలని నీవు, ఏకంగా భూతాలను తన అధీనంలో పెట్టుకోవాలని ఆ రాజు ఆలోచించడం నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది. ఈ విధానం తప్పు. మీనెలవులకు తీసుకునిపోయి విడిచి నా దారిన నేను వెళ్లిపోతాను. క్షుద్రశక్తులకోసం మీ జీవితాన్ని ఇలా బండలు చేసుకున్నారు. అయినా మీకు బుద్ధిరాలేదు." అని చెప్పి వారిని వారినెలవులకు పంపేందుకు ఇంద్రజాలంతో ఒక రథం సృష్టించి ముందుగా దీపపురి రాజును రథం ఎక్కించాడు. రెండో నడివయస్కుడు నవ్వి "నాయనా నాకు ఎవరూ లేరు. ఏ ఆధారం లేకుండా ఎక్కడికి పంపుతావు?" అనిప్రశ్నించాడు.

"ఓ రాజా నీ వయస్సును చూసి జాలిపడి, నీకు క్రమంతప్పకుండా మూడు పూటలా ముప్పయ్ ఏళ్లుపాటు తిండిపెట్టిన ఈతనికి నీరాజ్యంలో బతికే అవకాశం కల్పించు. అది నీ ధర్మం ఆ మాంత్రికుడు నీకు అన్నపానీయాలను ఏదో దుష్టశక్తితో ముప్పుటలా పెట్టించాడు. అతడు చావగానే, ఆ దుష్టశక్తులు నశించిపోయాయి. ఆ వెంటనే ఈతడు నీకు ముప్పయ్ఏళ్లుగా మూడుపూటలా పెట్టాడు." చెప్పి ఇద్దరిని రథం ఎక్కించాడు.

ఆ రథం కనుమరుగై పోయిన తరువాత తనలో తనే నవ్వుకున్నాడు. క్షుద్రశక్తులంటే మానవులకు ఎంత ఆశ. వాటితో తోటివారిని భయభ్రాంతుల్ని చేయాలని చూస్తున్నారు. అందుకే, జీవితాలు పణంగా పెట్టి నేర్చుకుంటున్నారు. ఎట్టిపరిస్థితిల్లో కూడా క్షుద్రశక్తులను పణంగా పెట్టి బ్రతుకరాదు. అలాయితే అవి మన అధీనంలో ఉంటాయి. అని మనస్సులో అనుకుని బయల్దేరాడు.

# మర్యాదరామన్న మరిన్ని తీర్పుకథలు

## ప్రత్యేక అనుబంధం

## భూతీ వైద్యం

రామన్న అర్ధరాత్రి అయ్యేసరికి ఒక గ్రామం చేరుకున్నాడు. అక్కడ ఎవరిని పిలిచినా పలుకరు.ఏమి అడిగినా చెప్పరు. చాలామందితో మాటలు కలిపిచూసాడు. కానీ, ఎవరూ కన్నెత్తి చూడలేదు. ఇలా ఉందేమిటి అనుకుని ఒక అరుగు మీద కూర్చున్నాడు. అక్కడ చూస్తుండగానే తలుపు ధబీమని మూసారు.ఆకలి వేస్తోంది.నాలుక పిడచకట్టుకుపోతోంది. ఒక్కరూ పలకరు కనీసం నీళ్లుపోయరు. ఇదేమి ఈ గ్రామం తీరు ఇలా ఉంది. కర్ణపిశాచి ద్వారా తెలుసుకుందామంటే వాటిని వాడకూడదు అనుకున్నాడు. అరుగు మీద ముడుచుకుని పడుకున్నాడు. అర్ధరాత్రి భయంకర మైన ఆకలి వేసి తట్టిలేపినట్లు అయ్యింది. భయంకరమైన నిశ్శబ్దం ఆవరించి ఉంది.ఏదో అడుగుల సవ్వడి విన్పించింది. చెవులు రిక్కించాడు. ఇటే వస్తున్నది. అంతే, లేచి కూర్చున్నాడు. దివ్వీటీ చేతబట్టుకుని ఒక పొడుగాటి వ్యక్తి నల్లని వస్త్రధారణతో పెద్దఅడుగులు వేసుకుంటూ రాసాగాడు.అన్ని ఇళ్లవైపు చూస్తూ నడవసాగాడు.రామన్న ఉండేచోటికి వచ్చి ఆగి పండ్లు పటపటకొరికాడు. అతడి ముఖం దివ్విటీ వెలుగులో ఎర్రగా లోతుగా ఎముకలు తేలిఉంది. ఒకరకంగా భయంగొలిపేట్లు ఉంది.వెంటనే భుజానికి ఉన్న నల్లసంచిలోంచి గంటతీసి గణగణమని మ్రోగించాడు.అది యముని వాహనం గంటలా భయంకరంగా మ్రోగింది. అంతే అన్ని ఇళ్లతలుపులు తెరవబడ్డాయి.చుట్టూ మూగారు. కొందరు ఆనల్లని బొమికలగూడువాడి కాళ్లమీదపడి దండాలు పెడుతున్నారు.






"వీడు ఇక్కడ పడుకుని నాకు చిక్కినాడు.వీడు ప్రయోగించిన చేతబడుల వలన పెక్కుమంది మరణాలకు కారణం అయ్యింది. పిల్లలకు బాలగ్రహల పీడలవలన చావులకు వీడే ముఖ్యకారకుడు. ఈ నీచునికి దేహశుద్ధి చేసి వదిలితే కాదు.తలగొరిగివేత,ముందుపండ్లు రాలగొట్టుట, ఒళ్లంతా దూలగొండి అకులరాసి వదులుట,దురద అని గోకినచో చావగొట్టుట, ఇన్ని తట్టుకుని బతికితే వీడిని వల్లకాట్లో కట్టిపడవేయుట చేయాలి అప్పుడు వీడిద్వారా ఈ గ్రామంలోకి వచ్చి స్వైరవిహారం చేయాలను కుంటున్న పిశాచాలు కాలికి బుద్ధిచెబుతాయి.లేకుంటే అవి మరింత పెట్రేగిపోయి మనలో ఒకర్ని బ్రతకనీయవు." అని అరిచిచెప్పాడు.

"తప్పక చేయాలి భూతాలదొర "అని అంతా ఏకకంఠంతో అరిచారు. రామన్నను పెడరెక్కలు విరిచికట్టారు."నేను బాటసారిని.నాపేరు రామన్న నా గురించి మీరు వినే ఉంటారు. ఇదేగ్రామమో నాకు తెలియదు. పగలు అంతా తిండితిప్పలులేకుండా నడిచాను.ఈ గ్రామం చూడగానే నాకు జీవం లేచి వచ్చినట్లుయ్యింది.కానీ ఒక్కరూ పలకరైరి. ఈ రాత్రివేళ ఎటుపోగలను అని ఈ అరుగుమీదకు చేరాను. ఒక అకుపైరాసి ఎవరో నామీద వేసారు వీధి దివ్వటీ ముందు చదివాను. ఇక్కడ రాత్రి ఉండవద్దు భూతాలదొర కళ్లపడి నావంటే నీప్రాణం పోతుంది అని రాసుంది. అదేమిటో అలా ఎందుకు ప్రాణం వరకు వస్తుందో తెలుసుకోవాలనుకున్నాను. అందుకే కావాలని ఇక్కడ ఈ రాత్రి గడపాలనుకుని ఆకలితో నిద్రించాను. నా ఆకలి అర్ధరాత్రి లేపింది. ఈ భూతాల దొర వచ్చి ఇలా కట్టిపడేయిం చాడు.నేను ఎలాంటి చేతబడులు పెట్టలేదు. నన్ను నమ్మండి." అని అరిచి చెప్పాడు.

"చూసారా వెర్రి ప్రజల్లారా వీడు సామాన్యుడు కాడు.ఆకలితో నిద్రపోయాడని చెబుతున్నాడు. చేతబడులు పెట్టేవాడు ఎప్పుడు ఆకలితో ఇలానే గ్రామాల్లో అరుగులుమీద నిద్రపోతుంటాడు.వీడు పెట్టిన చేతబడులు





వలన ప్రజలు చస్తుంటే వీడి ఆకలి తీరుతుంది" అని నమ్మబలికాడు భూతాలదొర. ఆమాటలకు ప్రజల్లో కదలిక వచ్చింది. ఇంకా చూస్తారేం నా కొడుకుని కత్తికోకండగా నరికేద్దాం."అని అరిచాడు ఒకడు. అంతా తలా ఒక ఆయుధం అందుకుని సిద్ధపడిపోయారు.

"అది తప్పు పద్ధతి, దాని వలన ఈ గ్రామానికి పట్టిన పిశాచబాధ తీరదు. నేను ముందుచెప్పాను ఎలా దశలవారిగా చేయాలో ఆ విధానంలో చేయాలి. ఈడు ఈరాత్రి నాతో తాడోపేడో తేల్చుకుందామని ఈ అరుగుమీద ఉన్నానని చెబుతున్నాడు చూసారా, రాత్రిళ్లు ఈడు నాకు చేతబడి పెట్టి చంపేయ్యాలనుకున్నాడు. బహుశా ఈడికి శాకినీ-ఢాకినీ విద్యలుకూడా వచ్చు. ఏరా నేను నీకు ఎలా కన్పిస్తున్నాను. నాపేరు చెబితే నీ శాకినీ-ఢాకినీలు పరుగెత్తాలి. ఈగ్రామానికి పట్టిన చీడపీడలను పారద్రోలడానికి ఇక్కడ తిష్ట వేసాను. ఇప్పటికి నీలాంటి వారు పదకొండుమందికి తేరుకోకుండా చేసాను. వాళ్లు చచ్చేవరకు కాళ్లవేళ్లా పడ్డారు. నువ్వు పన్నెండోవాడివి చాలా తలపొగరుగా ఉన్నావు. నువ్వే దయ్యంలా ప్రవర్తిస్తున్నావు." అని నిమ్మ కాయల దండ ఒకటి రామన్న మెడలో వేసాడు.

మూఢనమ్మకాలను గుడ్డిగా నమ్మిన వెర్రి ప్రజలు చురుగ్గా కదిలారు. అప్పటి కప్పుడు సాంబ్రాణి పొగలతో నింపేసారు. భేరీలు మ్రోగించ సాగారు. అంతా రామన్నను విషప్పురుగును చూసినట్టు చూడసాగారు.

ఇక లాభంలేదు తనను తాను రక్షించుకోవల్సిందేనని రామన్న మనస్సులో అనుకున్నాడు. అప్పటికే శిరోముండనం చేయడానికి, ఒంటి నిండా దూలగొండి ఆకులు రాయడానికి రంగం సిద్ధం చేసారు. "నేను మర్యాదరామన్నను, నామాట వినండి. ఈ భూతాలదొర అబద్ధాలతో మిమ్మల్ని వంచిస్తున్నాడు. మీరు అనవసరంగా బాటసారులను హింసించి చంపుతున్నారు. ఇంతవరకు మీచే చంపబడిన వారందరు నిరపరాధులే." పెద్దగా అరిచి చెప్పాడు.

ఆ పామరులు వినేదిశలో లేరు.వాడికి నోరువిప్పకుండా చావగొట్టండి అని అరవసాగారు. రామన్న వెంటనే తనలో ఉన్న క్షుద్రశక్తులను తలచుకున్నాడు. "ఓయీ భూతాలదొర నామాటవిని తోకముడిచేయ్ లేకుంటే నా విశ్వరూపం చూపుతాను. నీగుట్టు రట్టుచేస్తాను." అని చాలా అనునయంగా చెప్పాడు.

"వీడ్ని చింతరొద్దలతో చావగొట్టండి.చర్మం వొలిచేట్టు దెబ్బలు పడితే అప్పుడు వీడికి మనమేమిటో తెలుస్తుంది "అరిచాడు భూతాలదొర.

రామన్న ఆ ప్రజల మధ్య తాళ్లలో బంధింపబడిఉన్నవాడు చప్పున మాయమయ్యాడు.అక్కడ దివ్విటీ వెలుగుల్లో తినేసేలా చూస్తున్న మూఢప్రజలు గతుక్కుమన్నారు. నిలువెల్లా వణికిపోయారు. భూతాలదొర కంపించిపోయాడు. నలువైపులా పరికించి చూసాడు. ఏ అరుగుమీద పడుకుని ఉన్నాడో అక్కడే కన్పించాడు. అదిగో ఆ మాయలమారి రామన్న తీసుకురండి అని పురమాయించాడు. అంతాకలిసి ఒడిసిపట్టుకుని కట్టిపడేసారు. మళ్లీ తాళ్లమధ్య నుంచి మాయమవడం తిరిగి ఎదురు గుమ్మంపై కనపడడం తిరిగి అంతాకలిసి తీసుకు రావడం చకచకా తెల్లవార్లు జరిగింది.చీకటితెరలు పలుచనై వెలుగు ప్రసరించింది. అప్పటికి బాగా అలసిన ప్రజలు అయోమయంగా చూసారు. రామన్నను గుమ్మంలో వదిలేసారు."ఏమిటి ఇలా అవుతోంది? మరి ఎంత అని ఎత్తుకువచ్చి కట్టిపడేయగలం!" భూతాలదొరను అడిగారు.

"అతడేం చెబుతాడు నేను చెబుతాను. ఈతనికి క్షుద్రవిద్యలు గురించి ఏమీ తెలియదు.ఇక్కడ ఏవో అనారోగ్యం వలన చావులతో మీరు బాధపడ్డారు. ఈ చావులు ఏవో పిశాచాలు వలన జరిగాయి అని నమ్మించి మీ వలన అతడి పబ్బం గడుపుకుంటున్నాడు. అసలు నేను ఎలామాయమయ్యానో చెప్పమనండి."రామన్న నవ్వుతూ చెప్పాడు.భూతాలదొర బిక్కముఖం వేసాడు."నేను ఇంద్రజాలవిద్యతో మాయమై పోగలను.






క్షుద్రవిద్యలున్నాయి కానీ, గ్రామాలలో క్షుద్రశక్తుల వలన చావులు రావు. పలు అనారోగ్యాలవలన వస్తుంటాయి.ఇక ఈతని మనస్సులోని మర్మం ముడిని నాకు తెలిసిన కర్ణపిశాచి ద్వారా బహిర్గతం చేస్తాను. అని కన్నులు మూసుకుని మంత్రజపం చేసాడు. ఆ వెంటనే అందరిలో చెప్పాడు.

"ఈ భూతాలదొర పూర్వాశ్రమంలో ఒక గారడీలు చేసేవాడి వెనుక పాముల బుట్టలు మోసుకుని బతికేవాడు. అక్కడ కొంత ఎంగిలి కిటుకులు నేర్చుకుని ఇలా భూతవైద్యుని వేషంలో మీ ఊళ్లో బతుకీడుస్తున్నాడు.ఇది ఈతని పూర్వ కథ అవునా కాదా అడగండి. ఇంతకుమించి ఈతనికి వచ్చు విద్యలు లేవు."

భూతాలదొర తలదించుకున్నాడు."నేను ఇప్పుడు మహేంద్రజాల విద్యతో ఉఫ్‌మని ఊదితే గాల్లోకి ఎగిరిపోతాడు.దాన్ని ఇప్పుడు ప్రదర్శిస్తాను. అని ఉఫ్‌మని ఊదాడు.భూతాలదొర ఎగిరి గాల్లోకి కలిసిపోయి కన్పించకుండా పోయాడు. ఊరి ప్రజలు అతడు చచ్చాడా అని ఆత్రంగా అడిగారు. నేను వాడిలాంటి క్రూరసర్పాన్ని కాను. వాడు అల్లంతదూరంలో క్షేమంగా నేలమీద పడిపోతాడు ఆపైనా కన్పించకుండా పరుగులు తీస్తాడు. మరి మీరు రమ్మని పిలిచినా రాడు.వాడి కథ మీ అందరికి తెలిసిపోయింది వాడి ఆటలు మీవద్ద మరి సాగవు."

మూఢ ప్రజలు దభీమని రామన్న కాళ్లమీద పడ్డారు.

రామన్న నవ్వి చిన్నపాటి మంత్రతంత్రాలు చేస్తే ఎలామీరు నన్ను అద్భుతమైన వ్యక్తిలా చూస్తున్నారు. ఈ విధానం కూడదు. నేను క్షుద్రవిద్యలు జోలికి పోకుండా బతకాలనుకున్నాను.కానీ,ఈరోజు ఆశక్తులే నన్ను బతికించాయి." అని వారి వద్ద సెలవు పుచ్చుకుని అక్కణ్నించి కదిలాడు.



రామన్న గ్రామం మధ్యలో చెట్టుకు కట్టి వేయబడుట



# ఒక కన్నుతో ఏంచూస్తాం?

రామన్న మధ్యాహ్నం వేళకు ఒక నగరంలో ప్రవేశించాడు. నగరపొలి మేరల్లో ఒక పూటకూళ్లవ్వ ఇంటి ముందాగి "ఏమైనా తిండానికి ఉందా?" అని అడిగాడు. "అదేం ప్రశ్నయ్యా లోపలికి రా! పూటకూళ్లవ్వ ఇంటికి వచ్చి తింటానికి అడగుతున్నావు.నీకేమైనా వేపకాయంత వెర్రి ఉందా?" కోపంతో నిండిన గొంతుతో రామన్న పై మండిపడ్డాడు జంగయ్య అనే యువకుడు.

రామన్న లోపలికి వెళ్లాడు. అక్కడ జంగయ్య ఒక్కడే కూర్చుని ఉన్నాడు. అతడిచుట్టూ వండిన వంటలున్నాయి. అతడు ఒక కన్నుకు పసుపు గుడ్డ కట్టుకున్నాడు.అక్కడ పూటకూళ్లవ్వలేదు. "ఆకలిగా ఉంది ఏమయినా పెట్టు" అని వరహా అందించాడు.

"ముందు తినవయ్యా ఆ తరువాత నీ వరహా ఇవ్వవచ్చు.అన్నట్లు నీకు వడ్డించను. ఆ గరిటెతో నీకు ఏది ఎంతకావాలో అంత ఆ విస్తరాకులో పెట్టుకుని తిను. ఇది నీఇల్లు అనుకో! "చెప్పి గరిటె చూపాడు జంగయ్య.

అన్నిరకాలు వడ్డించుకుని పదిముద్దలు మింగాక, అప్పుడు కుదుట పడి రామన్న జంగయ్యను చూస్తూ "పూటకూళ్లవ్వ లేదు ఏమయ్యింది?"

"అది ఇప్పట్లో చావదు. గుండురాయిలా ఉంది. పేరుకే పూటకూళ్లవ్వ అదో ధనపిశాచి, నన్ను పనిలో పెట్టుకుంది. మధ్యాహ్నం భోజనం వచ్చే వారికి వడ్డించడం ఆపని అయ్యాక మిగిలింది తిని హాయిగా నిద్రపోవడం రాత్రి నాకు పనిఉండదు. అందుకే నాకు రాత్రి తిండిపెట్టదు. ఓ ఆరు అరిటిపళ్లు ఇస్తుంది.ఇదేమిటి అని అడిగితే పొమ్మంటుంది. కనీసం పగలైనా మంచి తిండి తింటానని ఆశతో ఉన్నాను. అందుకే రెండు కళ్లల్లో ఒక కన్ను బాగులేదని చల్లదనం కోసం పసుపుగుడ్డ కట్టువేసుకుని ఉన్నాను. పగలు ఇరవైమందికి మించి వడ్డించలేను అని చెప్పాను.ఆపైన వచ్చినవారికి ఆ ముసల్ది వడ్డిస్తుంది. నువ్వు ఇరవైనాల్గవ వాడివి. అందుకే వడ్డించకుండా గరిటెఇచ్చాను. ముసల్ది పక్కింటి పేరంటానికి పోయింది. నువ్వు వరహా

ఇవ్వకుండా తినిపో! నాకు ఏమీ ఇవ్వకు అన్నదానపుణ్యమేనా వస్తుంది. ఇలా మీలాంటి అన్నార్తులవద్ద ముక్కపిండి దానికి అందివ్వడమే అది మూటలు కడ్తుంది." తన కథంతా పూటకూళ్లవ్వపై అక్కసుతో ఏదీదాచకుండా వెళ్లగక్కాడు. రామన్నకు ఆమాటలు చాలా ఆశ్చర్యంగా అనిపించాయి.

"అయితే నీకు కన్నుపోలేదా? ఊరకనే కట్టుకున్నావా?"

అంతలోనే వచ్చింది ముసల్ది. రామన్నను ఎగాదిగా చూసి ఎండకు చెమటలు పోస్తూ ఆ ఎదురుగా నులకమంచంపై పడుకుంది. రామన్న తిని చేతులు కడుక్కుని ముసలామె వైపు చూసాడు. ఆమె ఏదో ఆలోచించు కోసాగింది. గాఢంగానిట్టూర్చి వెళ్లిపోతుంటే, "రేయ్ జంగం ఆ తినిపోతున్న కుర్రకుంక వద్ద వరహా తీసుకున్నావా?" అని అడిగింది.

"ఏ కుర్రకుంక, తినిపోతున్నాడా? ఏమో నేను చూడలేదు. అంతపాటి చూపు నాకు మరి లేదమ్మ నా పని మేరకు ఇరవైమంది వరకు కళ్లల్లోవత్తులు వేసుకుని చూస్తాను. ఆపైన నా వశంకాదు. అయినా రెండో కన్ను ఆరిపోయి వెలుగుతున్న దీపంలా ఉంది. ఇక్కడ నువ్వు నేను తప్పితే నాకు ఎవరూ కన్పించడం లేదు." జంగయ్యకోపంగా బదులిచ్చాడు.

రామన్న ఇంకా గడపదాటలేదు. ఆ మాటలు విని నవ్వుకుంటూ అక్కడే నిలబడి ఉన్నాడు. "ఈ గుడ్డివెధవతో భలే చిక్కువచ్చింది. నట్టింట కూర్చుని బుక్కేసి పోతుంటే కనిపించలేదంటున్నాడు. ఊడివి కాకి కళ్లు(కాకికి ఒక కన్ను కనపడదు మరోకన్ను కన్పిస్తుంది అని ఒక కథనం ఉంది.)ఏయ్ కుర్రాడా తిని ఎంచక్కాపోతున్నావు. వరహా ఇవ్వాలని ఇంగితంలేదా ఇదేం బుద్ధి ఇంత చిన్న వయస్సులో " లేని ఓపిక తెచ్చుకుని లేచి అడిగింది. అప్పుడు రామన్న వరహా తీసి ఇవ్వబోతుంటే జంగయ్య రుసరుసలాడాడు.

"ఓయీ వెర్రిబాగులోడా, ఇటు మధ్యాహ్నం అటు రాత్రికి మధ్యలో భోజనం చేసావు. అలాంటి భోజానాలు మనుష్యులు చేయరు. దయ్యాలు తింటాయి. అన్నికూరలు చల్లబడినాయి. ఎలా తిన్నావో ఏమో? అన్నం సరిగ్గా ఉడికి చావలేదు. మరి ఏమి ఇస్తావు. సరే ఫో! నీవు చెల్లించనక్కర్లేదు. మా ముసలి దానికి ధనంపిచ్చి, నీ వెంటపడి పీడించి వసూలుచేసేశక్తి మాముసలిదానికి లేదు." రామన్నకు వత్తాసుగా మాట్లాడాడు.



శ్రీమర్యాద రామన్న తీర్పుకథలు

"బాబ్బాబు వాడితో నీకేంటిగాని, నా వరహా ఇచ్చి పుణ్యం కట్టుకో! ముసలిదాన్ని రెక్కలు ముక్కలు చేసుకుని వండి వార్చాను. నా శ్రమను దోచుకోకు నాయనా!" అని ధీనంగా అడిగింది.

రామన్న ఆమెను సమీపించి చేతులుపట్టుకుని "అవ్వా నేను నీ ధనం నీ శ్రమను ఆశించువాడను కాను. ఇదిగో నీ వరహా" అని అందించాడు. ఆత్రంగా అందుకుని కొంగున ముడివేసింది. జంగయ్య తలపట్టుకున్నాడు. "ఓయ్ కుర్రోడా నీవు నాలాగునే ఇలాంటి పూటకూళ్లఇళ్లలో చేరిపోయి నాలుగు ఎంగిలిమెతుకులకు కుదిరిపోతావు. మనిషికి ఎప్పుడూ పక్కవాడి సొమ్ముతిందామని ఆశ ఉంటే చాలు వాడుపైకి వస్తాడు. లేకుంటే నాలాగునే అయిపోతావు" అన్నాడు జంగయ్య.

"వాడితోనేమిటి బాబు, వాడు తిన్నంటివాసాలు లెఖ్ఖించే బదుద్దాయి. ఎవరూలేని అనాథ రోడ్డునపడి తిండికి వాచిపోయి సొమ్మసిల్లి పడిపోతే, జాలిపడి ఇంతముద్దపెట్టి ప్రాణం నిలిపాను. వచ్చి నావద్ద పనిచేసుకుని నమ్ముకుని ఉండరా అంటే పెట్టిన చేయిని కోసేరకంగా తయారయ్యాడు. వాడికి ఒకపూట తిండి పెడుతున్నాను. రాత్రి వేళ నేను తినేది అరటి పండ్లు కనుక వీడికి నాతో బాటే అరటిపండ్లు పెడ్తుంటాను. అందుకు కారణం వేరే ఉంది. ముప్పూటలా తినేస్తే వీడు పనిచేయలేడు. బద్దకస్థుడయిపోతాడని భయపడ్తున్నాను."

"చాల్లేవమ్మా పెద్దచెబుతున్నావు. నీవు రేపోమాపో చావకూచున్నావు. నీకు తింటే రాత్రులయందు అరగదు. నీకు తోడుగా నన్ను మాడుస్తున్నావు. ఇది పాపం కాదా? పనివాడు మనసావాచా పనిచేయాలంటే ముందు యజమాని నమ్మకంగా ఉండాలి." జంగయ్య ఒంటికాలిమీద లేచాడు.

రామన్న జంగయ్యను సముదాయించాడు. "మెల్లగా మాట్లాడవయ్యా, ఆమె చెప్పింది నిదానంగా నన్ను విననీయ్. ఆమె ఎందుకలా చేస్తున్నదో తెలియాలి. ఇలా తలా ఒకమాట ఆడుతూ పోతే మీ ఇద్దరిమధ్య స్పర్థలుండనే ఉంటాయి." అక్కడ నిశ్శబ్దం చోటుచేసుకుంది.

మళ్లీ ముసలామె గొంతువిప్పింది. "నాయనా చిన్నవాడివైనా ఓపిగ్గా మా మాటలను ఇంతవరకు వినడమే కాకుండా ఇంకా వినడానికి ఉత్సాహ

పడ్తున్నావు. ఈ అనాథ జంగయ్యను చేరదీసిన తరువాత ఎందుకో వీడిని నా కొడుకు గానే భావిస్తూవచ్చాను. వీడు ఆకలినుంచి వచ్చినవాడు. మొదట్లో ముప్పూటలా తిని పాతజీవితాన్ని మరిచి ఏమీ ఇచ్చుకోలేని అన్నార్తులు వస్తే గేలిచేయడం దుక్కలా ఉన్నావు ఏ పనిచేసుకుని బ్రతుకరాదా అని ఎకసక్కెంగా మాట్లాడడం, మేము వండిన వంట బాటసారులు తింటే సరి లేకుంటే మిగిలినది పేదలకు పెట్టడు. నేలపాలు చేస్తాడు. అలా అలవాటు చేస్తే ఆపేదలు మావద్దకు బాటసారులు రాకుండా దేవుళ్లకు పదేపదే మొక్కుతారు మన వద్ద వండినదంతా మిగిలి పోతుంది. కొన్నాళ్లుకు మనం ఆ అడుకున్నవాళ్లలా అయిపోతాం అని చెప్తుంటాడు. బాగానడిచి వచ్చిన బాటసారులు ఎక్కువ తింటారు. ఇచ్చిన వరహాకు కుంచెడు తింటే ఎలా అని నాకు తెలియకుండ పెద్దకుండెడి అన్నంలో గరిటెడు సున్నం కలిపేస్తుంటాడు. ఆకలిమీద తినేవాడికి మొదటి పదిముద్దలు రుచి తెలియక పోయినా అక్కణ్నించి చిన్న వెగటు తెలుస్తుంది కడుపునిండినట్టుగా అనిపిస్తుంది. అన్నం చాలా తక్కువ తిని వాడిదారిన వాడు పోతాడు. ఇలా ఈ పూటకూళ్ల ఇంటిని వ్యాపారంగా మార్చేసాడు. ఇవన్నీ చూసాక, ఎన్నో మారులు నీవుచేస్తున్నది తప్పు అని చిలక్కి చెప్పినట్టు చెప్పాను. ఏ జన్మలో ఏ పాపం చేసుకున్నామో ఇప్పుడు అన్నం అమ్ముకుని బ్రతుకుతున్నాం. అని ఎన్నోవిధాలుగా చెప్పాను. వీడికి నామాట ఏమీకాదు. ఎలా అయినా వీడికి ఆకలి విలువ తెలియాలి. అందుకే నేను రాత్రిభోజనం మానేసి అరటిపండ్లు తింటున్నాను. నాకు అన్నం తింటే గాని నిద్రపట్టదు. కానీ, వీడికోసం తప్పదు. ఇన్ని చేసినా వీడు మారడు. రేపు నేను చచ్చాక ఈ వంట వార్పు వీడే చూడాలి. కానీ, వీడికి ఆ బుద్ధిలేదు. ఎప్పుడు మోసం ఆలోచనలే."

"చాలబాగుంది. నేను కొడుకులాంటి వాడినంట. మరి రాత్రి నాకు తిండిపెట్టకుండా మోసం చేయడం తగునా? బాటసారి ఇచ్చింది వరహా తినేది కుంచెడు బియ్యం ఏమైనా వ్యాపారమే కదా, అందుకే వ్యాపారచిట్కాలు చేస్తున్నాను. వద్దు అంటుంది. అలా అయితే ఏమీ మిగలదు. రేపు మరీ ముసలి దానివైతే నువ్వు వండలేవు. ఈ కాస్త వ్యాపారం సాగదు. అందుకే నువ్వు





ధనం ఆదా చేయాలి. అందరూ కొత్వాలువద్ద దండిగా వరహాలు దాచుకుంటున్నారు. (అప్పట్లో బ్యాంకులు లేవు. కొన్నిరాజ్యాలలో కొత్వాలే బ్యాంకులా వ్యవహరించేవాళ్లు. ఇక్కడ ఒక పేచీ ఉండేది. యుద్ధాలు వచ్చేటపుడు రాజులు ఆ ప్రజాధనం ఖర్చుచేసే వారు. అదీ ధనికుల ధనం మాత్రమే రాజులు తీసుకోవడానికి వెనుకాడేవారు కారు. అందుకే దిక్కులేనివారు, ఇంట్లో ధనానికి రక్షణలేని వారు కొత్వాలు వద్ద దాచుకునే వారు. పేదలధనం ఖర్చుచేయడానికి రాజులు ముందుకు వచ్చేవారు కాదు. వాటిని తాకేవారు కారు.) మనకంటూ గాలివానకు ఎగిరిపోయే ఈ గుడిశె వండిపోయడానికి గంగాళాలు, పాత్రలు తప్పితే ఏముంది? అప్పుడు ఒక్కడు నీకు ఇంత ముద్దపెట్టే వారే ఉండరు. నేను వేరే దారి చూసుకుంటాను. ఇన్నాళ్లు నీవద్ద బతికేను. నీకు ఏమైనా డొక్కాడకపోతే నా మనస్సు ఉస్సురుమనదా? అందుకే లాభం వచ్చేపని చేస్తున్నాను. దీనిలో తప్పులు ఎంచుతున్నావు. ఇప్పుడు నీకు నష్టంవచ్చేలా చేస్తే తెలుస్తుంది, తప్పకుండా నీకు ఈ లోకంలో ధనంలేనిదే ఎవరు అక్కరకురారు అని తెలుస్తుంది. అప్పుడు నీవే నా దారికొస్తావు." జంగయ్య తన వాదన విన్పించాడు.

"నా తదనంతరం ఈపూటకూళ్ల చావిడీని వీడే నడపాలి నా కొంప నా పాత్రలు అన్నీ వీడికే చెందుతాయి. నావద్ద ఉన్న మిగిలిన రూకలు వీడికే చెందుతాయి అని ఎన్నిసార్లు చెప్పినా వీడునమ్మడు." అని తల పట్టుకుంది.

"అవ్వవన్నీ బూటకపు మాటలు, మాకు బియ్యం పోసే రైతు పోతయ్యకు, పహరాకాసే రాజభటుడు గంగులకు, కూరగాయలు ఇచ్చే సిన్నోడికి అందరికి ఇలానే చెబుతోంది. వాళ్లు నాకు ఎప్పుడు కన్పించినా అవ్వకు ఇంకా ఏ మాయ రోగం రాలేదా? ఎప్పుడు కాలంచేస్తుంది అని అడుగుతున్నారు. అందులో ఒక్కడు అవ్వకు జబ్బో జొరమో వస్తే కాలుకి సేతులకు అవుతున్నారా? నేనే కదా ధన్వంతరి దగ్గరకు పరుగెత్తుతున్నాను. మరి ఈ అవ్వకు వాళ్లే వారసులుగా కన్పించారు. మరి నాకు ఇవన్నీ చూసాక

ఒక కన్నుతో కాకుంటే రెండుకళ్లతో ఎలా చూసేది?"జంగయ్య కోపంగా విచారంగా మనస్సు కకావికలమైనట్లు చెప్పాడు.

"నాయనా, ఇంతవరకు మా కథ విన్నావు. నేను అలా నలుగురికి చెప్పడానికి కారణం వారు సరైన వాళ్లు కారు. నాకు కన్నులు సరిగ్గా ఆనవు. కనుక రైతు బియ్యం సరైనవి వేయడు తప్పుడు కొలతలతో వేస్తాడు. అలాగే, కూరగాయలు వాడు అంతే! ఇక రాత్రులయందు పహారా హుషార్ అని నా కొంపవరకు రాడు. అయితే ఇంతమందికి చెప్పి నేను ఛస్తే వీడిపీకమీద కూర్చుని ఆ ముగ్గురు తీసుకుంటారని మీరనుకోవచ్చు. నేను కొత్వాలువద్ద ఒక పత్రం రాయించాను. అందులో నా వారసుడు జంగయ్య అని పదేపదే రాయించాను. కావాలంటే చూసుకోండి." అని అవ్వ చెప్పింది.

"జంగయ్య నీవు కొత్వాలు కచేరిలో అవ్వచెప్పిన పత్రం చూసుకుని వచ్చేయ్." అని రామన్న పంపాడు. పరుగున వెళ్లి వచ్చాడు. ఆ వెంటనే అవ్వ పాదాలమీద పడ్డాడు. "నాకు తెలియక నీ మీద చాలా అపోహలతో ఉండేవాడిని. కొన్ని సందర్భాలలో చాలా నష్టపరిచాను. నన్నుమన్నించు అవ్వా నీవు నాకు అన్నంపెట్టిన దాతవే కాదు. నన్ను పెంచినతల్లి వంటిదానవు. నీవు ఎలా చెబితే అలాచేస్తాను. అన్నంలో సున్నం కలుపను. నాసిరకం వంటలకు సిద్ధపడను." అని చెప్పాడు.

రామన్న నవ్వి "బావుంది నీ వరుస, పెడితే పెళ్లి లేదా చావు కోరుకునేట్టున్నావని ముందు అనుకున్నాను కానీ, మీ ఇద్దరు ఒకరికి ఒకరంటే చాలా ఇష్టం. ఒకరిని ఒకరు తప్పుగా ఆలోచించుకుని మీకు తెలియకుండానే అపకారం చేసుకుంటూ ఇంతకాలం గడిపారు. జంగయ్యా నీవు యువకుడివి. నీవు ఇప్పుడు తెలుసుకోవల్సింది ఏమిటో తెలుసా? మనలో మనమే ఎదుటివారికోసం ఏదో ఒక నిర్ణయానికి వచ్చేస్తే ఇప్పుడు మీరు పడ్డ యాతన పడక తప్పదు. ఎంతటి దూరం మీలో ఏర్పడింది. ఒక్కోసారి ఒకరిని ఒకరు చంపుకునేటంత హీనం ఏర్పడుతుంది. ముందు ఇద్దరి మధ్య వచ్చే పొరపొచ్చాలను ఆ ఇద్దరు కలిసి అనుకున్నా, లేకుంటే మధ్యవర్తి మధ్యపెట్టి అనుకున్నా అంతటితో ఆ సమస్య వీడిపోతుంది." అని చెప్పాడు.





"నాయనా ఇంతచిన్నవాడివి, పెద్ద ఆరినవాడిలా ఇంతటి చక్కని మాటలు చెప్పగలుగుతున్నావంటే నీవు ఎవరివి? ఇంతటి స్ఫూర్తిని నేను ఎందునూ చూడలేదు. ఎంతోమందికి వండివార్చినదాన్ని" చేతులు పట్టుకుని అడిగింది.

"అవ్వా నాపేరు మర్యాదరామన్న అని పిలుస్తారు. నేను కళింగ నగరానికి చెందినవాడను. దేశాటన చేస్తూ ఇక్కడికి వచ్చాను." "నువ్వేనా రామన్నవు. నేను బాటసారులవద్ద విన్నదానికంటే పదింతలు ఎక్కువగానే ఉన్నావు. నీకు మరిన్ని శుభాలు కలగాలని ఆ దేవున్ని కోరుకుంటున్నాను. అయ్యో ఎంతపనిచేసాను. వరహాపుచ్చుకుని చల్లని మెతుకులు పెట్టాను." అని కొంగున కట్టుకున్న వరహ తీసి తిరిగి ఇవ్వబోయింది.

రామన్న వరహ అందుకోకుండా "ఏమి జంగయ్య మీ అవ్వ నాకు వరహ తిరిగి ఇచ్చేస్తోంది. తిన్నవెంటనే ఇవ్వవద్దని నాకు చెప్పినవాడివి. ఇప్పుడు అడుగు తున్నాను. నీవు చెప్పు తీసుకోవాలా వద్దా? " అని అడిగాడు.

జంగయ్య అదోలా చూస్తూ " ఇంతచక్కగా మా మధ్య పొరపొచ్చాలు తీర్చినవాడివి. తిన్నదానికి వరహా ఇవ్వాలో వద్దో నీవే నిర్ణయించుకో గలవు. నీవు తిన్న భోజనం చల్లగా అయిపోయినా, శుచిగా, రుచిగా లేకపోయినా, ఒక వృద్ధురాలి శ్రమ ఉంది. నేను చెప్పాల్సింది చెప్పాను."

జంగయ్య మాటలకు రామన్న పడిపడినవ్వాడు. "చూసావా అవ్వా ఇందాక నేను తిన్న బువ్వను ఈతడు అవేం పదార్థాలు వాటికి ఎలాంటి చెల్లింపులు వద్దు అని నన్ను పొమ్మన్నాడు. తీరా, ఇప్పుడు ఏమంటున్నాడో అదే భోజనంలో అవ్వ. శ్రమ ఉంది. అలాంటి శ్రమను ఉచితంగా నీవు తింటే నీకు అరగదు అన్నట్టు చెబుతున్నాడు. ఇప్పుడు ఈతడు ఒక దారిలో పడ్డాడు. మీరు ఇద్దరు ఒకేమాట ఒకేబాటగా సాగిపోతారు."

అవ్వ బోసినవ్వులు చిందించి రామన్న ముఖాన్ని ఆప్యాయంగా తడిమింది. జంగయ్య గలగల నవ్వేసాడు. రామన్న సుమంతాపురానికి తోవ అడిగి వారి వద్ద సెలవు పుచ్చుకుని బయల్దేరాడు.





# ఉప్పుమూటతో భలే లాభం

పవిత్రమైన ఋషితుల్యనది ఒడ్డున రామన్న నిలబడ్డాడు. ప్రయాణ బడలికతో మరి నడవాలనిపించలేదు. మరోవైపు సాయం సమయం కావస్తున్నది. నది ఆవల ఒడ్డుకు చేరాక, అక్కడ ఉన్న ఫిరంగిపురం గ్రామంలో ఏదో దేవాలయంలో తలదాచుకుని ఉదయాన్నేలేచి మరి పది క్రోసులు నడిచి సుమంతాపురం రాజకోటకు చేరుకుంటే సరిపోతుంది అని అనుకుని చుట్టూ చూసాడు అక్కడ ఒక బస్తాపట్టుకుని ఎవరికి సంబంధంలేనట్టు ఒక నల్లని నడివయస్కుడున్నాడు. ఆవల ఒడ్డుకు చేరాల్సిన కొందరు అతడితో మాట్లాడకుండా దూరంగా నిలబడున్నారు. వాళ్లంతా పడవకోసం చూస్తున్నట్లున్నారు. అటువైపు కదిలాడు.

"ఏమయ్యా పడవకోసం అంతా ఎదురు చూస్తున్నట్టున్నారు. పడవ అసలు ఏట్లో కన్పించడమే లేదు. ఎప్పుడు వస్తుంది.?" అని అడిగాడు.

"అయ్యా ఎవర్నువ్ ? ఈ ప్రాంతానికి కొత్తవాడిలా ఉన్నావు. చూస్తే పెద్దింటి వారి బిడ్డలా ఉన్నావు. నగానట్రా దండిగా వేసుకుని భుజాన సంచితో మరీ వచ్చావు. ఎక్కడికి పోతావు?" అని ప్రశ్నలు కురిపించాడు.

రామన్న నవ్వి" ఇన్ని ప్రశ్నలు ఒక్కసారి కురిపిస్తే ఏమి చెప్పగలను? సరే, అడిగావు. నాపేరు రామన్న నేను ఇక్కడికి చాలాదూరంలో గల కళింగ నగర వాసిని, దేశాటనలో భాగంగా ఇక్కడికి వచ్చాను. సుమంతా పురం వెళ్లాలనుకుంటున్నాను. ఆవల ఒడ్డుదాటితే చాలు. నా తోవన నేను వెళ్లి పోతాను."

"నేను ఇక్కడ చిన్నవ్యాపారిని, నాపేరు అంతా ఉప్పయ్య అంటారు. రోజూ ఒకబస్తా ఇక్కడ కొని, ఆవల ఒడ్డుకు చేర్చుకుని అమ్ముకుని బ్రతుకు తున్నాను. నాకు తోడు ఎవరూ లేనందున ఏట్లోకి దిగలేదు. నువ్వు నాతో వచ్చేయ్. నాకు ఈఏటి లోతులు తెలుసు. బస్తా నా భుజాన ఉంటుంది. నా వెనుకనే వచ్చేయ్. పడవ ఇప్పట్లో రాదు. అది నడిపేవాళ్లు పరమ తాగుబోతులు, జూదరులు ఎక్కడో ఒకచోట తాగిపడుకోవడమో జూదంలో మునిగితేలడమో చేస్తారు."

ఆ ఒడ్డున ఉన్న వారంతా రామన్నవైపు జాలిగా చూసారు.

ఇద్దరూ నదిలోకి దిగారు. ఉప్పయ్య బస్తా ఎత్తుకుని నడవసాగాడు రామన్న వెనుకనే దిగాడు. సగం తోవకువచ్చారు. ఏటిలో నీటివేగం బరువెక్కిపోయి లాగేస్తున్నట్టుగా ఉంది. ఇద్దరి నడకలో ఇబ్బంది కల్గింది. రామన్నా ఒక్కసారి నా బస్తాను అందుకో నా పంచ ఊడింది. ఒడ్డెక్కేసరికి దాన్ని తిరగ ముడివేయ కుంటే పంచ ఈవేగంలో కలిసిపోతుంది. ఒడ్డుమీద దిశమొలతో నిలబడాలి. అని బస్తా రామన్న చేతిలో కుదేసినట్టు పెట్టాడు. రామన్న దాన్ని అందుకుని అతిమెల్లగా అడుగులు ముందుకు వేయసాగాడు. రెండు ఒడ్డులమీద ప్రజలు ఉత్కంఠగా చూడసాగారు. పంచ కట్టేసుకుని "ఏది నాయనా బస్తా ఇవ్వు" అని చేతులు చాచి వెనక్కు తీసుకున్నాడు. రామన్న బస్తా వదిలేసాడు. అది నీటివేగంలో కొట్టుకు పోసాగింది. రామన్న,ఉప్పయ్య ఇద్దరు అటుగా ఈదుకుంటూ వెళ్లి బస్తా అందుకున్నారు. దాన్ని ఎత్తిపట్టుకోవడం కుదరలేదు. అయినా ఉప్పయ్య మీదకు ఎత్తబోయి కావాలని మరోసారి పడేసాడు. మళ్లీ కొట్టుకు పోసాగింది. రామన్న ఈదుకుంటూ వెళ్లి అందుకుని ఈడ్చుకుంటూ ఒడ్డువైపుకు దూసుకు పోయాడు. అతడి వెంట పడ్డాడు ఉప్పయ్య. తీరా ఇద్దరు ఒడ్డెక్కారు. రామన్న చేతిలో బస్తాకు బదులు ఉత్త సంచి మిగిలింది. లోపల సరుకు ఏమయ్యింది? అని నదిలోకి అయోమయంగా చూసాడు.

"ఓర్నాయినో ఈ గుంటపాపడు ఎంతపనిచేసాడు. నా బస్తాను ఏటిపాలు చేసాడు. ఎలా బతికేది దేవుడోయ్" అని ఏడవసాగాడు. అక్కడ సిద్ధంగాఉన్నారు ఫిరంగిపురం గ్రామపెద్దలు ఇద్దరు. "వారు ఏమయ్యిందిరా, ఎందుకలా ఏడుస్తున్నావు. ఈ కుర్రాడెవడు నీ మేనల్లుడా? బుజ్జిగాఉన్నాడు."

"వీడు నా కడుపుమీద కొట్టినవాడు, మేనల్లుడుకాదు. నిలువునా బస్తా సరుకును నీటిపాలుచేసి ఉత్తసంచిని నాచేతిలోపెట్టిన పాపిష్టివాడు. నా బతుకు ఎలా బతకాలి. ఈరోజంతా నేనుపడ్డకష్టం వీడు ఏటిపాలు చేసాడు. వీడికి పుట్టగతులుండవు. పేదవాడి నోటికాడ కూడును తన్నేసినోడు." అనిపలు తెరంగుల ఏడ్చాడు." శాంతం విన్న పెద్దలు ఉప్పయ్య కన్నీటిని తుడిచారు.





"ఏరా బుద్ధిహీనుడా, నీకు చేతులు ఎలావచ్చాయి? సరుకును నీటిపాలు చేయడానికి నీకు మనస్సు ఎలా ఒప్పింది?" అని గ్రామపెద్దలు రుసరుసలాడారు.

"అయ్యా ఇందులో నా తప్పేమీలేదు. అతడే తూలిపడ్డాడు. "అని రామన్న చెబుతుండగా మధ్యలో పెద్దలు అందుకున్నారు. ఇంకనూ, నీవు చెప్పడానికి ఏముంది? నష్టపరిహారం చెల్లించుకో!" అని కోపంతో రామన్న ఒళ్లంతా తడిమారు. "అబ్బో నీ వద్ద చాలా నగసత్రా ఉన్నట్లుందే, అయితే నిన్ను తిట్టిపోయడానికి మాకు అర్హతలేదు. నీవు చేసిన తప్పుకు పెద్దనగను అంటే నీ మెడలో హారాన్ని ఈతనికి ఇచ్చేయ్. అతడికి నీవు చేసిన నష్టం అంతటితో పూడుతుంది. పేదవాడ్ని నీవు పెద్దఎత్తున నష్టపరిచి నీ దారిన నీవుపోవడం కల్ల. మర్యాదగా ఇచ్చేయ్. ఈ పెద్దలు ఏదీ అలా ఇలా చెప్పరు. ధర్మం నీతికి కట్టుబడి చెబుతారు. అదే నీకు శిక్ష. మా మాటను పెడచెవిన పెడితే ఇక్కడి కట్టుబాట్లు ప్రకారం నిన్ను చావగొట్టించాల్సి వస్తుంది. అంతవరకు తెచ్చుకోవద్దు ఆపైన నీ ఇష్టం."

రామన్న మెడలో హారాన్ని వారికి ఇచ్చేసాడు. ఉప్పయ్య సంతోషంగా ఆ బంగారు నగను కళ్లకు అద్దుకున్నాడు. రామన్న మెల్లగా ఒడ్డుఎక్కి "అయ్యా ఇక్కడేమైనా గుడి ఉందా?"అని ఆ గ్రామపెద్దలను అడిగాడు.

"అలాంటివి లేవు. ఏదో నీలాంటివాడు దయతలిస్తే ఒక గుడి కట్టుకుంటాం. నీ ఒంటిమీద ఉన్న నగలు కాస్తా పడేస్తే మంచి గుడి నీ పెద్దలపేరున కట్టి నిన్నుపిలుస్తాం. అది సరే, ఇంత సాయంత్రం వేళ ఎక్కడికి పోలేవు. కనుక నీవు ఇదిగో ఈ ఉప్పయ్య ఇంటిలో బసచేసి ఉదయాన్నే వెళ్లిపో!"చెప్పి గ్రామపెద్దలు వెళ్లిపోయారు. అక్కడ చోద్యం చూస్తున్న గ్రామస్థులు జాలిగా రామన్నవైపు చూసారు. పాపం బలిపశువు మరోసారి బలికావడానికి ఉప్పయ్య ఇంటిలో బసచేస్తున్నాడు అని అనుకోసాగారు.

ఉప్పయ్య రామన్న భుజం తట్టి "ఓ చిన్నవాడా నీకు ఈ గ్రామం కొత్త నా ఇల్లు నీకు తెలియదు. కనుక నీవు ఇలా తిన్నగా ఆవీధి చివరికిపో! అక్కడ ఎవరినైనా అడుగు ఉప్పయ్య కొంప ఎక్కడా అని, ఎవరూ చెప్పకపోతే వాకిట కూర్చుని ఉంటుంది నా భార్య గంగాయమ్మ ఆమె నిన్ను తీసుకుని

వెళ్లి మాకున్నంతలో రాచమర్యాదలు చేస్తుంది. చక్కగా భోంచేసి నిద్రపో! నేను మరో బేరం చూసుకుంటాను. రాత్రికి వస్తాను." చెప్పిపంపాడు.

రామన్న తిన్నగా వీధి చివరికి వెళ్లాడు. అక్కడ ఇంద్రభవనంలాంటి ఇల్లుంది గుడిశెలు లేవు. నిరుపేద ఉప్పయ్య ఇల్లు అంటే గుడిశె కదా అని అక్కడ వెతికి ఆ ఇంద్రభవనంలాంటి ఇంటిముందు కూర్చుని ఉన్న ఆమెను చూసి అమ్మా ఉప్పయ్య ఇల్లు ఎక్కడుంది?" అడిగాడు.

"రా నాయనా, ఇదే నాపెనిమిటి ఉప్పయ్య కష్టార్జితంతో నిర్మించుకున్న చిన్నిఇల్లు(భవనం) ఈ ఊరివాళ్ల కళ్లలోపడి ఇలా నల్లరాయిలా బద్దలయి పోయినట్లు అయ్యింది. ఊరివాళ్ల కళ్లల్లో నిప్పులుపడ," అని తిడుతూ లోపలకి ఆహ్వానించింది. రామన్న బిక్కముఖం వేసుకుని లోపలికి వెళ్లాడు.

నిజంగానే ఇంద్రభవనమే, లోపల ఏదో రాజులకోసం నిర్మితమైనట్టుగా ఉంది. అంతచక్కగా ఉంది. రామన్న నెమలి సింహాసనంపై కూర్చున్నాడు. ఆ ఎదురుగా వీణ ఉంది. గంగాయమ్మ కూర్చుని వీణ మీటింది. అంతే, రామన్న ముఖంలో రంగులు మారాయి. వీణవాయించడంలో ఆమెకు ప్రాథమికంగా ఏమీ తెలియదు. ఇష్టానుసారంగా వాయించి ఆ తరువాత చెమటలు పోసిన తన ముఖాన్ని అరచేత్తో తుడుచుకుని "పదనాయనా భోజనం చేద్దువుగాని" అని నాసిరకం వంటలతో వడ్డించింది. ఏదో తప్పదు అని తిని హాయిగా నిద్రపోయాడు. అప్పుడు వచ్చాడు ఉప్పయ్య. ఇద్దరు నవ్వుకున్నారు.

"వీడెవ్వడో కానీ, పెద్ద రాకుమారుడిలా దేశాటన చేస్తున్నాడంట. ఇక్కడ వీడికి నిలువుదోపిడీ అయితే చచ్చీచెడీ ఇంటికి చేరి బుద్ధిగా బతుకుతాడు. రేపు వీడిని నిలువునా దోచుకుందాం." అని చెప్పాడు.

ఉదయాన్నే లేచి రామన్న ఆ దంపతులవద్ద సెలవు తీసుకుని బయల్దేరబోతుండగా, గంగాయమ్మ వచ్చి "నాయనా, నీకు నా సంగీతం, నా వంట నచ్చిందా ?" అని అడిగింది. చాలా బాగా నచ్చాయి అని వెంటనే బదులిచ్చాడు. మరి అంత బాగానచ్చితే ఒక్కవరహా ఇవ్వకుండా వెళ్లిపోతున్నావు. ఇదేం పద్ధతి ఆడుదాని శ్రమను ఊరకనే తినిపోకూడదు." అని చేతులు చాచింది. వెంటనే ఆమెకు రెండు వరహాలు ఇచ్చాడు. ఇదేమిటి రెండు





వరహాలు ఇస్తున్నావు. ఇంత తక్కువ ఇవ్వడానికి నీకు మనస్సుఎలా ఒప్పింది. అని నిష్ఠూరంగ చూసి తిరిగి ఇచ్చేసింది. అంతవరకు సహనంగా ఉన్న రామన్న చిరుకోపంతో చూసి అదో సంగీతం, రాత్రి తిన్నది భోజనం ఏదో సర్దుకున్నాను కనుక సరిపోయింది. ఇష్టముంటే తీసుకో లేకుంటే నీఇష్టం అని విశురుగా వెళ్ళిపోతుంటే ఉప్పయ్య అడ్డుకున్నాడు. అదేమిటి వేలుడంత లేవు. నీకు ఏమిటి తలతిరుగుడు. నా ఇల్లాలి చేతితో తిని నీఇష్టం వచ్చినట్టుకూస్తావా? అని నిలదీసాడు. అంతలోనే గంగాయమ్మ వీధిలోకి పరుగులు తీసింది. పెద్దగా ఏడ్వసాగింది. అక్కడ కొంతమంది ప్రజలు పోగయ్యారు.

"నా చేతితో తిని, నా సంగీతం విని వెక్కిరించిన ఈ ముదనష్టపోడిని వదలకూడదు. వీడికి కుందకు కట్టి కొట్టాలి. ఈ ఫిరంగిపురంలో న్యాయం లేదా? నా వంటి ఇల్లాలు ఇలా పరితపించడమేనా?" అని పెడబొబ్బలు పెట్టింది. "మేము ఉన్నాం. ఎక్కడ స్త్రీ హింసపడ్తుందో, ఎక్కడ స్త్రీ అపమాన పడ్తుందో అక్కడ ఈ గ్రామపెద్దలు ప్రత్యక్షమవుతారు. ఆ స్త్రీ కన్నీటిని తుడిచిగాని పోరు. చెప్పు గంగాయమ్మ ఎందుకు ఇంతగా తెల్లవారుజామున ఏడ్చుచున్నావు?" ఇద్దరు గ్రామపెద్దలు ఏకకంఠంతో అడిగారు.

ఈ కుర్రనాయాలు నా వంట కమ్మగా తిని అదో తిండా అని కారుకూతలు కూసినాడు. నా సంగీతం వినడానికి మీరంతా ఎంతగా పరితపిస్తారో నా బుద్ధిలేని తనంతో వీడికి వీనుల విందుగా వీణ వాయించి విన్పించాను. అదో సంగీతమా ఓనమాలు నీకు రావు అని గేలిచేసినాడు. నేను చేసిన తప్పిదం ఇంతాఅంతా కాదు. అందుకే ఇలా వీధినపడి ఏడుస్తున్నాను. ఇకనాకు చావే శరణ్యం, ఏ నుయ్యో గొయ్యో చూసుకుంటాను. ఇక నా పెనిమిటికి మీరే ఆలనాపాలనా చూసుకోండి. అసలే అసూయకుడు ఉప్పువ్యాపారంలో చాలానష్టపోతూనే ఉన్నాడు. ఎలా బతుకుతాడోనని భయంతో చావలేకపోతున్నాను. కానీ ఈరోజు ఈ గుంటడు చేసిన అవమానంకు చావక తప్పదు. మరి నన్ను ఎవరు అడ్డుకోవద్దు." తల బాదుకుంది. ఆమెను గ్రామపెద్దలు ఆపారు.

"ఎందుకు నువ్వు చచ్చిపోయి ఉప్పయ్యకు అన్యాయం చేస్తావు. నీ

సంగీతం విని ఇంతకాలం మేమంతా బతుకుతున్నాం. మాకు ఆ ఆనందం లేకుండా చేయకు. ఎవడో ఈ బుడుతడు వీడు మాటల్ని పట్టించుకోకు. మేము నీకు న్యాయం చేస్తాం.రేయ్‌కుర్రకుంకా ఎంతకు తెగించితివి.ఒక ఇల్లాలిని దుర్భాషలతో బాధిస్తావా? నీకు సరైన శిక్షవిధిస్తున్నాం. నిలువు దోపిడీ ఈ కుటుంబానికి సమర్పించుకుని ఒక వారం వీరి వద్ద రేవులో ఉప్పు మోత పనిచేసాక, ఆ తరువాత ఈ దంపతులు నిన్ను బానిసగా ఎవరికైనా అమ్ముకుంటే అక్కడ నీ బతుకు ఈడ్వవల్సిందే ఫో! ఇదే రా నీకు మేము విధించు శిక్ష అనుభవించు."

రామన్న తప్పని పరిస్థితిలో వెంటనే నిలువుదోపిడిగా మొత్తం సమర్పిం చాడు. ఫిరంగిపురంలో ఒక్కరు ఇది అన్యాయం అనేవాళ్లులేరు. అంతగా గ్రామపెద్దలు , ఉప్పయ్య, గంగాయమ్మలు ఇలా బాటసారులను నిలువునా దోపిడి చేసుకుంటున్నారు. ఒకవేళ సరిగ్గా చెల్లించలేని వారిని, ఎదురుతిరిగిన వారిని నిర్దయగా వారితలకు పెద్ద బండనుకట్టి నదిలోకి తోసేటంత క్రూరంగా ప్రవర్తించ సాగారు.అందుకే వారితో ఎలాంటి గొడవకు ఆ ఊరి ప్రజలు వెళ్లలేకపోయారు. ఏదో ఒక రోజు సుమంతాపురం రాజుగారి దృష్టిలో పడకపోరు అనే ఆశతో మిగిలారు.

రామన్న దేశాటనకు వెళ్లడానికి అవకాశం లేకుండా పోయింది. ఉప్పు బస్తాతోఉప్పయ్య వెంట ఏటి ఒడ్డుకు చేరాడు. అప్పుడు ఉప్పయ్య రామన్నకు ఈ వారంలో తనవద్ద వ్యాపారం చేయాలి కనుక తప్పక వ్యాపార మర్మాలు తెలుసుకోవాల్సిందేనని అందుకు ఏమి చేయాలో అనేది చెప్పాడు.మనం చేసేది ఉప్పును ఆ ఒడ్డున కొని ఈ ఒడ్డున ప్రజలకు అమ్ముకోవాలి. కానీ, అమ్మితే మనకి గంజినీళ్లుకూడా రావు.కనుక ఉప్పు ఇలా అంటే అలా కరిగిపోయే పూస ఉప్పును మనం బస్తా కొనుక్కుని వస్తాం నీలాంటి బాటసారిని ఎంపిక చేసుకోవాలి. వాడివద్ద ధనం లేదా బంగారం ఉండి తీరాలి.అడుక్కునే వెధవల్ని, గంజికి ఠికాణాలేని వారిని ఎంపిక చేయ కూడదు. వారి వలన మనకు ఏమీ కిట్టుబాటు కాదు.కనుక జాగ్రత్త వ్యవహరించాలి.తీరా ఎంపిక అయినవాడిని తీసుకుని మనం నీకు జరిగినట్టే ఉప్పుబస్తా నది మధ్యలో వాడిచేతికి ఇవ్వడం మనమే





గిరాటేసేయ్యడం ఆపైన లబోదిబో మనడం, మన ఏడుపు విని పరుగులు తీసుకుని మనగ్రామ పెద్దలు వస్తారు. వారు మన కన్నీరు తుడవడం ఆపైన మనకు దండిగా నష్టపరిహారం ఇప్పించడం జరిగిపోతుంది. ఇది మన ఉప్పు లాభం. ఎన్ని బస్తాలు ప్రజలకు అమ్ముకుంటే మన కడుపు, మన ఇల్లు నిండుతుంది." అని రామన్న భుజం తట్టాడు.

రామన్నకు తలగిర్రున తిరిగిపోయింది."ఇంత నీచంగా ఎందుకు బ్రతకాలి. ఇప్పటికి చాలా సంపాదించావు. ఇంకా ఎందుకు ఈ దిశలో సంపాధన మంచి మార్గం ఎంపిక చేసుకోవచ్చుకదా," అని అడిగాడు.

"ఏ వ్యాపారం ఇంత సజావుగా సాగదు. హాయిగా నీలాంటి బాట సారిని పట్టుకుంటే చాలా ఆర్జించవచ్చు. ఒక వారం పనిచేయించుకుని తరువాత బానిసగా ఎవరికి అమ్ముకున్నా చేతినిండా ధనమే"

"అయితే నన్ను అమ్మేస్తావా? నన్ను చూస్తే జాలిగా లేదా?"

"ఉండదు ఉంటే ఈ వ్యాపారంకు పనికిరాను.అలా అమ్మకపోతే రేపు మాపై రాజుగారికి ఫిర్యాదు చేయడని నమ్మకం ఏమిటి? అందుకే సముద్ర పడవ వాళ్లకు అమ్ముకుంటాం. దాంతో వాడు మరి ఈనేలను చూడడు. నేను ఒక్కడినే కాను. నా వెనుక ఉన్న గ్రామపెద్దలకు సరిసమాన వాటా ఇవ్వాలి. వారు ఈ వాటాల పంపకంలో ఒక్కపిసరు జాలిపడరు. ఇప్పటికి కొన్నివందలమంది బాటసారులను మోసం చేసాం. ఇదే మా వృత్తి. అదిగో ఎవడో బంగారుపిచ్చుక లాంటివాడు వస్తున్నాడు.నేను వాడిని నమ్మించి గొంతుకోస్తాను. నీవు నీ ఎరికలో ఎవడైనా దొరికితే నీవు లాభం చేకూర్చు నీకు మంచి భోజనం పడక ఏర్పాటు చేస్తాను లేకుంటే తిండితిప్పలు లేక ఈ ఏటి ఒడ్డున తొంగోవల్సిందే."హెచ్చరించి బస్తాతో అటుగా కదిలాడు. రామన్నకు అంతా అయోమయంగా ఉంది.

సరిగ్గా అప్పుడే సుమంతపుర పురాధీశుడు కృష్ణదేవవర్మ అతి తక్కువ మంది పరివారంతో ఋషితుల్యనది ఒడ్డుకు వచ్చాడు.ఒడ్డున ఉన్న వారిని రాజభటులు ఖాళీచేయమని పంపేస్తున్నారు. మరణించిన తల్లితండ్రులకు ఆ నది ఒడ్డున ఏడాది కర్మలు చేయడానికి రాజు వచ్చాడు. రామన్నకు ఆ రాజును చూడగానే ఒడలు గగుర్పాటు కల్గించింది."ఓ రాజాధిరాజా రాజమార్తండా సుమంతానగర ధీశా, విజయీభవా, దిగ్విజయీభవ, నీ

ఏలుబడిలో నా వంటి శాపగ్రస్థునికి మోక్షం ప్రసాదించవా! ఓ ఏలికా, రమ్ము నీవు చేయాల్సినది ఎంతో ఉంది. నీ రాజ్యంలో బాటసారులకు ఎలాంటి రక్షణ లేదు.పలువిధాలుగా కష్టాలు పాలవుచున్నారు. వారి ఇక్కట్లు నీకు కన్పించుటలేదా?ఒకసారి నామొర విని ఇటుకదిలిరా!"అని ఎలుగెత్తాడు ఒక్కసారి ఆ రాజు తలతిప్పి ఇటుగా చూసాడు. ముక్కుపచ్చ లారని రామన్నను చూసి ఒకింత ఆశ్చర్యానికి లోనయ్యాడు. ఆ వెంటనే రామన్నను సమీపించాడు."ఎవర్నువ్ ఇంతచక్కని వాక్పటిమను కనబరిచిన నిన్నుచూసి చాలా ఆశ్చర్యపడ్తున్నాను.నీకు గల శాపమేమిటి? చెప్పు నాయనా,"అని చిర్నవుతో అడిగాడు.

"ప్రభూ నేను ఆవల ఒడ్డుకు చేరాలి మీరు నాకు నదిలో దిగి తోడుగా రావాలి. మీ భటులను వినియోగించరాదు. ఈ ఋషితుల్యనది పేదవాడిని ఏడిపించడమే లక్ష్యంగా పెట్టుకుంది. కనుక కన్నులారా చూద్దురుగాని"అని చెప్పాడు. రాజు నది వైపు అదోలా చూసాడు. గలగలమని శబ్దం చేస్తూ పారుతోంది.పుణ్యనదిపై ఫిర్యాదు చేయుచున్న బాలుడు మంచి మాటకారిలా మాట్లాడుతున్నాడు.చాలా చిత్రంగా ఉందే. వాస్తవానికి ఋషితుల్యనది ఎంతో పవిత్రమైనది.చూడాలి ఏమి జరుగుతుందో అని లోపల తర్కించుకున్నాడు.

"నాయనా ఏమంటివి ఎంతో పూజ్యనీయమైన నదిగా గుర్తింపు పొందినది. ఈ నదికి ఎందుకు పేదలంటే కోపం? పేదలనే కాదు అందరిని అక్కున చేర్చుకుంటుంది. నీవు పొరపడితివి.ఇక్కడ ఎందరో శుభకర్మలు చేసుకుంటారు.ఇట్టి నదిలో మునకలు వేస్తే సర్వపాపాలు పోతాయి అని హిందూవులు నమ్ముతారు ఇప్పుడు నా తల్లితండ్రుల సంవత్సరకర్మలు చేయడానికి వచ్చాను." భుజంతట్టి రామన్నకు అర్థంఅయ్యేలా చెప్పాడు.

"రాజాధిరాజులయిన మీ నమ్మికను నేను కాదనను. దయతో నామొర విని నాతో ఒకసారి ఈ ఒడ్డునుంచి ఆ ఒడ్డువరకు తోడు రావాల్సిందిగా కోరుతున్నాను. కాదనకుండా అవశ్యం రాగలరు"

రాజు కృష్ణదేవవర్మ నవ్వి "సరే, నీమాట ఎందుకు కాదనాలి. నీ మాటలు నాకు నచ్చాయి.కనుకనే వస్తున్నాను అని తోడుగా నదిలోకి దిగాడు. ముందు రామన్న బస్తా భుజంకు ఎత్తుకుని మెల్లగా నడవ సాగాడు.





మధ్యలో వేగం పెరిగి నడవ వీలుకాని విధంగా ప్రవాహం ఉంది. అప్పుడు "ఓ రాజా ఈ బస్తాను దయచేసి ఒక్కసారి తమరే పట్టుకుని నాలుగు అడుగులు ముందుకువేయండి. ఆ తరువాత నేను నా బస్తాను తమవద్ద నుంచి తీసుకుంటాను." అని చెప్పాడు.

రాజు నవ్వి బస్తా అందుకున్నాడు. ఇదంతా ఒడ్డున ఉన్న రాజభటులు చూసి బిక్కముఖాలు వేసారు.అలాగే గ్రామపెద్దలు ఇద్దరు, ఉప్పయ్య చూసి గతుక్కుమన్నారు.వీడు రాజుచే బస్తా మోయిస్తున్నాడు.కొంపదీసి రాజుచేతిలో బస్తాను గిరాటేసి ఉప్పు కరిగి ఉత్త సంచి చేతికిచ్చావు అని రాజునే నష్టపరిహారం కోరతాడు కాబోలు. పూర్తిగా మనం రాజు చేతికి చిక్కిపోయేట్టున్నాం. ఏమిత్రా మన గతి బెంబేలు పడిపోసాగారు.

రాజు భారంగా అడుగులు వేస్తుంటే బలిష్టమైన రాజు చేతిలోబస్తాను రామన్న ఏవిధంగా నదిలోకి పడేట్టు చేయలేడు.తనకంత శక్తి లేదు. అందుకే ఇంద్రజాల విద్యతో బస్తాను జారిపోయినట్టు చేసాడు.రాజు బస్తా చేజారి పోవడం చూసి అదిరిపడి నదిలో ఈదుకుంటూ దాని వెనుకనే వెళ్లాడు. ఒడ్డును ఉన్న రాజభటులు రాజుకు ఏమయినా కాగలదు అని ఛడేల్‌మని గెంతారు. రామన్న బస్తాను ఇంద్రజాలవిద్యతో మరింత వేగంగా కొట్టుకుని పోయేట్టు చేసి ఉప్పును కరగదీయించి ఉత్త సంచి తేలినట్టుచేసాడు.

రాజు ఉత్తసంచి చేతికి చిక్కేసరికి అయోమయంగా చూసాడు. బస్తా ఇలా కరిగిపోయిందేమిటి అని దిగులుతో రామన్నను అడిగాడు.ఇందులో ఏముంది? కరిగిపోయింది.పక్కనే రాజభటులు సంచిని కిందమీద చూసి "ప్రభూ ఇందులో ఉప్పు ఉన్నందున కరిగిపోయింది." అని చెప్పారు.

రాజు ఇంకేదో చెప్పబోతుండగా "ఓరాజా నన్ను నిలువునా ముంచేసావు.ఎంత పాపానికి ఒడిగడితివి. నా యజమానిని ఆయన భార్యను నేను ఎలాపోషించగలను? ఇదేనా నీవు చేయు ఉపకారం. రాజువై ఉండి ఒక సామాన్యుని బస్తాను నాలుగడుగులు మోయకుంటివి.నాకు నష్టపరిహారం ఇక్కడ ఈ ఫిరంగిపురం గ్రామపెద్దలు ఏమి చెబితే ఆ విధంగా ఇప్పించాలి. లేకుంటే నేను ఈ నదిలో మునకవేసి మరణింతును."

రాజు అవాక్కయి విన్నాడు. రాజభటులు కోపంతో రామన్నపైకి వెళ్లారు. "ఏయ్ కుర్రకుంకా నీకుగాని ఏమైనా చాదస్తం ఉందా? మహా ప్రభువులను పట్టుకుని ఏకవచన సంబోధనే కాకుండా నీ ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నావు."

"మీరు ఆగండి నేను చెబుతాను. నాయనా నీవు నా చేతికి ఇచ్చిన తరువాత బస్తా చాలా బరువెక్కిపోయింది. అదిపడడంకూడా ఎవరో నాచేతి లోంచి లాక్కుని పడేసినట్టుగా అనిపించింది. బస్తా పడినవెంటనే మునకలు వేస్తుంది అది అలాకాకుండా లేనివేగంతో కదిలిపోయింది "అని చెప్పాడు.

"చాలించండి నాకు కావల్సింది నష్టపరిహారం. అదిగో గ్రామపెద్దలు, నా యజమాని ఉప్పయ్య, వారిని పిలిపించి న్యాయం ఇప్పించండి." రామన్న కోరాడు. ఆ ఒడ్డున ఉన్న ఆ ముగ్గురు గొంతుల్లో పచ్చి వెలక్కాయలు పడ్డట్టు అయ్యింది. రాజు కనుసైగలతో భటులు వారిని తీసుకుని వచ్చారు.

రామన్న గ్రామపెద్దలతో "అయ్యా నిన్న నాకు ఇచ్చిన తీర్పుఇప్పుడు ఇచ్చారంటే ఈ రాజువద్ద మంచి కంఠహారం ఉంది. వెలకట్టలేనిది అది మన వశమవుతుంది. అలాగే ఈ రాజును ఈ రాత్రి మా యజమాని ఇంట్లో బసచేయిస్తే ఉదయానికి నిలువు దోపిడీ చేసుకోవచ్చు. రేపట్నించి నాలాగే ఈ రాజు ఉప్పుబస్తాతో బాటసారులను మోసం చేయవచ్చు. దండిగా సంపాదించవచ్చు. వారం తరువాత బానిసగా మీరు ఎవరికైనా అమ్మేయ వచ్చు."

ఆ మాటలలో అంతర్యం గ్రహించిన రాజు అదిరిపడ్డాడు. మనసావాచా ఇబ్బంది పడ్డాడు. ఇక్కడ ఇంత దారుణానికి ఈ ముగ్గురు ఒడిగడ్తున్నారా? ఆ ముగ్గుర్ని నిలదీసి అడిగాడు. వారు చెప్పేలోగా చుట్టూ ఉన్న ఆగ్రామ వాసులు మొత్తం ఏకరువు పెట్టారు. వెంటనే గొలుసులతో బంధింపచేసి ఆ ముగ్గురిని పడవ ఎక్కించి సుమంతాపురానికి నదిదారి గుండా పంపారు. అక్కడ విచారణ చేసి శిక్షిస్తామని ఈలోగా ఇక్కడ అక్రమంగా గడించిన ఆస్థులను రాజబొక్కసంలో కలిపేస్తామని ఫిరంగిపుర ప్రజలకు రాజు చెప్పాడు. వారు సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఈ రాత్రికి ఉప్పయ్య ఇంట్లో బసచేయగలను అని చెప్పి ఆ ఒడ్డున తనపెద్దలకు





చేయాల్సిన ఏడాది కర్మలు నిర్వర్తించి ఉప్పయ్య ఇంటికి రాజుతన పరివారంతో వెళ్లాడు. ఆ వచ్చింది రాజులా ఉన్నాడు ఏమాదర్పం ఎలా ఇంత పెద్ద పిట్టను తనభర్త పట్టాడు అని గంగాయమ్మ సంబరపడిపోయింది.

ఆ చిన్నగ్రామంలో గంగాయమ్మకు రాజు తన పెనిమిటిని గ్రామ పెద్దలు ఇద్దరిని బంధించి తీసుకుపోయినట్టు తెలియదు. కారణం ఆమె గ్రామంలో ఎవరితో మాట్లాడదు. ఎవరితో ఆమెకు సరిపడదు. ఒకవేళ మాట్లాడిందా ఒక నెల రాసుకుని తిరుగుతుంది. తర్వాత నెలలో తలలు బద్దలు కొట్టుకునే తగవులు పడ్తుంది. ఇది ఆమె నైజం. అందుకే అంతా గంగాయమ్మలాంటి దుష్టులకు దూరంగా ఉండాలి అని అనుకునేవారు.

గంగాయమ్మకు రామన్న ముందుగా వెళ్లి "ఈరోజు ఒక చిన్న కొండ దేవరను పట్టుకున్నాం. ఈ రాత్రి వీరికి మన పద్ధతిలో బువ్వలు ఏర్పాటు చేసి, నీ సంగీతం విన్పించి నిద్రపుచ్చాక ఉదయాన్నే నిలువుదోపిడీ చేయాలి అని ఉప్పయ్య ఆదేశించాడు. అతడు రేపు ఉదయాన్నే వస్తానన్నాడు." నమ్మేట్టుచెప్పాడు.

"నాయనా, నీవు వచ్చినప్పట్నించి నాకు బంగారునగల గలగలలే. ఇంతమందికి నేను ఒక్కతనే వండి చావాలేను. ఈ మందకు సరిపడా వంటలు చేయడానికి ఆచెట్టుకింద ఉండే యాచకమ్మల్ని పిలుచుకుని వస్తాను. వారు అయితే, ఇంత తిండిపెడితే చాలు వండిపోస్తారు. పైగా ఏ దినుసులు లేకుండా కూరలు వండగలరు."చెప్పి పెరట్లోంచి చెట్టుకింద కూర్చున్న యాచకమ్మలను పిలుచుకుని వచ్చింది. వాళ్లు వచ్చిందే తడవు ఊపిరి సలపకుండా వంటల్లో మునిగారు.

రాజు తన పరివారంతో గదుల్లో సర్దుకున్నాడు. ఆ ఇల్లుచూసి అంతా మరోసారి అవాక్కయ్యారు. లోపలకి తీసుకుని వెళ్లి తన వీణతో అందర్ని ఆకట్టుకునే ప్రయత్నంచేసి నాసిరకం భోజనాలుపెట్టి నిద్రపోవడానికి అన్ని సదుపాయాలు చేసింది. ఉదయాన్నే తను చేసిన మర్యాదలకు తగు ధనం ఇమ్మని కోరింది. రాజు ఎంతో కొంత ఇవ్వగా కావాలని వాగ్వివాదాలకు దిగింది. ఏడుపులు లంకించుకుని వీధిలోకి పోయి గగ్గోలుగా ఏడవడం చేసింది. అటుఇటుచూసింది. కొన్నివందల మంది అక్కడ గుమిగూడారు.

ఎంత ఏడుస్తున్నా గ్రామపెద్దలు రారైరి. ఉప్పయ్య కనిపించలేదు. ఏడ్చేఓపిక ఆమెలో లోపించింది. ఆమెకు అక్కడపరిస్థితి ఎందుకో అనుమానం కల్గించింది. రామన్నను పిలిచి నాయనా ఇదేమిటి ఎప్పుడు లేనంతగా మనింటి ముందు ఇంతమంది అమ్మలక్కలు చేరారు. అంతా నవ్వుతున్నారు. నా పెనిమిటి గ్రామపెద్దలు కన్పించరైరి. ఏదో జరుగుతోంది. నీకు ఏమైనా తెలుసా?"లోగొంతుతో అడిగింది.

"తెలుసు. ఈయన సుమంతాపురరాజు కృష్ణదేవవర్మ. నిన్న ఉప్పయ్యను గ్రామపెద్దలు ఇద్దరిని చెరసాలకు పంపారు. ఈరోజు అక్రమంగా సంపాదించినదంతా కలిపేసుకోనున్నారు. నిన్ను బందించి తీసుకుపోతారు. ఈ విషయం ఈ గ్రామంలో ఎవరితో మాట్లాడని నీ అహంకారం, నీ వెర్రితనం వలన నీకు తెలియలేదు. గ్రామస్తులకు తెలుసు. అందుకే అంతా చేరి చూస్తున్నారు."మరింత లోగొంతుతో ఆమెకు మాత్రమే వినపడేట్టు చెప్పాడు. ఆమాటలు గంగాయమ్మకు భయం గొలిపాయి. తలదించుకుని భోరున ఏడ్వసాగింది. భటులు ఆమె చేతికి గొలుసులు బిగించారు. ఆ గ్రామస్థులు చాలా ఆనందించారు.

రాజు రామన్నను అడిగాడు "నాయనా నీవెవరవు? ఇక్కడకి చాలా సారులు వస్తుంటాను, నాకు ఎవరూ చెప్పలేకపోయారు. బహుశా వారు భయపడి ఉంటారు. నీవు చాలా తెలివిగా సాక్ష్యాధారాలతో చూపావు. కనుక నిన్ను ప్రత్యేకంగా అభినందిస్తున్నాను." అని చెప్పాడు.

"ప్రభూ నేను మర్యాదరామన్నను. కళింగరాజ్యం నుంచి వచ్చు చున్నాను."

కృష్ణదేవవర్మ ఆశ్చర్యంగా చూసాడు. "వెతకపోయిన తీగలా ఉంది. నేను కబురంపాలనుకున్నాను. నీవే వచ్చావు. నీ గురించి చాలా విన్నాను. ఇదే నా ఆహ్వానం నా కోటకు విచ్చేసి నా ఆతిథ్యం స్వీకరించి మమ్మల్ని ఆనందింపచేయాలి అని ఆశిస్తున్నాను." అని కోరాడు.

అంతా అక్కణ్నించి బయల్దేరారు. ఫిరంగిపురవాసులు రామన్నను కొనియాడారు. వారందిరికి రామన్న చేతులు జోడించి సెలవు తీసుకున్నాడు.





# మెడలో రుద్రాక్షలు

సుమంతాపురంలో ఒక విడిదిలో రామన్న ప్రయాణపు బడలికతో హాయిగా నిద్రపోయాడు. తరువాత నిద్రలేవగానే అతడి భవనం ఎదురుగా అందమైన తోటలోకి చూస్తూ కొంతసేపు గడిపాడు. అక్కడ భయంకరమైన దృశ్యం ఎదురుపడింది. ఒక యోగిని పట్టుకుని రాజభటులు చావగొడ్తున్నారు. ఎందుకో రామన్న అటుగా పరుగెత్తినట్టుగా వెళ్లి "ఎందుకలా దండిస్తున్నారు. ఇవేం దెబ్బలు ఇలా చచ్చేట్టుగా కొడ్తున్నారు." ప్రశ్నించాడు. భటులు చెప్పేలోగా ఆ యోగి విలవిలలాడుతూ అయ్యా ఈ సుమంతాపురంలో నన్నుఎందుకు కొడ్తున్నారని నిలదీసిన తొలివ్యక్తివి. ఆ నోటితో వీరిని నన్ను చంపేయమని చెప్పండి. నేను నిత్యం ఈ దెబ్బలను భరించలేను. నాకా శక్తి నశించిపోయింది." ప్రాధేయపడ్డాడు. రాజభటులు ఆ యోగిని గొలుసులతో మరింతగా చుట్టేసి ఈడ్చుకుపోసాగారు. అందులో ఒక భటుడు నోరువిప్పాడు. "వీడు దొంగసన్యాసి రాజుగారి చెల్లెల్ని వలవేసి పట్టాలనుకున్నాడు. పాపం పండింది రాజుగారికి దొరికిపోయాడు. చచ్చేవరకు ఈ శిక్ష వీడికి తప్పదు. వీడికి నరకం ఏమిటో చూపిస్తున్నాం."

"భటులారా ఆగండి. మీరు శిక్షించవచ్చు. కానీ, ఇలా ఈతోటలో అమలు చేయడం, నా వంటి వారికి విడిదిగా భవనం ఇచ్చి ఇక్కడ నాకు భయాన్ని గొలిపేలా చిత్రహింసలు పాలుచేయడం ఏపాటి న్యాయం. చాలా తప్పుగా ప్రవర్తించారు. ఇది రాజాజ్ఞలా లేదే." నిలదీసినట్టు అడిగాడు.

భటులు ఆగారు. "అయ్యా మీరు రాజుగారి అతిథి. కనుక ఓపికగా చెబుతున్నాం. వీడు అలనాడు అర్జునుడులా ఈపూదోటలో మునిలా ప్రవర్తించాడు. వీడిసేవలకు రాజుగారి చెల్లెలు వచ్చేది. ఆమెను వీడు వలలో వేసుకున్నాడు. ఇదంతా పసిగట్టి రాజుగారికి కొందరు భటులు చెప్పేసారు. వీడిని చావచితకతన్ని ఇలా శిక్షిస్తున్నారు. రాజుగారిచెల్లెల్ని కూడా ఒక పంజరంలో బంధించినట్టు బంధించారు. ఇది ఇక్కడ ఈ ప్రేమికుల కథ. మీలాంటి వారు చూస్తే సుమంతాపురంలో రాజుగారు స్వంత చెల్లెలకు.





తప్పుచేస్తే శిక్షిస్తారని తెలియచేయడమే ఈరోజు వీడిని ఈ పూలతోటలోకి తీసుకువచ్చి చావకచితకతన్నడం" అని తెలిపారు.

"అయ్యా మీరు రాజుగారికి చెప్పి నాకీ శిక్షనుంచి తప్పించండి. నేను మరి దెబ్బలకు ఓర్వలేకపోతున్నాను. నా ప్రాణములు నిలువకుండా ఉన్నాయి." అని భోరున ఏడ్చాడు. "భటులారా కొంతసేపు నా యందు దయ వుంచి ఈ అభాగ్యునితో నన్ను మాట్లాడనీయండి. పాపం ఎంతగా బాధపడుతున్నాడో చూసారా? నీవు నిజంగా యోగివా? కావా?"

"అయ్యా నాపేరు ఇంద్రసేనుడు. నేను రాజుగారి చెల్లెలు రత్నాంగిని చూసి మోహించితిని. ఎందరు చెప్పినా విననందుకు ప్రత్యక్ష నరకం అనుభవించుచున్నాను. అర్ధరాత్రి రాజే స్వయంగా వచ్చి కొరడాలతో చావగొట్టిపోతున్నాడు. నన్ను ఒక్కసారిగా చంపేయమన్నాను. కానీ, వినిపించుకోరు. ఎంతగా కత్తివేటు లాంటి నొప్పిని అనుభవిస్తున్నాను. నేను రత్నాంగిని ఒకసారి రాజసౌధవంలో చూసాను. ఆమె అందం నాకెంతో నచ్చినది. నేను ఎలాగైనా ఆమెతో మాట్లాడాలని బలీయమైన కోరికతో ఒక మంత్రగాని వద్ద ఒక విద్య నేర్చితిని. నేను చిన్నపాటి మహిమలు చూపాను. దాంతో నేను గడ్డం మీసాలు పెంచి యోగిలా వేషం వేసుకుని రాజువద్దకు పోయి హిమాలయాల నుంచి వచ్చితిని. నాకు కొన్నాళ్లు మీ తోటలో జీవించుటకు అవకాశం కల్పించకోరితిని. కానీ, నాకు ప్రజలు చూడడానికి ఎట్టి పరిస్థితిలో వీలు కల్పించరాదు. ఎవరైనా క్షత్రియ కన్యను నా దేవుని పూజల కోసం ఏర్పాటు చేయవల్సిందిగా కోరితిని. అందుకు ఆ కన్యకు మంచి వరుడు రాగలడు. ఆమె వేయిశుభాలు కలుగగలవు అని చెప్పితిని. చిన్నపాటి మహిమలు చూపాను. దుర్భినిలో శత్రురాజు ఏమిచేస్తున్నాడో చూపితిని. నా మాటలను విశ్వసించి రాజు తోటలో నా గురించి చిన్న ఆశ్రమం నిర్మించి ఇచ్చాడు. నా సేవలకు అయన చెల్లెలను పెట్టాడు. నేను ఆమెను దగ్గరనుంచి చూసి మరింత ముచ్చటపడితిని. ఆమెకు కొద్దిరోజులలో విషయం చెప్పాను. ఆమె భయపడినా, నా ప్రేమను అంగీకరించినది. అయితే నేను నేర్చుకున్న మంత్రవిద్య నెలరోజులతో నా నుంచి దూరమైపోతుంది అని ఆ మంత్రగాడు చెప్పనే చెప్పాడు. ఒకరోజు

రాజువచ్చి తన శత్రురాజు ఈరోజు దినచర్య నాకు దుర్భినిలో చూపుమని కోరాడు. నేను నాకు ఆవిద్య దూరమై పోయిందని తెలియక సంచిలోంచి దుర్భినిని తీసిచూపాను. ఎంతకి కన్పించలేదు.దాంతో రాజుకు నామీద అనుమానంవచ్చి వెంటనే దాసీలను నిలదీసాడు. వారు భయంతో మా ప్రేమవ్యవహారం చెప్పేసారు. అంతే రాజు మా ఇద్దరిని నూరుకొరడాదెబ్బల శిక్ష వేసాడు. ఇద్దరు కాళ్లమీద పడ్డాం. ఇద్దరిలో ఒక్కరమే మొత్తం శిక్షను అనుభవించడానికి ఒకరికోసం ఒకరు త్యాగం చేసుకుని సిద్ధపడ్డాం. దాంతో రాజు మరింత కుపితుడై ఇద్దరిని మరింత తీవ్రంగా శిక్షించాలనుకున్నాడు. ఫలితంగా ప్రతిదినం నాకు యాభై కొరడా దెబ్బలు ఆమెకు ఒక పంజరంలో పెట్టి వేడినీళ్లతో పిచికారి చేయడం ఆమె ఆక్రందనలు విని నా మనస్సు ముక్కలయి పోయింది." వెక్కి వెక్కి ఏడ్చి చెప్పాడు.

"రాజు తన చెల్లెలను నీకు ఇవ్వాలంటే నీకు కావల్సిన అర్హతలు ఏమిటి? ఆయనకు ఏమి కావాలో నాకు చెప్పు. నా వంతు నీ గురించి రాజుతో సంప్రదిస్తాను."

"నేను రాజును కావాలి. అది ఈ జన్మలో జరుగదు. నాకు పేద తల్లి ఉన్నది ఒకే ఒక గుడిశె మాత్రమే మిగిలింది. తలకింద పెట్టి తపస్సు చేసినా నేను రాజును కాలేను. నా గుడిశెను కోటగా తీర్చిదిద్దలేను.కనుక రోజు చావబాదుతున్న ఈ దెబ్బలకు నా ప్రాణం పోవడం ఖాయం అయితే నా ప్రేమచావకూడదు. నన్నునమ్మి పాపం ప్రతిదినం నరకం అనుభవిస్తున్న రత్నాంగిని కాపాడండి. ఆమె అతి సుకుమారంగా పుట్టిపెరిగింది. నా ప్రేమ వలన చాలా కష్టాలు పడ్తోంది. కనుక ఆమె రక్షించబడాలి. ఇదే నా కోరిక" రామన్న కాళ్లు పట్టుకున్నాడు.

"భయపడకు,నీవు నేర్చిన విద్యనీకు ఆ మంత్రగాడు పూర్తిగా నేర్పలేక పోయాడు.నీవు నీ ప్రేమమైకంలో పడి పొరపాటున రాజుకు దొరికిపోతివి. ఏదో జరిగిపోయినది.నిన్ను నేను సభకు రప్పించగలను. ఈరోజుతో నీకు ఈ శిక్షలుండవు. నన్ను నమ్ము, నిశ్చింతగా ఉండు నీవు ఇప్పుడు పడ్తున్న శారీరక హింసను క్షణాల్లో తగ్గించగలను."అని చేత్తో ఇంద్రసేనుని శరీరమంతా తడిమాడు.అతడు అంతులేని ఆశ్చర్యానికి లోనయ్యాడు.





మరింతగా రామన్నపాదాలు చుట్టుకుని రత్నాంగిని కూడా ఎలాంటి శారీరక నొప్పిలేకుండా చేయమనికోరాడు.

భటులు నోటమాటరాకుండా చూస్తూ "అయ్యా మీలో ఏశక్తి లేకుంటే రాజుగారికి అతిధి ఎలా అవుతారు. మీరు ఇంత గొప్పవాళ్లా? క్షమించండి. మీలోఉన్న శక్తితో మమ్మల్ని ఏమి చేయవద్దు." భయపడ్తునే కోరారు.

రామన్న వారిని పంపించి సభకు వెళ్లాడు. రాజు కృష్ణదేవవర్మ రామన్నను అక్కడి వారందరికి పరిచయం చేసాడు. అంతా పెద్దకళ్లుచేసుకుని చూసారు. చాలా ఆనందించారు. ఇటీవల రామన్న తీర్పులు గురించి విన్నాం ప్రత్యక్షంగా చూడాలనుకున్నాం. ఇక్కడకే వచ్చాడు అని రామన్నను అభినందించారు. ఫిరంగిపురంలో బాటసారులను దోచుకునే ఉప్పయ్య దంపతులను ఆ ఊరి గ్రామపెద్దలను గొలుసులతో బంధించి తీసుకుని వచ్చారు. ఉప్పయ్య పెద్దగా రోధించాడు. "అయ్యా పెద్దమనస్సుతో నన్ను విడిచిపెట్టేయ్యండి నా తప్పుకు నేను గడించినదంతా మీరు తీసుకున్నారు. ఇంతకంటే పెద్ద శిక్ష ఏమి ఉంటుంది ప్రభూ! దూరంగా వెళ్లి బతుకుతాం." రాజు కాళ్లా వేళ్లాపడ్డాడు. రాజు నవ్వి "రామన్న నీవు చెప్పు.నీవు వీరికి ప్రత్యక్షబాధితుడవు. కనుక నీవు సరైన తీర్పు చెప్పాలి. వీరి కథ విన్నవారంతా వీరిని మరణదండన విధించమని కోరుతున్నారు. నేను అలానే చేద్దామను కుంటున్నాను. ఇలాంటివారికి శిక్షలు ఎంత తీవ్రంగా ఉంటే రానున్న కాలంలో ఇలాంటి మోసాలు బాగా తగ్గుముఖం పడతాయి. ప్రజలు గుండెల మీద చేతులు వేసుకుని హాయిగా నిద్రపోతారు. లేకుంటే వీడిలాంటివారు చాలామంది పుడతారు."

సభలో ఒక్కటే ఉత్కంఠ నెలకొంది. రామన్న తీర్పు అంటే ఆనోట ఈనోట వినడమే ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నారు. రామన్న లేచి రాజుకు సభకు నమస్కరించి "నామీద మీరంతా పెట్టుకున్న నమ్మకం నాకు ఆనందాన్నిచ్చింది. కానీ, నేను ఇచ్చే తీర్పు మీకు నచ్చకపోతే నన్నుమన్నిం చండి. ఇక్కడ బాటసారులను దోచుకునే ఈ నలుగురి ఆస్తులను ఖజానాకు తరలింపబడినాయి. అంటే వీరు ఈక్షణం నిరుపేదలుగా మన ముందు న్నారు. ఈశిక్ష మరణదండనతో సమానం. ఇక వీరు ఏ ముఖంపెట్టుకుని

ఫిరంగిపురంలో జీవించగలరు. వీరికి వలసపోవడమే ఒక్కటే మార్గం. ఎక్కడ ఇలా ఉప్పుతో నదిలో వ్యాపారం కుదరదు. వీరి ఆటలు సాగవు. ఋషితుల్య నది ఒడ్డున చాలాకాలంగా జరుగుతున్న బాటసారుల దోపిడి రాజుగారికి వేగులవారి వలన తెలియకపోవడం ఘోరం. ఇందులో ఆ గ్రామస్తులు కూడా చూసిచూడనట్లు ఊరుకున్నారు వారు ఇలాంటివి ప్రోత్సహించినట్టే కర్మకాండలకు ఇతరత్రా పూజలకు ఆ నది ఒడ్డులో రోజంతా ఉండే రాజుకు తెలియకపోవడం చాలా అన్యాయం. ఇందులో రాజుగారి అసమర్ధత ఉంది. ఇలాంటి అసమర్ధత వీరికి ఇతర రాజ్యాలలో కుదరదు. కనుక వీరిని ఇతరత్రా ఏవిధమైన శిక్ష విధించకుండా నగరం దాటించి వదిలేయడమే."

రామన్న మాటలకు సభ విస్తుపోయింది. రాజు తలపంకించి "రామన్న నీవు చెప్పినది నిజమే. బాగా చెప్పావు. ఇందులో నా అసమర్ధత ఉంది. నీవన్నట్లు వీరిని ఇతరత్రా శిక్షించనవసరం లేదు. నగరం నుంచి తరిమేయడమే" అని చప్పట్లు చరిచి అభినందించాడు. ఉప్పయ్య రామన్న కాళ్లమీదపడి మాకు ప్రాణభిక్ష పెట్టావు. జన్మజన్మలకు నీ మేలు మరిచిపోము అని తన ఆనందాన్ని వ్యక్తంచేసాడు. రాజునోటివెంట మరణదండన మాట రాగానే తెలివితప్పిపడిపోయింది గంగాయమ్మ. గ్రామపెద్దలు కుళ్లికుళ్లి ఏడ్చారు. ఇప్పుడు తేరుకున్నారు. క్షణాల్లో రాజభటులు నలుగురిని తీసుకుని బయల్దేరారు.

రామన్న నవ్వి "ప్రభూ మీ ఏలుబడిలో ప్రజలు సుఖంగా ఉన్నారని తెలుస్తోంది. కానీ, మీరు తెల్లనివన్నీ పాలు, నల్లనివన్నీ నీళ్లు అనుకునే మనస్సుతో ఉన్నారు. దానినుంచి మీరు బయటపడాలి. లేకుంటే చాలా ప్రమాదం." చెప్పి రాజు ముఖంలోకి చూసాడు. రాజు అర్ధంకాక చూసాడు.

"ప్రభూ, ఇప్పుడు చూస్తారు. మీకు నేను అనే మాటలు ఒకటికి రెండు సార్లు మననం చేసుకోండి. అదిగో వస్తున్నారు."

"రాజాధిరాజా, రాజమార్తండా, కీర్తియశోచంద్రా పాటలీనగర రాజు పంపగా విచ్చేసితిమి. మా రాక కారణం మీ వద్ద బంధిగా ఉన్న యోగిగా ఉన్న ఇంద్రసేనుని గురించి వచ్చాం. అతడికి మా రాజుగారు తన కూతురుని ఇచ్చి వివాహం జరిపించనున్నారు. అతడి విడుదలకై తమకు అభ్యర్ధిస్తూ





వచ్చాం.ఎంత త్వరగా పంపితే అంత త్వరగా పాటలీ చేరుకోగలం." అని తెలిపారు పాటలీపుర జ్యోతీష్యులు.

వారిని కూర్చుండబెట్టి రాజు అర్థంకానట్లుగా చూసాడు. "ఏమి నా వద్ద నిత్యం చావుదెబ్బలు తినేవాడికి మీరాజు తన కూతురుని ఇచ్చి పెండ్లిచేస్తాడా? వాడిలో ఏముంది? ఒక గుణమా? ఒక విద్యా? అతడో నిరక్షర కుక్షి.పొరపాటున వాడిపేరు చెప్పి ఉంటారేమో చూసుకోండి. ఒక వేళ వాడే అయినా వాడిని విడుచుట అసంభవం.వాడు మా రాణీవాస స్త్రీలను మోసం చేసాడు. అందుకు వాడికి చచ్చువరకు చావు దెబ్బలు శిక్ష విధించాం. కనుక మీరు తిరిగివెళ్లి పోవచ్చు." ఖరాఖండిగా తేల్చి చెప్పాడు.

"ఓరాజా! మా రాజు వెర్రివాడు కాడు. ఒక కపటయోగికి పిల్లనిచ్చు వాడు అంతకంటే కాడు.కానీ, ఈరోజు అమావాశ్య. అతడికి అనేక విద్యలు వచ్చు మండలదినాలు(40 రోజులు) అతడికి దూరమైపోయి తిరిగి ఈరోజు నుంచి సంప్రాప్తం కానున్నాయి. అతడికి మీరు శిక్షించినా ఆ శిక్షలు అతడి శరీరాన్ని బాధించవు.అవలీలగా బయటపడగలడు.తలచుకుంటే పలు రాజ్యాలను కబళించి చక్రవర్తి కాగలడు.అందుకే మా రాజు తన కూతురు నిచ్చి పెండ్లి జరపాలనుకుంటున్నాడు.ఈరోజు అతడిని మీభటులు చెమ్మడాలు ఒలిచి ఉంటారు. ఈ సభకు రప్పించి పరీక్షించండి." నమ్మకంగా చెప్పారు.

రాజు వెంటనే ఇంద్రసేనుడ్ని రప్పించి చూసాడు. చాలా తేలిగ్గా ఉన్నాడు. కొరడాతో తీవ్రంగా సభలోనే కొట్టిచూసాడు. ఇంద్రసేనుడు కనీసం వీసమెత్తు బాధపడలేదు.రాజు కృష్ణదేవవర్మ ఆలోచనలో పడ్డాడు. ఇట్టి విద్యలు కలవాడ్ని పొరుగు రాజు తనవద్దనుంచి విడిపించుకునిపోయి పిల్లనిస్తానంటున్నాడు. అక్కడ తాను ఇటీవల నెలరోజులుగా పెట్టిన చిత్రహింసలు గురించి చెప్పి ఆ రాజుతో దండెత్తి రాగలడు. కనుక తెలివిగా తను వ్యవహరించాలి అనుకుని "మీ రాజు పిల్లనివ్వడమేమిటి? ఈతడు నా చెల్లెలు రత్నాంగిని ప్రేమించాడు. కనుక ఈతనికి నా చెల్లెలు రత్నాంగినిచ్చి పెండ్లి జరిపిస్తాను.ఆ తరువాత ఈ ఇంద్రసేనుడు ఇష్టం.మీ రాజు





కూతురుని చేసుకున్నా నాకు ఎలాంటి అభ్యంతరం లేదు."స్వయంగా ఇంద్రసేనునికి గొలుసులు విప్పదీసి గాఢంగా కౌగిలించుకున్నాడు. వెంటనే వైభవంగా ఆరోజు రాత్రి రత్నాంగిని నిచ్చి పెండ్లి చేసాడు.ఆమె చాలా హింసలు పడినందున చాలానీరసించిపోయింది.రామన్న కొన్ని లేపనాలతో ఆమెకు ఉపశమనం కల్పించాడు.

ఇదంతా మూడురోజులుపాటు సాగింది. రాజు విడిదిలో రామన్నను కలుసుకుని "రామన్నా ఆరోజు సభలో నీవు ఒకమాట అన్నావు. నేను ఆలోచిస్తుండగా పాటలీనగర జ్యోతిష్యులు రావడంతో ఏదేదో జరిగి పోయింది. ఆరోజు నీమాటలు గుర్తుతెచ్చుకో! ప్రభూ మీ ఏలుబడిలో ప్రజలు సుఖంగా ఉన్నారని తెలుస్తోంది. కానీ, మీరు తెల్లనివన్నీ పాలు, నల్లనివన్నీ నీళ్లు అనుకునే మనస్సుతో ఉన్నారు.దానినుంచి మీరు బయటపడాలి. లేకుంటే చాలాప్రమాదం.చెప్పుడు మాటలు అనర్థదాయకం అని అన్నావు. అందులో నా గురించి అంతటి మాటలను వాడావు. కనుక నాతో అలా ఎందుకు అన్నావు?" అన్నాడు రాజు.

"ప్రభూ నేను అన్నదానిలో తప్పుఏమి లేదు. ఎందుకంటే, మీరు ఎవరు ఏమి చెబితే అదే వినేస్తున్నారు. ఆరోజు నేను ఋషితుల్యనది ఒడ్డున పిలిస్తే నా వెంట వచ్చారు. నేను మీకు పట్టించిన ఉప్పయ్యను అంతకు ముందు మీరు ఎన్నో మారులు వచ్చి కూడా వాడిని పట్టించు కోలేదు. మీకు అంటూ ఒక పరిశోధనలేదు. దీని వలన పాలకుడిగా మీరు రాణించలేరు.అలాగే మీవద్దకు యోగిగా వచ్చిన ఇంద్రసేనుడు చూపిన దుర్భినిలో మీ పొరుగు శత్రు రాజును చూసి ఆ కపటయోగి నిజమైన మహిమలు గలవాడని భ్రమించి తోటలో పెట్టుకుని మీ చెల్లెలను అతడి సేవలకు పంపారు.తీరా మరోసారి దుర్భిణిలో చూపమంటే చూపనందున అతడి గురించి ఆరాతీసి తీవ్రమైన శిక్షలకు గురిచేసారు.చివరికి మీ చెల్లెలను కూడా మరింత క్రూరమైన శిక్షలకు గురి చేసారు.ఇందులో స్వజనానికి ఇంతగా శిక్షించడం మిమ్మల్నే చూసాను. అందుకే అలా అన్నాను.చివరిలో కూడా ఇంద్రసేనుడు విషయంలో మళ్లీ మీరు తొందరపడ్డారు. మీ చెల్లెలను

ఇచ్చి పెండ్లిచేసారు. మీకు కన్పించిన నిజం మీకు చాలానమ్మకాన్ని కల్గిస్తుంది. ఆ వచ్చినది పొరుగురాజు జ్యోతిష్యులు అని నమ్మకం ఏమిటి? ఇలా ఎప్పుడు ఏ సందర్భంలో కూడా జ్యోతిష్యులు రారు కదా, ఇక్కడ మీరు ఇలా ఆలోచించ కుండా మరోలా ఆలోచించారు. ఇంద్రసేనుడుని రప్పించి అతడికి కొరడాతో కొట్టి పరీక్షించి అతడికి ఏవో మంత్రతంత్ర విద్యలు వచ్చు అని మీకుగా మీరే నిర్ణయించేసి మీ చెల్లెలను ఇచ్చి పెండ్లిచేసారు. ఇదంతా ఒక ఏలికకు ఉండాల్సినది కాదు. ఆరోజు నా ముందే ఇంద్ర సేనుడు చిత్రహింసలు పాలుకావడం చూసి జాలిపడ్డాను. అతడికి అభయం ఇచ్చాను. ఎలాగైనా రక్షిస్తాను. ఆ ప్రకారమే అతడిని రక్షించాను. మీరు మీ ఏలుబడిలో ఎవరినైన శిక్షించగలరు. కానీ, ఆ శిక్షలను మీ అతిధుల ముందు ప్రదర్శించడం చాలా పెద్దతప్పు. అది మీరు ప్రచారం అనుకున్నారు. దీనివలన నేరాలు అదుపులోకి వస్తాయి అని భావించి ఉండవచ్చు. చూసారా నేను ఇంద్రసేనుడికి నా వంతు సాయం చేసి ఇరువురు ప్రేమికులను ఒక్కటి చేసాను. నా స్థానంలో వేరే వారుంటే మరోలా అనుకునే వారు. ఈరాజు తన చెల్లెలను ఇంతగా హింసిస్తున్నాడే మిటా బాధపడేవారు. పుర్రెకోబుద్ధి మీ ఆలోచనలు ఇలా ఉన్నాయి. సూటిగా మీ తప్పులను చెప్పినందున నన్ను మన్నించండి." రామన్న గుక్కతిప్పకుండా చెప్పాడు. రాజు ఆమాటలు విని ఆలోచనలో పడ్డాడు.

ఇంద్రసేనుడిని తనవద్దకు రప్పించాడు. అతడు తనభార్యతో సహ భయంగా వచ్చినిలబడ్డాడు. "నీకు ఎలాంటి విద్యలు తెలుసో, నాకు తెలియ చేయ్." కటువుగా ముక్కుసూటిగా అడిగాడు. అతడు అయోమయంగా చూసాడు. పక్కనే ఉన్న చెల్లెలు రత్నాంగి "అన్నా మళ్లీ మొదటికి వచ్చి మమ్మల్ని వేరు చేసి శిక్షించకు. ఒకవేళ అలా జరిగితే రోజూ హింసించే బదులు ఒక్కసారి నన్ను హతమార్చు" అని పాదాలను పట్టుకుంది.

రాజు ముఖంలో ఎలాంటి భావాలు లేవు. తీక్షణంగా చూస్తూ "నేను అడిగిన దానికి నీ నుంచి సరైన జవాబు కావాలి." రెట్టించాడు.

"మన్నించాలి. నేను లోగడ ఒక మంత్రగాడివద్ద ఒకనెలవరకు నాకు వశమైన విద్య అదే దుర్భినిలో ఎవరినైనా చూడవచ్చు. ఆ నెలలో మీకు





చూపగలిగాను. కానీ, తరువాత చూపలేకపోయాను. ఇప్పుడు నాకు ఎలాంటి విద్యలు రావు. పొరుగురాజు నుంచి వచ్చిన జ్యోతిష్యులు కూడా కన్పించ లేదు. ఇదేదో చిత్రంగా ఉంది. తప్పితే, ఎలా ఇదంతా జరిగిందో తెలియదు."

రాజు తలపట్టుకున్నాడు. ఇద్దరిని కోపంగా చూసాడు. "రత్నాంగి అల్లారుముద్దుగా పెంచాను. నీకు నా వంటి రాజుకిచ్చి చేయాలనుకున్నాను. ఏమీ రాని ఈనీచున్ని చేసుకుని నీ జీవితాన్ని నీవే బుగ్గిపాలు చేసుకున్నావు. వీడు మనల్ని రెండోసారి మోసం చేసాడు. వీడిని ప్రాణాలతో వదలరాదు." అని కత్తి దూసాడు. అప్పుడు రత్నాంగి అన్న కాళ్లమీదపడి "మమ్మల్ని విడిచిపెట్టు ఎక్కడికైనా నీకు కన్పించనంత దూరంగాపోయి మా బ్రతుకు మేము బ్రతుకుతాం. నా భర్తను వధించవద్దు. ఒక వేళ చంపాలనుకుంటే నన్నువధించి తర్వాత నా భర్తను వధించు"

మరోవైపు ఇంద్రసేనుడు రామన్నను ప్రాధేయపడ్డాడు. "అయ్యా మీ కారణంగానే నేను, నా రత్నాంగి ఆ ఘోరశిక్షలనుంచి బయటపడ్డాం. నాయందు దయుంచి మాకు మరోసారి రాజాగ్రహానికి గురికాకుండా రక్షించండి."

రాజు రామన్నవైపు కూడా అదోలా చూసాడు. ఆ వెంటనే పొరుగు రాజునుంచి వచ్చిన జ్యోతిష్యులను వెంటనే తీసుకురమ్మని భటులను పంపాడు. వారు వెళ్లి వచ్చారు. ఆ జ్యోతిష్యులు విడిదిలో లేరు అని చెప్పారు. "ఏమిటి దంతా, అగమ్యంగా ఉంది. నా వేలుతో నా కన్ను పొడిచినట్లు చేసారు. ఈ బుడుతడు రామన్న వచ్చాక ఈ అనర్ధాలు జరిగాయి. రామన్న ఏమిటి దంతా?" అని కోపంగా అడిగాడు.

"ప్రభూ ప్రశాంతంగా ఉండండి. నేను మీకు మీ మనస్సులో ఏర్పడ్డ బాధను తొలగించగలను. ఈ మూడురోజులు జరిగినదంతా నాచే చేయబడిన ఇంద్రజాల మహేంద్రజాలవిద్య ప్రభావం. ఆ వచ్చిన జ్యోతిష్యులు చెప్పినది మీరుతప్ప వేరేఎవ్వరు వినలేదు. కావాలంటే మీ సభలోనివారిని అడగండి. మీరు భ్రమలో పడ్డట్టుచేసి ఈ ఇరువురిని కలిపాను. మీరు ఆశించిన విద్యలు ఈ ఇంద్రసేనునికి రావు అని తెలిసిన వెంటనే కొత్త

దంపతులపై మీ[వ్రే]టు వేయాలని మరల చూస్తున్నారు. మీకా పాపం ఎందుకు నాకు వచ్చిన విద్యలు ఈ ఇంద్రసేనునికి ధారపోయగలను. కనుక మీరు నిశ్చింతంగా ఉండండి." రాజు మనస్సును చల్లబరచి వెంటనే ఇంద్రసేనునికి ఇంద్రజాలమహేంద్రజాల, టక్కుటమార, గజకర్ణ – గోకర్ణ విద్యలను లిప్తలో ధారపోసాడు. "ఓ ఇంద్రసేనా ఈ విద్యలు నీకు రాణిస్తాయి. పగలు ప్రతీకారాలకు మాత్రం పనిచేయవు. నిన్ను చాలా కష్టాలు పాలుచేసిన ఈ రాజుపై నీవు కక్ష బూనిన ప్రయోజనం ఉండదు. తప్పుగా వ్యవహరించితే ఆ విద్యలు నిన్ను విడిచి తిరిగి నా వద్దకే చేరుతాయి. ఇట్టి విద్యలతో జాగ్రత్తగా వ్యవహరించాలి. లేకుంటే నీకు నిద్రాహారాలు ఉండవు" అని హెచ్చరించాడు.

రాజు రామన్నను సమీపించి "రామన్నా ఇలాంటివిద్యలు వచ్చి కూడా నీవు ఋషితుల్యానది వద్ద ఉప్పయ్య మోసానికి , నిలువుదోపిడికి గురయితివి ఈ విద్యలతో వాడి ఆట కట్టించవచ్చుకదా!"

"ప్రభూ ఈ విద్యలను నామీదకు వచ్చినప్పుడు మాత్రమే వినియోగిస్తాను అని నా గురువుకు మాటిచ్చాను. లేకుంటే ఈ విద్య ప్రభావంతో పలుతీర్పులను సునాయాశంగా ఇవ్వగలను. అది విధానం కాదు. ఈ విద్యలు లేకున్నా మీచే మరల ఈ దంపతులు ప్రాణాపాయస్థితిలో పడతారు. అందుకే ఈ విద్యలు ధారపోసితిని. ఇకసెలవు, నేనుబయల్దేరగలను " లేచి సిద్ధపడ్డాడు.

రామన్నకు రాజు, ఇంద్రసేనుడు, రత్నాంగిలు చేతులు జోడించి నమస్కరించారు. రామన్నను మంత్రి, దండనాయకులు కోటవెలుపల వరకు వచ్చి సాగనంపారు. వారితో బాటు పురప్రముఖులు కూడా వచ్చారు. రామన్నను వారు రకరకాలుగా కీర్తించారు. కొందరు రామన్నను ఆప్యాయంగా తడిమారు. ఎంతటి ప్రజ్ఞ కలవాడివి మా రత్నాంగిని కాపాడావు అని మెచ్చుకున్నారు.





# దయ్యమై పట్టుకున్నాడు

శశాంకనగరం శివార్లలో రామన్న అడుగుపెట్టాడు. అక్కడ వర్షం అదేపనిగా కురుస్తోంది. బాగా తడిసి ముద్దయ్యాడు. ఒకేఒక గుడిశె కన్పించింది. తెరిచిన కిటికీలోంచి చూసాడు. అందులో ఒక కుటుంబం బిక్కుబిక్కుమని ఒకచోట కూర్చుని ఉన్నారు. వారి మధ్య చిన్న నూనె దీపం వెలుగుతోంది. వారిని చూడగానే వారు ఏదో విషయంలో బాధపడుతున్నారనిపించింది. తలుపు తట్టాడు. భయంగానే అంతా ఇటుగాచూసారు. తలుపు గొళ్లెం వేసి లేదు లోపలికి వెళ్లాడు. కొత్తముఖం చూడగానే వారు "అయ్యా ఇక్కడ్నించి వెళ్లిపోండి లేకుంటే ప్రమాదం. మాబ్రతుకులు చాలా ఘోరంగా ఉన్నాయి. మీరు మాలా నరకం చూడకండి. ఇక్కడున్న ప్రతిక్షణం మీకు ప్రమాదమే" అని కుటుంబపెద్ద చెప్పకనే చెప్పాడు. రామన్న వారిని అర్ధంకాక చూసాడు. అంతలోనే, అడుగుల శబ్దం అయ్యింది. ఆ కుటుంబం మరింత బిగుసుకు పోయింది. రామన్నను పారిపో అని లోగొంతుతో చెప్పారు.

రామన్న అలాగే నిలబడి ఉన్నాడు. అడుగులశబ్దం మరింత దగ్గరయ్యింది. వెళ్లి చూసాడు. ఎత్తుగా, దృఢంగా, బలంగా, పీక్కుపోయిన ముఖంతో నల్లనిదుస్తులు ధరించి వచ్చినిలబడ్డాడు. అతడి కన్నులు ఎర్రగా మండుతున్న కొరివిలా ఉన్నాయి. ఎవడీతడు? మీకు ఈతనికి ఏమిటి సంబంధం? నేను వచ్చేలోగా పంపేయాలి అని తెలియదా?" కోపంగా అడిగాడు. ఆ కుటుంబం అంతాకలిసి ఎనిమిదిమంది ఉన్నారు. ఆరుగురు పిల్లలు ఇద్దరు తల్లితండ్రులు. వారు ఏదో చెప్పేలోగా రామన్న అందుకున్నాడు. "నేను ఆమెకు తమ్ముడిని ఈ పిల్లలకు మేనమామను. చూసిపోదామని వచ్చాను. మీరెవరో వస్తారు వెళ్లి పొమ్మని వారు భయంతో చెపితే ఎందుకుపోవాలి అని కావాలని ఉన్నాను. ఏమిటి నీ పెత్తనం ఇక్కడ ఇలా అఘోరిస్తోంది. నీ వంటే చాలా భయపడ్తున్నారు. భలేవింతగా ఉంది. ఏమిటి నీకథ. వినాలని ఉన్నాను." రెట్టించాడు.

ఆ మాటలకు ఆ నల్లని పొడుగు మనిషి పకపకానవ్వి "వేలెడంత లేవు. నీకు నేను నా వివరాలు అందివ్వాలా బాగుందిరా కుర్రకుంకా, నా

రూపం చూసి భయపడాలి. పోనీ, భయపడలేదు అని అనుకుందాం. నేను ఏమిటో నువ్వు చూస్తావు. నేను ఈ కోటలో దేవుడు అవతారం ఎత్తాను. ఊరిలో ఎవరూ నన్ను నమ్మలేదు. కానీ, ఈ పాపిష్టి కుటుంబం నన్ను దేవుడిలా నమ్మి పూజలు చేసింది. ఈలోగా చాలామంది ఈ దేవున్ని మీ ఇంట్లో పెట్టుకుని పూజించండి మీకున్న దరిద్రం పోయి ఐశ్వర్యం లభిస్తుంది అని చెప్పారు. వీరు పనికట్టుకుని నన్ను తీసుకుని వచ్చారు. తీరా వస్తే ఇక్కడ గుడిశె వీరి కొంప. సరైన తిండి లేదు. ఎంతసేపు భక్తులు ఒకటి అరా తెచ్చిన అరటిపండ్లు తిని నా నోరు జిహ్వాచచ్చిపోయింది. దాంతో నా అసలు రూపం ఇప్పుడు నువ్వుచూస్తున్నది నేను వీరికి చూపి నా ప్రేత విద్యలతో మూడుపూటలా వీరిద్వారా మాంసం తింటూ సురాపానం సేవిస్తూ జీవిస్తున్నాను. ఈ కుటుంబం ఒకప్పుడు ఏవో మట్టికుండలు చేసుకుని బతికేవారు. ఇప్పుడు చీడపీడలు వదిలించే భూతవైద్యులు అయ్యారు. నేను కోటలో చాలామందిపై దయ్యాలు భూతాలను ప్రవేశపెడ్తుంటాను. ఈ కుటుంబపెద్ద వీడు వెళ్ళి వాటిని వదిలిస్తుంటాడు. దండిగా ధనం వస్తుంది. నాకు కడుపునిండా తిండి వీడికి ఆ మిగిలింది పడేస్తుంటాను. ఎవరు చేసిన కూటికోసమే కదా! వీడికి వీడి కుటుంబానికి కూటిపురుగు తలకెక్కి ఈ బ్రతుకు వద్దు అని వీడు మొరాయిస్తుంటే ఇదిగో ఈ కొరడాతో చావగొడ్తుంటాను. వీడికి నీతిగా బతకాలని ఉందంట. అన్నట్లు నాపేరు చెప్పలేదు. నాపేరు ఉగ్రసేనుడు " చెప్పి పకపకమని నవ్వాడు.

"ఇంత కథ నాకెందుకు పనిగట్టుకుని చెప్పినట్లు చెప్పావు. నీపాపం పండింది. నా దగ్గర నీ ఆటలు సాగవు. దేవుడని నిన్ను కొలిస్తే వారికి దయ్యమై పట్టుకున్నావు. భలేగుంది నీ తీరు. సరే, నీకో అవకాశం ఇస్తున్నాను. నీవు ఇక్కణ్నించి వెంటనే వెళ్లిపో! లేకుంటే నిన్ను ప్రజలముందు దోషిలా నిలబెడతాను. ఆ తరువాత నీవు కుక్కలు చింపిన విస్తరిలా అయిపోతావు." రామన్న చిరాగ్గా చెప్పాడు.

ఉగ్రసేనుడుకి అయోమయంగా ఉంది. "ఏమిట్రా కుర్రకుంక ఏమన్నావు. నన్ను ప్రాణాలు అరచేతపెట్టుకుని పారిపొమ్మంటున్నావా? నీవేమైన సర్వసిద్ధులు పొందినవాడివా? నీమీద చేతబడి పెట్టానో నీవు రక్తం





కక్కుతావు. లేకుంటే కామిని పిశాచికి అప్పగించానో నీలో రక్తపు బొట్టు మిగలదు. చప్పరించి వదిలేస్తుంది. ఏమనుకున్నావో? నా కాళ్లుపట్టుకో నిన్ను వదిలేస్తాను. లేకుంటే నీ అంతు చూస్తాను. "అని పెట్రేగిపోయాడు.

ఆ కొంపలో కుటుంబయజమాని భయంగా చూస్తూ "అయ్యా మా కోసం మీరెందుకు ప్రమాదంలో పడతారు. చూస్తే చిన్నవయస్సువాడివి నీకు ఇలాంటి వారితో ఎలా మాట్లాడాలో తెలియదు. ఈ తడు అన్నంత పనిచేయగలడు. ఎంతో ప్రమాదకారి, మాతంటాలు మేము పడతాం మీరు దయచేయండి." రామన్నను బ్రతిమాలుకున్నాడు.

"నీకేమి బంధువు కాడా ఈ కుర్రకుంక, నీ పెండ్లానికి తమ్ముడు అని, నీ పిల్లలకు మేనమామను అని బొంకినాడు. ఇప్పుడు నువ్వేమిటి తెలియనట్టు విడదీసి మాట్లాడుతున్నావు." ఉగ్రసేనుడు ఆ కుటుంబాన్ని ప్రశ్నించాడు. వారు తల అడ్డంగా ఊపారు మాకేమి కాదు అని చెప్పారు.

"అయితే ఎవర్రా నువ్వు ? ఊరికి ఉపకారం చేయడానికి బయల్దే రావా? నీ సంచి చూస్తే తెలుస్తోంది నువ్వు దేశసంచారం చేస్తున్నావు. నీకు నాలాంటివాడు ఎక్కడ తగిలి ఉండకపోవచ్చు. సరే, నీ సరదా ఎందుకు కాదనాలి. నిన్ను శాకినికి అప్పగించి నీ అంతు చూస్తాను. నీ చావును కోరి తెచ్చుకున్నావు." అని గాల్లో చేతులు తిప్పి పిడెకెడు బుగ్గిని సృష్టించి దాన్ని రామన్నపై ఊదడానికి సిద్ధపడ్డాడు. అప్పుడు ఆ కుటుంబం కాళ్లావేళ్లాపడ్డారు. ఎవరో దారినపోయిన బాలుడు నీ గొప్పతనం తెలియక ఏదో అన్నాడు. నీ క్షుద్రశక్తికి అతడిని బలిచేయకు." అన్నారు.

"ఉగ్రసేనా నీవు నీ పని కానివ్వు. ఆ పుణ్యదంపతులు నా పసితనాన్ని చూసి జాలిపడ్తున్నారు. వారికి నేను ఎలా రక్షింపబడతానో నిన్నెలా పడగొడ్తానో తెలియదు. ముందు మంత్ర భస్మాన్ని నాపై ఊదేసి నీ మంత్రోచ్ఛరణ చేయ్."అని రామన్న ఎదురుగా వెళ్లాడు. ఉగ్రసేనుడు ఉఫ్మని ఊదాడు. ఏమికాలేదు. అలాచాలాసార్లు మంత్రభస్మాన్ని సృష్టించి రామన్నపై ఊదాడు. ఏమికాలేదు. ఉగ్రసేనుడు ఆశ్చర్యపోయాడు. ఏమిటీ వింత, బహుశా శాకిని మంత్ర ప్రయోగం తాను తప్పుగా చేసానా అని

ఈసారి ఢాకినీ ప్రయోగం చేసాడు. రామన్నకు ఏమికాలేదు. ఆ కుటుంబం కూడా అంతులేని ఆశ్చర్యంతో చూడసాగారు.

రామన్న నవ్వి "ఓరి వెర్రి ఉగ్రసేనా కుండలు చేయువాడి కుటుంబం అనుకున్నావా ఈ రామన్న అంటే నీకు వచ్చిన క్షుద్రశక్తులు చాలా తక్కువ నీ ఆటలు నావద్ద సాగవు. పారిపో అని నీకు చెప్పినపుడే పారిపోయి ఉంటే నీకున్న క్షుద్రశక్తులతో ఉండేవాడివి. ఇప్పుడు నా వంటి భయంకరమైన క్షుద్రశక్తులను కలిగినవాడితో ఢీకొన్నావు. ఇక నీలో మరి ఏచిన్న క్షుద్రశక్తి రాణించదు. నీవు ఈ కుండల చేయువానితో కలిసి చక్కగా కుమ్మరివృత్తి చేపట్టాల్సిందే." ఆ మాటలకు ఉగ్రసేనుడు అదిరిపడ్డాడు.

కుమ్మరి కుటుంబం ఆనందించింది. రామన్నను పెద్దకన్నులు చేసుకుని చూసింది. ఉగ్రసేనుడు తనలో శక్తులు నశించినందున రామన్నవైపు గుర్రెత్తిపోయి మీదపడ్డాడు. రామన్న కన్నులు మూసుకుని మంత్రోచ్చరణ చేసాడు. అంతే ఉగ్రసేనుడు ఒక్క అడుగు కదపలేకపోయాడు. "ఉగ్రసేనా నీవు ప్రయోగించిన శాఖినీని ప్రయోగించాను. నీఆటకట్టు. నీకు తెలిసిన విద్యలు తక్కువ. ఏ కొంచెం తెలిసినా, అవీ క్షుద్రవిద్యలు వాటితో నీవు చాలామందిని హింసించినందున నీకు మంచి జరుగదు. ఏదో ఒకరోజు ఆ క్షుద్రవిద్యలు నిన్ను కబళిస్తాయి." హెచ్చరించి ఆ కుటుంబాన్ని పలు విధాలుగా ధైర్యం చెప్పాడు.

ఉగ్రసేనుడు కుంచించుకుపోయాడు. ఏమీ మాట్లాడలేకపోయాడు.

"ఓయీ దేవున్ని ఈ తుచ్ఛునిలో చూసుకుని నీ ఇంటికి తెచ్చుకున్నావు. ఫలితం అనుభవించావు. ఇలాంటి తప్పుడు పనులు ఏనాడు చేయకు. దేవుడు కోసం ఎందరో ఋషులు,మునులు ఘోరతపస్సు చేసినా వశం కానీ దేవుడు ఒక్క క్షణం తపమాచరించని నీకు లభ్యం అయి నీ వెనుక ఎలా వస్తాడని ఆలోచించకుండా క్షుద్ర దేవతాలను ఆరాధించువాడిని తీసుకువచ్చావు. పాపం దేవుడని తెచ్చావు. దయ్యం అయి కూర్చున్నాడు. వీడ్ని తగిలేయండి. వీడికి బుద్ధిమాంద్యం ప్రవేశించి వీడు ఇలా మూగవాడిలా తిరుగుతూ అలా ఏ క్షుద్ర దేవతలను నమ్మాడో వాటిచేతిల్లో హతమై పోతాడు. ఇదే చివరికి ఇటువంటి వారికి జరిగేది."





# ఛండాలుని హితబోధ

రామన్న దేశసంచారంలో భాగంగా ప్రభావతి నగరంలో ప్రవేశించాడు. అక్కడ ప్రజలు గుమిగుడి ఉండడం చూసాడు. ఒక ఛండాలున్ని చుట్టిముట్టి ప్రజలు రాళ్లతో కొడ్తుంటే రామన్న విస్తుపోయాడు. "అయ్యా ఎందుకు ఒక్కడ్ని చేసి అలా రక్తంవచ్చేలా కొడ్తున్నారు." అని అక్కడ చేరిన వారిలో ఒకడ్ని అడిగాడు. నువ్వు కొత్తవాడిలా ఉన్నావు. ఆ దెబ్బలు తిన్న వ్యక్తి ఛండాలుడు వాడినోట ఏకంగా హితబోధలు వస్తున్నాయి. ఇప్పుడు ఊరుకుంటే వాడు ఏదో రోజు వేదం చెప్పినా చెప్పగలడు. అందుకే వాడిని తీవ్రంగా దండిస్తున్నాం. కావాలంటే ఆ నేలమీద ఉన్న రాళ్లతో నువ్వు బలంగావాడిని కొట్టు!"అని ఒకడు ఉత్సాహంగా చెప్పి చేతిలో ఒక రాయి పెట్టాడు. అప్పటికే ఆ ఛండాలుడు నేలమీదపడిపోయి దాహం దాహం అని లుంగలు చుట్టుకోసాగాడు. ఈలోగా గుంపులో ఒకరు ఇదే మంచి అదను వీడిని చచ్చేదాక కొట్టండి. చాలా పెద్దతప్పుచేసాడు. మనకి చెప్పేటంత వాడయ్యాడా? వీరినివాసాలను బుగ్గిపాలుచేయాలి. అని క్షణక్షణం గుంపులోని వారి ఆలోచనలు మరింత భయంకరంగా తయారుకాసాగాయి.

రామన్న ఆ దృశ్యం చూసి చాలాబాధపడ్డాడు. అందరిని నిలువరించే ప్రయత్నం చేయసాగాడు. కానీ,అక్కడ ప్రజల రక్తంలో తరతరాలనుంచి ఆ ద్వేషం రగులుకుని ఉన్నందున ఎవరు ఆగడంలేదు. రాళ్లువిసురుతూనే ఉన్నారు. రామన్న ఇలా వదిలేస్తే పాపం ఆ ఛండాలుడు మరణించగలడని పరుగున అతడిని చేరుకుని గట్టిగా పట్టుకున్నాడు. రాళ్లువిసిరేవారు ఆగారు "ఏయ్ కుర్రకుంకా నీకేమైనా పిచ్చా? వాడిని తాకి మైలపడితివి ముందు కోనేటికి పోయిస్నానం చేసుకుని రా! లేకుంటే నీకు మీ జాతివారు వెలివేయగలరు." అని అరిచారు.

"ముందు మీరంతా స్నానం చేసుకుని రండి. ఇక్కడ రాళ్లతో కొడ్తున్నారు ఈతన్ని తాకి కిందపడిన రాళ్లనే తిరిగి తీసుకుని కొడ్తున్నారు.

మరి ఆ రాళ్లు మైలపడ్డవి కావా వాటివలన మీరు మైలపడలేదా?" అని గట్టిగా అడిగాడు. అక్కడ మారువేషంలో ఉన్న ప్రభావతినగర పాలకుడు సునందవర్మ,మంత్రి ఆనందకేసరి ఒకరి ముఖాలు ఒకరు చూసుకుని మరింత దగ్గరగా వచ్చి చెవులు రిక్కించారు. గుంపులో వందలాది మంది చిరాగ్గా చూసారు.కొంత మంది ఆమాటలకు చేతిలో ఉన్నరాళ్లను కిందపడేసారు. మరికొంతమంది తాము చాలా ఎక్కువగా మైలపడ్డాం అన్నట్లుగా ఒడలంతా వికారంగా చూసుకున్నారు. వారిలో కొంతమంది మొండి వాదనకు దిగారు. నీవు అనవసరంగా మా నగరం విషయంలో దూరి మాకు ఈ ఛండాలుడిలా నీతులు చెప్పాలని చూస్తున్నావు. నీవు వాడిని వదిలి ఈ వైపుకు వస్తావా లేకుంటే రాళ్లవర్షం కురిపించాలా అని కోపంతో ఊగిపోయారు.అందుకు రామన్న నవ్వాడు.

అంతలోనే తేరుకుని ఆ ఛండాలుడు రామన్నను చూసి చేతులు జోడించి "నాయనా మాకు ఆ దేవుడు ఇలా పుట్టించి మమ్మల్ని హింసిస్తున్నాడు. నా కోసం వీరితో గొడవలు పడవద్దు. వారు కులపిశాచుల్లా ప్రవర్తిస్తున్నారు.వారికి పిల్లలు, పెద్దలు అనే తారతమ్యాలు లేవు.నిన్ను పొట్టనపెట్టుకోగలరు." అని చెప్పాడు.

"నోర్ముయ్‌రా చెప్పచ్చేవు. నీవా మా గుణగణాలు గురించి చెప్పేది. ఇప్పుడే కదా అన్నావు. ఆ దేవుడు ఇలా పుట్టించి హింసిస్తున్నాడు. మరి ఎందుకురా ఆ దేవుడు రాసిన రాతను మార్చుకోవాలని చూస్తారు. మీకెందుకురా హితబోధ, వేదం వల్లించే ఆశ."గుంపులో ఒకడు నిలదీసాడు.

రామన్న బదులిచ్చాడు."ఓయీ ఈ క్షతగ్రాత్రుడు చెప్పినదానిలో తప్పేమిలేదు.మీరు కొట్టిన రాళ్లదెబ్బలకు ఓర్చుకునే శక్తిలేక ఆ దేవుడు ఇలా హింసిస్తున్నాడు అని సరిపెట్టుకుంటున్నాడు.మీరే హింసిస్తున్నారు అనే నిర్ణయానికి ఈతడు వచ్చిన నాడు మీలో ఒకడు మిగలడు.ఎందుకు మీఅందర్నీ ఆ దేవుడు పెద్దకులాల్లో పుట్టించినట్లు ఈతన్ని అధమకులంలోకి నెట్టినట్లుగా భావిస్తారు. అంతెందుకు ఈతడు ముక్కుతో కాకుండా ఆయాస





పడ్తూ నోటితో గాలిపీల్చి వదులుతున్నాడు. మరి నీవెందుకు ఆ గాలినే పీలుస్తున్నావు?ఆ గాలి మైలపడలేదా? ఈతడు పండించిన పంటను నీవు తింటున్నావు ఆ ఆహారం మైలపడి నీ నోటికి అందడం లేదా? బుద్ధిహీనుడవై ఎందుకు లేని కులాలు మతాలు పేరిట ఇలా మారణకాండకు సిద్ధపడ్తున్నావు?"ఆ మాటలకు అంతా ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. అక్కడ జరుగుతున్నదంతా చూస్తున్న రాజు మంత్రి ఒకరి ముఖాలు ఒకరుచూసుకుని బాగానే ఆ కుర్రవాడు చెప్పాడు అన్నట్లు సైగలు చేసుకున్నారు. అక్కడ నిశ్శబ్దం చోటుచేసుకుంది.

"ఓయీ కుర్రకుంకా నీవు ఏదో నోటికి వచ్చినట్లు కూయుచున్నావు. ఏది అతడి ఎంగిలి నీవు స్వీకరించగలవా?మాకు చెప్పడం కాదు." గుంపులో ఒకడు ఎదురు ప్రశ్నించాడు.

"అవశ్యం ఆ పని చేయగలను. ఇందులో ఎలాంటి మరో ఆలోచనకు తావు లేదు. అని అక్కడ ఉన్న చెరువులోంచి తన వద్ద ఉన్న చెంబుతో నీళ్లు తెచ్చి.ఆ ఛండాలునికి దప్పికతీర్చి ఆ శేషాన్ని తాను తాగాడు.

"ఓరి నీచకుల సంజాతుని ఎంగిలి నీళ్లు తాగిన నీవునూ చంఢాలుడివే. తక్షణం ఈ నగరం వదిలిపో! లేకుంటే నీకు ప్రాణాపాయం తప్పదు." గుంపులో ఒకడు హెచ్చరించాడు. అంతా అతడికి వంత పాడారు. అప్పుడు రామన్న నవ్వి "మంచిది నాకు ఆ దేవుడు అన్ని తెలిసిన మానవునిగా జన్మనిచ్చాడు.ఇక్కడ మన సమాజం నేను పుట్టింది యాదవకులం అని చాటింది. ఇప్పుడు మీరు నీచకులం వాడిగా నన్ను గుర్తిస్తున్నారు. భళీ,మన సమాజంలో ఎన్నివింతలు,ఈ దేశాన్ని పాలించు రాజు నన్ను ఏ కారణం చేతనో ఆస్థాన పండితునిగా గుర్తించితే నేను అగ్రకుల తేజోవంతుడనవు తాను.ఇప్పటికైనా అర్థం అయ్యిందా? కులాలు మనం సృష్టించుకున్నవే. తప్ప దేవుని నిర్ణయం కాదు.మీలో ఉన్న విజ్ఞులు సయితం తెలుసుకోలేక పోయారు.ఈతడు మీకంటే తెలివైనవాడు. మీవంటి అజ్ఞానులు చేయు తోటి మానవహింసను ఈతడు కన్పించని దేవునిమీద వేసి తానుగా మీ

హింసను భరించాడు. ఈతడు ఏ విధంగా చూసిన ఛండాలుడు కాడు. గుణవంతుడు, తేజస్వి.ఇట్టివానిని హింసించే మీరు అధములు పాపులు చేసిన దానికి క్షమాపణలు కోరుకుని ఈతని యందేకాదు ఇట్టి వారిపట్ల సహృదయత కనబరచండి."

రామన్న మాటలు విన్నవారందిరికి మతిపోయినంతపనయ్యింది. అంతా అంతులేని ఆశ్చర్యానికి గురయ్యారు.రామన్న ఛండాలున్ని చేతులు జోడించి మ్రొక్కి మీరు వీరికి చెప్పిన హితమును నాకు మరల చెప్పండి గురుదేవా! మీ గురించి వీరితో వాదించునపుడే నాకు మీ పట్ల, మీ కులం పట్ల నాకున్న అజ్ఞానం తొలగి పోయింది." చెప్పినేలమీద కూర్చున్నాడు.


అంతా ఆ వింత దృశ్యం చూసి పండ్లు పటపటకొరికి "ఓరి యాదవా ఎంతకు తెగించితివిరా,ఆ నీచుడు నీకు ఈ క్షణమే గురువుకూడా అయ్యాడా? వాడు చెప్పు హితములు నీవు విందువా? ఎంత పొగరు మీ ఇద్దరిని కలిపి దండించి గాని వెనుదిరిగిపోము" అని మీదకు వచ్చారు.

చంఢాలుడు భయపడుతూ"ఓ అయ్యలారా,నన్ను ఏమైనా చేసుకోండి. కానీ, ఎవరో తెలియని పొన్నూరు బాలుడు, పైగా పసివాడ్ని దండించవద్దు. విడిచిపుచ్చండి." అని ఏడ్చాడు.

రామన్న అతన్ని ఓదార్చి "గురుదేవా రానిమ్ము చూతము నాకు వచ్చు విద్యలతో వీరి నుంచి నేను సులువుగా తప్పించుకొనగలను. ముందు మీరు చెప్పబోవు హితములు నాకు చెప్పండి.ఒక్కక్షణం ఆలస్యం చేయవద్దు." అని గాల్లో మంత్రబుగ్గిని సృష్టించి వృత్తాకారంలో చల్లాడు. గురుదేవా ఇక వారు వేయు రాళ్లు మన వరకు రావు. మీరు చెప్పండి "అని ఆసక్తిగా వినసాగాడు.

గుంపు కోపంతో పెట్రేగిపోయారు.రాళ్లు రప్పలు విసిరారు. అదేమి విచిత్రమో ఒక్కరాయి రామన్న గీచిన గీతను దాటిపోవడంలేదు. చంఢాలుడు కూడా ఆశ్చర్యపోయాడు.రామన్న వైపు చూస్తు అలా ఉండిపోయాడు.అక్కడ క్షణంలో మార్పు వచ్చింది.గుంపు రామన్నను ఏ





ఒక ఛండాలున్ని జనులు రాళ్లతో కొట్టుట అతడు దెబ్బలకు నేలకొరుగుట.

దేవుడో బాలుని వేషంలో వచ్చి మనల్ని పరీక్షించాడు. అయ్యో ఎంత పనిచేసితిమి అని అంతా రామన్న కాళ్లదగ్గర సాష్టాంగ పడ్డారు. మీరు ఏదో దేవుడు అయి ఉంటారు. లేకుంటే ఇంతటి మహిమ చూపగలరా? మీరు తక్కువ కులం వారని అని నోటికి వచ్చినట్లు ప్రేలాం. మా తప్పు క్షమించి మమ్మల్ని రక్షించు దేవరా!" అని నెత్తినోరు బాదుకున్నారు. రామన్న వారిని చూసి పకపకమని నవ్వాడు. "అయితే నాది ఏ కులం? మీరుచెప్పండి." అని వారిని రెట్టించాడు.

"మీది దేవుడు కులం, గొప్పకులం, అన్నిటికిమించి మమ్మల్ని ఆదుకునే ఆ దేవదేవులు మీరే!" అనిఅంతా వేనోళ్ల కీర్తించారు. రకరకాలుగా స్తుతించారు.

అక్కడే నిలబడిచూస్తున్న రాజు, మంత్రి అలా అబ్బురపడ్తూ నిలబడి పోయారు. వెంటనే రాజు తన వేషం వదిలి అక్కడి వారందరిని ఆరోజు సభకు రమ్మని చెప్పి రామన్నను తనతో తీసుకుని అంతఃపురానికి వెళ్లాడు.

ఆరోజు సభలో చంఢాలునిపై రాళ్లురువ్విన ప్రజలు గుంపుగా నిలబడ్డారు. రాజు తాను మారువేషంలో ఉండి చూసినది అక్కడ వివరించి రామన్నను అడిగాడు "మీరెవరు? ఎందుకు ఇలా వచ్చారు. మీ ప్రతిమాట యోగులను తలపింపచేసినది ఈసభలో మీ గురించి అంతా ఆసక్తిగా చూస్తున్నారు."

" ఓరాజా మీ ప్రభావతి నగరంలోకి దేశాటనలో భాగంగా ఉదయం వచ్చాను. అక్కడ ఈతన్ని హీనజాతివాడని మీ ప్రజలు రాళ్లతో కొట్టి హింసిస్తున్నారు. అక్కడ మారువేషంలో ఉండికూడా మీరు కనీసం అడ్డుకోలేదు. అంటే మీకు ఆ చర్య సమ్మతమే అని ఇప్పుడు తెలుస్తోంది. సరే, నీచకులాలుగా గుర్తించి వారిని ఇలా మన హైందవజాతి హింసిస్తోంది. కానీ, నాకు ఇలా ఎందుకు జరుగుతోంది అని కొన్నిక్షణాల్లో తెలిసివచ్చేట్టు చేసారు మీ ప్రజలు. అదెలా అంటే ఈతడు ఛండాలుడు ఇట్టివాని నోట నీతులు రాకూడదు. హితములు అసలే వెలువడరాదు. ఇక పొరపాటున





కాకిఎంగిలిలా వేదంలో ఏ ఒక్కపలుకు రారాదు. సరే. ఈతడు ఎక్కడవిన్నాడో ఏమో కానీ, నాలుగు హితములు విని తనలో తాను అనుకుంటూ పోతుంటే మీ ప్రజలు విని మండిపడి ఓరి నీచకులసంజాతు డవు నీవు వల్లించునది హితములా? అని దొరికిన రాయిరప్పతో చావగొట్టిరి. అప్పుడే వచ్చిననేను అది తప్పు అని వారిని వారించితే, చివరికి ఈతని ఎంగిలి నీళ్లు తాగినందున నన్ను చంఢాలునిగా జమకట్టి చావగొట్టనెంచిరి. నేను మంత్రబుగ్గితో నామీద ఎలాంటి రాళ్లు పడకుండా కాపాడుకోబోతే నాచండాలత్వం నశించి దైవత్వం ఆపాదించారు. నేను కొన్ని క్షణాలలో ఒకసారి శూద్రుడనయితిని. తరువాత మీ ప్రజలు నన్ను చంఢాలుని చేస్తిరి ఆపైన దేవుని కులంతో సరిపోల్చిరి. ఇప్పుడు రాజా దయఉంచి నేను ఏ కులమో తమరే తెలియచేయండి." అని విన్నవించాడు.

అక్కడ చేరిన వారంతా "దేవుని కులం అంటే శాఖాబ్రాహ్మలు అని అరిచారు. ఇంకొందరు దేవునికి కులమేమిటి? గొప్పకులం" అని ఎలుగెత్తారు.

రాజు అయోమయంగా చూసాడు. చుట్టుతిరిగి తనను ఇలా అడుగు తాడను కోలేదు. మంత్రి కూడా ఆలోచనలోపడ్డాడు. అక్కడ నిశ్శబ్దం అలుముకుంది. అంతా రామన్న వైపు చూసారు.

రామన్న అందరిని చూసి "నేను కొన్ని క్షణాలు తేడాలో మూడు కులాలకు చెందినవాడిని అయ్యాను. అంటే కులం అనేది మనం ఏర్పాటు చేసుకున్నదే అని మనందరం చెప్పకనే చెప్పుకున్నట్టే అయ్యింది. ఇలాంటి గాలిలో ఊగిసలాడే కులాన్ని పట్టుకుని పాపం ఈతన్ని అంతగా బాధించ వచ్చా? ఇట్టివానిని ఇంతగా రక్తసిక్తమయినట్లు హింసించిన మిమ్మల్ని ఏమనాలి? హైందవసాంప్రదాయం ఇలా మంటగలిపినందుకు చాలా బాధ పడ్తున్నాను. సరే, ఓరాజా నేను మర్యాదరామన్నను. దేశసంచారంచేస్తూ ఇటుగా వచ్చాను. నాగురించి వినే ఉంటారు."

రామన్న ఈ కుర్రవాడేనా అని ఆశ్చర్యంగా చూసారు.

వెంటనే రాజు ఒక ఆసనం చూపి కూర్చోమన్నాడు. రామన్న నీవు ఒక మాట అన్నావు గుర్తుందా? నీకు నేను ఆస్థానపండితున్ని చేస్తే నా కులమే మవుతుంది. నాకు అప్పుడు కులాలమీద ఒక అవగాహన వచ్చింది. నీ మాటలు అమృతతుల్యం అని అప్పుడే అనుకున్నాను. నా కొలువులో కొన్నాళ్లు న్యాయ మూర్తిగా పనిచేయాలని కోరుతున్నాను. అని చేతులు పట్టుకున్నాడు.

రామన్న చుట్టూ తిరిగి చూసి ప్రభూ ఇక్కడ న్యాయమూర్తి లేరా? నాకా అవకాశం కల్పిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. కానీ, ఈ వర్షకాలం ముగిసిన వరకు మాత్రమే పనిచేసి ఆపైన నా పయనంలో నేను ఉంటాను."

"రామన్నా తప్పకుండా నీవు చేయగలరోజులే నావద్ద పనిచేయ్. ఎలాంటి నిర్బంధం లేదు. ఎప్పుడుకావాలంటే నీవు యధేచ్ఛగా వెళ్లిపోవచ్చు" రాజుమాటలకు సభలోని వారు హర్షధ్వానాలు చేసారు. న్యాయమూర్తిగా ఆ క్షణమే ప్రమాణం చేసాడు. వెంటనే అక్కడ తీవ్రంగా రాళ్ల దెబ్బలు తిన్న చంధాలున్ని తనవద్దకు రప్పించి ఈతనికి గాయపరిచినవారు ఈ వైపుకు రావల్సిందిగా కోరాడు. ఒక వేళ రాకుంటే ప్రత్యక్షసాక్షులున్నారు. వారి ద్వారా వారిని గుర్తించి తీవ్రమైన దండనకు గురిచేయాల్సిఉంటుంది అని హెచ్చరించాడు.

కనీసం వందమందికి పైగా నిలబడ్డారు. "మీరంతా రాళ్లతో కొట్టారా లేక కర్రలతో కొట్టారా?"సభలో నిశ్శబ్దం భగ్నంచేస్తూ అడిగాడు.

"రాళ్లతో మాత్రమే కొట్టాం."అంతా చిన్నగొంతులతో చెప్పారు.

"తోటిమనిషిని చిత్రహింసలు పాలుచేసే అధికారం మీకు లేదు. మీకు మీ జీవనవిధానానికి విఘాతం కల్గించేట్టు ఎవరైనా ప్రవర్తిస్తే రాజుకు ఫిర్యాదు చేయాలి. మీరు అలా చేయలేదు. మీకుగా మీరే ఎదుటివాడిని శిక్షించారు. కనుక మీరు తీవ్రమైన దండనకు గురికాకతప్పదు."

అంతా భయంగా చూసారు. కొంతమంది రాజు పాదాలపై పడ్డారు." రామన్న మొదట్నించి తేడాగానే ఉన్నాడు. అటువంటివానికి న్యాయమూర్తిని





చేసారు. అందుకే అతడు మాపై పగ సాధించాలనుకుంటున్నాడు. అని చాడీలు చెప్పారు. రాజు వారికి బదులీయకుండా రామన్న మంచి గుణ సంపన్నుడు అట్టివానికి మీరు వంకలు పెట్టడం కూడా మరో శిక్షకు కారణమవుతుంది అని పొమ్మన్నాడు. ఏ శిక్ష విధిస్తాడో అని బిక్కుబిక్కుమని ఉన్నారు.

"మీకు శిక్షించే ముందు ఒక అవకాశం ఇస్తున్నాను. దాన్ని సాధించుకో గలిగితే మిమ్మల్ని విడిచిపెడతాను లేకుంటే అవే రాళ్ల దెబ్బలతో మీకు తీవ్రంగా శిక్షింపచేస్తాను." రామన్న వారినుద్దేశించి చెప్పాడు.

"మీరంతా ఈ ఛండాలుడు అనబడే వానికి రాళ్లతో ఎక్కడెక్కడ కొట్టారో నాకు చూపగలరా? అదేలాగు మీవల్లకాదు. కనీసం ఉపచర్యలు చేసి ఈసభ ముగియు లోపల అతన్ని మునుపటిలా స్వస్థతతో చూపగలరా?"

"చూపలేం వాడికి దెబ్బలు చాలా పెద్దగా తగిలాయి. కనీసం నెల రోజులయినా పడుతుంది." అని అంతా చిన్న గొంతులతో బదులిచ్చారు.

రామన్న తన ఆసనం నుంచి లేచి వారివద్దకు వెళ్లి "మీరుకొట్టిన రాళ్లదెబ్బలు ఏవిధంగా చూసుకున్నా మీ ఆధీనంలో లేనివి. మీరు విసిరారు అంతవరకే ఆ తరువాత అవి ఎక్కడ తగిలాయి ఎంతగా బాధించాయో మీకు తెలియదు. విసిరినవరకే మీరు మధ్యలో కూడా ఆపలేరు అంతగా మీ ఆధీనంలో లేని చర్య. ఇలాంటి నీచమైన అధీనంలో లేనిచర్యతో లేని కులం కోసం మీరు మీతో పుట్టి మీ మధ్య పెరిగిన మీ గ్రామవాసిని ఇంత ధారుణంగా హింసించారు. ఏమేరకు న్యాయం, మీరు ఈతని కంటే ఎందులో గొప్పవారు. పూర్తిగా అజ్ఞానంతో కొట్టుమిట్టాడుతున్నారు. మీకు పాపచింతన కూడాలేదు. మూర్ఖంగా ప్రవర్తించారు. మీకు తీవ్రంగా శిక్షించాలి."

అంతా కాళ్లావేళ్లా పడ్డారు. "సరే ఈతనికే మీకు ఏశిక్ష విధించాలో అడుగుదాం. ఏమయ్యా వీరిచేతిలో తీవ్రంగా గాయపడిన నీవు వీరికి ఏ శిక్ష విధించాలని కోరుకుంటున్నావు." రామన్న చంధాలున్ని అడిగాడు.

వారిని శిక్షించాలనుకోవడంలేదు. ఇలాంటి దారుణాలు జరుగకుండా చూడాలని ఆశిస్తున్నాను. మాలో చాలామంది వీరి కులపట్టుదలల కారణంగా అమానుషంగా బలవుతున్నారు. ఈ మధ్య దాహం తీర్చుకోవడానికి కోనేరుకు వెళ్లిన మాలో ఒకడ్ని వీరు ఇలానే రాళ్లతోకొట్టి చంపారు. వీరికి మా పట్ల జాలి కలిగితేచాలు. అంతకుమించి వీరిని శిక్షించితే చూడాలనుకోవడంలేదు."

అప్పుడు రాజు కలుగుచేసుకుని "రామన్న నీవు చాలాకాలంగా సాగుతున్న ఈ కులవివక్షతపై అందరికి కన్ను విప్పుకలిగించేలా చేసావు. నేను ఎప్పుడు ఆలోచించలేదు. నిజమే చంఢాలురుగా వీరిని చూడడం మా తప్పే. వీరికి ప్రజలు ఏమిచేసినా పట్టించుకోకుండా ఊరుకున్నాను. ఈ క్షణం నుంచి వీరు నా ప్రజలలో ఒకరిగా గుర్తిస్తున్నాను. వీరికి నగర ప్రధాన రహదారుల్లో తిరిగేందుకు, ఆలయంలో దైవ దర్శనానికి, కోనేటిలో నీళ్లుతాగేందుకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చేస్తున్నాను. రాళ్లదెబ్బలు తిన్న ఈతనికి నా కొలువులో చేర్చుకుంటున్నాను. ప్రధాన రహదారుల్లో పత్తేదారుగా నియమిస్తున్నాను. కులమతాల జాడ్యంనుంచి ప్రజలను వెలికితీస్తాను. ఇదే ఇక నేను నిత్యంచేసేది. ఇకపై ఇలాంటి హింసకు ఎవరు సాహసించినా మన్నించను. తీవ్రమైన శిక్షలతో రాచిరంపాన పెడతాం. వీరికి చంఢాలురు అనే పేరు వాడుకలో లేకుండా ఈ రాజ్యంలో ఒక శాసనం చేస్తున్నాను."

రామన్న రాజుకు చేతులు జోడించాడు. రాజు చండాలునికి తన దగ్గరకు పిలిచి ఒక కత్తిని బహుకరించి పత్తేదారు(గూఢచారి)పదవినిచ్చి అతనికి విశ్వధీరుడు అనే ఒక పేరును పెట్టి వానికి వైద్యం కోసం రాజవైద్యులను పురమాయించాడు.

రామన్న విశ్వధీరుడిని ఆనందంతో వాటేసుకున్నాడు.





# ఎవరీ బసివిరాండ్రు

రామన్న వర్షం పడ్తుంటే ప్రభావతి నగరంలో ఒక శివాలయ మండపంలోకి వెళ్లాడు. అక్కడ ఇద్దరు కన్నెపిల్లలు కన్పించారు. వారితో బాటు మరో అమ్మాయి పసుపు ముద్దలా ఉంది. ఆ చిన్నారి వయస్సులో కసురుకాయలా ఉంది. ఏడుస్తోంది మిగిలిన ఇద్దరు కూడా దుఃఖిస్తూనే ఆ చిన్నారిని సముదాయిస్తున్నారు. "నన్ను మా బావకిచ్చి పెళ్లిచేసినా బావుణ్ను. ఇలా బసివిని చేసి వదిలించుకుంది నా సవతి తల్లి." అని చెప్పుకుని వెక్కివెక్కి ఏడ్వసాగింది.

అప్పుడే వచ్చాడు పూజారి. బసివిలను చూసి పకపకమని నవ్వుతూ "ఏమేవ్ నీకళ్లు భలేగా ఎంత అమాయకంగా ఉన్నాయి. వాటిలో ఇప్పుడే ప్రతిబింబం చూసుకోవాలి."ఆ చిన్నారి బుగ్గను నలిపేసాడు. ఎర్రగా కంది పోయింది. అతడి చేతికి ఆమె కన్నీరుధార తగిలింది. "ఏడుస్తున్నావా? పర్వాలేదు. మొదట అలా ఉంటుంది. ఆ తరువాత ఏమిఉండదు. నీ చుట్టు మీసాలు మెలివేసే నాయాళ్లు అంతా కుక్కల్లా తిరుగుతారు. అందులో ఢోకాలేదు." మరింత వెకిలిగా నవ్వాడు. రామన్న వారిని చూసి చాలా బాధపడ్డాడు.

వారు కూర్చున్న చోటికి వెళ్లాడు. వారికెదురుగా కూర్చుని "ఏమ్మా నీకు బావతో పరిణయం కావల్సి ఉందా? అందుకు నీ సవతి తల్లి అడ్డంకి అయి ఇలా దేవునికి నిన్ను సమర్పించి బసివిని చేసిందా? నీ బావ ఎక్కడున్నాడు?"

ఆ ముగ్గురు రామన్నను చూసి కళ్లు చిట్లించారు. చిన్న వయస్సులో చాలా పెద్దవాడిలా అడుగుతున్న తీరుకు ఆశ్చర్యపోయారు.

పూజారి రామన్నను చూసాడు. "ఎవరయ్యానువ్వు వారితో నీకేంపని? వారితో నీలాంటి కుర్రకుంకలు మాట్లాడరాదు. వారు బసివిలుగా మారేట పుడు పూజ్యనీయులే కానీ,వారితో మాట్లాడితే నీకు సంఘం తప్పుపడ్తుంది. వెళ్లిపో!" అని రెక్కపట్టుకుని లేవదీసాడు. అక్కడికి కొన్నిఅడుగుల దూరంలో


ఉన్న సిపాయిలు వచ్చి పూజారిని అడ్డుకున్నారు. "ఆయన ఎవరనుకున్నావు. కొత్తగా వచ్చిన న్యాయమూర్తి." లోగొంతుతో చెప్పారు. ఆ మాట విన్న మరుక్షణం పూజారి సన్నగా వణికాడు. వదిలేసి వెనక్కు అడుగులు వేసాడు.

"మన్నించండి తమరెవరో తెలియక ఇలా ప్రవర్తించాను." అని ప్రాధేయపడ్డాడు. రామన్న అతన్ని తేరిపారచూసి "ఆలయ పూజారిగా ఉంటున్నావు. నీవు వయస్సులో బాగా పెద్దవాడివి. నీలో ఇలాంటి నీచబుద్ధి ఎందుకు కల్గింది. నీ మనుమరాలి వయస్సు గల అమ్మాయితో ఇలానే ప్రవర్తిస్తావా? నీకు ఈ చిన్నపిల్లను చూస్తే సరసం గుర్తుకు వచ్చిందా జాలి కలుగలేదా? ఆలయానికి వచ్చే భక్తులను వదిలి ఇక్కడ ఈ కొత్తమ్మాయిని నీచంగా సంబోధిస్తున్నావు. తలచుకుంటేనే అసహ్యంగా ఉంది."

"మన్నించాలి. తమరు చిన్నవారు. బసివిరాండ్రుకోసం తెలియక ఇలా అంటున్నారు. వీరికి ఏ పురుషుడైనా విలాసవస్తువుగా చూడాల్సిందే. అదే వీరికి ఒకరకంగా మంచిది. లేకుంటే వీరికి ఆలయాల్లో లభించే వడపప్పు, చలిమిడి ఆహారం అవుతుంది. ఇతరత్రా ఏమి దొరకదు. దాంతో వీరు శుష్కించి ఛస్తారు. అందుకే పెద్దలు వీరిని ఇలా విలాసవస్తువులను చేసారు. ఈ అమ్మాయి చెబుతోంది తన బావకిచ్చి పెళ్లిచేస్తేబావుణ్ను అని. ఏడి ఆ బావను వచ్చి తీసుకుపొమ్మనండి. వాడు రాడు ఈ బసివి ఊరందరికి విలాసవతి అయితే తాను ఏదో రోజు విలాసంగా చూసుకుని పోతాడు. వీరిని ఎవరు ఆదుకోరు. నేను ఎందుకు ఈ అమ్మాయిని ముమ్ముందు జీవితాన్ని ఎలా మలుచుకోవాలో చెప్పున్నానంటే కొంతమంది అమ్మాయిలు బసివిగా బ్రతకాలనుకోకుండా చావాలనుకుంటారు. ఈ ఆలయానికి చెందిన నూతిలో ఇప్పటికి నలుగురైదుగురు చనిపోయారు. అప్పుడు ఆలయానికి నీళ్లుకావాలంటే మేము చాలాదూరంపోయి తీసుకునిరావాల్సి ఉంటుంది. ఆకొత్తపిల్ల చావకుండా చెప్పాను." పూజారి వివరంగా చెప్పాడు.

రామన్న వెంటనే కొత్తబసివి తల్లితండ్రులను సిపాయిలను పంపి రప్పించాడు. "ఇంత చిన్నపిల్లను ఎందుకు ఇలా చేసారు. మీరు చూస్తుంటే ఆర్థికంగా ఉన్నవారిలా ఉన్నారు. ఏమిటి మీ సమస్య?"





సవతితల్లి కన్నీళ్లుతో చెప్పింది. "అయ్యా మాకు ఆచారం తప్పదు. మేము శైవమతస్థులం, మా ఇంట పుట్టిన ఆడపిల్లల్లో ఒకపిల్లను బసివిని చేస్తామని మొక్కుకున్నాం.మా ఇంటిలో ముగ్గురు ఆడపిల్లలున్నారు. పెద్దదాన్ని ఇక్కడ ఈరోజు ఉదయం బసివిని చేసాం.మరి ఇద్దరు ఆడపిల్లలకు లక్షణంగా పెళ్లిల్లుచేస్తాం.కొన్ని ఇళ్లలో పుట్టినవారినందరిని బసివిని చేసే సాంప్రదాయం ఉంది. మేము ఎంతమాత్రం మిగిలిన ఇద్దరికి చేయం."

"ఈ ఆడపిల్ల నీ కూతురుకాదు కదూ! చనిపోయిన మొదటిభార్య కూతురు నీ పెనిమిటికి అన్నివిధాల పోరినీవు ఈ పిల్ల గొంతును కోసావు.బసివి చేయాల్సి వస్తే నీ కూతురుకే చేయాల్సింది.నీవలా చేయలేదు. ఈ పిల్లదానికి వరుసకు బావ ఉన్నాడు అతడితో పెండ్లి చేస్తే సరిపోయేది. ఎందుకు ఇలా నీచంగా చేసావు. నీవు చేసిన దెంతవరకు న్యాయంగా ఉంది.నిజం చెప్పు బసివిని చేయాలనే మొక్కు ఉందా? లేదా?" రామన్న తీక్షణంగా చూస్తూ అడిగాడు.

ఆమె భర్త లేదని తలఅడ్డంగా తిప్పి బోరున ఏడ్చాడు."నా మొదటి భార్యకు చనిపోతున్న వేళ మాటిచ్చాను కూతురుని చక్కగా చూస్తాను అని చెప్పాను.కానీ, చూడలేక పోయాను.దీనిపోరు పడలేకపోయాను.ఎలాగైనా నా పెద్దకూతురుని బసివిని చేయమని పోరింది. మీరు అడిగారే బావగురించి వాడికి నా రెండో కూతురుని ఇచ్చి చేయాలని దీని స్వార్థం.అందుకు నాపెద్ద కూతురు బలి అయిపోయింది.నేను మొండికెత్తితే ఇది తన ఇద్దరుపిల్లలతో కోనేటిలో మునిగి చస్తానని బెదిరించింది. అందుకే ఈ పనికి ఒప్పుకున్నాను. మాకు బసివిని చేసే సాంప్రదాయంలేదు."

అంతలోనే బసివి బావను,అతడి తల్లితండ్రులను కూడా సిపాయిలు తీసుకుని వచ్చారు.వారు రామన్న ముందు వినమ్రంగా నిలబడ్డారు." ఏమయ్యా ఈరోజు సవతితల్లి కారణంగా బసివిగా మారిన నీ మరదలను చూడు ఎలా ఏడుస్తూ దీనంగా ఉందో, నీవు ఆమెను చేపడతావా నీతో పంపించే ఏర్పాట్లు చేస్తాను. మీరిద్దరు ఒకరంటే ఒకరు ఇష్టపడుతున్నారు అని విన్నాను." ఆకుర్రాడిని అడిగాడు.





పిల్లవాడు బసివిని జాలిగా చూసాడు.తలఅడ్డంగా ఊపుతూ "మన్నించాలి నేను సాంప్రదాయకమైన అమ్మాయిని చేసుకోగలను కానీ, ఇలా బసివిని చేసుకుంటే నాకు నగరంలో తలెత్తుకో నిస్తారా ఈ ప్రజలు."

రామన్న ఆ కుర్రవాణ్ని కోపంగా చూసాడు." ఏమయ్యా ఈ పిల్లదాన్ని నీవు చేసుకోవడానికి నీవు చెప్పే అభ్యంతరం ధారుణంగా ఉంది. ఉదయమే బసివిని చేసి ఈగుడిలో వదిలారు. ఈమె ఇంకను బయటికి పోలేదు. అంతమాత్రాన నీవు ఇలా మాట్లాడడం నాకు నచ్చలేదు."

"నీకు నచ్చడం ఎవరికి కావాలి?వరుసకు బావనే, కానీ బసివి అయ్యాక నా జీవితాంతం బసివిదాన్ని చేసుకున్నాడు అని నాకు ఈ ప్రజలు బ్రతకనీయరు సాక్షాత్తు శ్రీకృష్ణదేవరాయలు వంటి చక్రవర్తినే చని పోయేంత వరకు దాసీపుత్రుడు అనే పిలిచారు.ఇంతపెద్ద అపవాదు మోసాడు. ఆయన నిజంగా దాసీదానికి పుట్టలేదు.రాయలు తల్లి తన సవతి చదరంగం ఆటలో ఓడిపోయి కొన్ని నిముషాలు దాసీగా పనిచేసింది. అంతమాత్రాన రాయలకు జీవితాంతం అదే పిలుపు పిలిచింది ఈలోకం." ఆ కుర్రవాడు రోషంగా చెప్పాడు.

అక్కడే ఉన్న సిపాయిలు ఆ కుర్రవాడ్ని పెడరెక్కలు విరిచిపట్టుకుని తీవ్రస్వరంతో హెచ్చరించారు. "నిన్ను ప్రశ్నిస్తున్నవారు సాక్షాత్తు ప్రభావతి నగర న్యాయమూర్తి,అడిగిన దానికి గౌరవంగా బదులివ్వాలి.తలతిక్క సమాధానాలు చెబితే చావగొట్టి నేలమీద అడ్డదిడ్డంగా పడేస్తాం."

రామన్న వాడిని హీనంగా చూస్తూ "నీవు బావగా ఈమెను అభి మానించ లేదా? ఆమె నిన్ను తలచుకుని కన్నీరుమున్నీరు అవుతోంది.నువ్వు వస్తే ఏదో ఉద్ధరిస్తావని ఆశగా ఈ దైవసన్నిధిలో ఆ దేవున్ని కూడా పక్కకుపెట్టి నీకోసం ఎదురుచూస్తోంది. నువ్వు చూస్తే ఆమెను ఇంకా ఈప్రజలు బసివిగా చూడకముందే నువ్వు చూస్తున్నావు.నువ్వు మానవత్వంలేని మృగంలా ఉన్నావు.అయితే నీ మనస్సు ఇలానే ఉంటుందా?ఆమె ఇలా హీన పడాల్సిందేనా?"

"అది ఆమె చేసుకున్న పాతకం. అందులో నేను ఏమిచేయగలను." కుర్రవాని మాటలకు తల్లితండ్రులు వంతపాడారు. "ఇదెప్పుడు బసివి అయ్యిందో అప్పుడే మాతో బంధుత్వం లేకుండా పోయినట్లే. ఇది ఊరందరికి ఇల్లాలే. అందరికి అందిన పండే. దీని మాయలో పడి వీడు పాడయ్యాడు కానీ వీడికి తెలిసి వచ్చింది. దీన్ని వీడు ప్రాణం పోయినా అంగీకరించడు. ఇప్పుడు మాకు చాలా ఆనందంగా ఉంది. ఇది ఎన్ని ప్రేమపత్రాలు రాసింది. ఎంతగా దీనివెనుక తిప్పుకుంది. దీన్ని సవతితల్లి బసివిని చేయగానే వీడు ప్రేమపిచ్చి వదులుకున్నాడు." అని చెప్పి పొంగిపోయారు.

రామన్న వారిని అక్కడ్నించి పొమ్మన్నాడు. వారు వెళ్లిపోయారు. రామన్నకు ఏమి చేయాలో పాలుపోలేదు. చూస్తుండగా ఆమె కన్నీటిని తుడవలేని పరిస్థితిలో తాను మిగిలిపోతిని కదా అని చాలా బాధపడ్డాడు.

పక్కనే పూజారి చేరి "అయ్యా అర్థం అయ్యిందా నేను ఈ చిన్నపిల్లను చూసి ముచ్చటపడిపోయి అలా సరససల్లాపాలతో ప్రేలలేదు. బసివయ్యాక వీరిని ఎక్కువగా హింసించినది స్త్రీలే. చూసారా ఈ పిల్లదానికి స్వయాన అత్త ఎలా మాట్లాడిందో, స్త్రీకి స్త్రీయే శత్రువు అన్నట్లు ఆ బావగాడు ఈ పిల్లను తీసుకుని ఇదే గుడివెనుక ఎంతో సమయం ఉండేవాడు. ప్రేమలో మునిగితేలినవాడు ఇప్పుడు ఎలా కాదన్నాడో, ఏమైనా కలికాలం మనగ్రహచారం అని ఊరకే పెద్దలు అనలేదు. తప్పదు ఈ పిల్లదానికి ఈ బసివి బ్రతుకు."అని విచారించాడు.

రామన్న ఆలోచిస్తుండగా పరుగున వచ్చాడు బసివి బావ. రామన్న కాళ్లమీదపడ్డాడు. "అయ్యా నన్ను మన్నించి నాకు నా మరదలనిచ్చి పంపేయండి నేను ఈ నగరం వదిలిపోతాను. ఎక్కడైనా కాయకష్టం చేసి బతుకగలం. ఇద్దరం ఎంతో అన్యోన్యంగా ఉండేవాళ్లం. ఈమె సవతితల్లి కూతురును నాకు ఇచ్చిచేయాలని మాఇద్దరిని విడదీయాలంటే బసివిని చేయడమే అని భావించి ఇంతకు తెగించారు. శైవమతస్తులకు ఆడపిల్లలను బసివిని చేసి వదిలించుకోవడం చాలా తేలిక. అదే దారిలో మా కులమంతా ఎప్పటికప్పుడు పయనిస్తుంది. ఆడపిల్లల గొంతులను కోస్తోంది. నాతల్లి





తండ్రుల ముందు అలా చెప్పకపోతే వారు ఒప్పుకోరు. వారికోసం ఏమేమో ప్రేలాను. అవి మనస్సులో పెట్టుకోవద్దు. దయచేసి నా మరదలతో నాకు పెండ్లి చేసి పంపేయండి. ఎవరికి అందనంత దూరం వెళ్లి బతుకుతాం." కన్నులవెంట నీళ్లు గుమ్మరిస్తూ చెప్పాడు.

అక్కడే ఉన్న బసివి సవతితల్లి బిక్కముఖం వేసింది. రామన్న ఆ కుర్రాడిని భుజం తట్టి నీవు ఎంతో దూరం ఎందుకుపోవాలి. ఇక్కడే నీకు రాజకొలువు నిప్పిస్తాను. హాయిగా చిలకాగోరింకల్లా బ్రతకండి."

"ఈ నగరంలో మమ్మల్ని ప్రజలు బ్రతకనీయరు. దూరంగా వెళ్లి బ్రతుకుతాం. మమ్మల్ని సరిహద్దులు దాటించేయండి. మీ సిఫాయిలను తోడు ఇవ్వండి." అని గాభరపడ్డాడు.

"ఓయీ నీవు అవ్వా కావాలి బువ్వ కావాలి అనే ధోరణి విడనాడితే నీకు మేలు జరుగుతుంది. ఊరు మారినంతమాత్రానా ఉనికి మారదు. నామాటవిని రాజుగారివద్దకు వస్తే నీకు మంచి జీతంతో కొలువు లభించగలదు."

ఆ వెంటనే రామన్న రాజుముందు నిలిపాడు. సభలోనివారు ఆశ్చర్య పోయారు. బసివిలను పెళ్లిచేయడం చాలా ఘోరమైన నిర్ణయం, రామన్న చేస్తున్నది మనం వ్యతిరేకించాలి. అని సభలో అంతా అనుకుని రాజుముందు నినదించారు. అప్పుడు రాజు ప్రజలకు పూర్తిస్థాయి వివరణ ఇవ్వాల్సిందిగా రామన్నను కోరాడు.

రామన్న తాను దేవాలయంలో చూసినదంతా వివరంగా చెప్పాడు. "బసివిగా ఒక ఆడపిల్లను బలిఇచ్చే సాంప్రదాయాన్ని మనమంతా వదులు కోవాలి. ఇటుశైవ మతస్థులు అటు వైష్ణవమతస్థులు పోటీపడి మరీ ఈహీనసాంప్రదాయాన్ని పెంచిపోషిస్తున్నారు. ఇందులో బలియినది అమాయకమైన ఆడపిల్ల. ఏమితెలియని వయస్సులో చిదిమి వేయబడు తుంది. బసివిగా దేవునికి అర్పింపబడ్డ పుష్పం వరకు దైవచింతనతో కూడినదే, కానీ ఆ తరువాత అంతా ఆ ఆడపిల్ల బతుకుతో ఆడుకోవడమే. ఇదా దేవునికి సమర్పించే పుష్పంకు మనమిచ్చే గౌరవం. దేవునికిచ్చి పెండ్లి

చేసి దేవాలయంలో విడిచిపెట్టి ఆమెను దేవతగా చూడాల్సింది పోయి హీనమైన కామదృష్టితో చూసి అనుభవించడం ఇదెక్కడి న్యాయం.దేవునికి మన మిచ్చుగౌరవం ఇదేనా?పూజారులు సయితం దేవుని పూజలు మరిచి కొత్తగా తయారుచేయబడిన బసివితో వయస్సుకూడా చూడకుండా కామవికారాలతో ముచ్చటలకుపోవడం ఏమేరకు న్యాయం.ఈ అన్యాయపు సాంప్రదాయాన్ని కూకటి వేళ్లతో అంతాకలిసి పెళ్లగిద్దాం. మీరు ఈ బసివిని పెళ్లాడు తానని ముందుకు వచ్చిన యువకునికి పెండ్లిచేసి మీకొలువులో సరైన పని కల్పించవల్సిందిగా కోరుతున్నాను."

అందుకు మహామంత్రి అడ్డుతగిలాడు. "అయ్యా ఇలా చెప్పడానికి బావుంటాయి.నవమాసాలు మోసిపెంచిన తల్లితండ్రులు దైవభక్తితో తాము కన్నపిల్లలకు మంచి జరగాలి అని కన్నపిల్లలలో ఒకరిని దేవునికి అర్పిస్తున్నారు. ఇందులో వారికి ఎలాంటి బాధలేదు. అదో దేవుని మొక్కు లాంటిది.అందుకు శైవమతస్థులు ముందున్నారు.ఇప్పుడిప్పుడే వైష్ణవ మతస్థులు ముందుకువచ్చారు.రావడమేకాదు,పోటీపడ్డారు.దీన్ని ఎవరు అడ్డుకోరాదు.అది వారి ఇష్టం.మధ్యలో మనమెందుకు కలుగచేసుకోవాలి. రామన్నా నీవు వయస్సులో చిన్నవాడవు.బసివిగా మారిన ఒక అమ్మాయి కన్నీరు చూసి కరిగిపోయి ఆ కన్నీరు తుడవాలనుకుంటున్నావు నీవు జాలిహృదయుడవు.కనుక దీని గురించి ఇంతగా చర్చించాల్సింది లేదు. భటులారా ఆ అమ్మాయిని దేవాలయంలో విడిచి రండి. ఆ కుర్రాడిని మళ్లీ ఇలా పెండ్లి అని బసివి వెనుక తిరిగితే కారాగారంలో పడేయ్యండి."

మంత్రిమాటలకు అంతా చప్పట్లు చరిచారు. అక్కడే ఉన్న బసివి భోరున ఏడ్చింది.ఆమెను వంకరచూపులతో భటులు రెక్కపట్టుకుని అటు ఇటు ఊపుతూ నడిపించసాగారు.ఆమె బావను ఒక భటుడు బల్లెంతో పక్కకు బలంగా నెట్టేసాడు.

రామన్న వెంటనే వారిని నిలువరించి "ఆగండి, ఈ ప్రభావతి నగరానికి ప్రస్తుతన్యాయమూర్తిని నేను, నా ముందు న్యాయంకోసం బసివిని తీసుకుని వస్తే మహామంత్రిగారు చర్చను అర్థాంతరంగా ముగించి తానే





న్యాయం చెప్పి చేతులు దులుపుకోవడం సభ సాంప్రదాయాన్ని చిన్నబుచ్చినట్లే.ఇందులో మంత్రిగారు కాదు తీర్పు ఇవ్వాల్సినది నేను. ఒకవేళ నా తీర్పు అంతగా రుచించకపోతే దాన్ని ఆమోదించినా తిరస్కరించినా అది రాజుగారికే చెల్లు. ఎట్టిపరిస్థితిలో మంత్రికి న్యాయం చెప్పే అర్హత లేదు.కనుక భటులారా, బుద్ధిహీనులుగా ప్రవర్తించకండి.ఎవరు ఏమి చెబితే అది చేయరాదు అని ప్రాథమిక సత్యం ఎరుగరా, ముందు ఆమె మీద అగౌరవంగా వేసిన మీచేతులు తీయండి. ఆమెను గౌరవంగా యథాస్థానాల్లో నిలబెట్టండి." పెద్దగొంతుతో చెప్పాడు.

ఒక్కసారి సభలో అంతా స్థాణువులై చూసారు.రాజు చిర్నవ్వుతో తిలకించాడు.మంత్రి బిక్కచచ్చిపోయాడు.తాను ఎప్పుడు ఇలా సభలో ఇంతగా ఏమికానట్టుగా తీసివేయబడిన దాఖలు లేవు. ఏమిటి ఈ కుర్రరామన్న నన్ను ఇలా సభలో హీనపరిచి నామాటకు విలువలేకుండా చేసాడు అని చేష్టలుడిగి అలానే కూర్చుండి పోయాడు.సభలో రకరకాలుగా చెప్పుకోసాగారు.ఒక్కటే ఉత్కంఠగా ఉంది.

రామన్న అందరిని చూసి "చెప్పినదే చెప్పుకుని సాగదీసుకోకుండా చిన్న మాటలో చెప్పగలను.బసివిని చేసింది తల్లితండ్రులు వారు ఒక ఆడపిల్లను వదిలించుకోవడానికి ఇలా నీచానికి దిగజారిపోతున్నారు. బసివిగా మారాక ఆలయపూజారులు నుంచి ఆలయ ఇతరసిబ్బందికూడా ఆ బసివిని హీనంగా నీచంగా చూస్తున్నారు. ఆలయంలో దేవుని సేవలు మరిచి నగరప్రముఖులకు కొత్తబసివి గురించి ఆమె అందచందాల గురించి చెప్పి ఒకవిధంగా వేశ్యవాటికలో చరించే విటులమధ్య దళారుల పాత్రలో జీవిస్తున్నారు.మరెక్కడుంది ఆలయంలో పవిత్రత.నేను ఈరోజు ఆలయంలోకి వెడితే దేవుని విగ్రహంముందు భక్తితో సేవిస్తున్న భక్తులకు తీర్థప్రసాదాలు ఇవ్వకుండా గర్భగుడిని విడిచి కొత్తబసివితో సరస సంభాషణలలో మునిగి తేలి ఉన్నాడు. మన దేవాలయ ప్రధానఅర్చకుడు, భక్తులు గర్భగుడి వెలుపలే కొబ్బరికాయలు కొట్టి అర్చకునికోసం చూడకుండా వెళ్లిపోతున్నారు.అది దేవాలయమేనా?ఒక బసివి కారణంగా ఎన్ని అనాచారాలు జరుగుతున్నాయి.ఒకటి బసివిగా మారిన అమ్మాయి

కన్నీరుమున్నీరుగా దేవాలయంలో విలపించుట. ఆమె కన్నీరుకు ఏ విగ్రహం కరుగదు అని చూసేవారికి తెలియచెపుట. మరి భక్తి మన హిందూవులలో పెరుగుతుంది. సరే, ఇక అర్చకున్ని చూస్తే గర్భగుడి వదలి బసివి వెంటపడి తన విధులను మరుస్తు సాంప్రదాయాలను మట్టిపాలు చేస్తూ భక్తుల మనస్సుల్లో హీనపడ్తున్నాడు. ఇక మూడవది నగరప్రముఖులకు దేవాలయం అన్నచో తమగోడు చెప్పుకునేదిలా తమ కష్టాలు మాపుకునేదిలా ఉండాలి. అలాకాకుండా సరసానికి పనికి వచ్చే కన్నెల నిలయంగా వారికి కన్పిస్తుందంటే ఇక మన దేవాలయం మన సంస్కృతి ఏమి కావాలి. కనుక అవశ్యం ఈ బసివి అనేది ఈ నగరంలో లేకుండా శాసనం కావాలి. ఈ సభలో ఉన్న బసివికి కొత్త జీవితం ఇవ్వడానికి ముందుకు వచ్చిన యువకునితో పెండ్లి జరపాలి. రాజులు తలచుకుంటే భృతికి కొదువఉండదు. కనుక వీరికి జీవానాధారం కల్పించాలి. ఇదే నాతీర్పు. రాజుగారు పెద్దమనస్సుతో నాయీతీర్పును మన్నించి ఆచరణలోకి తీసుకు రావాల్సిందిగా కోరుతున్నాను."

రామన్నమాటలకు ఈసారి ఎక్కువమంది హర్షధ్వానాలు చేసారు.

రాజు గొంతుసవరించుకుని "మంత్రిగారు చెప్పినది ఒక ఆచారంగా మనమధ్య సాగుతోంది. కానీ, రామన్న చెప్పినది ఆలోచింపదగ్గదే. ఈ బసివిల వలన మన దేవాలయాలు మైలపడ్తున్నాయి. అర్చకులలో ఉన్న పవిత్రత మంటకలుస్తోంది. కనుక ఈ నగరంలో ఉన్న శైవమతస్థులకు, విష్ణు మతస్థులకు ఇదే హెచ్చరిక నేటినుంచి దేవదాసి, బసవి సాంప్రదాయాలకు స్వస్తి చెబుతున్నాను. ఏ గుడిలో వారు కనపడరాదు. యాభై పైపడిని వయస్సు గల స్త్రీలు వారికి ఇష్టపడితే దేవుని సేవలో అంకితం కావచ్చు. కన్యలు, యవ్వనంలో ఉన్న స్త్రీలు ఎట్టిపరిస్థితిల్లోకూడా బసివిలు కాకూడదు. ఈ శాసనాన్ని కాదన్నవారికి కఠినశిక్షలు కాచుకుని ఉంటాయి."

రాజు తీర్పుకు సభలో అంతా ఆనందించారు. బసివి రాజు కాళ్ల మీదపడింది. ఆమెను లేవనెత్తి "అమ్మా మీ ఇద్దరికి నేను పెండ్లిచేస్తాను. నీ బావ అన్నట్లు మీకు ఇక్కడి సమాజం బసివి అని నిత్యం దుయ్యబడ్తుంది.





కనుక మీ ఇద్దరు నాకు పిల్లనిచ్చిన మా మాంవగారి రాజ్యానికి పంపించి అక్కడ కొలువులో భృతి కల్పించగలను "అని చెప్పాడు.

అప్పుడు మహామంత్రి నవ్వి "రాజా చూసారా మీరు రామన్న మాటలకు సరేనని శాసనం చేసారు. కానీ, ఈ బసివి దంపతులకు సమాజ ఈసడింపును మీరు సయితం నిరోధించలేక మరో రాజ్యానికి పంపుతున్నారు అంటే మన మధ్య ఆచారాలు మనం తృంచలేము అని చెప్పకనే చెప్పారు." వ్యంగ్యంగా అని రామన్న వైపు చూసాడు. ఏమి బదులివ్వగలవు అన్నట్లు ప్రశ్నార్ధకంగా ముఖంపెట్టాడు.

రాజు ఆలోచనలో పడ్డాడు. రామన్న నవ్వి "మహామంత్రిగారు మీరు అన్నది నిజమే. రాజుగారు సమాజానికి జవాబుదారు. ఎంతకాదనుకున్నా మనలో హీనసాంప్రదాయాలకు బలమెక్కువ. ఈ బసివి దంపతులు రాజుగారినీడలో ఉన్నందున ఫలానావాళ్లు ఇలాకూసారు అలా కూసారు అని నిత్యం ఫిర్యాదులు చేయవచ్చు. ఇదో నిత్యసమస్య అని పెద్దతలతో ఆలోచించి మంచి నిర్ణయం తీసుకున్నారు. దీనిలో ఆయన మన అనాగరిక ఆచారానికి వెరచి కాదు."

మంత్రి ఎలా లేచి అన్నాడో అలానే కూర్చుండిపోయాడు.

రామన్నమాటలు ఆలోచనలో పడేసాయి. అక్కడ తలదించుకుని నిలబడిన పలువురు బసివిలు దయనీయంగా కన్పించారు. అంతలోనే ప్రజలు సభలోకి వచ్చి తమవ్యతిరేకత చూపారు. లిప్తలో బసివి, దేవదాసి సాంప్రదాయాన్ని ఈరోజునుంచి లేదంటే ఎలా? తరతరాలుగా వస్తున్నది కనుక, దీన్ని ఇప్పుడు కొత్తగా ఎవరు కనిపెట్టి పెంచిపోషించలేదు. దేవునికి మానవుడు తనఆడు బిడ్డలను సమర్పించుకునే అవకాశం మనమెందుకు కాదనాలి. రామన్న మాటలకు మేము వ్యతిరేకిస్తున్నాం." అని ఎలుగెత్తి చెప్పారు. మంత్రి ఆనందంగా చూసాడు.

రాజు రామన్నవైపు చూసాడు. రామన్న పలువిధాలుగా ప్రజలకు నచ్చజెప్ప చూసాడు. విన్నవారిలో ఎలాంటి మార్పురాలేదు. సభలో అంతవరకు మాకు న్యాయం జరుగుతుంది అని ఆశించిన బసివిలు

నీరుగారిపోయి మన తలరాత ఇంతే! అని సరిపెట్టుకుని రామన్నకు చేతులు జోడించి"సెలవు ఇప్పించండి మేము దేవాలయంలో ఈరోజు నృత్యప్రదర్శన ఉంది. రాత్రి నర్తించాల్సి ఉంది అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలి." అనికోరారు.

"అదిగో వారే దేవునికి అంకితమయ్యాం ఆ సేవల్లో ఆనందం వెతుక్కుంటున్నాం అన్నట్లు రాత్రి వారి నాట్యప్రదర్శన కోసం చాలా ఉత్సాహపడ్తుంటే మధ్యలో బాల్యచాపల్యంతో రామన్న వారి దైవసేవలను కాదని వారిని సంసారజీవితాల్లోకి నెట్టేయాలి అని చూడడం సబబుకాదు." ఒక తలపండిన వ్యక్తి అరిచిచెప్పాడు. అతని మాటలను మిగిలినవారంతా బలపరిచారు.

రామన్న మాటలను విలువనిచ్చేవారు ఆ సభలో చాలాతక్కువమంది వరకున్నారు. అయినా రామన్న ఏమాత్రం వెనకడుగు వేయకుండా తన వాదన విన్పిస్తునే ఉన్నాడు. రాజు జాలిగా చూసాడు రామన్నవైపు. అతడు చాలా చిక్కు సమస్యను ఎదుర్కొంటున్నాడు. ఎలా బయటపడతాడు అని ఆలోచించాడు.అక్కడే ఉన్న ఆరోజు బసివి అయిన అమ్మాయి,ఆమె బావకథ రామన్న సభలో విన్పించాడు. బసివి అయ్యాక పెళ్లి అనేది జరుగరాదు.అది శాస్త్రసమ్మతం కాదు. ఆ పిల్ల బసివిగా నిత్యం దేవున్ని ఆరాధించాల్సిందే, ఊళ్లో పురుషులను ఆనందింపచేయాల్సిందేనని పట్టుబట్టారు.

రామన్నవైపు ఆ బసివి జంట భయాందోళనలతో చూసారు." అయ్యా మమ్మల్ని ఆ గుడిలోనే వదిలేసి ఉంటే ఈపాటికి మేము నగరం వదిలిపారి పోయేవాళ్లం.ఇలా అంతా పట్టుదలలకు పోతుంటే నేను నా మరదలు ఏంకావాలి. మేము ఒకర్ని విడిచి ఒకరు ఉండలేం.అదిగో నా తల్లితండ్రులు వస్తున్నారు. సమస్య మరింత జటిలం అవుతుంది. మహారాజా ఇక ఈ రామన్న వలన ఏమీ కాదు.ప్రభువులు తమరే కలుగచేసుకుని మా ఇద్దరిని ఇక్కడ్నించి పంపేయండి. ఇద్దరిలో ఏచిన్న ఎడబాటు అయినా బ్రతకం."అని పాదాలపై పడ్డారు. అప్పటికే అతడి తల్లితండ్రులు వచ్చి గుడ్లెర్రచేసారు. "ఏరా పాపిష్టివాడా ఆ గుడిలో బసివిని చేసుకోను. జీవితాంతం బసివికి





మొగుడు అంటారు అని వాగి మమ్మల్ని నమ్మించి నువ్వు చేసిన నిర్వాకం ఇదా? నీకు సిగ్గులేదు.బసివిని చేసుకోవడానికి నువ్వెవరివి. అది దేవుని సొత్తు దేవునికి సమర్పించింది నీవు కోరవచ్చా? దేవుని సేవలో ఉన్న ఆమెను ఆసేవలకు దూరం చేసి నీసేవలకు ఉపయోగించుకోవడం ఏశాస్త్రం ఒప్పుకోదు. ఇక్కడి ప్రజలు చూస్తు ఊరుకోరు."

ఆ మాటలకు అక్కడి ప్రజలు "మేము ఒప్పుకోం, ఇలాంటి తప్పుడు వ్యవహారాన్ని హర్షించేది లేదు. అడ్డుకుంటాం.బసివిని పెళ్లిచేసుకుంటే ఒప్పుకోం.అది దేవుని పుష్పం.దాని సేవలు దేవునికే అంకితం కావాలి. ఆ తరువాత విటులకు అంకితం.దీన్ని కాదంటే మన ఆచారం ఏమి కావాలి?"

రామన్న వారిని శాంతింపచేసాడు. పనికిమాలిన సాంప్రదాయాలకు చాలా ఎక్కువగానే జీవం పోసారు. ఎవరూ దీనిపై ఆలోచన చేయడంలేదు. దేవుని సేవ అని చెబుతున్నారు. అట్టి సేవలో ఉన్న దేవునికి చెందిన వారి నుంచి మానవులమైన మనం ఏమీ కోరకూడదు. అలా జరగడంలేదు. ఎంతో ఆశిస్తున్నాం.తెరచాటున అంతా కోరుకుంటున్నాం.ఇందులో పాపభీతి లేదు.అప్పుడు దేవున్ని గురించి ఆలోచించేదిలేదు. బలిపశువులైన బసివిలను కాళ్లుచేతులు ఆడకుండా వారి బతుకులకు మంచి మార్గం ఏర్పడినా అడుగడుగునా అడ్డుపడే సాంప్రదాయం ఎంత దారుణంగా మన మధ్య అలుముకుంది.ఒక సవతితల్లి కావాలని సవతి కూతురుని బసివిని చేస్తే దానికి మీరంతా వ్యతిరేకించకుండా మరింతగా ప్రోత్సహిస్తున్నారంటే మనమంతా ఎక్కడికి పోతున్నాం.సవతి తల్లి కుట్రలకు మనం అడ్డం పడాల్సిందిపోయి ఆమెకు వత్తాసుపలుకుతున్నాం.ఇది మంచి విధానం కాదు.ఇట్టి ఆడకూతుర్ల ఉసురు ఊరకే పోదు.ఇక ఇంతవరకు ప్రజల మనోగతం ఎలా ఉందో తెలుసుకునే ప్రయత్నం మరోసారి చేసాను. ఈ ప్రభావతి నగరన్యాయమూర్తిగా నా తీర్పును వెలువరించాను.రాజ శాసనాన్ని వెంటనే తీసుకురా గలిగాను." సభలో నిశ్శబ్దం అలుముకుంది.

"ఓ జనులారా ఈరోజు మంచివిషయమై అంతా మనస్సు విప్పి మాట్లాడుకున్నాం. అయితే మీలో చాలామంది మనలో జీర్ణించుకుని పోయిన

మూఢవిధానాలను వ్యతిరేకించే సాహసం లేదు. కానీ, ఈ రామన్న ఈరోజు సభలోకి తీసుకువచ్చిన పెద్ద చర్చ చేసాడు. పాలకులు ఆలోచించి శాసనం చేయగలరు. దానికి అంతా కట్టుబడి ఉండాల్సిందే. అట్టి శాసనం ఇప్పుడు రామన్న తీర్పుననుసరించి రాజశాసనం తయారు అయ్యింది. కనుక మీలో ఎంతమంది ఇక్కడ ఉన్న బసివికి పెళ్లి చేయడానికి ఇష్టపడ్తున్నారు. చేతులుఎత్తండి." రాజు ప్రజలను అడిగాడు. ఆయన మాట్లాడుతున్నా ఇంకా సద్దుమణగకుండా అరవసాగారు. అంతగా మూఢత్వం ప్రకటిస్తునే ఉన్నారు.

అతి తక్కువమంది చేతులు ఎత్తారు. మంత్రి రామన్నవైపు హేయంగా చూసాడు. రాజు కూడా అయోమయంగా చూసాడు. ఈ విషయంలో ఎక్కువశాతం రామన్నకు వ్యతిరేకంగా ఉన్నారు. సభలో అంతా ఒక్కటే ఉత్కంఠగా ఉంది. చేతులు ఎత్తినవారిలో బసివి తండ్రి ఉన్నాడు. అతడి చేతిని కిందకు వంచే ప్రయత్నంలో అతని రెండో భార్యఉంది. రామన్న అతన్ని ముందుకు పిలిచి "ఈరోజు బసివిని చేసిన తండ్రివి, మరి ఆమెకు బసివిగా కాకుండా పెండ్లికూతురులా చూడాలనుకుంటూ చేతులెత్తావు. ఒక్కపూటలో నీలో ఇంతమార్పుకు కారణం, దేవునికి మొక్కుకుని కదా బసివిని చేసావు. నీవు ఇలా ఊసరవెల్లిలా మారిపోతుంటే నిన్ను ఆ దేవుడు క్షమించడు. అటు దేవునికి కాకుండా ఇటు మనుష్యులకు కాకుండా నీ కూతురిని త్రిశంకు స్వర్గంలో నిలుపుతావా?"

అతడు భోరున ఏడుస్తూ" అయ్యా ఎలాంటి మొక్కులేదు. నా రెండో భార్య పోరును భరించలేక నా తొలిభార్య కూతురుని ఈ నీచ బసివి సాంప్రదాయానికి బలిపెట్టాను. మీరు కలుగుచేసుకున్నారు. నా కూతురుకి ఈ బసివి చెరనుంచి రక్షించండి. దాని బావ శిల్పాచార్యుడు వాడితో పంపే యండి. ఏదూరప్రాంతానికో పోయి వారి బ్రతుకు వారు బ్రతుకుతారు. వాడుకూడా అదంటే ఇష్టపడుతున్నాడు. పదేపదే కోరుకుంటున్నాడు."చెప్పి కాళ్లావేళ్లాపడ్డాడు.





అయినా ప్రజలు ఊరుకోలేదు. పెద్దగొంతులతో విరుచుకుపడ్డారు. "బసివినిచేసిన తరువాత తిరిగి సంసార జీవితానికి పోవడాన్నిసాంప్రదాయం ఒప్పుకోదు. ముఖ్యంగా మేము ఒప్పుకోం. దేవునితో ఆడుకుంటారా? అయినా ఎక్కువమంది మేము వ్యతిరేకిస్తుంటే భార్యమాటలు విని కన్నకూతురు గొంతుకోసినవాడి మాటలకు విలువనీయ రాదు. వాడు కూతురు గొంతు కోసానని సభాముఖంగా ఒప్పుకున్నాక వాడిని వాడిభార్యను శిక్షించండి రేపు మరొకరు చేయరు. అలాగే, బసివిలయినవారిని విముక్తి కలిగిస్తే మేము ఒప్పుకోం. వారు దేవతా పుష్పాలు."

రామన్న అందరిని శాంతపరిచి మరల తన వాదన విన్పించాడు." ఇంతవరకు ప్రజల వాణి వినాలనుకున్నాం. విన్నాం ఇంతటితో ఏ ఒక్కరు గొంతు విప్పడానికి లేదు. ఇక పాలకుల తీర్పును విని శిరసావహించాల్సిందే. ఎంతటి వాడైనా తప్పుచేసి సరిదిద్దుకుంటాడు. ఇందులో మనం తప్పు బట్టాల్సిందేమి లేదు. ఎంతమంది వ్యతిరేకించినా, కన్నతండ్రి వద్దని చేయి ఎత్తాడంటే వెయ్యిమందితో సమానం. కనుక అతన్ని అతని ఆవేదన ఈ సభ అర్థం చేసుకున్నందున బసివి సాంప్రదాయంపై స్పష్టమైన తీర్పునిస్తున్నాం. ఈరోజు జరిగిన బసివిని మేము దేవతాపుష్పంగా గుర్తించం. ఇకపై ఈ నగరంలో ఇలాంటి నీచ బసివి సాంప్రదాయానికి నూకలు చెల్లిస్తున్నాం. ఇప్పుడున్న దేవాలయాల్లో ఉన్న బసివిలను వేరేచోటికి తరలిస్తాం. ఇందులో. ప్రజలు నిరసిస్తే తీవ్రదండనకు గురికాకతప్పదు. అని పెద్దగొంతుతో రామన్న తన తుదితీర్పును ప్రకటించాడు.

ఒక్కసారి నిశ్శబ్దం అలుముకుంది. రామన్న తీర్పుతో బసివి, ఆమె బావ కళ్లు పెద్దవిచేసి చూడసాగారు. మళ్లీ రామన్న గొంతెత్తి "ఈ ప్రభావతి నగరంలో అన్ని కళలున్నాయి. కవులు పోషింపబడ్తున్నారు. పాలకుడైన రాజు ఆచితూచి పాలిస్తున్నాడు. ఏవిధంగా చూసుకున్నా ఈ నగరంలో అంతా చక్కగా ఉంది. అయితే ఇట్టి నగరంలో ఆడకూతుళ్ల ఉసురు అగ్నిగుండంగా మార్చనున్నది. ఇది మన కెవ్వరికి క్షేమం కాదు. ఇకపై ఈ

బసివి, దేవదాసి, జోగిని, సాంప్రదాయాన్ని తరిమేద్దాం.రెండు శివ,వైష్ణవ మతాలు వారు ఇట్టి మొక్కులను ఇకపై మొక్కరాదు.అవి చెల్లుబాటు కావు.ఆలయాల్లో సేవలకు రాణీవాస దాసీలలో ఒకరిద్దరిని నియమించ గలం.ఇక్కడ బసివి జంటను యదేశ్చగా పెండ్లిచేసుకోవడానికి అనుమతి స్తున్నాం. వారికి నచ్చే రాజ్యంలో వారికి జీవించడానికి తగు ఏర్పాట్లు చేయగలం.మిగిలిన బసివిలకు బతుకుతెరువు చూపగలం. బసివి సాంప్రదాయాన్ని ఎవరు పునఃప్రారం భింపచేస్తే వారికి తీవ్రదండన తప్పదు. ఇది తక్షణం అమలులోకి వచ్చే ప్రభావతినగర పాలకుల శాసనం." ఆ మాటలను విన్న రాజు ఉత్సాహంగా చప్పట్లుచరిచాడు.

"రామన్న నీ తీర్పు బావుంది. నాలో ఉన్నదంతా నీవు వెళ్లగక్కినట్లే అయ్యింది.కటకంలో నా మిత్రులు గజపతులున్నారు.అక్కడికి ఈకొత్త దంపతులను పంపించగలను.బసివిలను మరిమనం తయారు చేయవద్దు. అది పాపానికి ఆడపిల్లల ఉసురుకు కారణం అవుతుంది. అట్టిపాతకాన్ని మనం మూటలుగా కట్టుకోవద్దు.బసివిని ప్రవేశపెట్టిన వారిని యావజ్జీవ శిక్షకు గురిచేస్తాను.కనుక ఎవరు వాటి జోలికి పోరాదు." రాజు తీవ్రస్థాయిలో హెచ్చరించాడు.

రామన్న ఆ క్షణాలు చాలా ఆనందించాడు. ఆప్యాయంగా బసివి కళ్లనీళ్లు తుడిచాడు. మొదట అంతా సాంప్రదాయం అని నమ్మకం అని గుడ్డిగా వాదించినా చివరకి రామన్నమాటలకు అతని ఆలోచనలకు తలవొంచారు. నిజమే ఒక ఆడ కూతురిని ఈ విధంగా హీనపరచడం మంచిదికాదు అని తెలుసుకోగలిగారు. ఈసారి ప్రజలు అంతా కలిసి రామన్నను, రాజును కీర్తించారు.





# ఇద్దరు దొంగల కథ

తండ్రికొడుకులు ఇద్దరు గజదొంగలుగా దారిదోపిడీలు చేసుకుని బ్రతుకుతుండేవారు.వారు దొంగలుగానే వారి జీవితం సజావుగా సాగుతున్న ఎవరికి ఎలాంటి ప్రాణహాని చేయకుండా బ్రతుకుతుండేవారు. వారు తమ విద్యను 64 విద్యలలో ఒకటిగా చూసుకునేవారు.దేవుళ్లే మాకు చోరవిద్యలకు మార్గదర్శకులు అని భావిస్తుండేవారు. వారు ఇంటిలో పలుదేవుళ్ల చిత్రాలు తగిలించుకుని మహాభక్తుల్లా చూపరులకు ఆశ్చర్యం కల్గించేవారు. వారు దొంగతనాలు చేసి బ్రతుకుతున్నారని ఎవరికి తెలియదు.ఆ దొంగలు పేర్లు విక్రమకేతు, వనకేతు ఇరువురు పరమ సాధువుల్లా నగరంలో ఒక మంచి ఇంటిలో జీవిస్తుండేవారు.చూడడానికి వారు చేసేది ఉప్పు వ్యాపారం. అంతా అదే వ్యాపారం చేస్తున్నారు అని అనుకునేవారు. అయితే ఒకసారి ఇద్దరు కలిసినగరంలో ఒక విచిత్రమైన దొంగతనం చేసారు.అదే రాణీవారు నగరంలో ప్రతిపౌర్ణమినాడు విపణిలో తనకు నచ్చిన వస్తువులను కొనుగోలు చేస్తుంది.ఆ రోజు సాయంసమయంలో పురుషులెవరు వీధులలోకిరాకుండా నిషేధాజ్ఞలు విధింపబడేవి.తండ్రికొడుకులు ఆడవేషాలతో విపణిలోకి వెళ్లారు.ఆ రోజు కొత్త వర్తకులు చాలా రకాలు తెచ్చి అమ్ముతుంటారు. అయితే మగవర్తకులు ఉండరు. వారి స్థానాల్లో వారి భార్యలుంటారు ఇది కుశాలీ నగరంలో జరిగే పౌర్ణమీనాటి తంతు.

రామన్న దేశాటనలో భాగంగా కుశాలినగరంలోకి అడుగెట్టిన రోజే ఇలా వీధిల్లోకి రాకుండా ఉండాల్సి వచ్చినందుకు పైగా ఆరోజంతా ఏమి తోచకుండా ఉన్నందున ఆడవేషం వేసుకుని తిన్నగా వ్యాపారం జరిగే కూడలికి వెళ్లాడు. అక్కడ చాలామంది మగాళ్లు ఆడవేషాల్లో తిరుగుతుంటే ఆ నగరరాజు శాసనాన్ని ఆప్రజలు ఏ విధంగా స్పందిస్తున్నది చూసి ఆశ్చర్యపోయాడు.మహారాణివారు దాసీజనాలుతో వచ్చి తనకు నచ్చిన వస్తువులను ఎలాంటి బేరసారాలు లేకుండా కొనుగోలు చేసుకుని వస్తువులను రథంలో వేసుకుని ముందుకు సాగిపోసాగింది.ఆ వెనుకనే

చేరారు గజదొంగ తండ్రి కొడుకులు. ఆమె మెడలో అత్యంత విలువైన వజ్రాల నగను క్షణాల్లో తస్కరించారు. అది మూడోకంటికి తెలియకుండానే చేయగలిగారు. ఆ సమయం పూర్తికాగానే రాత్రి ఇంటికి చేరుకున్న రాణివారికి మెడలో నగ పోయిన విషయం తెలిసింది. వెంటనే నగరంలో గల ప్రధాన కూడలిలో విపణిలో వెతికించింది. ఎంత వెతికినా ఎక్కడా దొరకలేదు. ఆ రాత్రి మహారాజు రాణివారిని కలుసుకుని ఎంతగా నచ్చజెప్పినా ఆమె మానసికంగా కుదుటపడలేదు. శోకతప్తురాలైంది. అప్పుడు రాజు సైనికులను ఇంటింటికి పంపించి వెతికించాడు. తెల్లవార్లు ఈ కార్యక్రమం జరిగింది. అయినా వస్తువు దొరకలేదు. ఉదయాన్నే ఆ నగ గురించి దండోరా వేయబడింది. ఎవరు దొరికినా తెచ్చి ఇవ్వగలరు వారికి పెద్ద బహుమానం ఇవ్వగలం.ఒక వేళ ఎవరు తస్కరించినట్టు తెలిపినా బహుమానం ఇవ్వగలం.రాణివారు పోగొట్టుకున్న వస్తువు అత్యంత ఖరీదైనది.సామాన్యులు ఎవరు ధరించడానికి లేదు.కాకి ముక్కుకు దొండపండు లాంటిది అని దండోరా వేస్తున్న వారు చెప్పుతునే ఉన్నారు. కానీ,ఆ దండోరాను గజదొంగలకు ఏమీకానట్టుగా ఊరుకున్నారు. రాజభటులు పూర్తిగా నిద్రాహారాలు మాని మరి తిరుగసాగారు.

వీధిలో నులకమంచం వేసుకుని తండ్రీకొడుకులు భటులు అటు ఇటు పరుగులు తీస్తున్న తీరును చూసి నవ్వుకోసాగారు. నగ కోసం ఆ రాజు,భటులు నిద్రాహారాలు మానివేసిపనికిమాలిన చోటుల్లో వెతుకులాటలో ఉన్నారు.మరోవైపు రాణివారు కూడా నిద్రకు ఆహారానికి దూరం అయ్యారు. ప్రతిపూటకో దండోరా వేస్తునే ఉన్నారు. పోయిన వస్తువు కంటే విలువైనది తెప్పించి ఇవ్వగలను అని రాజు చెప్పినా ఆ నగే తనకు కావాలని రాణి పట్టుదలతో ఉంది.దాంతో నగరం అంతా అయోమయంలో పడింది. ఇదెక్కడి గొడవ. ఎంత ముద్దులరాణి అయితే మాత్రం పోయిన వస్తువుకై ఇంతగా పట్టుపట్టి నగరంలో ఎవరికి నిద్రాహారాలు లేకుండా చేయడం అన్యాయం అని ప్రజలు లోలోపల అనుకోసాగారు.

చివరిసారిగా రోషంగా దండోరా వెలువడింది."నగ మర్యాదగా తెచ్చి ఇవ్వకుంటే అనుమానితులను వెతికి తెచ్చి నానాహింసలకు గురిచేస్తాం.





ఇదే ఆఖరి అవకాశం. జేగంట పక్కనే ఉన్న హుండీలో రేపు ఉదయం లోపు వేయండి.ఎవరు దొంగిలించింది మేము ఆరాతీయం. ఇదే చివరి అవకాశం. ప్రతిఒక్కరు హుండీ ఉన్న గదిలోకి ఒంటరిగా వెళ్లి వచ్చేయ్యండి. ఎవరివద్ద ఆ నగ ఉంటే వారు వేసి వచ్చేయండి.ఇలా వేస్తే ఎవరు వేసింది తెలియదు.

నగరప్రజలు భయభ్రాంతులయ్యారు. ఇదెక్కడికి దారితీస్తుందోనని చాలా బాధపడ్డారు. అంతా తప్పదని హుండీని దర్శించుకుని వెళ్లిపోసాగారు. రామన్నకూడా వెళ్లాడు.ఒక లేఖ రాసి అందులో వేసి వచ్చాడు.

ఆ మరుసటి రోజు హుండీని తెరిచిచూస్తే అందులో ఒకే ఒక లేఖ పడుంది.అది తీసి చదివాడు దండనాయకుడు.అందులో విషయం రాజు ఆసక్తిగా విన్నాడు.

మహారాజా మీరు పొగొట్టుకున్న నగలో ఎన్నో దోషాలున్నాయి.అది మీవద్ద ఉన్నంతవరకు చాలా నష్టాలు మీకు జరిగాయి. ఇటీవల పలు యుద్ధాలలో మీరు చాలా నష్టపోయారు. అందుకు కారణం ఆ నగలో ఉన్న రాళ్లలో దోషమే.అవి తస్కరించిన వారెంతటి వారైనా నాశనం కాకాతప్పరు. వారిలో విజ్ఞత నశించి పోతుంది. ఈ నగను పంచుకోవడంలో బంధుత్వాలు,స్నేహాలు చూసుకోరు. అంతగా పోరుతారు ఫలితంగా ఛస్తారు. కనుక మీ దరిద్రం వదిలిపోయిందని ఆనందించకుండా దానికోసం ఎందుకు రాత్రి పగలు వెతుకులాటలో ఉన్నారు.ఇక ఆ నగను వదిలించు కోవాలను కున్నవారు ఎక్కడో పారేస్తే దాని దరిద్రంపోదు.అది ఎక్కడినుంచి తస్కరించారో అక్కడే వదులుకోవాలి అంటే రాణివారు మెడలో తీస్తే ఆ మెడకే తగిలించాలి లేకుంటే దాని దోషం వెంటాడుతుంది. ఇక తిరిగి రాణివారు ఆ నగను ధరిస్తే ఆమె కురూపిగా మారిపోతుంది. ఆమె నవనాడులు కృంగిపోతాయి. ఇది సత్యం ఇందులో రవ్వంత దోషం లేదు. కావాలంటే వజ్రాలు, మణుల గురించి తెలిసిన నిపుణులకు సంప్రదించండి అని రాసుంది. అది విన్న మరుక్షణం అదిరిపడ్డారు అక్కడ రాజోద్యోగులు, వారితో బాటు రాజుకూడా మానసికంగా తల్లడిల్లిపోయాడు వెంటనే రాళ్ల

నిపుణులను రప్పించి ఆ లేఖ చూపించాడు. వారు చదివి అయోమయం లో పడ్డారు. తర్జనభర్జనలు పడ్డారు.

"ప్రభూ ఈలేఖ నూటికి నూరుపాళ్లనిజం నగలో దోషం ఉండబట్టే ఆ నగకోసం ఇంతమంది ఇంతగా బాధపడ్తున్నారు.దాన్ని మరిచిపోండి. అది మీకు శత్రురాజుచే బహుమతిగా లభించింది. మాకు తమరు ఆరోజు చూపించలేదు. అప్పుడే చెప్పేవాళ్లం." అని వారు మరింత ఆజ్యం పోసారు. విన్నవాళ్లు చేష్టలుడిగారు.

రాణి అంతవరకు ఆ నగకోసం నానా ముచ్చటలకు పోయింది. ఇప్పుడు తను ఆ నగ ధరిస్తే కురూపినవుతాను అని తెలియడంతో ఆ నగ వద్దు. దాన్ని నా మెడలోకి రాకుండా జాగ్రత్త పడతాను,అంతటి పాపాల పుట్టయిన నగను శత్రువు బహుమానంగాఇచ్చినపుడే అనుమానించాల్సింది అని రాజుతో చెప్పి తన చుట్టు మరింత పటిష్టమైన కాపలా పెట్టుకుంది. ఇప్పుడు పోయిన నగ రాజకుటుంబానికి సైన్యానికి ఒక దయ్యం అయి కూర్చుంది. రాణీవాసం చుట్టూ కాపలా మరింత పెరిగింది. దొంగిలింప బడిన నగను తిరిగి రాణిమెడలో వేయాలని ఎవరైనా ప్రయత్నిస్తారని రాజుకు భయం పట్టుకుంది. ఆయనకు దాసీలపైనే అనుమానం ఉంది. వారిని కోటలోకి వెళ్లునపుడు పూర్తిగా తనికీలు చేసి లోపలికి పంపుతున్నారు.

రామన్న తానువేసిన పాచిక పారింది. ఇక ఆ నగను రాణిమెడలోకి ఎలా ఆ దొంగలు చేర్చుతారా అని వేచిచూడాలి అనుకున్నాడు. ఇంతకీ దొంగలు ఎవరై ఉంటారా అని ఆలోచించాడు. ఆ రోజు తాను ఆడవేషం వేసుకుని అంగడికి పోయినపుడు వీధి చివరిలో ఉన్న తండ్రీకొడుకులు ఆడవేషాలతో వచ్చారు.వారు చేసే వ్యాపారం ఉప్పుగుళ్లు.అది అంత లాభదాయకం అయినది కాదు.మరిఎలా ఆ వ్యాపారం చేస్తున్నారు. చేయడమే కాకుండా మంచి కొంపలో ఉంటున్నారు. ఆడవేషాలు వేసుకుని వచ్చి పోనీ ఏమైనా వస్తువులు కొనుగోలు చేసారంటే అదీ లేదు. వారిలో ఏదో మర్మం ఉంది అని ఆ రాత్రే అనుమానించాడు. అలా పలువురిని అనుమానించినా చివరకి తేలింది ఈ తండ్రీకొడుకులే.వారిని ఒక కంటకనిపెట్టసాగాడు. వారుండేది తనుండే పూటకూళ్లవ్వ ఇంటి దగ్గరలోనే.





దండోరా వెలువడిన నాటి నుంచి వారు చాలాభయపడ్తున్నట్టుగా కన్పించారు. భయం వారిని పిండేస్తోంది. రకరకాలుగా ఆలోచించసాగారు. ఎలా వదిలించుకోవాలి నగ. ఇది ఇంత ప్రమాదకరమైనదా అనవసరంగా దీన్ని మెడకు తగిలించుకున్నాం అనే తపన వారిలో రామన్న చూడగలిగాడు. వీధిలో వారు కూడా ఆ తండ్రీకొడుకుల గురించి రకరకాలుగా చెప్పుకో సాగారు. ఎప్పుడు అన్యోన్యంగా ఉండేవారు ఈ మధ్య కీచులాడుకుంటు న్నారు. వేరే కాపురాలు పెట్టుకుందామనేవరకు వెళ్లారు. ఏమిటో వీరిని చూస్తే మొన్న రాజు నగ వీరికి దొరికినట్టుంది అని గుసగుసలాడుకోసాగారు. అలా నగరమంతా కోడైకూసింది. తండ్రీకొడుకులు తగ్గడంలేదు. వారు రోజురోజుకి కీచులాటలతో ఇల్లుపీకి పందిరి వేసుకోసాగారు. ఒకరోజు ఏకంగా తండ్రిని కొడుకు చావబాది తగవుపడి తిన్నగా రాజుకు ఫిర్యాదు చేసేవరకు వెళ్లారు. తండ్రీకొడుకు ఎన్ని అనుకున్నా ఎంతగా దూషించు కున్నా తాము దారిదోపిడీ దొంగలం అనిగాని, ఈ మధ్య రాణిమెడలో నగ తస్కరించాం అని అనుకోకుండా మిగిలినవి ఎంచుకోసాగారు. నువ్వు అంతతింటావు అంటే నువ్వు ముసలి పీనుగువయినా బకాసురిడిలా తింటావు. నీకు వండిపోయలేక నా భార్య ఛస్తోంది అని కొడుకు ఏమాత్రం తగ్గకుండా ఇల్లు ఎక్కిమరీ అరవసాగాడు. వినేవాళ్లకు వినోదంగా ఉంది. గుమిగూడి వినసాగారు.

ఇక అత్తాకోడల్లు అయితే జుట్లు పట్టుకుని వీధినపడి కొట్టుకోసాగారు. కోడలపిల్ల కూటికి గతిలేక వచ్చింది. మాకు మతిలేక తెచ్చుకున్నాం.దీని తండ్రి జూదగొండోడు. తల్లి నాలుగు ఇళ్లలో ఏదో ఒకటి దొంగిలించితేగాని. దానికి పూటగడవదు.అలాంటి దొంగోలు సంబంధం తెలియక చేసుకున్నాం. దీని ముఖం చూస్తే పంచకోటి మహాపాపాలు అంటుకుంటాయి.ఇది కోడలా ఛీ, దయ్యం ఎంత అయినా తినగలదు. నా మొగుడు, నా కొడుకు కష్టం దీనితిండికే సరి పోతుంది. ఇదీ దీని తల్లినిమించిన దొంగే.ఇరుగుపొరుగు కోళ్లు పట్టి తినేస్తుంది.వీధిలో ఎవరి కోడి పోయినా దీనిదెబ్బే" అని అత్త ఊరువాడ ఏకం చేసింది.

కోడలు మాత్రం తక్కువతిన్నదా నోరు మరింతపెద్దది చేసి "చక్కగా సాగుతున్న ఈ కుటుంబాన్ని వీధిల పాలుచేసారు ఇది, దీని ముదనష్టపు ముసలి మొగుడు. ఎక్కడిది చాలదు. ఏదో ఒకటి దోపిడీ చేసి తినంది వీరికి నిద్రపట్టదు నా మొగుడు ఎంతఅమాయకుడు చెప్పినపని ఇది తప్పు అది ఒప్పు అని తర్కించుకోకుండా చేస్తాడు. ఏకంగా రాణివారి నగను ముసలిపీనుగు ఎత్తుకు రమ్మంటే కుర్రకుంక దొంగిలించాడు. అది మా ఇంటిలో అన్ని అనర్ధాలకు దారి తీసింది. ఎవరు చస్తామో తెలియదు. ఎందుకు అనర్ధాల నగ. ఏ ముహూర్తానా తెచ్చారో, ఈ అత్తముండన్నట్టు ఒక్క కోడి దొరికి చావలేదు. నేను ఇలా చెయ్యి విసిరితే, అలా దొరికేవి ఇప్పుడు అవి పట్టుకుంటే తప్పించుకుని మీద రెట్టవేసి పారిపోతున్నాయి. మరిశాపాల నగ దొంగిలించి తెచ్చిపెట్టారు. ఇలానే ఉంటుంది. ముద్దకువాచి చావా ల్సిందే." అని ఇల్లుమీదకు ఎక్కి పదివీధులు వినేట్టు అరవసాగింది.

భటులు నలుగుర్ని రాజుముందు నిలిపారు. కొలువులో నలుగురు ఎడముఖం పెడముఖం పెట్టుకుని నిలబడ్డారు. ప్రజలు గుసగుసగా చెప్పుకోసాగారు మన విక్రమకేతు, వనకేతులు ఉప్పువర్తకులు కారన్నమాట గజదొంగలు. నిజమే వారు ఎవరితో కలిసి ఉండేవారు కారు. ఎప్పుడూ తెల్లవారు జామున ఉప్పుమూట లు గుర్రపుబండిలో వేసుకుని వస్తుండేవారు. వాటిమధ్య ఈ దోపిడి మూటలు తెచ్చేవారన్నమాట. ఓర్నాయినో వీధి మధ్య వీరున్నారు. ఎంతగా నమ్మించారు.

ఆ ప్రజలు నుంచి రామన్న వెలికివచ్చి"మహారాజా ఈ మధ్య నేను మీ హుండీలో ఒకలేఖ రాసి వేసాను. నాపేరు మర్యాదరామన్న. అని పరిచయం చేసుకున్నాడు అంతా అప్పటికే ఆనోట ఈనోట విన్నందున రామన్నను కన్నులు పెద్దవి చేసుకుని చూడసాగారు. రాజు తన ప్రక్కనే కూర్చుండబెట్టుకున్నాడు. కుశలప్రశ్నలు వేసాడు. అనుకోవడమే కానీ. ఇదే మొదటిసారి చూడడం అని చెప్పాడు.

రామన్న రాజుకు గుసగుసగా చెప్పాడు. తాను దేశసంచారంలో భాగంగా ఇలా వచ్చాను. ఇక్కడ నగపోవడం వందలాది భటులు వెతుకు





లాటను చూసాక ఒక లేఖను రాసి వేసాను. దాని గుణం కన్పించింది. మీరు. ఒకసారి ఆ నలుగురిని ప్రశ్నించండి. చాలావిషయాలు తెలుస్తాయి. అని వినమ్రంగా చెప్పాడు. రాజు సరేనని దండనాయకున్ని అడిగాడు. వారిని ఎందుకు ఇక్కడ హాజరుపరిచావు. వారుచేసిన నేరమేమి? సభలో అందరికి వినేట్లుగా చెప్పు."అని ఆదేశించాడు.

"మహారాజా! రాణీవారి నగను ఈ తండ్రీకొడుకులు కాజేసారు. దాని ప్రభావం వలన కీచులాడుకుని ఇల్లు ఎక్కి పీక్కుకునే స్థితికి వచ్చారు. వారి నోటినుంచి వారి దొంగతనం విని తీసుకువచ్చాను. అలాగే ఈ నలుగురు దొంగలు వీరుచేసే ఉప్పువ్యాపారం వెనుక దొంగతనాలు దోపిడీలున్నాయి. నేనేకాదు. చాలామంది విన్నారు. కావాలంటే తమరే అడగండి ప్రభూ!"

రాజు ఆశ్చర్యంగా చూసాడు. "ఏమి ఆ నగను వీరు దొంగిలించారా వీరు వ్యాపారులు కారా, దొంగలా? ఏమిటిదంతా? ఆ రోజు రాణీ వాసస్త్రీ లకు, మిగిలిన నగరంలో స్త్రీలకే పరిమితం కావల్సిఉండగా, పురుషులకు నిషిద్ధమై ఉండగా ఎలా ప్రవేశించగలిగారు ఇది సహించరానిది. మర్యాదగా చెప్పండి. ఎలా మీరు అంగడిలోకి ప్రవేశించారు. మీరు వెంట వెంటనే నిజాలు చెబితే మీకు దండన కొంత వరకు తగ్గవచ్చు. లేకుంటే చిత్రహింసలు పాలుచేయకపోను"

సభ మొత్తం నివ్వెరపోయి వినసాగింది. తండ్రి విక్రమకేతు ముందుకు వచ్చి" ప్రభూ ఏదీదాచకుండా చెబుతున్నాను. మా తాతలునుంచి దొంగతనం వృత్తిగా బతుకుతున్నాం. అయితే,కొండలు కోనల్లో తలదాచుకుని బతుకు ఈడ్చేందుకు నాకు సమ్మతంగా లేనందున నేను నా భార్య ఉప్పు అమ్ముకునే వ్యాపారంతో నగరంలో అడుగుపెట్టాం ఇక్కడే నా కొడుకు పుట్టాడు. వీడికి విద్యాబుద్ధులు చెప్పించి ఈ దొంగతనాలు మానుకోవాలనుకున్నాం. కానీ, వీడు పసిగుద్దుగా ఉన్నప్పుడే ఎత్తుకుని ముద్దులాడే ఆడాళ్ల ముక్కులు చెవులు తడిమేస్తుండేవాడు. వీడివి మా ముత్తాతబుద్ధులని ఆ తరువాత తెలిసింది. సరే కన్నాం కనుక పెంచక తప్పదు. అలా పెరుగుతుంటే వీడు దొంగతనాల పై మక్కువ మరింత ఎక్కువ కనబరచడంతో వీడికి విద్యలు నేర్పించకుండా

దారిదోపిడీలకు నాతో తీసుకుపోయేవాడిని. అలా చాలా దోచుకున్నాం. మరోవిషయం చెబుతాను.మన రాజ్యంలోగల ప్రజలకు ఏక ధాటిగా నెలరోజులు తిండి పెట్టగలిగిన సత్తా నాకుంది ప్రభూ! అంతగా దారినపడి దోచాను. అందులో మన రాజ్యంలోనిది చిల్లిగవ్వలేదు. పొరుగు రాజ్యాలలో దోచాను. మీరు ఏది దాచకుండా చెప్పమన్నారు కనుక వివరంగా చెప్పాను."

రాజు సంభ్రమాశ్చర్యాలతో విన్నాడు."ప్రభూ ఇక రాణీవారి నగ గురించి చెప్పాలి. ఆ వజ్రాల నగ గురించి విన్నాము. కనుకనే కన్నేసాం. ఆడవేషాలతో తండ్రీకొడుకులం అంగడికి వెళ్లాం.అక్కడ రాణీవారు కన్పించారు. ఆమె ధగధగ మెరిసి పడ్తోంది. ఆ నగ మరింత మెరవసాగింది. మెల్లగా అటుగా వెళ్లాం. దాసీలు ఆమెను సమీపించడానికి కుదరదు అన్నట్టు చుట్టూ ఉన్నారు. వెంటనే మా సంచిలో ఉన్న కోరలు తీసిన నాగుబామును తీసి రాణీవారి రథంలోకి వదిలాం. ఆ పాము మా కోసం అన్నట్టు రథంలో ఏమూలనో నక్కిదాక్కుంది.రాణీవారు రథమెక్కి బయల్దేరుతుండగా బుస్సుమంది. అంతే రాణీవారు భయంతో గజగజ లాడిపోయారు. అక్కడ భటులెవరు ఉండని కారణంగా దాసీజనులు పాము పేరుచెప్పితే పరుగులు తీసారు.అప్పుడు మేము రథమెక్కి పామును పట్టుకుంటున్నట్టుగా నటించాం. ఈ హడావుడిలో కుంచించుకుపోయి రథంలో ఒక పక్కకూర్చుండిపోయిన రాణివారి మెడలో వజ్రాలహారం తీసాను. ఇది ప్రభూ, మేము హరించిన హారం కథ."

"రాణి మెడలో హారాన్ని నీవు తీసావా? నీ కొడుకు తీసాడా ?" రాజు తీక్షణ దృక్కులతో అడిగాడు.

"ప్రభూ ఇన్ని నిజాలు చెప్పినవాడను ఈ విషయం దాచగలనా? నేను దొంగలవంశానికి చెందినవాడినయినా, నాకు మంచి చెడు తెలుసు. మీ నీడల్లో బతికేటోల్లం.మీకు అపచారం జరిగేపనులు ఏమి చేయం.ఇకనేను ఆమె కంఠహారాన్ని తస్కరించినపుడు నాచేతిస్పర్శ గురించి చింతవలదు. నాకు ఆమె పుత్రికతో సమానం.రాణివారి దరిదాపుల్లో నా కొడుకును





నిలబడనీయకుండా జాగ్రత్తపడ్డాను."అని చెప్పాడు. అతడిమాటలకు అంతా ఆశ్చర్యపోయారు.

రాజు ఆలోచనలో పడ్డాడు.అప్పుడు విక్రమకేతుడు మరల గొంతు విప్పాడు."మహారాజా ఇదిగో తమవద్ద తస్కరించిన నగ దీన్ని తమరే తీసుకుని మమ్మల్ని మన్నించి విడిచిపెట్టండి ప్రభూ!"

"విక్రమకేతు ఆ ఆభరణం మరి నాకు అక్కర్లేదు. దాన్ని నీవే ఉంచుకో నాకు దానికి ఋణతీరిపోయింది. మాకు ఆ నగ ఏవిధంగా రాణించదు."

'ప్రభూ మన్నించి స్వీకరించండి.తెలిసి తెలియక చేసిన పొరపాటుకు మమ్మల్ని బలిచేయకండి. నగ తెచ్చినప్పట్నించి మా ఇంటిలో తగవులు ఇన్నీ అన్నీ కావు. నేను నా కొడుకు ఎప్పుడు ఏమీ అనుకోలేదు. వీడు ఇటుపిలిస్తే అటు పలుకుతున్నాడు. ఇకకోడలు తలపొగరుతో ఉంది. అది కనీసం మాంవయ్య అని కూడా చూడడంలేదు. నోటికి ఎంతమాట వస్తే అంతే అనేయడమే కాదు అత్తమీద చాడీలు చెప్పుకుని తిరుగుతోంది. చాలాప్రమాదంలో నా కుటుంబం ఉంది.ఇదిగోండి మీకు తిరిగి ఇచ్చేయ డానికి తీసుకువచ్చాను." అని నగను వెలికితీసాడు.

సభలో రాణీవాసస్త్రీలు కూర్చున్న చోటునుంచి ఇరువురు దాసీలు వచ్చి "ప్రభూ ఎట్టిపరిస్థితిల్లోకూడా ఆ ఆభరణాన్ని స్వీకరించవద్దు అని రాణీగారు తమరిని కోరుతున్నారు" అని చెప్పారు.

రాజు వారిని పంపించి "ఓయీ విక్రమకేతూ నీవు దొంగిలించిన వస్తువు వలన నీకు ఎట్టి విపత్తు కలిగినా దాన్ని నీవు అనుభవించాల్సిందే. తిరిగి పుచ్చుకోవడం కుదరదు. అంతేకాదు ఆ ఆభరణం వలన విపత్తు నీవు నీ కుటుంబం ప్రత్యక్షంగా అనుభవించినట్లు చెప్తున్నావు. మరిదాన్ని నాకు ఇవ్వజూపడం ఎంతవరకు సబబు."

"ప్రభూ తమరే రక్షించాలి. ఆ వస్తువును వదిలించుకోవాలన్నచో ఎంతసేపు పట్టదు. రాణీవాసంలోకి ప్రవేశించి నగను రాణీవారి కంఠంలో వేయగలను. ఈలోగా నేను మీకు బంధీ అయ్యాను.నేరం ఒప్పుకున్నాను. కనుక మీకు అప్పగించడం తప్ప నేనుగా ఎలాంటి సాహసం చేయలేను.మీరే-

టముకుద్వారా తెలియపరిచారు. ఎక్కడనుంచి ఎత్తుకు వెళ్లబడిందో అక్కడికే చేరాలి. కనుక తమరే స్వీకరించాలి." అని ముందుకువచ్చి మెరిసిపడ్తున్న నగను రాజుముందు పెట్టాడు.

రాజు తనకళ్లెదుట ఆ నగను తీయమని చెప్పాడు దాన్నో విషసర్పంలా చూడసాగాడు. భటులు కూడా భయపడసాగారు. రామన్న నవ్వుతూ చూసాడు. రామన్నను రాజే గుసగుసగా కోరాడు "రామన్నా నీవు మంచి మాటకారివని విని ఉన్నాను. ఇక్కడ ఈ సంకట పరిస్థితిని చూసావు దాన్ని నీవే పరిష్కరించాలి. నేను రాజునై ఉండి నా ప్రజలక్షేమం కోరినవాడిలా ఉండాలి. అలాంటిది నేను ఆ గజదొంగ వద్ద ఆభరణాన్ని దానికున్న దుష్టశక్తులకు భయపడి తీసుకోలేకపోతున్నాను."

రామన్న లేచి నిలబడి "మహారాజా ప్రశాంతత పొందండి. ఈ సభాముఖంగా చాలా విషయాలు చెప్పాల్సిఉంది. గజదొంగ చేతిలోఉన్న ఈ నగకు ఎలాంటి దుష్టశక్తులు లేవు. కేవలం ఆ భ్రమలో ఉన్నారంతా. నేను ఒక లేఖ రాసి హుండీలో వేసాను. దాన్ని మీరు చదివి ఈ నగ ధరించితే కష్టాలు తప్పవు అని భ్రమకు లోనయ్యారు. వాస్తవానికి ఆలేఖను నేను ఎందుకు రాసాను అంటే పోయిన నగకోసం రాణీవారు అలక, రాజుగారు రోజుకు రెండుపూటలా దండోరాలు వేయిస్తున్నారు. నగ దొరక్కపోతే అనుమానితులను బ్రతకనీయను చిత్రహింసలు పాలు చేస్తామంటున్నారు. మరోవైపు అన్ని ఇళ్లల్లో రాత్రనక పగలనక వెతికిస్తున్నారు. వీటిని చూసాక తెలివిగా ఈలేఖ ఇక్కడ వర్తమానపరిస్థితిలతో రాసాను. దాన్ని మీరు నమ్మారు. వజ్రాలనిపుణులను అడిగితే వారు కూడా అయ్యా ముమ్మాటికి ఆ నగలో వజ్రాలు, మణులు అన్నీ కష్టాలు కలుగ చేస్తాయి అనిచెప్పారు. కాదంటే ఎందుకు కాదు అని మీరు అడుగుతారు. అవును అంటే ఆ సమస్య ఉండదు. ఇక నగ దొంగిలించుకుని వెళ్లిన విక్రమకేతు ఇంట్లో తగువులు నివురుగప్పిన నిప్పుల్లా చాలాకాలంగా ఆ ఇంట్లో ఉన్నవే. అవి ఏనాడు బయటపడలేదు. ఎక్కడా అత్తాకోడలకు మంచి ఉండదు. అలాంటప్పుడు ఏదో దుష్టశక్తి తెచ్చుకున్నామని వారిలో ఒక భావన





ఎప్పుడయితే ఏర్పడిందో వెంటనే వారు ఆ దుష్టశక్తియే నడిపిస్తుందని అత్తకోడలుమీద,కోడలు అత్తమీద చెడామడా చెలరేగి పోయి ఇల్లుపీకిపందిరేసుకున్నారు. వాస్తవానికి ఏ దుష్టశక్తిలేదు. అంతా భ్రమే. తండ్రికొడుకుల మధ్య గొడవలు కూడా అలాంటివే. కేవలం నేను నగ పోకూడదని ఎక్కడయితే దొంగిలించి తెచ్చారో అక్కడే తిరిగి ఖచ్చితంగా పెట్టాలని రాసాను. లేకుంటే ఆ నగ ఇక్కడికి రాదు. వేరే చోట అమ్మేసు కుంటారు." అని రామన్న నవ్వుతూనే చెప్పి ముగించాడు.

ఒక్కసారి అంతా ఊపిరిపీల్చుకున్నట్టు అయ్యింది. రాజు గొంతు సవరించుకుని "రామన్న చెప్పినది మనమంతా నమ్ముతున్నాం. చాలా తెలివిగా రామన్న ఎత్తుగడ వేసి నగను మన వద్దకు రప్పించాడు. రామన్న తెలివికి మనమంతా మెచ్చుకోదగ్గదే. సరే, ఇక్కడో విషయం చెప్పాల్సి ఉంది. రాణివాస స్త్రీలకోసం ఏర్పాటు చేయబడిన అంగడికి గజదొంగలు తండ్రీకొడుకులు ఆడవేషాలతో ప్రవేశించి నందున వారిని మరణదండన విధించకుండా ఉపేక్షించను." అని కోపంతో అరిచాడు. సభ అంతా బిక్కముఖం వేసింది.

రామన్న రాజును శాంతపరిచి "రాజా క్షమించాలి. నేనూ ఆడవేషంతో అంగడికి వెళ్లాను. కొన్నివందలమంది యువకులు అక్కడకి ఆడవేషాలలో వచ్చారు అంతకుమించిన మరో విషయం ఉంది మీ కాపలాగా ఉండేభటులు ఆడవేషాల్లోనే ఉన్నారు. మీరు తీయాలంటే చాలామందిని ఉరితీయాల్సి ఉంటుంది. అందులో నన్ను తీయండి" చేతులు కట్టుకుని నిలబడ్డాడు.

"రామన్న నిజంగా సంకటస్థితిని నాకు కలుగచేస్తివి. ఇంత మంది ఆడవేషాలతో అంగడిలో ప్రవేశిస్తున్నారా? ఎందుకు అలా చేయడం వలన వారికి వచ్చు ప్రయోజనం."రాజు అడిగాడు.

"ఏముంది ప్రభూ, నాలాంటివారు ప్రతి పౌర్ణమికి ఈ అంగడిలో ఏమి అమ్ముతారు తెలుసుకోవాలి అని ఉత్సుకతతో ప్రవేశిస్తారు. ఇక దొంగలకు రాణీవాసంవారివద్ద దండిగా బంగారం లభిస్తుంది అని ఆశ మీ కాపలాదారులు వారి విధినిర్వాహణ చేయడానికి రాణీవాసానికి ఎలాంటి

ఆపదరాకుండా ఆడవేషాలతో కాపలాకాసారు." రామన్న చెప్పాడు.

రామన్న విషయాన్ని విడమర్చి చెప్పినందున రాజు అభినందించాడు. గజదొంగలకు శిక్షించకుండా వదిలేసాడు. స్త్రీలకోసం ఏర్పాటుచేయబడిన అంగడిలో ఆడవేషాలతో మగవారు ప్రవేశానికి ఇకమీదట తీవ్రంగా పరిగణిస్తామని చెప్పి తొలి తప్పుగా వదిలేసినట్లు తెలిపాడు. ప్రతిపౌర్ణమికి ఈ అంగడి ఏర్పాటును ఎత్తివేసి, ఏడాది కోసారిగా మార్చేస్తానని సభలో ప్రకటించాడు.

రామన్నను కుశాలి నగరవాసులు చక్కని యుక్తితో గజదొంగల నుంచి ఆభరణాన్ని తిరిగి రప్పించినందుకు అతన్ని ఎంతగానో కొనియాడారు. రాజు ఆభరాణాన్ని రాణికి పంపగా ఆమె వద్దంది. ఎంత మంది ఎన్ని విధాలుగా చెప్పినా ససేమిరా అంది. రాజు కూడా చాలాసేపు చెప్పినా తనకు వద్దుగాక వద్దు అంది. అప్పుడు రాజు రామన్ననే చెప్పమని కోరాడు. రాజా ఆడువారికి నగలు అంటే ఎంతపిచ్చి అభిమానమో అంతకంటే వారికి అందాలపిచ్చి ఎక్కువ. నేను రాసిన లేఖలో ఈ ఆభరణం వలన కురూపితనం వస్తుంది అని రాసాను అందుకే రాణీవారు వద్దంటున్నారు" అని చెప్పాడు. రాజు పగలబడి నవ్వాడు.

"రామన్న నీకు ఎదైనా విలువైన బహుమానం ఇవ్వాల్సి ఉంది ఈ ఆభరణాన్ని ఇస్తే స్వీకరిస్తావా?" అని మెల్లగా అడిగాడు.

తప్పకుండా తీసుకుంటాను ప్రభూ! ఇందులో రవ్వంతయినా దోషం లేదు. నాకు అవశ్యం ఇప్పించండి. ప్రభూ నేను ఎలాగూ తమవద్ద వారం రోజులుంటాను. నా వద్ద ఉన్న ఆభరణంలో దోషం ఉంటే నా మీద తమకు ఏదో రకమైన ఏహ్యాభావం కలుగుతుంది. మీరు గమనించండి అని ఆ ఆభరణాన్ని తీసుకున్నాడు. వారం వరకు రాజాతిథ్యం స్వీకరించి కుశాలి నగరం వదిలి కాంచనపురం వైపు బయల్దేరాడు. రామన్నకు తోడుగా పలువురు రాజోద్యోగులు వెంటవచ్చారు. అలా కొంతదూరం వెళ్లాక రామన్న బాటసారులతో కలిసిపోయాడు.





# దేవునికే సాధ్యం కానిది

రామన్న కాంచనపురంలోకి అడుగుపెట్టాడు. అక్కడ ఒక యోగి చచ్చినవాణ్ని బ్రతికించగలనని చెప్పి ప్రజలచే పూజింపబడ్తున్నాడు. అక్కడ రాజు అతడి పరివారం కూడా ఆ యోగి సేవలలో మునిగి ఉన్నారు. సరిగ్గా అదే సమయంలో వెళ్లి అంతా గమనించాడు. ఆ యోగి పేరు నందయోగి. పట్టుమని ముప్పది ఏండ్లున్నవాడు. ఆ యోగి అహంకార పూరితమైన ప్రేలాపనలతో కన్నుమిన్నుగానకుండా ఒక తోటలో విడిది చేసాడు. అందరిని ఏకవచన ప్రయోగంతో సంబోధిస్తూనే కాలంగడుపు చున్నాడు. అంతా అతని ఎదుట నిలిచేందుకు భయబ్రాంతులై పోసాగారు. ఇన్ని అవలక్షణాలున్న యోగిని ప్రజలు ఎందుకు దేవుడిలా కొలుస్తున్నారంటే చిన్న మహిమలు చూపుతున్నాడు ఆ కారణంగా అతడు దేవుడయ్యాడు.

ప్రజలు ఉదయం అయ్యేసరికి తండోపతండాలుగా బయల్దేరి తోటలోకి వెళ్లి దర్శించుకుని వస్తున్నారు. రాజు, రాజపరివారానికి ఆ యోగి ప్రత్యేక దర్శనం ఇస్తున్నాడు. ఇదంతా చూసిన రామన్నకు ఎందుకో ఆయోగిని చూస్తే చాలా జాలి కలిగినది. అరవైఏండ్లరాజు యోగి పాదాల మీద పడి మొక్కుతుంటే ఆ యోగి ఆనందంగా చూస్తున్నాడు. పేదలు మొక్కుతుంటే వారినుంచి తన పాదాలను విసురుగా లాక్కుంటున్నాడు. చాలా వింతైన యోగిలా ఉన్నాడని రామన్న పగలబడి నవ్వసాగాడు. ఒకదశలో యోగి రామన్నను చూసి ఊదేస్తాను అని కోపంగా సైగ చేసాడు. అది చూసి రామన్న మరింత పగలబడినవ్వాడు.

యోగి తట్టుకోలేకపోయాడు. పక్కనే ఉన్న రాజభటులకు చెప్పాడు వారు పరుగున వచ్చి రామన్నను పట్టుకుని యోగివద్దకు తీసుకుపోయారు. అక్కడే రాజు ఉన్నందున అతడు అడిగాడు "ఎవరీ బాలుడు? ఎందుకు ఈడ్చుకు వచ్చారు. ఈతడు చేసిన నేరమేమి?" అప్పటికి ఇంకా రామన్న నవ్వుతూనే ఉన్నాడు. రాజుకు కూడా చిర్రెత్తుకు వచ్చింది "ఈతడు వర్థి వాచాలుడులా ఉన్నాడు. విషయం రాబట్టండి." భటులను ఆదేశించాడు

రామన్న నవ్వులు ఆపుకుని "ప్రభూ నేను చాలాదూరం నుంచి అంటే కళింగ రాజ్యంనుంచి వచ్చినవాడను. నన్ను అంతా మర్యాదరామన్న అని

పిలుస్తారు. దేశాటనలో భాగంగా ఈ కాంచనపురానికి ఇప్పుడే వచ్చాను." రాజు వెంటనే భటులను దూరంగా పంపించి "రామన్నా నీ గురించి చాలావిన్నాను. నీవు ఇలా కలుసుకోవడం నాకు చాలా ఆనందంగా ఉంది. అన్నట్టు ఈయన నందయోగి,చచ్చినవారిని బ్రతికించు దివ్యశక్తి సంపన్నుడు మా పూర్వజన్మ సుకృతమున ఇక్కడికి వచ్చారు.నీవును వచ్చి ఈయన ఆశీర్వాదం స్వీకరించు." అని చేయి అందించాడు.

"ఏమి ఈ బుడుతడేనా, మర్యాదరామన్న. బొత్తిగా మర్యాద ఇచ్చే వానిలా లేడు. పిల్లచేష్టలతో పగలబడి నవ్వుచున్నాడు. నా మనస్సు ఎందుకో చాలాబాధపడినది. ఇట్టివానిని క్షమించరాదు. ఏమూలనో అహంకారం ఈతన్ని ఆవహిస్తున్నప్పుడు ఇలా ప్రవర్తిస్తుంటాడు. ఇట్టివానికి శిక్షించాల్సిందే."యోగి ఆగ్రహం వ్యక్తం చేసాడు.

రాజు ఏదో సర్దిచెప్పాలని చూసాడు. యోగి మరింతగా కోపంతో చెలరేగి పోయాడు.అప్పుడు రామన్న నవ్వి "యోగివైన నీవు చేస్తున్న హీనమైన చర్యలకు నాకు పగలబడి నవ్వేటంత నవ్వు వచ్చినది. ఎందుకో తెలుసా? చచ్చినవాణ్ని బ్రతికించగలవని, ఇక్కడ నీ శిష్యులు ఫదేపదే ప్రచారం చేస్తున్నారు. మనల్ని సృష్టించిన ఆ దేవదేవుళ్లకే లేదు. ఇట్టి శక్తి ఆనాడు శ్రీమహావిష్ణువు తన పుత్రుడు మన్మధుడు శివుని నేత్రజ్వాలల్లో మాడిమసై పోతేనే తిరిగి బ్రతికించలేకపోయాడు. సాక్షాత్తు శివుడు తన దారికడ్డంగా ఉన్న తనకుమారుడిని కానక హతమార్చి తిరిగి బ్రతికించలేక పోయాడు. ఇక నీ వంటి సాధారణ యోగివలనేమి అవుతుంది. వద్దు నీవు అత్యాశలకు, ప్రలోభాలకు పోవద్దు. రాజులను ప్రజలను నీ మభ్య మాటలతో వారిని కొంతకాలమే నమ్మించగలవు. ఆపైన కుదరదు. పైగా నీవు భూమి ఆకాశం చూడకుండా చెడామడా రాలిపోయి పేలిపోతున్నావు. ఏంచూసి నీకా అహంకారం. సాక్షాత్తు వృద్ధుడైన రాజుచే నీ పాదములను మొక్కించుకుని అందులో ఎంతో సంతృప్తిని వెతుక్కుంటున్నావంటే నీవెంత హీనుడవో అర్థం అవుతుంది. నీవు చేసి చూపేవి పేలవమైన అతి చిన్న తంత్ర విద్యలు, ఇప్పటికైనా నీ నీచధోరణి విడనాడితే నీవు ఏదో ఒకరోజున యోగికాగలవు." అని అక్కడి వారందరికి వినిపించేలా రామన్న గొంతుఖంగుమంది. అంతా బిక్కముఖాలతో నిలబడ్డారు. రాజు ఏమి చెప్పలేక రామన్నను అదోలా





చూసాడు. యోగి వెంటనే కమండలం అందుకుని "బుడుతా ఎంతకండ కావరంతో కన్నుమిన్నుగానక ప్రేలితివి. నిన్ను ఘోరంగా శపించిగాని విడువను. ఏమన్నావురా రాజుచే పాదములు మ్రొక్కించుకుని ఆనందాన్ని వెతు క్కుంటున్నానా? పామరుడైన రాజు నా కాళ్లకు మ్రొక్కితే అందులో నాకు ఆనందం ఏముంది, వీరు చేయు పాపములను నేను మోయాలి. ప్రమాణాన్ని స్వీకరించడంలో ఇన్ని కష్టాలు ఉంటాయి. కుర్ర చేష్టలతో నోటికివచ్చినట్లు కూయుచుంటివి. ఓరాజా ఈ దుష్టబాలున్ని నీవుగా శిక్షించాలి. లేదా నేనే నా తపోబలంతో నామరూపాలు లేకుండా చేయగలను." యోగి ఎరుపెక్కిన కన్నులతో రాజును అడిగాడు.

"యోగీశ్వరా దయచేసి ఈ బాలునిపట్ల శాంతం వహించండి. ఈతడు సామాన్యుడుకాడు మర్యాదరామన్నగా వాసికెక్కినాడు. మంచి తీర్పరిగా పలురాజ్యాలలో విశేషాధారణ పొందిన వాడు. కనుక క్షమించి విడువండి తప్పదని భావిస్తే ఆ శిక్ష నాకు విధించండి" అని రాజు కోరాడు.

యోగి కటకటలాడాడు."అయ్యో ఎంతటి జటిలసమస్య నాకు ఎదురైంది. రాజా! ఈ నీచబాలకుడి కోసం మీరెందుకు ఇంతటి నిర్ణయాన్ని తీసుకుంటారు. ఇట్టివారిని విడువరాదు. ఏవో చిరుతప్రాయమందు మాటలు రాని ఇట్టి మతిమాలిన బాలురకు పక్షులకు పట్టే వస అనే మూలికను నాలుకకు రాస్తారు దాని ప్రభావమున వారు కొన్నాళ్లకు మాట్లాడగలుగుతారు ఊహలను పూర్తిగాపోసుకోని బాలకుడేమి పలురాజ్యాలలో ప్రజలకు, పెద్దలకు తీర్పులు చెప్పుటేమి,కాలప్రభావ మందురు. వీనిని నాకు అప్పగించండి."మరింత ఉన్మాదంతో రామన్నను పట్టుకుని అటుఇటు గుంజేయసాగాడు. రాజు అదోలా అయిపోయి యోగీశ్వరా ఆగుము అని నిలువరించాడు.

రామన్న నవ్వి " ఓ యోగీకాని యోగీ, నీ పాపం పండినది కనుకనే నీవు ఇట్లు నీచానికి దిగజారిపోతివి. సరే ఇక్కడ మన ఇరువురుకి పరీక్ష. కాంచనపురప్రముఖుల ముందు నీ శక్తిని ప్రదర్శించు. చిన్నచిన్న పనికి మాలిన పనులు చేస్తు ఇలా పూజింపబడుతున్నావు. ఇక ప్రదర్శించు నీ శక్తియుక్తులు వాటిని నిరోధించడమేకాదు వాటిని పూర్తిగా నిర్వీరం చేస్తాను. ఇందులో ఏమాత్రం అపజయం పొందను."

"అరే డింభకా ఎంత పొగరుపట్టి మాట్లాడుతున్నావు ఈ నంది యోగినా నీవు పోటీకి పిలుచునది. ఇదిగో నీ మూడుపూజల్లో ఒక పూజ బందు చేస్తాను." అని కమండలంలో నీళ్లు చేతిలో పోసుకుని రామన్నపై వేసాడు. రామన్నవైపు అక్కడున్న ప్రజలు కళ్లార్పకుండా చూడసాగారు రామన్న కన్నులు మూసుకుని ధ్యానంలోకి వెళ్లాడు. రామన్నకు ఏమీ కాలేదు. రామన్న మరోసారి కమండలంలో నీళ్లు చల్లమన్నాడు. యోగి మరోసారి వేసాడు. ఈసారి ఏమికాలేదు. అవమానంగా తీసుకుని తన జుట్టులోంచి వెంట్రుకను తీసి దాన్ని మంత్రించి రామన్నపై విసిరాడు. రామన్న దాన్ని అందుకుని తిరిగి ప్రయోగించి వదిలాడు. అప్పుడు అది పెద్దకొరడాగా మారిపోయి యోగి చర్మం ఊడేలా కొట్టసాగింది. పదిపదిహేను దెబ్బలకు యోగి నేలమీదపడిపోయి "రామన్న రక్షించు. ఇవి దెబ్బలు కావు ఏనుగు బలంతో కొడ్తున్నట్లుగా ఉన్నాయి.మరో దెబ్బపడకుండా చూడు లేకుంటే నా బొందిలో ప్రాణములుండవు." అని అరవసాగాడు. ఇదేమి చచ్చినవాళ్లను బ్రతికించే శక్తిసంపన్నుడను అని అన్నాడు ఇప్పుడిలా తన ప్రాణాలు పోకుండా రక్షించు అని అంటున్నాడేమిటా అని విస్తుపోయారు.

"యోగివి కావాలనుకోలేదు నీవు చిన్న మాంత్రికుడవు. నీకు వచ్చినవి దివ్యశక్తులు కానేకావు. కేవలం క్షుద్రశక్తులు నేర్చుకున్నావు. నీవంటి వాడు యోగి ముసుగులో ఈ రాజును ప్రజలను వంచించడం నేను భరించలేక పోతిని. నీవు పామరుడిలా ప్రవర్తిస్తుంటే అసలు యోగి అనేవాడు ఎలా ఉంటాడో తెలియని వాడవు అని గ్రహించాను. అందుకే ఎక్కువకాలం ఉపేక్షించకుండా ఇలా నీతో తలపడ్డాను. ఈ కొరడా నా నుంచి రాలేదు. నీవుగా నీ వెంట్రుకలలో ఒక దాన్ని క్షుద్రమంత్రాలతో ముడిపెట్టి జటాకేశం అనే పిశాచాన్ని ఆవహింపచేసావు. నీ జటాకేశాన్ని నాపై ప్రయోగించావు. దాన్ని నీవైపుకు మళ్లించాను. రాజుగారి పాదములు పట్టుకుని క్షమాపణలు కోరుకో! లేకుంటే ఆ కొరడా దానిపని అదిచేస్తుంది." అని హెచ్చరించాడు.

యోగి ఎగిరి గంతేసి రాజు పాదములపై పడ్డాడు. "ప్రభూ నాకు ప్రాణభిక్ష పెట్టండి. ఏదో బుద్ధిగడ్డితిని ఇలా వేషం వేసినాను. యోగిలా కాకుండా ఒక దుష్టమాంత్రికునిలా ప్రవర్తించాను. నన్ను వదలమని ఆ





రామన్నకు తమరు చెప్పండి." కనుగుడ్లులో నీళ్లు రాలుతుంటే చెప్పాడు. అప్పటికే అతని శరీరంనుంచి రక్తం కారసాగింది.

"రామన్నా ఎంతఘనా కొన్ని క్షణాలవరకు ఈ యోగి ఇక్కడ పూజలు అందుకున్నాడు అతన్ని కనికరించి వదిలేయ్ నాయనా, నా మాట మన్నించు" అని బ్రతిమలాడాడు.

"ప్రభూ తమరు ఆదేశించినా చాలు ఈతన్ని విడుచుటకు నాకెట్టి అభ్యంతరంలేదు. "ఓ జటాకేశమా ఈతన్ని మన్నింపుము." అని చెప్పగానే నింగిలోకి లేచిన కొరడా తిరిగి వెంట్రుకగా మారిపోయి యోగి శిరోజాలలో కలిసిపోయింది. అంతటితో దాని క్షుద్రశక్తిని కోల్పోయింది.

యోగి లేవలేక లేచి నిలబడి రామన్నను చూసి చేతులు జోడించి "ప్రాణదాతా! నావేలితో నా కంటిని పొడుచుకున్నాను. నీపై ఏనుగుబలంతో కొరడాను ప్రయోగించ చూసాను. అది నా మీదకు వచ్చింది. నీకు రాయ భారమంత్రం వచ్చా ? ఆ మంత్రం పాములపై చేస్తే పొడిచిన పాములు వెనక్కివచ్చి విషాన్ని పీల్చుకుని వెళ్లిపోతాయి. అప్పుడు పాముకాటుకు గురయినవాడు బ్రతుకగలడు. అదే మంత్రంతో ఇలా క్షుద్రశక్తిని ప్రయోగిస్తే అది ప్రయోగించినవాణ్ణే తీవ్రంగా బాధిస్తుంది. నాకు వచ్చినది కొంత, దానితో చక్కగా బ్రతుకవల్సింది కానీ మతిహీనుడనై చాలాచెడ్డగా ప్రవర్తించి మీదకు తెచ్చుకున్నాను. ఇక బుద్ధిగా బ్రతుకగలను సెలవు" అని చెప్పి అతికష్టంతో నడవసాగాడు.

"నందా ఆగు, నీవు నీకు వచ్చిన విద్యలతో నీవు అబాసుపాలయితివి. కనుక అవి నీ వశంలో మరి ఉండవు. నీకు ఇంతవరకు వచ్చిన క్షుద్రవిద్యలు మరల నేర్చుకునే ప్రయత్నం చేసినా నీదరి చేరవు. నీవు ఇప్పుడు ఒక తోలుతిత్తిలాంటి వాడవు. చూసావా తలపొగరుతో కన్నూ మిన్నూ కానకుండా చరించావు. నీచుడవై హీనపడితివి. ఇప్పటికైనా బుద్ధిగా మిగిలిన జీవితం తీర్చిదిద్దుకో లేకుంటే ఇంతకంటే ఘోరంగా అవమానింపబడతావు. పూజింపబడినచోట ఇలా బాధింపబడినవాడవు నీవే. ఇక పొమ్ము. ఓ ప్రజలారా, ఈతన్ని ఎవరు ఏమి పరుషపదజాలాలతో హింసించరాదని మనవి." రామన్న చేతులు జోడించి అందరిని కోరాడు. నందా తలదించుకుని

నడుస్తుంటే రామన్న మాటను ధిక్కరించి చాలామంది యోగిముఖంచూసి భరించలేక ఉమ్మేసారు. వాటిని భరిస్తూనే అలా సాగిపోయాడు.

ఇలా నంద వెళ్లాడో లేదో ఒక సన్యాసి రామన్న ఎదురుగా వచ్చి "నాయనా రామన్న నీవు దివ్యకళలతో ఉన్నావు. నీవంటివాడిని చూస్తాను అని అనుకోలేదు. నీవు నందయోగితో తలపడి అతనికి బుద్ధివచ్చినట్లు చేసావు. కనువిప్పు కలిగించావు. కానీ, అతనితో నీవు గెలవలేదు. అతడు నీతో వేరే విధంగా తలపడ్డాడు. అసలు పోటీ చచ్చినవాణ్ని బ్రతికించుటయే అది మీ ఇద్దరిమధ్య జరగనే లేదు కనుక నీవు గెలవనట్టే అతడు మా అందరి సమక్షంలో చచ్చిన కోతిని బ్రతికించాడు. మరణించిన చేపను బ్రతికించాడు అది చూసే రాజుగారు ఆయన్ని దేవుడిలా పూజించారు. ప్రజలు కూడా రాజుగారి వెనుకనే పూజలుచేయడానికి ఎగబడ్డారు."

రామన్న అందరినిచూసి అది పరకాయప్రవేశ విద్య. దాన్ని అతడు మీ ముందు ప్రదర్శించాడు. ఒకప్పుడు ఒకరి ఆత్మ మరో శరీరంలో మన గలిగేది. ఇప్పుడు అలా లేదు. కొన్ని క్షణాలకే పరిమితం అయ్యింది. ఆ విద్యలో ఉన్న శక్తిని ఎవరు కాపాడలేకపోయారు. దాన్ని వెకిలితనంతో, వెర్రివ్యామోహా లకు వాడుకున్నారు. అది శక్తిహీన అయ్యింది. ఇప్పుడు అది వెలవెల పోయింది. రానున్న తరానికి అది మిగలదు. ఒకప్పుడు చాలామంది వద్ద ఉండేది. ఇప్పుడు అతితక్కువ మంది వద్ద చాలా తక్కువ స్థాయిలో ఉంది. అదే నంద మీ ముందు ప్రదర్శించాడు. అతడు లిప్తలో చచ్చిన బొందిలోకి ప్రవేశించి వెలుపలి వచ్చేస్తాడు. అంతకుమించి ఉండడానికి లేదు. కానీ, నేనుండగలను. ప్రదర్శించమంటారా?" చిర్నవ్వుతో అడిగాడు.

ప్రజలు అది పరకాయ ప్రవేశవిద్య అని అనుకోలేదు. చచ్చిన జీవులను యోగిబ్రతికించేస్తున్నాడు అందుకే అతడు దేవుడు అని నమ్మారు. ఇప్పుడు వారికి అర్థమయ్యింది. అది పరకాయప్రవేశవిద్య అని. వద్దు చచ్చిన జీవుల్లోకి ప్రవేశించి మరల వెలుపలికి రావడం అనవసరం అదో కనికట్టులాంటి విద్య. దేవునిలా చచ్చినవారిని బ్రతికించగలిగితే దాన్ని ప్రదర్శించండి. లేలేతప్రాయంబు వారు మరణించిన వెంటనే వారికి ప్రాణదానం చేసిన ప్రజలు మెత్తురు. ఇలా పరకాయ ప్రవేశాలు అనవసరం అని ఎలుగెత్తారు.





దాంతో రామన్న ఎదుటనిలబడిన సన్యాసితో చెప్పాడు. "అయ్యా మీరు నన్ను ఎత్తిచూపారు. నేను తలపడునపుడే దేవునికే సాధ్యం కానిది అని చెప్పి నందతో పోటీలో ఉన్నాను. నేను చచ్చినవాణ్ని ఎట్టిపరిస్థితిల్లో జీవింపచేయలేను. అది మానవులకే అసాధ్యం. లేని పరుగులు మంచిది కాదు." అని చెప్పాడు.

ఆ సన్యాసి రామన్నను మెచ్చుకుని "నీవు చాలా ప్రయోజకుడవు కాగలవు. ఇంతచక్కగా కుండబద్దలుకొట్టునట్లు చెప్పగలుగుతున్నావు. వేయిశుభాలతో వర్ధిల్లు నాయనా,"ఆశీర్వదించి అక్కణ్నించి వెళ్లి పోయాడు. రాజు రామన్నను తన అంతఃపురానికి తీసుకుపోయాడు.

రామన్నకు ప్రత్యేకమందిరం ఏర్పాటు చేయబడింది.

రాజు మరుసటిరోజు వచ్చి కలుసుకుని "నాయనా నీకు ఈ కాంచన పురంలో ఏమి చూడాలన్నా చూడు. ఎన్నాళ్లు కావాలంటే అన్నాళ్లు నీ నిజపురి అనుకుని ఉండు. నీకు అన్నిసదుపాయాలు సమకూర్చమని మంత్రివర్యులకు తెలియచేసాను."చెప్పి వెళ్లిపోయాడు.

రామన్న కాంచనపురం మొత్తం ఒక రథం మీద తిరిగాడు దారి పొడుగునా ప్రజలు చేతులు ఎత్తి అభివాదాలు చేసారు. అలా వెడుతూ నగరవింతలు పెద్దపెద్ద భవంతులను చూస్తూ ముందుకు సాగాడు. రథానికి అడ్డంగా ఒక ఛండాలుడు ఎదురొచ్చాడు. రథాన్ని తప్పించుకోబోయి దారిలో పడ్డాడు. రథాన్ని తోలే సారథి జాగ్రత్తగ తప్పించాడు.

లేవలేకలేచిన ఆ ఛండాలున్ని చూసి రామన్న రథం దిగి చేతి సాయంతో నిలబెట్టాడు. అతడు చాలా ఆశ్చర్యంగా చూసాడు. "నీకు ఎవరూలేరా ? శరీరం చూస్తే వయస్సుడిగినవాడిలా లేవు ఆరు పదులు నిండి ఉండవు. నీకు శారీరకపోషణ లేనట్లుంది. అవునా?"

ఆ మాటలకు అతడు మరింత ఆశ్చర్యపోయాడు. రథసారథి క్రిందికి దిగివచ్చి రామన్నా వచ్చేయ్ అతడితో మాట్లాడరాదు. అతడికి నగరంలో సమాజ బహిష్కరణ చేసారు. అది పాతికేళ్లుగా సాగుతోంది. అతడితో మాట్లాడితే రాజశాసనాన్ని ధిక్కరించినట్టే కనుక వెనక్కు వచ్చేయ్యండి." పిలిచాడు. అప్పటికే అక్కడ చాలామంది వింతగా చూడసాగారు.

రామన్న వెంటనే రథమెక్కి అక్కణ్నించి వెళ్లిపోయాడు.ఆ రాత్రి చాలాసేపు ఆ ఛండాలునికోసం ఆలోచించాడు అతడికి ఎందుకంత శిక్ష విధించారు అని తన మందిరానికి కాపలాగా ఉన్న భటున్ని అడిగాడు. అదో అంతఃపుర రహస్యం. మీ మనస్సులో ఉంచుకోండి. ఇక్కడి రాజుగారికి ఒక చెల్లెలుండేది. ఆమె చాలా అందంగా ఉండేది. ఆమెకు ఏకైక లోపం కుడికాలు సరిగా పడదు. ఆ అవిటితనంతో ఆమె చాలాబాధ పడ్తుండేది. రోజూ దేవాలయంకు వెళ్లి వచ్చేది. దారిలో జీమూతుడు అనే గురువు నవయౌవనంలో ఉంటూ పలువురికి పలువిద్యలు నేర్పుతూ జీవిస్తుండేవాడు. ఇద్దరు రోజు కలుసుకోవడంతో వారు ఊహించని విధంగా ప్రేమికులయ్యారు. అయితే వారి ప్రేమ పెళ్లివరకు వెళ్లింది. ఇదంతా తెలిసిన రాజు ఆగ్రహంతో ఊగిపోయి అతడిని తీవ్రంగా శిక్షించి, చెల్లెల్ని వెంటనే పొరుగు రాజ్యంలో ఒక సేనానికిచ్చి పెళ్లి చేసి సాగనంపేసాడు. తరువాత ఎలాంటి రాకపోకలు పుట్టింటితో సంబంధాలు లేకుండా ఆమెతో తెగతెంపులు చేసుకున్నాడు. అది ఆమెకు విధించినశిక్ష. రాజస్త్రీలను ప్రేమించిన నేరానికి జీమూతున్ని బిచ్చగాడిగా చేసి సమాజంలో ఎవరు మాట్లాడరాదని అతనికి ఎలాంటి సాయం చేయకూడదని రోజూ కచేరిలో బిచ్చగాళ్లకు పడేసే మెతుకులతో జీవించాలని ఒకవేళ నగరం వదిలిపోతే వెతికి పట్టుకుని ఉరితీస్తామని చాటింపువేసారు. నాటినుంచి జీమూతున్ని ఎక్కడికి పోకుండా నలుగురిని కాపలాగా వేసారు. ఇది అతని బ్రతుకు. ప్రేమించిన నేరానికి ఇంత ఘోరశిక్షకు గురయ్యారు."

"అతడు గురువుకదా, విద్యలు ఎవరికి నేర్పకూడదా,అతనివద్ద ఎవరూ నేర్వకూడదా? అలా ఎవరు నేర్చుకున్నా అది నిషిద్ధమా?"

"అవును రామన్న, మారాజు ఎంతో మంచివాడు.కానీ, ఈ జీమూతుని విషయంలో చాలాఘోరంగా ప్రవర్తించాడు.చెల్లెలకు పెండ్లిచేసి, పాపం ఈతని జీవితం నాశనంచేసాడు. అతడు ఛండాలుడు కాడు. తైల సంస్కారం లేక చినిగిన దుస్తులతో సరైన తిండితిప్పలు లేనందున అనారోగ్యం పాలయ్యాడు.అందుకే చూడడానికి ఛండాలునిలా ఉంటాడు. పాతికేళ్లుగా ఎవరితో మాట్లాడనందున అతడికి మాటలు కూడా రాకుండాపోయి ఉంటాయి." ఆ భటుడు జాలిగా చెప్పాడు.





"అతడికి వచ్చు విద్యలు గురించి నీకు తెలుసా?"

"తెలుసు, నా తమ్ముడు అక్కడే నేర్చుకునేవాడు. జీమూతుడు సంగీత ప్రవాహం. అతడు చక్కగా పాడగలడు. అతడు పాడితే కొండలు కరిగేవంట. అలాగే కత్తియుద్ధంలో అతడో శక్తి.ధనుర్విద్యలో అతనికి శబ్దభేరి విద్య వచ్చు.అందుకే పలువురు యువకులు ఎగబడి నేర్చుకునే వారు. కొంతమంది యువకులు ఈ గురువును రాజశాసనాన్ని ధిక్కరించి తీసుకుపోవాలనుకున్నారు. జీమూతుడు ఎవరు పిలిచినా పలకుడు ఉలకుడు. అతడు మానసికంగా బాధపడ్తుంటాడు."

రామన్న ఉదయాన్నే స్నానం చేసుకుని గుర్రమెక్కి నగరంలోకి వెళ్లాడు. అతడి కన్నులు వెతుకుతున్నాయి. ఒక దేవాలయం ముంగిట జీమూతుడు కన్పించాడు. అతన్ని చూడగానే మానసికంగా చివుక్కుమన్నాడు. వెంటనే గుర్రందిగి "ఓ గురు దేవా!" అని ఎలుగెత్తి పిలిచాడు.

జీమూతుడు అసలు తలతిప్పి చూడనేలేదు. అతడికి ఎవరో ఇంత ప్రసాదం పడేస్తే ఏరుకుని తింటూ కన్పించాడు. అప్పుడు అతడి పాదములు వద్ద మోకరిల్లాడు రామన్న. ఒక్కసారి అక్కడున్నవారంతా బిక్కముఖాలు వేసి చూసారు.కొబ్బరి చిప్ప తింటున్న జీమూతుడు కన్నులు చిట్లించి చూసాడు. గురుదేవా మీ వద్ద విద్యనభ్యసించడానికి వచ్చాను. నాకు విద్యాదానం చేయండి."అని కోరాడు అక్కడే ఉన్న భటులు చుట్టు ముట్టారు.

"రామన్న నీవు రాజుగారి అతిథిగా వచ్చి ఆయన శాసనాన్ని ధిక్కరిస్తున్నావు. నిన్ననే ఆ రాజద్రోహితో మాట్లాడావు. అప్పుడు రాజుగారికి తెలిపాం. రామన్నకు కొత్త తెలియదు అని రాజుగారు సరిపెట్టుకున్నారు. ఇప్పుడు నీధోరణి చూస్తుంటే నీవు కావాలనే చేస్తున్నదే అని తెలుస్తోంది. నిన్ను అతిథి అని చూడకుండా బంధించి సభకు తీసుకుపోతాం. రాజుగారి ముందునిలుపుతాం.నీ కారణంగా పలువురు ఈ ద్రోహితో మున్ముందు మాట్లాడిన ఆశ్చర్యపోనక్కర్లేదు.కనుక రాజశాసనాన్ని నీవు ధిక్కరించి మీదకు తెచ్చుకుంటున్నావు." అని రామన్నను బంధించారు.

రామన్నను రాజుముందు నిలిపారు. రాజు నొచ్చుకున్నాడు. "ఏమి రామన్నా మా శాసనాన్ని నీవు ధిక్కరించడం నాకు చాలాబాధగాఉంది.

మన్నించమని కోరుకో నీకు బంధవిముక్తిన్ని చేసి సాగనంపేస్తాను. ఇలా మేము విధించు శిక్షలు నీవు వ్యతిరేకించడం ఎంతమాత్రం నాకు, నా ప్రజలకు మింగుడు పడడంలేదు."

"ప్రభూ మన్నించండి. అతడెంతటి శిక్షార్హుడైనా ఇంతగా ఇన్ని ఏండ్లు శిక్షను కొనసాగించడం చాలా అన్యాయం. అతడు మంచి విద్యాగంధం ఉన్నవాడు. అట్టివానిని మూగగా, శుశ్రుత లేనివాడిగా, సమాజంలో నీచునిగా చూపడం ఎంతవరకు న్యాయం. అతడికి వచ్చిన విద్యలలో శబ్దభేరి విద్య, జలస్థంభనవిద్యలను అతడిలో నిర్వీర్యమై పోవునట్లు చేయడం ఎంతవరకు న్యాయం. దేవుడుచేయలేని పని మీరు చేస్తున్నారు. చచ్చినవాన్ని దేవుడుకూడా బ్రతికించడు. కానీ మీరు మీ అధికారంతో బ్రతికున్న ఓ గురువును జీవచ్ఛవంలా చేసారు. అంతే కాకుండా కాలగర్భంలో కలిసిపోతున్న విద్యలను జీవంలేకుండా చేస్తున్నారు. ఒకసారి ఆలోచించండి. మీకు, మీ సైన్యానికి పనికివచ్చు విద్యలు అతనిలో ఉన్నాయి. ఆ విద్యలు దేశంలో చాలావరకు తెలిసినవారు అరుదయిపోయారు. కనుక ఆలోచించండి మహారాజా," అని పరిపరివిధాలుగా చెప్పాడు.

రామన్నను అక్కడివారంతా తినేసేట్టు చూసారు. రాజు కూడా రామన్నను తీక్షణంగా చూసి "రామన్న నీవు మాటకారివి. అంతకుమించి విజ్ఞానవంతుడవు. నీకు దేవుడిచ్చిన వరాలు గొప్పవే. కానీ, నీ బుద్ధి చాలా హీనంగాఉంది. రాజద్రోహి వద్ద ఉన్నవిద్యలకు విలువేముంటుంది. వాడు తారతమ్యాలను చూడని నీచుడు. అట్టివాడు గురువెట్లు అగును. సరే వాడి కోసం నీతో వాదులాడను. నీకు వెలలేని ఆభరణాలు కానుక ఇవ్వాలనుకున్నాను. నీకుగా నీవే ఆ అదృష్టాన్ని దూరం చేసుకున్నావు. నీవు తక్షణం ఈ నగరం వదిలిపోవాల్సిందిగా ఆదేశిస్తున్నాను. కావాలంటే ఆనీచున్ని తీసుకునిపో! వాడివద్ద నీవు అభ్యసించే విద్యలు ఏమున్నా వాటిని అభ్యసించుకో! వాడి విద్యలు మాకు మా ప్రజలకు అక్కర్లేదు."

"ప్రభూ, మీ ఆదేశానుసారం వెంటనే వెళ్లిపోతాను. మీరునాకు ఇచ్చినది వెలలేని వజ్రం ఆ జీమూతుడే. అట్టి విద్యాగంధం ఉన్న గురువుతో





వెలకట్టలేని విద్యలు నేర్చుకుంటాను. పలువురికి నేర్పించగలను. ధన్యుడను" అని చెప్పి జీమూతున్ని వెతికి పట్టుకుని తనతో తీసుకుని కళింగనగరం వైపుసాగిపోయాడు. దారిలో జీమూతుడు మాట్లాడాలని ప్రయత్నించి నానాయాతనలు పడ్డాడు. సర్వం మరిచిపోయినట్లు అయిపోయాడు. కొంత దూరం సాగాక అతడు మాట్లాడగలిగాడు. అతనికి నదీస్నానం చేయించి కొత్తదుస్తులు ధరింపచేసి, కొన్నిమూలికలు, పసరికలు తినిపించి కొన్ని రోజుల్లో పూర్తిగా స్వస్థత కల్గించాడు. కళింగ నగరాన్ని చేరుకునే సరికి జీమూతుడు పూర్తి ఆరోగ్యవంతుడయ్యాడు. అక్కడి గురుకులం ఏర్పాటుచేసి పలువురు విద్యార్థులను చేర్పించుకుని అపురూపమైన విద్యలను నేర్పేందుకు జీమూతున్ని అక్కడ నిలిపాడు. అక్కడ కళింగరాజు ఆ గురుకులానికి ఎంతో సహకారం అందించాడు. జీమూతుడు వద్ద కొన్నివందలమంది విద్యార్థులు పలువిద్యలు నేర్చుకున్నారు. ఇప్పుడున్న ఉత్తరాంధ్రలో నాటి జీమూతుని విద్యలే నేటివరకు కొన్ని అవశేషాలుగా మిగిలిఉన్నాయి. వాటిలో గిరిజనుల్లో ఉన్న ధనుర్విద్య, రాయబారమంత్రం, కత్తిసాములలో ఘమో అనే కత్తియుద్ధం (ఈ కత్తియుద్ధం కేరళకు తరలిపోయింది. అక్కడ కలరి అనే పేరుపడ్డది, ఇటీవల కాలంలో అది కూడా అదృశ్యమైపోయిన పరిస్థితిలో ఉంది. ఇది గిరిజనులలో ఉండేది. ఒకరకంగా కత్తియుద్ధం మరోకోణంలో మల్లయుద్ధం. చచ్చువరకు కత్తులతో కొట్టుకోవడమే) ఇవన్నీ జీమూతుని వద్ద నిక్షిప్తమైన విద్యలు.

జీమూతుడు రామన్నకు తనకు కొత్తజీవితాన్నిచ్చిన వాడవు అని వేనోళ్ల పొగిడేవాడు. రామన్నను వెతుక్కుంటూ తల్లితండ్రులు బసవయ్య వసుమతి వచ్చారు. రామన్నను వదిలి ఇన్నాళ్లు ఉన్నందున తాము ఎంతగా కృంగిపోయారో తెలిపారు. తాము జీవించువరకు వదలివెళ్లొద్దని కోరారు. నీతి, న్యాయం, ధర్మం గురించి పోరాడే రామన్న జీవనయానంలో ఇలాంటి జీమూతులు ఎంతమందో తారసపడ్డారు. అంతమంది అన్ని విధాలుగా లాభపడ్డారు.

# నిజాయితికి ఇదా ప్రతిఫలం

రామన్నకు ఒకసారి ఒక రచ్చబండవద్ద ఒక గ్రామ పెద్ద తగువు తీరుస్తుండగాఎందుకో ఆగి వినాలనిపించి ఆగి ప్రజల మధ్య తాను నిలబడి వినసాగాడు. అప్పుడు అక్కడ తగవు చాలా విచిత్రంగా సాగింది. అసలు కథేమిటి అంటే ఇద్దరు కలిసి వ్యాపారం చేసారు. అందులో ఇద్దరు నిజాయితికి మారుపేర్లుగా ఉన్నాం. మరి ఎందుకు నష్టం వస్తుంది అని అక్కడ తగువు పడ్తున్నారు. ఇంతకీ వ్యాపారం ఏమిటి అంటే బట్టల వ్యాపారం. ఇద్దరు చెరిసగం ధనంపెట్టి వ్యాపారం చేస్తున్నారు. కానీ, ఒకప్పుడు వ్యాపారంలో బాగా లాభాలు వచ్చాయి. ఇప్పుడు విపరీతంగా నష్టాలు వస్తున్నాయి. దీనికి గ్రామపెద్ద ఇరువురి సమాధానపరచాలి.

"ఏమయ్యా మీరు ఇద్దరు గత పదేళ్లుగా వ్యాపారం చేసి చెరో ఇల్లుకట్టుకున్నారు. ఇంట్లో ఆడపిల్లలకు పెండ్లి చేసారు. వేరే వ్యాపారాలు పిల్లలచే పెట్టించుకున్నారు. ఇంతవరకు సజావుగా సాగిన వ్యాపారం ఎందుకు నష్టాలు వస్తుంది చెప్పండి మీలో ఏదో జరగరానిది జరుగుతోంది." గ్రామపెద్ద తొలి ప్రసంగం చేసాడు

అక్కడ ఉన్నవారంతా తలదించుకుని నిలబడిన ఇద్దరు వ్యాపారుల వైపు చూసారు. అప్పుడు ఒక వ్యాపారి "అయ్యా మేమిద్దరం ఒకరంటే ఒకరికి ప్రాణస్నేహం ఉంది. నాపేరు బ్రహ్మయ్య ఇతడి పేరు దీనయ్య ఈతడిని నేను అనుమానించను. ఇద్దరం గల్లాపెట్టెవద్ద ఉంటున్నాం. ఎలాంటి లెక్కలు మా మధ్య ఉండవు. కానీ, ఎన్నడూ లేని విధంగా నష్టం వస్తున్నది. అదే అర్ధంకావడంలేదు. నేనుగా ఎన్నడూ ఒక్కరూక కూడా తేడాగా చేయను. వీడూ చేయడు. లాభాల్లో అమ్మకాలు జరుగుతున్నాయి. ఎంతగా ఆలోచించినా అంతుపట్టడంలేదు. ఈ మధ్య ఒక జ్యోతీష్యున్ని కలుసుకుంటే అతడు ఒకమాట చెప్పాడు. ఎవరికైనా పుష్కరకాలం మాత్రమే ధనయోగం ఉంటుంది. ఎలావచ్చిన లక్ష్మి అలా వెళ్లిపోతుంది అని చెప్పుతున్నారు. దీనిపై





నేను విడిపోదాం ఎవరిబ్రతుకు వారు బ్రతుకుదాం అని అంటే వీడు దీనయ్య ససేమిరా అంటున్నాడు. ఇది మా మధ్య జరిగిన నష్టాలకథ"

"నీవు ఏమి చెప్పదలిచావు దీనయ్య" గ్రామపెద్ద అడిగాడు.


"బ్రహ్మయ్య చెప్పినది నిజమే మా ఇద్దరం ఒకరంటే ఒకరికి అభిమానం. వీడికి దశ ఎక్కువ. వీడుతో కలిసి చేసిన వ్యాపారం కనుకనే నేను నిరుపేదనుంచి ధనికుడనయ్యాను. వీడిని వదులుకోను. నష్టం అయినా లాభం అయినా వీడితో కడవరకు సాగాలనుకుంటున్నాను. ఇందులో మరోఆలోచనలేదు. మాది ఒకే మంచం ఒకే కంచం అనుబంధం. దయతో అర్థం చేసుకుని మమ్మల్ని కలిసి వ్యాపారం చేయమని తీర్పు ఇవ్వండి. వీడు లేకుండా ఒక్కక్షణం జీవించలేను."

గ్రామపెద్ద తలపట్టుకున్నాడు. "ఈ తగవు తీర్చడం ఎలా సాధ్యం ఇద్దరు ఒకరంటే ఒకరికి ఎనలేని అభిమానం ఉంది. అలాంటప్పుడు లాభాల వ్యాపారం నీరుగారి పోతోంది. సరే మీవద్ద పనిచేసేవాళ్లు ఎలాంటి వాళ్లు వారు నమ్మకస్థులేనా లేక వారు ఏమైనా మోసం చేసి మీకు లాభం లేకుండా చేస్తున్నారా?"

"అయ్యా నా మాట వినండి. నేనంటే ఈ దీనయ్యకు ప్రాణస్నేహం ఉంది. కానీ, వాడు నేను కలిసి వ్యాపారం చేస్తే ఇలా నష్టాలతో నాశనం కావడం నాకు ఇష్టంలేదు. వాడిపిల్లలు కూడా విడిపోదాం అంటున్నారు. వీడు స్నేహం వదులుకోలేకపోతున్నాడు. కలిసి ఉండాలని నాకు లేదు. ఎవరివ్యాపారం వారు చేసుకుంటాం" అని చెప్పాడు బ్రహ్మయ్య.

"నేను అంగీకరించను. నా పుత్రులకు తెలియదు. వారు విడిపోదామంటున్నారు. వారు చేసేవ్యాపారాలు బాగులేవు. వారు వ్యసనపరులు ఇప్పుడు నేను నామిత్రుడు విడిపోతే చివరాఖరిలో వచ్చే ధనం కోసం చూస్తున్నారు. అందుకు నేను అంగీకరించను. నా మిత్రుడుతో నేను వ్యాపారంలో చచ్చేవరకు ఉంటాను." మొండిగా చెప్పాడు.

ఇక గ్రామపెద్ద చెప్పడానికి ఏమిఉంటుంది. ఇద్దరు కలిసివ్యాపారం చేయమంటే కదా అతడు అవునా కాదా అని చెప్పడానికి, ఒకరు విడిపోతామంటే వేరొకరు కాదంటున్నారు. కష్టమే అని అక్కడ గుమిగూడిన వారు చెప్పుకోసాగారు.



రచ్చబండవద్ద గ్రామ పెద్ద వద్ద ఇద్దరు వర్తకులు తమ గోడు వెళ్ళబోసుకొనుట.

గ్రామపెద్ద తలవిదలించి "ఇది నేను తేల్చలేను. ఒకపనిచేయండి. వ్యాపారం బాగాతగ్గించుకోండి. అప్పుడు నష్టాలు మీకు బాధించవు. కలిసి ఉండచ్చు. మీ స్నేహం చెడదు. ఏమంటారు " అని తన తీర్పును ఇచ్చాడు.

దీనయ్య సంబరపడ్డాడు. బ్రహ్మయ్య విచారంగా చూసాడు అప్పుడు రామన్న ప్రజల్లోంచి బయటికి వచ్చి "అయ్యా గ్రామపెద్దగారు ఇక్కడ జరుగుతున్న చిత్రమైన కథనం విన్నాక మీ తీర్పు ఇరువురిలో ఒకరికి ఆనందాన్నిచ్చేదిలా లేదు. నాకు అవకాశం ఇప్పించగలిగితే మీకు దీనివెనుక ఉన్న గుట్టువిప్పుతాను" అని కోరాడు.

"చూడడానికి మరీచిన్నవాడిలా ఉన్నావు. సరే, నా గ్రామపెద్దరికాన్ని నీవు కొంతసేపు తీసుకుని తీర్పునిస్తానంటున్నావు. చూద్దాం ఏమి చెబుతావో ఈ కాలపు పిల్లలకు మనుధర్మశాస్త్రం, చాణక్యనీతి,వంటి న్యాయాలుపై పట్టుంది. సరే చెప్పు."అని తన పక్కనే రామన్నను కూర్చుండబెట్టుకున్నాడు.

"బ్రహ్మయ్యా నీవెందుకు విడిపోవాలనుకుంటున్నావు?"రామన్న ప్రశ్నించాడు. ఒక్కసారి బ్రహ్మయ్య రామన్న వైపు అదోలా చూసాడు.

"ఒకటి వ్యాపారంలో నష్టం. మరొకటి ప్రాణస్నేహితునికి ఇన్నేళ్లు లాభాలు ఇచ్చాను. ఇప్పుడు నష్టాలు చూపడం ఇష్టంలేదు."

"ఏమి దీనయ్య నీవు ఎందుకు విడిపోకూడదు అనుకుంటున్నావు."

"నిరుపేదను నాకు తన వ్యాపారంలో చోటు ఇచ్చి ఇంతవాణ్ణి చేసాడు. అలాంటి స్నేహితున్ని వదులుకోలేను. నష్టం వచ్చి మళ్లీ నిరుపేదను అయినా నా మిత్రున్ని వదలనుగాక వదలను. ఇదే తుది నిర్ణయం."

గ్రామపెద్ద రామన్నవైపు ఆసక్తిగా చూసాడు.

ప్రజలలో ఒకటే ఉత్కంఠగా ఉంది. ఏమి చెబుతాడా అని చూసారు.

"ఏమయ్యా దీనయ్యా మరి నీ మిత్రుడు కోరిక తీర్చవచ్చు కదా!"

"కుదరదు. వాడితో వ్యాపారం చేస్తాను. వాడితోనే జీవితం ముగించుకుంటాను. వాడు నా ప్రాణం. నా భార్యపిల్లలు చెప్పినా నేను వినలేదు."

"ఇప్పుడు మీరు ఎదుర్కొంటున్న నష్టం మీలో ఎవరు భరిస్తున్నారు?"

"మొదట్నించి వాడే పెద్దమనస్సుతో తన ఇంటినుంచి పెట్టుబడులు తెచ్చిపెడుతున్నాడు. అతడికి ఒకే కూతురు పెండ్లిచేసి అత్తారింటికి పంపాడు.

నాకు నలుగురు కొడుకులు వారికి వేరే వ్యాపారాలు పెట్టించాను. వారు నా ముఖం చూడరు. భార్యలు వచ్చాక వారు తల్లితండ్రులను వదిలేసారు."

"బ్రహ్మయ్యా నీవు ఇలా నష్టాలు పూడ్చుకుంటూ పోతే నీ ఆస్థి ఈసరికే బాగా తగ్గి యి ఉంటుంది. అవునా?"

"నీ ... యే, ఏదో రోజు వీధిన పడతాను. అప్పుడు మనం సన్యాసుల్లో కలుద్దాం అని దీనయ్య చెప్తున్నాడు. హాయిగా శేషజీవితం అన్నిక్షేత్రాల్లో గడిపేయవచ్చు అని చెబుతుంటే నిజమే ఆ దిశలో పుణ్యం దక్కుతుందని ఆశిస్తున్నాను." "దీనయ్య నీ కొడుకులు వ్యసనపరులు అన్నావు. వారు, వారి భార్యాపిల్లలను, పెంచకుండా జులాయిగా తిరుగుతున్నారా? వారిని నీవే పెంచుతున్నావా ? అన్ని బాధ్యతలు మోస్తున్నావా?"

"నేను పెంచడంలేదు. కానీ, ఆస్థులు నా నుంచి తీసుకువెళ్లిన తరువాత వారు ఆస్థుల్ని పెంచుకోలేకపోయారు. లేని వ్యసనాలకు బానిసలై ఉన్నవి అమ్ముకుంటున్నారు. నాకున్న తోటలు అమ్మేసారు. అలాగే పంట భూములను కూడా ఖర్చుచేసారు ఏవో ఓడవర్తకం అని సముద్రవ్యాపారంలో చాలా తగలేసారు" బాధగా చెప్పాడు. అంతా అయ్యోపాపం అని చూసారు.

గ్రామపెద్ద శాంతం విని "బాగుంది నీ ధోరణి. నువ్వు యక్షప్రశ్నలు వేస్తున్నావు ఇంత అవసరమా? అసలు విషయం ఇద్దరు కలిసి వ్యాపారం చేయడం కుదరదు అని ఈ బ్రహ్మయ్య చెబుతుంటే దీనయ్యా చేస్తామంటే నువ్వు ఇరువురుకి సరిపడా చెప్పగలను అని వచ్చి ఎటో వెళ్లిపోతున్నావు."

"గ్రామపెద్దగారు మీ నుంచి ఇలా అసహనం ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూసి ఇలా ఇద్దరిని అడగాల్సింది అడిగాను. ఇక అసలు విషయం చెబుతాను. వినండి నా తీర్పును ఇక్కడ ఇద్దరు వినాలి లేదా కాదనేనా చెప్పాలి. అలా చెప్పేటపుడు కారణం చెప్పాలి. ఓయీ దీనయ్యా! నీకు ప్రాణస్నేహితుడు ఈ బ్రహ్మయ్య. కనుక ఇంతవరకు నీ దరిద్రం స్థానంలో ధనవంతుడ్ని చేసాడు. అట్టివానికి ఇకమీదట నష్టాలు వచ్చేటపుడు నీ ఇంటిలో ఉన్న ధనం తెచ్చి నీవు కోరుకున్న జంటవ్యాపారం కొనసాగించు అలాగే బ్రహ్మయ్య నువ్వు ఇంతవరకు నీ మిత్రునికి నష్టం చూపకుండా అంతా నీ నెత్తిన వేసుకున్నావు. ఇక అలా చేయకు నేను చెప్పినట్లు చేస్తే లాభాలే నీకు వస్తాయి."





దీనయ్య మండిపడ్డాడు. "ఏమిటి ఈవింత తీర్పు. నేను నా ఇంటిలో ధనం తెచ్చి నష్టాలవ్యాపారం కొనసాగించాలా? నాకు అక్కర్లేదు. కావాలంటే నేను జంట వ్యాపారం మానుకుంటాను. వేరే చూసుకుని చేసుకుంటాను."

బ్రహ్మయ్య తలగోక్కుకుంటూ ఆలోచనలో పడ్డాడు. రామన్న అతన్ని తట్టి "ఓ బ్రహ్మయ్య ఇప్పటికైనా నీకు అర్ధంకాలేదా? నీతో వ్యాపారం వదులుకోవడం జరగదు అలా అయితే ప్రాణాలు వదులుతాను అని నీకు నిత్యం చెప్పిన వాడు ఇప్పుడు అతడికి పెట్టుబడి పెట్టమంటే ఈ క్షణమే మానుకుంటాననంటున్నాడు. ఇదే వ్యాపార మర్మం, నీకు నష్టం రావడానికి కారకుడు ఈ దీనయ్యే ఈతడు నిత్యం గల్లాపెట్టెలోంచి విపరీతంగా తస్కరించుకుపోతున్నాడు. ఈతడి మాటలు చేతలు విని మోసపోయి నీ ఇంటిలోంచి చాలా ధనం పెట్టుబడిగా తెస్తున్నావు. చూసావా ఈ దీనయ్య మోసం ఇక ఈతడు కొడుకులు వ్యసనపరులు కారు అలా అయితే విపరీతంగా లాభాలు తెచ్చే సముద్రవ్యాపారానికి పోరు. ఈతడు ఆషాడభూతి." రామన్న తీర్పుపాఠాన్ని వినిపించాడు. ప్రజలు ఆశ్చర్యంగా విన్నారు. గ్రామపెద్ద తలాడించాడు.

దీనయ్యకు ఏమిపాలుపోలేదు. పట్టులో పిట్టలా అయిపోయాడు.

బ్రహ్మయ్య హీనంగా దీనయ్య వైపు చూసాడు. ఒక్కసారి బోరున ఏడ్చాడు.

"బ్రహ్మయ్య ఏడవకు ఇది కలియుగం స్నేహానికి విలువలు అడుగంటుతాయి. ఇట్టిమోసగాళ్లు ఎక్కడా ఉంటారు. నీవు గ్రామపెద్ద ముందున్నావు. కనుక న్యాయం జరుగుతుంది. ఇంతవరకు నీకు చాలా మోసం చేసి ఎంతో ఆర్జించాడు. ఈతని ఆస్థిలో సగం నీకు సంక్రమిస్తుంది." రామన్న ధైర్యం చెప్పాడు.

దీనయ్య అందుకు ఒప్పుకోలేదు. "నా ఆస్థిలో చిల్లిగవ్వకూడా ఇవ్వను. వ్యాపారంలో మాయలు మోసాలు సహజం. వ్యాపారంలో నమ్మకం ఉండకూడదు అని ప్రాధమిక సత్యం ఎరుగనందున బ్రహ్మయ్య వంచింపబడ్డాడు." చెప్పి వెళ్లిపోవాలనుకున్నాడు. గ్రామాధికారి అంతవరకు రచ్చబండమీద కూర్చున్నవాడు లేచి దీనయ్యను ఒక కర్రతో గొడ్డును

బాదినట్లు బాది "ఏరా దొంగవ్యాపారి,చేసింది పరమమోసం దీనికి నీవు సమర్ధించుకునేట్టు చెప్పి నీకుగా నీవు వెళ్లిపోవాలనుకుంటావా? ఇది రచ్చబండ.మరిచావా?" అని సింహనాదం చేసాడు.

"అయ్యా వదిలేయండి. వాడినుంచి నేను ఏమి కోరను.ఉన్నంతలో ఏదో నా బ్రతుకు నేను బ్రతుకుతాను.మిత్రద్రోహం చేసినందున చాలా విచారించుచున్నాను" అని కళ్లు తుడుచుకున్నాడు. బ్రహ్మయ్య.

"బ్రహ్మయ్య నీకు అవసరంలేకపోతే వదిలేయ్ మేము వదలం నీకయితే సగంవాటా వీడినుంచి వసూలుచేస్తాం.నీవు వద్దనుకుంటే పూర్తిగా వీడిని బికారిని చేసి గ్రామబహిష్కారానికి గురిచేస్తాం. ఏరా దొంగవ్యాపారి, ఏమంటావు? క్షణాల్లో బికారి వవుతావా? బ్రహ్మయ్యకు సగం ఆస్తులు ఇచ్చి గౌరవంగా బ్రతుకుతావా?" గ్రామపెద్ద కోపంతో ఊగిపోతూ మరీ అడిగాడు.

దీనయ్య గ్రామపెద్ద పాదాలపై పడి సగం ఇచ్చుకుంటాను అని చెప్పాడు.

అక్కడ ప్రజలు రామన్నను ఎత్తిపొగిడారు. గ్రామపెద్ద తలపాగా విప్పి రామన్నకు చుట్టి "భళీ నీ తీర్పు ఎంత ముచ్చటగా ఉంది. ఎవరునువ్వు అచ్చం మర్యాద రామన్నలా తీర్పునిచ్చావు" అని ప్రశంసించాడు.

రామన్న నవ్వి "మీరన్నట్లు నేను అచ్చం రామన్ననే." అని నవ్వుతూ చెప్పాడు.అంతా ఆశ్చర్యంగా చూసారు.దీనయ్య రామన్న చేతులు పట్టుకుని బాబు అందుకే నన్ను అవలీలగా పట్టి అందరి ముందు నిలిపావు. నా బిడ్డలు చెబుతునే ఉన్నారు. నాన్నా ఎన్నాళ్లు దాగుతుంది దొంగతనం అందుకే ఇప్పటికైనా బ్రహ్మయ్యను వదిలివచ్చేయ్ అని చెబితే నన్ను ఎవరు పట్టుకుంటారు అని చాలా గర్వంగా ఉండేవాడిని.తీరా,ఈరోజు నీ కారణంగా నా పాపం బద్దలయ్యింది. మిత్రద్రోహిని నన్ను ఆ దేవుడు క్షమించడు. నన్ను అన్నివేళలా ఆదుకునే నాప్రియ మిత్రున్ని నేను ఘోరంగా వంచించాను. సగం ఆస్తి ఇవ్వడంలో నాకు పోయిందేమి లేదు.అసలు చిల్లిగవ్వలేని వాడను. ఇంతవరకు వచ్చానంటే బ్రహ్మయ్య నావెనుక ఉన్నాడు." చెప్పుకుని పశ్చాత్తాపపడ్డాడు.





# కొండల్ని కరిగించే సంగీతం

రామన్న సింహపురి పురవీధుల్లో నడుచుకుంటూ వెడుతుంటే రాజభటులు ఒక మధ్యవయస్కుడిని గొలుసులతో బంధించి తీసుకువెడుతూ కన్పించారు. అతన్ని అక్కడ పురప్రజలు ఏమి పట్టనట్లుగా చూడడంలేదు. రామన్నకు ఆశ్చర్యం అనిపించి వెంటనే అడిగాడు. అయ్యా అతడు చేసిన నేరమేమి ఎందుకు అలా నడిపించుకుని వెడుతున్నారు. అతడు మోయలేని గొలుసులతో బందించడానికి అతడు బందిపోటు దొంగా ?" ఆ భటులను అడిగాడు.

వారు ఎగాదిగా చూసి "నీకెందుకయ్యా ఆరాలు తీస్తున్నావు.సరే అడిగావు కాదనడమెందుకు? వీడు ఒక సంగీత విద్వాంసుడు వీడి తాతల నాటినుంచి సంగీతంలో అదేదో లోకాల్లో ఉండే తుంబురుడుతో పోటీ పడినవారు. వాళ్లు పాడితే కొండలు కరిగిపోయేవి. వీడు మా రాజుగారు కోరిక మీద కొండల్నికరిగించడం అనేది ఇంతవరకు చేయలేదు. అదేం పోయేకాలమో తెలియదు.వీడు సంగీతం ఎవరికి విన్పించడు.కూనిరాగాలు మస్తుగా తీస్తుంటాడు. వీడు కొండల్ని కరిగించేవరకు ఈ శిక్ష తప్పదు. వీడికి మనస్సుబాగుంటే పాడతాడేమోనని ఇలా పురవీధులు, సానివాడలు తిప్పుతుంటాం. వీడు కుంయ్‌కుంయ్ మనడం లేదు.నిన్నగాక మొన్న చెమడాలు వలిచాం.ఎన్ని దెబ్బలయినా భరిస్తాడు.చిన్న గులకరాయి అయినా కరగదీసే గానం ఎత్తుకోడు.వీడు మాట దేవుడెరుగు వీడిని తిప్పలేక ఛస్తున్నాం.వీడికి బరువైన గొలుసులు వేసాం అన్నమాటేగాని మేమే మోస్తున్నాం.వీడుహాయిగా తిరిగి పాడను గాక పాడను అని చెప్పి చెరసాలలో హాయిగా నిద్రపోతాడు. వీడికి నిద్రజబ్బు చాలా ఎక్కువే.ఇది వీడి కథ"

సంగీత విద్వాంసుడు ఓరకంటితో రామన్నను చూసాడు. "అయ్యా నీపేరు ఏమిటి?ఎందుకు ఈ శిక్షను అనుభవిస్తున్నావు. వీరు చాలాహీనంగా

మాట్లాడుతుంటే పౌరుషం వచ్చి రాజుగారి కోరికతీర్చవచ్చు కదా, సంగీతం మీ ఇంట పుట్టినట్లుంది." అని రామన్న అతడిని అడిగాడు.

"నాయనా నా పేరు చంద్రకీర్తి నేను తుంబురుని గానంతో సమానంగా పాడగలను. కొండల్ని కరిగించడమే కాదు. వర్షం కురిపించగలను. అట్టి రాగాలు నాకు వశం అయినవి. కానీ, పాడను. ఇక్కడ రాజు పరమ మూర్ఖుడు. నా వంటి సంగీత విద్వాంసున్ని ఒకడ్ని అకారణంగా హతమార్చి నాడు. నాలాగునే ఒకడ్ని వెతికి తెచ్చి పాడమన్నాడు. అదీ అతడి మందిరంలో, పాపం రాజులవద్దపాడినచో ఎక్కువ ధనం ముడుతుంది అని ఆశతో పాపమా విద్వాంసుడు పాడాడు. అక్కడే ఉన్న రాణీవారి చేతిలో చనిపోయిన ఆమె పుత్రిక రాతిబొమ్మ ఉంది. అది కాస్తా కరిగిపోయింది. దాంతో రాణీ గొల్లు మంది. ఆ మూర్ఖరాజు వెంటనే ఆ పాడినవాణ్ణి హతమార్చినాడు. ఆ చంప బడిన వాడు ఎవరో కాదు. నాతోటి విద్యార్థి. అందుకే నేను ఈ రాజువద్ద పాడను అని ఆనాడే నిర్ణయించుకున్నాను."అని చెప్పాడు.

"ఒరేయ్ పాడేస్తే కొండో, బండో కరుగుతుంది. నీకు ఈ చెరసాల తప్పుతుంది. మాకు ఈ తిప్పడం వదిలిపోతుంది. వాడెవడో చచ్చినదానికి నీకు సంబంధం ఏమిటిరా" ఒక సైనికుడు కోపంతో బల్లెం వెనక్కుతిప్పి వీపుమీద పొడిచాడు. దాంతో చంద్రకీర్తి విలవిలలాడాడు. అలా పొడవద్దు వాడు అసలు నడవడు వీడిని మనమే మోయాలి. వీడు బరువు వీడి మీద ఉన్న గొలుసుల బరువు చచ్చేచావు వచ్చింది అని మరోసైనికుడు అడ్డుకున్నాడు.

"రాజుగారు సరదాగా ఉన్నప్పుడు ఈ పిచ్చివెధవను ఉరితీసేద్దామని అడుగుదాం ఆయన సరేనంటే నా కొండెడ్ని కసక్మనిపించేస్తేపోలా, వీడ్ని తిప్పలేక ఛస్తున్నాం. వీడి పాటకు ఏమి కరుగుతాయో కరగవో కానీ,మనం కరిగిపోతున్నాం రా!" మూడోసైనికుడు చాలా ఇబ్బందిపడ్తూనే చెప్పాడు. అప్పటికే చంద్రకీర్తి నేలమీద పడిపోయి లుంగలు చుట్టుకోసాగాడు. రామన్న చాలా బాధపడ్డాడు.





"మీరు సైనికులా? యమకింకరులా? ఒక మహాసంగీతవిద్వాంసున్ని ఇంతగా హింసిస్తారా ఇక్కడ ఏలుతున్నది రాజా? రాక్షసుడా? అని ఎలుగెత్తి అడిగాడు. అప్పటికి ప్రజలు పోగయ్యారు. రాజును విమర్శించిన రామన్నకు నూకలునిండాయి అనుకున్నారు. సైనికులు చంద్రకీర్తిని వదిలి రామన్నను పట్టుకున్నారు. వేలెడంతలేవు నీవా మా రాజును దుయ్యబట్టేది. నిన్ను రాజుసన్నిధిలో నిలిపి వాతలు వేయించితే తప్ప నీకు బుద్ధిరాదు. పదా అని ఈడ్చుకుపోయారు. రామన్నకు ఇది తొలి అనుభవం రాజభటులు గౌరవంగా తీసుకుపోవడం తెలుసు కానీ,ఇలా జరగడంతో ఖంగుతిన్నాడు. రాజసభలో ఇరువురుని నిలిపారు. చంద్రకీర్తి నిలబడలేక కూర్చున్నాడు. అతడిని లేపే ప్రయత్నంలో ఆముష్కరభటులు సర్వప్రయత్నాలు చేయసాగారు. అప్పుడు రాజు వచ్చాడు. రాగానే చంద్రకీర్తిని చూసి పకాలున నవ్వాడు. ఆ పక్కనే ఉన్న రామన్నను ఆశ్చర్యంగా చూసి"ఎవరీ బుడుతడు ఈతడు చేసిన అపరాధమేమి? బంధించి మరీ తీసుకువచ్చారు."

జరిగినది అంతా పూసగుచ్చినట్లు చెప్పారు. అప్పుడు రాజు మరింత పగలబడి నవ్వి "రాజదూషణ చేసినవాడిని ఏనుగుల చేతతొక్కించండి. ఇట్టి శిక్షలు వేస్తే తప్ప వేరెవ్వరు ఇలా సాహసించరు. తక్షణం సభలోకి ఏనుగును తీసుకురండి "అని ఆదేశించాడు. సభలో ప్రజలు చాలామంది రామన్న చూసి జాలిపడ్డారు.

ఏనుగు కావలిలో ఉన్నందున వెంటనే తీసుకువచ్చారు. అప్పుడు తేరుకుని చంద్రకీర్తి రాజును బ్రతిమాలాడు "ఓరాజా నేను పాడుతాను. నా సంగీతంతో కొండల్ని కరిగించి తమకు ఆనందం కలుగచేస్తాను. ఈ పసివాడిని దయతో వదిలేయండి."ప్రాధేయపడ్డాడు. రామన్నతో బాటు అక్కడ ఉన్నవారంతా చంద్రకీర్తిని చూసారు. అతడు ఎన్ని హింసలకైనా తట్టుకుని నోరుమెదిపేవాడు కాదు అలాంటిది నోరువిప్పి బాలునికి శిక్ష వేయవద్దని బ్రతిమాలడం అందరిని కలిచివేసింది. కానీ రాజుకు మనస్సు కరగలేదు.

ఏనుగును తెచ్చిన మావటికి ఆ బాలుడిని అందరి సమక్షంలో ఏనుగుచే కుమ్మించి చంపివేయాల్సిందిగా ఆదేశించాడు.

అంతవరకు రామన్న మౌనంగా ఉన్నాడు. వెంటనే పురివిప్పినవాడిలా "ఓ మూర్ఖరాజా ఉగ్రసేనా, బ్రాహ్మణ బాలుని వధించిన పాపం నిన్ను ఇలా క్రూరకర్మలు చేయిస్తోంది. నీవు నన్ను గుర్తుపట్టావా? రామన్నను. నాడు నీ తండ్రి చనిపోయినందున నీవు రాచపీనుగుకు తోడుండాలి అని ఎవరో వెర్రివాళ్లు చెప్పినందున విని ఎక్కడో తపస్సులో ఉన్న జటకేశుడు అనే బ్రాహ్మణ బాలుని వధించి బ్రహ్మహత్యపాతకంతో ఇలా కొట్టుమిట్టాడు చుంటివి. లేకుంటే సంగీతమే ప్రాణంగా భావించిన ఈ చంద్రకీర్తిని ఇంతగా హింసిస్తున్నావే నీకు గల సంగీత పరిజ్ఞానం ఏపాటిది అసలు నీకు స్వర ములు ఎన్ని తెలియునా? నీకు బుద్ధి పుట్టినపుడు పాడవలెనా నీవెవరవని ఈతడు నీ వద్ద పనిచేయువాడు కాడు. నిర్బంధించి హీనచర్యలకు పాల్పడితివి. నీకు తగు బుద్ధి చెప్పడానికి వచ్చాను." అని కోపంగా హెచ్చరించాడు.

ఉగ్రసేనుడు పండ్లుపటపట కొరికి "నీవు నాకు శత్రుశేషమే నిన్ను తప్పక వధించవలెను. నీ కోసం వెతుకుతున్నాను. ఆ చచ్చిన జటకేశుడు నీకు సర్వవిద్యలు నేర్పి పరలోక గతుడైనాడు అని విన్నాను. నీ గురువు ఆ కుష్ట గుణనందుడు నీకు గురుదక్షిణగా నా అంతుచూడమని కోరెనట. వెర్రి యాదవుడవు. నీవేమి చేయగలవు. ఈ ఏనుగు పాదాలే నీకు మృత్యువు కాగలవు."

"మూర్ఖరాజా చేసినపాపమునకు నీలో లేశమైన పశ్చాత్తాపం లేదు. కనుక నిన్ను ఇక విడువను. నీకు ఏమి తెలియకపోయినా సంగీతం కోరుకున్నావు. ఆ సంగీతంతో నీ అంతు చూడగలను ఇక విను. సప్తస్వరాలు అందుస(సడ్జమం) రి(రిషభం)గ (గాంధారం)మ (మద్యమం)ప (పంచమం) ద (ధైతం)ని (నిషాదం) ఈ స్వరాలు ఈ చంద్రకీర్తి గానామృతంలో ఇప్పుడు వింటావు. నీలో ఉన్న సర్వశక్తులు నీ నుంచి దూరమైపోతాయి. ఇక నీవు ఒక తిత్తివి కాగలవు. ఓ సంగీత చక్రవర్తీ చంద్రకీర్తి! మీ మధురమైన గొంతెత్తి






పాడండి." రామన్న చెప్పాడు. అప్పటికే మావటి ఎంత ప్రయత్నించి నను ఏనుగు ముందుకు రాకుండా వెనుకడుగులు వేయసాగింది.

ఉగ్రసేనుడు అయోమయంగా చూడసాగాడు. చంద్రకీర్తి గొంతెత్తి పాడాడు. అంతా చెవులు రిక్కించి విన్నారు. అలా చాలాసేపు సాగింది అమృతగానం. శ్రీరాగంలో పాడాడు. ఈ రాగం తొలుత కత్తులు కటారుల ధ్వనినుంచి పుట్టిన రాగం అది కాలగమనంలో ప్రేమికుల మధ్యవర్తిగా మారిపోయింది. ఇప్పుడు చంద్రకీర్తి ఆలాపనలో యోధుల కత్తుల వికృతధ్వని రావడంతో వెనుకనే ఉన్న ఏనుగు మావటిని ఎత్తి ప్రజలలోకి విసిరిపారి పోయింది. ఉగ్రసేనుడు వినలేక చెవులు మూసుకున్నాడు. అలా సింహాసనం నుంచి కిందకుదిగి నేలమీద చతికిలపడ్డాడు. రామన్నను అక్కడ ప్రజలు రాజోద్యోగులు వింతగా భయంగా చూడసాగారు. ఉగ్రసేనుడు సొమ్మసిల్లిన వాడిలా అయిపోయాడు.

చంద్రకీర్తి పాట ఆపి అయోమయంగా చూసాడు. "ఈ రాజు ముక్కు పచ్చలారని బ్రాహ్మణబాలున్ని వధించిన పాపంతో దుర్బలుడై మరెన్నో పాపపు కార్యాలు చేస్తూ నిత్యం మనశ్శాంతిలేక అలమటిస్తున్నాడు. ఒకరోజు సంగీతం విని చేతిలో శిలకరిగినది ఆ పాడినవాణ్ని వధించినవాడు మరో సంగీత విద్వాంసుని పాడమని శిలలు కరగించి ఆనందింపచేయమని కోరుతూ నానాహింసలు పెడుతున్నాడంటే ఈతడెట్టి హీనమైన మనస్సుతో రాజుగా ఉన్నాడు. ఇట్టి చంచల మనస్కుడు రాజుగా తగడు. ఈతన్ని ఎంతత్వరగా వదిలించుకుంటే అంతమంచిది. లేకుంటే ఈతని మెడకు చుట్టుకున్న బ్రహ్మాహత్యాపాతకం వలన ఈతనితో బాటు మీకు కట్టికుడుపుతుంది." రామన్న ప్రజలనుద్దేశించి చెప్పాడు.

అక్కడే ఉన్న సర్వసేనాని సర్రున కత్తి దూసి ఉగ్రసేనుడిని చంపాలను కున్నాడు. "చంపవద్దు ఈతన్ని అడవుల్లో విడిచిపుచ్చినచాలు. ఈతడు చావకూడదు. బ్రహ్మాహత్యాపాతకం మాపుకోవడానికి తపస్సు చేయాల్సి ఉంది. లేకుంటే మరింత నరకప్రాయపు జీవితం అనుభవించక తప్పదు." రామన్న వారికి చెప్పాడు.



రాజసభలో రామన్నను సంగీతవిద్వాంసుడ్ని రాజు ఉగ్రుడై దూషించుట.



"ఇన్ని చెప్పినవాడివి రాజులేని రాజ్యం ఏమికావాలి మాలో రాజును నీవే ఎంపిక చేయాలి" అని అంతా పట్టుపట్టారు. అందుకు రామన్న నవ్వి "నా మీద భారం వేసారు కనుక, నా మాట వినాలి. మరోమాటకు అవకాశం ఉండరాదు.అని ముందే మాటపుచ్చుకున్నాడు.వారు మాట జవదాట మన్నారు.

"ఇదిగో ఈ చంద్రకీర్తిని రాజుగా మీరు అంతాకలిసి పట్టాభిషిక్తుడ్ని చేయండి. ఉగ్రసేనున్ని తన గానామృతంతో నిర్వీర్యున్ని చేసాడు. కనుక ఇతడే మీకు రాజు.ఆ మూర్ఖరాజు కోరిక తీర్చడానికి బదులు తన ప్రాణాలు అర్పించడానికి సిద్ధపడిన వాడు ఎన్నో హింసలు పొందాడు.చివరికి నావంటి ముక్కుముఖం తెలియని వాడి ప్రాణం రక్షించడానికి తన గొంతెత్తి పాడడానికి సిద్ధపడ్డాడు.అంటే ఈతనిలో ధర్మం ఉంది.మీరంతా చూసారు."ఆ మాటలకు అంతా హర్షధ్వానాలు చేసారు.అప్పుడు తలదించుకుని ఉన్న ఉగ్రసేనుడు రామన్నకు చేతులు జోడించి "ఏమి విచిత్రం కేవలం సరిగమలు విన్నంతలో నాలో సర్వశక్తులు కుంచించుకు పోయి క్షణం సింహాసనంపై నిలవకుండా చేసాయి.వర్షరాగం ఉంది ఆ రాగంతో వర్షాలు కురుస్తాయి.మరి ఈ సరిగమలు వింటే నాశక్తులు పోయి భీరువనయ్యాను.కారణం ఏమిటి? కనీసం తెలుసుకోవాలి అని ఆశపడుతున్నాను."

"ఉగ్రసేనా నీవు విన్నది సరిగమలులతో శ్రీరాగం అందులో ఉన్న కత్తుల శబ్దం నీలో శక్తులను హరించింది.ఇదంతా కాకతాళీయం.నీవు ఈ సరికే బ్రహ్మహత్యా పాతకంతో కష్టాలు పాలయిఉన్నావు. ఇంతటితో నీవు మరి ఎందుకు కొరగాకుండా పోయావు. నీవు అడవులలో మా గురువు గుణనందున్ని కలుసుకుని మోక్షమార్గం కోరుకో!తొలుత కాదన్నా తరువాత జాలిపడే గురువు. నీకు మంచి మార్గం చూపగలడు.అంతకుమించి నీకు ఎవరూ మానసికంగా రక్షించలేరు.

ఉగ్రసేనుడు చేతులు జోడించి అందరికి మ్రొక్కి అక్కణ్నించి వెళ్లిపోయాడు.

# లేస్తే మనిషిని కాను.

"లేస్తే మనిషిని కాను. మర్యాదగా మీ వద్ద ఉన్న ధనం, దస్కం నా తలవద్ద పెట్టి పొండి లేకుంటే నేను లేచే పరిస్థితి తెచ్చుకున్నారో నాచేతి కత్తికి ఎరకావల్సిందే అదే నా నియమం. ఏమంటారు ? " పెద్దపెద్ద మీసాలు మెలేస్తూ చెప్పాడు. నగరం వెలుపల గజదొంగ గంగులు పెద్ద దుప్పటి కప్పుకుని పడుకుని దారినపోయినవాళ్లను భయపెడ్తున్నాడు. అదే దారిలో పోతున్న రామన్నను "ఏరా నీకు బొట్టుపెట్టి చెప్పాలా వేలెడంత లేవు. ఒక్కగా నొక్క కొడుకులా ఉన్నావు. నీ మెడనిండా బంగారు ఆభరణాలే. మర్యాదగా పెట్టి పో!" అరిచాడు గంగులు.


"పెట్టవయ్యా లేకుంటే వాడు లేచాడంటే పులిలాంటోడు. చాలా మందిని నరికి గాని నిద్రలోకిపోడు." అప్పటికే నిలువుదోపిడీ ఇచ్చుకున్న ఒకడు చెప్పాడు.

రామన్న గంగులును ఎగాదిగా చూసి "పడుకునే శాసిస్తున్నాడు. బాగుంది. ఇంతకీ లోగడ ఏమి చేసేవాడు. ఇప్పుడు ఇతన్ని చూసి మీరంతా భయపడ్తున్నారు. నాకు కొంచెం చెప్పండి. విని తరించాలనుకుంటున్నాను."

"చుప్‌రే బద్మాష్ నీకు నా కథల్ కావాలా అరే గంగులు అంటే ఏమను కున్నావుబే, హిందుస్థాన్ వణికిపోద్దిరా హత్యల్ మస్తుగా చేసినానురా, నా గురించి నీకు కావాలంటే మొగల్ ఇలాకాకి పోరా! అక్కడ కథల్ కథల్‌గా చెప్తారుబే రాని భాషలేదు. తిరగని శెహర్ లేదు. తలపడని యోధుడు లేదు. అరే బచ్చా ఏమనుకున్నావు? నీ కాడ ఎంగిలి మెతుకులకు ఆశపడేది ఈ గంగులు కాదు. నేను ఒక చోట కోట కడ్తున్నాను. దానికి మస్తుగా నిధుల్ కావాలా అందుకే ఈడ కాసినానురా! ఇక రాజునై ఈజమీన్ అంతా ఏలతారా" గంగులు కోపంగానే చెప్పాడు.

ఆ మాటలకు అక్కడ మరికొంతమంది తమ వద్ద ఉన్నది గంగులు తల ముందు పెట్టారు. ఈ కుర్రాడు అదీ ఇదీ మాట్లాడి గంగుల్ని లేపుతాడు వాడు పడుకున్న సింహం లాంటివాడు లేస్తే అందరి మీద పడతాడు. ఉన్నది





ఇచ్చుకుని పోతే సరి లేకుంటే వాడి కత్తికి ఎరకావడం తప్పదు అని జారుకో సాగారు. రామన్న నవ్వి గంగులు పడుకున్న చోటులో చుట్టూతిరిగాడు.

"అరే ఏమిరా? పూరా భయంలేదు నీకు. సింహం చుట్టూ లేడిపిల్లా మాదిరి తిరుగుతావ్ మర్యాదగా నీ వద్ద ఉన్నది ఇస్తావా లేకుంటే నన్ను తీసుకోమంటావా?"

"గంగులు నీవు కోట కడ్తున్నావా? ఎందుకు ఏమి సాధించడానికి, దొంగలు అంతా చేరి ఒక రాజ్యం ఏర్పాటు చేసుకుంటారా? ఆ రాజ్యం పేరు ఏమిటి?"

"ఏమిరా బేటా నువ్వు గలీజ్ ఆద్మీకాబేటాలా ఉన్నావు. లేచేనా నాకొండే నిన్ను ఇరగదీసి నలిపేస్తాను. మాటలు కట్టిపెట్టి ఇచ్చుకునిపో!"

"గంగులు ఇవ్వను గాక ఇవ్వను. ఏమి చేసుకుంటావో అది చేసుకో" రామన్న మాటలు విన్న బాటసారులు ఒక్కసారి ఖంగుతిన్నారు. ఏమిటి కుర్రవాడి సాహసం అని నోళ్లువెళ్లబెట్టి చూసారు.

గంగులు చేతిలో కత్తిని విసిరాడు అది వెంట్రుక వాసిలో రామన్నను రాచుకుంటూ పోయింది. " గంగులూ నువ్వు లేవలేకుండా నీకాళ్లు మాయం చేస్తాను నన్ను ఏమనుకుంటున్నావో నాకు అతీంద్రశక్తులు వచ్చు." అని రామన్న చేతిని తిప్పాడు. గంగులు పెద్దకేక వేసాడు. అప్పటికి బాటసారులు గుడ్లప్పగించి చూసారు.

"ఏమిటి కాళ్లుపోయాయా? ఆ కుర్రవాడు సామాన్యుడు కానట్లు న్నాడు." "అవును కుర్రాడికి ఏవో శక్తులున్నట్లున్నాయి. అందుకే భయపడలేదు."

"ఏ పుట్టలో ఏ పాముందో అన్నట్లుంది ఇక్కడా అంతా"

"గంగులకే మంత్రాలతో కాళ్లు తెగేసాడంటే ఈ కుర్రాడు గొప్పవాడే"

"మనలాంటివాళ్లను దోచుకున్నందుకు తగిన శిక్ష పడింది."

"గంగులు పాపం బద్దలయ్యింది." ఇలా తలాఒక మాట అన్నారు.

గంగులు విలవిలలాడిపోయాడు. చూస్తుండగా అతడి మీద దుప్పటి చెదిరి పోయింది. పాదాలు రెండు లేవు. చూడగానే బాటసారులు భయ





భ్రాంతులయ్యారు. "నాయనా నన్ను రక్షించు నా పాదాలు నాకు ఇప్పించు బుద్ధిగా ఎక్కడికైనా వెళ్లిపోయి బ్రతుకుతాను. మరి ఈ దోపిడీలు చేయను," అని పాదాలు పట్టుకున్నాడు. ముందు నువ్వు దోచుకున్నది ఇక్కడే ఎవరిది వారికి అప్పగించు అప్పుడు నీకు నీ పాదాలు ఇప్పించగలను." రామన్న ప్రశాంతంగా చెప్పాడు.

"నాయనా నీవే మా వెంట ఉంటే వీడికి అడిగితీసుకోవడమెందుకు? ఏమి చేయగలడు. లేవకుండా పాదాలు లేకుండా చేసావు. ఇప్పుడు చేతులెత్తితే నీవు ఆ చేతులు ఊడగొట్టేస్తావు. మనభాష వదిలి సాయిబుల భాషలో మనల్ని బెదిరించడం వినకుంటే కత్తి ఎత్తి పొడవ బోవడం"అని గంగుల్ని పక్కకు తోసి ముందు ఇచ్చినవి పుచ్చుకుని చక్కా వెళ్లిపోయారు.

"గంగులు ఇక్కడ నువ్వునేను తప్పితే ఎవరు లేరు. సరే విషయానికి వద్దాం. నీకాళ్లు నామంత్రాలతో ఊడగొట్టానా, అంతకుముందే లేవా?"

"నాయనా ఎవర్నువ్ చాలా తెలివైనవాడివిలా ఉన్నావు. దుప్పటిలో పడుకుని నేను దారినపోయిన వారిని నా పూర్వచరిత్ర గుర్తుచేసి దోచుకుని పొట్ట పోసుకుంటున్నాను. నీవు వచ్చి నా ముఖంలో రౌద్రం చూసి బెదరకుండా నాతో మాట్లాడుతునే దుప్పటిలో నాకు పాదాలు లేవు అని గుర్తించేసావు. నీవు తెలివిగా మంత్రాలతో పాదాలు మాయం చేస్తాను అని అనడంతో నేను తెలివిగా ఇప్పుడే నా పాదాలు పోయినట్లు నటించాను. లేకుంటే ఈ బాటసారులు నన్ను చిత్రవధ చేస్తారు."

"నాపేరు మర్యాదరామన్న. నీవు దుప్పటిలో పడుకుని లేస్తే మనిషిని కాను అని దోపిడీ చేస్తుంటే చాలా వింతగా అనిపించింది. పైగా నీవు నింగివైపు చూస్తూ ఉన్నావు. దుప్పటిలో నీ పాదాలు నిటారుగా కన్పించాలి. అలా కన్పించలేదు. కనుకనే నీతో అన్ని మాటలు ఆడాను. తెలివిగానే బాటసారుల ముందు నటించావు. ఇకపై ఇలాంటి విధానం మానుకో! లేకుంటే నీకు బాటసారులు భరతం పడతారు,"

దూరంగా కూర్చున్న వికలాంగ అనుచరులు వచ్చి గంగుల్ని ఎత్తుకుని ఒక పల్లకిలో కూర్చోబెట్టుకున్నారు. వారితో పల్లకి వరకు వెళ్లి "ఏమిటి

మీలో కొంతమందికి ఒక్కో కన్నులేదు. ఒక్కో చేయి లేదు. ప్రమాదమా లేక ఏ రాజైనా శిక్షించాడా?"

"రెండోది నిజం రాజులే అనుకుని నా పాదాలు నరికారు. నా అనుచరులకు తలోచెయ్యి కన్ను లాగేసారు దాంతో ఇలాంటి తెలివైన నేరాలు చేస్తు బ్రతుకుతున్నాం ఇక వేరేదారి వెతుక్కోవాలి. బాటసారులు ఇప్పుడు జరిగినది దేశమంతా చాటుతారు.ఇక ఎక్కడ నేను పడుకుని భయపెట్టడం కుదరదు."దీనంగా చెప్పాడు

"గంగులు బ్రతకాలంటే దారులు అనేకం.భయపడకు మీరంతా కలిసి ఏపని చేసుకున్నా మీ పొట్టలునిండుతాయ్. ఇలా పదిమందిని దోచుకోవడం చాలా పాపం మీపై రాజులు అనుకుని విధించిన శిక్షతో మీలో మార్పు రావల్సిందిపోయి మరింతం తేలికమార్గంలో ఇలా దోపిడీలు చేస్తున్నారు. ఇందుకు మీరు సిగ్గుపడాలి.ఆ రాజులు అంతాకలిసి మీ పని పట్టారు. అసలు విషయం మీరంతా కలిసి ఒక చోట దొరికి పోయిఉంటే మరోలా ఉండేది. వివిధ రాజ్యాలలో మీరు ఒకేసారి మీ పాపం పండి దొరికారు. అక్కడ ఒక్కోలా న్యాయం ఉంది. ఒకరు నేత్రాలు ధ్వంసంచేస్తే మరొకరు పాదాలు తీసారు. ఇంకొకరు చేతులు నరికారు. ఇలా మీరు ఒక విధంగా చాలావరకు తక్కువ మోతాదు శిక్షలతో గట్టెక్కారు. లేకుంటే మీరు చేసినవి ఒకటా రెండా ఎన్నో ఉన్నాయి." చెప్పి రామన్న వారిని మంచి మార్గంలో నడవమని కోరాడు.

"అయ్యా దొంగతనం దోపిడీలే తరతరాలుగా మాలో ఉంది.కొత్తగా ఏమిచేయలేం. మాకు ఏదైన బ్రతుకు దారి చూపండి. అంతే తప్ప మమ్మల్ని ఘోరంగా అంగవిచ్ఛేదం చేసినప్పుడు రాజులు బ్రతుకు దారి చూపకుండా దుక్కల్లా ఉన్నారు. ఏపని చేసుకుని బ్రతకవచ్చుకదా అన్నారు. ఆ మాటలు ఎవరైనా చెబుతారు. దయచేసి ఒక విషయం అడుగుతున్నాను.ఇప్పటికైనా మించిదిలేదు. బ్రతుకుదారి చూపండి." పల్లకి ఆపించి అడిగాడు గంగులు.

అప్పుడు రామన్న నవ్వి "గంగులు దారిన పడ్డావు.ఇంతవరకు నీకు పాదాలు లేవు అని ప్రజలకు తెలియదు. ఇప్పుడు తెలిసిపోయింది. కనుక





నీవు బ్రతుకుదారిలో పడ్డావు. నీలో మంచి నైపుణ్యం ఉంది. అదేమిటో తెలుసా?"

"కొన్ని వందలు, వేలు దొంగతనాలు, దోపిడీలు చేసాను. అది మరి వద్దు అంటున్నావు. మళ్లీ అక్కడికే వెడుతున్నావు." తలగోక్కుంటూ అడిగాడు.


"ఆ అనుభవంతో నీవు ఏ రాజు పంచన చేరి ఆ రాజ్యంలో ఎక్కడ ఎలాంటి దొంగతనాలు దోపిడీలు అయితే నీవు నిశితంగా పరిశీలించి వాటి వెనుక కూపీ అంతా బట్టబయలు చేయగలవు. ఇది కొత్వాలు కచేరిలో ఒక ఉద్యోగమే కదా, ఇంతకాలం ఇనుము వంచి మీకు సరిపడా కత్తులు, కటారులు తయారు చేసుకునేవాడివి ఇప్పుడు ఇలా ఎటుచూసినా ధర్మంగా నీతిగా బ్రతికేమార్గాలు నీలో ఉన్నాయి.నీవు బ్రతికి నీ వారిని బ్రతికించు కోవచ్చు."

"ఇది బావుంది. తప్పక ఆచరింతును. కానీ, నన్ను నాలాంటి గజదొంగను ఎవరు కొలువులో పెట్టుకుంటారు? "

"ఎవరూ పెట్టుకోరు. ఎందుకంటే నీలో అంతా గజదొంగనే చూస్తారు. నీవు ధర్మం నీతితో కూడిన రాజ్యాన్ని ఎంపిక చేసుకుని అక్కడ ఏ దోపిడి అయితే, కొత్వాలు దోపిడీ ముడి విప్పలేని పరిస్థితిని నీవు అనుకూలంగా మార్చుకుని ఆ దోపిడీలో ఎంతమంది పాల్గొన్నారు. ఏ విధంగా చేసారు అనేది నీకున్న పరిజ్ఞానంతో వారిముందు పెట్టు.వెంటనే కొత్వాలకు కావల్సింది జరిగిన నేరం ముడివీడడమే కదా, అప్పుడు నీకు అన్నివిధాల మంచి జరుగుతుంది."

"రామన్నా మంచి మార్గం చూపావు. ఇక ఈ నీచపు బెదిరింపులతో కూడిన బ్రతుకు వద్దు. కోసలదేశానికి వెళ్లిపోతాను. అక్కడ నేను ఏనాడు దొంగతనాలు దోపిడీలు చేయలేదు. నేనెవరినో వారికి తెలియదు. అక్కడే నా బ్రతుకుదారి వెతుక్కుంటాను. ఆ తరువాత కత్తులు తయారీ అక్కడి సైనికులకు చేసుకుంటాను."

రామన్న వారినుంచి సెలవు తీసుకుని బయల్దేరాడు.






# పాపం చెలిసగం

గండకీనదీ తీరాన ఇద్దరు గురువులు ఎదురెదురుగా కూర్చుని ఉన్నారు. వారి చుట్టూ చాలామంది వారికి కావల్సినవారు కూర్చుని ఉన్నారు. ఆ ఇద్దరు గురువులు సింహకేశభట్టు, రాకుమారులకే శాస్త్రం నేర్పేవాడు. మరొకరు సర్వశక్తి వర్మ రాకుమారులతో బాటు శూద్రులకు మాత్రమే యుద్ధవిద్యలు నేర్పేవాడు. రాకుమారులకు నేర్పేదంతా కత్తియుద్ధం గుర్రపుస్వారీ మాత్రమే, అదే శూద్రులకు భయంకరమైన యుద్ధవిద్యలు నేర్పేవాడు. వారు యుద్ధభూమిలో రాత్రిపగలు నిద్రాహారాలు లేకుండా పోరాడగలిగేవారు. అలా తర్ఫీదును ఇచ్చేవాడు. ఇలా రాజపుత్రులకు విద్యలు నేర్పినందున పలుఅగ్రహారాలు, పలు సంపదలు గురుదక్షిణ క్రింద పొందేవారు. వాటిని సమానంగా పంచుకునేవారు. అయితే వారికి ఈ మధ్య కాలంలో విషమ సమస్య వచ్చి పడింది వారి ఇంట జరిగే ఏ శుభకార్యాలకు పండితులు బ్రాహ్మణులు రావడంలేదు. అందుకు కారణం ఉంది. ఈ ఇరువురు వద్ద విద్యలు నేర్చుకున్న రాకుమారులు తమ రాజ్యాలకుపోయి రాజులుగా పట్టాభిషిక్తులైన తరువాత వారికి నరనరాల్లో జీర్ణించుకుపోయిన శూద్రద్వేషం వారికి వారిప్రజలకు పెద్ద సమస్యగా మారిపోయి రాజ్యాలు శత్రువులపాలయి చివరికి ఆ రాజులు బంధీలుగా అయిపోయారు. ఇంతకీ ఏమిటా శూద్రద్వేషం అంటే సింహకేశభట్టు కేవలం శాస్త్రములు చెప్పుట వరకు అదీ మనుధర్మశాస్త్రంమీద ఆధారపడి మరీ బోధించేవాడు. అందులో అతడి బోధన శృతిమించిందనే చెప్పాలి. శూద్రులు యజ్ఞయాగాదులకు పనికిరారు. వారు చూడడానికి అర్హులుకారు లాంటి బోధనలు ఆ రాకుమారులు మొదట్నించి నూరిపోయడంతో రాకుమారుల నరనరాల్లో నిలిచిపోయి, వారు ఏలికలైన మరుక్షణం శూద్రులను నానారకాలుగా హింసించడం యజ్ఞాలు, యాగాలు చేయునపుడు వారిని నగర బహిష్కరణ చేయడం వంటివి చేస్తునే ఉన్నారు. దాంతో వారు విరక్తి చెంది అటునుంచి అటే మరో రాజ్యంలోకి వలసపోవడం ప్రతిఏడాది జరిగేది. ప్రతిఏటా వందలాదిమంది సైనికులు వలసపోయేవారు. ఇక మరో గురువు

సర్వశక్తివర్మ యుద్ధతంత్రాలు, కత్తులు కటారులతో పోరాడాల్సింది శూద్రులు అని వారికే నేర్పేవాడు. యుద్ధసమయంలో సైనికులుగా ఉన్న శూద్రులు అప్పటికే వలసపోవడంతో శత్రువుల విజయం తేలికై రాజులు బందీలుగా, ప్రజలు ఊచకోతకు గుర్రై పలురాజ్యాలు నాశనం అయ్యాయి. ఇక్కడే ప్రజలకు దీనికి కారణం ఈ ఇద్దరు గురువులే అని అసహ్యం కలిగి శాపనార్థాలు పెట్టసాగారు.

వీరి వద్ద విద్యలు నభ్యసించువారి సంఖ్య గణనీయంగా పడి పోయింది. ఎటుచూసినా వీరిపై నిప్పులు కక్కేవారి శాతం పెరిగింది. వీరి కారణంగా పన్నెందు మంది రాజులు తమరాజ్యాలు కోల్పోయి కొందరు బికారులయి అడవులపాలయితే మరికొందరు శత్రువులకు చిక్కి చెరసాలపాలయ్యారు. ఇంకొందరు ఉరితీయబడినారు. ఎక్కువ మంది జనులు ఊచకోతకు గురయ్యారు. దాంతో ఈ ఇద్దరు గురువులుపై పలురాజ్యాల ప్రజలు గుర్రెత్తిపోయారు. వీరి వలనే కొన్ని వేలమంది చచ్చారు. వీరు నిశ్శబ్ద మారకులుగా గుర్తించి వీరి ముఖం చూడడం మానుకున్నారు. వీరు చేయు శుభకర్మలకు ఎవరు వచ్చేవారు కారు. బంధువులు దూరమయ్యారు. అందుకే అతి తక్కువ మందితో గండకీనదీ తీరాన కూర్చుని ఇద్దరు గురువులు ఎందుకు ఇలా జరిగింది అని బాధపడసాగారు. వారి ముందు కులపెద్ద ఒకడు కూర్చున్నాడు. "మీరు పలుయజ్ఞాలు యాగాలు చేయండి. ఇద్దరిని ప్రజలు ఆడిపోసుకుంటున్నట్లు హత్యాపాతకం చుట్టుకుంది. మీరు సహస్రచండీయాగం చేయండి. దాంతో చాలావరకు మీ పాపాన్ని మీరు కడిగేసుకుంటారు."అని చెప్పాడు.

"అయ్యా మా బోధనలు వలన ఆ రాకుమారులు ఇలా ప్రజా కంటకంగా పాలించడంవలన ఎందరో చచ్చారు. అందుకు మేము కారణం ఎలా అవుతాం గురుబోధనలు ఎంతవరకు స్వీకరించాలో అంతవరకే తీసుకుని అక్కడ పరిస్థితులకు అనుగుణంగా పాలించాలి. అలా చేయకుండా గురుకులంలో ఏమి విన్నారో అది పట్టుకుని వ్రేలాడి ఇంతవరకు తెచ్చి మా పీకకు చుట్టేసారు. ఇక మేము మా ఇంట పెండ్లిచేసినా, తద్దినం చేసినా బంధువులు మిత్రులు కూడా రాకుండా ఉన్నారు. మాలో మానవహోమం





జరిపే కిరాతకులను చూసుకుని భయపడ్తున్నారు. మరో వైపు సర్వం కోల్పోయిన రాజులు ఏ క్షణమైనా దాడి చేసి చంపుతామని కబుర్లు పెడ్తున్నారు. ఇలా మా చుట్టూ ఉన్న మా బంధు, మిత్ర, హితులు అంతా దూరమయ్యారు. ఇప్పుడు యాగం చేసినా ఎవరు వస్తారు. అందుకే మరోమార్గం చెప్పండి."అని ఇద్దరు కులపెద్దకి అడిగారు.

"ఎవరు రావాలి? యాగాలు చేస్తే వేలం వెర్రిల వచ్చేస్తారు. దానికి ఒకర్ని పిలవాల ఎందుకు ఇలా ఆలోచిస్తున్నారు. ముందు యాగం ప్రారంభించి పాపాన్ని మాపుకోండి. ఇందులో మరో ఆలోచన చేయకండి అంతెందుకు ఈ గండకీ నదీ తీరంలో ఆనుకుని ఉన్న పలుగ్రామాలవారిని పిలవండి వారు వస్తారు."

"వీళ్ళంతా శూద్రులే. వీరు యాగానికి వస్తే ఇంకా ఏమైనాఉందా? యాగం కాస్తా మంట కలుస్తుంది." సింహకేశభట్టు ఆశ్చర్యం వ్యక్తంచేసాడు.

"నువ్వు ఇంతవరకు తెచ్చుకున్నావు. ఇంకా నీకు బుద్ధిరాలేదా? ఏమి నీ ఆలోచన ఇలా ఏడుస్తోంది. శూద్రులతోనే నువ్వు యాగం నిర్వర్తించు నీపై కత్తులు నూరుతున్న అడవులపాలయిన రాజులు నుంచి నీవు కాపాడబడతావు. విద్యఅనేది పూర్తిస్థాయిలో స్వీకరించాల్సిందే. కానీ, అందులో మనకు పనికి వచ్చేవరకు తీసుకుంటాం. మిగిలినవి మనలో నిక్షిప్తమై ఉంటాయి. శంభుకుడు అనే శూద్రుడు తపస్సుచేస్తే దేవుడయిన శ్రీరాముడు తగదని నరికివేసిన సంఘటన త్రేతాయుగంలో జరిగింది. అది అప్పుడు జరిగితీరాల్సిందే. కారణం శంభుకుడు తపస్సువలన ఒక బ్రాహ్మణబాలుడు మరణించెను. నీవు ఈరోజు యాగానికి మానవున్ని ఆహ్వానిస్తున్నాను కులమతాలుతో సంబంధంలేదు అని చాటుకోవడానికి అవకాశం ఉంది. ఆలోచించుకో మంచి అవకాశం నీకు చిక్కింది."

"ఓ పెద్దా ఇదంతా ఒక్క సింహకేశభట్టు చేస్తే సరిపోతుంది. నేను ఇలాంటి బోధనలు చేయలేదు. నేను చేసినది యుద్ధకళలు నేర్పేంతవరకు మాత్రమే."సర్వశక్తి శర్మ తనకు ఏమి సంబంధం లేదనే చెప్పాడు.

"తప్పుగా మాట్లాడకు. మీ ఇద్దరు తప్పుడు విధానాలతో విద్యలు నేర్పే గురుకులం నిర్వహించి ఆ వచ్చిన ఫలాలను సమానంగా పంచుకు న్నారు. ఆ పాపం చెరిసగం పంచుకుని బుద్ధిగా కలిసి యాగం చేయండి."

"మీరన్నది నిజమే కలిసి చేసాం. కానీ, నేను బోధకుడను కాను. నేను యుద్ధ విద్యలు శూద్రులకు నేర్పాను. అందులో నేను కులాలను చూడలేదు. అతడు బోధకుడు రాకుమారులకే శాస్త్రం చెప్పేవాడు."

"ఓ సర్వశక్తివర్మ నీకు చాలా విషయాలు నీకుగా నీవే వదిలేసి నీ వరకు నీవు మంచివాడిని అనుకుంటున్నావు. నీవు శూద్రులకు నేర్పిన విద్యలు అంతకు తక్కువజాతిలో వారికి నీవు నేర్పనందున వారు ఇతర రాజ్యాలకు పోలేక ఎలాంటి కత్తి యుద్ధం రాక బలవంతంగా యుద్ధాలలోకి పోయి ఊచకోత గురయ్యారు. అందుకే ఇప్పుడున్న రాజ్యాలు ఓటమి దిశలోకి పోయాయి. నీవును ఒకరకంగా చెరిసగం పాపానికి అర్హుడవే."

ఆ ఇద్దరు నువ్వంటే నువ్వు అని కలహించుకోసాగారు. అక్కడ ఉన్న అతి తక్కువమంది తలలు పట్టుకున్నారు. అప్పుడు అదే దారిన వస్తున్న రామన్న అక్కడ జరగినదంతా విని "ఓ గురుదేవులారా కలహం ఆపి శాంతం వినండి. పాపం చెరిసగం మోయడానికి తగువులేలపడెదరు. ఇందులో మీ కులపెద్ద చెప్పినట్లు మీరు మీవలన పరాజితులైన రాజుల నుంచి తప్పించుకునే మార్గం ఉంది. మరి అలాంటప్పుడు ముందు మీ ప్రాణాలు కాపాడుకోండి. ముందు యాగం చేయండి"

వారు రామన్నను ఎగాదిగా చూసి "ఆఖరికి మా బ్రతుకు బొడ్డూడని బిడ్డలతో చెప్పించుకోవల్సివచ్చింది. నువ్వెవరవు. కొంపదీసి రామన్నవు కావు కదా!" సింహకేశభట్టు అడిగాడు.

"రామన్ననే, మీవంటి అగ్నిజ్యోతిల్లా మెరిసిపడే గురువులును దర్శించి నందున ఆనందంగా ఉంది. మీ విషయంలో కలుగుచేసుకున్నందుకు క్షమించండి. మీరు యాగం చేస్తే చూడాలని ఆశపడ్తున్నాను."

ఇద్దరు గురువులు లేచి రామన్నను దగ్గరగా తీసుకుని "నాయనా నీవు రావడంతో మా సమస్య పూర్తిగా తీరిపోగలదని ఆశిస్తున్నాం. రామన్న పేరు విన్నాం మేము మీ తాతలనాటి తరం వాళ్లం. మాకు తెలియనిది ఒకటి ఉంది. మేము నేర్చుకున్నదే మా వద్ద విద్య అభ్యసించే వారికి చెప్పాం. తీరా అది దారుణంగా బెడిసింది. ఇంచుమించుగా పదిపన్నెండు రాజ్యాలు శత్రువుల పాలయ్యాయి. ఆ రాజులు చెట్టుకొకరు పుట్టకొకరు అయిపోయారు. కొన్నివేలమంది ప్రజలు శత్రుసైనికుల చేతిల్లో ఊచకోతకు





గురయ్యారు. అదంతా మా నెత్తిన పడింది. యాగం చేయడానికి బ్రాహ్మలు కావాలి. తపస్సంపన్నులు కావాలి ఎవరు దొరకడం లేదు. ఎటూ పాలుపోవడం లేదు. ఒకవైపు మా కులపెద్ద మానవ హోమం మా వలనే జరిగింది యాగాలు చేసి పాపనివృత్తి చేసుకోమంటున్నారు. నీవును చేయమంటున్నావు. ఎవరు లేకుండా చేయడమెలా? "అని పక్కనే కూర్చోబెట్టుకున్నారు.

"గురుదేవా జరిగిందేదో జరిగింది. చిత్తశుద్ధితో మీరు ఇరువురు చేయగలిగినంతలో యాగం చేయండి. మీ వంటి గురువులకు చెప్పువాడను కాను కానీ, ఒకటి మాత్రం నిజం గురువులైన మీకు కులమతాలు, మానవుని రంగులు, రోగాలు కనిపించకూడదు. కానీ, మీలో కులజాడ్యం మితిమీరింది కనుకనే మీ ఇరువురు బాల్యదశలో వచ్చిన రాకుమారులకు పాతకాలం నాటి విధానాలు నూరి పోసారు. ఫలితం ఇంత హీనం అయ్యింది. మీకు ఇదో గుణపాఠం. మీ తప్పేకాదు ఇందులో విద్య అభ్యసించినవారికి ఉంది. వారు ఎప్పుడు ఏది చేయాలో అది చేసుకుని పోవాలి."

"నాయనా చిన్నవాడివైనా మమ్మల్ని దోషులు కాకుండా మా శిష్యుల తప్పుంధ్ధి అని చెబుతున్నావు. ఇలా ఎవరూ చెప్పడం లేదు. యాగం చేయడానికి అన్నియు సమకూర్చుకుంటాం. దీనితో మాకు చుట్టుకున్న పాతకం నశిస్తుంది."

"గురుదేవులారా మీరు ఏదో మండలదినాలు చేస్తే సరిపోదు. మీరు అలా కొన్ని ఏళ్లు చేయాలి. అప్పుడే మీరు అడవులపాలయిన రాజుల కత్తులకు ఎరకాకుండా ఉంటారు. అలాగే మీకు అంటుకున్న పాతకం నశిస్తుంది. పవిత్రమైన విద్యాపీఠం మీకు తెలియకుండానే మీరు రుద్రపీఠంగా మార్చేసారు. ఆ పాపాన్ని మీరు ఒక యాగంతో కడిగేయాలను కుంటున్నారు. అలా కాకుండా మీ బొందిలో ప్రాణం ఉన్నంత వరకు చేస్తునే ఉండండి. దాంతో కొన్నాళ్లు అయ్యేసరికి మీ నుంచి వెళ్లిపోయిన బంధువులు మిత్రులు వస్తారు. ఎలాగూ మీరు గురుకులం నిర్వహించుట లేదు. విద్యార్థుల సమస్య ఎలాగూ లేదు. ఉన్నంతలో మీ వద్ద పలు ధనరాశులున్నాయి. వాటిని యాగాలకు ఖర్చుచేసి మీ ఇద్దరు చెరిసగం పాపనివృత్తికి వినియోగించండి" చెప్పి అక్కడ కొన్నాళ్లుండి వెనుదిరిగాడు.

# రామన్న దేశసంచారి

రామన్న ఎక్కడా నిలువకుండా దేశమంతా తిరిగాడు చివరికి పలుభాషలు నేర్చుకున్నాడు.ఎన్నో రాజ్యాలు ఎందరో రాజులను చూసాడు. వారిచే గౌరవాలు పొందాడు. నలుగురు యువతులను పెండ్లాడి గంపెడు పిల్లలనుకన్నాడు. కానీ వారెవ్వరు రామన్నలా రాణించలేదు. వివిధ రాజుల కొలువుల్లో చిన్న చితకా పనులకు కుదిరారు. కొన్నాళ్లు కొండవీటి రాజులు వద్ద సామంతురాజుగా పనిచేసాడు. తప్పితే వారు న్యాయనిపుణులు కాలేదు. ఎక్కువగా తెలుగు ప్రజల్లో మమైకం అయిన రామన్న తీర్పులు తెల్లవారి ఏలుబడిలో కూడా జమీందార్ కచేరీల్లో సంస్థానాల్లో ప్రముఖంగా వాటినే అనుసరించి తీర్పులు ఇవ్వబడేవి. అతడి తీర్పులు మాటల్లో ఉండేవి కావు, అన్నీ చేతల్లో కనిపించేవి. ప్రతిదీ ఏదో రచ్చబండ వద్ద కూర్చుని ఇరువురు మాటలు విని తీర్పులు ఇచ్చేవి చాలా తక్కువ. తన ముందున్న తగువులో రామన్న ప్రత్యక్షంగా దిగి తీర్చినవే ఎక్కువ కావడం వలన కథలు కథలుగా చెప్పుకోసాగారు.అవికూడా వినడానికి ఎంతో ఇంపుగా ఉన్నందున ప్రాచుర్యం పొందాయి. అవి వినడానికి సరదా పడేవారు. పడవలు నడిచే నదీతీర ప్రాంతాల్లో ఈ గ్రంథంలో ఉన్న 19వ కథ ఉప్పుమూటతో భలే లాభం గురించి లోగడ పదే పదే చెప్పుకునేవారు. దేవదాసిలు, జోగినిలు, బసివిలు రామన్నను దేవుడిలా చూసుకునేవారు వారికోసం ఆ వ్యవస్థ పోవాలని ఎంతో పోరాడాడు. పాత రోగి ఒక వైద్యుడు అంతటివాడని నమ్మేవాడు. అలాగే గజదొంగను కొలువులో వేసుకుంటే అతడి ద్వారా నగరంలో జరిగిన నేరాలను సులభంగా పట్టుకోవచ్చని చాటిచెప్పిన రామన్న కథనం ఈ గ్రంథంలో లేస్తే మనిషినికాను. ఈ తరహా దొంగల నియామకాలు విజయనగర రాజులు, గోల్కొండ నవాబులు వేసేవారు.

రామన్న కథలు పేరిట పలువురు పుస్తకాలు వేసారు. అప్పటికి ఆయన కుటుంబ వివరాలు గురించి ఎవరు పోలేదు కారణం రామన్న తరువాత తరం అంతంతమాత్రం కావడం వలన నిర్రాణం అయిపోయంది. లేకుంటే రామన్న చరిత్ర తెలుగువారికి ఇంటింటి గ్రంథం అయ్యేది. రామన్న గురించి ఆంధ్రప్రదేశ్ అంతటా విస్తరించిన కథలున్నాయి. అవి చాలావరకు పాతతరం వారు పిల్లలకు చెప్పుకునేవిగా మిగిలాయి. ఆంధ్రప్రదేశ్ అనుకుని ఒరిస్సా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్నాటకలలో ఈ కథలు గురించిన ప్రస్థావన ఉన్నందున అక్కడ ఒకటి అరా పుస్తకాలు ఆయా భాషల్లో ప్రచురితం అయ్యాయి. రామన్న చాలాకాలం బ్రతికాడని, వృద్ధాప్య తీర్పులు కూడా ఉన్నాయి. రామన్న తెలుగువాడు కావడం తెలుగువారు చేసుకున్న పుణ్యం.

-:: సమాప్తం ::-